తెలంగాణ చరిత్ర

జి. వెంకట రామారావు



ఆంధ్ర సారస్వత పరిషత్తు

తిలక్ రోడ్డు, హైదరాబాద్

తెలంగాణ చరిత్ర

ప్రధాన సంపాదకులు

జ్ఞానపీఠ పురస్కార గ్రహీత, పద్మభూషణ్

డా. సి. నారాయణ రెడ్డి

అధ్యక్షులు. ఆంధ్ర సారస్వత పరిషత్తు

సంపాదకులు

డా. జె. చెన్నయ్య

ప్రధాన కార్యదర్శి, ఆంధ్ర సారస్వత పరిషత్తు

గ్రంథకర్త

జి. వెంకటరామారావు

ఆంధ్ర సారస్వత పరిషత్తు

తిలక్‌రోడ్, హైదరాబాద్-1

ఫోన్ నెం.040-24753724

TELANGANA CHARITRA
by
G.Venkatarama Rao

ప్రథమ ముద్రణ : మే 2014
ద్వితీయ ముద్రణ : మార్చి 2015

పుటల సంఖ్య : 376

ప్రతులు : 2000

మూల్యం : రూ. 220

ప్రతులకు:
ఆంధ్ర సారస్వత పరిషత్తు
తిలక్‌రోడ్, హైదరాబాద్
ఫోన్: +91-40-24753724

ముద్రణ:
సాయిలిఖిత ప్రింటర్స్
ఖైరతాబాద్, హైదరాబాద్
040-65545979

జ్ఞానపీఠ అవార్డు గ్రహీత
డాక్టర్ సి. నారాయణరెడ్డి ఎక్స్ ఎం.పి.
ఎం.ఏ., పిహెచ్.డి., డి.లిట్.
అధ్యక్షులు
ఆంధ్ర సారస్వత పరిషత్తు
తిలక్ రోడ్,
హైదరాబాదు-500001.
ఫోన్ : (ఆ) 24753724

Jnanpith Awardee
Dr. C. Narayana Reddy Ex. M.P.
M.A., Ph.D., D.Litt.
PRESIDENT
Andhra Saraswatha Parishath
Tilak Road,
Hyderabad - 500 001.
Phone : (Off.) 24753724

అవతారిక

నిజాం పాలనలో తెలుగు భాషాదీపం కొడిగట్టిన కాలంలో దాని పునరుద్దీపనానికి ఉద్యమించిన మాతృసంస్థ ఆంధ్ర సారస్వత పరిషత్తు. శ్రీ సురవరం ప్రతాపరెడ్డి, శ్రీ మాడపాటి హనుమంతరావు, శ్రీ కాళోజి నారాయణరావు, శ్రీ బూర్గుల రామకృష్ణారావు, శ్రీ లోకనంది శంకర నారాయణ రావు, శ్రీ గడియారం రామకృష్ణశర్మ వంటి సాహితీమూర్తుల ప్రేరణతో పరిషత్తు 1943 మే 26 న రూపుదిద్దుకుని ఈ రోజు తెలంగాణలో అగ్రేసర సాహితీ సంస్థగా విశిష్టస్థానం వహించింది. మాన్యమిత్రులు డా॥దేవులపల్లి రామానుజరావు గారు యావజ్జీవం పరిషత్తు అభివృద్ధికి శ్రమించినారు. పరిషత్తు బహుముఖీన కార్యక్రమాలు చేపట్టి సమర్థంగా నిర్వహిస్తూ అందరి ప్రశంసలందుకుంటున్నది. పరిషత్తు ప్రాథమిక, ప్రవేశ, విశారద తెలుగు పరీక్షలు జరపడంతో పాటు, తెలుగు పండిత శిక్షణ కళాశాలను, ప్రాచ్య కళాశాలను నిర్వహిస్తున్నది. పరిషత్తు ఏర్పాటు చేసే సాహితీ సభలు, సమావేశాలు, ప్రసంగాలు, సదస్సులు, ఉత్సవాలు, చర్చాగోష్ఠులు, పరిణతవాణి ప్రసంగాలు, ప్రసంగాత్మక ప్రదర్శనలు, సాంస్కృతిక కార్యక్రమాలు మొదలైనవి తెలంగాణ వైశిష్ట్యానికి అద్దం పడుతున్నవి. పరిషత్తు ప్రచురించే గ్రంథాలను సాహితీలోకం అభిమానించి స్వాగతిస్తున్నది. ఇంతవరకు దాదాపు 300 గ్రంథాలను వెలవరించింది. 2013 లో పరిషత్తు సప్తతి మహోత్సవాలను ఘనంగా నిర్వహించింది. తెలంగాణ ప్రత్యేకతలోని వివిధ పార్శ్వాలను ఆవిష్కరించే సదస్సులు, సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటయ్యాయి. నిపుణుల ప్రసంగ వ్యాసాలను "వ్యాసగుళుచ్ఛం" పేరుతో పరిషత్తు రెండు భాగాలు వెలువరించింది. వివిధ రంగాలలో తెలంగాణ వైశిష్ట్యాన్ని విశదీకరించే "తెలంగాణలో తెలుగు సాహిత్య వికాసం" పై సదస్సు వంటి కార్యక్రమాలను పరిషత్తు ఏర్పాటు చేసింది. తెలంగాణ ప్రజల చిరకాల స్వప్నం సాకారమై 2014 జూన్ 2 వ తేదీన ప్రత్యేక తెలంగాణ రాష్ట్రం ఆవిర్భవించింది. తెలంగాణను

సర్వతోముఖంగా అభివృద్ధి చేసేందుకు ప్రభుత్వం, సంస్థలు, ప్రజలు ఉద్యమస్ఫూర్తితో కృషి చేయడం హర్షణీయం. తెలంగాణ భాషా సాహిత్య కళా సంస్కృతుల వికాసాభ్యుదయాల కోసం ఏడు దశాబ్దాలకు పైగా అంకితభావంతో ముందుకు సాగుతున్న ఆంధ్ర సారస్వత పరిషత్తు బంగారు తెలంగాణ నిర్మాణంలో తన వంతు పాత్రలో భాగంగా విశిష్ట కార్యక్రమాలకు రూపకల్పన చేసి నిర్వహిస్తున్నది. వాటిలో కొన్ని- తెలంగాణ మాండలిక పదాలు – ప్రయోగ వైశిష్ట్యం, తెలంగాణ ప్రాచీన తెలుగు కవుల కవితా ప్రాభవం, తెలంగాణ చిత్రకళ, శిల్పకళల వైభవం, తెలంగాణ గిరిజన భాషా సాహిత్యాలపై సదస్సు, తెలంగాణ కవయిత్రుల, కథయిత్రుల రాష్ట్రస్థాయి సమ్మేళనం.

తెలంగాణ వైభవోన్నతిపై ప్రత్యేక గ్రంథ ప్రచురణను పరిషత్తు చేపట్టింది. ప్రస్తుత గ్రంథం "తెలంగాణ చరిత్ర" గ్రంథకర్త ప్రభుత్వ విద్యాశాఖలో రమారమి నాలుగు దశాబ్దాల పాటు అంకితభావంతో సేవలందించిన శ్రీ జి.వెంకటరామారావు. ప్రవృత్తిరీత్యా ఆయన రచయిత, వివిధ సామాజికాంశాలపై రెండువేల కు మించి వ్యాసాలు రచించిన శ్రీ వెంకటరామారావు జీవిత చరిత్ర, దేశ–ప్రాంత చరిత్ర రచనలో, రాజకీయ ఘట్టాల విశ్లేషణలో సిద్ధహస్తుడు. శాతవాహనుల కాలం నుండి తెలంగాణ రాష్ట్రావిర్భావం వరకు తెలంగాణ చరిత్రను తనదైన విలక్షణ దృక్పథంతో, అన్వయంతో ఈ గ్రంథాన్ని రూపొందించినారు. చివరి అధ్యాయంగా తెలంగాణ జలవనరులు, పరిశ్రమలు గురించి తెలియజేయడం విశేషం. పూర్వ చరిత్ర, గోలకొండ నవాబులు, నిజాం ఏలుబడి, విద్య, గ్రంథాలయాలు, ఆర్యసమాజం, సాయుధపోరాటం, వివిధ ఉద్యమాలు, పోలీసుచర్య, తెలంగాణ ఉద్యమం, తెలంగాణ రాష్ట్ర అవతరణ మొదలైన అంశాల వివరణతో పరమపఠనీయ శైలిలో తీర్చిదిద్దిన ఈ గ్రంథ ప్రచురణ నవతెలంగాణ వికాసదశలో అందరి అవగాహనకు దోహదకారి కాగలదని భావిస్తూ గ్రంథకర్త శ్రీ జి.వెంకటరామారావుకు నా హార్దికాభినందనలు అందజేస్తున్నాను.

పరిషత్తు వెలువరిస్తున్న ఈ గ్రంథం ఎప్పటిలాగా అందరి మన్ననలను పొందగలదని విశ్వసిస్తున్నాను.

హైదరాబాదు **(డా.సి.నారాయణ రెడ్డి)**

తేది :15-03-2015. అధ్యక్షులు

ఆంధ్ర సారస్వత పరిషత్తు

డా॥ జె. చెన్నయ్య
ప్రధాన కార్యదర్శి
ఆంధ్ర సారస్వత పరిషత్తు

తిలక్ రోడ్,
హైదరాబాదు-500001.
ఫోన్ : 040-24753724

ప్రవేశిక

ఆంధ్ర సారస్వత పరిషత్తు నిర్వహిస్తున్న విభిన్నమైన కార్యక్రమాల్లో పుస్తక ప్రచురణ విశిష్టమైంది. పరిషత్తు ప్రచురించిన గ్రంథాల పట్టికను చూస్తే ఎంత గొప్పవైన ప్రచురణలు వచ్చాయో తెలుస్తుంది. పరిషత్తు ఆధ్వర్యంలో తెలుగు పరీక్షల నిర్వహణ, భాషా సాహిత్య సాంస్కృతిక వికాసానికి దోహదం చేసే సదస్సుల నిర్వహణ, పెద్దల పేరిట నిర్వహించే సంస్మరణ ప్రసంగాలు, పరిణతవాణి ప్రసంగ పరంపర కొనసాగుతూ అనుబంధంగా పుస్తక ప్రచురణ జరుగుతున్నది. 2013 సంవత్సరంలో పరిషత్తు అధ్యక్షులు డా. సి.నారాయణరెడ్డి నేతృత్వంలో సప్తతి పూర్తి సందర్భంగా ఏడాది పొడవునా అనేకమైన ప్రత్యేక కార్యక్రమాలు ఏర్పాటు చేయడం జరిగింది. 'తెలంగాణ తెలుగు సాహిత్య వికాసం', 'తెలంగాణ ప్రాచీన కవుల కవితా ప్రాభవం', 'తెలంగాణ మాండలిక పదాలు-ప్రయోగ రీతులు', 'తెలంగాణ ప్రాచీన నృత్య రీతులు', 'తెలంగాణ గిరిజన భాషా సాహిత్యాలు', 'తెలంగాణ కవయిత్రులు, కథయిత్రుల సమ్మేళనం' వంటి అనేక సదస్సులు, ప్రత్యేక కార్యక్రమాలను నిర్వహించడం జరిగింది. తెలంగాణ ప్రత్యేక రాష్ట్రంగా ఆవిర్భవించిన తరుణంలో తెలంగాణలో సాహిత్య చైతన్యాన్ని పెంపొందించే కృషిలో భాగంగా ఈ కార్యక్రమాలు నిర్వహించాలని పరిషత్తు భావించింది. నవ్య స్ఫూర్తితో ప్రచురణల్ని కూడా వెలువరించాలని నిర్ణయించింది. గత సంవత్సరం పరిణతవాణి ప్రసంగాలతో కూడిన తాజా సంపుటి, 'తెలంగాణ సాహిత్య వికాసం', 'వ్యాసగుళుచ్ఛం' రెండు సంపుటాలు ప్రచురించడం జరిగింది. వాటిని పాఠకులు ఆదరించారు.

తెలంగాణ ప్రత్యేకరాష్ట్రంగా ఆవిర్భవించింది. ఈ నూతన యుగోదయవేళ తెలంగాణ కు సంబంధించిన వివిధ అంశాలపై ప్రత్యేక అధ్యయనం జరగాలి. ఆ అధ్యయనానికి కావలసిన పఠనసామాగ్రిని సమకూర్చుకోవాలి. ఇప్పటివరకు ఉమ్మడి చరిత్రలో అంతర్భాగంగా వుండి తగినంత ప్రాధాన్యం లభించలేదని ప్రజల్లో వున్న

అసంతృప్తిని పోగొట్టాలి. ఆ దిశగా ఆంధ్ర సారస్వత పరిషత్తు నిర్వహిస్తున్న విశిష్ట కార్యక్రమాల నిర్వహణలో ప్రచురణ ఒకటి. ఆ ప్రచురణల్లో 'తెలంగాణ సాహిత్యచరిత్ర', 'తెలంగాణ ప్రాచీనకవుల కవితా ప్రాభవం', 'తెలంగాణ మాండలిక పదాలు-కావ్యప్రయోగాలు', 'కుతుబ్‌షాహీల తెలుగు సాహిత్యసేవ', 'మాఊరు మాట్లాడింది', 'తెలంగాణ గిరిజన భాషా సాహిత్యాలు', 'సురవరం ప్రతాపరెడ్డి వ్యాసావళి', 'తెలంగాణ ప్రముఖుల పరిణతవాణి' 'బంజారాల వివాహ ఆచార పద్ధతులు' 'యాభైసంవత్సరాల జ్ఞాపకాలు' 'తెలంగాణ చరిత్ర' 'తెలుగు జానపద సాహిత్యం-స్త్రీల గేయాల్లో సంప్రదాయం' ఈ సంవత్సరం వెలువడుతున్నాయి.

తెలంగాణ చరిత్రలో ప్రథమంగా ఇంత ఎక్కువ సంఖ్యలో పరిషత్తు వెలువరిస్తున్న గ్రంథ పరంపరలో జి.వెంకటరామారావు గారి 'తెలంగాణ చరిత్ర' కు ఎంతో ప్రాముఖ్యముంది. ప్రాచీనకాలం నుండి నేటి వరకు తెలంగాణ వ్యక్తిత్వం ఈ గ్రంథంలో ఆవిష్కృతమవుతుంది. ఈ నేలను ఏయే రాజులు పాలించారు. ఏ విధమైన విశిష్టత ఈ ప్రాంతానికి వుంది. కాలగమనంలో రాజకీయార్థిక సామాజిక సాంస్కృతిక రంగాల్లో సంభవించిన పరిణామాలు ఈ గ్రంథంలో వున్నాయి. ఒక్కమాటలో చెప్పాలంటే తెలంగాణ ప్రత్యేక వ్యక్తిత్వం రాశిభూతమైంది. పత్రికా రచయిత, బహుగ్రంథకర్త, దశాబ్దాల రాజకీయ పరిశీలనానుభవశాలి వెంకటరామారావు. తమ తెలంగాణ చరిత్రను ప్రచురించే అవకాశం పరిషత్తుకు కలిగించినందుకు కృతజ్ఞతలు తెలియజేస్తున్నాను.

ప్రచురణల పరిశీలక సంఘం సభ్యులుగా తమ పూర్తి సహకారాన్ని అందించిన ఆచార్య ఎస్వీ రామారావు, డా.తిరుమల శ్రీనివాసాచార్య, డా.డి.చంద్రశేఖర్ రెడ్డి గార్లకు కృతజ్ఞతలు.

(డా॥ జె. చెన్నయ్య)
ప్రధాన కార్యదర్శి

హైదరాబాదు
తేది : 20-03-2015

ఆకాంక్ష

"మూగవోయిన కోటి తమ్ముల గళాల
పాట పలికించి కవితా జవమ్ము కూర్చి
నా కలానకు బలమిచ్చి నడిపినట్టి
నా తెలంగాణ కోటి రతనాల వీణ"- **మహాకవి డా॥ దాశరథి**

ఆరు దశాబ్దాలక్రితం ఆ మహాకవిని ముగ్ధుణ్ణి చేసి నడిపించిన తెలంగాణా నిన్న మొన్నటి వరకు తంత్రులు తెగిన వీణ. నేల, నీరు తరతరాల ప్రకృతి సంపదలన్నీ తన వాళ్ళకి కాకుండా పోతుంటే కళ్ళ నీళ్ళతో చేష్టలుడిగి చూసిన దీన వదన. 1956 నాటి పెద్దమనుషుల ఒప్పందం, 1969 నాటి అఖిలపక్ష ఒప్పందం, అష్టసూత్ర, పంచసూత్ర పథకాలు, 1972 నాటి ఆరు సూత్రాల పథకం, జీ.వో. నం. 610 ఒప్పందాల ఉల్లంఘనలు నిరాటంగా సాగడంవలన ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో ప్రాంతీయ అసమానతలు మరింత పెరిగిపోయాయి.

అరవైయేళ్ళలో ప్రపంచంలో ఏ దేశంలో లేని విధంగా తెలంగాణాలో ప్రజలు తమ జీవన స్థితిని మార్చడం కోసమే కాకుండా, మొత్తం సమాజంలో మార్పుకోసం ఉద్యమాలు జరిపి ప్రాణాలర్పించారు. వీటిలో వేల సంఖ్యలో యువజనులు తమ రక్తాన్ని ధారపోశారు. దక్షిణాన తెలంగాణాలోనే పలుసార్లు ఉద్యమాలు ఎందుకు వస్తున్నాయి? ఆత్మగౌరవానికి అభివృద్ధి ఎప్పటికీ ప్రత్యమ్నాయం కాదు. బ్రిటిష్‌వాళ్ళు రోడ్లు, రైల్వేలైన్లు వేసి దేశాన్ని అభివృద్ధి పరిచారు. అయినా వాళ్ళనే దేశాన్ని పరిపాలించమని అన్నామా?

సంపద ఉత్పత్తిలో బ్రిటిష్ ఇండియాలో పంజాబ్ రాష్ట్రానికున్న స్థానం నిజాం రాష్ట్రంలో తెలంగాణా కుందని ఆనాటి పి.డబ్ల్యు.డి. శాఖమంత్రి నవాబ్ జైన్ యార్‌జంగ్ అనేవారు. అపారమైన బొగ్గు నిల్వలతో పాటు లామైట్- నాపరాయి, యురేనియం నిల్వలు, జీవనదులైన గోదావరీ, కృష్ణా అత్యధిక భాగంలో ప్రవహిస్తున్నా తెలంగాణాలో నికృష్ట పరిస్థితులేర్పడి, ఇంతకాలము మహబూబునగరు జిల్లాకి మాత్రమే పరిమితమైన వలసలు తక్కిన అన్ని జిల్లాలకు వ్యాపించాయి. వలసలు పోలేనివాళ్ళు జీవితం పట్ల నిస్పృహతో తమకు బతుకు ఇవ్వలేని ఈ వ్యవస్థపట్ల ఆగ్రహంతో అన్నల్లో కలుస్తున్నారు.

భూ సంస్కరణలకు శ్రీకారం చుట్టిన నేలలో ఆకలి చావులు సంభవిస్తున్నాయి. ఆది మానవుల అడుగు జాడల నుంచి శాతవాహనులు, కాకతీయులు, రాష్ట్ర కూటులు, కుతుబ్‌షాహీల ఉన్నత సంస్కృతికి, చారిత్రక వారసత్వానికి పేరుపడ్డ తెలంగాణా

గ్రామీణ జీవనం ఇప్పుడు దారిద్ర్యానికీ, దైన్యానికీ మారుపేరుగా తయారైంది.

అంతా తాము వచ్చాకనే తెలంగాణాను అభివృద్ధి పరిచామని చెప్పుకుంటున్నారు ఆంధ్రనాయకులు. హైదరాబాద్ రాష్ట్రంలో నిజాం ప్రభుత్వం 'ఇండస్ట్రియల్ ట్రస్ట్ ఫండ్' అనే సంస్థని స్థాపించి, దాని యాజమాన్యంతో నాలుగు బట్టల మిల్లులు, బోధన్ చక్కెర కర్మాగారం, సిర్‌పూర్ కాగితం ఫ్యాక్టరీ, వజీర్ సుల్తాన్ సిగరెట్ ఫ్యాక్టరీ, రెండు సిమెంటు ఫ్యాక్టరీలు, ఆల్విన్, ప్రాగాటూల్స్ ఇంజనీరింగ్ సంస్థలు, హైదరాబాద్ కెమికల్ ఫెర్టిలైజర్స్ పరిశ్రమలు మరెన్నో నెలకొల్పింది. సింగరేణి బొగ్గు పరిశ్రమను అభివృద్ధి పరిచింది.

ఆంధ్రప్రదేశ్ ఏర్పడేనాటికి ఉభయ ప్రాంతాల ఉద్యోగుల వేతనాలలో కూడా వ్యత్యాసం ఉండేది. ఆంధ్ర సచివాలయపు మధ్యతరగతి (యు.డి.సి) వేతనం రూ. 90-175, తెలంగాణా వారికి రూ.135-205, ఆంధ్ర సచివాలయపు దిగువ తరగతుల గుమాస్తా (ఎల్.డి.సి.) వేతనం రూ.50-100. తెలంగాణా వారిది రూ. 65-120. ఆఫీసర్ల క్యాడర్లలో ఆంధ్రప్రభుత్వ జీతాలు అధికం. కింది తరగతులలో అంటె ఎగువ, దిగువ గుమాస్తాలు, స్టెనో టైపిస్టులు, నౌఖర్లు వారందరి విషయంలో తెలంగాణా స్కేళ్లు అధికం. దీనిని బట్టి నిరంకుశ పాలనైనా నిజాం హయాంలోనే కింది తరగతి వాళ్ళను మానవతా దృష్టితో చూసినట్లు వ్యక్తమవుతుంది.

తెలంగాణాలో ఉర్దూ అధికార భాషగా ఉండేది. అయినా ప్రభుత్వోద్యోగులకు తప్ప ఇతర వృత్తులకు ఉర్దూ ప్రాముఖ్యమే లేదని చెప్పవచ్చు. వాణిజ్యము, పరిశ్రమలు, వ్యవసాయము మొదలగు రంగాల వారికి ఉర్దూతో ఏమి పని? దీన్ని తెలుసుకోలేని వారు తెలంగాణా వారికి తెలుగు రాదని ప్రచారం చేశారు.

ఒక ప్రాంతంలోని ఆర్థిక అభివృద్ధితోపాటు, ఆ ప్రాంత ప్రజల చైతన్యం రాజకీయ ప్రాధాన్యం చాలావరకు ఆ ప్రాంతం సాధించిన విద్యాభివృద్ధిపై ఆధారపడి ఉంటుంది. విద్యారంగంలో తెలంగాణా ప్రాంతం ఆంధ్రప్రదేశ్‌లోని తక్కిన రెండు ప్రాంతాల కంటే చాలా వెనుకబడి ఉండటంవల్ల ఇతర రంగాలలో కూడా తెలంగాణా గణనీయంగా వెనుకబడి పోయిందని కాకతీయ విశ్వవిద్యాలయం పూర్వ ఉపకులపతి స్వర్గీయ డా॥ కె.జయశంకర్ విశ్లేషించారు.

భాషాప్రయుక్త రాష్ట్రంగా ఆంధ్రప్రదేశ్ ఏర్పడి 58 సంవత్సరాలైనా ఆంధ్ర, తెలంగాణ ప్రజలమధ్య ఏనాడూ భావోద్వేగపరమైన ఐక్యత లేదు. రెండు రాష్ట్రాల సంస్కృతీ సంప్రదాయాలువేరు. తెలంగాణ స్వాతంత్ర్యోద్యమంలోగాని, ఆంధ్రమహాసభల నిర్వహణలోగాని ఆంధ్ర ప్రజలు, నాయకుల పాత్రవేరు. ఉద్యోగరీత్యా

నిజాంరాష్ట్రంలో నివాసమున్న ఆంధ్రులెన్నడూ తెలంగాణ ప్రజలతో కలిసిమెలసి వుండలేదు. తామే నాగరికులైనట్లు తెలంగాణ ప్రజలను చిన్నచూపు చూసేవారు. దాదాపు ఆరుదశాబ్దాలు కలిసివున్నామున్నమాటేగాని తెలంగాణ ప్రజలు, నాయకుల మనసులో ప్రత్యేక రాష్ట్రం కావాలన్న ఆకాంక్ష, ఆలోచన నిరంతరం రగులుతూనే వుంది. మా ప్రాంతం ఉద్యోగాలు మాకు కావాలని తెలంగాణ ప్రాంతంవారు అనగానే ప్రత్యేకాంధ్ర ఉద్యమం చెలరేగింది. కోర్టు ఉత్తర్వులతో ఎంతకాలమని కలిసిమెలసి వుంటాం.

ఇంతవరకు తెలంగాణ రాష్ట్రంపై వచ్చిన గ్రంథాలన్నీ ఉద్యమవిశేషాలకు మాత్రమే పరిమితమై వున్నాయి. ఇవన్నీ ఈ శతాబ్ది కాలానికి సంబంధించినవే. తెలంగాణ రాష్ట్రావతరణ నేపథ్యంలో తెలంగాణ చరిత్రపై ప్రపంచ వ్యాప్తంగా ఆసక్తి పెరిగింది. నాటి నుండి నేటిదాకా తెలంగాణా చరిత్రనంతా తెలుసుకోవాలన్న కుతూహలం కలిగింది. రాజకీయ చరిత్రలోనే కాకుండా ఆర్థిక, సామాజిక, సాంస్కృతిక అంశాల ప్రాధాన్యాన్ని కూడా గుర్తించి వాటికి ప్రత్యేక ప్రాముఖ్యం ఇవ్వడం జరిగింది. విస్తృతమైన అంశాలన్నింటినీ చెప్పవలసివున్నా అన్నింటకీ స్థానం కల్పించాలనే ఉద్దేశంతో వాటిని సంగ్రహంగా ఇవ్వడం జరిగింది. నిజానికి ఒక్కో అధ్యాయంలోని ప్రతి అంశంపై ఒక పూర్తిస్థాయి గ్రంథం రాయదగినంత సమాచారం వుంది. ఇది తెలంగాణాకు చెందిన సంపూర్ణ చరిత్రగా నేను భావించడం లేదు. ఎంత సమాచారం సేకరించినా ఏదోలోటు కనిపిస్తూ ఉంటుంది. చరిత్ర గ్రంథాల్లో ఉన్న విశేషమే ఇది.

తెలుగుతల్లిని కనకకిరీటంతో అలంకరించాలన్న ఆకాంక్ష, నిరక్షరాస్యత నిర్మూలన, చరిత్రపరిశోధన కోసం ఆంధ్ర సారస్వత పరిషత్తు ఆవిర్భవించడం అతిశయోక్తి కాదు. ఆంధ్ర సంస్కృతీ సారస్వతాల సర్వతోముఖ వికాసానికి ఈ సంస్థ కృషి సల్పింది. తెలుగులో పరీక్షలు నిర్వహించింది, రచయితలను ప్రోత్సహించింది, ఉత్తమ గ్రంథాలను ప్రచురించింది. తెలుగులో అక్షరజ్ఞానం కలిగినవారు ఎన్నటికీ ఈ సంస్థ కృషిని మరవలేరు.

నేను కోరగానే ఈ పుస్తక ప్రచురణకు అంగీకరించిన పరిషత్ అధ్యక్షులు, జ్ఞానపీఠ పురస్కార గ్రహీత డా. సి. నారాయణ రెడ్డి గారికి కృతజ్ఞతలు, పరిషత్తు ప్రధాన కార్యదర్శి డా. జె. చెన్నయ్య, కార్యక్రమ సలహాదారు గోవిందరాజు రామకృష్ణరావు లకు కృతజ్ఞతలు.

హైదరాబాద్ **జి. వి. ఆర్.**


ఆదిలాబాద్
నిజామాబాద్
కరీంనగర్
మెదక్
వరంగల్
ఖమ్మం
రంగారెడ్డి
హైదరాబాద్
నల్గొండ
మహబూబ్‌నగర్

విషయ సూచిక

మొదటి భాగం

రెండవ భాగం

1. శాతవాహనులు

'ఆంధ్ర' శబ్దం అతి ప్రాచీనమైనది. క్రీస్తుకు పూర్వం వెయ్యి సంవత్సరాల నాటిదైన ఐతరేయ బ్రాహ్మణంలో ఆంధ్రుల ప్రస్తావన ఉంది. ఆ కాలంలో ఆంధ్రులు వింధ్యకు దక్షిణ ప్రాంతంలో నివసించేవారు. శాతవాహనులకు పూర్వం ఉన్న రాజ్యాలన్నీ గణతంత్ర రాజ్యాలే. ఒకానొక గణతంత్రరాజ్యానికి శాలివాహనుడు రాజు. క్రమక్రమంగా శాలివాహనులు కరీంనగరం మండలం నుంచి విస్తరించి ఆంధ్రదేశాన్నే గాక యావద్దక్షిణదేశాన్ని, కొంతకాలం మగధను ఏలుబడిలోకి తెచ్చుకున్నారు. చంద్రగుప్తమౌర్యుడు ఉత్తర భారతదేశాన్ని పరిపాలిస్తున్న కాలంలో దక్షిణభారతదేశంలో ఆంధ్రులకు ప్రత్యేక రాజ్యం ఉండేది. ఆ రాజ్యానికి 30 కోటలు, ఒక లక్ష పదాతి సైన్యం, రెండు లక్షల అశ్వక బలం ఉండేవి.

అశోక చక్రవర్తి మరణానంతరం దక్షిణాపథంలో నివసించిన జాతులలో ఆంధ్రులు ముందుగా స్వతంత్రించి శ్రీముఖుని నాయకత్వంలో క్రీ.పూ. 225లో స్వతంత్ర రాజ్యం స్థాపించుకున్నారు. ఈ శ్రీముఖుడు ఆంధ్రజాతిలోని శాతవాహన కాలానికి చెందినవాడు. కనుక శ్రీముఖుని సంతతి వారికి చరిత్రలో ఆంధ్రరాజులని, శాతవాహన రాజులని పేరు వచ్చింది. ఈ శాతవాహనులనే శాలివాహనులు, శాతకర్ణులని అంటారు. ఈ వంశంవారు దాదాపు 450 ఏండ్లు అవిచ్ఛిన్నంగా పరిపాలన చేసి చరిత్ర ప్రసిద్ధినొందారు.

ఉత్తరభారతదేశంలో రాజకీయ అనిశ్చిత పరిస్థితి దాపురించిన కాలంలో దక్షిణదేశంలో తమ రాజ్య విస్తరణకు శాతవాహనులకు మంచి అవకాశం లభించింది. శ్రీముఖుడు, అతని తమ్ముడు శ్రీకృష్ణుడు తమ రాజ్యాన్ని నాసిక్ దాకా విస్తరించుకున్నారు. ఆ తరువాత శుంగులతోను, శకులతోను పోరాటం జరిపి తమ విస్తరణలో మొదట ఉజ్జయిని, పిదప విదిశా నగరాలను ఆక్రమించుకున్నారు. పైఠాన్

అనే ప్రతిష్ఠానపురం వీరి రాజధాని. ఇది పూర్వపు హైదరాబాద్ రాష్ట్రంలోని అవురంగాబాద్ జిల్లాలో గోదావరి నదికి ఉత్తర తీరాన ఉంది.

క్రీ.శ. 2వ శతాబ్ది చరిత్ర శక–శాతవాహనుల యుద్ధచరిత్ర. శాలివాహనుల మరో రాజధాని అమరావతి. దీన్ని ధాన్యకటకమని కూడా పిలిచేవారు.

శాతవాహనులు 157 సంవత్సరాలు దక్షిణభారతదేశంలో రాజ్యం చేసిన తరువాత కణ్వవంశపు సుశర్మ అనే రాజును శాతవాహన శ్రీముఖుడు యుద్ధంలో ఓడించి, వధించి మగధరాజ్యాన్ని ఆక్రమించుకున్నాడు. ఈ సంఘటన జరిగిన తరువాత 19 మంది శాతవాహన రాజులు అవిచ్ఛిన్నంగా 300 సంవత్సరాలు భారతదేశాన్ని పాలించారు. వీరి రాజ్యం పడమట అరేబియా సముద్రం వరకు వ్యాపించి ఉండేది. అందులో హైదరాబాద్ రాష్ట్రం, విదర్భ ప్రాంతాలు ఉండేవి. ఈ రాజులను భారతీయ క్షత్రియులని రేప్సన్ తన 'కయిన్స్ ఆఫ్ ఆంధ్ర' అనే గ్రంథంలో పేర్కొన్నాడు.

మెగస్తనీస్ క్రీస్తుకు పూర్వం 300 సంవత్సరాల క్రితం పేర్కొన్న ఆంధ్రుల ముప్ఫయి పట్టణాలలో మెదక్ జిల్లాలోని కొండాపురం ఒకటి. అక్కడి దిబ్బని తవ్వగా దొరికిన నాణేలనుబట్టి ఈ ప్రాంతాలను గౌతమీపుత్ర పులోమావి పాలించినట్లు తెలుస్తున్నది. తెల్లని మట్టితో చేసిన అనేక విగ్రహాలు కొండాపురంలో దొరికాయి. ఆ బొమ్మలకు రంగులు కూడా పూసేవారు. చేతిలో 'త్రిరత్న' చిహ్నం ఉన్న విగ్రహాలు, చేతిమీద చిలుకనో, పావురాయినో ఎక్కించుకున్న బొమ్మలు స్త్రీ, పురుషులవి అనేకం దొరికాయి. త్రిరత్న చిహ్నం బౌద్ధమతస్థులు ధరించేది.

బుద్ధం, ధర్మం, సంఘం– ఈ మూడు కలిసి త్రిరత్న అవుతోంది. బహుశా ఈ ప్రాంతంలో హీనయాన బౌద్ధమతం వ్యాప్తిలో ఉండి ఉంటుంది. సింహాలు, పొట్టేళ్ళు, కుక్కలు, చిలుకలు, గుర్రాల బొమ్మలు కొండాపురం దిబ్బలలో దొరికాయి. అక్కడ పింగాణి పరిశ్రమ కూడా ఉండేదని, అది మంచి అభివృద్ధిలోకి వచ్చిన పరిశ్రమల ప్రాంతం అయి ఉంటుందనిపిస్తుంది. ఇంతటి మహోన్నతమైన కొండాపురం మత విద్వేషాగ్నిలోపడి బుగ్గి అయినట్లు చరిత్రాధారాలు సూచిస్తాయి. స్తూపాలు, త్రిరత్న చిహ్నాలు, విగ్రహాలు దొరికాయి. కాబట్టి ఆ ప్రాంతం చాలాకాలం వరకు

బౌద్ధమత కేంద్రంగా ఉన్నట్లు చెప్పవచ్చు. కాని ఆ తరువాత బౌద్ధమతానికి శత్రువులైన ఆంధ్రరాజులు వచ్చారు. ముఖ్యంగా గౌతమీపుత్రుడు బౌద్ధమత ద్వేషి, ఇతని పుత్రుడు పులోమావి తండ్రికింద సామంతుడిగా ఉండి తన పేరుతో నాణేన్ని తయారు చేయించుకున్నాడు. అవే నాణేలు కొండాపురంలో దొరికాయి. బహుశా కొండాపురంలో బౌద్ధమతాన్ని పూర్తిగా తుడిచివేసి, వర్ణాశ్రమ ధర్మాన్ని నిలపటానికి గౌతమీపుత్రుడు, పులోమావి దండయాత్రలు చేసి ఉంటారు. ఆ దండయాత్రలు బౌద్ధమతాన్ని తుడిచివేయలేక కొండాపురాన్ని తుడిచివేశాయేమో!

కరీంనగర్ జిల్లా కోటిలింగాల క్షేత్ర త్రవ్వకాలలో శాతవాహనుల కాలంనాటి కొన్ని ఆధారాలు లభ్యమైనాయి. ఆ కాలంలో మురుగునీటి పారుదల సౌకర్యాలు బాగా అభివృద్ధి చెందాయి. స్నానాలగదిలోని నీళ్ళు బయటకు పోయి ఒక కూడలి స్థలంలో చేరుకోవడానికి వీలుగా క్రమపద్ధతిలో డ్రైనేజి పద్ధతి అభివృద్ధి చెందింది. బావులకు చుట్టూ ఇనుపగోడలు నిర్మించారు. ఇనుప ఆయుధాలు కూడా దొరికాయి. గొలుసుతో కట్టిన ఒక ముళ్ళ ఇనుప బంతి కూడా దొరికింది. దీనినిబట్టి ఆనాటి రాజులు ఎంత ప్రమాదకరమైన ఆయుధాలు ఉపయోగించేవారో విదితమవుతుంది.

శాతవాహనుల కాలంలో రెండు ముఖ్య శకాలు ప్రచారంలోకి వచ్చాయి. ఒకటి విక్రమశకం, రెండోది శాలివాహనశకం. విక్రమశకం క్రీ.పూ. 58 నుంచి, శాతవాహనశకం క్రీ.శ. 76 నుంచి లెక్కకు వస్తాయి. ఇప్పుడు శాలివాహనశకమే ఎక్కువ ప్రచారంలో ఉంది. ప్రాకృతము శాతవాహనుల రాజభాష. శాసనాలు, గ్రంథాలు, రాజ్యాంగ వ్యవహారాలన్నీ ఈ భాషలోనే జరిగేవి. ఈ ప్రాకృత భాషకు ఒక రూపమైన పాళీ భాషలో బౌద్ధమత గ్రంథాలన్నీ ఉన్నాయి. ఈ రెండు భాషలు కాక సంస్కృతం కూడా ప్రవేశించింది. కుంతలశాతకర్ణి ఆస్థాన పండితుడైన శర్వవర్మ 'కాతంత్ర వ్యాకరణము' రచించి ఆరునెలల్లో సంస్కృత భాషను రాజుకు నేర్పగలిగాడని గుణాఢ్యుని కథ ద్వారా తెలుస్తున్నది. సంస్కృతం, ప్రాకృతం భాషలు రెండూ ఒకే భాషాకూటమికి చెందినవే. ఈ రెంటికిగల తేడా గ్రాంథిక, వ్యావహారిక భాషలకు గల తేడా మాత్రమే. కనుకనే ఆంధ్రదేశంలో సంస్కృతం ప్రాకృతాన్ని అతిత్వరగా తొలగించి ఆ స్థానాన్ని ఆక్రమించింది. హాల శాతవాహనుని కాలం అయిదు సంవత్సరాలే (క్రీ.పూ. 19–24). అది ప్రాకృత భాషకు స్వర్ణయుగం. మధుర మంజుల

శబ్దాల కూర్పు 'గాథా సప్తశతి'. దీనిలో 700 శృంగార గాథలున్నాయి. దీనిలో కొన్ని మాత్రమే రాజు రచించాడు. హాలునికి 'కవివత్సల' అని బిరుదు ఉండేది.

చరిత్రయుగంలో ఆంధ్రులు ఆదినుంచి బౌద్ధులు. బుద్ధుడు కూడా బ్రాహ్మణేతరోద్యమ సంస్థాపకుడే. ఈ యుగంలోని గొప్ప ఆంధ్రవ్యక్తి నాగార్జునుడు. ఈయన అపర బుద్ధుడు. హీనయాన బౌద్ధానికి ప్రతిగా మహాయాన బౌద్ధం స్థాపించిన ప్రవక్త నాగార్జునుడు. జగత్ప్రఖ్యాతి గాంచిన రసాయన శాస్త్రజ్ఞుడు. ఆయుర్వేదాచార్యుడు. శ్రీపర్వత వాసి, కృష్ణాతీరస్తుడు.

గుణాఢ్యుడు రాసిన 'బృహత్కథ', వాత్సాయనుని 'కామసూత్రాలు' నాగార్జునుని 'ప్రాజ్ఞ పారమిత సూత్రం', 'సుహృల్లేఖ' మైదలైన అనేక గ్రంథాలు భారత వాఙ్మయంలో అమూల్య రత్నాలు. రాజులు కళాప్రియులు. అనేకమంది కవులు, పండితులు కావ్య రచనలు చేసి రాజుల ఆస్థానంలో సన్మానాలు అందుకున్నారు.

వాత్సాయన కామసూత్రాలలో శాతవాహనుల కాలంనాటి కొన్ని ఆటలు, పందేల ప్రస్తావన వుంది. వీటిలో కోళ్ళు, గొఱ్ఱెల పందాలు ఉండేవి. వెన్నెలలో జాగరణ చేసేవారు. శనగ మొక్కలను, జొన్న కంకులను తెచ్చి మంట పెట్టి కాల్చుకుని తినడం, సరస్సులలోనికి దిగి తామరతూళ్ళను ఊడలాగే ఆట, బొమ్మలకు పెళ్ళిళ్ళు చేసే ఆట, సుగంధ ద్రవ్యాలు కలిపిన పిండిని ఒకరిపై ఒకరు చల్లుకోవడం, చెరకు ముక్కలతో దండలు గుచ్చి ఇళ్ళకు అలంకరించుకోవడం మొదలైన వినోదాలతో ప్రజలు కాలక్షేపం చేసేవారు. వేటాడడం మరొక ప్రీతికరమైన వినోదం. వేటకు వెళ్ళేటప్పుడు కుక్కలని వెంటతీసుకు పోయేవారు. ఆ కాలంనాటి పెంపుడు పక్షులలో చిలుకలు, కోళ్ళు ముఖ్యమైనవి.

స్త్రీలు బంతులతో ఆడేవారు. దీన్ని కందుక క్రీడ అనేవారు. దాన్ని చెక్కతోనూ, ఊలుతోను, పువ్వులతోను చేసేవారు. రకరకాల ఆకులను పోగుచేసి దండలు చేసి పైన దారం కట్టిన బంతులతో ఆడుకోవడం కొన్ని ప్రాంతాలలో ఇప్పటికీ ఉంది. శాతవాహనుల కాలంలో లోహపరిశ్రమ చాలా ఉచ్ఛస్థితికి చేరింది. లోహాల్లో ఇనుము, రాగి, బంగారం, వెండి, తుత్తునాగం, కంచు మొదలైనవి ఉన్నాయి. ఏనుగులు, గుర్రాలు, రథాలు, సైనికులు– ఇవి చతురంగ బలాలు. రాజులు తమ సంపత్తిని

చూపించడానికి ఏనుగులు, గుర్రాలు, మనుషుల బొమ్మలను నాణేలమీద ముద్రించేవారు. బౌద్ధులకు ఏనుగులు చాలా పవిత్రమైనవి.

శాతవాహనుల కాలంలో దేశంలోని వివిధ ప్రాంతాలతోను, విదేశీయులతోను, పశ్చిమ ఆసియా, గ్రీసు, రోమ్, ఈజిప్టు, చైనా, బర్మా, జావా, సుమత్రా ఇతర తూర్పు ఆసియా దేశాలతోను వ్యాపార సంబంధాలు ఉండేవి. భారతదేశం నుండి రోమన్ సామ్రాజ్యానికి ఏనుగులు, రత్నాలు, మస్లిన్‌గుడ్డలు, ముత్యాలు, బానిసస్త్రీలు, కొజ్జాలు, సింహాలు, చిరుతపులులు, పెద్దపులులు, ఖడ్గమృగాలు, కోతులు, కుక్కలు, మూపురం ఉన్న ఎడ్లు, తాచుపాములు, కొండ చిలువలు, నెయ్యి, నువ్వులనూనె, కొబ్బరినూనె, ఏనుగు దంతాలు, తాబేలు టెంకలు, శంఖాలతో చేసిన గాజులు, చెవిపోగులు, దూదితో చేసిన పల్చటి వస్త్రాలు, లక్క, మిరియాలు, పిప్పళ్ళు, శొంఠి, సునముఖి, దాల్చిన చెక్క, తమలపాకులు, రకరకాల కలపలు, నల్లమద్ది, చందనం, టేకు మొదలైనవి ఎగుమతి అయ్యేవి. ఆంధ్రరాజుల నాణెములమీద ముద్రితమైన రెండు కొయ్యలుగల పెద్ద ఓడలే వారి కాలంలో జరిగిన విదేశీ వ్యాపారము, సముద్రముపై వారికి గల ఆధిపత్యాన్ని వ్యక్తం చేస్తున్నాయి.

నాలుగువందల సంవత్సరాలకు పైగా సుస్థిరంగా, శక్తిమంతంగా, సమభావంతో పరిపాలన సాగిన శాతవాహన యుగంలో సర్వతోముఖాభివృద్ధి జరిగింది. ప్రజలు తీరిక సమయాల్లో ఆటలతో, పందేలతో, సంగీత సాహిత్య, నృత్య వినోదాలతో సుఖశాంతులను అనుభవించారు. ఆ మహాయుగం ఏ యుగానికైనా ఏ కాలానికైనా ఒక గొప్ప ఆదర్శమే. నాటి సంఘంలో స్త్రీలకు గౌరవ ప్రదమైన స్థానం ఉండేది. సంగీత సభలలో, విద్వద్గోష్ఠులలో, నాట్యమండలులలో స్త్రీలు పాల్గొనేవారు. గౌతమీపుత్ర శాతకర్ణి కాలంనాటి నుండి శాతవాహన చక్రవర్తులు మాతృభక్తి పరాయణులు. అలా పేరుకుముందు తల్లిపేరు చెప్పుకునేవారు. రాజవంశపుస్త్రీలు బౌద్ధభిక్షువులకు అనేక దానాలు చేసేవారు.

ఆంధ్రులు బౌద్ధమతం స్వీకరించే నాటికే ఆంధ్ర శిల్పం ఉన్నత స్థితిలో ఉంది. ధాన్యకటకంలో, జగ్గయ్యపేటలో, భట్టిప్రోలులో, ఘంటసాల, నాగార్జున కొండ మొదలైన ప్రదేశాలలో క్రీస్తుకు పూర్వం రెండవ శతాబ్దంనుండి క్రీ.శ. మూడు వందల సంవత్సరాల వరకు ఒక మహారాగము పాడింది. రాజులు బ్రాహ్మణ మతస్తులు.

అశ్వమేధ, రాజసూయ యాగాలు చేసి, బౌద్ధమత వ్యాప్తికోసం అనేక స్తూపాలు, చైత్యాలు, విహారాలు నిర్మించారు. వీటిలో కొన్ని శిల్ప నిర్మితాలు, కొన్ని ఇటుక కట్టడాలు. బౌద్ధారామాలు ప్రఖ్యాత విద్యాసంస్థలుగా భాసిల్లాయి. ఈ విధంగా ఆంధ్రదేశం శాతవాహనుల కాలంలో అన్నివిధాలా అభివృద్ధి చెందింది. నాగార్జునకొండ ప్రాంతంలో బౌద్ధావశేషాలతోపాటు దేవయానావశేషాలు కూడా కనిపించడం శాతవాహనుల పరమత చిహ్నానికి గొప్ప నిదర్శనం. పాలకులందరు, వైదిక మతావలంబులుకాగా, రాణులంతా బౌద్ధమతాన్ని పోషించారు. ఈ విధంగా వారి కాలంలో కృష్ణాతీరమంతా బౌద్ధ, వైదిక మతాలకు, విద్యలకు కేంద్రమయింది.

ఆంధ్ర శాతవాహనుల కాలంలో దేశం అన్నివిధాలా అభివృద్ధి చెందింది. ఒక ప్రాంతంలో సుస్థిరంగా నివసించనారంభించిన ప్రజలే, క్రమంగా ఒక జాతిగా ఏర్పడగలుగుతారు. ఆంధ్రుల ఈ చారిత్రక పరిణామం శాతవాహనుల రాజుల కాలంలో ప్రారంభమైంది. ఆంధ్ర శాతవాహన చక్రవర్తులు క్రీ.పూ. 833 నుండి క్రీ.శ. 327 వరకు అయిదు వందల ఆరు సంవత్సరాలు రాజ్యమేలారు.

శాతవాహనుల కాలంలో ఆంధ్రులు, మహారాష్ట్రులు, కన్నడిగులు, ద్రావిడులు, ఘూర్జరులు, కాళింగులు, విదేశీయులైన శక, యవన, పల్లవులు మొదలైన అసంఖ్యాక ప్రజలు అన్నదమ్ములవలె కలసి మెలసి జీవించేవారు. సామ్రాజ్యంలో హిందూ, బౌద్ధ, జైన మతాలు ప్రధానమైనవి. సంచార తెగల దశనుంచి మారి ఆంధ్రప్రజలు సుస్థిర జాతిగా పరిణామం చెందనారంభించారు. ❑

2. ఇక్ష్వాకులు

శాతవాహన సామ్రాజ్యము అంతరించగానే ఛిన్నాభిన్నమైన దక్షిణదేశానికి రాజకీయ ఐక్యత కలిగించినవారు ఇక్ష్వాకులు. వీరి పరిపాలన అర్ధశతాబ్దము మాత్రమే సాగింది. శాతవాహన సామ్రాజ్యం క్రీస్తుశకం తృతీయ శతాబ్దం ప్రారంభంలో కూలిపోయింది. ఆ అవకాశం వినియోగించుకుని వాసిష్ఠీ పుత్ర శ్రీచాంతమూలుడు ప్రబలుడై కృష్ణాతీరంలో విజయపురి రాజధానిగా ఇక్ష్వాకు వంశరాజ్యం స్థాపించాడు. ఇక్ష్వాకులు 225-300 మధ్య పాలన జరిపారు. ఈ వంశంలో శాంతిమూలుడు, వీర పురుషదత్తుడు, ఏహువల శాంతమూలుడు, రుద్రపురుష దత్తుడు ముఖ్యులు. శాంతిమూలుడు గుంటూరు, ప్రకాశం, నల్లగొండ మండలాలను పరిపాలించి వైదిక మతాన్ని ఉద్ధరించాడు. నాగార్జునకొండ ప్రాంతంలో మహాసేన విరూపాక్షాలయాలు నిర్మించాడు. ఇతని రాజ్యకాలంలో రాణివాసపుస్త్రీలు, రాణులు బౌద్ధమతాన్ని ఆదరించారు.

ఇక్ష్వాకుల పరిపాలన శాతవాహన పద్ధతిలోనే సాగింది. వీరి రాజలాంఛనం సింహం. వీరికాలంలో బౌద్ధమతం ఉచ్ఛదశలో ఉంది. చైనా, సింహళం, మలయా దేశాలనుండి బౌద్ధభిక్షువులు వచ్చేవారు. నేటి నాగార్జునలోయ నాటి ప్రఖ్యాతమైన బౌద్ధతీర్థము. ఇక్ష్వాకులు ప్రాకృతభాషను ఆదరించారు. మనకిప్పుడు వాడుకలో ఉన్న తిథి, వార, పక్ష, మాసాలతో కూడిన పంచాంగమ్, చంద్రయాన వ్యవహారము వీరి కాలంనుండే ప్రారంభమైనది. ఈ కాలాన సంవత్సరానికి గ్రీష్మము, వర్షము, హేమంతము అనే మూడు ఋతువులు చెప్పుకున్నారు. ఒక్కో రుతువుకు నాలుగు మాసాలు. ఇక్ష్వాకులు తమ అధికారాన్ని స్థిరపరచుకుని, విస్తరింపజేసుకొనడానికి ఇతర రాజులతో వైవాహిక సంబంధాలు నెరపుకున్నారు. ఇవి ఆనాటి రాజ్యాల చరిత్రలో సహజంగా కనిపించే సంఘటనలు.

ఇక్ష్వాకుల రాజవంశ వైభవ ప్రాభవాల చరిత్ర పునర్నిర్మాణానికి ప్రధానాధారం నాగార్జునకొండ తవ్వకాలలో లభించిన పురావస్తు సంపదే. సామాన్య ప్రజలు కోట

వెలుపల చెక్కరాయి, మట్టి ఇటుకలతో కట్టిన ఇళ్ళలో నివసించేవారు. పౌరులు నివసించే ఇండ్లు బారులు తీరి విశాలమైన వీథులకు ఇరుపక్కల నిర్మించబడ్డాయి. ఈ తవ్వకాలలో బయటపడిన సంఘజీవనానికి సంబంధించిన కట్టడము గోళాకారమైన రంగభూమి. దీనిలో దాదాపు వేయిమంది ప్రేక్షకులు నాలుగువైపుల కూర్చుని చూడటానికి అంచెలంచెలుగా వరుసగా కట్టిన రాతి బల్లల వంటివి ఉన్నవి. నాగార్జున కొండలో దొరికిన రోమన్ నాణేలు, బంగారు నగలను బట్టి విజయపురికి విదేశాలలో విరివిగా వర్తక వ్యాపారాలు సాగినట్లు తెలుస్తుంది.

సంఘజీవితంలోని అన్ని స్థాయిలు, అన్ని అంశాలు మతంతో పూర్తిగా ముడిపడి వుండడం ప్రాచీన భారతీయ సంస్కృతి విశిష్టత. బౌద్ధస్థూపాలు, విహారాలు, చైత్యాలు మాత్రమే గాక, దేవాలయాలు విశేషంగా ఉన్న నాగార్జున కొండ పైన పేర్కొన్న అంశానికి ఉదాహరణ. ఇక్ష్వాకు రాజవంశం బౌద్ధమతాన్ని భారతదేశంలోనే గాక, లంక మున్నగు సుదూర దేశాలలో వ్యాపింపజేయడంలో ప్రధానపాత్ర వహించింది. ఈ బౌద్ధవ్యాప్తికి నౌకాయానుకూలంగా కృష్ణానది కూడా తన పాత్ర నిర్వహించింది.

బౌద్ధమత చరిత్రలో ఇక్ష్వాకుల పరిపాలన మరొక కారణాన కూడా ప్రాముఖ్యం వహించింది. ఆ కారణమేమంటే మహాయాన బౌద్ధమత వ్యాప్తికి దోహదం చేయడం, విజయపురి ఇక్ష్వాకులకు దక్షిణాన వాస్తు కళా చరిత్రలోనే గాక, భారతదేశ వాస్తుకళా చరిత్రలోను ప్రముఖ స్థానముంది. పల్లవరాజైన సింహవర్మ విజయపురిపై దండెత్తడంతో రుద్రపురుషదత్తుని పాలనలో ఇక్ష్వాకు రాజ్యమంతరించింది.

ఇక్ష్వాకుల రాజధాని అయిన విజయపురి మహావైభవంగా వెలిగిపోయింది. సుదూర దేశాలనుంచి వర్తక, వ్యాపారాలకు కేవలం వాణిజ్యాలే కాకుండా బౌద్ధధర్మ జిజ్ఞాసు లు, విద్యార్థులు, గురువులు కూడా ఎంతోమంది ఇక్కడికి వచ్చేవారు. నాగార్జునుని కాలంలోనూ, తర్వాత కొన్ని శతాబ్దాల వరకు కూడా విజయపురి ప్రపంచ విద్యార్థుల విద్యాదాహాన్ని తీర్చు విశ్వవిద్యాలయంగా నిలిచింది. కాశ్మీర్, గాంధార, చీన, చిలాటి, తోసలి, అపరంత, వంగ, వారణాసి, యవన, సాలూర, తంబపణ్ణి, తమిళ దేశాలలోని విద్యార్థులు తండోపతండాలుగా వేదాంత విద్య నేర్చుకోటానికై వచ్చేవారు. ❑

3. విష్ణు కుండినులు

ఆంధ్రదేశ చరిత్రలో మహోజ్జ్వలంగా రాణించిన రాజవంశాలలో విష్ణుకుండిన వంశమొకటి. ఇక్ష్వాకుల సామంతుడిగానో, మాండలికునిగానో ఈ శకకర్త మహారాజేంద్రవర్మ కృష్ణానదికి ఉత్తరాన ఉన్న తెలంగాణాలోని నల్లగొండ, మహబూబ్‌నగరు మండల ప్రాంతాలనాక్రమించి విష్ణుకుండిన రాజ్యం నెలకొల్పాడు. రెండవ మాధవవర్మ వాకాటక రాజకుమార్తెను వివాహం చేసుకొని తన రాజ్యాన్ని సురక్షిత పరచుకున్నాడు. వీరి పరిపాలన నాల్గవ శతాబ్ది ఉత్తరార్ధమునుంచి ఏడవ శతాబ్ది పూర్వార్ధము వరకు అవిచ్ఛిన్నంగా కొనసాగింది. మూసీనది వొడ్డున ఉన్న ఇంద్రపురి లేక ఇంద్రపాల నగరం వీరి రాజధాని. ఈ ఇంద్రపాల నగరమే నేటి తుమ్మలగూడెం. ఇది నల్లగొండ జిల్లా రామన్నపేట మండలానికి 6 కి.మీ. దూరంలో ఉంది.

విష్ణుకుండిన రాజులలో మొదటి ముగ్గురు బౌద్ధులు. తదుపరి వారు వైదిక మతాన్ని అవలంబించారు. వీరి కాలంలో సంస్కృతం రాజభాషగాను, తెలుగు వ్యావహారిక భాషగాను వాడుకలో ఉంది. పన్నెండుగురు విష్ణుకుండిన రాజులు 260 సంవత్సరాలు ఆంధ్రదేశాన్ని పాలించారు. లంఘించు సింహం ఈ వంశపు రాజుల రాజ చిహ్నము.

ఆంధ్రదేశ చరిత్రలో విష్ణుకుండిన రాజకీయ చరిత్రకంటే కూడా ఎక్కువ వైభవోపేతమైనది వారి సాంస్కృతిక చరిత్ర. రాజకీయంగా వారు ఆంధ్రదేశంలో బలమైన స్వతంత్ర రాజ్యం స్థాపించి సుమారు ఒకటిన్నర శతాబ్దాలు పాలించారు. ఒకవైపు బలవంతులైన వాకాటక చక్రవర్తులతో వియ్యమంది ప్రాముఖ్యాన్ని సంపాదించారు. ఇంకొకవైపు కయ్యం సాగించి కళింగాధిపతుల నోడించి వారిని అదుపులో పెట్టారు. వారి రాజ్యకాలం ఆంధ్రదేశ మతచరిత్రలో కూడా విశిష్టమైనది.

వారికి ముందుకాలంలో ఆంధ్రదేశంలో బౌద్ధమతం విస్తరించి వికసించగా వారికాలంలో వైదిక మతం తిరిగి ఉన్నతస్థితికి వచ్చింది. యజ్ఞాలు చేయడం, విద్యాధికులైన విప్రులను పోషించడం, వేదవిద్యలను ఆదరించడం ద్వారా వీరు వైదికమతాన్ని ఆంధ్రదేశంలో పునరుద్ధరించారు. ఈ కాలంలో బౌద్ధ, జైనమతాలు క్షీణదశకు చేరుకున్నాయి. విష్ణుకుండిన పాలనాకాలంలో చక్కని న్యాయ వ్యవస్థ ఉండేది. విష్ణుకుండినుల శాసనాలు సంస్కృత భాషలో ఉన్నాయి. వీరికి ముందు పాలించిన ఆంధ్రరాజుల శాసనాలు పాకృతంలో ఉన్నాయి. ఆ రోజులలో ఆంధ్రదేశం నుండి ముఖ్యంగా కళింగతీరంనుండి విశేషంగా నౌకాయానం, విదేశవర్తకం, సాంస్కృతిక వ్యాప్తి, వలసల స్థానం ప్రాచ్యదేశాలతో జరిగేది.

'విష్ణుకుండినులు గొప్ప ఆలయాలు నిర్మించారు. వారికి ముందు ఆంధ్రదేశ మంతటా బౌద్ధస్తూపాలు, చైత్యాలు, విహారాలు, సంఘారామాలు వెల్లివిరిసాయి. విష్ణుకుండినుల కాలం నుండి ఆంధ్రదేశంలో హిందూదేవాలయాల యుగం ప్రారంభమైంది. పాలూరు విష్ణుగ్రహస్వామి ఆలయం, వేంగిలోని చిత్రరథస్వామి ఆలయం వీటికి ఉదాహరణలు. విష్ణుకుండినుల ఆలయ శిల్పానికి శిలలు మలచిన ఆలయాలు ప్రత్యేక చిహ్నాలు.

విష్ణుకుండినుల కాలంలో శాలంకాయనులు, బృహత్ఫలాయనులు, ఆనంద గోత్రీకులైన స్థానిక రాజులు, చిన్న చిన్న రాజ్యాలను పరిపాలించారు. వీరిలో ఏ ఒక్కరూ రెండు జిల్లాలను మించి పాలించలేదు.

ఈ కాలంలో గుప్తరాజుల దండయాత్రలు జరిగాయి. కీ.శ. 324లో జరిగిన సముద్రగుప్తుని దండయాత్ర కంచివరకు సాగింది. గుప్తరాజులు వైదిక మతస్థులు. విష్ణుకుండినులు, బౌద్ధమతాన్ని ఆచరించినప్పటికి చాళుక్యయుగం ప్రారంభం అయ్యేనాటికి బౌద్ధమతం పూర్తిగా క్షీణించింది. ఆంధ్రదేశం బౌద్ధసంస్కృతి నుండి క్రమంగా హిందూ సంస్కృతిలోకి మారిన సంధియుగం అని చెప్పవచ్చు. ఈ పరిణామంవలన ఆంధ్రదేశ చరిత్రలో వచ్చిన ప్రధానమార్పు ఏమంటే ఈ యుగంలో ఆంధ్రదేశంలో కులవ్యవస్థ ప్రారంభమయింది. తరువాత రాజ్యానికి వచ్చిన రాజవంశాల కాలంలో కులాల సంఖ్య పెరుగుతూ వచ్చింది. ❑

4.చాళుక్యులు

శాతవాహనుల పతనానంతరం దక్షిణాపథంలో సుస్థిర రాజ్యం స్థాపించగలిగిన వారు చాళుక్యులే. వారి పరిపాలన రెండు శతాబ్దాలు కొనసాగింది. క్రీ.శ.546 ప్రాంతంలో మొదటి పులకేశి వల్లభుడు బీజాపూరు జిల్లాలోని బాదామి కోటను జయించి దాన్ని రాజధానిగా చేసుకున్నాడు. తన విజయ చిహ్నంగా అశ్వమేధయాగం చేశాడు. క్రీ.శ. 610లో చాళుక్య సింహాసనమధిష్ఠించిన రెండవ పులకేశి కన్యాకుబ్జ రాజైన హర్షచక్రవర్తి దండయాత్రను తిప్పికొట్టాడు. అటు పిమ్మట రెండవ పులకేశి కాలంలో కుబ్జ విష్ణువర్ధనుడు తీరాంధ్ర, తెలంగాణా ప్రాంతాలను 620–623 మధ్యకాలంలో తన ఏలుబడిలోకి తెచ్చుకున్నాడు. తూర్పు చాళుక్యుల వేంగీరాజ్య పరిపాలన విష్ణువర్ధనునితో ప్రారంభమైనది. క్రీ.శ. 631లో ఆవిర్భవించిన వేంగి చాళుక్య రాజుల యుగం అయిదు దశాబ్దాలు కొనసాగి పదకొండవ శతాబ్దంలో చోళరాజ్యంలో లీనమైంది.

పులకేశిపై ప్రతీకారం తీర్చుకొనడానికి పల్లవరాజు క్రీ.శ. 641లో బాదామిని ముట్టడించాడు. పులకేశి, విష్ణువర్ధనులిద్దరు ఆ యుద్ధంలో ప్రాణాలు కోల్పోయారు. విష్ణువర్ధనుని ఇద్దరు కుమారులైన జయసింహుడు, ఇంద్రభట్టారకుడు ఒకరి తరువాత ఒకరు రాజ్యానికొచ్చారు.

విష్ణువర్ధనుడి జ్యేష్ఠపుత్రుడు జయసింహుడు ముప్పయ్యేండ్లు రాజ్యం చేశాడు. ఇతని అధికారం కళింగం నుండి పాకనాటి వరకు సాగింది. రెండవ పులకేశి పుత్రులలో ఒకరైన విక్రమాదిత్యుడు క్రీ.శ. 655 ప్రాంతంలో పల్లవరాజును ఓడించి తండ్రి పొందిన రాజ్యాన్ని పునరుజ్జీవింపజేశాడు. ఇతని దండయాత్రలలో జయసింహుడు సహాయపడ్డాడు. జయసింహునికి సంతానం లేనందున అతని తమ్ముడు ఇంద్రభట్టారకుని కుమారుడు రెండవ విష్ణువర్ధనుడు తొమ్మిది సంవత్సరాలు పరిపాలించాడు.

క్రీ.శ. 629లో చైనా యాత్రికుడు యునిత్సాంగ్ ఆంధ్రదేశాన్ని సందర్శించి నప్పుడు బౌద్ధమతం ఈ ప్రాంతంలో క్షీణదశలో ఉంది. సుప్రసిద్ధమైన ధాన్యకటకము చుట్టుపక్కల ఎన్నో బౌద్ధారామాలు ఉన్నా 20 మాత్రమే మిగిలిపోయాయి. వీటిలో బౌద్ధభిక్షువులు వెయ్యిమంది మాత్రమే నివసించే వారు. వేంగీ సామ్రాజ్యమంతటిలో మూడువేలమంది బౌద్ధ సన్యాసులున్నట్టు ఈ చైనాయాత్రికుడు పేర్కొన్నాడు.

రెండవ విష్ణువర్ధనుని అనంతరం ఇతని పుత్రుడు మంగిరాజు ఇరవై అయిదేళ్ళు పరిపాలించాడు. ఇతని తరువాత జయసింహుడు 705 మొదలు 712 వరకు, 712 నుండి 718 వరకు కొక్కిలి విక్రమాదిత్యుడు, 718 నుంచి 752 వరకు ముమ్మడి విష్ణువర్ధనుని పరిపాలన సాగింది. క్రీ.శ. 753లో బాదామీ చాళుక్య రాజైన రెండవ కీర్తివర్మను ఓడించి దంతిదుర్గుడు రాష్ట్రకూట రాజ్యాన్ని స్థాపించాడు. వేంగీచాళుక్యులకు ఇకనుంచి రాష్ట్రకూటుల దాడులనుండి రక్షణ పొందడం ప్రధాన కర్తవ్యమైంది. క్రీ.శ. 755లో పరిపాలనలోకి వచ్చిన విజయాదిత్యుడు రాష్ట్రకూట రాజు కృష్ణుడితో యుద్ధం చేయకుండానే 769లో సంధి చేసుకోవలసి వచ్చింది.

విజయాదిత్యుని మరణానంతరం అతని పుత్రుడు నాల్గవ విష్ణువర్ధనుడు రాజ్యాధికారానికొచ్చి 771 నుండి 804 వరకు పరిపాలించాడు. రాష్ట్రకూటరాజైన ధ్రువుడు వేంగిపై దండెత్తివచ్చినప్పుడు ఇతడు తన కుమార్తె శిలామహాదేవిని అతనికిచ్చి వివాహం చేసి బాంధవ్యం నెరపుకున్నాడు. విష్ణువర్ధనుడి అనంతరం అతని కుమారుడు విజయాదిత్యుడు రాజ్యానికొచ్చాడు. కాని అతని తమ్ముడు భీమసలి ద్రోహబుద్ధితో రాష్ట్రకూట చక్రవర్తి ముమ్మడి గోవిందరాజు సహాయంతో తొమ్మిది సంవత్సరాలు అడపాదడపా యుద్ధాలు చేసి విజయాదిత్యునికి నిద్రలేకుండా చేశాడు. విజయాదిత్యునికి పాపభీతి ఎక్కువ. మహేశ్వర భక్తుడు. యుద్ధాలలో తను చేసిన జీవహింసవల్ల కలిగిన పాపాన్ని పోగొట్టుకొనడానికి తను పోరాడిన నూటయెనిమిది రణక్షేత్రాలలోను శివాలయాలు కట్టించాడు. 784లో ఇతడు చనిపోయాడు.

విజయాదిత్యుని తరువాత ఇతని కుమారుడు విష్ణువర్ధనుడు పద్దెనిమిది మాసాలు, తరువాత అతని పుత్రుడు గణగ విజయాదిత్యుడు 44 సంవత్సరాలు సుదీర్ఘ పాలన జరిపారు. విజయాదిత్యుని కాలంలో రాష్ట్రకూటులకు, చాళుక్యులకు

తిరిగి యుద్ధాలు ప్రారంభమయ్యాయి. 850 సంవత్సరంలో కర్నూలు సమీపంలో జరిగిన యుద్ధంలో గణగ విజయాదిత్యుడు ఓడిపోయాడు. కానీ, ఇది తాత్కాలికమే. తరువాత అతడు గంగరాజుల సహాయంతో తిరిగి తన రాజ్యాన్ని స్వాధీన పరచుకున్నాడు. గణగ విజయాదిత్యుడు అస్తమించిన అనంతరం అతని తమ్ముని పుత్రునిపై చాళుక్య భీముడు 892లో రాజ్యాధిపత్యం వహించాడు. ఇతడు క్రీ.శ. 921లో కళింగ యుద్ధంలో చనిపోయాడు. మొదటి చాళుక్యభీముని తరువాత కొందరు రాజులు 921 నుంచి 945 వరకు పరిపాలించారు. ఈ రాజులలో చివరివాడు రెండవ చాళుక్యభీముడు. అతని రెండవ కుమారుడే అమ్మరాజు విజయాదిత్యుడు. 1011లో రాజ్యాధికారానికి వచ్చిన విజయాదిత్యునికి ఇద్దరు భార్యలు. వీరిలో చోళచక్రవర్తి రాజరాజు కుమార్తె ఒకరు. వారి కుమారుడే రాజరాజ నరేంద్రుడు.

రాజరాజుకు అమ్మంగిదేవివలన రాజేంద్రుడనే కుమారుడు జన్మించాడు. ఇతడు మాతామహుని వద్ద చోళరాజధానిలో పెరిగాడు. రాజరాజు అస్తమయానంతరం వేంగిరాజ్యం ఇతనికి దక్కలేదు. పినతండ్రి విజయాదిత్యునికి లభించింది. విజయాదిత్యుని మరణంతో వేంగిరాజ్యపు పూర్వవైభవానికి గ్రహణం పట్టింది. అతని అనంతరం అతని అన్న కుమారుడు రాజేంద్రునికి రాజ్యం లభించినా, అతడు చోళరాజ్యాన్నే తన జన్మరాజ్యంగా భావించుకుని ద్రవిడదేశంలో స్థిరపడ్డాడు. దీనితో వేంగిరాజ్యం చోళరాజ్యంలో కలసి సామాన్య మండలమైంది.

పరిపాలనా విధానం:

చాళుక్యులకాలంలో దేశం సుభిక్షంగా ఉంది. పరిపాలన సౌలభ్యం కోసం రాజ్యాన్ని నాడులు, విషయములుగా విభజించారు. రాజమహేంద్రవరం, వేంగీపురం వీరి రాజధాని నగరాలు, వేంగీపురం ఇప్పుడు పశ్చిమగోదావరి జిల్లా ఏలూరు పట్టణానికి ఎనిమిద మైళ్ళ దూరంలో శిథిలావస్థలో కనిపిస్తుంది. నన్నయ భట్టు రాజరాజనరేంద్రుని వేంగీ విజయాధీశుడు, 'వేగీనాథ', 'వేగి భూవల్లభ' అని సంబోధించాడు. రాజులు తమ రాజ్యంలోని ప్రజలకు ఆర్థిక, సాంఘిక, రాజకీయ అవసరాలను సమకూర్చేవారు. రాజ్యంలో మంత్రి, పురోహితుడు, సేనాపతి, అమాత్య, దేవరిక, దండనాథ, కటక రాజు, దండనాయక, ఆయుక్త, నియుక్త మొదలైన

ఉద్యోగులను నియమించేవారు. రాజు తరువాత మంత్రి సర్వాధికారి. యువరాజు నియామకం రాజు ఇష్టంమీద జరిగేది.

రాష్ట్రానికి భూమి పన్ను ద్వారా వసూలైన ఆదాయమే ముఖ్యమైనది. భూసారాన్ని లెక్కకు తీసుకుని పన్నులు విధించేవారు. పన్నులు నానా రకాలుగా ఉన్నాయి. ఇంటిపన్ను, వృత్తిపన్ను, వివాహపందిళ్ళపై పన్ను ప్రజలు చెల్లించుకోవలసి వచ్చేది. నిధులు, నదులు రాజుల అధికారంలో ఉండేవి. నీటిపారుదల సౌకర్యాలు కలుగజేస్తూ రాజులు వ్యవసాయాభివృద్ధికి తోడ్పడేవారు. వేదవిదులైన విప్రులపై పన్నులు లేవు. పశువుల మేతకు కేటాయించిన బీళ్ళపై సుంకాలు లేవు. కనుక ప్రజలు ఎక్కువ పన్నులు చెల్లించినా సుఖజీవితం గడిపేవారు.

గ్రామసీమలో పంచాయతీ వ్యవస్థ అమల్లో ఉండేది. గ్రామపంచాయతీ సభ్యులను రాజులే నియమించేవారు. వేదశాస్త్రపారంగతులు, నిత్యసత్యవ్రతులు, ధార్మికులు, ధీరులు, లౌకికులు, పలుకుబడి కలవారు, మిత్రామిత్రుల యెడల సమదృష్టి ప్రదర్శించేవారు. పంచాయతీ సభ్యులుగా నియామకానికి అర్హత గలవారై ఉండేవారు. ఆనాడు ధాన్యాలు కొలవడానికి రాజముద్రలున్న కొలపాత్రలు వాడుకలో ఉండేవి. వడ్డీ వ్యాపారం విశేషంగా సాగేది. ముఖ్యమైన సైన్యం రాజువద్దనే ఉన్నా యుద్ధ సమయంలో సామంతులు, మాండలికులు సైనిక సహాయమందించేవారు. యుద్ధ సయమంలో ఏనుగులకు, గుర్రాలకు వీరసైనికులకు వీరపానమిచ్చేవారు. యుద్ధభూమికి స్త్రీలు కూడా వచ్చేవారు. గుర్రాలకు శరీర రక్షణార్థం కవచాలు తొడిగేవారు. సైనికులు శిరస్త్రాణము, కవచములు ధరించేవారు. విజయానంతరం స్త్రీ, శిశు, బాల, బ్రాహ్మణ, వృద్ధ జనులను హింసించరాదని కఠిన నిబంధనలుండేవి.

తూర్పు చాళుక్యులు వైదిక మతావలంబులు. శివపూజా ధురంధరులు. బ్రాహ్మణులకు అగ్రహారాలిచ్చి సత్కరించేవారు. ఘటిక స్థానాలని నెలకొల్పి దానాలు చేసేవారు. శైవమతాలను, శైవాగమ శాస్త్రవేత్తలను, శైవపండితులను, శైవ మతాచార్యులను పోషించేవారు. అమరావతి, ద్రాక్షారామం మొదలైన దేవాలయాలలో శైవాచార్యులుండేవారు. చాళుక్యులు మొదట జైనులు. కాబట్టి ఆంధ్రదేశంలో మొదట జైనశిల్పం తీసుకువచ్చినది వీరే. బసవేశ్వరుని శకం పూర్తికాగానే చాళుక్యులు శివదీక్షాపరులైనారు.

చాళుక్యుల కళాభిరుచికి అనువుగా నిర్మితమైన ఆలయాలు ఆంధ్రదేశంలో మహబూబ్‌నగరు జిల్లా ఆలంపురంలో తప్ప మరెక్కడా ఇప్పుడు కానరావు. కోటిలింగాల పుణ్యక్షేత్రమని కూడా వ్యవహరితమయ్యే ఆలంపురంలో ఆలయాలు విభిన్నరీతులలో ఉన్నాయి. ఇక్కడి బాలబ్రహ్మేశ్వరస్వామి దేవాలయం చుట్టూ కోటగోడ ఉంది. ఈ ఆలయానికి ముందు భూదేవి, పక్కన జోగులాంబ ఆలయాలు ఉన్నాయి. వీటి కోట గోడలపై గంధర్వ జంటలు, విహరిస్తున్న అప్సరసలు, ఇతర శిల్పాల బొమ్మలు నాటి రాజుల కళాభిరుచికి మచ్చుతునకలు. దేవాలయాలపై నిలువెత్తు దేవతా విగ్రహాలున్నాయి. నటరాజు, అష్టదిక్పాలకులు, త్రిపురాసుర మర్దని మొదలైన విగ్రహాలు మలచబడ్డాయి.

తూర్పు చాళుక్యులు అధికారంలోనికి వచ్చేనాటికి ఆంధ్రదేశంలో సంస్కృతం అధికార భాషగా ఉంది. జన వ్యవహారంలో తెలుగువాడుకలో ఉంది. రేనాటి చోళుల కాలంలో శాసనస్థమైన తెలుగు భాష చాళుక్యుల కాలంలో గ్రంథరూపం ధరించింది. రాజరాజనరేంద్రుడు, నన్నయ భట్టారకుని చేత మహాభారతాన్ని తెనుగించడానికి ముందే చోడవంశపు రాజైన నన్నెచోడుడు కుమార సంభవము అనే గ్రంథాన్ని రచించాడు. మనకు తెలిసినంతవరకు మొదట ఆంధ్రసాహిత్య రంగంలో మార్గదేశి కవిత్వ విభాగాన్ని తెచ్చి సాహిత్యపరంగా సమన్వయ పరచినది నన్నెచోడుడు. భారత రచనలో తనకు నారాయణభట్టు సహకరించినట్టు నన్నయ చెప్పుకున్నాడు.

విశ్వకర్మకులంవారికి సంఘంలో గొప్పస్థానముండేది. రాగిరేకులపై శాసనాలు చెక్కడం వీరిపని. శాసన లేఖకులుగా విశ్వకర్మ కులస్థులను నియమించేవారు. తెలుగు వారి పెళ్ళిళ్ళు నాలుగు రోజులు జరిగేవి. స్త్రీ మెట్టెలు ధరించేవారు. మేనమరిదిని పెళ్ళి చేసుకునే ఆచారం ఆనాడు ఉన్నది. రాజులు శాసనాలపై శివలింగాన్ని, చంద్రుని గుర్తును వేసేవారు. వీరి నాణెములపై వరాహ చిహ్నములున్నవి. దాని అర్థం రాజులు వైష్ణవులని కాదు. చాళుక్య రాజులు శైవ మతస్థులు.

రాజు బాలుడుగ ఉన్నప్పుడు అతని తల్లి రాజ్యభారం వహించడం ఆనాటి సంప్రదాయం. రాజుల స్నానగృహాలు స్ఫటిక వేదికలు, కచకుట్టాలు, చిత్ర విచిత్ర చిత్రములతో మెరిసే స్తంభాలతో శోభిల్లుతుండేవి.

ఎల్లోరా శిల్పం- రాష్ట్రకూటులు:

ఎల్లోరాలోని హైందవ శిల్పం ప్రారంభించిన రాజు రాష్ట్రకూటుడైన కృష్ణుడు. వెనుకట హైదరాబాద్ రాష్ట్రంలో మాల్‌ఖేడ్ అని పిలువబడే మాన్యకేతనం ప్రాంతాలను పరిపాలించిన రాజులు రాష్ట్రకూటులు. మొదట వీరు శాలివాహనులకు సామంతులు. తరువాత పశ్చిమ చాళుక్యులకు సామంతులైనారు. క్రీ.శ. 780 సమీపంలో పశ్చిమ చాళుక్యులు బలహీనపడిన రోజులలో దంతిదుర్గ రాష్ట్రకూటుడు తన సేనతో వాతాపినగరం ముట్టడించి స్వాధీనపరచుకుని విజృంభించాడు. దంతిదుర్గుని తరువాత అతని పినతండ్రి కృష్ణరాజు రాజైనాడు. ఈ కృష్ణరాజుకు కుష్టురోగం వచ్చింది. అందుకు ఎన్ని మందులు తిన్నా తగ్గలేదు కదా ఎక్కువవుతూ వచ్చింది. ఎల్లోరా కొండలవద్దనున్న ఒక నూతిలోని జలం స్వీకరిస్తే రోగం సంపూర్ణంగా నెమ్మదవు తుందని ఎవరో చెప్పగా, రాజు అలాగే చేశాడు. రోగం నిశ్శేషంగా తగ్గింది. శైవుడైన ఆ రాజు కైలాసమూర్తి పరమ కరుణకు తనకు సంపూర్ణారోగ్యం చేకూరిందని తన భక్తిని లోక సమ్మోహనమైన శిల్పరూపంగా నిర్మించి ఈశ్వరునికి అంకితమివ్వడానికి సంకల్పించాడు.

అజంతా, మహాబలిపురం శిల్పుల వంశీకులైన ఆంధ్రశిల్పులను కృష్ణరాజు రప్పించి కైలాసపర్వత సౌందర్యానికి ఏ మాత్రం తీసిపోని శిల్ప కల్యాణ నిర్మాణం సంకల్పించాడు. ఇక కొండ పక్క భాగమంతా తొలచి ఆ రాతితో ఒక గుడిని నిర్మించారు. ఇప్పటికీ ఆ గుడి జీవించి ఉన్న రాయియే. ఆ గుడికున్న అందం ప్రపంచంలో ఏ గుడికి లేదని రసజ్ఞుల భావన. సింహాలమీద, శరభాలమీద నిలబడి ఉండేటట్లు గుడి, గుడిచుట్టు మందిరాలు, గోడలు, మండపాలు, ధ్వజస్తంభాలు అంతా జీవించి ఉన్న రాయి, విడిగా చెక్కిన శిల్పం ఒక్కటి కూడా తీసుకు వచ్చి అక్కడ అతికించలేదు. త్రివేణి మూర్తులైన గంగా, యమున, సరస్వతులు, పార్వతీ పరమేశ్వరులు అధిష్ఠించి ఉన్న కైలాసాన్ని ఎత్తటానికి సంకల్పించిన రావణుడు- హిరణ్యకశిపుని మదమణచటానికి అతనితో కుస్తీ పడుతున్న సింహమూర్తి- మండపం మందిరంలోను, ఆవరణ కుడ్యముల మీదను చెక్కి ఉన్న శివలీలలు భారతీయ శిల్ప సంపదకు శిరోమణిలా ఉన్నవి. భంగిమ కల్పన, ముఖ భావ విలాసము, మూర్తి

సౌందర్యము, మూర్తికి మూర్తికి ఉండే సంబంధంలోని శ్రుతి, ఆంధ్రశిల్ప సార్వభౌమత్వాన్ని వేనోళ్ళ చాటుతున్నాయి.

కులవ్యవస్థ వేళ్ళూనుకుపోయిన మతాంతర వివాహాలు ఆచరణలో ఉన్నాయి. వాకటక వంశ బ్రాహ్మణరాజైన రుద్రసేనుడు ప్రభావతిగుప్త అనే వైశ్య కన్యను పెళ్ళిచేసుకున్నాడు. కులాంతర వివాహాలలోనూ హూణులు మొదలైన విదేశీయులు హిందూ మతం స్వీకరించగలిగారు. చాళుక్యుల పరిపాలనలో ప్రజలు సుఖజీవనులై ఉండేవారు.

దక్షిణభారత చరిత్రలో చాళుక్యుల పరిపాలనా కాలం ద్రావిడ భాషల పరిపూర్ణ వికాసం పొందిన కాలం. అందులో తూర్పుచాళుక్య రాజులున్న కాలం చాలా ముఖ్యమైనది. ఈ వంశీయులలో ప్రముఖుడు రాజరాజనరేంద్రుడు. ఆ కాలంలోనే నన్నయ భట్టారకుడు మహాభారతాన్ని తెలుగులో రచించాడు. మహాభారత గ్రంథం భారతీయ ధర్మాన్ని ప్రవచిస్తోంది. అది ఇచ్చే సందేశం మహోన్నతం, పరిపూర్ణం. హైందవ సంస్కృతికి భారత గ్రంథం దర్పణం. ఆంధ్రుల మత, సంస్కృతులు వానివలన పరిపూర్ణమైనాయి.

తెలుగు భాషకు ప్రప్రథమంగా అధికార భాషా ప్రపత్తిని కల్పించి దాని అభివృద్ధికి దోహదం చేసిన ఘనత కీ.శ. 625 నుండి 1070 వరకు సుమారు నాలుగు శతాబ్దాలకు పైగా తెలుగుదేశాన్ని పాలించిన తూర్పు చాళుక్య వంశానికి చెందిన రాజులకు దక్కుతుంది. 'కుమార సంభవ' కృతికర్త నన్నెచోడకవి తెలుగు దేశంలో తెలుగు భాషకు పట్టము కట్టినందుకు చాళుక్యులను ప్రశంసించాడు.

తెలుగు రాజభాష ప్రతిపత్తిని పొందినట్లు తెలియపరచే తెలుగు శాసనాలు తెలంగాణాలో కూడా మనకు కనిపిస్తాయి. మొదట చాళుక్య భీముని కొరవి శాసనం (కీ.శ. 892–921) ఆసక్తి జనకంగా ఉంటుంది. ఇందులో చక్కటి వచనం ఉంది. కొరవి మానుకోట ప్రాంతంలో వున్నది. ❑

5. కాకతీయులు

అఖిలాంధ్రదేశాన్ని పాలించిన చక్రవర్తులు శాతవాహనుల తరువాత కాకతీయులే. కాకతీపురాధినాయకుడుగా పేర్కొనబడిన మొదటి బేతరాజు, నతవాడు సీమ (మధుర), కొరివిసీమ (డోర్నకల్) మండలాధిపతి. ఇతని పరిపాలన క్రీ.శ. 1000 నుండి 1050 వరకు సాగింది. కాకతీయులు మొదట తూర్పు చాళుక్యులకు, పిమ్మట పశ్చిమ చాళుక్యులకు సామంతులు. ఇతని కుమారుడే మొదటి ప్రోలరాజు. పశ్చిమ చాళుక్య ప్రభువు సోమేశ్వరుని వద్ద హనుమకొండ విభాగం పొందినట్లు ఖాజీపేట శాసనం తెలుపుతున్నది. ఇతడు క్రీ.శ. 1050 నుండి 1080 వరకు పరిపాలన సాగించాడు.

క్రీ.శ. 1080లో రాజ్యానికొచ్చిన రెండవ బేతరాజు పరాక్రమవంతుడు. త్రిభువనమల్ల బిరుదాంకితుడు. ఇతని కుమారుడే రెండవ ప్రోలరాజు. పశ్చిమ చాళుక్యరాజు విక్రమాదిత్యుని మరణానంతరం ఇతడు స్వతంత్రుడై కాకతీయ సామ్రాజ్యాన్ని స్థాపించాడు. క్రీ.శ. 1115 నుంచి 1158 వరకు ఇతడు రాజ్యం చేశాడు.

రుద్రదేవరాజు (1158 – 1195):

రెండవ ప్రోలరాజు తరువాత రుద్రదేవ మహారాజు పాలన ప్రారంభమైంది. ఇతడు ఓరుగల్లు కోటను శత్రుదుర్భేధ్యంగా నిర్మించాడు. పశ్చిమచాళుక్య రాజ్యం అస్తమించగానే వారి సామంతులు స్వతంత్రులై పరస్పర మాత్సర్యంతో పెనుగులాడు కుంటూ కాలం గడిపారు. ఈ అవకాశం వినియోగించుకుని రుద్రదేవ మహారాజు అనేక చిన్నచిన్న రాజ్యాలను తన ఏలుబడిలోకి తెచ్చుకున్నాడు. దొమ్మెరాజు, మేడరాజు, మెలగదేవుడు, భీముడు, చేడోదయుడు ఇంకా అనేకమంది రాజులను జయించాడు.

రుద్రదేవరాజు సంస్కృత భాషాభిమాని. సంస్కృతంలో నీతిసారమనే గ్రంథాన్ని రచించి విద్యాభూషణ బిరుదు పొందాడు. దేవగిరి రాజు ఇతనితో యుద్ధం చేశాడు. అతని కుమారుడు మహాదేవరాజు 1195 నుండి 1199 వరకు రాజ్యం చేశాడు.

గణపతిదేవ చక్రవర్తి (1199-1261):

కాకతీయ రాజులలో గణపతిదేవుడు సుప్రసిద్ధుడు. ఇతడు యువరాజుగా ఉన్న రోజులలో యాదవరాజు చెరసాలలో పదిసంవత్సరాల కాలం గడపవలసి వచ్చింది. అందువలన ఇతని పరిపాలన 1208 నుంచి ప్రారంభమైందని చెప్పాలి. రాజులేని కాలంలో ప్రభుభక్తి పరాయణుడైన రేచర్ల రుద్రసేనాని, కాకతీయ సామ్రాజ్యాన్ని సురక్షితంగా కాపాడి తన ఏలికకు అప్పగించాడు. గణపతిదేవ చక్రవర్తి కాలంలో కాకతీయ సామ్రాజ్యం ఉత్తర గోండ్వానా (మధ్యప్రదేశ్) నుండి దక్షిణాన కాంచీవరకు, తూర్పు బంగాళాఖాతం నుంచి పశ్చిమాన బీదరు వరకు విస్తరించింది. నెల్లూరు సీమను పాలించిన మనుమసిద్ధి కోల్పోయిన తన రాజ్యాన్ని ఇతడి సహాయంతోనే తిరిగి సంపాదించుకోగలిగాడు. గణపతిదేవ చక్రవర్తి ఓరుగల్లు పట్టణాన్ని అభివృద్ధి పరచి దాన్ని తన రాజధానిగా చేసుకున్నాడు. అంతవరకు వారి రాజధాని హనుమకొండ.

కాకతీయులు నాల్గవ వర్ణానికి చెందిన కర్షకులు, రెడ్డి, వెలమ, కమ్మ, బ్రాహ్మణ కులాలతో వివాహ సంబంధ బాంధవ్యాలు పెట్టుకున్నారు. తద్వారా వీరికి దేశమంతటా సంపన్నులగు భాగస్వాములు బంధువులయ్యారు. ఆంధ్రదేశాన్ని జయించడంతోపాటు 'సాంఘిక, సాంస్కృతిక రంగాలలో కూడా ఆంధ్రైక్యతకెంతో సహాయపడ్డారు.

నెల్లూరు జన్మస్థలమైన తిక్కన సోమయాజి ఓరుగల్లు వెళ్ళి కాకతీయ గణపతిదేవుని ఆస్థానంలోనే తన మహాభారత రచన పూర్తి చేశాడు. తెలంగాణా-ఆంధ్రప్రాంతాలను సాంస్కృతికంగా ఐక్యపరచిన సాహిత్య కృషికి తిక్కనను మూల పురుషుడని చెప్పవచ్చు.

రుద్రమదేవి (1262-1296):

గణపతిదేవునికి పుత్రసంతానం లేనందున కుమార్తె రుద్రమదేవి కాకతీయ సామ్రాజ్యపురాణి అయింది. ఇటలీ దేశస్థుడు మార్కోపోలో ఆ కాలంలో ఆంధ్రదేశ పర్యటన చేసి రుద్రమదేవి ప్రజానురంజకంగా పరిపాలించినట్లు పేర్కొన్నాడు. ఆ రోజులలో ఆంధ్రదేశం వజ్రాలు, సన్నని నూలుబట్టలకు ప్రసిద్ధి. రాణిరుద్రమదేవి పురుషవేషం ధరించి గుఱ్ఱంపైన, ఏనుగుపైన ప్రయాణం చేసి యుద్ధరంగంలో ప్రవేశించేది. ప్రజలామెను రుద్రమదేవి మహారాజుగా పిలిచేవారు. అబల పరిపాలన అసమర్థంగా ఉంటుందని తప్పుడు అంచనా వేసుకొని యాదవరాజు ఓరుగల్లుపై దండెత్తిరాగా ఆమె మహాపరాక్రమంతో ఆ రాజుని తిప్పికొట్టింది. రుద్రమదేవికి ముమ్మడమ్మి, రాయనమ్మి అనే ఇద్దరు కుమార్తెలు. ముమ్మడమ్మి కుమారుడే రెండవ ప్రతాపరుద్రదేవుడు.

ప్రతాపరుద్రదేవుడు (1296-1323):

రుద్రమదేవి అనంతరం ఆమె దౌహిత్రుడు ప్రతాపరుద్ర చక్రవర్తి 1296లో రాజ్యానికొచ్చాడు. ఇతడు వీరుడు. విద్వత్కవి పోషకుడు. ఇతడి కాలంలోనే కాకతీయ సామ్రాజ్యం పతనం చెందడం విధి వైపరీత్యం.

క్రీ.శ. 1294లో అల్లా ఉద్దీన్ ఖిల్జీ దక్షిణాపథంపై దండయాత్ర జరిపినప్పుడు దక్కనులో ఈ నాలుగు ప్రధాన రాజ్యాలున్నాయి:-

1) మహారాష్ట్రను యాదవరాజులు పరిపాలిస్తున్నారు. వారి రాజధాని దేవగిరి. రామచంద్ర దేవుడు పాలకుడు.

2) ఆంధ్రదేశం కాకతీయుల పరిపాలనలో ఉంది. వరంగల్‌లో గణపతిదేవుడు పరిపాలిస్తున్నాడు.

3) కర్నాటకను హోయసలరాజులు పరిపాలిస్తున్నారు. ద్వారవతీపురం దీని రాజధాని. రాజు వీరభల్లాలుడు.

4) మధిరను పాండ్యరాజు కులశేఖరుడు పాలిస్తున్నాడు.

1294లో ఢిల్లీని జలాలుద్దీన్ ఖిల్జీ పాలిస్తున్నాడు. అల్లాఉద్దీన్ ఖిల్జీ ఇతడి సోదరుని కుమారుడు. యువరాజుగా ఉన్నప్పుడే అల్లాఉద్దీన్‌కు దక్షిణాది రాజుల

సిరిసంపదలపై కన్నుపడింది. 18వేల అశ్వక దళంతో దక్షిణ దిగ్విజయ యాత్రకు బయలుదేరాడు. విజయం తథ్యంగా అతనికి కనిపించలేదు. ఆ సమయంలో కుతంత్రం ప్రయోగించాడు. తనకు పినతండ్రితో విభేదాలు కలిగాయని, తన రక్షణకోసం దక్షిణాదికి వస్తున్నట్లు ప్రచారాలు చేశాడు. అతడు దేవగిరి చేరుకునే వరకు మధ్య ఎక్కడ ప్రతిఘటన ఎదురు కాలేదు. అల్లాఉద్దీన్ దేవగిరి కోటగోడలు కొల్లకొడుతున్నప్పుడు రామచంద్రదేవుడు మేల్కొన్నాడు. అప్పటికే రామచంద్రదేవుని సైన్యంలో అధికభాగం తన కొడుకు శంకరదేవుని నాయకత్వంలో మరోచోట పోరాటానికి వెళ్ళింది. విధిలేని పక్షంలో రామచంద్రదేవుడు సంధి చేసుకోవలసి వచ్చింది. 600 మణుగుల బంగారం, 7 మణుగుల మంచి ముత్యాలు, రెండు మణుగుల వజ్రాలు, 100 మణుగుల వెండి, లెక్కలేనన్ని గుఱ్ఱాలు, పట్టుబట్టలు, ఏనుగులు ఇచ్చి రామచంద్ర దేవుడు అల్లాఉద్దీన్‌తో సంధిచేసుకోవలసి వచ్చింది. తన పినతండ్రి జలాలుద్దీన్ ఖిల్జీని వధించి, అల్లాఉద్దీన్ ఢిల్లీ సింహాసనాన్ని 1307లో ఆక్రమించుకున్నాడని ఫిరిష రాశాడు.

దక్కను మీద మలిక్కాఫర్ దాడికి రెండు కారణాలున్నాయి. ఓడిపోయిన గుజరాత్ రాజు కర్ణదేవునికి దేవగిరిలో రక్షణ లభించడం. అతని కూతురు దేవల్ దేవిని వశపరచుకోవాలన్న సంకల్పం. గుజరాత్ యుద్ధంలో ఓడిపోయిన కర్ణదేవుడు తన కూతురు దేవల్ దేవిని వెంటబెట్టుకుని తలదాచుకోవడానికి దేవగిరికి వస్తున్న సమయంలో మార్గమధ్యంలో గుజరాత్ గవర్నర్ ఆసిఫ్‌ఖాన్ చేతుల్లో ఆమె పడింది. ఆసఫ్‌ఖాన్ ఆమెను బంధించి ఢిల్లీకి పంపించి వేశాడు. అక్కడ ఆమె వివాహం అల్లాఉద్దీన్ ఖిల్జీ కుమారుడు ఖిజర్‌ఖాన్‌తో జరిగింది. మాల్వాను దాటుకుంటూ మలిక్కాఫర్ దేవగిరిని ముట్టడించాడు. దేవగిరి పట్టణాన్ని సర్వనాశనంచేసి దొరికిందల్లా దోచుకున్నాడు. ఇది మొదలు దేవగిరి ఢిల్లీ సుల్తానుల సామంతరాజ్యమైంది.

20 జనవరి 1310లో మలిక్కాఫర్ ఢిల్లీ సుల్తాను తరఫున హనుమకొండను ముట్టడి చేసి ఆక్రమించుకున్నాడు. 24 రోజుల యుద్ధానంతరం ఓరుగల్లు స్థల దుర్గాన్ని 12 ఫిబ్రవరి 1310న ముట్టడి చేసి ఆక్రమించాడు. అయితే ఆ యుద్ధంలో ఓటమి చవిచూసిన ప్రతాపరుద్రుడు అపార ధనరాసుల్ని, ఏనుగుల్ని, గుఱ్ఱాలను బహూకరించి సంధి చేసుకున్నాడు. ఈ యుద్ధానంతరం అతని కొందరు సామంతులు, నెల్లూరు

ప్రాంతపు సామంతుడు రంగనాథుడనే తెలుగు చోళుడు స్వాతంత్ర్యాన్ని ప్రకటించుకున్నారు. కీ.శ. 1316లో ఢిల్లీ సుల్తాన్ మరణించడంతో ప్రతాపరుద్రుడు స్వాతంత్ర్య బావుటా ఎగురవేశాడు. సంధి ఒప్పందం ప్రకారం చెల్లించ వలసిన కప్పాన్ని ప్రతాపరుద్రుడు చెల్లించలేదు.

అల్లాఉద్దీన్ మరణానంతరం ముబారఖ్‌షా రాజ్యానికొచ్చాడు. క్రీ.శ. 1318లో తిరిగి దక్కను ఆక్రమించుకోడానికి ఖుస్రూఖాన్ నాయకత్వంలో సైన్యాలను పంపించాడు. ఈ యుద్ధంలో ఎంతోమంది హిందువులు మరణించారు. ప్రతాపరుద్రుడి సైన్యాధ్యక్షుడు ఈ యుద్ధంలో మరణించాడు. తిరిగి ప్రతాపరుద్రుడు ఖుస్రూఖాన్‌తో సంధి చేసుకొని, పన్నెండువేల గుర్రాలను, 1000 ఏనుగులను, అనేక వజ్ర వైడూర్యాలను ధనరాసుల్ని సమర్పించుకున్నాడు. ప్రతిసంవత్సరం కప్పం చెల్లించడానికి అంగీకరించాడు. ఈ యుద్ధంలో మొదట సింగమనేడు ప్రతాపరుద్రుని తరఫున పాల్గొన్నాడు.

ఘయాసుద్దీన్ తుగ్లక్ క్రీ.శ. 1320లో ఢిల్లీ చక్రవర్తిగా ప్రకటించుకొని తిరిగి తన కుమారుడు ఉలుగ్‌ఖాన్‌ని సైన్యంతో తెలంగాణాపై యుద్ధానికి పంపించాడు. ప్రతాపరుద్రుడు సమర్థవంతంగా ఎదుర్కొన్నప్పటికీ వెనుదిరిగినట్లే తిరిగి మరల ఓరుగల్లుపై పదే పదే యుద్ధం ప్రకటించడంతో, ప్రతాపరుద్రుని సైన్యంలోని దండనాయకులకు, సమన్వయం లోపించడంతో 1323లో జరిగిన యుద్ధంలో ప్రతాపరుద్రుడు బందీగా తురుష్క సైన్యాలకు చిక్కాడు. అతడిని ఢిల్లీకి తీసుకు వెడుతుండగా మార్గమధ్యలో నర్మదా నదిలో దూకి ఆత్మహత్య చేసుకున్నాడు.

హిందూరాజుల అనైక్యత:

ఢిల్లీ సుల్తానుల విజయ పరంపరలకు హిందూ రాజుల మధ్య నెలకొన్న అనైక్యత ప్రధాన కారణం. 1296లో అల్లాఉద్దీన్ ఖిల్జీ దేవగిరిపై మొదటిసారి దండెత్తినప్పుడు ఆ ప్రాంతపు రాజు రామచంద్రదేవుని కుమారుడు దక్షిణాదిన మరోచోట యుద్ధంలో నిమగ్నుడై ఉన్నాడు. పాండ్యరాజు మీద మలిక్కాఫర్ దాడిచేసినప్పుడు పాండ్యరాజు సోదరులైన సుందరపాండ్యుడు, వీరపాండ్యుడు సోదర మాత్సర్యంలో పడిపోయి ఒకరి ఓటమికొకరు పన్నాగాలలో పడిపోయారు. ప్రతాపరుద్రదేవుని మీద మలిక్కాఫర్ దాడి సల్పినప్పుడు ఢిల్లీ సేనకు మార్గదర్శిగా నిలిచినవాడు దేవగిరి

రాజు రామచంద్రదేవుడు. ఖిల్జీలు అశ్వికసేనను బాగా వృద్ధి పరిచారు. హిందువుల వద్ద అశ్విక సేన ఉన్నా వారు ఎక్కువగా ఆధారపడింది కాల్బలము మీదనే. హిందూరాజులు సామ్రాజ్యాలు స్థాపించుకున్నవారి చావుబ్రతుకులలో సామంతరాజుల సహాయం లభించలేదు. ప్రతాపరుద్రుడు యుద్ధరంగంలో రెడ్డియోధుల సహాయం పూర్తిగా పొందలేకపోయాడు. గణపతిదేవుని కాలం నుంచి వీరు పద్మనాయకులమీద ఎక్కువ విశ్వాసం ఉంచేవారు. మతావేశంతో ముస్లింలు పోరాడేవారు. గెలిచిన చోటల్లా మత వ్యాప్తి చేస్తామని సైనికులలో ఆశలు కలిపించేవారు. ఈ విధంగా మతోద్రేకంతో ముస్లింలు పోరాడేవారు. హిందువులు పరాక్రమ శూన్యులేమీ కారు. అనైక్యత వారికి శాపంగా పరిణమించి అది శత్రువు విజయానికి కారణమైంది.

మతము- వీరశైవం:

తెలంగాణా ప్రాంతంలో, ప్రజానీకంలో బౌద్ధం తరువాత ప్రబలిన మతం శైవం. నిజానికి శైవమే తెనుగుమతం అనాలి. తెనుగు అనే శబ్దమే త్రిలింగంలోంచి వచ్చిన దనడానికి మూలాధారం శైవమే. శ్రీశైలం, కాళేశ్వరం, ద్రాక్షారామం అనే త్రిలింగ క్షేత్రంతో కూడిన దేశమే త్రిలింగ దేశం అన్నారు. ఆ దేశ భాష త్రిలింగ భాష. త్రిలింగ తెలుగు అయినది. తెలుంగు, తెలుగు, తెనుగు అయినది.

శైవం భక్తి ప్రధానమైన మతం. సామాన్య జనులకోసం పుట్టినది. వీరశైవ సంస్థాపకుడు బసవేశ్వరుడు. ఈయన జన్మభూమి కర్నాటకదేశం. కుల తత్వాలతో కుళ్ళిపోయిన వేదమతాన్ని తోసిరాజని, జాతి, కుల, మత వివక్షతలేని సంఘం సృష్టించదలచుకున్నాడు. ఈ నిశ్చయ ఫలితమే వీరశైవం. సంగీతాన్ని, సాహిత్యానికి సంధించి, తన సందేశం దేశీయ భాషలో ప్రజలలో ప్రచారం చేసి రాజాశ్రయంతో దానికి బలం చేకూర్చినాడు.

కాకతీయ సామ్రాజ్యంలో కూడా శివమతానికే ప్రాబల్యం ఉండేది. బౌద్ధం, జైనం, వేదమతం కూడా ఉండేది. ఆంధ్రదేశంలో వేదమతం మాత్రం ఎప్పుడూ సర్వనాశనం కాలేదు. అణిగి మణిగి వుండి మళ్ళీ ప్రచారంలోకి వస్తూ ఉండేది. మతానికి, సాహిత్యానికి మాత్రం. ఎప్పుడూ సన్నిహిత సంబంధం ఉండేది. ఎప్పుడూ మతానికి సాహిత్యం ఉపకరించేది. శైవం వెర్రితలలు వేసే కాలంలో తిక్కన

అవతరించి, అద్వైత మతం పునరుద్ధరించాడు. యజ్ఞం చేసి సోమయాజిననిపించుకుని, మార్గదేశీ కవితా సంప్రదాయాలు సంధించి, దేశీయ కవితకి ప్రాముఖ్యం ఇచ్చి భారతాంధ్రీకరణ చాలా వరకు సాగించి ధన్యుడైనాడు. 'ఇదం బ్రాహ్మం, ఇదం క్షాత్రం' అనే విశ్వామిత్ర ప్రతిభ తిక్కనలో కూడా ఉండేది.

కాకతీయులకాలంలో వీరశైవం ఆంధ్రదేశాన్ని మహాప్రభంజనంలా ఊపివేసింది. ఇది కులవ్యవస్థపై ఒక తిరుగుబాటు. దానితోపాటు విపరీతమైన శైవభక్తి, అసహనం, మత విద్వేషం కలిసి ఉన్నాయి. ఈ మత విద్వేషానికిగురై నశించిన వారు జైనులు.

బసవేశ్వరుని నిర్యాణంతో విజృంభించిన వీరశైవం గణపతిదేవుని రాజధాని లోనూ, ఆయన దండయాత్రల దాడులలోనూ ప్రళయ నృత్యం చేసింది. శైవ ఖడ్గం కాకతీయుల నాడు జైన తీర్థంకర విగ్రహాల రాతితలలనే నరికివేసింది. కొలనుపాకలో, వేములవాడలో, శివగంగలో, పెనుగొండలో, ఓరుగల్లులో ఈ తలలు నేటికీ కనబడతాయి. తిక్కన మహాకవితో వాదించి జైనగురువులు ఓడిపోయిన తరువాత వారి ఆలయాలను గణపతిదేవుడు కూలదోయించాడు. ఉప్పుగుండూరు జైనాలయాలు కూలిపోయాయి. విగ్రహాలు విరిగిపోయాయి.

వీరశైవ గురువులు రాజులను వశపరచుకున్నారు. వారికి శైవదీక్ష ఇచ్చారు. గురువులై, మంత్రులై, దండనాయకులై వారి సహాయ సహకార సానుభూతులతో తమ మతాన్ని బాగా వ్యాప్తిలోకి తెచ్చుకున్నారు.

వీరశైవ మతానికి చిహ్నం లింగధారణ. వారి మత ప్రచారకులు జంగములు. సాక్షాత్ శివ స్వరూపులు. వారిలోని దోషాలను ప్రజలెన్నరు, భక్తి సకల పాపాలను పారదోలి ముక్తినిస్తుంది. ఇంతటి వీరత్వాన్ని చూపించిన వీరశైవం మాంసాహారాన్ని నిషేధించింది. వీరశైవులు ఆత్మార్పణం చేసుకోవడానికి కూడా సిద్ధమే. కంఠాన్ని కూడా సమర్పించుకున్న వీరుడే నిజమైన శివభక్తుడు. శైవులలో లింగాయత్‌లు, బలిజలు, జంగములు అనే శాఖలేర్పడ్డాయి.

కాకతీయరాజులు మొదట జైనులు, పిమ్మట శైవులు. క్రమంగా శైవవైష్ణవ సామరస్య ప్రబోధమైన మహాభారతాన్ని పోషించే దశకు చేరుకున్నారు. మతోన్మాదంతో

లభించిన వీరావేశం ప్రజలలో చైతన్యం కలిగించినప్పటికీ రెండువందల యేండ్ల కన్న ఎక్కువ కాలం ఈ మతం నిలువలేకపోయింది. అన్యమత సహనం లేక, శైవేతరులను దండించి హింసించి చిత్రవధలు చేసి అన్యమత గ్రంథాలను తగుల బెట్టి, అన్యమతస్థులతో వాదించి చివరకు విద్వేషపూరిత ఉద్యమాలు చాలా కాలం నిలవవని వీరశైవం నిరూపించింది. ఈ మతానికి చిహ్నంగా బ్రాహ్మణులలో ఆరాధ్యులు, బ్రాహ్మణేతరులతో జంగములు మిగిలి ఉన్నారు.

'వసుధలోని జనులనందరిని నేలపాలు జేసి' శైవమత స్థాపన జరిగింది. శైవులకు అన్యమతస్థులను నిందించడం నిత్యకృత్యం. బ్రాహ్మణులను కర్మ ఛండాలురని ఎత్తిపొడిచారు. వ్రత భ్రష్టులని నిందించారు. బాపన కూళులని ఏవగించారు. శైవమతం పేర కొల్లలుగా హత్యలు జరిగినవి. తామే ఈ హత్యలు చేసినట్లు జబ్బచరిచి చెప్పుకున్నారు వీరంగం చేస్తూ.

ఏకశిలానగరం మడిసంత, మైలసంత, వెళపాళెము, మేదరవాడ, మోహరివాడ, హాలికవాడ, రాజవీథి, వైశ్యవీథి- అని విభజించబడింది. విపణివీథులలో పుష్పలావికలు పుష్పాలను విక్రయించేవారు. పురవీథులలో కాంతలు సంపంగి నూనె అమ్మేవారు.

ఏకవీరాదేవి, కాకతమ్మ, పోలేరమ్మ మొదలైన దేవతలకు జాతరులు జరిపేవారు. బవవీలు, మాలెతలు, కాపుస్త్రీలు, జక్కులు, పురంధ్రులు, అక్కలు, మైలారు భటులు మొదలైనవారు చిందులు తొక్కుతూ, తప్పెటలు తాళాలు వాయిస్తూ పాడుతూ తమ భక్తిని వెల్లడించేవారు. పరవశంతో వారు చేసే నృత్యాలు, పాడే పాటలు ప్రేక్షకులకు సైతం వీరావేశం కలిగించేవి. పర్వదినాలలో మేషయుద్ధాలు, కోడి పందెములు జరిగేవి. ద్యూతము కూడా ప్రజా వినోదాలలో ముఖ్యమైనది.

ఆనాటి ప్రజలు పెక్కురు వేశ్యాలోలురు. ప్రజలు శకునాలనుపాటించేవారు. ఆనాటి పూటకూళ్ళ ఇళ్ళు ఈనాటి బోర్డింగ్, లాడ్జింగ్ హోటళ్ళకు ఏమాత్రం తీసిపోవు. వినుకొండ వల్లభరాయుని క్రీడాభిరామము 15వ శతాబ్దినాటి ఓరుగల్లు జీవిత విధానానికి దర్పణం పట్టే గ్రంథం.

మన ప్రాచీన కళారూపాల్లో అతిప్రాచీనమైనది యక్షగానం. జక్కులనేవారు,

ఈ యక్షగానాలను ప్రదర్శించడంవలన జక్కులవారి ప్రబంధానికి యక్షగానం అని పేరు వచ్చింది. దక్షిణ భారతదేశంలో ఈ యక్షగానాలు వర్ధిల్లాయని పాల్కురికి సోమనాథుడు ఉదాహరించాడు. యక్షగానాలు ఆంధ్రదేశంలో కాకతీయ సామ్రాజ్య కాలంలో బహు జనాదరణ పొందాయి. పాల్కురికి సోమనాథుడు పండితారాధ్య చరిత్రలో యక్షగాన విశేషం గురించి, ఆనాటి వేషధారణల గురించి వ్రాశాడు. ప్రతాపరుద్రుని ఉంపుడుకత్తె మాచల్దేవి గౌరవార్థం వినుకొండ వల్లభరాయుడు క్రీడాభిరామమనే యక్షగానాన్ని వ్రాశాడు (ఇది శ్రీనాథుడే రచించాడని ప్రతీతి).

వెలనాటి చోళుల కాలంలోనే బౌద్ధమతము క్షీణదశకు చేరుకున్నా క్రీ.శ. 12వ శతాబ్దం చివరివరకు బౌద్ధమతము ప్రకాశవంతంగానే ఉంది. ఒకప్పుడు తెలుగుదేశంలో ముమ్మరంగా వ్యాపించి, జనులకు నూతనోత్సాహాలు ఇచ్చి, ధర్మాభ్యున్నతికి కారణమైన, తెలుగుదేశంలో ఒక కొత్త వెలుగునిచ్చిన బౌద్ధసంప్రదాయం ఈ విధంగా క్రమంగా అంతరించిపోయింది.

శిల్పకళ:

జైన దేవాలయాలపై జరిగిన విధ్వంసంతో మైలారు వీరశిల్పం మొలిచింది. యుద్ధాలలో మరణించిన శైవులకు వీరగల్లులు వెలిశాయి. రుద్రాంబ, పుష్పగిరి మఠాలు, ఇతర శైవమఠాలను పోషించింది అక్కడి శిల్పులు. మైలారు గాథల్ని, పదాల్ని మట్టుకే కాక జైన సంహారాన్నికూడా చూపించారు.

స్తంభాలు పేర్చి నిలబెట్టి కట్టిన వేయిస్తంభాల గుళ్లను ప్రతాపరుద్రదేవుడు కొలనుపాకలో, మంథనిలో నిర్మించాడు. కాకతీయుల కాలంలో జరిగిన నిర్మాణాలలో వేయిస్తంభాల గుడి, పాలంపేట, గణపవరము, పిల్లలమర్రి, నాగాలపాడు, అన్నారం, అన్నపురెడ్డిపల్లిని పేర్కొనవచ్చు.

సంప్రదాయానికి విరుద్ధమైన శిల్పాలను రూపొందించారు కాకతీయులు. శిల్పంలో సరస్వతి, బ్రహ్మ, శివుడు, ఇంద్రుడు తమ వాహనాల మీద నర్తిస్తున్నారు. కాకతి రాజ్యంలోని సరదా అంతా చిన్నరూపాలతో రాయిగట్టింది. పాలంపేట, రామప్ప దేవాయాలలో. గజాసుర సంహారం, ఉమా కల్యాణం, గజాముఖాసుర యుద్ధం, అమృత మథనం కల్పించారు. ఇది రాతిని అంటిపెట్టుకున్న శిల్పం కాదు. దూలాలకు

అంటించిన నిండు శిల్పం. ఇతివృత్తాలు కేవలం శైవము కాదు. జీవితోత్సాహాలు, సర్వమత సంప్రదాయాలు, సమకాలిక సుందర వాతావరణం రంగరించుకుపోయి ఆ కాలపు శిల్పాలు రూపొందాయి.

కాకతీయుల కాలంలో దేవాలయ నిర్మాణం విరివిగా కొనసాగి తెలుగువారి శిల్ప కళా విన్యాసం ఆ నల్లని కఠిన శిలలపై వెన్నెలలా ప్రవహించింది. కాకతీయులు దేవాలయాలు సాధారణంగా త్రికూట నిర్మాణాలు. ప్రధాన దేవాలయాల సరసనే మరో రెండు చిన్న దేవాలయాలుండటమనేది సాధారణ విషయం. ప్రధానాలయం శివుని కంకితం కాగా మిగిలినవి ఇతర దేవతలకు ఉద్దేశించినవి. కాకతీయ శిల్పాల్లో ఏ మూర్తి కూడా నిశ్చలంగా నిల్చుని ఉండదు. చివరకు చామరధారులు సైతం కదలిక సూచించే ఏదోఒక భంగిమలో చూపబడినారు. శిల్పానికిగాని, చిత్రానికిగాని విలువను తెచ్చేది ఇట్టి చైతన్యమే.

కాకతీయ శిల్పంలో ప్రధానంగా నాలుగు భాగాలు కనిపిస్తాయి. దేవతా రూపాలు, నర్తక, నర్తకీబృందాలు, సాధారణ రూపాలు. రూపాలతో సంబంధం లేకుండా విడిగా కనిపించే అలంకార శిల్పంలో ప్రధానమైనవి ఆరు రకాలు. మకరతోరణాలు, హంసలు, పద్మాలు, లతలు, ఏనుగులు, సింహాల శ్రేణులు. కాకతీయ హంసలన్నీ ఠీవిగా నిలబడి, వంపులు తిరిగి, అందమైన ఫించాలతో బారులుగా సాగిపోతాయి. కాకతీయ శిల్పులు ఏనుగులు, మకరందాలకే ప్రాముఖ్యత నిచ్చారు. కానీ, ఇతర దక్షిణాది దేవాలయాల్లోలా సింహాలను, అశ్వాలను చెక్కలేదు. పద్మం కాకతీయ శిల్పుల చేతిలో ఒక ప్రత్యేక వ్యక్తిత్వాన్ని రూపొందించుకున్నది. ఖాళీలున్నచోటల్లా ఈ శిల్పులు ఒక ప్రామాణిక రూపంలోనున్న పద్మాన్ని అసంఖ్యాకంగా సృష్టించి వదిలారు.

వరంగల్ జిల్లా పాలంపేటలోని రామప్పదేవాలయం అధిక శిల్పకళా సమన్వితమై ఒప్పుచున్నది. ఇది రుద్రేశ్వరుని ఆలయం. గణపతిదేవుని సేనానిగాను, మంత్రిగాను ఉన్న రేచర్ల రుద్రమదేవుడు క్రీ.శ. 1213లో ఈ దేవాలయాన్ని కట్టించాడు. దీనిలోని ప్రతి భాగము ఒక అపురూప శిల్ప కళాఖండం. కాకతీయుల నృత్య కళాభిమానానికిది పరాకాష్ఠ. ఈ నృత్య శిల్పాలని తీర్చిదిద్దడంలో జాయప సేనాని సహకరించి ఉండాలి. రామప్పగుడి, అందులోని నంది ఎంతటి దైవశిల్ప విలసితాలో చెప్పలేము. ఆ గుడిలోని నాగిని మూర్తుల సౌందర్య లావణ్యాలు, నాట్య

భంగిమల విలాసాలు దర్శనీయాలు.

నృత్య కళ:

గణపతిదేవుని కాలంలో జాయపసేనాని గజసైన్యాధ్యక్షుడు ఉండేవాడు. ఆయన రచించిన గ్రంథమే 'నృత్యరత్నావళి'. గణపతిదేవుని మంత్రి అయిన గుండామాత్యుడు నృత్యశాస్త్రవేత్త. గణపతిదేవుడు తన బావమరిది, అభిమాన పాత్రుడైన జాయపని గుండామాత్యునికి శిష్యుడుగా అప్పగించాడు. జాయప సుమారు పదేళ్ళపాటు గుండామాత్యునివద్ద శుశ్రూష చేశాడు. అటు పిమ్మట గణపతిదేవుని కోరిక ననుసరించి జాయపసేనాని క్రీ.శ. 1253-54లో 'నృత్యరత్నావళి' అనే ఉత్తమ నృత్యశాస్త్ర గ్రంథాన్ని రచించాడు. దీనిలో మార్గనృత్య సంప్రదాయమే గాక ఆ కాలంలో తెలుగు దేశంలో బహుళ ప్రచారంలో ఉన్న నృత్యపద్ధతులు పేరిణి, చర్చరి, దండరాసక, ఘటసరి, బహురూపము, బిందు, కోలాటము మొదలైన వెన్నో వర్ణించబడ్డాయి. తిక్కన సోమయాజి మూలములో లేకపోయినా బృహన్నలకు నేర్పినదంతయూ దేశీనృత్యమనే పేర్కొనబడుట గుర్తింపదగినది. అట్లే పాల్కురికి సోమనాథుడు కూడా దేశీనృత్య భేదములను పేర్కొన్నాడు. వీరిరువురు జాయపకు సన్నిహిత కాలంలోని వారే.

కాకతీయుల కాలంలో ముఖ్యంగా పశుపతి సంప్రదాయం మన చరిత్రలో ఎక్కువగా ప్రచారంలో ఉంది. శైవవీరులు దినంలో ఆరు పర్యాయాలు శివుని నృత్య గానాలతో ఆరాధించేవారు. శివలీలలకు శివతాండవమునకు సంబంధించిన అనేక నృత్యాలు వీరు చేసేవారు. 'శివప్రియము' వారి ప్రత్యేక నర్తనము. 'ఊర్ధ్వతాండవము' ను శివరాత్రినాడు లింగోద్భవ కాలంలో ప్రత్యేకంగా ప్రదర్శించేవారు. ఈ తీరున ఎన్నో విధాలైన శాస్త్రీయ నర్తనములు, శివ ఆరాధనలు ప్రదర్శించేవారు.

ఈ కాలంలో చిత్రకళ కూడా బాగా వృద్ధి చెందింది. గోడలకు చిత్తరువులు రాయించుకునేవారు. బట్టలమీద అద్దకాలతో బొమ్మలు వేయించుకునేవారు. ధనికులు పటాలు రాయించుకునేవారు. ఓరుగల్లులో చిత్తరువులు రాసేవారు సంఖ్య 1500 మంది ఉన్నట్లు పేర్కొనబడింది.

భాషాపోషణ:

ఆనాటి కవులు ఉదర పోషణ నిమిత్తం గ్రంథరచన చేయలేదు. నాటి కవులు మంత్రులు, రాజతంత్రజ్ఞులు. మనుమసిద్ధి తిక్కనను 'మామా' అని పిలిచేవాడు. వీరశైవం, వీరవైష్ణవం ఎంత విజృంభించినా నాటి కవులకు పరస్పరమాత్సర్యం లేదు. ఒకరినొకరు గౌరవించుకునేవారు. కళలు, సాహిత్యం, తెలుగు భాష వికాసం కాకతీయుల కాలంలో అభివృద్ధి చెందినంతగా మరే రాజుల కాలంలోనూ అభివృద్ధి చెందలేదు. తిక్కన నిర్వచనోత్తర రామాయణం రచించినదీ,మహాభారతంలోని 15 పర్వాలను తెనుగించినదీ వీరి హయాంలోనే. కాకతీయ ప్రతాపరుద్రుని కొలువులో ఆస్థాన కవిగా ఉన్న విద్యానాథుడు 'ప్రతాపరుద్ర యశోభూషణం' పేరిట అలంకారశాస్త్రం రచించి ఆంధ్రసాహిత్య సంపదని పరిపుష్టం చేశాడు.

మతప్రచారానికి తమ ధీశక్తినంతా ఉపయోగించిన ధైర్యవంతులు ఆనాటి కవులు. పాల్కురికి సోమనాథుడు రాసిన పండితారాధ్య చరిత్ర, బసవపురాణము, వృషాధిప శతకము శైవమత వ్యాప్తికి తోడ్పడ్డాయి. కవులు కష్టకాలములో రాజులని కాపాడగలిగారు. విద్యార్థులకు ఉచితభోజన సౌకర్యాలు ఉండేవి. నాటి గోళిక మఠాలన్ని విద్యాకేంద్రాలే.

కాకతీయుల రాజభాష సంస్కృతం. విద్యానాథుడు, గంగాధరుడు, నరసింహ కవి, అప్పయార్యుడు, వీరవల్లభ దేశికుడు, త్రిపురాంతకుడు, జాయపసేనాని నాటి ప్రఖ్యాత సంస్కృత కవులు.

దేశి కవిత 'జాను తెనుగు' ప్రావిర్భవించిన కాలమది. ద్విపద వాఙ్మయములో సుప్రసిద్ధమైనది రంగనాథ రామాయణము. పూర్వరామాయణాన్ని బుద్ధరాజు రచించగా, ఉత్తర రామాయణాన్ని విఠలదేవుడు, బుద్ధరాజు పుత్రులు రచించారు. తెలుగులో మొదటి లక్షణ గ్రంథం కేతన రచించిన ఆంధ్రభాషా భూషణమే. యథావాక్కుల అన్నమయ్య రచించిన సిద్ధేశ్వర శతకము లభించిన ఆంధ్రవాఙ్మయ శతకాలలో మొదటిది. మల్లికార్జున భట్టు, కుమార రుద్రుడు, అయ్యలార్యుడు, భాస్కరుడు, హుళక్కి భాస్కరుడు- ఈ అయిదుగురు కలిసి రచించినదే భాస్కర రామాయణము. భారత రామాయణాలే గాక పురాణ రచన జరిగిన కాలం కూడా

ఇదే. మారన మార్కండేయ పురాణం, మంచన కేయూర బాహు చరిత్ర రాశారు. శైవ మతంలో కాలాముఖి, కాపాలిక, శైవ, పాశుపతమనే ముఖ్యశాఖలుండగా పాశుపత శైవమే రాజమతమై ప్రజాహృదయాలను చూరగొన్నది. ఏకవీర, మహూరమ్మ, కాకతమ్మ, కామేశ్వరి సామాన్య ప్రజలను ఆకర్షించిన దేవతలు.

సూటిగా, తేటగా కవిత్వం చెప్పాలంటే జాను తెనుగుకు ధీటులేదని చాటినవాడు పాల్కురికి సోమనాథుడు. వీధి మానిసి మాట్లాడుకునే తెనుగును అపౌరుషేయాలైన వేదాల సరిబంతిలో నిలపడం పాల్కురికి గుండె ధైర్యానికి నిదర్శనం. పాల్కురికి సోమనాథునికి ముందు తెలుగులో వెలసిన గ్రంథాలు ప్రాయికంగా సంస్కృత మూలకాలు. ఇతని బసవపురాణము వీరశైవ మతోద్ధారకుడైన బసవేశ్వరుని జీవితాన్ని అభివర్ణించే గ్రంథం. ఇది ఏ సంస్కృత గ్రంథానికి అనువాదం కాదు.

నన్నయ్య, నన్నెచోడు లిద్దరూ ఆంధ్రసాహిత్య చరిత్రలో రెండు మార్గాలకు దారి తీసిన వారు. ఒకరిది పురాణ కవిత్వం, మరొకరిది వస్తుకవిత. ప్రబంధ కవితామార్గం. ఆంధ్ర సాహిత్యానికి ఆదిలోనే రెండు భిన్నమైన శాఖలకు అంకురార్పణ జరిగిందని చెప్పవచ్చు.

కాకతీయుల ఏ రంగాన్ని కదిలిస్తే ఆ రంగం కోటి ప్రభలతోణ ప్రకాశించింది. కాకతీయులు ఎంతో ప్రణాళికా బద్ధంగా నిర్మించిన లక్నవరం, గనపురం, పాకాల, రామప్ప చెరువుల నీటితో వరంగల్ జిల్లా ప్రజలు నేటికీ భూములను సాగుచేసు కుంటున్నారు. కాకతీయులు నిర్మించిన భారీ తటాకాలన్నీ దాదాపు అడవుల్లోనే నిర్మించారు. ఈనాటికి కూడా ఆదిమ గిరిజన జాతులు వీటి కింద నివసిస్తున్నాయంటే దాదాపు 700 సంవత్సరాల కింద ఎలా ఉండేవో ఊహించవచ్చు. కేవలం చెరువుల నిర్మాణమే కాకుండా ఆ చెరువుల కింద ఉన్న అడవులను నరికి సాగుచేయడమనేది చాలా వ్యయంతో కూడుకున్న పనే. ఇంత వ్యయానికి ఓర్చి వారు వీటిని నిర్మించడం విశేషం. ఇంకొక ఆసక్తికరమైన అంశమేమంటే ఈనాడు తెలంగాణా ప్రాంతంలో ప్రతి గ్రామంలో 2, 3 చెరువులు ఉండటం గమనిస్తాం. వీటిలో కొన్నైనా కాకతీయులకు ముందు ఆ తరువాత కూడా నిర్మించి ఉండవచ్చు.

కాకతీయుల కాలంలో మోటుపల్లి, మచిలీపట్నం ప్రసిద్ధరేవులు. అరేబియా, చీనా దేశాలనుండి సరుకులు వచ్చి ఆ ఓడరేవు లో దిగేవి. బొంగురము ఆట ఎడల

పిల్లలు ఆసక్తి చూపేవారు. తాయెత్తులను రక్షణగా కట్టుకునే ఆచారం ఆనాటికి ప్రబలమైనది. మార్కోపోలో వరంగల్ పారిశ్రామిక ప్రాముఖ్యాన్ని ఇలా కొనియాడాడు: "ఈ సామ్రాజ్యంలో అతి సున్నితమైన నూలు వస్త్రాలు తయారవుతున్నాయి. అవి పట్టులాగా, మెత్తగాను ఉంటాయి. ప్రపంచంలో ఏ రాజు రాణి అయినా వాటిని ధరించడానికి తహతహలాడుతారు".

కాకతీయులు తలపెట్టిన తెలుగుదేశ పునర్నిర్మాణం దీనికి అనుసరించిన రాజనీతి, ఎంతో ప్రశంసనీయమైనది. అడ్డు, అదుపు ఒక విధానంలేక అనేక విడి విడి భాగాలుగా ఉన్న చిన్న చిన్న రాజ్యాలన్నిటినీ సమీకృత పరచి వీటిని ఒక ఆంధ్రదేశంగా నిలిపి జాతిగౌరవాన్ని నిలబెట్టిన పరాక్రమవంతులు కాకతీయులు. క్రీ.శ. 1050 నుంచి 1350 వరకు తెలంగాణా కేంద్రంగా ఆంధ్రదేశాన్ని కాకతీయ రాజులు పరిపాలించారు. శాతవాహన యుగం తరువాత ఆంధ్రుల చరిత్రలో ఇది మరొక స్వర్ణయుగం. కాకతీయరాజులు అంతకు పూర్వం రాజుల వలె పరాయి ప్రాంతం నుంచి వచ్చినవాళ్ళు కారు. రాజ్యకాంక్షచే రాజ్యాలు స్థాపించిన వాళ్ళు కారు. ప్రజలలో పుట్టి, నిరంతర కలహాల ఫలితంగా ఆంధ్రప్రజలు అనుభవిస్తున్న బాధలను వీరు స్వయంగా చూశారు. ఉత్తర హిందూస్థానంలో అప్పటికే ముస్లింల దండయాత్ర ముంచుకు వస్తున్నది. ఈ ప్రమాదాన్నుంచి రక్షించుకోవాలంటే ఆంధ్రుల నందరినీ సుస్థిర ప్రభుత్వం కిందికి తీసుకురావడం అవసరమని గుర్తించారు.

ఉత్తర భారతదేశంలో రాజపుత్రుల మాదిరిగా దక్షిణాన తురుష్క సేనా వాహినుల నరికట్టి హైందవ స్వాతంత్ర్యం సంస్కృతులను రక్షించడానికి కాకతీయులు తమ సర్వస్వాన్ని ధారపోశారు. వారి దేశభక్తి, స్వాతంత్ర్య కాంక్ష, అనంతరం ఆంధ్రదేశాన్ని పాలించిన రెడ్డి, విజయనగరాధీశులకు ఆదర్శమై దక్షిణాపథంలో హైందవ సంస్కృతి రక్షణకు వారిచే కంకణం కట్టుకునేటట్లు చేసింది. అందుకే కాకతీయుల యుగం ఆంధ్రదేశ చరిత్రలో స్వర్ణయుగంగా కీర్తింపబడింది.

వరంగల్లునేలిన కాకతీయులు తెలుగు పతాకాన్ని ముందుకు తీసుకుపోయి దాన్ని రెడ్డి రాజులకు, విజయనగరాధీశులకు అందించారు. ❑

6. పద్మనాయకులు

క్రీ.శ. 1323లో కాకతీయుల ఓరుగంటి దుర్గం ముస్లిం సేనావాహిని ధాటికి కుప్పకూలిపోయింది. ఢిల్లీ పాలకులైన తుగ్లక్‌ల ఏలుబడిలోనికి వచ్చింది. వారి జైత్రయాత్ర తమిళనాడులోని మధురదాకా ఎదురులేకుండా సాగింది. ఆంధ్ర, తమిళనాడుల్లో మహమ్మదీయులు జయించిన ప్రాంతాన్నంతా కలిపి మలబార్ రాష్ట్రంగా ఏర్పరచి ఢిల్లీ సామ్రాజ్యంలో కలిపివేశారు. ఈ రాజ్యవిస్తరణ కార్యక్రమం ఘియాసుద్దీన్ తుగ్లక్ కుమారుడైన ఉలుఫ్‌ఖాన్ (తరువాత మహమ్మద్‌బిన్ తుగ్లక్) నేతృత్వంలో సాగింది. తెలుగుదేశం ముస్లిం ఏలుబడిలోకి రావడం ఇదే మొదటిసారి.

ఆ కాలంలో ముస్లిం సైన్యం విజయగర్వంతో సాగించిన దుష్కృత్యాలకు అంతులేదు. దేవాలయాలను పడగొట్టి వాటి స్థానంలో మసీదులను కట్టించారు. పండినపంటలన్నీ బలవంతంగా దోచుకుపోయేవారు. ఆ విధంగాసాగినవి వారి చేష్టలు.

ఆ సమయంలో ప్రాచీనరాజవంశస్థులు, కాకతీయ సేనలు, మహాసామంతులు, మాండలిక వంశస్థులు ముస్లిం పాలనకు వ్యతిరేకంగా పోరాడేందుకు ఒక్క తాటిమీదికి వచ్చారు. దుర్భరమైన ముస్లిం పరిపాలనలో కుంగుతున్న తెలుగుదేశాన్ని ఉద్ధరించ డానికి వేంగీవాసివీరుడైన ముసునూరి ప్రోలయ నాయకుడిని అధ్యక్షుడిగా ఎన్నుకున్నారు. 1325లో, ప్రాచీన భాతరదేశంలోని గణతంత్ర వ్యవస్థ ఆంధ్రదేశంలో తిరిగి అమల్లోకి రావడం విశేషం. ప్రోలయ నాయకుడి అధ్యక్షతన ముస్లిం పరిపాలకులకు వ్యతిరేకంగా ఆంధ్రదేశంలోని హిందూరాజులు ప్రవాస ప్రభుత్వం ఏర్పరచి, ఆ తరువాత స్వతంత్ర సామ్రాజ్యాన్ని ఏర్పరచారు. ఇది ఆంధ్రుల చరిత్రలో మరుపురాని ఘట్టం.

తీరాంధ్రం ప్రోలయనాయకుని స్వాధీనమైనది. ఆ సమయంలో వరంగల్‌ను స్వాధీనపరచుకున్నవాడు కాపయ నాయకుడు. ఇతడు ప్రోలయ నాయకుడి పినతండ్రి

కుమారుడు. ప్రోలయ నాయకుడికి సంతానం లేనందున అతడు మరణించగానే తీరాంధ్ర దేశానికి కూడా కాపయ నాయకుడే ప్రభువయ్యాడు.

ఆ కాలంలోనే రాచకొండ రాజధానిగా తెలంగాణాలో రేచర్ల వంశంవారు పద్మనాయక రాజ్యం స్థాపించారు. వీరు వెలమలు. దేవరకొండ రాజ్యాన్ని పాలించిన వారు కూడా వెలమలే. వీరు మొదట శైవులు. తరువాత వైష్ణవులుగా మారారు.

1335–36 కాలంలో దక్షిణాపథంలో ఈ ఆరుముఖ్యమైన రాజ్యాలు స్వతంత్ర ప్రతిపత్తితో వెలసిన సంగతి గుర్తుంచుకుంటే ఆనాటి రాజకీయ స్వరూపం వెల్లడవుతుంది:–

1) తీరాంధ్రాన్ని పాలించినవారు ముసునూరి పాలకులు.
2) వరంగల్‌ను స్వాధీనపరచుకున్న కాపయ నాయకుడు.
3) ప్రోలయ వేమారెడ్డి స్థాపించిన రెడ్డిరాజ్యం.
4) పద్మనాయకులు స్థాపించిన రాచకొండ, దేవరకొండ రాజ్యాలు.
5) హరిహర బుక్కరాయలు స్థాపించిన విజయనగర సామ్రాజ్యం.
6) స్థానిక గవర్నరు తిరుగుబాటు జరిపి దక్కనులో స్థాపించిన బహమనీ రాజ్యం.

స్వదేశాభిమానంగల దాదాపు 77 మంది నాయకులు ఒక్క తాటిపైకొచ్చి తిరిగి హిందూ రాజ్యాన్ని స్థాపించడానికి ముసునూరి ప్రోలయ నాయకుని నాయకత్వంలో ఉద్యమించడం ఒక గొప్ప చారిత్రక సంఘటన. వేంగి ప్రాంతం నుండి తన రాజధానిని గోదావరి తీరంలోగల భద్రాచలం దగ్గరి రేకపల్లికి మార్చాడు ప్రోలయ నాయకుడు. ప్రోలయ నాయకుడు క్రీ.శ. 1330 ప్రాంతంలో మరణించాడు. అతని మరణానంతరం అతని పినతండ్రి కుమారుడు కాపయ నాయకత్వం వహించాడు. ఈ కాపయ నాయకుడు 1336లో ఓరుగల్లు కోటను ముట్టడించి మహమ్మదీయులను పారదోలి స్వాధీనం చేసుకున్నాడు. రేకపల్లి నుండి రాజధానిని ఓరుగల్లుకు మార్చాడు. ఆంధ్ర సురత్రాణ, ఆంధ్రదేశాధీశ్వర, కాకతీయ స్థాపనాచార్య మొదలైన బిరుదులు ధరించాడు.

తురుష్కులపై దండయాత్ర ప్రారంభించడానికి ముందు 77 మంది నాయకులు ఒక ఒప్పందానికి రావడం జరిగింది. ఆ ఒప్పందం ప్రకారం మహమ్మదీయులను

పారదోలిన తరువాత ఎవరి భూభాగాలను వారే ఏలుకొనేటట్లు, ఒకరి భూభాగాలలో వేరొకరు జోక్యం చేసుకొననట్లు అందరూ అంగీకరించారు. కాపయ నాయకునికి తాను కూడా కాకతీయ సామ్రాజ్యాధీశునిగా చక్రవర్తిత్వాన్ని నిరూపించుకోవాలని దుర్బుద్ధి పుట్టింది. దానికితోడు ఓరుగల్లు రాజధానిగా చేసుకున్న తరువాత తన అనుయాయులను పెంచుకుని తన రాజ్యవిస్తరణ చేసుకున్నాడు. తెలంగాణాలో అధిక ప్రాంతానికి పాలకుడైన రేచర్ల సింగమనేడు పై కయ్యానికి కాలుదువ్వి అతని కొన్ని ప్రాంతాలను ఆక్రమించుకున్నాడు. నిరంతర యుద్ధాలతో కాపయ నాయకుని బలం క్షీణించింది. 1367–68లో అతడు మరణించాడు. ఆ తరువాత అనపోతన రేడు వరుసగా తెలంగాణా దుర్గాలన్నీ తన స్వాధీనంలోకి తెచ్చుకున్నాడు.

పద్మనాయకులు:

పద్మనాయకులు కాకతీయరాజుల సామంతులు. గణపతిదేవుని కాలం నుండి పద్మనాయకుల అభ్యున్నతి ప్రారంభమైంది. రాజకీయాలలో ఉత్సాహంగా పాల్గొంటూ కాకతీయ సామ్రాజ్య విస్తరణకు దోహదపడ్డారు. పద్మనాయకుల జన్మస్థలం నల్లగొండ జిల్లాలోని ఆమనగల్లు. పద్మనాయక రాజులు స్వతంత్రులైన తరువాత ఆమనగల్లు, రాచకొండ, దేవరకొండలను రాజధానులుగ ఏర్పాటు చేసుకున్నారు. రాచకొండ, దేవరకొండలలో బలిష్ఠమైన దుర్గాలను నిర్మించుకున్నారు.

రాచకొండ పట్టణం నల్లగొండ జిల్లా నారాయణపురం మండలంలోఉంది. రాజ్యం సుస్థిరం కాగానే రాచకొండ ప్రాంతంలో పద్మనాయకులు ధర్మరక్షణకు కంకణం కట్టుకున్నారు. అందుకు కారణం కాకతీయుల పతనం తరువాత వరంగల్ తదితర ఆంధ్రదేశ ప్రాంతాలు ముస్లింల వశమైనాయి. ఆ పరస్థితుల్లో స్వధర్మ, స్వమత రక్షణ, అభివృద్ధి ప్రతిహిందువు కర్తవ్యమైనది. రాచకొండలో అన్ని మత సంప్రదాయాలకు చెందిన వారు ఉండేవారు.

రాచకొండ పట్టణం సాహిత్యానికి, సంగీతానికి, నాట్యశాస్త్ర రంగానికి పెట్టింది పేరు. వీరి కాలంలో సంస్కృత భాషకు ఎంతో విలువ లభించింది. పద్మనాయకుల ఆస్థాన కవి శాలక్య అయ్యలార్యుడు. ఇతడు భాస్కర రామాయణం పూర్తి చేశాడు. రాచకొండ ప్రభువుల ప్రాపు పొందిన తెలుగు కవులలో గౌరన, పోతన ప్రసిద్ధులు.

రాచకొండ రాజులలో సర్వజ్ఞ సింగభూపాలుడు సంగీత, సాహిత్య కళావిశారదుడు, మంచి రసికుడు, బహు గ్రంథకర్త. కవిసార్వభౌముడు శ్రీనాథుడు రాచకొండను దర్శించాడు.

ఆనాడు రాజులు నీచులైనారు. మంత్రులు స్వార్థపరులైనారు. ప్రజలు అవినీతిపరులై లంచాలకు మంచాలు వేశారు. మహమ్మదీయ సంపర్కంతో, సంఘర్షణలతో హిందూ సంఘం నీరసించింది. దేశ అభ్యున్నతికై ఆధ్యాత్మిక చింతనగాని, పరార్థచింతనగాని లేదు. శ్రీరాముడు ఆదర్శప్రభువు. రామరాజ్యం ఆదర్శ రాజ్యం. ఆ సందేశం ప్రపంచానికి చాటడమే భాగవతాంధ్రీకరణ. పోతనచేతిలో తెలుగు తల్లి రాణించింది. పోతన లేఖినిలో తెనుగు తీగలు సాగినది. సహజమాధుర్యం సార్థకం చేసుకున్నది.

కాకతీయులు పతనమైన తరువాత ముసునూరు, రేచర్ల పద్మనాయకులు తెలంగాణాని దాదాపు 150 సంవత్సరాలు పాలించినప్పటికీ సమర్థమైన, స్థిరమైన పాలనను అందించలేకపోయారు. వారు, వాళ్ళ జీవిత కాలమంతా యుద్ధాల్లో గడపడం, బహ్మనీసుల్తాన్‌లతో, ఢిల్లీ సుల్తాన్‌లతో వైరం, విజయనగర, గజపతుల ప్రాబల్యం పెరగడం వంటి ఎన్నో కారణాలవల్ల క్రీ.శ. 1475 నాటికి క్షీణించి పద్మనాయక రాజ్యం అస్తమించింది. అయినా తెలంగాణా చరిత్రలో వారు ప్రధాన పాత్రను పోషించారు.

తెలంగాణాను తటాకాల ప్రాంతంగా కాకతీయులు ఇంతకుముందే కూర్చి యున్నారు. దానికి తోడు వెలమలు కూడా అనసోమసముద్రం, రాయసముద్రం, నాగసముద్రం మొదలైన తటాకాలను నిర్మించి వ్యవసాయాన్ని ప్రోత్సహించారు. వ్యవసాయ పరిస్థితి కొంతవరకు సాధారణంగా ఉన్నా నిరంతర సైనిక పటాలాల కదలికలవల్ల ముక్కారు పంటలు పండే పరిస్థితి లేదు. వర్తక, వాణిజ్యాలకు రక్షణ తగ్గింది. ఓడరేవు పట్టణాలకోసమే కృష్ణా, గోదావరి తీరప్రాంతాన్ని తమ అధీనంలోనికి తెచ్చుకోవటానికి రెడ్డి రాజులతో తలపడ్డారు. కాని పట్టుమని పది రోజులు కూడా అవి వారి అధీనంలో ఉన్నది లేదు. విదేశీ వ్యాపారం అడుగంటినా దేశీయ వ్యాపారంలో చిల్లర వర్తకులు, కుటీర పరిశ్రమలవారు రాజకీయాలకతీతంగా తమ పనులు తాము

నిర్వర్తించినట్లు కనిపిస్తుంది. ప్రధాన వృత్తి వ్యవసాయం అయిన వృత్తిపనివారు భూముల్ని కలిగి ఉన్నారు.

రేచర్ల పద్మనాయకులు కవిపండిత పోషకులే కాకుండా స్వయంగా కవులు. అనేక ప్రామాణిక గ్రంథాలు రచించారు. ఆనాడు రచించిన గ్రంథాలలో రసార్ణవ సుధాకరము (నాట్యాలంకార శాస్త్రగ్రంథము), రత్నపాంచాలిక (సంస్కృత నాటకం), చమత్కార చంద్రిక (అలంకారశాస్త్ర గ్రంథము), అమర పద పారిజాతము (అమర కోశానికి వ్యాఖ్యానం), లక్షణదీపిక, హరిశ్చంద్రోపాఖ్యానము మొదలైనవి సంస్కృత గ్రంథాలు, సింహాసన ద్వాత్రింశిక, నవనాథ చరిత్ర, భాగవతము, భోగినీ దండకము వంటి తెలుగు గ్రంథాలు ముఖ్యమైనవి. ఈ విధంగా సాహిత్య రంగం పద్మనాయకులకు ఒక విశిష్ట స్థానాన్ని కల్పించింది. ❑

7. హిందూమత పునరుద్ధరణ- భక్తి ఉద్యమం

ఆంధ్రులు అతి ఉద్రేక స్వభావులు. అతిశీఘ్రంగా, అతితీవ్రమైన ఉద్రేకాలకు పాల్పడుతారని ఈనాటికి కూడా పేరుపడే ఉన్నారు. అందుకనే ఏ కొత్త అభ్యుదయ భావమైన, నూతనాదర్శమైన వాళ్ళనిట్టే అతిస్వాభావికంగా ఆకర్షిస్తుంది. ఆంధ్రలో మొట్ట మొదట వ్యాపించింది బౌద్ధమతం. క్రీస్తుపూర్వం 4వ శతాబ్దం నుండి క్రీస్తు తరువాత 6-7 శతాబ్దాల వరకు ఆంధ్రదేశం బౌద్ధానికి పెట్టని కోటగా ఉండేది. క్రీస్తు శకం 2, 3 శతాబ్దాల వరకు, ఆంధ్రదేశంలో బౌద్ధమత కట్టడాలు తప్ప మరి ఏ ఇతర మత కట్టడాలు చెప్పుకోతగ్గవి లేవు. రమేశన్‌గారు ఈ విధంగా వ్రాశారు: "ప్రాచీనాంధ్ర సంస్కృతిలో చెక్కిన ప్రతిరాయి, ఆంధ్ర సంస్కృతి అన్వేషణకు త్రవ్విన ప్రతిగుంట బౌద్ధానికి సంబంధించినదే. ఫణిక్కర్ అనే చరిత్రకారుడు 'ఆంధ్రదేశంలో బౌద్ధం సరికొత్త ఆర్య నాగరికత'. ఏడవ శతాబ్ది ప్రారంభానికి దక్షిణాపథంలో బౌద్ధమతం దాదాపు అంతరించి పోయిందనే చెప్పాలి. అయినప్పటికీ హిందూమతస్థులు-బౌద్ధ, జైన మతాల ముందు తమ మతం ఏమైపోతుందోనని భయపడేవారు. ఈ నిస్పృహ మతోద్రేకానికి కారణమై భక్తి ఉద్యమానికి దారితీసింది".

హిందువులకు ముఖ్యమైన ఆరాధ్యదేవతలు శివ-విష్ణువులు. నిర్గుణారాధన స్థానాన్ని, సగుణారాధన ఆక్రమించుకున్నది. ఈ యుగలక్షణ ఆవేశానికి లోనైన యోగులు, మహాభక్తులు అనేకులు పుణ్యక్షేత్రాలకు యాత్రలు చేస్తూ భక్తిగీతాలను, గానం చేసేవారు. మహామయుడూ, మానవుని దుఃఖాలను తక్షణం నివారించేవాడూ అఖండమైన ఆనందాన్ని ప్రసాదించేవాడూ అయిన ఇష్టదైవం పట్ల ప్రగాఢమైన మైత్రి ఉప్పొంగింది. ఈ ఉద్యమానికి నాయకత్వం వహించిన ఆచార్యులు తమకు ప్రతిస్పర్థులైన జైనులతోనూ, బౌద్ధులతోనూ మత విషయంలో జరిగిన చర్చల్లో స్వయంగా పాల్గొనేవారు. హిందువులలోని శైవ, వైష్ణవ శాఖలు రెంటిలోని భక్తి ఉద్యమం ఈ విధంగా బయల్దేరింది.

మొదటిదశలో భక్తి ఉద్యమానికి స్వమత రక్షణ కారణమైన తరువాత రాజకీయ పరిస్థితి కూడా ప్రోది అయింది. ఉత్తరాన పృథ్వీరాజ్ పతనంతో దక్షిణాన ఓరుగల్లు ఒరిగిపోవడంతో ప్రజల బింకం, బిగువు బీటలు వారాయి. ఇతర మతాల వారూ, ఇతర దేశాలవారూ, మన దేశాన్ని ఆక్రమించుకోవడంతో వర్ణాశ్రమ ధర్మాలు మరింత సడలాయి. అన్నివర్ణాలవారు ఒక్కటేననే భావం బౌద్ధయుగంకన్న హెచ్చుగా ప్రబలింది. ఆ విప్లవానికి వెన్నెముక భక్తి యోగం. అది ఆనాటి సాంఘిక సాహిత్య రంగాలలో ప్రస్ఫుటమైన మార్పును తెచ్చింది.

వీరశైవం:

పన్నెండవ శతాబ్దంలో ఆంధ్ర, కర్ణాటక దేశాలలో ఉదయించిన 'వీరశైవం లేక లింగాయత్' హిందూ సంఘసంస్కరణలో మరొక శాఖ. క్రీ.శ. 1156లో కల్యాణీ చాళుక్యుల రాజ్యాన్ని వశపరచుకున్న బిజ్జలుని ప్రధానమంత్రి బసవేశ్వరుడు ఈ మతాన్ని స్థాపించాడు. ఈ మతంలో శివుడే దేవాది దేవుడు. ఈ మతోద్ధారకులకు 28 శైవ ఆగమాలు మూలాధారం. వీరశైవులకు నయనార్లు మార్గోపదేశికులు. చైతన్య ప్రదాతలు. వీరశైవం వేదాలను తిరస్కరించింది. వర్ణవ్యవస్థను తోసిరాజన్నది. వీరశైవంలో ఒక శాఖ ఆరాధ్య దైవము. ఇది తెలుగుదేశంలోనే ఎక్కువ కనబడుతుంది. బసవేశ్వరుని సమకాలికుడైన పండితారాధ్యుడు దీన్ని ప్రవేశపెట్టాడు.

శాతవాహన రాజ్య పతనానంతరం ఆంధ్రదేశమంతా చిన్న చిన్న రాజ్యాలుగా విడిపోయింది. చాళుక్యులు, పల్లవులు, సాలంకాయనులు, విష్ణుకుండినులు, గాంగవంశపు రాజులు తలా ఒక భాగాన్ని పాలించసాగారు. వారికి ప్రజలతో సన్నిహిత సంబంధం ఏర్పరచుకోవడం వారి అస్థిత్వానికి అవసరమైనది. కాబట్టి తప్పనిసరిగా తెలుగు భాషను ప్రోత్సహించి అందులో గ్రంథాలు కూడా రాయించవలసి వచ్చింది. ఈ ఉద్దేశంతోనే క్రీ.శ. 1050లో చాళుక్య రాజైన రాజరాజనరేంద్రుని ప్రోత్సాహంతో నన్నయ్యభట్టు ఆంధ్రభారత రచనకు ఉపక్రమించాడు. ప్రాకృతం సంపూర్ణంగా నశించింది. సంస్కృతం పండితభాషగా మాత్రమే అయిపోయింది. ప్రాకృత, సంస్కృత భాషలలోని పదజాలాన్ని విశేషంగా స్వీకరించి ఆంధ్రభాష వికసించింది. ఒకే భాషను ప్రజలందరు మాట్లాడటం సమగ్రజీవి పరిణామానికి అవసరమైన రెండవ లక్షణం. ఆ లక్షణం 800 సంవత్సరాల సుదీర్ఘపోరాటం తరువాత ఆంధ్రజాతి సాధించింది.

అనంతర కాలంలో శైవ, వైష్ణవ మతాలు రెండు కూడా ఆంధ్రదేశంలో బాగా ప్రచారంలోకి వచ్చాయి. పాల్కురికి సోమనాథునికి పూర్వం తెలుగులో వెలిసిన గ్రంథాలు ప్రాయికంగా సంస్కృతమూలకాలు. ఇతని బసవపురాణం వీరశైవ మతోద్ధరణకు మూలమైన బసవేశ్వరుని జీవితం గురించి వర్ణించే గ్రంథం. ఇది ఏ సంస్కృత గ్రంథానికి అనువాదం కాదు. తమిళంలోని పెరియ పురాణం కూడా దీనికి మౌలికం కాదు. ఇది దేశీయ ఇతివృత్తంతో కూడిన ఒక స్వతంత్ర గ్రంథం. అందులోని వస్తువు పురాణాల్లోని పౌరాణిక వ్యక్తులకు సంబంధించినది కాకుండా ఒకానొక చరిత్ర పురుషునికి సంబంధించినది. పండితారాధ్య చరిత్రలోని ఇతివృత్తం మల్లికార్జున పండితుని కథ.

అద్వైత సిద్ధాంతాన్ని ప్రచారం చేసిన వారు శంకరాచార్యులు. ఈయన క్రీ.శ. 790 ప్రాంతంలో కేరళలోని నంబూద్రి కుటుంబంలో జన్మించాడు. ముప్పయి రెండు సంవత్సరాలు మాత్రమే జీవించాడు. ఆ కొద్ది కాలంలోనే భారతదేశ మంతా పర్యటించాడు. పూరి, ద్వారక, బదరి, శృంగేరీలలో మతాలను స్థాపించాడు. ఉపనిషత్తులకు, భగవద్గీతకు, బ్రహ్మసూత్రాలకు వ్యాఖ్యలు రచించాడు. హిందూ దేశమంతటా అనేక లక్షలమంది ప్రజలు అత్యంత భక్తి విశ్వాసాలతో నేటికీ శంకర జయంతిని జరుపుకుంటారు. ఆయన శిష్యులు పలుదిక్కులా ఆయన సిద్ధాంతాలను ప్రచారం చేస్తున్నారు.

పన్నిద్దరాళ్వారుల స్తోత్రాలను నాలాయిరం అనే పేరుతో వ్యవహరిస్తారు. అదే తిరువాయ్ మొడి. తంజావూరు జిల్లాలోని మన్నారు గుడిలో క్రీ.శ. 824లో జన్మించిన నాథముని ఆ నాలుగువేల స్తోత్రాలను సేకరించారు. నాథముని మనుమలైన యామునాచార్యులు ఆళవందార్‌గా ప్రసిద్ధులు. ఆయన తన వైదుష్యబలంచేత వైష్ణవ జ్యోతిని ప్రజ్వలింపచేశాడు. ద్వాదశ ఆళ్వారులలో వివిధ కులాల వారున్నారు. ఆ పన్నెండు గురిలో ఒక స్త్రీ ఉన్నది. ఒక అస్పృశ్యుడు ఉన్నాడు. వీరు చేసిన మతప్రబోధ సంప్రదాయ పరిధులన్నిటినీ అతిక్రమించి బహుళ ప్రచారం పొందింది. యథార్థానికి దక్షిణదేశంలో భక్తిమార్గాన్ని ప్రారంభించింది ఆళ్వారులే. మతం అతి సామాన్య మానవుడికి కూడా అందుబాటులో ఉండాలన్నదే వారి వ్రతం.

విశిష్టాద్వైతం:

పదో శతాబ్దం చివరిలో మతోద్యమములో వికాసహేతువైన ఆధ్యాత్మికత సన్నగిల్లింది. ఆళ్వారుల స్థానాన్ని ఆచార్యులు ఆక్రమించారు. ఈ నవీన మార్గాన్ని లేవదీసినవారు రంగనాథాచార్య అనే నాథముని. విశిష్టాద్వైత వేదాంతంపైన న్యాయ తత్వం అనే గ్రంథాన్ని ఈయన రచించారు. ప్రపత్తి అనే సిద్ధాంతాన్ని అందులో ప్రతిపాదించారు. అళవందారు అనే నామాంతరంగల యామునాచార్యులు ఈయన మనుమడు.

రామానుజాచార్యులు:

వీరశైవంవలె అన్యప్రాంతములో రూపొంది ఆంధ్రదేశంలో వ్యాపించింది వైష్ణవ మతము. ఈ మతము ద్రావిడదేశంలో విశేష ప్రచారం పొందింది. భక్తి ప్రధానమైన వైష్ణవాన్ని శఠకోపుడు, నాథముని, యామునాచార్య మొదలగు భాగవతోత్తములు బోధించారు. శైవానికీ, వైష్ణవానికీ సంఘర్షణ జరుగుతున్న సమయంలో ద్రావిడదేశంలోని శ్రీపెరుంబుదూరు అనే గ్రామంలో బ్రాహ్మణ కుటుంబంలో వైష్ణవమత స్థాపకుడైన రామానుజాచార్యులు 1018లో జన్మించాడు. ఇతడు శంకరాచార్యుల అద్వైత మతాన్ని ఖండించి విశిష్టాద్వైతమనే వైష్ణవ సిద్ధాంతాన్ని నెలకొల్పాడు. ఈ కాలంలో చాళుక్య చోళరాజుల కులోత్తుంగుడు శైవ మతాభిమాని కావడంతో రామానుజులు దేశం విడిచి పోవలసి వచ్చింది. కులోత్తుంగుని మరణానంతరం రామానుజులు తిరిగి శ్రీరంగం ప్రవేశించి శ్రీభాష్యం పూర్తి చేశాడు. శంకరాచార్యుల అద్వైతాన్ని ఈయన ఖండించాడు. జీవాత్మ భగవంతుని కంటె వేరని, ఈ భిన్నత ఎప్పటికీ తొలగేది కాదని, భగవంతునిలో ఐక్యం కావడం కాకుండా ఆయన సన్నిధిలోనే ఉండటమే మోక్షమని రామానుజాచార్యులు బోధించాడు.

రామానుజాచార్యుల విశిష్టాద్వైతాన్ని ఎదిరించిన మరొకశాఖ నవీన వైష్ణవం. ఈ శాఖను నింబార్కుడు స్థాపించాడు. ఈయన రామానుజులకు సమకాలికుడు. ఈయన బళ్ళారి జిల్లాలో జన్మించాడు. రామానుజాచార్యులు లక్ష్మీనారాయణులను అర్చించాడు. నింబార్కుడు రాధాకృష్ణులను అర్చించాడు. మధ్వాచార్యులు శంకర మతాన్ని ఎదుర్కొన్న మరొక ప్రముఖుడు, ఈయన ఉడిపిలో పుట్టాడు. మధ్వాచార్యుల

సిద్ధాంతంలో నారాయణుడొక్కడే దైవం. భగవంతుని గురించి తెలుసుకోవాలంటే వేదాలే ముఖ్యమని ఈయన ఘంటాపథంగా చెప్పాడు.

13, 14 శతాబ్దాలలో రామానుజ శిష్యులలో వడగలై, తెంగలై అనే రెండు తెగలు ఏర్పడ్డాయి. మొదటి తెగ నాయకులు వేదాంత దేశికులు, రెండవ తెగకు పిళ్ళైలోకాచార్యులు నాయకులు. వడగలై వైష్ణవులు వేదాలకు ప్రాముఖ్యమిచ్చారు. తెంగలై వైష్ణవులు ప్రబంధాలకు ప్రాముఖ్యమిచ్చారు.

శంకర నిర్మాణం ముందు బౌద్ధ నిర్మాణం కూలిపోయింది. ఎంతో ఆవేశంతో, ఎంతో దీక్షతో, ఎంతో చాతుర్యంతో తెలుగు నాట బౌద్ధసంస్కృతి నిర్మించారో, అంత ఆవేశంతోనూ, అంత దీక్షతోనూ, అంత చాతుర్యంతోనూ ఆ సంస్కృతిని మనవారు నాశనం చేసినారు. ఊరూ, పేరు లేకుండా, సున్నంలోకి ఎముకలేకుండా, ఆఖరుకి ఆ మహా యుగానికి సంబంధించిన అక్షరం లేకుండా సర్వనాశనం చేశారు. అశోక చక్రవర్తి ప్రారంభించిన శిలాక్షర ప్రచార చిహ్నాలు లేకపోతే, దేశదేశాంతరాల నుంచి వచ్చిన బౌద్ధయాత్రికులు పొగడ్తలు అన్యభాషలలో లేకపోతే, నిర్జనారణ్యాలతో గృహాంతర్భాగాలలో శిథిలమై పోయిన శిల్ప కళ లేకపోతే, ఒకనాడు బౌద్ధం, జైనం, తెలుగుసీమలో వెల్లివిరిసిన సాక్ష్యం ఉండేది కాదు. అందుకనే నన్నయకు పూర్వం తెలుగు కవిత్వం ఉన్నదా లేదా అనే సందేహం కలగడం, ఆంధ్రమహాభారతం ప్రథమాంధ్ర కావ్యం కావడం, తూర్పు చాళుక్యులు నూతన సామ్రాజ్య నిర్మాతలు కావడం జరిగింది.

దేశంలో బౌద్ధమతం క్షీణించిన తరువాత ఆంధ్రుల అంతర్జాతీయ ప్రాబల్యం కూడా క్షీణించింది. పాత లక్ష్యం పోయింది. కొత్త లక్ష్యం దొరకలేదు. ప్రజాస్వామ్యానికి పారమార్థిక చింతపోయి దుర్దశ సంభవించింది. శంకరుడి సందేశం జనసామాన్యానికి దురవగాహమైనది. కర్మాధికారంలేని బ్రాహ్మణేతరులకి అది చెందలేదు. అజ్ఞానులైన, మూఢుల్ని పొందలేదు. మత గ్రంథాలన్ని సంస్కృతంలో ఉన్నవి. ఆ భాష జనసామాన్యానికి రాదు. అందుచేత వేదరహస్యాలు, వేదప్రాశస్త్యం, జన బాహుళ్యానికి అందజెయ్యడానికే రాజరాజ నరేంద్రుని పోషణలో వున్న నన్నయభట్టు నారాయణభట్టు సహాయంతో పంచమవేదమైన భారత సంహిత తెనిగించడం ప్రారంభించాడు. ఈ

భారత సంహిత ప్రచారం చేసి, ప్రజాస్వామ్యంలో వేదమతం పునఃస్థాపన చెయ్యడం అతని ఉద్దేశం. పండితులకి మాన్యాలిచ్చి, పురాణాలు చెప్పించి, తన మతం దేశీయ భాషలో పామర జనానికి అందజెయ్యాలని ప్రయత్నం. భాష తెనుగైనా పద్ధతి సంస్కృత పద్ధతి. భాషకూడా తత్సమ తద్భవము. దీన్నే మతపద్ధతి అన్నారు. మతంలో, సంఘంలో, భాషలో, కవితలు సంస్కృత పద్ధతిలో నడిచే ఈ మార్గానికీ, దేశీయ పద్ధతులకి సరిపడలేదు. సంస్కృతానికీ తెలుగుకీ ఈ యుద్ధం జరగాలనే వచ్చింది. అందుకనే భారతాంధ్రీకరణం రెండు వందల నలభై సంవత్సరాలు పట్టింది. ఈ ఉద్యమం శీఘ్రంగా కొనసాగకపోవడానికి కారణం తెలుగు ప్రజల జాతీయత, ఆ జాతీయత రేకెత్తించిన శైవమతం, బౌద్ధం. తరువాత తెలుగుదేశంలో ప్రజానీకంలో ప్రబలిన మతం శైవం.

పదమూడవ శతాబ్దం ముగిసేనాటికి మహారాష్ట్రదేశంలో చాలా వరకు వైష్ణవ మతం ప్రబలిపోయింది. తుకారాం, జ్ఞానేశ్వరుడు ఈ మతాన్ని అనుసరించారు. శైవ, వైష్ణవమతాలు రెండు కూడా ఆంధ్రదేశంలో బాగా ప్రచారంలో ఉన్నాయి.

మహాభారతగ్రంథం భారతీయ ధర్మాన్ని ప్రవచిస్తోంది. అది ఇచ్చే సందేశం మహోన్నతం, పరిపూర్ణం. హైందవ సంస్కృతికి భారత గ్రంథం దర్పణం. ఆంధ్రుల మత, సంస్కృతులు దానివలన పరిపుష్టమైనాయి. భారతాన్ని హైందవ సంస్కృతికి పునాదిగాను సంపూర్ణ వ్యక్తీకరణగాను నన్నయ పరిగణిస్తే, తిక్కన మహాభారతంలో హరిహర రూపంలో పరమాత్మ సాక్షాత్కారమయింది. అయితే నన్నయ కాలానికి తిక్కన కాలానికి మధ్యకాలంలో శైవమతం విజృంభించింది. అది వీరశైవంగా పైబడి శివుడొక్కడే దైవమనే భావం, మార్మిక పద్ధతి ఆరాధనలు బహుళ ప్రచారంలోకి వచ్చాయి. ఇంకో పక్క విష్ణువొక్కడే దైవమనే వైష్ణవ మతం వృద్ధి చెందింది. విభిన్న దృక్పథాలతో ఈ రెండు మతాలు తిక్కన సోమయాజి చేపట్టాడు. ఈ భావన ఆయనకు మహాభారతంలో దర్శనమయింది. అదే హరిహర స్వరూపం. ఆత్మహత్యా సదృశంగా తయారై వెర్రితలలు వేస్తున్న శైవమత విధానాల నిరోధానికి ఈ విశిష్టమైన భావన దోహదమయింది. అప్పటికే ఉత్తరాన విదేశీయుల శతఘ్నుల తాకిడికి సోమనాథ దేవాలయం ఇతర వైష్ణవ దేవాలయాలు కూలిపోతున్నాయ్. దక్షిణ దేశానికి కూడా ఈ దండయాత్రల ప్రమాదం వ్యాపించింది.

ఈ విధమైన విపత్సమయాలలో భక్తాగ్రేసరుడైన బమ్మెర పోతన తన భక్తి భావలహరిని కవితా స్రవంతిగా ప్రవహింపజేసి, తెలుగువారి హృదయాలమీద చెరగని ముద్రవేశాడు. ఆయన వ్రాసిన మహాభాగవతం భక్తిరసపూర్ణమైన మహోత్కృష్ట గ్రంథం. ఆయన వరంగల్ వాడైనా అతని భక్తి ప్రపత్తులు నలుమూలల వ్యాపించాయి. మహావిష్ణువు దశావతారాలను భక్తిభావ పూరిత కవితాధారలతో సమదర్శనం చేసుకున్న పోతన, భక్తుని అనుభవాన్ని, ఆత్మ సాక్షాత్కారాన్ని మేళవించిన కవిశ్రేష్ఠుడాయన. మతపరమైన కవిత్వం ఇంతగా ప్రభవించిన కాలం ఆంధ్రుల మూడు శతాబ్దాల కవిత్వ చరిత్రలో మరొకటి లేదు. భక్తి ఉద్యమం ప్రభావంగా వాఙ్మయంలో దేశీ కవిత ప్రచారంలోకి వచ్చింది. హిందీలో దోహ, చప్పయ్, మున్నగునవి. పంజాబీలో హీర్ వంటివి. కన్నడంలో షట్పది, రగడ మొదలయినవి. తెలుగులో ద్విపద, మంజరి, జాజిరి, చందమామలు, కోయిల, చిలుక, తుమ్మెద పదాలు. రావి, సువ్వి, గొబ్బి, ఉయ్యాల, జోల, జోజో, తందనాలు, చాంగు బళాలు– ఒక్కటేమిటి దేశీకవితా కమలం వేయిరేకులలో వికసించి భక్తికీ, సంగీతానికీ అవినాభావ సంబంధం ఉందని నిరూపించింది. దేశికవితల పద్ధతిలోనే శ్రీ వైష్ణవంలో తిరునామాలు మంగళ హారతులు, కీర్తనలు వెలువడి భక్తి సాహిత్యాన్ని పరిపుష్టంచేసి ప్రజా బాహుళ్యంలో వ్యాప్తి చెందినవి.

❑

8. బహమనీ సుల్తానులు

బహమనీరాజ్యం, విజయనగరరాజ్యం రెండూ ఢిల్లీ సుల్తానుల సామ్రాజ్య తత్వానికి వ్యతిరేకంగా ఏర్పడిన స్వతంత్ర రాజ్యాలు. 1336లో విజయనగర రాజ్యం హంపీలో ఏర్పడింది. 1347లో బహమనీరాజ్యం గుల్బర్గాలో ఏర్పడింది (గుల్బర్గా వెనుకటి నిజాంరాష్ట్రంలోని ఒక జిల్లా).

ఢిల్లీ సల్తనత్ (రాజ్యం) బలహీనమైపోగానే దక్కను అమీర్లందరూ సంఘటితులై మహమ్మద్ బిన్ తుగ్లక్‌మీద తిరుగుబాటు చేసి ఇస్మాయిల్ మఖ్ అనే వృద్ధనేతను తమ నాయకుడుగా ఎన్నుకున్నారు. రాజ్య భారం భరించలేని ఆ వృద్ధ అమీరు హసన్ అలీ అనే యువకునిపై ఆ భారం మోపాడు. ఈ హసన్ 1347 ఆగస్టు 3వ తేదీన ముజఫర్ అల్లాఉద్దీన్ అహమ్మద్ హసన్ గంగూ పేరుతో బహమనీ వంశాన్ని స్థాపించాడు. మహమ్మద్‌బిన్ తుగ్లక్ జీవితకాలంలోనే యావత్తు దక్షిణాపథం స్వతంత్రమైనది.

అల్లాఉద్దీన్ హసన్ గంగు (1347-58):

రాజ్యాధికారం లభించగానే అల్లాఉద్దీన్ అహమ్మద్‌షా గుల్బర్గాను తన రాజధానిగా చేసుకొని దాని పేరు హస్నాబాద్‌గా మార్చాడు. అతనికి రాజ్యస్థాపనలో సహాయ మందించినవాడు ఆంధ్రదేశాధీశ్వరుడైన ముసునూరి కాపయ నాయకుడు. కానీ హసన్ దాడికి ముందుగా గురైన వాడు కాపయ నాయకుడే.

ఢిల్లీ సుల్తాన్ల దక్షిణాపథ రాజ్యానికి తానొక్కడే వారసుడైనట్లు హసన్ గంగూ ప్రవర్తించడం మొదలుపెట్టాడు. అతని కుటిల చర్యకు కాపయనాయకుడు హైరానా పడిపోయాడు. ఒకవైపు రెడ్డిరాజులు, మరొకవైపు పద్మనాయకుల మధ్య నలిగిపోతున్న కాపయనాయకునికి హసన్ చర్యలు మరిన్ని ఇబ్బందులు కలిగించాయి. హిందూరాజుల మధ్య వైరంతో హసన్ రోజు రోజుకి బలపడుతూ వచ్చాడు. హసన్ ఓరుగల్లుపై

దాడి జరిపి కాపయనాయకుడిని ఓడించాడు. అప్పుడు కాపయనాయకుడు పెక్కు ఏనుగులు, ద్రవ్యరాసి సమర్పించి సంధిచేసుకున్నాడు. దీనితోనే తృప్తిపడని హసన్ రెండవసారి ఓరుగల్లు పై దాడి చేసి దారిలో కనిపించిన గ్రామాలన్నిటినీ దోచుకున్నాడు. దేవాలయాలను పడగొట్టించాడు.

తీరాంధ్రాన్ని జయించలేక పోయినా బీదరు, మాల్ఖేడ్‌లను ఈ బహమనీ సుల్తాన్ ఆక్రమించుకున్నాడు. 1358లో అల్లాఉద్దీన్ హసన్ చనిపోయాడు. ఇతని రాజ్యం ఉత్తరాన పైన్ గంగా నుంచి దక్షినాన తుంగభద్ర వరకూ, పశ్చిమాన దౌలతాబాద్ నుంచి తూర్పున భువనగిరి వరకూ విస్తరించింది. ఇతడు తన రాజ్యాన్ని గుల్బర్గా, దౌలతాబాద్, బీదరు, బిరారు అనే నాలుగు తరఫులలో విభజించి వాటి పాలనకు సమర్థులైన గవర్నర్లను నియమించాడు.

అల్లాఉద్దీన్ హసన్ తరువాత అతని జ్యేష్ఠపుత్రుడు మొదటి మహమ్మద్‌షా రాజ్యానికి వచ్చాడు. ఇతడు పరాక్రమవంతుడేగాని, మహాక్రూరుడు. ఇతడు ఓరుగల్లుని ముట్టడించి కాపయనాయకునితో జబర్దస్తీ సంధి చేయించుకున్నాడు. మాట నిలుపుకోలేని మహమ్మద్‌షా కాపయనాయకుని కుమారుడు వినాయక దేవుని నాలుక కోయించి మంటలలో పడదోయించాడు.

దారుణ హింసలకు గురై తన కొడుకు మరణించాడనే వార్త కాపయనాయకుణ్ణి కుంగదీసింది. తనకు జరిగిన పరాభవానికి న్యాయం జరిపించవలసినదిగా అతడు ఢిల్లీశ్వరుడైన ఫిరోజ్ తుగ్లక్‌కు విన్నవించుకున్నాడు. కాని స్వమతాభిమానంతో తుగ్లక్ అతనికి న్యాయం చేకూర్చలేదు. విజయనగరం రాజునుంచి కాపయనాకునికి సహాయమందే అవకాశం లేదు. అన్నివిధాలా నిస్సహాయుడైన కాపయ నాయకుడు చివరకు బహమనీ సుల్తాన్‌కు 33 లక్షల నగదు, 300 ఏనుగులు, 200 గుర్రాలు సమర్పించుకుని సంధి చేసుకోవలసి వచ్చింది. ఆ చర్యతో కాపయనాయకుని రాజ్యం పేరుకు మాత్రమే మిగిలింది.

మహమ్మద్‌షా పరమ క్రూరుడు. విజయనగరంమీద దండెత్తి కృష్ణా–తుంగభద్ర నదుల మధ్య ప్రాంతాన్ని సర్వవిధాలా నాశనం చేశాడు. ఇతని దర్బారులో ప్రసిద్ధులైన ఉలేమాలు ఉండేవారని ప్రొఫెసర్ షేర్వానీ రాశాడు. మహమ్మద్‌షా 1375లో చనిపోయాడు.

మొదటి మహమ్మద్‌షా తరువాత ముజాయిద్‌షా రాజ్యానికొచ్చిడు. కృష్ణా-తుంగభద్ర అంతర్వేది విషయంలో బుక్కరాయలతో యుద్ధాలు చేసి ముజాయిద్‌షా రెండు సార్లు ఓడిపోయాడు. అవమాన భరితుడైన ముజాయిద్‌షాని దావూద్ అనే వాడు చంపివేసి రాజ్యాన్ని ఆక్రమించుకున్నాడు. ముజాయిద్‌కు సంతానం లేదు.

రాజ్యం కోసం రెండు వర్గాలు తలెత్తాయి. ఒక వర్గం దావూద్‌ని బలపరిస్తే మరొకవర్గం అల్లాఉద్దీన్ కనిష్ఠపుత్రుడిని బలపరిచింది. ఈ పెనుగులాటలో దావూద్‌షాకు పరాజయం లభించింది. అతడు నమాజు చదువుతున్నప్పుడు ఒక బానిస దావూద్‌ని హత్య చేశాడు. దావుద్‌షా పరిపాలన 35 రోజులు సాగింది.

బహమనీ రాజ్య ప్రతిష్ఠని కాపాడినవాడు రెండవ మహమ్మద్‌షా. ఇతని పరిపాలన 1378లో ప్రారంభమై 1397లో ముగిసింది. ఇతడు శాంతిప్రియుడు, దైవభక్తి, పాపభీతి కలవాడు. ప్రభుత్వ ఆస్తికి తను ధర్మకర్తగా భావించేవాడు. అతని కాలంలో దక్కన్‌లో భయంకరమైన కరువు వచ్చింది. పదివేల ఎడ్లపై మాల్వా, గుజరాత్ ప్రాంతాలనుంచి ధాన్యం తెప్పించే ఏర్పాటు చేశాడు. కాని, ఇతడు విషయలోలుడు. ఇతడు కూడా హిందువులను ఊచకోత కోయించినవాడే. ఇతని విజయాలకు సైఫ్ ఉద్దీన్ అనే ప్రధాని కారకుడు. సైఫ్ ఉద్దీన్ అయిదుగురు సుల్తాన్ల కాలంలో ప్రధానిగా పనిచేశాడు. పరిపాలనాదక్షుడనే పేరు తెచ్చుకున్నాడు. గుల్బర్గా, బీదరు, ఎలచ్‌పూర్, ఖందహార్, దౌలతాబాద్ మొదలైన పట్టణాలలో ఉచిత పాఠశాలలు నెలకొల్పాడు. అయితే ఇవి సెక్యులర్ పాఠశాలలు కావు. వాటిలో ప్రవేశం ముస్లిం ప్రజలకు మాత్రమే. కరువు కాలంలో ప్రభుత్వ సబ్సిడీలు ముస్లిం ప్రజలకు మాత్రమే లభించేవి. ఇతడు చేసిన మంచి పని ఏమిటంటే గుడ్డివాళ్ళకు ప్రత్యేక భత్యాలు జారీచేసేవాడు. దీన్ని అవకాశంగ తీసుకుని ఎంతోమంది కృత్రిమ అంధత్వం ప్రదర్శించి ప్రభుత్వ సౌకర్యాలు పొందేవారు. మహమ్మద్‌షా పరిపాలన 19 సంవత్సరాల 5 నెలల 21 రోజులు సాగింది. అతని అనంతరం అతని జ్యేష్ఠపుత్రుడు ఘియాసుద్దీన్ ఒక నెల 22 రోజులు, తరువాత మహమ్మద్‌షా కనిష్ఠపుత్రుడు షమ్షుద్దీన్ 7 రోజులు మాత్రమే రాజ్యమేలారు. అనంతరం అల్లాఉద్దీన్ హసన్ మనుమడైన ఫిరోజ్‌షాకు రాజ్యం లభించింది.

పరిపాలన సామర్థ్యం కలిగిన ఫిరోజ్‌షా అనతికాలంలోనే విషయలోలుడుగా మారిపోయాడు. అంతఃపురంలో ప్రతిరోజు ఎనిమిది వందల నెరజాణలను చేర్చుకునేవాడు. 1389లో రెండవ బుక్కరాయలు ముద్గల్‌ను స్వాధీనపరచుకొనడానికి రాయచూరు మీద దాడి చేశాడు. ధర్మయుద్ధంలో గెలవలేని ఫిరోజ్‌షా కుట్ర పన్ని రాయల కుమారుని హత్య చేయించాడు. పుత్రశోక నిరతుడైన రాయలు విజయనగరం తిరిగి ప్రయాణం కాగానే బహమనీ సైన్యం హిందూ ప్రజలను ఊచకోత కోసింది. 1420లో జరిగిన యుద్ధంలో ఫిరోజ్‌షాకు పరాజయం లభించింది. ఆ అవమానంతో ఫిరోజ్‌షా మంచం పట్టాడు. 25 సంవత్సరాలు రాజ్యమేలిన ఫిరోజ్‌షా 1422లో మరణించాడు. ఫిరోజ్‌షా తరువాత వచ్చిన రాజులెవరూ అంతటి సమర్థులు కారు.

ఫిరోజ్‌షా తరువాత రాజ్యానికొచ్చిన అహమ్మద్‌షా 1422నుంచి 1433వరకు రాజ్యమేలాడు. ఇతడు విజయనగరపు రాజులతో యుద్ధం చేసి కోల్పోయిన రాజ్యవిభాగాన్ని గెలుచుకున్నాడు. ఈ యుద్ధకాలంలో 20వేలమంది హిందువులు, ముస్లిం సిఫాయిల ఊచకోతకు గురైనారు. రాజధాని నగరాన్ని ఈ రాజు గుల్బర్గానుంచి బీదరుకు మార్చాడు. ఈ రెండు నగరాలు కూడా పూర్వపు నిజాంరాష్ట్రంలోనివే. 1436లో అధికారం హస్తగతం చేసుకున్న రెండవ అల్లాఉద్దీన్ బహుమన్‌షా 23 సంవత్సరాలు పరిపాలించాడు. కొంకణ దేశాన్ని జయించాడు. సంగమేశ్వరాన్ని పాలించే హిందూ రాజును ఓడించి అతని కూతురిని వివాహం చేసుకున్నాడు. అల్లాఉద్దీన్ ఇస్లాం మత పోషకుడు. బీదరులో అనేక పాఠశాలు, వైద్యశాలలు నిర్మించాడు. మత్తుపదార్థాలపై నిషేధాజ్ఞలు జారీచేశాడు. సోమరుల మెడలకు గొలుసులు తగిలించి వాళ్ళని వీధులు శుభ్రపరిచే పనికి పెట్టాడు. పని చేయనివారికి దేశబహిష్కరణ ఆంక్ష విధించాడు. విజయనగరం రాజుతో ఒకసారి గెలిచి మరొకసారి ఓడిపోయాడు. ఓటమి బాధను భరించలేక మధుపాన లోలుడై మరణించాడు.

హుమాయూన్ 'జాలిమ్' (క్రూరుడు):

అల్లాఉద్దీన్ అహమ్మద్‌షా జ్యేష్ఠపుత్రుడు హుమాయూన్‌షా యువరాజుగా ఉన్నప్పుడే అనేక క్రూర చర్యలు చేసి అమీర్లను భయభ్రాంతుల్ని చేశాడు. ఈ క్రూరునికి రాజ్యం లభించకుండా అమీర్లు చేసిన ప్రయత్నాలు ఫలించలేదు. దీన్ని తెలుసుకున్న

హుమాయూన్ కుపితుడై తనకు రాజ్యం దక్కకుండా ప్రయత్నించిన అమీర్లను ఊచకోత కోయించాడు.

దక్కన్ చరిత్రలో హుమయూన్‌షా అంతటి క్రూరుడు మరొకడు లేడు. తనపై ధిక్కార ధోరణిని ప్రదర్శించిన వారిని పట్టుకొని నిర్దాక్షిణ్యంగా ఏనుగుల కాళ్ళకు కట్టించి పురవీథులలో ఈడ్చుకుపోయాడు. సలసలకాగే నూనెలో పడదోయించాడు. ఆకలిగొన్న పులులకు ఆహారంగా ఇచ్చాడు. ఈ చర్యలు చూసి రాక్షసానందం పొంది వికటాట్టహాసం చేసేవాడు. వివాహమైన తొలిరాత్రి ప్రతి పెళ్ళికూతురు అతని కామానికి బలికావలసి వచ్చింది. ప్రజల హాహా కారాలు మిన్నుముట్టాయి. ఒకరోజు బాగా తాగి మైకంలో సుఖనిద్రపోతున్న అతన్ని హాబాషి ఉంపుడు కత్తె బలంగా నెత్తిమీద ముష్టిఘాతాలు తగిలించి, ఈ లోకకంటకుని హత్యచేసింది. హుమయూన్ షా మూడు సంవత్సరాల ఆరు నెలలు రాజ్యంలో ఉన్నాడు.

హుమాయూన్ షా అనంతరం రాజ్యాధికారం వహించిన నిజాంషా బహమనీ ఎనిమిదేళ్ళ బాలుడు. కొద్దికాలము తరువాత అతని సోదరుడైన మూడో మహమ్మద్ 1463లో గద్దె నెక్కాడు.

మహమ్మద్ గవాన్ సంస్కరణలు:

భారతదేశ చరిత్రలో పరిపాలన దక్షత ప్రదర్శించిన ప్రధానమంత్రులతో ఖాజా మహమ్మద్ గవాన్ ఒకడు. గవాన్ తండ్రి తాతలు ఇరాన్ దేశ గిలాన్‌షా వద్ద వజీర్లుగా పనిచేశారు. గవాన్ తన 45వ ఏట ఇరాన్ నుంచి దక్కన్ కొచ్చాడు. రెండవ మహమ్మద్ షా ఇతనికి అమీర్ పదవినిచ్చి గౌరవించాడు. హుమాయూన్‌షా కాలంలో మలక్-ఉల్-తుజార్ అనే బిరుదు పొందాడు. మూడవ మహమ్మద్‌షా ఇతనికి ప్రధాని పదవి ఇచ్చాడు. ఈనాడు డిక్టేటర్లకుండే అధికారాలన్నీ ఆనాడు గవాన్‌కు హస్తగతమైనాయి. కానీ అతడు తన జీవితకాలంలో స్వామిభక్తి పరాయణుడుగానే మిగిలిపోయి రాష్ట్రానికెంతో సేవచేశాడు.

బహమనీ సుల్తాన్ల కాలంలో విదేశీ అమీర్లు బలవంతులైపోయారు. కొరాసి నేవియన్ తెగకు చెందిన మలిక్ తుచార్ అనే అమీరు, రెండు లక్షల సైన్యానికి

అధిపతి. ఇలాంటివారు మరికొందరు ఉండేవారు. ఈ అమీర్లు తలచుకుంటే రాజును పదవీభ్రష్టున్ని చేయగలిగిన బలవంతులు. గవాన్ ప్రధానికాగానే రాజ్యానికి అపాయకరంగా మారిన అమీర్ల బలాన్ని తగ్గించి వారివద్ద ఉన్న సైన్యాన్ని ఉపసంహరింపజేసి దాన్ని ప్రభుత్వాధీనంలోకి తెచ్చుకొని బి గ్రేడ్లుగా విభజించాడు. సైనికులలో క్రమశిక్షణకి గట్టి చర్యలు తీసుకున్నాడు. సైన్యాన్ని అజేయశక్తిగా రూపొందించాడు.

అమీర్ల బెడద పోగానే గవాన్ సంస్కరణలపై దృష్టి సారించాడు. పరిపాలనా యంత్రాంగంలో అనేక మార్పులు తీసుకువచ్చాడు. భూములను సర్వే చేయించాడు. లంచగొండితనం రూపుమాపడానికి కఠిన చర్యలు తీసుకున్నాడు. బీదర్ నగరంలో అనేక పాఠశాలలు నెలకొల్పాడు. రాజమండ్రి, కొండవీడులను ఆక్రమించుకున్నాడు. 1475లో దక్కనులో భయంకరమైన క్షామమేర్పడింది. దాన్ని ఆసరాగా తీసుకొని ఒరిస్సా రాజు తెలంగాణాపై దాడి సల్పాడు. దాన్ని మహమ్మద్‌షా తిప్పికొట్టి ఒరిస్సా రాజులకు తెలంగాణాలో ఏమాత్రం హక్కులేదని ఒక పత్రం రాయించుకున్నాడు. బహమనీల నుంచి నిజాముల వరకు తెలంగాణాలో దాదాపు 600 సంవత్సరాలు ముస్లింల పాలన కొనసాగింది.

ఎన్నో ఆదర్శాలను పుణికిపుచ్చుకున్న మహోన్నత వ్యక్తి గవాన్. అధికారం చేతిలో ఉన్నదని ఎన్నడూ విర్రవీగలేదు. కటికనేలపై పరుండేవాడు. మట్టిపాత్రలలో భుజించేవాడు. అనేక దానధర్మాలు చేశాడు. బీదరు నగరంలో ఒక ఉన్నత గ్రంథాలయం ఏర్పాటు చేసి అందులో అపురూపమైన మూడువేల గ్రంథాలను సమకూర్చాడు. ఇంతటి సద్గుణ సంపన్నుడైన వ్యక్తి మత సహనం ప్రదర్శించలేక పోయాడు. ఇతడు కూడా దండయాత్రల దారులలో అనేక దేవాలయాలను కూలదోయించినవాడే.

బహమనీ రాజుల కాలంలో పర్షియా నుంచి వచ్చి స్థిరపడిపోయిన వారి సంఖ్య ఎక్కువ. అలా వచ్చినవారిలో ఆబాషీలు, ఆపాకీలు ముఖ్యులు. వారు షియా మతస్థులు. సుల్తాన్లు వీరి యెడల ఆదరం చూపి పెద్ద పెద్ద ఉద్యోగాలిచ్చేవారు. వీరు దక్కనుకొచ్చి సూఫీమతాన్ని అవలంబించారు.

ఇస్లాంలోని సాత్విక మతధోరణికి వీరు ప్రతినిధులు. ఢిల్లీ సుల్తాను ప్రతినిధులుగా దక్కనులో స్థిరపడినవారు సున్నీలు. వీరికి మతద్వేషం హెచ్చు. బహమనీ రాజ్యంలో షియా, సున్నీల మధ్య తగాదాలు తీవ్రస్థాయికి చేరుకున్నాయి. ఈ మత విద్వేషాలకు గవాన్ దూరంగానే ఉన్నా అతని ప్రాముఖ్యం పెరగడం దక్కను అమీర్లకు ఇష్టంగా ఉండలేదు. కుట్రలతో అతన్ని మట్టుబెట్టాలనుకున్నారు. ఒరిస్సా రాజులతో కుట్రపన్ని గవాన్, సుల్తాన్ను పదభ్రష్టున్ని చేయడానికి పన్నాగాలు చేస్తున్నాడని వదంతులు వ్యాప్తింపచేశారు. ఈ వదంతులు నమ్మి, ఇంతకాలం తన రాజ్యాన్ని కంటికి రెప్పలా కాపాడుకుంటూ వచ్చిన మహమ్మద్ గవాన్‌ను సుల్తాన్ హత్య చేయించాడు. గవాన్ హత్యతో బహమనీ రాజ్యం పునాదులు కదలిపోయాయి. అధికారాన్ని స్వార్థపరులైన అమీర్లు తిరిగి స్వాధీనపరచుకున్నారు. నిజం తెలుసుకున్న సుల్తాన్ కుమిలి కుమిలి మరణించాడు. మహమ్మద్‌షా తరువాత వచ్చిన రాజులు అసమర్థులు, విషయలోలురు. బహమనీ రాజ్యాన్ని పాలించిన చివరి రాజు కరీముల్లా. ఇతడు మూడు సంవత్సరాలు నామమాత్రపు ప్రభువుగా ఉండి 1527లో చనిపోయాడు. దీనితో బహమనీ రాజ్యం అస్తమించింది. బహమనీ రాజ్యం పతనంతో ప్రాంతీయ సుబేదార్లు స్వతంత్రులైనారు. బీదరులో బురీద్‌షాహీ, గోల్కొండలో కుతుబ్‌షాహీ, బీజాపూర్‌లో ఆదిల్‌షాహీ, అహమ్మద్‌నగర్‌లో నిజాంషాహీ, బిరారులో ఇమాద్‌షాహీ రాజ్యాలు తలెత్తాయి.

బహమనీ రాజ్యాన్ని 17మంది సుల్తాన్లు 182 సంవత్సరాలు పరిపాలించారు. అందులో అయిదుగురు హత్యకు గురి అయ్యారు. ఇద్దరు విషయ లోలురై మరణించారు. ముగ్గురు పదవీభ్రష్టులైనారు. ఇద్దరు అంధులు కావింపబడ్డారు. విజయనగరం రాజులతో పోరాటమే బహమనీ రాజుల కర్తవ్యమైనది.

బహమనీ, విజయనగర రాజుల యుద్ధాలు చాలావరకు ఆర్థిక, రాజకీయ కారణాలతో వచ్చినవే. సైనికులను ఆవేశపరచడానికి ఇరువైపులవారు మతాన్ని వాడుకున్నారు. తమశక్తినంతా ధారపోసినా బహమనీ సుల్తాన్లు విజయనగరాన్ని ఆక్రమించలేకపోయారు. బహమనీసుల్తాన్లు నడిపిన దండయాత్రలను తిప్పికొట్టి తమ ఆత్మగౌరవాన్నీ స్వాతంత్ర్యాన్ని విజయనగర రాయుళ్ళు నిలబెట్టుకున్నారు.

సూఫీభక్తితత్వం:

పదకొండవ శతాబ్దిలో పర్షియా మొదలైన మధ్యదేశాల నుండి వచ్చిన మహమ్మదీయులలో కొందరు సూఫీలు. వారు సోదరభావం ప్రదర్శించి హిందువులను ఆకట్టుకున్నారు. సూఫీమతంలో ప్రేమతో భగవంతునికి ఆత్మార్పణం కావించుకోవడం ముఖ్యం. భగవంతునిపై నిజమైన ప్రేమ ప్రదర్శించిన వారే భగవంతునికి దగ్గరవుతారని సూఫీతత్వం బోధిస్తుంది. భగవత్ ప్రార్థన, ఉపవాసాలు, నోములు మొదలైనవి వారి దృష్టిలో ముఖ్యమైనవి కావు. దేవునిమీద ప్రేమ కలిగి ఉండటం కారణంగా సూఫీ మతతత్వం ఇతర మతాలను ద్వేషించలేదు. మతాలన్నీ భగవంతుని దగ్గరకు తీసుకుపోయే విభిన్న మార్గాలని వారి విశ్వాసం. మానవత్వమే వారి ప్రధాన లక్ష్యం.

దక్కనులో హిందూ–ముస్లింల సమ్మేళనం ఫిరోజ్‌షా బహమనీ కాలంలో మొదలైంది. అతని తమ్ముడు అహమ్మద్ కాలంలో బహుముఖంగా విస్తరిల్లి వేళ్ళు తన్నుకుంది. అహమ్మద్ వర్ధంతిని భారతీయులు పంచాంగం లెక్కల ప్రకారం జరుపుకుంటారు. హిందువులు అహమ్మద్‌ను ఒక సంత్‌గా భావించి భక్తి ప్రపత్తులతో కొబ్బరికాయలు, పూలతో పూజిస్తారు. ఈ ఉర్సు జరిపే పురోహితుడు గుల్బర్గాకు చెందిన లింగాయత్ జంగము. దక్కను పరిపాలకుల కాలంలో పండరీపురం సంప్రదాయంపైకి వచ్చింది. ఏకేశ్వరవాదులైన ఈ సంప్రదాయవాదులు అన్యధర్మస్థులైన పాలకులతో కలిసి మెలసి ఉండి, ఈ పండరీపురం సంప్రదాయానికి దోహదం కలిగించారు. ఈ సంప్రదాయ ప్రవక్తుడైన జ్ఞానేశ్వరుడు గొప్ప భక్తుడు. ఇతని బోధనవల్ల ఒక కొత్త చైతన్యం, జీవకళ ఏర్పడింది. జాతివల్లనే మానవుడు గొప్పవాడు కాదని, భగవంతుని దృష్టిలో ప్రజలందరూ సమానులేననీ జ్ఞానేశ్వరుడు బోధించాడు. కర్నూలు జిల్లా శ్రీశైలంలో 'నాద' సంప్రదాయం వెలిసింది. ఈ మత ప్రవక్తలైన యోగులు, జ్ఞానమార్గాన తమ ధర్మం ప్రచారం చేసుకున్నారు. 15వ శతాబ్దంలో దక్కనులో దత్తాత్రేయ సంప్రదాయం ప్రబలమైంది. దత్తాత్రేయుని భక్తులలో ఎందరో ముస్లింలు ఉండేవారు. వారు 'షాహీపకీర్లు'గా ప్రఖ్యాతులు.

బహమనీ సుల్తాన్లు ఉర్దూ భాషను పోషించారు. ఆ రోజులలో ఈ భాషను 'హిందవీ' అనేవారు. హిందువులను బలవంతంగా ఇస్లాంలోకి మార్చడానికి బహమనీ రాజుల కాలంలో ప్రయత్నాలేవీ జరుగలేదు. ఢిల్లీ సామ్రాజ్యానికి వ్యతిరేకంగా ఒక

స్వతంత్ర రాజ్యంగా బహమనీ రాజ్యం ఏర్పడటం తమకు మంచిదేనని ఓరుగల్లును పాలించిన కాపయ నాయకుడు భావించి ఈ దృష్టితో ఆ ప్రయత్నాన్ని బలపరిచాడు. గుల్బర్గా, ఓరుగల్లు రాజ్యాలు ఇరుగు పొరుగున సహజీవనం చేయగలవని ఆశించాడు. ఈ ఆశ కొద్ది కాలంలోనే భగ్నమైంది. పిమ్మట ఓరుగల్లు రాజ్యం బహమనీల వశమైంది.

బహమనీ రాజ్యంలో అధిక సంఖ్యాక ప్రజలు హిందువులు. సుల్తాన్లు ప్రజల ధార్మిక జీవనంలో జోక్యం కలిగించుకోలేదు. ప్రజలు ఎవరి ఇష్టానుసారం లింగాయతులై, వీరశైవులై, జైనులై, మహానుభావ పంథానుయాయులై జీవించేవారు. ప్రజలు తమ ఆహారంలో వరి అన్నం, పప్పులు, పెరుగు, మజ్జిగ, ఆకుకూరలు వాడేవారు. జొన్నలు, సజ్జలు కూడా ఉపయోగించేవారు. తాంబూల చర్వణం సర్వసామాన్యం. గోధుమలను పాలలో ఉడికించి కిచిడి చేసుకునేవారు. బ్రాహ్మణులు శాకాహారులు, మధుపాన విసర్జితులు. రెడ్లు, వెలమలు, మరాఠీలు మొదలైన పాలకవర్గం వారు మాంసాహారులు. హిందూ స్త్రీలకు పరదా నియమం లేదు. వారిలో బాల్య వివాహాలు ఆచరణలో ఉండేవి. సతీసహగమనం పాటించేవారు. నౌకానిర్మాణాన్ని బాగా వృద్ధిలోకి తెచ్చారు బహమనీలు. వీరి కాలంలో నిర్మించిన ఓడలు ఇటలీదేశపు ఓడల కన్న నాణ్యతలో మెరుగైనవి, ఆకారంలో పెద్దవి. భారతీయ సైనికులు కత్తులు, బల్లేలు, బాకులు, ధనుర్బాణాలు ఆయుధాలుగా ఉపయోగించేవారు. అంతకన్న ఎక్కువ ప్రమాదకరమైన ఆయుధాలతో శత్రుసంహారం చేసేవారు. బహమనీలు హిందువుల కోసం వైదిక పాఠశాలలు, ముస్లింల కోసం మక్తబ్‌లు నిర్మించారు. బహమనీ సుల్తానులతోనే దక్కనులో ముస్లిం రాజుల శకం ప్రారంభమైంది. ❑

9. కుతుబ్‌షాహీ నవాబులు

పదహారవ శతాబ్ది తొలినుంచి పదిహేడవ శతాబ్ది చివరివరకు గోలకొండ రాజధానిగా దక్కనుపాలించినవారు కుతుబ్‌షాహీ నవాబులు. ఈ వంశ స్థాపకుడైన సుల్తాన్ కులీ ఇరాన్‌లోని అమ్దాన్ రాజవంశానికి చెందినవాడు. అదృష్టం అతణ్ణి భారతదేశానికి తీసుకువచ్చింది. మహమ్మద్‌షా బహమనీ కొలువులో ప్రవేశించి తన ఉదాత్త గుణసంపదతో త్వరలోనే బహమనీ దర్బారులో ప్రముఖస్థానం పొందాడు.

1493లో తెలంగాణా గవర్నరు కుతుబుల్ ముల్క్ మరణించాడు. సుల్తాన్ కులీకి కుతుబుల్ ముల్క్ బిరుదునిచ్చి తెలంగాణా గవర్నరుగా మహమ్మద్‌షాని నియమించాడు. తెలంగాణా సూబా అంటే గోలకొండ వరంగల్ మధ్య విభాగం. 1500 సంవత్సరం వచ్చే సరికి బహమనీ రాజ్యం చీలిపోయి ఐదు స్వతంత్ర ముస్లిం రాజ్యాలేర్పడ్డాయి. 1) అహమద్ నగర్, 2) బీజాపూర్, 3) బీరారు, 4) బీదరు, 5)గోల్కొండ. కులీ 1512లో స్వతంత్ర్యం ప్రకటించి కుతుబ్‌షాహీ రాజ్యం స్థాపించాడు.

సుల్తాన్ కులీ కుతుబ్‌షా:

బహమనీ కాలంలో వరంగల్లు పరిసరాలకే పరిమితమైన రాజ్యాన్ని వరంగల్ సరిహద్దునుంచి మచిలీపట్నం వరకు, గోల్కొండ నుంచి రాజమహేంద్రం వరకు తన రాజ్యాన్ని విస్తరించాడు. మట్టికోటగా నిర్మితమై మళ్ళీ రాజవైభోగాన్ని సంతరించుకున్న గోల్కొండ కోట అభివృద్ధికి సుల్తాన్ కులీ ప్రముఖ పాత్ర పోషించాడు.

సుల్తాన్ కులికి ఆర్గురు కుమారులు. పరస్పరం పోట్లాడుకుంటుండేవారు. పెద్దకుమారుడు హైదర్ కులీ తండ్రి ఉండగానే చనిపోయాడు. రెండవ కుమారుడు కుతుబుద్దీన్ మెత్తని స్వభావుడు, అసమర్థుడు. పరిపాలనా దక్షత లేనివాడు. మూడవ కుమారుడు యూర్‌కులీ (జంషీద్ కులీ) పరిపాలనా విషయాలు క్షుణ్ణంగా తెలిసినవాడు. క్రూరుడు, దుర్మార్గుడు, కఠిన హృదయం కలవాడు.

నాల్గవ కుమారుడు అబ్దుల్ కరీం. రాజ్యవ్యవహారాలు తెలిసినవాడు. కాని తీవ్ర స్వభావి. తండ్రి ఉండగానే రాజ్యాధికారం కోసం ప్రయత్నించి బీజాపూర్ సుల్తాన్ సహాయంతో గోల్కొండ ముట్టడించడానికి ప్రయత్నించి బీజాపూర్ వద్ద మరణించాడు. ఐదవ కుమారుడు దౌలత్ కులీ. తెలివిగలవడే కాని ఉద్రేక స్వభావి. ఆరవ కుమారుడు ఇబ్రహీం కులీ ఉన్నతభావాలుగలవాడు. పరిపాలనాదక్షుడు. దేవరకొండ దుర్గం రాజప్రతినిధిగా ఆ ప్రాంత పాలన వ్యవహారాలను నిర్వహించాడు. అసమర్థులు, పరస్పర జుగుప్సాపరులైన యార్ కులీని భువనగిరి దుర్గంలో, దౌలత్ కులీని గోల్కొండ కోటలో సుల్తాన్ బంధించి ఉంచాడు. బందీఖానాలో ఉంటూనే యార్ కులీ కుట్రలు మాన లేదు. తన ఆంతరంగికుడైన మీర్ మహమూద్ హందానీని తండ్రిని చంపమని పంపాడు.

ఆ రోజు సుల్తాన్ కులీ మజ్జీద్ సఫాలో నమాజు చేసుకున్న తరువాత కూలీలకు, మేస్త్రీలకు మసీదు కొన్ని భాగాల నిర్మాణం గురించి సలహాలిస్తున్న సమయంలో మీర్ మహమద్ హందాని తల్వార్‌తో దూసుకువచ్చి శతవృద్ధుడైన సుల్తాన్ కులీ శిరస్సు ఖండించాడు. అనుజుడైన కుత్బుద్దీన్ కళ్ళు పెరికించి కారాగారంలో పడదోసి జమ్షీద్ కులీకుతుబ్‌షా గోల్కొండ సింహాసనం అధిష్ఠించాడు.

జమ్షీద్ కులీ కుతుబ్‌షా (1543-50):

1543లో యార్ అలీ జంషీద్ కుతుబ్‌షా పేరుతో గోల్‌కొండ సింహాసనాన్ని అధిష్ఠించాడు. బీదరు సుల్తాను అలీ బరీద్ సహాయంతో ఇబ్రహీం గోల్కొండ ఆక్రమించు కోవాలని చేసిన ప్రయత్నం ఫలించలేదు. గోల్కొండ సైనికులు విజృంభించి పోరాడి బరీద్ సైన్యాన్ని బీదరు వరకు తరిమి కొట్టారు. అలీ బరీద్‌షా భాండాగారాన్ని కొల్లగొట్టి అపార ధనాన్ని సంపాదించాడు.

ఓడిపోయిన ఇబ్రహీం విధిలేక తన అనుచరులతో విజయనగరం పారిపోయాడు. రామరాయలు ఇబ్రహీం కులీని సాదరంగా ఆహ్వానించి కొన్ని జాగీర్లిచ్చి సత్కరించాడు. ఏడేండ్లు విజయనగర రాజ్యంలో ఉండడంవల్ల తెలుగు సాహిత్య సంస్కృతుల ప్రభావం ఇబ్రహీం మీద ఎక్కువగా పడింది. ఆ తరువాత గోల్కొండ రాజ్యంమీద పడింది. ఏది ఏమైనా ఇబ్రహీం వెళ్ళిపోవడం జమ్షీద్‌కి మేలే అయింది.

జమ్‌షీద్ ఏడేండ్ల పాలనలో యుద్ధాలతో జనం విసుగెత్తిపోయారు. మానసికంగా జమ్‌షీద్‌లో కూడా క్రమంగా మార్పులు రాసాగాయి. అందరినీ మానసికంగా హింసించే స్థితికి చేరుకున్నాడు. అతను పెట్టే బాధలు భరించలేక కొలువులో పని చేసేవాళ్ళు కూడా కొంతమంది ఇతర ప్రాంతాలకు వెళ్ళిపోయారు.

జమ్‌షీద్ పరిపాలనాదక్షుడు. కాని కఠినహృదయుడు, నిర్దయుడు, నిరంకుశుడు. సామాన్యమైన నేరాలకు కూడా కఠినాతి కఠినమైన శిక్షలు విధించి పరమ క్రూరుడనిపించుకున్నాడు. జమ్‌షీద్ కవి. కవి పండితులను ఆదరించాడు. క్షయ వ్యాధితో కృశించి 1550లో చనిపోయాడు.

ఇబ్రహీం కులీ కుతుబ్‌షా

జంషీద్ మరణానంతరం అతని తనయుడు సుభాన్ కులీ సప్తవార ప్రాయుడు కావడంతో రాణి బిల్‌కిస్‌జమాన్ రాజ్యపాలన సాగింది. ముస్తఫా, సలాబత్ ఖాన్‌లు రాజమాతకు సలహాదారులుగా ఉండేవారు. రాజ్యపాలన వ్యవహారాలను సైఫ్‌ఖాన్ ఐనుల్ముల్క్ నిర్వహించేవాడు. ఇతని పరిపాలన వ్యవహారాలు నచ్చని సర్దార్లు ముఖ్యంగా జగదేవుడు అనుచరులు భువనగిరి కోటలో కారగార శిక్ష అనుభవిస్తున్న దౌలత్ కులీని బంధవిముక్తుణ్ణి చేసి సుల్తాన్‌గా ప్రకటించారు. ఈ లోపలే సైఫ్‌ఖాన్ గోల్కొండ చేరి పాలనా వ్యవహారాన్ని చేజిక్కించుకున్నాడు. రాణికి రాకుమారునికి గట్టి భద్రత కలిగించాడు. సైఫ్‌ఖాన్, భువనగిరి కోటను ముట్టడించి జగదేవరావు సైన్యాన్ని చిత్తుచేసి కోటను స్వాధీనం చేసుకున్నాడు. సైఫ్‌ఖాన్ తనకు ఎదురులేదనే ధీమాతో విర్రవీగడం ప్రారంభించాడు. ఎవరినీ లక్ష్యపెట్టేవాడు కాడు. ఇతని ప్రవర్తనతో విసిగిపోయిన వారు ఇబ్రహీం కులీని గోల్కొండకు రప్పించి అతని చేతుల్లో రాజ్యంపెట్టాలనుకున్నారు. ఈ వినతులు అందుకున్న ఇబ్రహీం కులీ విజయనగరం రాజు దగ్గర సెలవు తీసుకుని గోల్కొండకు బయలుదేరాడు. కొంత ప్రతిఘటన ఎదురైనా 1550లో గోల్కొండ సింహాసనాన్ని ఇబ్రహీం కులీ అధిష్ఠించగలిగాడు. గోల్కొండ రాజ్యంలో అరాచక శక్తులు విజృంభించిన విషమకాలంలో రాజైన ఇబ్రహీం దొంగల బారినుంచి ప్రజలకు విముక్తి కలిగించే కఠిన చర్యలు తీసుకున్నాడు. విజయనగర రాజ్యపరిపాలనాపద్ధతులను ఒక్కొక్కటే తన రాజ్యంలో ప్రవేశపెట్టి పరిపాలనలో నూతన ఒరవడి పెట్టాడు. వేగులవాళ్ళ ద్వారా ప్రజా సమస్యలను తెలుసుకొని తగు చర్యలు తీసుకున్నాడు.

చోరుల బాధ తప్పడంతో వర్తక వ్యాపారాలు వృద్ధి కాజొచ్చాయి. సరిహద్దు దళాల సంఖ్య పెంచి రాష్ట్ర సరిహద్దులను గట్టిగా కాపాడాడు. హైదరాబాద్‌లో హుసేన్‌సాగర్ చెరువు ఇతడు నిర్మించిందే.

విజయనగరం, బీజాపూర్ రాజులపైగల కోపం కారణంగా గోల్కొండ, అహమద్‌నగర్ రాజులు ఏకమైనారు. దానికి తోడు నిజాంషా తన సోదరి బీబీజమాల్‌ను ఇబ్రహీం కుతుబ్‌షాకిచ్చి వివాహం జరిపించాడు. వీరిద్దరు బీజాపూర్ రాజ్యభాగమైన కల్యాణిపై క్రీ.శ. 1562లో దండెత్తారు. కాని రామరాయల సేన బీజాపూర్ సుల్తాన్‌కు మద్దతుగా నిలచి అహమద్‌నగర్‌ను ముట్టడించింది. రామరాయలు అధికారము నానాటికి పెరగడం చూసి సహించలేకపోయాడు ఇబ్రహీం కుతుబ్‌షా. రెండు దశాబ్దాల తరబడి, దక్కను సుల్తాన్లు తన నీడలో నడచినట్లు చేసుకున్నాడు రామరాయలు. పొరుగునున్న ముస్లిం రాజ్యాలకు హిందూ విజయనగరశక్తి మళ్ళీ మళ్ళీ అవమానాలనే ప్రసాదించింది. ఇబ్రహీం కుతుబ్‌షా ఈ హిందూశక్తిని నాశనం చేయదలచినాడు. సుల్తానులందరిని ఏకత్రాటిపై నడిపించే ప్రయత్నాలు ప్రారంభించాడు. తరచుగా పోరాటాలకు దిగుతున్న బీజాపూర్, అహ్మద్‌నగర్ సుల్తానులను మిత్రులుగా మార్చడానికి తన రాయబారిని రెండు ఆస్థానములకు పంపి రెండు రాజవంశాల మధ్య వివాహ సంబంధాలేర్పాటు చేశాడు. హుసేన్ నిజామ్‌షా సోదరి చాంద్‌బీబీని అలీ ఆదిల్‌షాకి అలీ ఆదిల్‌షా సోదరిని నిజాంషా కుమారుడు ముర్తాజీకిచ్చి పెళ్ళి కుదిర్చాడు. వీరితో బీదర్ అలీ బరీద్‌షా చేరాడు. వీరందరూ రామరాయల నెదిరించే కూటమిగా ఏర్పడ్డారు.

రక్షసతంగడి వద్ద 1564 డిసెంబరులో జరిగిన ఘోరయుద్ధంలో రామరాయలు ఓడిపోయాడు. రామరాయల శిరస్సును ఖండించి ముస్లిం సేన విజయ ఢంకా మోగించింది. విజయనగర పతనానికి ఇబ్రహీం కుతుబ్‌షా ప్రధాన బాధ్యత వహించాడు. రక్కసితంగడి యుద్ధానంతరం ముస్లిం రాజ్యాల మైత్రి ఎక్కువ కాలం నిలవలేదు. నిజాంషా సైన్యాలు తెలంగాణాను ఆక్రమించుకునే ప్రయత్నం చేశాయి. ఇబ్రహీం రాజ్యంలోని కౌలాస్ దుర్గం సర్వనాశనమైంది. 1574లో బీదరు రాజ్యం అహమద్‌నగర్ రాజ్యంలో కలిసిపోయింది. వీరి అంతఃకలహాలతో ఇబ్రహీం లాభపడ్డాడు. తీరాంధ్రదేశాన్ని జయించాలనే కోరికతో 1572లో రాజమహేంద్రవరం,

కాశింకోట, వీరఘట్టం ముట్టడించాడు. 1575 నాటికి వినుకొండ, కొచ్చర్లకోట, కంభం, కొండవీడు ప్రాంతాలు గోలకొండ రాజ్యంలో చేరిపోయాయి.

ఇబ్రహీం కుతుబ్‌షా దూరదృష్టి, రాజకీయ చతురత, పరిపాలనాదక్షత గోల్కొండ విస్తృతికి తోడ్పడ్డాయి. పటిష్టమైన వేగుల శాఖను ఏర్పాటు చేసుకుని ఎప్పటికప్పుడు తన రాజ్యంలో ఎవరేమనుకుంటున్నారో, ఏం చేస్తున్నారో తెలుసుకొని తగిన చర్యలు తీసుకునేవాడు. ప్రజలకు రక్షణ కల్పించి, శాంతిభద్రతలు కాపాడాడు. మచిలీపట్నం-గోల్కొండ రహదారులలో దొంగల భయం ఉండేది. దాన్ని తొలగించాడు. 1550 నాటికి గోల్కొండ పట్టణం పెద్దవ్యాపార కూడలిగా మారింది. నగర విస్తరణ అవసరమైంది. మూసీనది ఒడ్డున నగరం పెరగడం ప్రారంభమైంది. 1550లో రాజ్యానికొచ్చిన ఇబ్రహీం కుతుబ్‌షా 1580లో మరణించాడు.

మహమ్మద్ కులీ కుతుబ్‌షా (1580-1612):

ఇబ్రహీం కుతుబ్‌షా తరువాత అతని మూడవ పుత్రుడు మహమ్మద్ కులీ కుతుబ్‌షా గోల్కొండ సింహాసనం అధిష్ఠించాడు. గోల్కొండ జనాభా క్రమంగా పెరుగుతూ వచ్చింది. అనేక ప్రాంతాల నుంచి ప్రజలు వలస వచ్చారు. మచిలీపట్నం, శ్రీకాకుళం ప్రధానరేవు పట్టణాలుగా ఎగుమతి, దిగుమతి వ్యాపార కేంద్రంగా ఉన్నాయి. కాబట్టి మూసీకి దక్షిణాన మచిలీపట్నం దారిలో పురానపూల్‌కి సమీపంలో నూతన భవనాలు నిర్మించడానికి నిర్ణయం జరిగింది. 1591లో మొహరం తరువాత మూసీకి దక్షిణాన పురానపూల్ బ్రిడ్జి పక్కన మహమ్మద్ కులీ హైదరాబాద్ నగరానికి శంఖుస్థాపన చేశాడు. చార్మినార్ కేంద్ర బిందువుగా కొత్త నగర నిర్మాణం జరిగింది. ఈ నూతన నగర నిర్మాణ బాధ్యతను తన ప్రధానమంత్రి మీర్‌మోమిన్‌పై పెట్టాడు.

కుతుబ్‌షాహీల నగర నిర్మాణ కౌశలము, వాస్తు శిల్పుల ప్రతిభా పాటవము నేటికీ కనువిందుగా కనిపిస్తుంది. చార్మినార్‌కు పైభాగాన పశ్చిమ దిశలో వందమందికి పైగా నమాజు చేసుకునే విధంగా మసీదు నిర్మించారు. నమాజ్‌కు ముందు వజూ చేసుకోవడానికి గ్రౌండ్‌ఫ్లోర్‌లో వాటర్‌హౌజు ఉంది. కులీ కుతుబ్‌షా చార్మినార్‌ను ఓ వినూత్నమైన సంకల్పంతో కట్టించాడు. అప్పటి పరిస్థితులలో అతి భయంకరంగా వ్యాపిస్తూ ఇటు ప్రజలకు, అటు పరిపాలనా యంత్రాంగాన్ని ముప్పుతిప్పలు పెట్టిన

ప్లేగు వ్యాధికి వ్యాధి నిరోధకాన్ని కనుగొన్నందుకు గుర్తుగా ఈ చార్మినార్‌ను నిర్మించినట్లు చరిత్ర చెబుతుంది.

మహమ్మద్ కులీ కుతుబ్‌షా కాలంలోనే దక్షిణాది రాజ్యాలపై మొగల్ చక్రవర్తుల కన్ను పడింది. అక్బర్ చక్రవర్తి భారతదేశమంతటినీ మొగల్ పాలనలోకి తీసుకు రావడానికి ప్రయత్నాలు ప్రారంభించాడు. గుజరాత్, మాళవాలను జయించి ఖాందేష్‌ను వశపరచుకున్నాడు. 1595లో అహమద్‌నగర్ మొగలుల వశమైంది. మసూద్ బేగ్ మొగల్ సామ్రాజ్య ప్రతినిధిగా గోల్కొండలో నియమింపబడినాడు. అక్బర్ చక్రవర్తి మైత్రిని కోరి కుతుబ్‌షా అమూల్యమైన బహుమతులు సమర్పించాడు. 1605లో అక్బర్ చనిపోయాడు. జహాంగీర్ మొగల్ సామ్రాజ్యాధినేత అయ్యాడు. 1606 నాటికే పాశ్చాత్య వర్తక సంఘాలు దక్కనులో ప్రవేశించి వాణిజ్యం ప్రారంభించాయి. డచ్ కంపెనీ మచిలీపట్నం, నిజాంపట్నం, పులికాట్ రేవుల్లో స్థావరాలను ఏర్పరచుకుంది. తరువాత బ్రిటిష్‌వారు ప్రవేశించారు.

సుల్తాన్ మహమ్మద్ కుతుబ్‌షా (1612–1626):

మహమ్మద్ కులీ కుతుబ్‌షా తన సోదరుడి కుమారుడైన సుల్తాన్ మహమ్మద్‌తో తన కుమార్తె హయత్ బక్షీ బేగమ్ పెళ్ళి జరిపించాడు. 1612లో మహమ్మద్ కులీ కుతుబ్‌షా మరణించాడు. ఇతని తరువాత అల్లుడు సుల్తాన్ మహమ్మద్ గోల్కొండ రాజ్యాన్ని చేపట్టాడు. సుల్తాన్ మహమ్మద్ కుతుబ్‌షా విద్యావంతుడు. కవిపండితుల నాదరించాడు. స్వయంగా పారశీక భాషలో కవిత్వం చెప్పేవాడు. ఉర్దూ, పారసీ, తెలుగు భాషలకు ఇతని కాలంలో ఆదరణ లభించినది. మక్కామసీదు నిర్మాణానికి అంకురార్పణ జరిగింది. ఇతని పరిపాలనా కాలంలో ప్రజలు సుఖశాంతులతో జీవించారు. ఇతడు 1626లో మరణించాడు.

అబ్దుల్లా కుతుబ్‌షా (1626–1672):

సుల్తాన్ మహమ్మద్ కుతుబ్‌షా అనంతరం అతని కుమారుడు అబ్దుల్లా కుతుబ్‌షా గోల్కొండ రాజ్య సింహాసనం అధిష్ఠించాడు. అప్పటికి ఆయన వయస్సు 12 ఏళ్ళు. అతని తల్లి హయత్ బక్షీ బేగం రాజ్యభారం వహించింది. 1626లో జహాంగీర్ మరణించగా షాజహాన్ మొగల్ సింహాసనాసీనుడైనాడు. మొగల్

రాయబారితో కుతుబ్‌షా సంధిచేసుకుని ప్రతి సంవత్సరం రెండున్నర లక్షల కప్పం చెల్లించడానికి అంగీకరించాడు. గోల్కొండ ప్రాంతంలో వజ్రాన్వేషణ విస్తారంగా ఇతని కాలంలో జరిగింది. గోల్కొండ పట్టపురాణులలో అందరికంటే అదృష్టవంతురాలు హయత్ బక్షీబేగం. ఆమె ముగ్గురి సుల్తాన్ల పరిపాలనను కళ్ళారా చూసి పట్టపురాణి గాను, రాజమాతగాను రాణించింది. శైశవదశలో రాజైన అబ్దుల్లాకు ఏబది సంవత్సరాలు రాజుగా ఉండే అదృష్టం లభించింది. కానీ, దురదృష్టం ఏమంటే ఇతని కాలంలోనే గోల్కొండ పతనం ప్రారంభమైనది.

1656లో ఒక కొత్త ఉపద్రవం వచ్చిపడింది. ప్రధాని మీర్‌జుమ్లా తిరుగుబాటు లేవదీసి మొగలులతో కలిసిపోయాడు. తనపై ద్రోహం ప్రకటించిన మీర్‌జుమ్లా ఆస్తిని సుల్తాన్ వశపరచుకుని అతని కొడుకును బంధించాడు. దక్కను సుబేదారైన ఔరంగజేబు దాడిని ఎదుర్కోలేని అబ్దుల్లా రాసులకొద్ది ధనమందించి తన కూతురుని ఔరంగజేబు కొడుక్కిచ్చి పెళ్ళి జరిపించి సంధి కుదుర్చుకున్నాడు.

స్ఫురద్రూపి, సుందరాకారుడైన అబ్దుల్లా వినోద ప్రియుడు. తన జన్మదివసం రోజులను విలాసంగా జరుపుకొని ఎన్నోరోజులు వినోదంతో గడిపేవాడు. అబ్దుల్లా కీర్తి దిగంతవ్యాప్తమైంది కోహినూర్ వజ్రం ద్వారానే. గోల్కొండ పొలిమేరలలో వజ్రాన్వేషణ సుల్తాన్ కులీ కాలంలోనే ప్రారంభమైంది. అబ్దుల్లా కాలంలో ఆ కృషి మరింత తీవ్రమైంది. గోల్కొండ వజ్రాలు విదేశీయ ధనికులను, కళాప్రియులను, వర్తకులను విశేషంగా ఆకర్షించేవి.

అబుల్‌హసన్ తానీషా (1672–1687):

అబ్దుల్లా కుతుబ్‌షాకు ముగ్గురు కుమార్తెలు. మొదటి కుమార్తెను సయ్యద్ అమీర్ అనే అరేబియా నుంచి వచ్చిన అమీర్‌కిచ్చి పెళ్ళి చేసాడు. రెండవ కుమార్తె ఔరంగజేబు కొడుకు కిచ్చాడు. మూడవ కుమార్తెను అబుల్‌హసన్ పెళ్ళి చేసుకున్నాడు.

ఔరంగజేబుతో చేసుకున్న సంధి ప్రకారం అబ్దుల్లా రాజ్యం అతని కుమారునికి దక్కాలి. కాని అతని దుష్ప్రవర్తనను భరించలేక తండ్రే అతన్ని జైల్లో పెట్టాడు. ఈ విధంగా అతడు రాజ్యార్హత కోల్పోయాడు. సయ్యద్ అహమ్మద్ గర్విష్ఠి. అతని పక్షాన నిలిచిన వాడొక్కడూలేడు. చివరకు అబుల్‌హసన్‌కు రాజ్యం దక్కింది. అబుల్‌హసన్ తానీషాగా ప్రసిద్ధుడు.

తానీషా మొదట యోగి. తరువాత భోగి. పర్షియాకు చెందిన యోధుడైన అబుల్‌హసన్ తన సత్ప్రవర్తనతో, కళాభిరుచితో ప్రజలను ఆకట్టుకున్నాడు. గోల్కొండ నవాబులందరిలో ప్రజాభిమానం పొందిన అబుల్‌హసన్ జీవితం ఒక విషాద సంఘటనతో శోకభూయిష్టమైనది.

ఒకరోజు అబుల్‌హసన్ వేటకు వెళ్ళి ఒక గొర్లకాపరి పడుచును ప్రేమించి అంతఃపురానికి తెచ్చుకున్నాడు. ఈ సంగతి తెలియగానే అంతఃపురంలో కలకలం బయల్దేరింది. రాజులేని సమయంలో పట్టపురాణి ఆ గొల్లపడుచును చెట్టుకు వేలాడదీసి నూనెలో ముంచిన గుడ్డలను కట్టించి మంటలకు ఆహుతి చేసింది. తన ప్రత్యర్థి మరణవేదన చూసి వెర్రి ఆనందం పొందాలని భావించిన రాణికి దీనికి పూర్తి భిన్నమైన పరిస్థితి ఎదురైంది. ఆమె దారుణమైన మరణవేదనను చూచి చలించిపోయిన రాణికి మతి భ్రమించింది. ఈ రెండు దుస్సంఘటనలు అబ్దుల్ జీవితాన్ని చివరివరకు బాధించాయి.

మాదన్న మహామంత్రి:

మీర్‌జాప్లి స్థానంలో 1674లో అబుల్‌హసన్ మాదన్నను ప్రధానమంత్రిగా నియమించాడు. ఆయనకు సూర్యప్రకాశరావు అనే బిరుదునిచ్చారు. అల్లాఉద్దీన్ ఖిల్జీ దండయాత్రల అనంతరం 300 సంవత్సరాల్లో ఒక హిందువును ప్రధానిగా నియమించడం ఇదే మొదటిసారి. ఆయన సోదరుడు అక్కన్నను రెవిన్యూమంత్రిగా నియమించాడు. అక్కన్న, మాదన్నలు సోదరులు, పింగళి వంశీయులు, శాస్త్రకోవిదులు, బహుభాషా పండితులు, రాజకీయాలలో ఆరితేరినవారు.

అబుల్‌హసన్ తానీషా రాజవ్యవహారాలలో ఎన్నడూ ఉదాసీనత వహించలేదు. పట్టాభిషేకానంతరం దేశపర్యటన జరిపి పరిస్థితులను ప్రత్యక్షంగా తెలుసుకున్నాడు. కొండపల్లి మొదలైన దుర్గాలను పటిష్ఠపరిచాడు. గుత్తపద్ధతిలో ఉన్న పన్నులు వసూలు చేసే విధానాన్ని రద్దు చేసి అధికారులచేత పన్నులు వసూలు చేసే పద్ధతిని ప్రవేశపెట్టాడు. అబుల్‌హసన్ తానీషా కాలంలోనే కొండవీడు దుర్గాన్ని పునర్‌నిర్మించాడు. అక్కడే తానీషా కొంతకాలం ఉండి తూర్పు తెలంగాణా, కర్నాటక ప్రాంతాల్ని అజమాయిషీ చేశాడు.

కుతుబ్‌షాహీలు మొదటినుంచే నౌకావ్యాపారం చేసేవారు. బందరు ప్రధాన ఓడరేవు. అందుకనే మహమ్మద్ కులీ హైదరాబాద్ నగరాన్ని నిర్మించినప్పుడు ఓదారి చార్మినార్ నుంచి బందరు ఓడరేవు వైపునకు వెళ్ళేటట్టు ఏర్పాటు చేశాడు. గోల్కొండ ప్రభుత్వానికి ఓడలు నిర్మించే కర్మాగారాలు ఉండేవి. గోదావరి తీరంలో వున్న నర్సాపురం అతి ప్రసిద్ధమైన పురాతన నౌకా నిర్మాణ కేంద్రం.

ఒకసారి అబుల్‌హసన్ తానీషా మాదన్నతో కలిసి బందరు రేవు పట్టణానికి బయల్దేరాడు. దారిలో విశ్రాంతి కోసం ఓ గ్రామంలో విడిది చేశాడు. ఆ గ్రామంలో విశ్రాంతి తీసుకుంటున్న నవాబుకి దగ్గరలోవున్న గుడిలో పాటలు, నృత్యం చేస్తున్న శబ్దాలు వినిపించడంతో వాటిపట్ల ఆకర్షితుడై చూసాడు. వాళ్ళ నృత్యాన్ని చూసి ఇంకా అభివృద్ధి పరచండి అంటూ ఆ నృత్యాన్ని ప్రదర్శిస్తున్న ఆరు కుటుంబాల వారికి కూచిపూడి అగ్రహారాన్ని దానమిచ్చాడు.

కుతుబ్‌షాహీల కాలంలో మచిలీపట్నం, మద్రాసు, పులికాట్‌లలో విదేశీ వర్తకులు వ్యాపార స్థావరాలను ఏర్పాటు చేసుకున్నారు. వీరు అక్రమ లాభాలార్జించ కుండా మాదన్న చక్కని ఏర్పాట్లు చేశాడు. శివాజీ 1674లో ఒకసారి, 1675లో మరొకసారి గోల్కొండ రాజ్యంపై దాడిచేశాడు. బెదిరింపులతో ప్రతిసారి కొంత డబ్బు వసూలు చేసుకొని పోయేవాడు. 1680లో శివాజీ మరణించగా ఔరంగజేబు దక్కన్ రాజ్యాలమీద దృష్టి పెట్టాడు. దేశవిదేశ అమీర్ల కుట్రలతో, అంతఃపుర కలహాలతో శివాజీ, ఔరంగజేబు వంటి యోధానయోధులమధ్య 15 సంవత్సరాలు అబుల్‌హసన్ మాదన్న యుక్తితోనే రాజ్యాన్ని కాపాడుకోగలిగాడు.

బహమనీ సుల్తానుల కాలంనాటి నుండి పర్షియానుంచి వచ్చిన అమీర్లు, స్థానిక అమీర్లతో ప్రతిఘటనలు సల్పేవారు. వీరి వైరాలు రాజ్యాలను రాజ్యాలనే కూల్చివేసినవి. ఈ సంగతి బాగా గుర్తెరిగిన మాదన్న ఈ గందరగోళ సృష్టికి కారకులైన వారిని గుర్తించి అధికారం నుంచి తొలగించాడు. పదవిని కోల్పోయిన వారంతా మాదన్నకు విరోధులై ఔరంగజేబు శరణుజొచ్చారు. అబుల్‌హసన్‌పై ఔరంగజేబు చేసిన ఆరోపణలలో అతడు సయ్యద్‌లను షేకులను అణచివేస్తున్నాడనీ, ముస్లింలకు ఇతరులకు, నిరంకుశత్వానికీ న్యాయానికీ, భక్తులకీ, పాపుల,కీ విచక్షణ చూపడం లేదనీ, దైవవిధులను నిషేధాలను పాటించడం లేదనీ ముఖ్యంగా శత్రుదేశాల వారికి

తోడ్పడరాదనే నిషేధం పాటించడం లేదన్నవి ముఖ్యమైనవి. 1686 మార్చి 21వ తేదీన అక్కన్న, మాదన్నలు హత్యకు గురైనారు. మొగల్ సైన్యం దండెత్తి వస్తున్నా అబుల్ హసన్ తానీషా భయపడలేదు. మాల్ఖేడ్ దగ్గర హోరాహోరీగా పోరాడిన కుతుబ్‌షా సైన్యాలు శత్రుధాటికి నిలబడలేకపోయాయి. మొగల్ సైన్యాలు యుద్ధభేరుల్ని మోగిస్తూ కుతుబ్‌షా సైన్యాన్ని తరుముతూ గగన్ పహాడ్ వరకు వచ్చాయి. తానీషా గోల్కొండ కోటలో తలదాచుకున్నాడు.

కోట ముట్టడి ఎనిమిది మాసాలు సాగింది. చక్రవర్తి స్వయంగా సైనిక పర్యవేక్షణ జరుపుతున్నా చెక్కుచెదరకుండా ఇన్నిరోజులు నిలిచింది గోల్కొండకోట. విసుగెత్తిపోయిన సైనికులు ముట్టడిని ఎత్తివేయాలని చక్రవర్తిపై వొత్తిడి తెచ్చే ప్రయత్నంలో ఉన్నారు. ఇక లాభం లేదనుకొని మోసంతో కోటను జయించడానికి వ్యూహాలు ప్రారంభమైనవి. కీలకమైన స్థావరాలలో ఉన్న సైనికులకు లంచమిచ్చి మొగల్ సైనికులు తమవైపు తిప్పుకున్నారు. ప్రలోభానికి లోనైన కోట ప్రధాన రక్షణాధికారి అబ్దుల్లా అనేవాడు ఒక అర్ధరాత్రి కోట తలుపులు తెరిచాడు. ఆగమేఘాలమీద మొగల్ సైన్యం కోటలో ప్రవేశించింది. ఆ సమయంలో కోట రక్షకుడు అబ్దుల్ రజాక్‌లారీ చివరి శ్వాస ఉన్నంతవరకు భీకరంగా పోరాడి ఔరంగజేబు మెప్పునుకూడా పొందాడు.

మొగలుల ముట్టడి 1687 ఫిబ్రవరి 7న ప్రారంభమై ఏడు నెలల పదిహేను రోజులు భయంకరంగా సాగింది. తానీషా నమ్మిన సైన్యాధిపతి అబ్దుల్లాఖాన్ కోటలోని చిన్నద్వారం తెరిచాడు. మొగల్ సైన్యం కోటలో ప్రవేశించింది. విజయం తరువాత ఔరంగజేబు హైదరాబాద్‌లో రెండు నెలలుండి రక్షణ ఏర్పాట్లు చేశాడు. దౌలతాబాద్ కోటలో అబుల్‌హసన్‌ని బంధించాడు. 1696లో తానీషా బందీగానే చనిపోయాడు. 1687 నుంచి 37 ఏళ్ళపాటు గోల్కొండ రాజ్యంలో మొగల్‌చక్రవర్తుల ప్రత్యక్ష పాలన కొనసాగింది. దాదాపు రెండువందల సంవత్సరాలు వైభవోపేతంగా తెలుగుదేశాన్ని పరిపాలించిన కుతుబ్‌షాహీ రాజవంశం విద్రోహుల కుట్రలతో విధ్వంసమైంది. కోట మొగలుల హస్తగతమైందని తెలియగానే అబుల్‌హసన్ నిశ్చలంగానే ఉన్నాడు. తనను బంధించడానికి వచ్చిన మొగల్ సేనానిని ఆహ్వానించి తనతో భోజనం చేయమన్నాడు. రోషాలకు, ద్వేషాలకు అతీతంగా జీవించాడు అబుల్‌హసన్ తానీషా. రాజ్యానికి

రాక పూర్వం అబుల్‌హసన్ 15 సంవత్సరాలు యోగిగా జీవించాడు. 15 సంవత్సరాలు రాజ్యపాలన జరిపాడు. 15 సంవత్సరాలు బందీగా జీవించాడు.

సాంఘిక జీవనం:

మూర్తీభవించిన ఆంధ్రత్వాన్ని ప్రదర్శించినవారు కుతుబ్‌షాహీ నవాబులు. వీరు హిందువులకు గొప్ప ఉద్యోగాలిచ్చారు. తెలుగు కవులను పోషించారు. రాజకీయ వ్యవహారాలను స్థానిక తెలుగు భాషలో కొనసాగించారు. అనేకమంది సుల్తాన్లు తెలుగు నేర్చుకొని ప్రజల కష్టసుఖాలనర్థం చేసుకొని ప్రజాభిమానం పొందారు.

మత పక్షపాతంతో రాజ్యాన్ని పాలించడానికి వీరు వ్యతిరేకులు. హైందవ నాగరికతను తెగనరికి వేస్తున్న కాలంలో కుతుబ్‌షాహీలే మత సహనం కనబరచ గలిగారు. కుతుబ్‌షాహీలు షియామతస్థులు, సూఫీభక్తులు. సూఫీభక్తితత్వానికి ప్రేరణ కలిగిస్తుంది కనుక కుతుబ్‌షాహీల పాలనలో హిందూ-ముస్లిం మతాచారాలు, నాగరికతలు, వేడుకలు, వినోదాలు విడదీయరానంతగా కలిసిపోయాయి. కుతుబ్ షాహీలు మహమ్మదీయులై హిందూ దేవాలయాలను పోషించారు. కుతుబ్‌షాహీ సుల్తానులతో చివరివాడైన తానీషా కాలంలో భద్రాచంల ప్రాంతానికి తహసీల్దారుగా ఉన్న కంచర్లగోపన్న భద్రాద్రి రామాలయ నిర్మాణానికి ప్రభుత్వ ధనాన్ని వినియోగించి సీతారాములకు అనేక అమూల్యాభరణాలు తయారు చేయించాడు. ఈ అపరాధానికి 14 సంవత్సరాలు జైలు శిక్షణ అనుభవించాడు గోపన్న. ప్రభుత్వ సంపదంతా భద్రాద్రి ఆలయంలోనే రత్నాభరణాల రూపంలో ఉందని తెలుసుకున్నా దాన్ని తిరిగి స్వాధీనం చేసుకోకపోవడం తానీషా మతసహనానికి తార్కాణం. ఇలాంటి ఉన్నత సంప్రదాయం మన చరిత్రలో మరోచోట కానరాదు.

గోదావరీ తీరాన, గోల్కొండ రాజ్యపు సరిహద్దులలో ప్రజలు దుర్నీతిపరులై అరాజకం ప్రబలి సుంకాలు చెల్లించకుండా విచ్చలవిడిగా ఉన్న విషమ సమయంలో ఆ భాగంలో రాజ్యపాలన బలపడడానికి కంచెర్ల గోపన్నను తానీషా భద్రాచలం తహసీల్దారుగా నియమించినాడు. ఆలోచించగా గోపరాజుకి ఒకటే మార్గం కనబడింది. ఆ మార్గం చూపించినవాడు భద్రగిరి రాముడు. ప్రజల్ని భక్తిమార్గంలో పెట్టమన్నాడు. ఆ భక్తితో వినయం, విద్యా తదితర సుగుణాలు అలవడి నాగరికులవుతారు. ప్రజల్ని బాగు చెయ్యాలంటే వారిలో ఉత్సాహం, ఉద్రేకం రేకెత్తించాలి. ఉత్సాహానికి ఏదైనా

నిర్మాణ కార్యక్రమం ఉండాలి. ఉద్రేకంవల్ల వాని నిర్మాణం సాధించవచ్చు. ప్రజలలో భక్తి ఉత్సాహం కలుగచేయడానికి గోపరాజు ఓ నిర్మాణం తలపెట్టాడు. అదిపాడైపోయిన భద్రగిరి శ్రీరామాలయం పునర్నిర్మాణం చెయ్యడం. తురక సంపర్కంవల్ల క్షీణించిన హిందూమతం పునరుద్ధరించడం కూడా అయియుండవచ్చు. ప్రజాబలంతో శ్రీరామాలయం పునర్నిర్మాణం చేస్తే తన ఆశయం నెరవేరుతుందని భావించి కార్యక్రమం ప్రారంభించాడు. కార్యదీక్షతో తాత్కాలికంగా రాజమర్యాద నతిక్రమించి సర్కారు ఖజానా సొమ్ము కొంత శ్రీరాముడికి కైంకర్యం చేసి ఉండవచ్చు. బహుశః మహ్మదీయులకు ఆ విధంగా మసీదులు నిర్మించడం నాటి రివాజై ఉండవచ్చు. లేదా ఆనాటి తహసీల్దార్లకి ఆ అధికారం ఉండి ఉండవచ్చు. హిందూమత ప్రచారం చేస్తున్నాడనే భయంవల్ల తోటి మహ్మదీయ ఉద్యోగులు అనేకారోపణ చేసి ఉండవచ్చు. ఫలితం ఖైదువాసం. శిక్ష అనుభవించినాడు గాని శ్రీరామచంద్రుని పాదపద్మములు వదలలేదు. చివరికి ఆ సొమ్ము శ్రీరాముని పేరిట ప్రజలంతా కలిసి చెల్లించారో, సహృదయుడైన తానీషా కలగన్నాడో గోపరాజు ఆశయం నెరవేరింది. ఆనాటినుంచి ఈనాటివరకు తురక రాజ్యంలో, సర్కారు సొమ్ముతో ప్రతియేటా శ్రీరామ కల్యాణోత్సవం జరుగుతుంది. శ్రీరాముడి జన్మక్షేత్రం అయోధ్యకంటే, ఆయన వనవాస తీర్థం భద్రగిరి ఈనాడు గొప్ప క్షేత్రం. గోపరాజు తన భక్తపారవశ్యంతో పాటలు పాడినాడు. రాముని కీర్తించి కీర్తనలు పాడినాడు. తెలుగువారికి వలెనే నిందాస్తుతికూడా చేసినాడు. సంగీతం సహజంగా వెల్లివిరిసింది. కాని పోతరాజుకి లభించిన కవితా పటిమ దొరకలేదు.

కుతుబ్‌షాహీ ప్రభువులు స్థానికాచారాలను గౌరవించారు. వీరు తెలుగు వారివలె ఉత్తరీయాలు వేసుకున్నారు. ఇరానీ అలంకరణలు మాయమైనవి. మహ్మద్ కులీ కుతుబ్‌షాను కంటికి రెప్పలా కాపాడినవాడు అశ్వారావు. ఇతని స్వామిభక్తికి మెచ్చిన నవాబు ఇతన్ని మొసలి మడుగు పాలకునిగా చేశాడు. సైనిక ప్రధానోద్యోగిగా ధర్మారావును, నంద్యాల పరిపాలకునిగా గణపతిరావు అనే మరొక హిందువుని నియమించాడు. కొండపల్లి, కోయలకొండ, కొండవీడు, ఘనపురం, పానగల్లు, ఖమ్మం మెట్టు మొదలైన ప్రధాన రక్షణ స్థావరాలకు అధిపతులందరూ నాయక జాతికి చెందిన హిందువులే.

కుతుబ్‌షాహీ సుల్తానులందరూ సాహిత్య ప్రియులే. ఫార్సీ, ఉర్దూ, తెలుగు భాషా సంగమంగా వర్ధిల్లింది. అన్యభాషలపై వారు కనబరచిన అభిమానం భావితరాల

వారికి ఆదర్శప్రాయమైనది. మహమ్మద్ కులీ కుతుబ్‌షా అక్బరు చక్రవర్తికి సమకాలికుడు. ఇతడే హైదరాబాద్ నగర నిర్మాత. ఇతడు ఉర్దూ, పార్సీ, తెలుగులో కావ్యాలు రచించాడు. కానీ ఇతని తెలుగు కవిత లభ్యం కాలేదు. ఇతడు పార్సీ, ఉర్దూ భాషలలో రచించిన దివాన్‌లు (కావ్య సంపుటాలు) 1800 పేజీలు అంటే యాభైవేల పంక్తులు కలిగి ఉన్నవి. భక్తి, శృంగారాలను, సాంఘిక పరిస్థితులను ఇతడు తన కవితలలో చిత్రించాడు. హిందూ-ముస్లింల పండుగలను రసవత్తరంగా చిత్రించాడు. అబ్దుల్లా కుతుబ్‌షా గొప్ప విజ్ఞాన ప్రియుడు. కొన్ని సంస్కృత, ఫార్సీ శృంగార కథలు ఉర్దూలో అనువదించాడు. శుక సప్తతి, పార్సీతర్జుమా 'యాతీనామా'. దాని ఉర్దూ అనువాదం సబ్‌రస్. దక్కనీ భాష అంటే పార్సీ దుస్తులు ధరించక ముందు. ముస్లిం సేనలు దక్షిణానికి తీసుకువచ్చిన భాష అని అర్థం. ఈ భాషలో తరువాత హిందీ, మరాఠీ, తెలుగు, మళయాళం మొదలైన దేశీయ భాషల పదాలు విరివిగా కలిసిపోయాయి. ఆ భాషనే గోల్కొండ సుల్తానులు పోషించారు.

బహమనీ సుల్తానుల కాలంలో తెలంగాణాలో ఆరిపోయిన తెలుగుదీపం గోల్కొండ సుల్తానుల కాలంలో కొంగ్రొత్త వెలుగులను విరజిమ్మింది. కుతుబ్‌షాహీ వంశానికి మూలపురుషుడైన సుల్తాన్ కులీ కాలంలో చరికొండ ధర్మన్న అనే తెలుగు కవి చిత్రభారతము అనే మహాకావ్యాన్ని రచించాడు. ఈ సుల్తానులందరిలో ఆంధ్రభాష పోషకుడుగా గొప్పకీర్తి పొందినవాడు ఇబ్రహీం కుతుబ్‌షా. అద్దంకి గంగాధర కవి తన తపతీ సంవరణోపాఖ్యానాన్ని ఇబ్రహీంకు అంకితమిచ్చాడు. ఇబ్రహీం కుతుబ్‌షా తెలుగువారి నోట మల్కిభరాముడైనాడు. ఇతడు తెలుగు కవులను ఆదరించి తెలుగు భాషను పోషించాడు. కవి అంటేనే సరి చెవి తెగకోసుకునే అభిరుచితో ఈ గోల్కొండ నవాబు రాజ్యమంతా తన కవులను సృష్టించాడు. కవిత్వం రానివారు కూడా అనేకమంది ఈతని ముందు జిలిబిలి అల్లికలు అల్లి వల్లె అనుపించుకుని 'ముల్లెలు' సంపాదించుకునేవారు. అటువంటి కవులిద్దరు ఒకప్పుడు మల్కిభరామ్‌ను గురించి-

"యరలవ మదనస యనుచును
వరవడి నీయక్షరములు భయనయ తతులన్
నిరతమును వ్రాయ నేర్చిరి
మఱి మఱి నీ పుత్రులెల్ల మల్కిభరామా" (చాటువు)

పొన్నగంటి తెలగనార్యుడు 'యయాతి చరిత్ర' అనే అచ్చ తెనుగు కావ్యం రచించి ఇబ్రహీం సేనాని అమీన్‌ఖాన్‌కి అంకితమిచ్చాడు.

కవితలకు పుట్టిల్లు మరంగంటి వారి ఇల్లు. మరంగంటి సోదరులలో అగ్రేసరుడు సింగరాచార్యుడు. ఇతడు రామకృష్ణ విజయమనే ద్వర్థి కావ్యాన్ని నలయాదవ రాఘవ పాండవీయం అనే నాలుగర్థాల కావ్యాన్నీ, పెక్కు శతకాలు రచించి ఇబ్రహీం సత్కారాలు పొందాడు. సుప్రసిద్ధ వాగ్గేయకారుడు క్షేత్రయ్య అబ్దుల్లా ఆస్థానంలో గౌరవాదరాలు పొందాడు. వైజయంతీ విలాసము అనే శృంగార కావ్యాన్ని అతిమనోహరంగా రచించిన సారంగ తిమ్మయ్య ఆ కాలంలోనివాడే.

దక్కను పాలకులు స్వతంత్ర శిల్పి శైలిని సృష్టించారు. ఇది విలక్షణమైన దక్కను శైలి. గోల్కొండలోని వీరి సమాధులు వారి శైలీ చిహ్నాలు. ఇది ఢిల్లీ సుల్తానుల శైలికీ, పర్షియా శైలికి మిశ్రమము. చార్మినార్, మక్కామసీదు ఈ రెండు కట్టడాలు వీరి కాలంనాటి శిల్ప వైభవాన్ని వేనోళ్ళ చాటుతున్నాయి. ఒక రాతితో మలిచి నిర్మించిన మక్కామసీదు పూర్తి కావడానికి 77 సంవత్సరాలు పట్టింది. ఈ కాలంలోని లంగర్‌హౌజులు (బిక్షా గృహాలు), ఉద్యానవనాలు నాటి వైభవానికి ప్రతీకలు.

గోల్కొండ కోట:

ఎంతో శక్తిమంతమూ, మహాబలసమన్వితమై, అనేక శత్రుదాడులను, ఆటుపోట్లను అనుభవించి కాలప్రవాహ రాపిడులకు తట్టుకుని నిలబడి ఈనాటికీ దృఢంగా నిలిచి ఉన్నది గోల్కొండ కోట.

గోల్కొండ కోటకు ప్రాచీనమైన చరిత్ర ఉంది. చాళుక్య యుగంలో గోల్కొండ ప్రాంతాన్ని మంగళవరం అనేవారు. తొలి కాకతీయ రాజులు ఈ కొండపై మట్టి దుర్గం నిర్మించారు. దీనిపై గొల్లలు గోవులను మేపేవారని అందుకే గొల్లకొండని, తరువాత గోల్కొండగా రూపాంతరం చెందిందని కొందరి అభిప్రాయం. కాకతీయులు నిర్మించిన మట్టికోటకు బదులుగా క్రీ.శ. 1496లో సూబేదారు అయినప్పటి నుంచి సుల్తాన్ కులీ గోల్కొండ దుర్గాన్ని రాతికోటగా మరమ్మతు చేయించి, రక్షణ శ్రేణులు, పౌరజన నివాసప్రాంతాలు నిర్మించి, దుర్భేధ్యమైన దుర్గంగా ఆకర్షణీయమైన నగరంగా

గోల్కొండను రూపొందించాడు. కోట చుట్టూ కందకము సర్వకాల సర్వావస్థలయందు నీటిచే నింపబడి వుండేది. ఈనాడు ఆ ఛాయలు మాత్రమే కనిపిస్తాయి.

గోల్కొండ కోటలో అడుగడుగున ఎన్నో ప్రత్యేకతలు కనిపిస్తాయి. ఈ కోట రక్షణకై దాని నిర్మాణకర్తలు తీసుకున్న జాగ్రత్తలు మనల్ని సంభ్రమాశ్చర్యాలతో ముంచెత్తుతాయి. శత్రువులు యుద్ధ సమయంలో కోటలోని బాలహిసార్ గేటును ఏనుగులతో పగల గొట్టించి లోనికి ప్రవేశించకుండా నిరోధించడానికి సమున్నతమైన రాతిగుమ్మం మీది నుండి మరిగే నూనెను, కరుగుతున్న లోహాన్ని శత్రువులపైకి పోయడానికిగాను ఏర్పాట్లు చేయబడ్డాయి. ఇక శత్రువుల కదలికలను జాగ్రత్తగా గమనించి తగు చర్యలు తీసుకోవడానికిగాను 'కర్టెయిసీ వాల్' అనే తెరవంటి గోడ నిర్మించారు. ఇక పోతే, కోట కింది భాగం నుండి పై భాగానికి చప్పట్ల ద్వారా శత్రువుల రాకను తెలియచేయడానికి గాను 'వైబ్రేషన్' యేర్పాటు ఆనాటి సాంకేతిక విజ్ఞానానికి చక్కని ఉదాహరణ. దర్బారు హాల్‌లో ప్రవేశిస్తే 'ఎయిర్ కండిషన్' హాల్‌లో ప్రవేశించినట్లు ఉంటుంది.

విదేశీ వ్యాపారం బాగా అభివృద్ధి చెందిన కాలమది. మచిలీపట్నం గొప్ప వ్యాపార కేంద్రం. ఈనాడు బొంబాయి రేవుకుగల ప్రాముఖ్యం ఆ రోజులలో మచిలీపట్నంకు లభించేది. అద్దకపు గుడ్డలు, ఉక్కు, ఇనుము, వజ్రాలు, తేయాకు, ఏనుగు నగిషీలతో తయారు చేసిన కుర్చీలు, బల్లలు ఎగుమతులు అయ్యేవి. అరబ్, టర్కీ, ఇరాన్‌నుంచి వర్తకులు వచ్చేవారు.

కోటి వజ్రాల మూట:

గోల్కొండ రాజ్యంలోని ఐశ్వర్యమంతా కోలార్ వజ్రపు గనులనుండి వచ్చిందే. రాష్ట్రపరిపాలన వలెనే ఈ గనుల తవ్వకం కూడా అనాలోచితంగా, యాదృచ్ఛికంగా సాగినట్లు ఆ కాలంలో ఈ గనులను సందర్శించిన విలియం మైథోల్డ్ అనే ఆంగ్లేయుడు వాపోయాడు. కొండపల్లి, నర్సాపురం కూడా ప్రసిద్ధమైన వజ్రపు గనుల కేంద్రాలే. ఒక్క కోలార్ గనులలోనే 30 వేలమంది కార్మికులు పనిచేసేవారు. ఇక్కడ లభించిన కోహినూర్ వజ్రం కోటి ప్రభలతో వెలుగొందింది.

ఈ రాజ్యానికొచ్చే ఆదాయంలో మరొకమార్గం ప్రభుత్వ యాజమాన్యంలో సారాయి విక్రయం. భారతదేశంలోని ఇతర నగరాలకంటే గోల్కొండలోనే ఎక్కువ వైశ్య గృహాలు ఉన్నట్లు కిన్‌కైడ్ రాశాడు. గోల్కొండ రాజ్యంలోని ఎక్కువమంది ప్రజలు వ్యవసాయదారులు. ఇజారాదారీ పద్ధతి వలన రైతులనుంచి ఇజారా దారులు ఇష్టం వచ్చినంత డబ్బు వసూలు చేసేవారు. ఆ విధానాన్ని మాదన్న రద్దు పరచి అమీర్ల ఆగ్రహానికి గురయ్యాడు.

తన ఐశ్వర్యసంపదతో గోల్కొండ నగరం ఆనాడు చాలామంది పాశ్చాత్య వర్తకులను ఆకర్షించింది. ఇటు మహారాష్ట్రులు, అటు మొగలులకు ఒకేసారి కప్పం చెల్లించటానికి సులభంగా భరించగల ఐశ్వర్యం సమృద్ధిగా వారికి ఉండేది. అందువలన గోల్కొండ రాజ్యంలో వైభవోపేతమైన సౌధనిర్మాణ కార్యక్రమాలు విరివిగా సాగుతుండేవి. చక్కని సశ్యసంపదలతో, ఫలవనాలతో మత్స్యపూర్ణమైన సరస్సులతో భాగ్యవంతమైన దేశంగా పాశ్చాత్య చరిత్రకారులు గోల్కొండను వర్ణించారు. పురుషులు నాలుగైదు గజాలు కాలికట్ రకపుగుడ్డను అంగీగా చేసుకునేవారు. పొడుగాటి జుత్తు కలిగి స్త్రీలవలె నెత్తిమీద సిగముడి వేసుకునేవారు. స్త్రీలు ముక్కోణాకృతిగల ఊలు గుడ్డని తలకు ధరించేవారు. రాజోద్యోగులు వెడల్పుగల ఖడ్గాలను మొలనుండి వేలాడ తీసుకునేవారు. ఇది పొడవడానికి, నరకడానికి ఉపయోగపడేది.

జాతీయ పండుగలను ఈ సుల్తాను పరమోత్సాహంతో జరుపుకునేవారు. హిందువులకు సంబంధించిన సంవత్సరాది పండుగనాడు మహమ్మద్ కులీకుతుబ్‌షా తను కూడా రాచనగరులో పండుగ జరుపుకునేవాడు. ఆరోజులలో హిందూ–ముస్లిం భేదభావం లేదు. తురకల ముఖ్యమైన పర్వదినం మొహర్రం. ఇదే పీరీల పండుగ. తురకల వలె హిందువులు కూడా పీరీలకు దట్టీలు కట్టేవారు. ఊదు, బెల్లం, కందూరులు చల్లడం, మలీద తినడం, అగ్నిగుండాలు తొక్కడం, పులివేషాలు ధరించి ఆడటం చేసేవారు. గోల్కొండ కుతుబ్‌షాహీ ప్రభువులు పోషించిన మిశ్రమ సంస్కృతి, అవలంభించిన మత సామరస్య విధానాలు భారతదేశ చరిత్రకే గర్వకారణంగా నిలిచినవి. ❑

10. నిజాం రాజ్యస్థాపన

అఖిలాంధ్ర దేశాన్ని పాలించిన చివరి రాజవంశం ఆసఫ్‌జాహీ నిజాం ప్రభువులది. ఈ వంశస్థాపకుడైన మొదటి నిజాముల్ ముల్క్ (మీర్ ఖమ్రుద్దీన్‌ఖాన్) పూర్వీకులు టర్కీనుంచి వచ్చారు. నిజాం తాత అబిద్‌ఖాన్ షాజహాన్‌కు అతి సన్నిహితుడుగా ఉండేవాడు. మొగల్ రాకుమారుల వారసత్వ యుద్ధాలలో ఔరంగజేబు పక్షంవహించాడు. చీన్‌ఖులిచ్‌ఖాన్ అనే బిరుదు పొందాడు. బీహార్ గవర్నర్‌గా నియమితుడై 1687లో గోల్కొండ యుద్ధరంగంలో అసువులు బాసాడు.

నిజాం తండ్రిపేరు షాహబొద్దీన్. తండ్రి ఉండగానే ఔరంగజేబు చక్రవర్తి కొలువులో ఉన్నత స్థానం సంపాదించుకున్న భాగ్యశాలి. చక్రవర్తి కోరికమీద షాహజహాన్ కాలంలో ప్రధానమంత్రిగా పని చేసిన అల్లామీ షహీదుల్లాఖాన్ కుమార్తెను పెళ్ళిచేసుకున్నాడు. ఈ దంపతులకు 1671 ఆగస్టు 11న నిజాం పుట్టాడు. చిన్నతనంలోనే తన ప్రజ్ఞాపాటవాలతో ఔరంగజేబు చక్రవర్తి అభిమానాలు సంపాదించుకున్న అదృష్టవంతుడు నిజాం. మరాఠి యుద్ధాలలో చక్రవర్తికి కుడిభుజంగా నిలిచాడు. బీజాపూర్ గవర్నరు అయ్యాడు. అత్యున్నతమైన 'పంచ్‌హజరీ' మన్సబు పొందాడు.

ఔరంగజేబు మరణం:

1707 ఫిబ్రవరి 20వ తేదీన ఔరంగజేబు చక్రవర్తి మరణించాడు. భారత దేశాన్ని ఏకచ్ఛత్రాధిపత్యంగా ఏలిన సామ్రాజ్యాలలో మొగల్ సామ్రాజ్యం గొప్పది. మొగల్ సమ్రాట్టులలో అక్బర్ తరువాత ఔరంగజేబు మేటి. ఔరంగజేబు సామ్రాజ్యం విస్తీర్ణంలోను, పరిపాలన విధానంలోను అశోకుడు, సముద్రగుప్తుడు, హర్షవర్ధన చక్రవర్తుల సామ్రాజ్యాల కంటె పెద్దది. ఔరంగజేబు కాలంలో మొగల్ అధికారం గజనీ నుండి చట్‌గాన్ వరకు, కాశ్మీర్ నుండి కర్నాటక వరకు వ్యాపించి పోయింది.

కానీ అతనిలో కొన్ని దౌర్బల్యాలుండేవి. ఫిరోజ్‌షా తుగ్లక్ కాలంలో తీసివేసిన జిజియాపన్ను (జుట్టుపన్ను) హిందువులపై రుద్దాడు. శిక్కుల గురువులను వధించాడు. మొగల్ సామ్రాజ్య వ్యవస్థకు మూలస్తంభాలైన రాజపుత్రులు ఆయనకు విరోధులైనారు. పడమటి కనుమలలో దిన దినాభివృద్ధి చెందుతున్న మరాఠీ సామ్రాజ్యం క్రమంగా మొగల్ సామ్రాజ్యానికి పక్కలో బల్లెమై కూర్చుంది. సహృదయుడు కానందువల్ల తను నిర్మించిన సామ్రాజ్య సౌధాన్ని తానే శిథిలావస్థకు తెచ్చుకున్నాడు.

వారసత్వ యుద్ధాలు:

మొగలులకు వారసత్వంగా వచ్చినది వారతస్వ యుద్ధాలు. ఔరంగజేబు మరణించగానే ఆయన ఇద్దరు కుమారులు ఆజమ్, మొహజమ్‌ల మధ్య అంతర్యుద్ధం చెలరేగింది. ఈ యుద్ధంలో ఆజమ్ రాకుమారునికి విజయం లభించింది. 68 సంవత్సరాల వయస్సులో బహదుర్‌షా అనే బిరుదుతో ఆజమ్ చక్రవర్తి అయ్యాడు. ఇతడు నిజాంకు ఖాన్‌దౌరాన్, బహాదుర్‌ఖాన్ అనే బిరుదులు లిచ్చి ఔద్ (అయోధ్య) ప్రాంతానికి సుబేదారుగాను, లక్నో విభాగానికి ఫౌజ్దారు (సేనాని)గాను నియమించాడు. స్వాతంత్ర్యాధికారంతో భారతదేశాన్ని ఏలిన చివరి చక్రవర్తిగా బహదుర్‌షాను పేర్కొనవచ్చును. ఇతడు అయిదు సంవత్సరాలు మాత్రమే రాజ్యం చేసి 1712లో చనిపోయాడు.

బహాదుర్‌షా అనంతరం అతని జ్యేష్ఠ పుత్రుడు జహందార్‌షా రాజ్యానికొచ్చాడు. ఆ రోజులలో బిహార్ సుబేదారైన అమీరుల్ ఉమ్రాహుసేన్ అలీఖాన్, అలహాబాద్ సుబేదారైన కుతుబుల్ ముల్క్ అబ్దుల్లాఖాన్ అనే సయ్యదు సోదరుల ప్రభావం ఢిల్లీలో బాగా వ్యాప్తిలోకి వచ్చింది. జహందార్‌షా తమ్ముని కుమారుడైన ఫరక్ సైర్ ఈ సయ్యద్ సోరుల సహాయంతో ఒక సంవత్సరం తిరుగకుండానే సామ్రాజ్యాన్ని హస్తగతం చేసుకున్నాడు. ఈ ఫరక్ సైరే నిజాంను దక్కన్ సుబేదారుగా నియమించాడు. ఫతేజంగ్, నిజాముల్‌ముల్క్ బిరుదునిచ్చి సత్కరించాడు.

అప్పుడు దక్కనులో ముబారిజ్‌ఖాన్ అధికారంలో ఉన్నాడు. నిజాంకు ఇతనిలో ప్రతిఘటన తప్పలేదు. 1724 అక్టోబరు 11న ఔరంగాబాద్ సమీపంలోని షెక్కర్‌ఖేడా వద్ద జరిగిన యుద్ధంలో నిజాం శత్రుసైన్యాన్ని చెండాడి ముబారిజ్‌ఖాన్‌ని చంపివేశాడు.

ఆ రోజునే దక్కనులో ఆసఫ్‌జాహీ రాజ్యస్థాపన జరిగింది. ఈ చర్యను మహమ్మద్‌షా అంగీకరించక తప్పలేదు. నిజాంకు 'ఆసఫ్‌జా' అనే బిరుదు ప్రసాదించి దక్కను సుబేదారుగా నియమిస్తున్నట్లు అధికార పత్రం జారీ చేశాడు. ఈ ఆసఫ్‌జా బిరుదే నిజాం ప్రభువుల వంశనాశనానికి కారణమైంది.

ఆఫ్ఘనిస్తాన్‌లో మొగల్ పట్టు సడలిపోగానే నాదిర్షా, అహమద్‌షా అబ్దాలీ వంటి బందిపోటు నాయకులకు ఆఫ్ఘనిస్తాన్ విహార భూమైంది. మరొకవైపు మహారాష్ట్రుల నిరంతరం దాడులతో కేంద్రప్రభుత్వంలో దిక్కుతోచని పరిస్థితి ఏర్పడి పోయినది. దేశం అస్తవ్యస్తంగా ఉన్నప్పుడు ప్రతివారు దేశాన్ని దరిజేర్చగల నాయకునికోసం ఎదురు చూస్తారు. ఆ నాయక లక్షణాలు సమృద్ధిగా ఉన్న నిజాంను ఢిల్లీకి రావలసిందని మహమ్మద్‌షా కబురంపాడు. దక్కనులో సుస్థిర స్థాపనలో నిమగ్నుడైన నిజాం తన కొడుకు నాసిర్‌జంగ్‌ను నవాబుగా నియమించి స్వామిభక్తి పరాయణుడై 1737లో ఢిల్లీ చేరుకున్నాడు.

దారి దోపిడీలతో జీవితం ప్రారంభించిన నాదిర్షా తన అద్భుత యుద్ధకౌశలంతో అతి త్వరలోనే ఇరాన్ సింహాసనం అధిష్ఠించాడు. ఆ రోజులలో ఆఫ్ఘనిస్తాన్ పౌరులు ఇరానీలను నానాబాధలు పెట్టేవారు. వారి దురాగతాలనుండి ఇరానీలకు రక్షణ కల్పించవలసిందని నాదిర్షా అనేకసార్లు మహమ్మద్‌షాను కోరుతూ వచ్చాడు. ఏదో ఒక అల్పజ్ఞాని కింద నాదిర్షాను తీసుకొని మహమ్మద్‌షా వాటికి సమాధానాలు పంపలేదు. ఈ అవమానం భరించలేని నాదిర్షా కోపంతో మ 1739లో ఢిల్లీపైన దండయాత్ర జరిపాడు. మొగల్ సైన్యం నాదిర్షా సైన్యాన్ని ఎదుర్కొనలేక పోయింది. నాదిర్షాకు 2 కోట్ల రూపాయలు యుద్ధపరిహారం చెల్లించి నిజాం సంధి చేసుకున్నాడు. ఈ గండం నుంచి పూర్తిగా బయటపడక ముందే నాదిర్షాను చంపివేశారనే పుకార్లు ఢిల్లీలో వ్యాపించాయి. ఇది విని మండిపడ్డ నాదిర్షా ఢిల్లీ ప్రజలను ఊచకోత కోయించాడు. ఈ ఊచకోతలో లక్షాయాభైవేలమంది చనిపోయారు. 15, 20కోట్ల విలువైన ధనరాసులు, వజ్ర వైడూర్యాలు, నెమలి సింహాసనం నాదిర్షాకు సమర్పించు కుని మహమ్మద్‌షా సంధి చేసుకోవలసి వచ్చింది. మొదలే ఎక్కడికక్కడ కూలిపోతున్న మొగల్ సామ్రాజ్య సౌధం నాదిర్షా దండయాత్రలతో దాని పునాదులు సైతం బీటలు వారాయి.

1774లో నాసిర్‌జంగ్ దక్కనులో తిరుగుబాటు లేవదీశాడు. ఇక ఎక్కువ కాలం ఢిల్లీలో ఉండటం ప్రమాదకరమని భావించిన నిజాం వెంటనే దక్కను ముఖం పట్టాడు. ప్రతిఘటన చేయకుండానే నాసిర్‌జంగ్ తండ్రిని క్షమాపణ కోరాడు. మహారాష్ట్రులతో యుద్ధం చేసి నిజాం తిరుచునాపల్లి స్వాధీనపరచుకున్నాడు. మద్రాసు వశపరచుకున్నాడు. ఆనాడు ఔరంగాబాద్ దక్కన్ రాజధాని.

దక్షిణదేశ దిగ్విజయ యాత్ర పూర్తి చేసుకొని 1744లో నిజాం ఔరంగాబాద్ చేరుకున్నాడు. తెలంగాణాలోని బాలకొండ పాలకుడు స్వాతంత్ర్యం ప్రకటించు కోవడంతో నిజాం బాలకొండను జయించాడు. మొదట నిజాం సైనికుడు. తటస్థ్యం ఎరిగిన రాజకీయ నిపుణుడు. ఫ్రెంచ్‌వారితోనూ, బ్రిటీష్‌వారితోను స్నేహసంబంధాలు కలిగి ఉండేవాడు. ఉత్తర భారతదేశంలోని ముస్లిం రాజ్యాలలో రాజకీయ అస్థిరత నెలకొన్నందున చాలామంది కవులు, కళాకారులు దక్కన్ కొచ్చి నిజాం ఆశ్రయం పొందారు. అరబీ, ఫార్సీ, ఉర్దూ భాషా కవిపండితులతో నిజామ్ దర్బారు ఒక వెలుగు వెలిగింది.

క్రీ.శ. 1747లో ఆఫ్గన్ రాజ్య సింహాసనం అధిష్ఠించిన అహమద్‌షా అబ్దాలీ ఢిల్లీ సింహాసనాన్ని ఆక్రమించుకోడానికి ప్రయత్నాలు చేశాడు. యుద్ధాన్ని ఎదుర్కొనడానికి సైన్యంతో నిజాం ఢిల్లీకి బయల్దేరాడు. మార్గమధ్యంలో నిజాముల్ ముల్క్ బురహాన్‌పూర్ వద్ద 1748లో చనిపోయాడు. దక్షిణాపథాన్ని పాలించిన గొప్ప ప్రభువుల పరంపరలో నిజాం చివరివాడు.

మొదట నిజాం ఢిల్లీ నుంచి దక్కను వస్తున్నప్పుడు ఖుల్దాబాద్ సమీపంలో ఒక ఫకీరు కుటీరం అగుపించింది. ఆకలిదప్పులతో మలమలమాడిపోతున్న నిజాం ఫకీరుని దర్శించుకుని తన బాధను వ్యక్తపరిచాడు. ఫకీరు వెంటనే కొన్ని కుల్చాలు (రొట్టెలు) తెచ్చి నిజాం ముందర పడవేశాడు. ఏడు కుల్చాలు తినగానే నిజాం మొగం మొత్తిపోయింది. మరొకటి తినమని ఫకీరు ఎంత చెప్పినా నిజాం ఇక ఒక ముక్కయినా తినలేకపోయాడు. నీ వంశం ఏడోతరంతో అంతరించిపోతుందని ఫకీరు జోస్యం చెప్పాడు. తన భుజంమీదవున్న పసుపు పచ్చ బట్ట నిజాం తలకు చుట్టి ఆశీర్వదించి పంపించాడు. ఆనాటి పసుపు పచ్చబట్ట దాని మధ్య గుండ్రటి రొట్టెముక్క నిజాం ప్రభుత్వ పతాకమైంది. నిజాంముద్రలు, నిజాం రాష్ట్రమ్యాపు, నిజాంపోస్టలు స్టాంపులు మొదలైనవన్నీ శ్వేతవర్ణంలోనే ఉండేవి. ❑

11. రెండవ నిజాం- నిజాం అలీఖాన్

భారతదేశ చరిత్రలో శరవేగంగా ఎన్నో మార్పులు వచ్చిన సంవత్సరంలో నిజాం అలీఖాన్ రాజ్యానికి వచ్చాడు.

మూడవ పానిపట్టుయుద్ధం:

క్రమశిక్షణారాహిత్యవల్ల మనం గతంలో ఎంతో నష్టపోయాము. 1761లో మూడవ పానిపట్టుయుద్ధం హిందూ సైన్యానికి ఒక పరీక్ష. అపారమైన హిందూ సైన్యానికి నాయకుడు కాకలు తీరిన సదాశివరావు పీష్వా, దురాక్రమణ దారులకు నాయకుడు ఇరాన్ దేశపు అహమద్‌షా అబ్దాలీ. హిందూ సైన్యాధికారులు యుద్ధతంత్రాన్ని నిర్ణయించుకునేందుకు సమావేశమైనారు. మల్హార్‌రావ్ హోల్కర్ మరికొందరు గెరిల్లా యుద్ధాన్ని ప్రతిపాదించారు. సంకుల సమరంలో సాటిలేని సైన్యాధిపతిగా ప్రశంసలందిన సదాశివరావు ఒకే దెబ్బతో శత్రువులను నాశనం చేయటం ప్రయోజనకారి అని, ముఖాముఖి యుద్ధాన్నే నిర్ణయించాడు. దానికి మల్హార్‌రావ్ అంగీకరించలేదు. అస్త్రసన్యాసం చేసినాడు. మిగిలిన సైన్యం సదాశివరావు నాయకత్వంలో యుద్ధం మొదలుపెట్టింది. యుద్ధరంగానికి చేరువలోనే ఉన్న మల్హార్‌రావు హోల్కర్ చిన్న సహాయం చేసి ఉన్నట్లయితే చరిత్రాత్మకమూ, భయానకమైన అపజయం ఒక విజయంగా మారి బహుశః మన చరిత్ర గతినే పూర్తిగా మార్చివేసి ఉండేది. కాని అతని సైన్యం చూస్తూ ఊరుకుంది. దానితో అతి శ్రేష్ఠమైన హిందూ సైన్యం పూర్తిగా ఓడిపోయి సర్వనాశనం అయిపోయింది. దురాక్రమణదారుని తరిమి వేయాలనేదే ఇద్దరి లక్ష్యమూ అయినప్పటికీ, వారిద్దరూ ఒకే తాటిపై నిలువలేక పోవడమే పరాజయ కారణం.

చారిత్రాత్మకమైన ఈ యుద్ధంలో మరాఠీలు పరాజితులైనా శత్రువుకు భారత దేశంపై పట్టుచిక్కలేదు. కాగా, మొగల్ సామ్రాజ్యం కృశించి ఢిల్లీ పరిసరాలకు

పరిమితమై పోయింది. ఒకప్పుడు ఢిల్లీ సామ్రాజ్యానికి అధీనమైన మండలాలన్నీ ఇంచుమించుగా స్వతంత్రమైనాయి.

1761లో వొడియారు రాజులను తొలగించి హైదర్‌అలీ మైసూరులో స్వతంత్ర రాజ్యం స్థాపించాడు. విజృంభిస్తున్న హైదర్‌అలీ మహారాష్ట్రులకు, నిజాంకు, బ్రిటిష్‌వారికి దక్కనులో గట్టి పోటీదారునిగా నిలిచాడు.

నిజాం తమ్ముడు బసాలత్‌జా జీవించి ఉన్నంతవరకు గుంటూరు మండలం ఆయనకు జాగీరుగా ఉండేది. 1782లో బసాలత్‌జా చనిపోయాడు. బ్రిటిష్‌వారు గుంటూరు తమకు కావాలని జాన్సన్ అనే వకీలు (మధ్యవర్తి)ని నిజాం దగ్గరకి రాయబారిగా పంపించారు. బ్రిటిష్‌వారి మాయాజాలంలో పడవద్దని నిశ్చయించుకున్న నిజాం తనకు ఉత్తర సర్కార్లు కావాలని వాదించాడు. 1786లో నిజాంకు చెప్పకుండానే బ్రిటిష్‌వారు గుంటూరు మండలం హస్తగతం చేసుకున్నారు.

1778 నుంచి హైదరాబాద్ రాష్ట్రంలో రెసిడెంటుల నియామకం ప్రారంభమైంది. 1788లో లార్డు కరన్‌వాలీస్ దగ్గరికి మీర్ ఆలమ్‌ను తన దూతగా పంపి ఉత్తర సర్కార్లు కావాలని నిజాం వాదించాడు. ఆచరణ సాధ్యంకాని కోరికలు కోరవద్దని బ్రిటిష్‌వారు దూతను తిప్పి పంపించి వేశారు. 1790లో బ్రిటిష్ వారితో కలిసి నిజాం టిప్పుసుల్తాన్‌తో పోరాటంలో దిగాడు. ఈ యుద్ధంలో కర్నూలు నవాబు నిజాంకు ఎదురు తిరిగాడు. నిజాం బ్రిటిష్‌వారి సహాయం కోరితే కర్నూలుపై నీకేమి హక్కు ఉందని ప్రశ్నించారు.

మహారాష్ట్రులు నిజాం ఇలాకాలో సర్‌దేశ్‌ముఖీ, చౌత్ అనే పన్నులు వసూలు చేసుకునేవారు. నిజాంవారికి కొంత బాకీ పడ్డాడు. 1792లో ఖాడ్లా వద్ద మహారాష్ట్రులతో నిజాంకు యుద్ధం జరిగింది. నిజాం ఫ్రెంచ్ సేనాని మోషేరేమాండ్ ధైర్యంగానే పోరాడాడు. కానీ నిజాం వెంట ఉన్న అంతఃపుర కాంతలు యుద్ధభేరీలకు భయపడి యుద్ధం ఆపుచేయమని నిజాంని కోరారు. బేగమ్‌ల మాటలు మన్నించి, మధ్యలోనే యుద్ధం ఆపివేసి నిజాం కోరి అపజయం తెచ్చుకున్నాడు. సతారా, బీదరు, బీజాపూరు, దౌలతాబాద్ మొదలైన 36 లక్షల ఆదాయంవచ్చే ఇలాకాను, 2 లక్షల రూపాయల నగదును, తన ప్రధాని అరస్తూజాను సమర్పించుకుని నిజాం

మహారాష్ట్రులతో సంధి చేసుకున్నాడు. రెండేళ్ళు మహారాష్ట్రుల వద్ద ప్రవాస జీవితం గడిపి, మహారాష్ట్రుల అంతఃకలహాలతో లాభపడి, రఘునాథరావు పక్షం వహించి, అతడు పీష్వాకాగానే నిజాం కోల్పోయిన మొత్తం ఇలాకాను తిరిగి సంపాదించుకొని వచ్చి అరస్తూజా హైదరాబాద్ చేరుకున్నాడు.

అరస్తూజా రాగానే నిజాంకు కొండంత బలం చేకూరింది. అతని సలహాపైనే తన సేనను ఫ్రెంచ్ సేనలతో ఆధునిక శిక్షణ ఇప్పించాడు. బ్రిటిష్‌వారు మరో ఎత్తు వేసి ఈసారి ప్రిన్స్ అలీజాతో తిరుగుబాటు చేయించారు. ఈ తిరుగుబాటుకు భయపడి నిజాం, టిప్పుసుల్తాన్‌తో పోరాడటానికి అంగీకరించాడు.

సబ్సిడెయిరీ విధానం:

1798లో గవర్నరు జనరల్‌గా వచ్చిన లార్డ్ వెల్లస్లీ సబ్సిడెయిరీ విధానం ప్రవేశపెట్టాడు. దీనితో సంస్థానాధీశుల స్వాతంత్ర్యం హరించుకుపోయింది. ఈ విధానం ప్రకారం: 1) సంస్థానాలలో బ్రిటిష్ ప్రభుత్వం తమ ఏజెంట్‌గా రెసిడెంట్‌ను నియమిస్తుంది. 2) సంస్థానాల రక్షణ కోసం బ్రిటిష్‌వారు నియమించే సైన్యానికి సంస్థానాధీశులే వేతనాలు చెల్లించాలి. 3) ఫ్రెంచి సైనికులను తొలగించి వారి స్థానంలో బ్రిటిష్ సేనలను నియమించాలి. మూసీనది ప్రాంతంలో రెసిడెన్సీ భవన నిర్మాణానికి నిజాం అనుమతించాడు. ఈ విధానాన్ని మొదట అంగీకరించింది నిజమే. మైసూరులో హైదర్ అలీకీ, టిప్పుసుల్తాన్‌కు వత్తాసిచ్చి, తద్వారా తమ అధికారాన్ని పెంచుకోదలచుకున్న ఫ్రెంచ్‌వారికి నిజాంవల్ల ఆశాభంగం ఎదురై 18వ శతాబ్ది చివరిలో అపజయం కలిగింది. నెపోలియన్ పతనం నాటికి మహే, కరైకల్, పుదుచ్చేరి, యానం, చంద్రనగరులలో మాత్రమే ఫ్రెంచి వారికి వలసలుండేవి.

1799లో నాల్గవ మైసూరు యుద్ధంలో మహారాష్ట్రులు, నిజాం కలిసి బ్రిటిష్ వారికి సహాయమందించారు. నిజాం సైన్యానికి మీర్ ఆలమ్ కమాండర్‌గా పనిచేశాడు. ఈ చరిత్రాత్మక యుద్ధంలో టిప్పుసుల్తాన్ వీర స్వర్గమలంకరించాడు. మైసూరు రాష్ట్రాన్ని మిత్రదేశాలు పంచుకున్నాయి.

1) మైసూరులోని పైన్‌ఘాటు తీరప్రాంతాలను, లోగడ కర్నాటక నవాబుల అధీనంలో ఉన్న జిల్లాలను బ్రిటిష్ వారే ఉంచుకున్నారు.

2) తుంగభద్రాదిట్టాన్ని మహారాష్ట్రుల కిచ్చారు.

3) హైదర్ అలీ ఆక్రమించుకున్న అనంతపురం, కర్నూలు, కడప, బళ్ళారి జిల్లాలు నిజాంకు లభించాయి.

4) ఇవిగాక మిగిలిపోయిన ప్రాంతాలతో మైసూరు సంస్థానాన్ని పునరుద్ధరించి వొడియార్ రాజులకు తిరిగి ఇచ్చివేశారు.

ఆ వెంటనే సైనిక సహకార పద్ధతిని ప్రయోగించి మైసూరు యుద్ధరంగంలో నిజాంకు లభించిన సీడెడ్ జిల్లాలను బ్రిటిష్ వారు తిరిగి స్వాధీనపరుచుకున్నారు. దీన్ని ఆంధ్రదేశ విచ్ఛిన్నం అనటానికన్న నిజాం రాజ్యవిచ్ఛిన్నమనే అనాలి. ఎన్నో అవమానాలు భరించుకుంటూ 43 సంవత్సరాల సుదీర్ఘ పరిపాలన జరిపి 1803లో నిజాం అలీఖాన్ మరణించాడు. వాస్తవంలో నాల్గో నిజామే అయినా నిజాం అలీఖాన్‌ను చరిత్రకారులు రెండవ నిజాంగా పేర్కొన్నారు. బ్రిటిష్ రెసిడెంటు జేమ్స్ పేట్రిక్ మీరాలం బంధువర్గంలోని ఖైరున్నిసాబేగంను వివాహం చేసుకున్నాడు.

మత వివక్షతలేని పరిపాలన సాగింది నిజాం అలీఖాన్ కాలంలో. భద్రాచలం దేవాలయాన్ని పునరుద్ధరించి సాలీన 40 వేల రూపాయలు కైంకర్యాలకు మంజూరు చేశాడు.

బ్రిటిష్‌వారు తలచుకుంటే స్వదేశీ సంస్థానాలను తుడిచిపెట్టి రాజాలకు, మహారాజాలకు, నవాబులకు పెన్షన్లిచ్చి ఈ భూభాగమంతటిని బ్రిటిష్ ఇండియాలో చేర్చుకో గలిగేవారే. కానీ దేశాన్ని రెండుగా చీల్చి పాలిస్తే లాభదాయకంగా ఉంటుందనీ, ప్రజలను నేరుగా దోచుకునే బదులుగా స్వదేశ సంస్థానాధీశులను ఆ పదవికి ఉపయోగిస్తే తమ లాభాలకు ఎలాంటి ఆటంకం ఉండదనీ, స్వదేశ సంస్థానాలను అలాగే ఉండనిచ్చారు. బ్రిటిష్ సామ్రాజ్యవాదాన్ని ప్రతిఘటించిన చరిత్ర వీరికి ఏ మాత్రము లేదు. ప్రారంభం నుంచి వీరు తమ మనుగడకు బ్రిటిష్‌వారిపైనే ఆధారపడి ఉన్నారనేది నిజం.

నిజాం నవాబు తను స్వతంత్రుడనని చెప్పుకున్నా బ్రిటిష్ వారికి సామంతుడుగానే ఉండేవాడు. 1800 సం॥ అక్టోబరు 10వ తేదీన దీనికి అనుగుణమైన

ఒప్పందాన్ని నిజాం అలీఖాన్ చేసుకున్నాడు. దీనికి The treaty of subsidiary అని పేరు. బ్రిటిష్ వారి సైన్యం సికిందరాబాద్‌లో మకాం వేసి ఉండేది.

రెండవ నిజాం ఎంతటి దుర్బలుడైనా అవసరమైనప్పుడు బ్రిటిష్ వారితో కఠినంగా ప్రవర్తించేవాడు. ఆరవ రెసిడెంటు కెప్టెన్ అచ్చిలిన్ క్రిక్ పాట్రిక్ రెసిడెన్సీ భవన నిర్మాణ పథకం తయారు చేసుకొని అనుమతికోసం నిజాంకు సమర్పించాడు.

"ఏం? నా రాజ్యమంత పథకం తయారు చేసుకువచ్చావు. నీకు ఎంత భవనం కావాలో అంతే పథకం తయారు చేసుకొనిరా?" అని నిజాం గద్దించాడు.

నిజాం సంగతి బాగా ఎరిగిన రాష్ట్రప్రధాని మీర్ ఆలమ్ జోక్యం చేసుకుని కోడి గుడ్డంతనో, పోస్టుకార్డంతనో పథకం తయారు చేసుకురమ్మని సలహా ఇచ్చాడు.

మరుసటి రోజు రెసిడెంటు పోస్టుకార్డుమీద రాయించిన పథకం సమర్పించగానే నిజాం సంతుష్టుడై అంగీకరించాడు. బ్రిటిష్‌వారి చర్యలపై అసంతృప్తి వెల్లడించడానికి నిజాం ప్రభువులు ఇలాంటి అర్థం పర్థంలేని పనులు చేసి సంతృప్తి పడేవారు. ❑

12. మొదటి స్వాతంత్ర్య సమరం

అఫ్జలద్దౌలా:

నవాబు నాసిరద్దౌలా తరువాత ఆతని కుమారుడు నవాబు అఫ్జలద్దౌలా 1857లో రాజ్యానికొచ్చాడు. ఇతడు సింహాసనం అధిష్ఠించిన నాలుగు మాసాలకే ప్రథమ భారతీయ స్వాతంత్ర్య సమరం మొదలైంది.

మొదటి స్వాతంత్ర్య సమరం: (సిపాయిల తిరుగుబాటు)

లార్డ్ డల్హౌసీ తన 35వ ఏట 1849 జనవరి 12వ తేదీన భారతదేశ గవర్నరు జనరల్‌గా ప్రమాణ స్వీకారం చేశాడు. ఇతడు వచ్చీ రాగానే రాజ్యవిస్తరణ పనికి పూనుకున్నాడు. కంపెనీవారి పరిపాలనలో మూడు రకాలైన రాజ్యాలుండేవి. స్వంతంత్ర రాజ్యాలు మొదటిది. ఆధార రాజ్యాలు రెండవది. తక్కినవి అధీన రాజ్యాలు. ఈ విధానాన్ని డల్హౌసీ రద్దుపరచి మూడు కొత్త విధానాలను ప్రవేశపెట్టాడు. స్వతంత్ర రాజ్యాలుగా ఉన్న బర్మా, సిక్కిం, పంజాబు మొదలైన రాజ్యాలను యుద్ధరంగంలో జయించి బ్రిటిష్ సామ్రాజ్యంలో కలుపుకున్నాడు. నిజాంవంటి పెద్ద రాజ్యాలమీద కాంటిజెంట్ సైన్యం రుద్ది వాటి సారవంతమైన భూభాగాలను కాజేశాడు. అయోధ్య మొదలైన అధీనరాజ్యాలను వాటి దుష్పరిపాలన పేరుమీద అంతం చేశాడు. కర్నాటక, తంజావూరు రాజుల పింఛన్లను రద్దుచేశాడు. మొగల్ చక్రవర్తి ఏనాడో బ్రిటిష్ వారికి పింఛనుదారుడయ్యాడు. భారతదేశాన్ని కల్లోల పరచిన డల్హౌసీకి సుఖం మాత్రం కరువైంది. 1856 మార్చి 5వ తేదీన అతడు భారతదేశం నుంచి వెళ్ళిపోతున్నప్పుడు హృదయ భారంతో చిక్కి శల్యమైనాడు. 1866 డిసెంబరు 19వ తేదీన డల్హౌసీ అతిదీనావస్థలో మరణించాడు.

పెల్లుబికిన అసంతృప్తి:

భారతదేశంలో రెండు రకాలైన వారసత్వ సిద్ధాంతాలు అమల్లో ఉండేవి. మొదటిది 'వారసీన్' పద్ధతి. రాజు చనిపోతే వారి కొడుకులకో, సమీప రక్త సంబంధీకులకో వారసత్వంగా రాజ్యాలు లభించేవి. రెండవది- 'జాన్‌షీన్' పద్ధతి. సంతానం లేనివారికి దత్తు తీసుకునే అధికారం లభించేది. ఈ జాన్‌షీన్ పద్ధతిని రద్దుపరచి డల్హౌసీ అనేక రాజ్యాలను కబళించి వేశాడు. అతడు ప్రవేశపెట్టిన నిర్వారసత్వ సిద్ధాంతం అనే బరికత్తి అనేక రాజ్యాల తలలను నరికి వేసింది. దీనితో దేశమంతా అసంతృప్తి దావానలంలా పెల్లుబికింది.

ఝాన్సీ పాలకుడు గంగాధరరావు 1858లో చనిపోయాడు. ఝాన్సీ రాష్ట్రం పీష్వాల పాలనలో ఉండేది. గంగాధరరావుకు సంతానం లేనందున ఒక కుర్రవాన్ని దత్తుతీసుకున్నాడు. దీనికి అనుమతి ప్రసాదించమని ఆయన భార్య ఝాన్సీలక్ష్మీబాయి పెట్టుకున్న దరఖాస్తును డల్హౌసీ తిరస్కరించాడు.

1855లో కర్నాటక నవాబు మహమ్మద్‌గౌర్ చనిపోయాడు. అతని వారసునికి పింఛన్ అర్హతలేదని ఉత్తరువులు జారీ అయ్యాయి. 1851లో పీష్వా రెండవ బాజీరావు చనిపోయాడు. అతడు జీవించి ఉండగా బ్రిటిష్‌వారు ఏటా 8 లక్షల రూపాయల పింఛన్ ఏర్పాటు చేశారు. బాజీరావు దత్తపుత్రుడైన నానాసాహెబ్‌కు ఈ పింఛను వర్తించదని దాన్ని ఆపుచేశాడు. 1851లో తంజావూరు రాజు చనిపోయాడు. అతడు జీవించి ఉండగా తన రెండవ కూతుర్ని వారసురాలుగా ప్రకటించాడు. స్త్రీలకు తండ్రివైపు ఆస్తిని పొందటానికి అర్హతలేదని తంజావూరుని కబళించాడు. సంబల్‌పూర్ మొదలైన రాజ్యాలకు ఇదేగతి పట్టింది. ఈ చర్యలవల్ల రాజ్యాలు కోల్పోయినవారే కాక, రాజ్యంలో ఉన్నవారూ కూడా ఒకనాడు తమకిదేగతి పడుతుందనే భయంతో దిక్కుతోచని వారైనారు. సమయం రాగానే తిరుగుబాటుకు సిద్ధంగా ఉన్నారు.

ఇన్ని రాజ్యాలు ఏకకాలంలో రద్దు కావటంతో అక్కడ వివిధ వృత్తులలో పనిచేసేవారు నిరుద్యోగులైనారు. రాజపోషణలో జీవిస్తున్న కళాకారులు, విద్యాసంస్థలు నిరాధారమైనాయి. రైతాంగాన్ని సైన్యంలో చేర్చుకునే ఉద్దేశంతో కంపెనీ పాలకులు భూమిశిస్తుని విపరీతంగా పెంచారు. "నేనేమి కథ చెప్పడం లేదు. ఇక్కడి పరిస్థితులే

ఇలా తయారైనాయి. రైతులు సేద్యం చేయడం మానుకుని బందిపోటు దొంగలు, థగ్గులుగా మారిపోతున్నారు. భారతదేశపు రైతు, రష్యా బేగారి, క్యూబా బానిస ఒకే రకమైన జీవితం గడుపుతున్నారని" క్రిస్మన్ అనే రష్యా చరిత్రకారుడు రాశాడు.

ప్రథమ స్వాతంత్ర్య సమరంలో మీరట్‌లో ప్రజ్వరిల్లిన స్వాతంత్ర్య జ్వాలలు హైదరాబాద్ చేరుకోవడానికి ఎక్కువ సమయం పట్టలేదు. ఐదవ నిజాం అఫ్జలద్దౌలా బహాదూర్ పట్టాభిషేకోత్సవంలో పాల్గొని తన ఇంటికి చేరుకోగానే ఢిల్లీ విప్లవకారుల హస్తగతమైపోయిందనే వార్త రెసిడెంటుకు తంతి ద్వారా తెలిసింది. ప్రధాని సాలార్ జంగ్‌ని పిలిపించి ఆయన ఈ వార్తను అతని చెవిలో ఊదాడు. దీనికి స్పందించిన సాలార్‌జంగ్ ఇది రహస్యమేమీ కాదని, ఈ వార్తలు నాలుగైదు రోజులనుండి ప్రజల నోటిలో నానుతున్నవని చెప్పినప్పుడు రెసిడెంటు విని విస్తుపోయాడు. ఈ సమయంలో ఔరంగాబాద్‌లో కొందరు విప్లవకారులు ప్రాణభీతితో హైదరాబాద్ చేరుకున్నారు. వాళ్ళని సాలార్‌జంగ్ బంధించి రెసిడెంటుకు కానుకగా సమర్పించాడు. అతడు చేసిన ఈ సిగ్గుమాలిన చర్యతో ప్రజలకు సాలార్‌జంగ్ మీద విపరీతమైన కోపం వచ్చింది. విప్లవకారులను విడుదల చేయవలసిందని సాలార్‌జంగ్‌కు, నిజాంకు బెదరింపు లేఖలు అందాయి. దీనిపై ప్రభుత్వం విప్లవకారులపై తీసుకునే చర్యలు మరింత కఠినం చేసింది. విప్లవకారులు ఎక్కడ కనిపిస్తే అక్కడనే కాల్చివేయవలసిందని అతిక్రూరులైన రోహిలా దళానికి సాలార్‌జంగ్ ఆదేశించాడు. వీరు నగర వీథుల్లో బారులు తీర్చి కవాతులు జరుపుతూ ప్రజల్లో భీతావహం సృష్టించారు. సాలార్‌జంగ్ ఎన్ని జాగ్రత్త చర్యలు తీసుకున్నా విప్లవం చల్లారలేదు. బ్రిటిష్‌వారు హైరాన పడిపోయారు. హైదరాబాద్ కూడా చేయిదాటిపోయిందేమోననే అనుమానం వారికి కలిగింది. దీనిపై హైదరాబాద్‌ను తమ పూర్తి శక్తితో కాపాడవలసిందని రెసిడెంటుకు ఉత్తరువులు జారీ అయ్యాయి. 'హైదరాబాద్ పోతే అంతా అయిపోయినట్లే' అనే వ్యాకులంతో బ్రిటిష్‌వారు ఇక్కడి తిరుగుబాటును కఠినంగా అణచివేశారు.

ఉత్తరాదిలో ఉవ్వెత్తున లేచిన విప్లవ జ్వాలలను చల్లార్చటానికి 1857 జూన్‌లో హైదరాబాద్ నుండి ఒకటవ, మూడవ అశ్విక దళాలను ఔరంగాబాద్ మీదుగా ఢిల్లీకి పంపారు. ఒక దళం ఔరంగాబాద్‌కు 14 మైళ్ళ దూరంలో పీల్‌గాం వద్ద విడిది చేసింది. బ్రిటిష్ వారికి వ్యతిరేకంగా పోరాడటానికి తాము సిద్ధంగా లేమని

ఆ మాటకు వస్తే హైదరాబాద్ రాష్ట్ర సరిహద్దులు దాటేది లేదని నిజాం సైన్యం ఎదురు తిరిగింది. దీనికి నాయకత్వం వహించిన అమీర్‌ఖాన్, వహీద్‌ఖాన్‌లను పట్టి ఇచ్చినవారికి వెయ్యి రూపాయల బహుమతిని బ్రిటిష్ ప్రభుత్వం ప్రకటించింది. ఔరంగాబాద్‌లో మరో సైనికుడు చీదాఖాన్ తిరుగుబాటు చేశాడు. తమను అనేక ఇబ్బందులకు లోనుచేస్తున్న చీదాఖాన్‌ను పట్టి ఇచ్చినవారికి 3 వేల రూపాయల బహుమతిని ఇస్తామని బ్రిటిష్ వారు దండోరా వేయించారు. ఈ సంగతి తెలుసుకున్న చీదాఖాన్ హైదరాబాద్‌కు తన నివాస స్థానం మార్చుకున్నాడు. చీదాఖాన్ హైదరాబాద్‌లోనే ఉంటున్న సంగతి తెలుసుకున్న సాలార్‌జంగ్ అతన్ని బంధించి రెసిడెంటుకు కానుకగా సమర్పించాడు. ఈ వార్త దావాలనంలా హైదరాబాద్ అంతా పాకిపోయింది. విప్లవకారులను విడిపించుకునే ప్రయత్నంలో కొందరు ముఖ్యులు మక్కామసీదులో రహస్యంగా సమావేశమయ్యారు. ఈ సంగతి చారుల ద్వారా తెలుసుకున్న సాలార్‌జంగ్ 11 మంది సమావేశకర్తలను బంధించి వారిని రెసిడెంటుకు సమర్పించాడు. ఉద్యమకాలంలో సాలార్‌జంగ్ చేసిన సహాయం బ్రిటిష్‌వారికి ఎంతగానో మేలు చేసింది.

ఆనాటి విప్లవకారులలో ప్రసిద్ధుడు తుర్రేబాజ్‌ఖాన్. 1857 జూలై 17వ తేదీన 500మంది రోహిల్లా వీరులను వెంటబెట్టుకొని తుర్రేబాజ్‌ఖాన్ రెసిడెన్సీ మీద దాడికి ఉద్యుక్తుడయ్యాడు. రెసిడెన్సీ పశ్చిమవైపు ఉన్న డబ్బుసింగ్, జయగోపాల్ దాస్ ఇండ్లను స్వాధీనపరచుకొని వాటిని ముట్టడి స్థావరాలుగా ఉపయోగించుకున్నాడు. జనసమ్మర్ధమైన కోఠీ ప్రాంతంలో ఉద్రిక్త వాతావరణం ఏర్పడింది. రెసిడెన్సీ భవనంలోని సైనికులు భీతావహంతో భవన ద్వారాలు మూసివేశారు. పరిస్థితి కొంతసేపు ఇలాగే ఉంటే రెసిడెంటు సైనికులు చిత్రవధకు లోనయ్యేవారే. కాని ఇంతలో సాలార్‌జంగ్ పంపిన అశ్విక దళాలు విప్లవకారులమీద మెరుపుదాడి చేసి వారిని హతమార్చాయి. ఈ దాడిలో 32 మంది రోహిలా వీరులు ప్రాణాలు పోగొట్టుకున్నారు. తన వ్యూహం ఈ విధంగా విఫలమైనందుకు తుర్రేబాజ్‌ఖాన్ ఎంతో వ్యధచెంది షాద్‌నగర్‌వైపు పారిపోతుండగా సాలార్‌జంగ్ సైనికులు ఆయనను మొగులు గిద్ద అనే గ్రామంలో పట్టుకున్నారు. తుర్రేబాజ్‌ఖాన్‌కు కుడిభుజంగా పనిచేసిన మవులీ అల్లాఉద్దీన్ను కూడా పట్టుకున్నారు. ఈ ఇద్దరు దేశభక్తులకు ద్వీపాంతరవాస శిక్ష విధించబడింది. అల్లాఉద్దీన్

అండమాన్ దీవుల్లో ఖైదీగా ఉంటూ 1884లో మరణించాడు. రహస్యంగా పారిపోయిన తుర్రెబాజ్‌ఖాన్ పట్టుబడటం ఇష్టంలేక తన కరవాలంతో శత్రువులను చెండాడటానికి సిద్ధమవుతున్న సమయంలో సాలార్‌జంగ్ సైనికులు అతని భయంకర వాలకం చూసి భయపడి క్షణం ఆలస్యం చేయకుండా తుర్రేబాజ్‌ని కాల్చి వేశారు. తుర్రేబాజ్‌ఖాన్ శవాన్ని గొలుసులతో బిగించి నగ్నరూపంలో రెసిడెన్సీ ప్రధాన ద్వారానికి వేలాడ తీయించారు.

విప్లవాన్ని చల్లార్చడంలో తమకు సహాయం అందించిన నిజాం నవాబుకు బ్రిటిష్ ప్రభుత్వం కృతజ్ఞతలు వెల్లడించి. 1861లో అతనికి 'స్టార్ ఆఫ్ ఇండియా' (భారత నక్షత్రం) అనే బిరుద ప్రదానం చేశారు. విక్టోరియా మహారాణి పక్షాన ఈ బిరుదును రెసిడెంటు డెవిడ్‌సన్ ఐదవ నిజాం అఫ్జలద్దౌలాకు ఒక ప్రత్యేక దర్బారులో బహూకరించాడు. దీనితో బ్రిటిష్ మహారాణితో సమానుడనే భ్రమ నిజాంకు తొలిగిపోయింది. బ్రిటిష్‌వారికి నిజాం విధేయుడుగా ఉండటం ప్రజలకు నచ్చలేదు. గవర్నరు–జనరల్ ఇచ్చే ప్రశంసా పత్రాన్ని రెసిడెంటు నిజాం దగ్గరికి తీసుకు పోతున్నప్పుడు దీన్ని తీవ్ర అవమానంగా భావించిన రోహిల్లా వీరుడు జహంగీర్‌ఖాన్ రెసిడెంటుపై హఠాత్తుగా దాడి జరిపాడు. కానీ దురదృష్టవశాత్తు అది గురితప్పి పక్కనే ఉన్న నిజాం అధికారికి తగిలింది. పట్టుబడిన జహాంగీర్‌ఖాన్ ఎన్ని చిత్రహింసలైనా భరించాడు కాని విప్లవ జాడ తెలుపలేదు. దేశంలో తమ ఉనికికి స్థిరత్వం కల్పించిన నిజాంకు బ్రిటిష్‌వారు కృతజ్ఞతాపూర్వకంగా కొన్ని బహుమతులు ప్రకటించారు. 1842లో షోలాపూర్ సంస్థానాధీశుడు తిరుగుబాటు చేసినప్పుడు నిజాంకు తెలియకుండా ఆ సంస్థానాన్ని బ్రిటిష్‌వారు తమ రాజ్యంలో కలుపుకున్నారు. ఇప్పుడు ఆ సంస్థానాన్ని తిరిగి నిజాంకు ఇచ్చివేశారు. కాంటిజెంటు పద్దు కింద నిజాం బాకీ పడిన 50 లక్షలకు మాఫీ ఇచ్చారు.

బ్రిటిష్‌వారికి సాలార్‌జంగ్ ఎంత సహాయం చేసినా ఆయన బలపడటం వారికి రుచించలేదు. పరిపాలన మొత్తం ఒకని చేతులలోనే ఉండటం బ్రిటిష్ రాజనీతికి విరుద్ధం. ఆరు సంవత్సరాల బాలునిగా ఉన్న ఆరవ నిజాంకు మరో సంరక్షకునిగా (కాంటిజెంట్) సాలార్‌జంగ్‌కు విరోధి అయిన షమ్‌షుల్ ఉమ్రాను నియమించారు. 1877లో షమ్‌షుల్ ఉమ్రా చనిపోతే అతని స్థానంలో సాలార్‌జంగ్ మరో విరోధి

వికారుల్ ఉమ్రాని నియమించారు. దీన్ని సాలార్‌జంగ్ తీవ్రంగా ప్రతిఘటించాడు. 'దీనికి నీవు అంగీకరించక పోతే నిన్ను బంధించి మద్రాసుకు పంపిస్తాం' అని బ్రిటిష్‌వారు హెచ్చరికలు జారీ చేశారు. చివరకు అయిష్టంగానే సాలార్‌జంగ్ ఇష్టపడ వలసి వచ్చింది. ఏమైతేనేం? ప్రతిఘటించిన అనేక రాజులను, నవాబులను పదభ్రష్టుల్ని చేసిన ఆ రోజుల్లో, నిజాములు మాత్రమే బ్రిటిష్ వారితో సఖ్యత చేసి తమ రాజ్యాన్ని కాపాడుకోగలిగారు.

1857లో గండం గట్టెక్కిన తరువాత బ్రిటిష్ వారు సంపూర్ణ అధికారాలతో ప్రవర్తించడం మొదలు పెట్టారు. 1857 వరకు రెసిడెంట్లు నిజాం దర్శనానికి వచ్చినప్పుడు మేజోళ్ళు విడిచి దొరటోపి నెత్తిన పెట్టుకుని నిజాంకు వంగి వంగి సలాములు చేసేవారు. అధికార ఉత్తర ప్రత్యుత్తరాలలో గవర్నరు-జనరల్ 'నియాజ్‌మంద్' (విన్నవించు విధేయుడు) అని, నిజాంను 'మాబదౌలత్' (దేవరవారు) అని సంబోధించుకునేవారు. ఇప్పుడు ఆ మర్యాదలన్నీ పోయాయి. తమకు బ్రిటిష్ చక్రవర్తితో సమాన హోదా లభిస్తుందన్న నిజాం కలలు పూర్తిగా చెదిరిపోయాయి. ఇకనుంచి బ్రిటిష్‌వారికి నిజాం పరమ విధేయుడై పోయాడు. ❑

13. ఆరవ నిజాం- మీర్ మహబూబ్ అలీఖాన్

నిజాం ప్రభువులందరిలో ప్రజాభిమానం పొందిన ఆరవ నిజాం మీర్ మహబూబ్ అలీఖాన్ బహదూర్ రెండు సంవత్సరాల పసిప్రాయంలో 1869లో పట్టాభిషిక్తుడైనాడు. పరిపాలన విధానమంతా సాలార్‌జంగ్ చేతుల్లోనే ఉండటం ఇష్టపడని బ్రిటిష్‌వారు షమ్‌షుల్ ఉమ్రాను కోరెజెంట్‌గా నియమించారు. వీరిద్దరి మధ్య పచ్చిగడ్డివేస్తే భగ్గున మండేది. అయినా పరిపాలన వ్యవహారంలో సాలార్‌జంగ్ మాటే చెల్లుతూ వచ్చింది.

బిరారును పొందడానికి సాలార్‌జంగ్ సరికొత్త ప్రయత్నాలు ప్రారంభించాడు. బ్రిటిష్ వారికి బాకీ పడ్డ 8౦ మిలియన్ పౌండ్ల డబ్బును సమకూర్చి పెట్టుకున్నాడు. ఇప్పుడు బ్రిటిష్‌వారి దృష్టి డబ్బుమీది నుంచి మళ్ళిపోయి బిరారుని శాశ్వతంగా వశపరచుకోవాలన్నది వారి ఆశయమైంది. ఈ విషయమై సాలార్‌జంగ్ పట్టుబట్టడంతో వారు అతనికి విరోధులైనారు. సాలార్‌జంగ్ మీద తిరుగుబాటు చేయించడానికి రెసిడెంటు సాడ్రస్ అనేక కుయుక్తులు పన్నాడు. కానీ సాలార్‌జంగ్ మీద ఉన్న ప్రజాభిమానంతో అతని పన్నుగడ ఫలించలేదు. ఇక ఇక్కడి ప్రయత్నాలకు నీళ్ళు వదులుకొని లండన్‌లో కొత్త ప్రయత్నాలు ప్రారంభించాడు. కానీ అక్కడ కూడా ఆయన మాట చెల్లలేదు. హైదరాబాద్ రాష్ట్రంలో ఎన్నో సంస్కరణలు ప్రవేశపెట్టిన అభ్యుదయశీలి సాలార్‌జంగ్ 1883లో చనిపోయాడు.

1884లో మీర్ మహబూబ్ అలీఖాన్‌కు 18 ఏళ్ళు వచ్చాయి. అదే సంవత్సరం ఫిబ్రవరి 5వ తేదీన వైస్రాయ్ లార్డ్ రిప్పన్ హైదరాబాద్ సందర్శించాడు. చౌమహల్లా రాజ ప్రాసాదంలో దర్బారు జరిగింది. ఈ సమావేశంలోనే నిజాంకు సమస్త అధికారాలు దత్తమైనాయి. మొదటి సాలార్‌జంగ్ చనిపోగానే ప్రధానమంత్రి పదవికి వారసత్వ పోరు ప్రారంభమైంది. ముల్కీ-నాన్ ముల్కీ సమస్యలు తలెత్తాయి. భారత ప్రభుత్వం

జోక్యం చేసుకుంది. సాలార్‌జంగ్ కుమారుడు రెండవ సాలార్‌జంగ్ మీర్‌లాయక్ అలీఖాన్‌ను ప్రధానిగా, రాజనరేంద్ర బహదుర్‌ని జాయింట్ అడ్మినిస్ట్రేటర్‌గా నియమించింది.

రెండవ సాలార్‌జంగ్ తన తండ్రికాలంలో పూర్తికాని కొన్ని పనులను తిరిగి చేపట్టాడు. సివిల్, క్రిమినల్ చట్టాలను ప్రత్యేకంగా రూపొందించాడు. ఉర్దూభాషను అధికార భాషగా చేశాడు. కానీ ఆయన మూడు సంవత్సరాలకంటె ఎక్కువ కాలం అధికారంలో ఉండలేకపోయాడు. రెండవ సాలార్‌జంగ్ తన పదవికి 1887 ఏప్రిల్‌లో రాజీనామా చేశాడు. ఆయన స్థానంలో ఆస్మాన్‌జా ప్రధాని అయి 1893 వరకు ఆ పదవిలో ఉన్నాడు. ఆ తరువాత సర్ వికారుల్ ఉమ్రా ప్రధాని అయి 1901 వరకు ఆ పదవిలో ఉన్నాడు. పిమ్మట ప్రధాని అయిన మహారాజా సర్ కిషన్ ప్రసాద్ 1912 వరకు అంటే 11 సంవత్సరాలు ప్రధాని పదవిలో ఉన్నాడు.

1892లో నిజాం 'ఖానూన్–చె– ముబారక్' అనే రాజపత్రం ద్వారా రాజ్యాంగ సంస్కరణలు ప్రవేశపెట్టాడు. అందులో మంత్రివర్గం, విధాన సభ మొదలైనవి చేర్చబడ్డాయి. కానీ ప్రజలకు రాజ్యాంగ పరమైన హక్కులేవీ లభించలేదు.

1887లో బ్రిటిష్‌వారు అఫ్గన్ యుద్ధాలలో మునిగిపోయారు. 60 లక్షల రూపాయల నగదు, పెద్ద సంఖ్యలో సైన్యం పంపి నిజాం బ్రిటిష్ వారిని ఆదుకున్నాడు. 1902లో వైస్రాయ్ లార్డ్ కర్జన్ హైదరాబాద్ పర్యటనకు వచ్చినప్పుడు బిరారును తమకు శాశ్వతంగా ఇచ్చివేసినట్లు నిజాంతో సనాదు రాయించుకున్నాడు. నిజాంకు జి.సి.బి. (నైట్ ఆఫ్ గ్రాండ్ క్రాస్) బిరుద ప్రదానం చేశాడు. దీన్ని చూసి నిజాం 'గేవ్ కర్జన్ బిరార్' (జి–అనగా గేవ్, సి–అనగా కర్జన్, బి–అనగా బిరారు) అని ఆవేదన వెల్లడించాడు.

స్వదేశీ ఉద్యమ ప్రభావం నిజాంరాష్ట్రం మీద కూడా పడింది. 1901 నుంచి 1908 వరకు హైదరాబాద్‌లో ఉన్న సంస్కృత పండితుడు శ్రీపాద దామోదర్ సాత్వాలేకర్ ఆర్యసమాజ్ నాయకుడు కేశవరావుతో కలిసి ఈ ఉద్యమం లేవదీశాడు. అఘోరనాథ్ చటపాధ్యాయ, దత్తు అప్పాజీ తుల్జాపూర్ కర్, వామన్‌రావులు వీరితో చేతులు కలిపారు. 1907లో నిజాం తన దూతను సాత్వాలేకర్ దగ్గరికి పంపాడు.

'లెక్చర్లివ్వడం మానుకో, పాటకచ్చేరీలు జరుపు, చిత్రలేఖనంతో డబ్బు సంపాదించుకో' అని తాఖీదు విడుదల చేశాడు. అందుకాయన సమ్మతించలేదు. దానిపై నిజాం ప్రభుత్వం సాత్వాలేకర్, తుల్జాపూర్‌కర్‌లను సంస్థానం నుంచి బహిష్కరించింది.

1908లో తుఫాను, భారీ వర్షాలవల్ల మూసీనదికి వరదలొచ్చి హైదరాబాద్ నగరాన్ని ముంచెత్తింది. 19000 ఇళ్ళు నేలమట్టమయ్యాయి. దాదాపు 15000 మంది మరణించారు. నాల్గోవంతు జనాభాకు ఇళ్ళు లేకుండా పోయింది. హైదరాబాద్ చరిత్రలో ఇది కనీవినని ఘోరం. ఆ రోజుల్లో మూడు కోట్ల రూపాయలు నష్టం వాటిల్లినట్లు అంచనావేశారు. ఆ సమయంలోనే ఇటలీ పర్యటనలో ఉన్న ప్రసిద్ధ ఇంజనీరు సర్ మోక్షగుండం విశ్వేశ్వరయ్యను సంప్రదింపుల ఇంజనీరుగా అప్పటి నిజాం ప్రభుత్వం హైదరాబాద్‌కు ఆహ్వానించింది. హైదరాబాద్ నగరానికి వరద, మురుగు నీరు నుంచి శాశ్వతంగా రక్షణ కల్పించే ఒక పథకాన్ని రూపొందించే బాధ్యతను ఆయనకు అప్పగించింది.

మహబూబ్ అలీఖాన్ ధర్మాత్ముడు. హిందూ–ముస్లిం అనే భేదభావం లేకుండా ఆయన పాలన సాగింది. మాణిక్య ప్రభువే మహబూబ్ అలీఖాన్‌గా జన్మించాడని కొందరి విశ్వాసం. అందుకే ఆయన పేరు వచ్చే విధంగా తమ పిల్లల పేర్లు పెట్టుకున్నారు. అలా పెట్టుకున్నవే మహబూబ్‌రాయ్, మహబూబ్ కరన్, మహబూబ్ పర్షాద్, మహబూబ్ రెడ్డి మొదలైనవి.

1877లో అఘోరనాథ్ చట్టోపాధ్యాయను సాలార్‌జంగ్ హైదరాబాద్‌కు ఆహ్వానించాడు. నిజాం స్టేటు రైల్వేని విస్తరించడం కోసం ఇంగ్లాండ్‌లో డబ్బు సేకరించాలన్న ప్రతిపాదనను అఘోరనాథ్ నాయకత్వంలో కొందరు వ్యతిరేకించారు. ఇది రెసిడెంటుకు కన్నెర్ర అయింది అంతే. అఘోరనాథుకు హైదరాబాద్ నుండి బహిష్కరణ శిక్ష విధించారు. కానీ ఆయన వైస్రాయ్‌కు అపీలు చేసుకోగా 1888లో వైస్రాయ్ కలుగజేసుకొని రెసిడెంటుని బయటికి పంపించివేసి అఘోరనాథ్‌ని తిరిగి ఉద్యోగంలో తీసుకున్నారు. ఈ విధంగా హైదరాబాద్ స్వాతంత్ర్యోద్యమానికి అఘోరనాథుడు తొలి కేకవేశాడు. ఆరవ నిజాం 1911 ఏప్రిల్ 3వ తేదీన ఫలక్‌నుమా రాజభవనంలో మరణించాడు. దేదీప్యమానంగా వెలిగిన ఒక జ్యోతి ఆరిపోయింది. ❑

14. సాలార్‌జంగ్ సంస్కరణలు

ముగ్గురు నిజాముల కాలంలో ప్రధానిగా పనిచేసిన మొదటి సాలార్‌జంగ్ హైదరాబాద్ సంస్థాన చరిత్రలో విశిష్టమైన వ్యక్తి. మొగలాయి పరిపాలనను అంతమొందించి రాష్ట్రంలో నూతన పద్ధతితో పరిపాలన ప్రారంభించిన కీర్తి ఇతనికే దక్కుతుంది. ఇతడు ప్రవేశపెట్టిన సంస్కరణలే హైదరాబాద్ రాష్ట్రం విచ్ఛిన్నమయ్యే దాక కొనసాగినవి.

సాలార్‌జంగ్ ప్రధానిగా రాకపూర్వం ఖాల్సా (ప్రభుత్వ) గ్రామాలలో కూడా మధ్యదళారి పద్ధతి అమలులో ఉండేది. కొన్ని భూములు నిర్ణీత పద్ధతిపై కౌలుకు ఇవ్వబడేవి. ఈ కౌలు పెరగడానికి వీలులేకుండా అంగీకారం ఉండేది. ఈ విధంగా కౌలుమీద తీసుకున్నవారు ప్రభుత్వానికి నిర్ణయించిన కౌలు చెల్లించి తాము స్వయంగా ఆదాయాలు పెంచుకునేవారు.

రైత్వారీ పద్ధతి అమలుకు రాకపూర్వం భూమిశిస్తు వసూళ్ళను వేలం వేసేవారు. ఆయా ప్రాంతాలలో బలంగలవారు ఆ వేలంపాటలో పైచేయి చేసుకుని ఆ కౌలు పొందేవారు. ఇది ఒక నిర్ణీతకాలం వరకే ఉండేది. ఆ గడువు ముగిసిన తరువాత కౌలు మార్పునకు అవకాశముండేది. ఈ విధానాన్ని 'తాహుత్తూ' లేక 'సర్‌బరస్తా' విధానమనేవారు. 'బిల్‌మక్తా' అని కూడా దీనికి మరొక పేరు ఉండేది. ఈ సర్‌బరస్తా కాలంలో ఈ తాహతు దార్లు లేదా బిల్ మక్తాదార్లు ప్రభుత్వానికి చెల్లించవలసిన మొత్తానికి అనేక రెట్లు శిస్తు ఎక్కువ వసూలు చేసుకునేవారు. ఈ విధానాన్ని సాలార్‌జంగ్ రద్దుపరిచాడు. భూమిని సర్వేసెటిల్‌మెంటు చేయించి నేరుగా ప్రభుత్వ యంత్రాంగం ద్వారా శిస్తు వసూలు చేసే విధానాన్ని ప్రవేశపెట్టాడు. అంతకుముందు సర్‌బరస్తా కాలంలో ఉన్న కంట్రాక్టర్లకు దేశముఖ్, దేశపాండ్య, దేశాయి, సర్దేశాయి వంటి బిరుదులిచ్చి వీరికి పరిహారాలు చెల్లించాడు.

ఈ విధంగా దేశముఖు, దేశపాండ్యాలు, దేశాయి, సర్దేశాయిలనే వారు అనేక ఎకరాల భూమిని తమపేర వ్రాయించుకుని ఖాల్సా ప్రాంతాలలో పెద్ద పెద్ద భూస్వాములుగా తయారయ్యారు. ఖమ్మం, నల్లగొండ, మహబూబ్‌నగర్, వరంగల్ జిల్లాల్లో 500 ఎకరాలకు పైబడిన భూస్వాములు 60 నుండి 70 వంతుల భూమిని తమ చేతుల్లో ఉంచుకున్నారు. 1942లో చేసిన ఒక సర్వే ప్రకారం రాష్ట్రమంతటా 3668 మంది దేశముఖులు, దేశపాండ్యాలు, దేశాయిలు, సర్దేశాయిలు ఉండేవారు.

నిర్మానుష్యమైన గ్రామాలలో పునరావాసం కల్పించటానికి యోగ్యమైన భూములను వ్యవసాయంలోనికి తెచ్చే ఉద్దేశంతో సాలార్‌జంగ్ ఇజారా లేక కౌలు పద్ధతి అనే మరో మార్గాన్ని ప్రవేశపెట్టాడు. ప్రారంభ దశలో కౌలు నామమాత్రంగా ఉండేది. కానీ క్రమానుగతంగా పెరుగుతూ ఉండేది. ఆ తరువాత పూర్తి రేటు వసూలు చేయబడింది. 1908లో ఈ విధానం కూడా రద్దు చేయబడింది.

1857లో సాలార్‌జంగ్ రాష్ట్రంలో రైత్వారీ పద్ధతిని ప్రవేశపెట్టాడు. ప్రారంభంలో సెటిల్‌మెంటును 20 సంవత్సరాలుగా నిర్ణయించిన తరువాత 15 సంవత్సరాలకు తగ్గించారు. ప్రతి సెటిల్‌మెంటులో శిస్తు పెరగటానికి అవకాశం కలిగించారు.

ఈ సెటిల్‌మెంటు విధానాన్ని అనుసరించి తరీ (మాగాణీ) సేద్యాన్ని నిర్బంధం చేశారు. పట్టేదారు తన సొంతఖర్చులతో తవ్వుకున్న బావికింద సేద్యం చేసుకునే భూములపై కూడా తరీ రేట్లు నిర్ణయించారు. ఈ రేటు ఎకరాకు 20, 25 రూపాయలు అంటే 10, 12 రూపాయలు ఎక్కువ (ఆంధ్రప్రదేశ్ ఏర్పడ్డ తరువాత ఈ పన్ను రద్దయింది).

1868లో జిల్లాల పునర్వ్యవస్థీకరణ జరిగింది. వీటి రెవిన్యూ పాలనకోసం అవ్వల్, దువ్వం, సువ్వం తాలుక్దార్ల పదవులను సృష్టించారు (తాలుక్దారు అంటే కలెక్టరు). కలెక్టర్లమీద పర్యవేక్షణకోసం బోర్డ్ ఆఫ్ రెవిన్యూ ఏర్పడింది. పరిపాలనా సౌలభ్యం కోసం రాష్ట్రాన్ని అయిదు డివిజన్లు, 16 జిల్లాలు, 114 తాలూకాలుగా విభజించారు.

1) ఉత్తర డివిజన్: మెదక్, ఇందూరు (నిజామాబాద్), ఎల్గందల్ (కరీంనగర్) జిల్లాలు. ఇందులో 23 తాలూకాలు.

2) తూర్పు డివిజన్: ఖమ్మం, వరంగల్, నల్గొండ, నాగర్ కర్నూలు జిల్లాలు. ఇందులో 26 తాలుకాలు.

3) పశ్చిమ డివిజన్: బీదరు, నాందేడ్, నల్దుర్గ జిల్లాలు. ఇందులో 25 తాలూకాలు.

4) దక్షిణ డివిజన్: రాయచూరు, షోలాపూరు, గుల్బర్గా జిల్లాలు. 14 తాలూకాలు.

5) వాయవ్య డివిజన్: ఔరంగాబాద్, పర్భనీ జిల్లాలు. 26 తాలూకాలు.

బొంబాయి పద్ధతిననుసరించి ఈ సంస్కరణలు చేశారు. ఇది మద్రాసు పద్ధతికి వ్యతిరేకం.

1846లోనే రాష్ట్రంలో స్వతంత్రాధికారాలతో ప్రత్యేక న్యాయశాఖ ఏర్పడింది. దీన్ని సాలార్‌జంగ్ మరింత కట్టుదిట్టం చేశాడు. జిల్లా కేంద్రాలలో సెషన్స్ కోర్టులేర్పరచి వాటి అప్పీళ్ళకని ప్రధాన న్యాయమూర్తి, నలుగురు న్యాయమూర్తులతో హైదరాబాద్‌లో హైకోర్టు నెలకొల్పారు. దివానీ, ఫౌజ్దారీ కేసులు హైకోర్టు పరం చేశారు.

వైద్యం, మింటు (టంకసాల), ముద్రణశాల, పి.డబ్ల్యు.డి. మొదలైన శాఖలను ఏర్పాటు చేసి ప్రభుత్వ యంత్రాంగాన్ని ఆధునికీకరించాడు సాలార్‌జంగ్. రాష్ట్రంలో క్యాబినెటు పద్ధతిలో మంత్రివర్గం ఏర్పడింది. మొదట్లో ఒక మదరుల్-మొహం (ప్రధానమంత్రి) నలుగురు మోహినుల్- మొహాంలు (మంత్రులు) క్యాబినెటులో ఉండేవారు. 1874లో హైదరాబాద్-వాడీ రైల్వేలైను పూర్తయింది.

ప్రభుత్వాదాయాన్ని పెంచే అనేక చర్యలు తీసుకున్నాడు సాలార్‌జంగ్. 1802లో బ్రిటిష్ వారితో చేసుకున్న ఒడంబడిక ప్రకారం ఎగుమతి, దిగుమతులపై 5 శాతం ఎక్సైజ్ డ్యూటీ విధించే అవకాశం ఉండేది. దీన్ని సాలార్‌జంగ్ ఆచరణలో పెట్టాడు. తాటి, మొహవ్వ (ఇప్ప), భంగ్, గాంజా మొదలైన మత్తుపదార్థాలకు కూడా జిల్లా బందీ పద్ధతి ఏర్పాటు చేసి ఆయా జిల్లాలలో వీటిని వేలం వేయించాడు. క్రయ విక్రయాలపై స్టాంపు డ్యూటీ విధించాడు.

ఆ రోజులలో ఉద్యోగుల వేతనాలు సూగూరు సిక్కా (నాణెం)లో లెక్కకట్టి హాలీ సిక్కాలో చెల్లించేవారు. ఈ మారకంవల్ల లభించే 10 శాతం లాభాన్ని ప్రభుత్వ ఖజానాలో జమకట్టించాడు. దీనికి 'క్యూరిస్ ప్రాఫిట్' అని పేరుండేది. ఈ క్యూరిస్

ప్రాఫిట్‌తో పాటు సంస్థానాధీశులు చెల్లించే పేష్కషులు, లోకల్‌ఫండ్ సెస్సులు, స్టాంపు డ్యూటీలు, రుసుములు మొదలైనవి ప్రభుత్వాదాయాన్ని పెంచే మార్గాలైనాయి.

సాలార్‌జంగ్ చేపట్టిన అనేక సంస్కరణలవల్ల ప్రభుత్వానికి రుణభారం నుండి విముక్తి లభించింది. రుణభారంతో సగం రాజ్యం కోల్పోయిన నిజాం ప్రభుత్వానికి స్థిరత్వం కల్పించిన పరిపాలనా దక్షునిగా సాలార్‌జంగ్‌కు ప్రజల్లో గొప్ప పేరు వచ్చింది. గతంలో అభ్యుదయ పనులు చేసిన ప్రధానులెదుర్కొన్న కష్టాలే సాలార్‌జంగ్‌కు ఎదురైనాయి. అక్రమ ఆస్తులార్జించేవారి ఆటలు సాగనందుకు వారు సాలార్‌జంగ్‌కు విరోధులైనారు. నిజాంను పదవీచ్యుతుణ్ణి (ఐదవ నిజాం) చేయడానికి బ్రిటిష్ వారితో సాలార్‌జంగ్ కుట్రలు పన్నుతున్నాడని మిథ్యాప్రచారాలు ప్రారంభించారు. దీనితో నిజాం, సాలార్‌జంగ్‌ల మధ్య విరోధం పెరిగింది. ఎంతో అవసరం ఉంటేనేగాని నిజాం దర్శనం లభించే పరిస్థితులు ఎదురైనాయి. నిజాం దర్శనానికి సాలార్‌జంగ్ వచ్చినప్పుడు అయిష్టంగా 'ప్రవేశపెట్టు' అని ఒక సాధారణ నౌకరు మాదిరిగా ప్రవర్తించే వాడు. నిజాం రాష్ట్ర అభ్యుదయమే తన ద్యేయంగా పెట్టుకున్న సాలార్‌జంగ్ 1883లో చనిపోయాడు.

ఆరవ నిజాం కాలంవరకు రాష్ట్రపరిపాలనలో ప్రధానుల పాత్రే అధికం. 1777 నుంచి 1802 వరకు ప్రధానిగా పనిచేసిన అరస్తూజా రాష్ట్ర ఆదాయంలోని ఎనిమిదవ భాగం వేతనంగా తీసుకునేవాడు. మీర్ జుమ్లా ఏటా 22 లక్షలు పొందేవాడు. మునీరుల్ ముల్క్ 6 లక్షలు, చందూలాల్ రాష్ట్రాదాయంలోని 16వ భాగం వేతనం కింద తీసుకునేవాడు. ఒకవైపు రాష్ట్ర ఆదాయం నిరంతరం కుంచించుకు పోతుంటే ప్రధానులు ఇంతేసి జీతాలు తీసుకోవటమేమిటని తమ వేతనాలు తగ్గించుకోవలసిందని బ్రిటిష్ రెసిడెంట్ జనరల్ ఫ్రెయిజర్ నిజాంకు సిఫారసు చేశాడు. దీనిపై సాలార్‌జంగ్ తన వేతనాన్ని 14 వేలకు తగ్గించుకున్నాడు.

ఉద్యోగుల సివిల్ లిస్టు (1885)

	హోదా	హిందువులు	ముస్లింలు
1	కార్యాలయ కార్యదర్శులు	37	164
2.	రెవిన్యూ సిబ్బంది	2306	347
3.	అడవుల శాఖ	25	27
4.	కరోడ్గిరి	1300	58
5.	అబ్కారీ	62	29
6.	స్టాంపులు	12	5
7.	టంకశాల	15	12
8.	తపాలశాఖ	83	118
9.	అకౌంటెంట్ జనరల్ కార్యాలయం	141	58
10.	న్యాయశాఖ	234	378
11.	పోలీసు శాఖ	479	1435
12.	విద్యాశాఖ	114	117
13.	వైద్యశాఖ	7	26
14.	ముద్రణాలయము	10	27
15.	పి.డబ్ల్యు.డి	110	55
16.	మునిసిపాలిటీలు	10	35
17.	అనువాదశాఖ	2	–
	మొత్తం	4919	2882

❑

15. ఏడవ నిజాం- నవాబు మీర్ ఉస్మాన్ అలీఖాన్ బహదుర్

ఆరవ నిజాం మీర్ మహబూబ్ అలీఖాన్ బహదూర్ 1911 సం॥ ఆగస్టు 11వ తేదీన చనిపోయాడు. అదేరోజు చివరి నిజాం మీర్ ఉస్మాన్ అలీఖాన్ బహదూర్ తన 21వ యేట గద్దెనెక్కాడు. 1911లోనే బ్రిటిష్ వారు భారత రాజధాని నగరాన్ని కలకత్తా నుంచి ఢిల్లీకి మార్చారు. ఆనాడు రాష్ట్రంలో మతకలహాలు లేవు.

31వ కాంగ్రెసు సమావేశాలు లక్నోలో అంబికా చరణ్ మజూందార్ అధ్యక్షతన 1916 సం॥ డిసెంబరు నెలలో జరిగాయి. 'మత ఘర్షణలు ఎక్కువగా బ్రిటిష్ ఇండియాలోనే జరుగుతున్నాయి. సంస్థానాలలో హిందూ-ముస్లింలు సోదర భావంగానే జీవిస్తున్నారు. ముస్లిం సంస్థానమైన హైదరాబాద్‌లో దాదాపు 70 శాతం జనాభా హిందువులదే. కాని అక్కడ గోహత్య గురించిన అల్లరులుగానీ, మొహర్రం గురించిన అలజడులు గానీ జరుగవు' అన్నారు.

ఏడవ నిజాం మీర్ ఉస్మాన్ అలీఖాన్ సమర్థుడు. ఎంతటి సమర్థుడో అంతటి వివాదాస్పదమైన వ్యక్తి. తాను సింహాసనం అధిరోహించగానే మహారాజా సర్‌కిషన్ ప్రసాద్‌ను ప్రధానమంత్రి పదవి నుంచి తొలగించి మూడవ సాలార్‌జంగ్‌కు ఆ పదవిని కట్టబెట్టాడు. ఒకసారి నిజాం, సరోజనీనాయుడును, 'సరోజినీ! నీవు నన్ను, మా నాన్నగారిని చూసావు కదా! మాలో నీకు ఏ భేదం కనిపించింద'ని ప్రశ్నించాడు. దీనిపై సరోజినీ నాయుడు "దేవుడు దివంగతరాజుకు 'దిల్' (ఔదార్యం) ఇచ్చాడు. మీకు 'దిమాగ్' (బుద్ధి) ఇచ్చాడు" అని అన్నది. అది నిజాంకు ఎంతో సంతృప్తిని కలిగించింది.

మొదటి ప్రపంచయుద్ధం 1914లో మొదలైంది. దీన్ని సాకుగా చేసుకొని ఏకంగా తన రాజ్యంలో మంత్రివర్గాన్ని తొలగించి తానే పరిపాలనా బాధ్యతలను

స్వీకరించాడు. ప్రభుత్వ యంత్రాంగం మీద పూర్తి అధికారం తనకు దక్కగానే 'నజరానా' మొత్తాన్ని పెంచాడు. నజరానా అంటే కానుక. ప్రభువుల కానుకలంటే ఈనాటి పరిభాషలో లంచం. ప్రభువుకు ఎవరు ఎక్కువ నజరానా ముట్టజెపితే అంత పెద్ద ఉద్యోగం దొరికేది. ప్రభువుకు ఘనంగా నజరానాలిచ్చి ఉద్యోగాలు సంపాదించుకున్న వారు జనబాహుళ్యం నుంచి విపరీతంగా లంచాలు గుంజేవారు. లంచం ఇవ్వకపోతే ఆఫీసుల్లో కాగితాలు కదిలేవి కావు.

మొదటి ప్రపంచయుద్ధ సమయంలో బ్రిటిష్‌వారికి నిజాం నవాబు అపరిమితంగా ధన సహాయం చేశాడు. అంటే తను జనం దగ్గర లంచాలు తీసుకుంటూ బ్రిటిష్ వారికి తాను లంచమిచ్చాడు. పెద్ద మొత్తాలలో బ్రిటిష్ ప్రభువులకి లంచమిచ్చిన నిజాం నవాబు నిరంకుశంగా పరిపాలన సాగించాడు.

హిజ్ ఎగ్జాల్టెడ్ హైనెస్:

నిజాం నవాబు ప్రజలను ఎంత ఘోరంగా దోచుకున్నా బ్రిటిష్ పాలకులు నోరు మెదపలేదు. పైగా 1918లో ఆయనను హిజ్ ఎగ్జాల్టెడ్ హైనెస్ అనే బిరుదు, 25 తుపాకీగుళ్ళ సైనిక వందనంతో సత్కరించారు. అత్యున్నతమైన ఈ గౌరవం పొందిన సంస్థానాధీశుడు నిజాం నవాబు ఒక్కడే.

యుద్ధానంతరం బ్రిటిష్‌వారు తిరిగి నిజాం సంస్థానం వ్యవహారాలలో జోక్యం చేసుకున్నారు. 1919లో సర్ అలీ ఇమామ్‌ను నిజాం రాష్ట్రానికి ప్రధానిగా నియమించారు. ఇమామ్ ఉత్తరాదివాడు. పేరుమోసిన ప్లీడరు. భారత ప్రభుత్వంలో కొంతకాలం న్యాయశాఖ మంత్రిగా పనిచేసిన అనుభవశాలి.

ఇమామ్ ప్రధాని పదవి చేపట్టగానే నజరాన పద్ధతిని నిలిపివేశాడు. సమర్థులకే ఉద్యోగాలిచ్చాడు. అధికారులలో ప్రబలిన లంచగొండితనాన్ని నిర్మూలించడానికి గట్టిచర్యలు తలపెట్టాడు. ఎక్కువ మార్కులు తెచ్చుకునే విద్యార్థులకు ఉపకారవేతనాలు మంజూరు చేసి పై చదువులకోసం విదేశాలకు పంపే విధానం ఇతడు రూపొందించిందే. హిందూ-ముస్లిం అనే భేదభావం లేకుండా పోలీసు చర్య జరిగే వరకూ ఈ విధానం కొనసాగింది.

భారతదేశంలో 1919లో ప్రవేశపెట్టిన రాజకీయ సంస్కరణల ప్రభావం హైదరాబాద్ రాష్ట్రంమీద కూడా పడింది. ప్రధాని అలీ ఇమామ్, రాయ్‌బాల్ ముకుంద్‌ను ప్రత్యేకాధికారిగా నియమించి రాజ్యాంగ సంస్కరణల మీద నివేదిక సమర్పించవలసిందిగా కోరాడు.

అలీ ఇమామ్ తొలగింపు:

ఉన్నట్టుండి ఇమామ్‌కో దుర్బుద్ధి పుట్టింది. నిజాం సంస్థానంలో ముస్లిం జనాభా పెంచాలనే ఉద్దేశంతో మలబార్‌లోని మాప్లా జాతివారిని రప్పించి పరిశ్రమలు, ఇతర అభివృద్ధి కార్యక్రమాలు వారికి అప్పగించాడు. ఖిలాఫత్ ఉద్యమం సందర్భంగా ఈ మాప్లాలు బ్రిటిష్‌వారికి ఎదురు తిరిగినవారే. అప్పుడు వారు హిందువులమీద అనేక అత్యాచారాలు కూడా చేశారు. ఈ సంగతి తెలియగానే రాష్ట్ర హిందూ నాయకులు రెసిడెంటుకు మహాజర్లు సమర్పించుకుని తమ నిరసనను తెలుపుకున్నారు. నజరానా పద్ధతిని రద్దుచేసి రాజ్యాంగ సంస్కరణల విషయంలో ఒక అడుగు ముందుకు వేసి నిజాం నవాబు అభిమానానికి దూరమైన ప్రధాని అలీ ఇమామ్ ఈ చర్యతో బ్రిటిష్ వారి అనుగ్రహం కూడా కోల్పోయాడు. ప్రధాని ఇమామ్‌ని తొలగించడానికి సాకులు వెదకుతన్న నిజాం నవాబు ఇది మంచి అవకాశంగా భావించాడు. ఒప్పందం ప్రకారం నెలకు ఏడేసి వేల రూపాయల చొప్పున రెండు సంవత్సరాల వేతనం ఇమామ్‌కు ముట్టజెప్పాడు. 1922 సెప్టెంబర్ 5వ తేదీన ప్రత్యేక రైలు ఏర్పాటు చేసి ఇమామ్‌ని సాగనంపాడు.

సర్ అలీ ఇమామ్ తరువాత ఫరీదున్ ముల్క్, వలీ ఉద్దౌలా సంవత్సరం చొప్పున ప్రధానులుగా పనిచేశారు. మళ్ళీ బ్రిటిష్ వారు జోక్యం చేసుకొని మహారాజా సర్ కిషన్ ప్రసాద్ బహదుర్‌నే ప్రధానిగా నియమించారు. ఇతడు ఐదేళ్ళు ఆ పదవిలో కొనసాగాడు. మహారాజా బహదుర్ ప్రధానిగా, రాజాబహదుర్ వెంకట్రామారెడ్డి కోత్వాల్‌గా రాష్ట్రపరిస్థితులు ప్రశాంతంగా గడచిపోయాయి. మహారాజా బహదుర్ అనంతరం 1936లో సర్ అక్బర్ హైదరీ ప్రధాని అయ్యాడు. ఆయన 1941 వరకు ప్రధానిగా ఉన్నాడు.

అభివృద్ధి కార్యక్రమాలు

నిజాం నవాబు ప్రజలకు ఏ మాత్రం స్వాతంత్ర్యం ఇవ్వలేదు. కాని కొన్ని ప్రజాభ్యుదయ కరమైన పనులు మాత్రం చేశాడు.

1400 ఎకరాల విస్తీర్ణంలో ఉస్మానియా విశ్వవిద్యాలయం ఏర్పడింది. అత్యున్నత స్థాయిలో అత్యున్నత ప్రమాణాలతో ఉర్దూలో బోధన జరిగే విశ్వవిద్యాలయం చూసి ముక్కుమీద వేలు వేసుకున్నవారున్నారు. ఆ వెంటనే దారుల్ తర్జుమా (అనువాద విభాగం) ఏర్పాటు చేసి పాఠ్యగ్రంథాలను ఉర్దూలోనికీ అనువాదం చేయించాడు. మూసీనది వరదలను అరికట్టడానికి ఉస్మాన్‌సాగర్, హిమాయత్ సాగర్‌లు నిర్మించాడు. నిజాం సాగర్ నిర్మాణంతో ఏటా మూడు లక్ష ఎకరాలకు నీటిపారుదల సౌకర్యం లభించింది. పాలేరు, వైరా, తుంగభద్ర, రాజోలిబండ, కడెం, మూసీ, మానేరు ప్రాజెక్టులు ఉస్మాన్ అలీఖాన్ నిర్మించినవే. ఈ ప్రాజెక్టులకు రూపకల్పన చేసిన ఇంజనీరు నవాబు అలీ నవాజ్ జంగ్.

బోధన్‌లో నిర్మించిన నిజాం షుగర్ ఫ్యాక్టరీ ఆసియా ఖండంలోనే పెద్దది. ఉస్మానియా విశ్వవిద్యాలయం, ఉస్మానియా దవాఖానా, హైకోర్టు,స్టేటు సెంట్రల్ లైబ్రరీ, అసెంబ్లీ భవనాలు నిజాం కట్టించినవే. భవనాల నిర్మాణంలో నిజాం మొగలు చక్రవర్తులకు దీటు అనిపించాడు.

నిజాం రాష్ట్రంలోని రైల్వేలను 'నిజాం గ్యారెంటీడ్ కంపెనీ' అనే బ్రిటిష్ సంస్థ నడిపేది. 1930లో దీనిని నిజాం స్వాధీన పరుచుకున్నాడు. అందుకుగాను ఆ కంపెనీకి పదికోట్ల రూపాయలు చెల్లించాడు. సంస్థ పేరును నిజాం స్టేట్ రైల్వే (ఎస్.ఎస్.ఆర్.) గా మార్చాడు. నిజాం స్టేటు రైల్వే 1932లో రోడ్డురవాణాను ప్రారంభించింది. దేశంలో రహదారులను జాతీయం చేసిన మొదటి సంస్థానం ఇదే.

ఏడవ నిజాం కాలంలో రాష్ట్రం ఆర్థిక, పారిశ్రామిక రంగాలలో చెప్పుకోదగిన అభివృద్ధిని సాధించింది. కానీ సంస్థానంలోని భూస్వామ్య వ్యవస్థ సామాన్యులకు ప్రయోజనం కలిగించలేక పోయింది. రాష్ట్రంలోని భూములలో 60 శాతం దివానీ (ప్రభుత్వ ప్రాంతం), 40 శాతం సర్ఫెఖాస్, జాగీర్లలో ఉండేది. హైదరాబాద్ రాష్ట్ర విస్తీర్ణం 82,698 చదరపు మైళ్ళు. అందులో సర్ఫెఖాస్ 8,100 చ.మై. పాయిగా

3,262 చ.మై., జాగీర్లు 1,100 చ.మై. మిగతాది దివానీ. 59.21 శాతం. సర్ఫెఖాస్ విస్తీర్ణం 50 లక్షల ఎకరాలు. దీనినుంచి వచ్చే ఆదాయం 3 కోట్లు. నిజాం నవాబు హైదరాబాద్ ప్రభుత్వానికి ఏ విధమైన పన్ను చెల్లించేవాడు కాదు. ఈ ఆదాయమే కాకుండా నవాబుకు ప్రభుత్వ ఖజానానుంచి ఏటా యాభై లక్షలు చెల్లించవలసి వచ్చేది. నిజాం నవాబు బంధువుల భూములు, అంటే పాయేగా భూములు ఎక్కువగా మరట్వాడాలో ఉండేవి. వీటిని నిజాం బంధువులైన ముగ్గురు నవాబులు పంచుకున్నారు. తద్వారా ఆస్మాన్‌జాకు 30 లక్షలు, ఖుర్షీద్‌జాకు 20 లక్షలు,సర్ వికారుల్ ఉమ్రాకు 15 లక్షల రూపాయల ఆదాయంవచ్చే భూములు లభించాయి.

దివానీ విభాగం పేరుకు రైత్వారీ పద్ధతిలో నడిచేది. ఆచరణలో భూస్వామ్య విధానాలే చలామణి అవుతుండేవి. రైత్వారీ పద్ధతి ప్రవేశపెట్టినప్పుడు ఎంత శిస్తు చెల్లించే తాహతు ఉంటే అంత భూమి ఉంచుకునేందుకు భూస్వాములకు అనుమతించారు. భూస్వాములను దేశ్‌ముఖ్, దేశపాండ్యా, మఖ్తేదారు, బంజర్‌దార్, ఇజారాదార్ అనే పేర్లతో పిలిచేవారు. ఈ రకంగా దున్ని పండించే రైతును కౌలుదారుగా దిగజార్చింది రైత్వారీ పద్ధతి. మూటకట్టి మేతపెట్టినట్లయింది రైతుల పరిస్థితి.

నిజాం బిరుదులు:

రకరకాల బిరుదులతో నిజాంను ప్రజలు కీర్తించేవారు. ప్లేటో, అరిస్టాటిల్ వంటి మేధావి అన్నారు. ఇరాన్ జానపద గాథల వీరుడు రుస్తుంకు దీటైనవాడన్నారు. ఎ-జమాన్, ముజఫర్ ఉల్-ముల్క్, నవాబు మీర్ ఉస్మాన్ అలీఖాన్ బహదుర్ ఫతేజంగ్, సిప్పేసాలార్, లెఫ్టినెంట్-జనరల్, ఫెయిత్‌ఫుల్ టు బ్రిటిష్ గవర్నమెంట్, నిజాం ఉద్దౌలా, నిజాం ఉల్‌ముల్క్, ఏడవ నిజాం. ప్రజల నోట మాత్రం 'ఆలాహజ్రత్'గానే ప్రసిద్ధుడు.

సంస్థానాలు:

మొత్తం 14 సంస్థానాలలో గద్వాల, వనపర్తి, జటప్రోలు, అమరచింత, పాల్వంచ సంస్థానాలకు మాత్రమే పాలనాధికారాలు ఉండేవి. దోమకొండ, గోపాలపేట, ఆనెగొంది, రాజాపేట, దుబ్బాక, నారాయణపేట, పాపన్నపేట, సిర్నాపల్లి, గురుగుంట

(రాయచూరు జిల్లా) సంస్థానాలకు పాలనాహక్కులు లేవు. సంస్థానాధీశులు ఇష్టం వచ్చిన విధంగా పన్నులు విధించేవారు.

గద్వాల సంస్థానంలో 120 గ్రామాలు, 97 శివారు గ్రామాలు ఉండేవి. ఖాల్సా ఇలాకాలో లేని అనేక పన్నులను ఈ సంస్థానంలో విధించారు.

1) *విరాళపుపన్ను:* కార్తీకమాసం పూజలపేర, మాఘమాసం దానాల పేర రైతుల మీద ప్రత్యేక పన్నులు విధించేవారు. ఆబ్కారీ (కల్లుగీత) ముస్తాజర్ల మీద ఒకరూపాయి, మహాసిలిపైన 1 అణా 3 పైసలు అదనంగా వసూలు చేసేవారు.

2) *నుజుల్:* (ఇండ్లపన్ను) ఇంటి స్థలంపై గజానికి అణా చొప్పున, భవనాలపై ఒక రూపాయి నుంచి 2 రూపాయల చొప్పున ఇంటి పన్ను వసూలు చేసేవారు.

3) *సీసు బంచరాయి:* ఖాల్సా ఇలాకాలో శాల్తి ఒక్కంటికి 4 పైసల చొప్పున పన్ను ఉండగా, సంస్థానంలో ఆవు, ఎద్దు, పడ్డలకు అణా చొప్పున, బర్లకు రెండణాల చొప్పున, వంద గొర్లకు 5 రూపాయల చొప్పున, వంద మేకలకు 25 రూపాయల చొప్పున పన్ను వసూలు చేసేవారు. 1340వ ఫస్లీలో ప్రభుత్వం రద్దుచేసిన బంచరాయి (పశువుల మేతకు విధించే పన్ను) పన్నును సంస్థానంలో కొనసాగించారు.

4) *ఆయాగల్లా:* శేరు మొదలుకొని 5 శేర్లు చొప్పున వడ్లు కానీ, జొన్నలు కానీ ఇంటింటికి వసూలు చేసేవారు.

5) *ఏనుగు పన్ను:* ఏనుగులు లేకున్నా సంస్థానం వారి ఎడ్లకోసం రైతుల వద్ద చొప్ప ఉచితంగా వసూలు చేసేవారు.

బిరారు సమస్య:

1902లో వైస్రాయ్ లార్డు కర్జన్ 6వ నిజాంకు ఓ లేఖరాస్తూ బిరారు పై ఎలాంటి ఆశలు పెట్టుకోవద్దని తెలియజేశాడు. ఇది తన విధానమే కాదు రానున్న వైస్రాయ్‌ల విధానం కూడా అని ఖండితంగా చెప్పాడు. అయినా ఏడవ నిజాం బిరారు కోసం పోరు మానలేదు. 1926లో నిజాం ప్రభుత్వానికి బ్రిటిష్ ప్రభుత్వంతో

సంధి కుదిరింది. నిజాంకు బిరారుపై కొన్ని రాయితీలు లభించాయి:-

1. ఇకమీదట జరిగే ఉత్తర ప్రత్యుత్తరాలలో హైదరాబాద్ నిజాంను 'నిజాం ఆఫ్ హైదరాబాద్ అండ్ బిరారు' అని పేర్కొంటారు.

2. బిరారు రాజ్యంలో బ్రిటిష్ పతాకంతోపాటు నిజాం పతాకం కూడా ఎగురవేయ బడుతుంది.

3. మధ్యపరగణాలలో (ఎం.పి) జరిగే అధికార విందులకు నిజాంను ఆహ్వానిస్తారు.

4. బిరారు ప్రజలకు కూడా నిజాం బిరుదులు ప్రసాదించవచ్చు.

5. హైదరాబాద్ రాష్ట్రంలో చదువుకున్నవారికి బిరారులో కూడా పరిగణన లభిస్తుంది.

6. మధ్య పరిగణాల రాజధాని నగరంలో, బిరారు ముఖ్యపట్టణాలలో నిజాం తన ఏజెంట్లను నియమించుకోవచ్చు.

7. యువరాజును ప్రిన్స్ ఆఫ్ బిరారు అని పిలుస్తారు.

8. బ్రిటిష్ ప్రభుత్వం నిజాం ప్రభువుకిచ్చే 25 లక్షల రూపాయల పరిహారం ఇకముందు కూడా చెల్లిస్తుంది.

ఈ షరతులవల్ల నిజాం కొత్తగా పొందిందేమీ లేదు, సనదులు, గౌరవాలు తప్ప. ❑

16. పరిపాలనా వ్యవస్థ

రాష్ట్ర పరిపాలన నిమిత్తం 'బాబ్-హుకుమత్' (కార్యనిర్వాహక సభ) ఉండేది. మంత్రిమండలి అధ్యక్షుణ్ణి సదరె-ఎ-ఆజమ్' (ప్రధానమంత్రి) అనేవారు. 7గురు మంత్రుల సంఖ్య 9కి పెరిగింది. ప్రధానమంత్రికి కల్దారు సిక్క (బిజి కరెన్సీ)లో 5 వేల వేతనం, నూరు రూపాయల అలవెన్స్, బ్రిటిష్ మంత్రులకు 4 వేల రూపాయల కల్దారు వేతనం లభించేది.

పరిపాలనా వ్యవహారంలో నిజాం ఖచ్చితంగానే ఉండేవాడు. దేశంలోని నలుమూలల నుంచి మతానుబంధంతో నిమిత్తంలేకుండా నిపుణులైనవారిని రప్పించి తన పరిపాలన చక్రంలో ఇమిడ్చేవాడు. మూసీవరదలను అరికట్టడానికి సర్ ఎం. విశ్వేశ్వరయ్య సేవలను వినియోగించుకున్నారు. ఏడవ నిజాం ఉస్మాన్ అలీఖాన్ రాష్ట్రంలో చక్కని పరిపాలనా యంత్రాంగాన్ని రూపొందించాడు. 'జాబితె-అక్లాక్' (సివిల్ కోడ్)లోని రెండు ఫర్మానాలను పరిశీలిస్తే ఈ విషయం వెల్లడవుతుంది.

1) అధికారులు పర్యటనలో ఉన్నప్పుడు నృత్య, గాన వినోదాలు, సరదాలు చేసుకుంటున్నారని నాకు తెలిసింది. దీన్ని నేను చాలా తీవ్రమైన విషయంగా భావిస్తున్నాను. దీనివల్ల ప్రభుత్వ యంత్రాంగంలో భ్రష్టాచారం పెరుగుతుంది. కనుక నేనొక హుకుం జారి చేస్తున్నాను. ఇలాంటిపనులు చేసే అధికారులపై కఠినమైన చర్యలు తీసుకొనబడుతాయి (1340 హిజ్రి, 16 జమాదుల్ అవ్వల్).

2) ఇక ముందు అధికారులందరు విధిగా పాటించవలసిన ఒక తాఖీదు విడుదల చేస్తున్నాను. కోర్టులలో అధికార బాధ్యతలు నిర్వహిస్తున్నప్పుడు ఏ అధికారైనా టీ తాగడం, సిగరెటు పీల్చడం చేయరాదు. బోడి నెత్తిన ఉండరాదు. అందరూ విధిగా దస్తార్ పెట్టుకొని, షేర్వాణీ ధరించి కార్యాలయాలకు రావాలి. వకీళ్ళ ఎడల, ప్రజల ఎడల మర్యాదగా ప్రవర్తించాలి (1334 హిజ్రి, 17 షవ్వాల్).

నిజాం ప్రభుత్వంవారు తాలూకా, జిల్లా కేంద్రాల్లోని కొన్నిటి పేర్లను మార్చి తమకు నచ్చినపేర్లు పెట్టారు. మహబూబ్‌నగర్ ఒక జిల్లా కేంద్రం. పాలమూరు అనే పెద్ద గ్రామం దీనిని ఆనుకుని ఉంది. దీనిని జిల్లా కేంద్రంగా మార్చి మహబూబ్‌నగర్ అని పేరు పెట్టారు. పూర్వం మహబూబ్‌నగర్ అనే గ్రామమైనా, పట్టణమైనా అక్కడ లేదు. వరంగల్లు జిల్లాలోని తాలూకా కేంద్రమైన మానుకోటను మహబూబాబాద్ అని పేరు మార్చారు.

మహబూబ్ అలీఖాన్ ఆరవ నిజాం. మహబూబ్‌నగరానికి, మహబూబ్ ఆబాద్‌కి ఆయన పేరు పెట్టుకున్నారు. నల్లగొండ జిల్లాలో హుజూర్‌నగర్ అనే తాలూకా కేంద్రం ఉన్నది. దాని అసలు పేరు పోచంచర్ల. కరీంనగర్ సమీపంలో సుప్రసిద్ధమైన ఎలగందల అనే పెద్ద గ్రామమున్నది. దానికి చారిత్రక ప్రాధాన్యత ఉన్నది. బమ్మెరపోతన రచించిన శ్రీమదాంధ్ర భాగతములోని కొంతభాగాన్ని రచించిన యలగందల నారయ ఈ గ్రామవాసి అని ఒక అభిప్రాయముంది. నిజామాబాద్ సమీపాన ఇందూరు అనే పెద్ద గ్రామముంది. ఆ పేరును వదిలి నిజామాబాద్ అని పేరు పెట్టారు. పూర్వం ఆదిలాబాద్ జిల్లా కేంద్రం అసిఫాబాద్‌లో ఉండేది. దీని అసలు పేరు జనగామ. ఈ చిన్న పట్టణాన్ని 'జిల్లా జనగామా' అనే పేరుతో ఇటీవల దాకా ప్రజలు పిలిచేవారు. ఇలాంటి ఉదాహరణలు మరికొన్ని చూపవచ్చు.

గ్రామాల పేరు చివరకు 'పాడు' అనే పదం ఉండటం సహజం. పాడు అనే పదానికి పల్లె అని అర్థం. దానిని పహాడ్‌గా మార్చారు. బూర్గుంపాడునుంచి బూర్గుంపహాడ్ అయింది. పహాడ్ అనే పదానికి కొండ అని అర్థం. ప్రజలందరి నాలుకలపై ఉండే పట్టణాలు, గ్రామాల పేర్లు మార్చి వక్రీకరించడం ఆంధ్ర సంస్కృతిని అణచివేయడానికి చేసిన ప్రయత్నాలలో ఒక భాగమే.

ఎం.విశ్వేశ్వరయ్య రూపొందించిన పథకం ప్రకారం రూపుదిద్దుకున్నవే ఈనాడు హైదరాబాద్ నగరానికి మంచినీటిని అందిస్తున్న ఉస్మాన్‌సాగర్, హిమాయత్ సాగర్ జలాశయాలు. హైదరాబాద్ కంటోన్మెంటు ప్రాంతానికి, ఆయన ఒక పథకాన్ని రూపొందించాడు. 1922లో తిరిగి నిజాం ప్రభుత్వం ఆహ్వానంపై వచ్చిన విశ్వేశ్వరయ్య బృహత్తరమైన భూగర్భ మురుగు నీటి పారుదల పథకాన్ని రూపొందించి ఆధునిక హైదరాబాద్ నగర నిర్మాణానికి పునాదులు వేశాడు.

హాలీ సిక్కా:

బ్రిటీష్‌వారి పరిపాలనలో యావద్భారతానికి కల్దార్ నాణెమే (బి.జి. కరెన్సీ) లీగల్ టెండర్ అయినప్పటికీ తిరువాన్కూరు, హైదరాబాద్ సంస్థానాలకు మాత్రమే ప్రత్యేక కరెన్సీలు చెలామణిలో ఉండేది. నూరు రూపాయల హాలికి 83 రూపాయల 5 అణాల 3 పైసలు కల్దారు మారకం లభించేది. 1883 వరకు చేతితోనే నాణేలు తయారు చేసేవారు. 1894లో యంత్రాలమీద చర్ఖీ నాణేలు తయారు చేయడం మొదలుపెట్టారు. ఈ నాణెం 172.5 గ్రెయినుల బరువు కలది. ఈ చర్ఖీ నాణెం కూడా ఉస్మానియా సిక్కా (నాణెం) ఆకారంలోను, సైజులోను ఉండేది. నాణెం ఎదుటి భాగంలో హిజ్రీలో ముద్రింపబడిన సంవత్సరం 'నిజాం ఉల్‌ముల్క్ ఆసఫ్‌జా బహదుర్' అని, రెండవ వైపు 'జర్బ్ ఫర్ఖుందా బున్సద్ హైదరాబాద్ జులుస్ మైమనత్ మనూసే' అని రాయబడి ఉండేది. 1905 నుంచి కొత్త నాణానికి వెనుక చార్మినార్ బొమ్మ ముద్రించారు. చార్మినార్‌లో ప్రధానమైన కమాను భాగంలో అప్పటి పరిపాలకుని పేరులోని మొదటి అక్షరం 'మీం' (ఎం) అని చేర్చారు. దీనికి హాలీ సిక్కా అని నామకరణం చేశారు. హాలీసిక్కా అనగా ప్రస్తుతం అమల్లో ఉన్న నాణెం– ఉస్మాన్ అలీఖాన్ పరిపాలన రాగానే 'మీం' అక్షరం స్థానంలో 'అయిన్' (ఓ) అనే అక్షరం మార్చారు. ఆ అక్షరం ఉర్దూ లిపిలో మారింది.

1918లో పేపరు కరెన్సీ చెలామణిలోకి వచ్చింది. 1939 వరకు ఈ నోట్లు ఇంగ్లీషులో అచ్చువేయాలని ప్రభుత్వం నిర్ణయానికి వచ్చింది. నాసిక్‌లోని సెక్యూరిటీ ప్రింటింగ్ ప్రెస్‌లో నోట్లు అచ్చువేయటానికి ఏర్పాట్లు చేశారు. ఇవి వెనుకటికంటె సైజులో చిన్నవి. ఫోర్జరీ నోట్లు తయారు చేయడానికి వీలులేకుండా ఈ నోట్లలోని వర్ణ విన్యాసం కఠినతరం చేయబడింది.

1939లో అయిదు, పదిరూపాయల కొత్తనోట్లు వచ్చాయి. ఆ తరువాత సంవత్సరం నూరు రూపాయల నోట్లు, మరో రెండేళ్ళకు వేయి రూపాయల నోట్లు వచ్చాయి. 1943లో రూపాయి నోటు చెలామణిలోకి వచ్చింది. ఈ రూపాయి అజమాయిషీలో నెంబరింగు పనులు జరిగాయి. 1955 ఏప్రిల్ 1 నుండి హాలీసిక్క పూర్తిగా రద్దయ్యింది.

ఉద్యోగుల వర్గీకరణ

మూడువేలు, అంతకు ఎక్కువ	2,500 వేతనం	2,250 వేతనం	2,000 వేతనం
1. ప్రధాన న్యాయమూర్తి	అక్కౌంటెంట్ జనరల్	కార్యదర్శి	జాయింట్ సెక్రటరి
2. జుడిషియల్ కమిటీ సభ్యులు	ఐ.జి.పి	సూబేదార్లు	సెక్రటరీలు
3. అసెంబ్లీ ఛైర్మన్	వైస్‌చాన్సులర్ పబ్లిక్ సర్వీస్ కమీషన్ సభ్యులు హైకోర్టు న్యాయ మూర్తులు, సెక్రటరీ కో ఆర్డినేషన్	ఛీఫ్ ఇంజనీర్ ఎక్సైజ్ సూపరిండెంట్ కన్సర్వేటర్ ఆఫ్ ఫారెస్ట్స్ ఆదాయపు పన్ను, విద్య, వైద్య శాఖల డైరెక్టర్లు	డైరెక్టర్లు

పారిశ్రామికాభివృద్ధి:

పరిశ్రమరంగంలో రాష్ట్రం అభివృద్ధి పథంలో నడిచింది. ఔరంగాబాద్ మిల్స్ లిమిటెడ్, ఉస్మాన్ షాహీ మిల్స్ లిమిటెడ్, ఆజంజాహీ మిల్స్ లిమిటెడ్, మహబూబ్ షాహీమిల్స్ లిమిటెడ్, రాంగోపాల్ మిల్స్ లిమిటెడ్, హైదరాబాద్ స్పిన్నింగ్ అండ్ వీవింగ్‌మిల్స్ అనే ఆరు పెద్ద బట్టల మిల్లుల్లో 52 వేలమంది కార్మికులు పనిచేసేవారు.

సింగరేణి గనులలో తప్ప దక్షిణభారతదేశంలో బొగ్గు మరోచోట దొరకదు. రాయచూరు జిల్లా హట్టి బంగారు గనుల నుండి ఏటా వెయ్యి ఔన్సుల మేలిమి బంగారు తీసేవారు. సున్నపురాయి, గ్రానేటు, అభ్రకము, ఇనుము, క్వార్ట్స్ మొదలైన ఖనిజాలు లభించేవి. 1928లో బేగంపేటలో దక్కను గ్లాసు ఫ్యాక్టరీ పని ప్రారంభమైంది. చార్మినార్, గోల్కొండ మార్క్ సిగరెట్లను వజీర్ సుల్తాన్ అండ్‌కో సిగరేటు ఫ్యాక్టరీ ఉత్పత్తి చేసేది. మేజోళ్ళు, గుండీలు, బట్టల అద్దకం, బిస్కెట్లు, పేంట్స్, వార్నిష్, షాబాద్ బండలు తయారు చేసే ఫ్యాక్టరీలు విరివిగా ఉండేవి. ❑

17. విద్య, విజ్ఞానం, సంస్కృతి

నిజాం ప్రభుత్వం స్కూళ్ళను, కాలేజీలను తానే నడిపించేది. విద్యా వ్యవస్థపై గుత్తాధికారం కలిగి ఉండేది. ప్రైవేటు విద్యా సంస్థలు చాలా అరుదుగా ఉండేవి. వాటిని ప్రభుత్వం అనుమతించక పోయేది. ప్రభుత్వం నడిపిన స్కూళ్ళద్వారా చేసిన విద్యాభివృద్ధి చాలా స్వల్పం.

ప్రభుత్వ స్కూళ్ళలో కూడా చినబాలశిక్ష, పెదబాలశిక్ష, ఉత్తరాలు చదువుట నేర్పే విధానం ఒక భాగం. స్కూల్ టెక్ట్స్ పుస్తకాలున్నప్పటికీ సామాన్యులు కోరే ఈ శిక్షణను ప్రాథమిక పాఠశాలల ఉపాధ్యాయులు కాదనలేకపోయారు. కొత్త విధానం అమలు కావడానికి పూర్వం ఇదే అమలులో ఉన్నందున దీనిని మానివేయడానికి కొన్ని సంవత్సరాలు పట్టింది. ప్రారంభంలో ఉర్దూలో విద్యావిధానం ఉన్నప్పటికీ కింది తరగతులలో తెలుగు పుస్తకాలను కొనసాగించారు. కందుకూరి వీరేశలింగం పంతులుగారు రచించిన వాచకాలు వీటిలో కొన్ని. క్రమంగా మొదటి తరగతి నుంచి ఉర్దూలో విద్యావిధానం కొనసాగింది. తెలుగు రెండవ భాషగా ఉండేది. ప్రారంభంలో ఉర్దూ టెక్ట్స్ పుస్తకాలన్నీ ఉత్తర హిందూస్థానం నుండి దిగుమతి అయ్యేవి. వీటిలో ఉపయోగించిన భాష కఠినమైనందున తెలుగు విద్యార్థులకు పాఠాలను అర్థం చేసుకోవడం అతికష్టంగా ఉండేది. క్రమంగా సంస్థానంలోనే టెక్ట్స్ పుస్తకాలను తయారు చేసి దిగుమతి మానివేశారు. ఇవి కొంత సులభమైన ఉర్దూ భాషలో ఉండేవి.

చరిత్రకు సంబంధించిన పుస్తకాల పాఠాలన్నిటిలో ముస్లిం చక్రవర్తులు, రాజులు, వారి ప్రధానులు, వారి దర్బారులోని విద్యావంతుల వర్ణనలే హెచ్చుగా ఉండేవి. ముస్లింరాజులు హిందూరాజులపై విజయాలు సాధించి వారిని ఓడించిన ఘటనలను సవివరంగా రాసేవారు. ఇస్లాం మతాన్ని బోధించే పాఠాలు ఎక్కువగా ఉండేవి. అక్కడక్కడ ముస్లిం చక్రవర్తుల దర్బారులో ఉండే హిందువుల గురించిన

పాఠాలు కూడా ఉండేవి. రాజా బీర్‌బల్, రాజా తాన్‌సేన్ లాంటివి. కానీ ఆంధ్రుల రాజ్యాలను, ఆంధ్రుల జీవిత పరిస్థితుల గురించి ఎక్కడా ఉదాహరించకపోయేవారు. ఉదాహరించినా నాలుగు మాటలు చెప్పి దాటవేసేవారు. బ్రిటిష్‌వారు పెట్టిన ఒరవడే ఇది. హిందూ యుగము, ముస్లిం యుగము, బ్రిటిష్‌యుగం అని విభజించి చరిత్ర రాయడం ఆనాటి అలవాటు. ప్రాథమిక, మాధ్యమిక పాఠశాల తరగతులలో అక్కడక్కడ చరిత్రను చెప్పేవారు. ఇది ప్రధానంగా నిజాము నవాబు, అతని పూర్వుల చరిత్ర రూపంలో ఉండేది. హైదరాబాద్ సంస్థానపు భూగోళం, బోధనాంశంగా ఉండేది. సామాన్య గణితము, సైన్స్ మొదలైన కోర్సులన్నీ ఉర్దూలోనే చెప్పేవారు.

హైస్కూల్, కాలేజీ తరగతుల పాఠ్యపుస్తకాలను ఉర్దూలోనికి తర్జుమా చేయించారు. చరిత్ర, తత్త్వశాస్త్రం మొదలగు పుస్తకాలనే కాక, సైన్స్, గణిత శాస్త్రం పుస్తకాలు కూడా తర్జుమా చేయించారు. వీటిలో ఉపయోగించిన ఉర్దూభాష, పార్సీ, అరబ్బీమయంగా ఉండేది. విద్యార్థులకు వాటిలోని విషయంతోపాటు భాషను కూడా అర్థం చేసుకోవడం కష్టంగా ఉండేది. ఇంగ్లీషు భాషకు సంబంధించిన పుస్తకాలను ఇతర రాష్ట్రాల నుంచి దిగుమతి చేసుకునేవారు.

ఉర్దూ భారతదేశపు భాషల్లో ఒకటి. బ్రిటిష్‌వారి తోడ్పాటుతో నిజాం ప్రభుత్వం ఉర్దూను విశ్వవిద్యాలయ స్థాయి వరకు బోధనా భాషగా చేసి అమలు జరిపింది. ఉర్దూ దేశీయ భాషల్లో ఒకటైనప్పటికీ కొద్దిమంది తప్ప సంస్థాన ప్రజల మాతృభాషల్లో ఒకటికాదు. తెలుగు, మరాఠీ, కన్నడం- వారి వారి మాతృభాషలు, వీటికి ప్రత్యామ్నాయంగా ఉర్దూను ప్రవేశపెట్టి పరాయి భాషాధిపత్యాన్ని ప్రజలపై రుద్దింది నిజాం ప్రభుత్వం. దీని ప్రభావంగా తెలుగువారిలో విద్యావ్యాప్తి తగ్గిపోయింది. ఈ వాస్తవాన్ని గుర్తించలేని విశ్వకవి టాగూరు నుంచి రాజాజీ వరకు ఈ విధానాన్ని ఆకాశానికెత్తారు. అయినా సంస్థానంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడగానే దీనిని రద్దు చేసి ఇంగ్లీషును ప్రవేశపెట్టారు.

ఉద్యోగాల్లో చేరిన తెలుగువారిలో తమకో భాష, సంస్కృతి ఉన్నవని భావించేవారు ఉండడమే అరుదు. విద్యార్థులలో అలాంటి ఉద్యమాలు అభివృద్ధి కాలేదు. కాలేజీలో చేరేనాటి నుంచి ఉద్యోగంలో ప్రవేశించే రోజుకోసం నిరీక్షించేవారిలో

ఇలాంటి భావాలు ఉండడం అసాధ్యం. తమ తమ భాషా సంస్కృతులను అభిమానిస్తే దానిని ప్రభుత్వం వ్యతిరేకంగా పరిగణించే రోజులవి. ఈ దుస్థితి 1940 దాకా కొనసాగింది.

నిజాం తాను స్వతంత్రుడనని చెప్పుకున్నా బ్రిటిష్ వారికి సామంతుడుగానే ఉండేవాడు. అన్నిటికన్న మించి బ్రిటిష్ సైన్యం సికింద్రాబాద్‌లో మకాం చేసి ఉండేది. బ్రిటిష్‌వారి ప్రతినిధిని రెసిడెంటు అనేవారు. రెసిడెంటు హైదరాబాద్ నగరంలో ఉంటూ నిజాం నవాబు, ఆయన వంశీకుల కార్యకలాపాలను, పరిపాలనా వ్యవహారాలను ఎప్పటికప్పుడు తెలుసుకుంటూ, ఢిల్లీలోని బ్రిటిష్ ప్రభుత్వానికి రిపోర్టు చేస్తూ, వారి ఆదేశాలను నిజాం ప్రభుత్వానికి అందజేసి, అమలు జరిపిస్తూ ఉండేవాడు. భోగలాలసుడైన నిజాంకు బ్రిటిష్‌వారిని ఎదిరించే శక్తిలేకున్నా వారు ఆయనను అష్టదిగ్బంధనం చేశారు. నిజాం నవాబుకు, బ్రిటిష్ వారికి వ్యతిరేకమైన రాజకీయోద్యమాలు తలెత్తకుండా చేయడానికి, తలెత్తినా అణచివేయడానికి ఈ దిగ్బంధనాన్ని ఉపయోగించారు. ఈ విధంగా బ్రిటిష్‌వారు తమ ఆధిక్యాన్ని కట్టు దిట్టం చేసుకున్నారు.

ఆ రోజులలో సర్ వాల్టన్ మాంక్టన్ నిజాంకు రాజ్యాంగ సలహాదారుగా ఉండేవాడు. అతనికి ప్రభుత్వ ఖజానా నుండి సాలీన ఏడు లక్షల రూపాయల వేతనం లభించేది. ఇది చాలదన్నట్టు నిజాం ఆయనకు సర్ఫేఖాస్ నుంచి ఏడాదికి యాభై వేల రూపాయలు ఇచ్చేవాడు. ఈ విధంగా రాజభోగాలనుభవించుకుంటూ 30 సంవత్సరాలు అతడు నిజాం కొలువు చేసి 1948లో పోలీసు చర్య అనంతరం పదవీ విరమణ చేసి లండన్ వెళ్ళిపోయాడు. ❑

18. ఆంధ్ర జనసంఘం

1921 వరకు రాష్ట్రంలో ఏ ఉద్యమాలు లేవు. 1921లో జరిగిన ఒక కారణంగా ఆంధ్ర జనసంఘం ఏర్పడింది.

అది 1921 నవంబరు 12 సాయం సమయం. హైదరాబాద్‌లోని వివేకవర్ధనీ థియేటరులో హిందూ సంస్కార సభ జరుగుతున్నది. పూణే మహిళా విశ్వవిద్యాలయ సంస్థాపకుడు ధోండే కేశవ్ కార్వే మహాశయుడు సభకు అధ్యక్షత వహించాడు. ఈ సభలో అనేకమంది వక్తలు ఇంగ్లీషు, ఉర్దూ, మరాఠీలలో ప్రసంగించారు. ఆంధ్ర ప్రతినిధులు మాడపాటి హనుమంతరావు, ఆలంపల్లి వెంకటరామారావు ఇద్దరూ ప్రసిద్ధులే. ఇద్దరూ హైకోర్టు న్యాయవాదులే. హనుమంతరావు తెలుగులో మాట్లాడినాడు. మహారాష్ట్ర బాహుళ్యమైన సభవారు విసుక్కున్నారు. కాని విన్నారు. ఆలంపల్లి వెంకటరామారావు లేచి సభలో మాట్లాడటం ప్రారంభించాడు. సభవారు నిరసన చప్పట్లు కొట్టినారు. ఆయన లక్ష్యం చేయక మాట్లాడుతూనే ఉన్నాడు. సభవారు అల్లరి చేశారు. వినలేదు. వక్త మాట్లాడుతూనే ఉన్నాడు. సభవారు తమ వీపులు సభావేదికవైపు తిప్పి వీపా వినమన్నారు. ఈ దుశ్చర్య, ఈ అవమానం ఆంధ్రులు భరించలేకపోయారు. సభ విడిచి వెళ్ళిపోయారు. ఆ రాత్రికి రాత్రే టేకుమాల రంగారావు గారింట్లో సమావేశమై కర్తవ్యం ఆలోచించారు. ఆంధ్రుల అభిమాన సంరక్షణ కోసం, ఆంధ్రుల వ్యక్తిత్వ నిరూపణకోసం, ఒక సంఘం స్థాపించాలని నిశ్చయించుకున్నారు. ఆ సంఘం పేరు నిజాంరాష్ట్ర ఆంధ్రజన కేంద్ర సంఘం. అధ్యక్షుడు రావు బహద్దూర్ శ్యామలరెడ్డి, కార్యదర్శి హనుమంతరావు.

ఈ కేంద్ర సంఘం సంస్థాపకులు టేకుమల రంగారావు, మాడపాటి హనుమంతరావు, బూర్గుల రామకృష్ణారావు, కొండా వెంకటరంగారెడ్డి, మందుముల నరసింగరావు, మందుముల రామచంద్రరావు, ఆదిరాజు వీరభద్రరావు, పందిట రామస్వామి నాయుడు, ఆర్. రాజగోపాల రెడ్డి, మిట్టా లక్ష్మీనరసయ్య, కొమ్మవరపు

సుబ్బారావు. ఈ బీజావాపనతో ఆంధ్రోద్యమం రాజ్యమంతా వ్యాపించింది. ప్రజలకు వెలుగు చూపింది. తరువాత మహారాష్ట్ర, కన్నడ పరిషత్తులకు దారి చూపింది. ఇంతవరకు ఏ రాష్ట్ర ఉద్యమమైనా నగరంలోనే ఉండేది. ఆంధ్రులు గ్రామసీమలకు తరలారు. ఆంధ్రులలో ఐకమత్యం, చైతన్యం, విద్య, స్త్రీల వికాసం మొదలైన వాటికి కారకులై తాము మేల్కొని ఇతరులను మేల్కొలిపారు.

ఇదివరదాకా ప్రభువులు, వారి ఆశ్రితులు ప్రచారం చేస్తూ వచ్చిన దక్కను భావం, దక్కను చరిత్ర, దక్కను రాజ్యం, దక్కను సంస్కృతీ అనే ముక్కాలి పీఠం విరిగిపోయింది. ఆంధ్ర సంస్కృతీవాహిని వెల్లివిరిసి మూసీనదిలో మూర్తీభవించింది. యువకుల ఆవేశ అభిమానాలతో, ఈ ఆంధ్ర సంఘం పెద్ద ఆశయాలతో బయలుదేరింది. ఒక పక్కన గ్రామీణుల విజ్ఞానం వృద్ధి చేసి, వాళ్ళకళ్ళు తెరవడానికి గ్రంథాలయాలు, రైతుల ఇక్కట్లు పోగొట్టడానికి రైతు సంఘాలు, వ్యాపార పరిస్థితులు బాగుపరచడానికి వర్తక సంఘాలు ఇటువంటి సంఘాలు ఉన్నవాటికి చేయూతనిచ్చి, లేనిచోట్ల కొత్త వాటిని స్థాపించి 'జై' అని కార్యక్రమం ప్రారంభించారు. ఆ కాలంలో గ్రామస్థుల మీద పటేల్–పట్వారీలు, పోలీసుల జులుం నిరంకుశంగా సాగేది. రైతుల్ని అన్యాయంగా వసూళ్ళతో యమ బాధలు పెట్టేవారు. వెట్టిచాకిరీ చేయించుకునేవారు. వర్తకుల దగ్గర అధికారులు సరుకులు తీసుకుని డబ్బిచ్చేవారుకారు. తిట్టేవారు, కొట్టేవారు. దిక్కూ దివాణం ఉండేది కారు. అటువంటి నిర్భాగ్య ప్రజల శ్రేయస్సుకోసం పనిచేసింది ఆంధ్ర జనసంఘం. నాయకులు జిల్లాలు తిరిగి ప్రబోధం చేశారు.

ఆంధ్ర జనసంఘం మొదటి సమావేశం 1923 జూలై 27న హైదరాబాద్‌లో మాడపాటి హనుమంతరావు నివాసగృహంలో జరిగింది. తెలంగాణాలో ఎనిమిది జిల్లాల నుండి ఎన్నికైన సభ్యులతో ఏడుగురు ఈ సమావేశంలో పాల్గొన్నారు. మరో ఆర్గురు హైదరాబాద్ నుండి ప్రేక్షక కార్యకర్తలుగ పాల్గొన్నారు. ఈ సభకు రాజా బహద్దూర్ వెంకటరామారెడ్డి అధ్యక్షత వహించారు. దీని ఆశయాలు:

1. గ్రంథాలయాలు, పఠన మందిరాలు, పాఠశాలలు స్థాపించాలి.
2. విద్యార్థులకు సహాయమందించి, ప్రోత్సహించాలి.
3. విద్వాంసులను గౌరవించాలి.

4. తాళపత్ర గ్రంథాలను, శాసన ప్రతులను సంపాదించి వాటిపై పరిశోధన జరపాలి.
5. విజ్ఞానాభివృద్ధికి దోహదపడే విధంగా ఉపన్యాసాలు, సమావేశాలు జరిపి, కరపత్రాలు, చిన్న పుస్తకాలు ప్రచురించాలి.
6. భాషాభివృద్ధికి చర్యలు తీసుకోవాలి.
7. అనాథలకు అత్యవసర సహాయమందించాలి.
8. వ్యాయామములను, కళలను ప్రోత్సహించాలి.

రెండవ సమావేశము:

ఆంధ్ర జనసంఘం రెండవ సమావేశం 'నీలగిరి' పత్రిక సంపాదకులు షబ్నవీసు వెంకట రామనరసింహారావు కార్యాలయ ఆవరణలో నల్లగొండలో 1924 సం॥ మార్చి 21వ తేదీన జరిగింది. ఈ సమావేశానికి రావుబహద్దూర్ వెంకటరెడ్డి అధ్యక్షత వహించారు. తెలంగాణా జిల్లాలనుండి 7గురు ప్రతినిధులు, వివిధ జిల్లాల నుండి 50 మంది ప్రజలు వచ్చారు. ఈ సభలో–

1. చిత్రాడ జమీందారు, సాహిత్య పోషకుడు చెలికాని లచ్చారావు, శతక కవుల చరిత్ర గ్రంథకర్త సాహితీవేత్త వంగూరు సుబ్బారావు మృతికి సంతాపం ప్రకటించారు.
2. వేతనములతో పూర్తికాలం పనిచేయడానికి ప్రచారకుని నియమించాలి.
3. నిజాం రాష్ట్రంలో ఆంధ్రోద్యమ వ్యాప్తికి 'నిజాం రాష్ట్ర ఆంధ్రనిధి' ఏర్పాటు చేయాలని, అందుకు కొండా వెంకటరంగారెడ్డి వ్యవహర్తలుగా ఉండాలని నిర్ణయించారు.
4. 'ఆంధ్ర పరిశోధక మండలి' అనే పేరుతో 'లక్ష్మణరాయ పరిశోధక మండలి'గా ఉన్న సంఘాన్ని కేంద్ర సంఘం యాజమాన్యంలోకి తీసుకోవాలి.
5. హెచ్.ఎస్.ఎస్.సి. ఉస్మానియా విశ్వవిద్యాలయం మెట్రిక్, ఇంటర్మీడియేట్ పరీక్షలలో ఆంధ్రభాషలో ప్రథములుగా వచ్చినవారిని బంగారు, వెండి పతకాలతో సత్కరించాలి.

6. ఆంధ్ర వాఙ్మయ ప్రచారం చేయడానికి పరీక్షలు నిర్వహించాలి.

7. నిజాం రాష్ట్రంలోని ఆంధ్రుల పరిస్థితులను తెలిపే విధంగా ఉండే లఘు పుస్తకాలు ప్రచురించి వాటిని అణాలోపు వెలకు విక్రయించే ఏర్పాట్లు చేయాలి.

ముగింపు సభకు పింగళి వెంకట్రామారెడ్డి అధ్యక్షత వహించారు.

మూడవ సమావేశం:

ఆంధ్ర జనసంఘం మూడవ సమావేశం 1925 సం॥ ఫిబ్రవరి 21వ తేదీన వరంగల్లు జిల్లా మధిరలో పింగళి వెంకటరామరెడ్డి కర్మాగారపు ఆవరణలోని విశాలమైన మంటపంలో జరిగింది. హైకోర్టు వకీలు మాడపాటి తిరుమలరావు ఆహ్వాన సంఘాధ్యక్షులు. ఈ సభలో మునగాల రాజా నాయని వెంకటరంగారావుగారి అల్లుడు వనపర్తి సంస్థానాధీశుడైన రాజా కృష్ణదేవరాయ బహిరి బలవంతు, గద్వాల సంస్థానాధీశులు సీతారాం భూపాలు, జోగిపేట వర్తకులు, ప్రజాకార్యకర్త శివ్వప్ప గారల అకాల మరణానికి సంతాపం ప్రకటించబడింది. సమావేశానికి ప్రొఫెసరు శిరుగూరి హనుమంతరావు (అధ్యక్షుడు), ఆదిరాజు వీరభద్రరావు (కార్యదర్శి), నాయని వెంకటరంగారావు (మునగాల సంస్థానాధీశులు), మాడపాటి హనుమంతరావు, రాజా బహద్దూర్ పిళ్ళే (సభ్యులు) హాజరయ్యారు.

హైదరాబాద్ ప్రభుత్వ వైద్యకళాశాల, ఇంజనీరింగు కళాశాల పరీక్షలలో అత్యుత్తములుగా ఉత్తీర్ణులైనవారిని స్వర్ణ పతకములతో గౌరవించాలని తీర్మానించారు. 'నిజాం రాష్ట్రాంధ్రుల అభివృద్ధికి మార్గమంటూ' అనే లఘు పుస్తకం వ్రాసిన రచయితకు 25 రూపాయలు బహుమతినిచ్చి దాన్ని సభాపక్షాన ప్రచురించాలని అంగీకారం లభించింది.

నాల్గవ సమావేశము:

ఆంధ్ర జనసంఘం నాల్గవ సమావేశం సూర్యాపేటలో 1928 సం॥ మే నెల 28, 29, 30 వ తేదీలలో జరిగినది. కోదాటి రామకృష్ణారావు ఆహ్వాన సంఘాధ్యక్షులు, సంఘం దిగువ పేర్కొన్న నియమాలను విధించింది:-

1. రాజకీయ విషయములు, రాజభక్తి విరుద్ధమైన విషయములు ముచ్చటించ కూడదు.
2. సభాస్థానమున చుట్టలు, బీడీలు, సిగరెట్లు తాగరాదు. నిషేధ వస్తువులు సేవించరాదు.
3. నిబంధనలకు విరుద్ధంగా ప్రవర్తించే వారిపై చర్యతీసుకునే అధికారం ఆహ్వాన సంఘానికి ఉంటుంది.
4. ఉపన్యాసకులు ముందుగా తమ పేర్లను ఆహ్వాన సంఘానికి తెలియజేయాలి.

ఈ సభలకు ముందుగా నిర్ణయించిన ప్రకారం రావు బహద్దూర్ వెంకటరెడ్డి హాజరు కానందున కొండా వెంకటరంగారెడ్డి అధ్యక్షత వహించారు. జటప్రోలు సంస్థానాధీశులు శ్రీ రాజాసురభి వెంకటలక్ష్మణరావు బహద్దూర్, ఆంధ్రోద్యమ కార్యకర్తలైన సదాశివరెడ్డి, చిరుగు వీరన్నల మరణానికి సంతాపం ప్రకటించారు. గద్వాల సంస్థానానికి మహారాణిగా ప్రభుత్వం అంగీకరించిన రాజ్యపాలన భారం వహించిన ఆదిలక్ష్మిదేవమ్మగారికి అభినందనలు తెలిపారు. ఉస్మానియా విశ్వవిద్యాలయపు ఇంటర్, బి.ఏ. పరీక్షల్లో ప్రథమంగా నిలిచినవారికి పతకములు బహూకరించారు. ఆంధ్రోద్యమ ప్రచారానికిగాను బొంబాయి ఆంధ్ర ప్రముఖులు శంకర సాయన్న పర్సాగారు 500 రూపాయలు (కల్దారు) విరాళంగా పంపినందుకు ఆయనకు అభినందనలు తెలిపారు. ఉస్మానియా విద్యార్థులకు ఆంధ్ర విశ్వవిద్యాలయ సంబంధిత కళాశాలలో ప్రవేశించడానికి అనుమతించాలని విజ్ఞప్తి చేయనైనది.

ఆంధ్ర జనసంఘం స్థాపించినది మొదలు దాని పెంపు కొరకై మాడపాటి హనుమంతరావు పంతులుగారు నిర్విరామకృషి చేసారు. మూడు, నాలుగేళ్ళలోనే ఆంధ్ర జనసంఘం శాఖలు 50 వరకు వివిధ ప్రదేశాలలో స్థాపించబడ్డాయి. సుమారు 90 గ్రంథాలయాలు కూడా తెలంగాణాలో ఏర్పడి భాషాసేవ, విజ్ఞాన వ్యాప్తి కలిగించాయి. దీనితో ప్రజలలో సంచలనం కలిగింది. తెలంగాణాలో క్రమంగా చీకట్లు తొలగి పోయి ఉషోరేఖల కాంతులు వెదజల్లసాగాయి.

ఇక్కడ ఒక ప్రశ్న తలెత్తుతుంది. ఈ సంస్థలను స్థాపించినవారు తెలంగాణా వారు. ఆంధ్రోద్యమం, ఆంధ్ర జనసంఘం అనేపేర్లనే పెట్టుకున్నారు. తెలంగాణా

జనసంఘం అని పెట్టలేదు. వారు పురాతన చరిత్రను పరిశీలించారు. చరిత్రలో తెలుగు భాష మాట్లాడే ప్రజలను ఆంధ్రులన్నారు. ఉర్దూ భాషా మాట్లాడే నిజాం అధికారులు 'తెలంగీ' అనేవారు. 'తెలంగీ బేఢంగీ' (తెలుగు భాషకు ఒక క్రమ పద్ధతి లేదు) అని అపహసించేవారు. భాషను అర్థం చేసుకోలేక, నేర్చుకోవాలన్న ఉద్దేశమే లేక, మాట్లాడటం చేతకాక, భాషను అలా ద్వేష భావంతో తూలనాడేవారు. ఈ విధంగా ఆంధ్ర భాష అనే మాటే ఇక్కడ నిలిచింది. పైగా తెలంగాణాలో తొలి దశలో సంస్థాన పేర్లలో ఆంధ్ర శబ్దమే కనిపిస్తుంది. శ్రీకృష్ణదేవరాయ ఆంధ్ర భాషానిలయం, రాజారాజనరేంద్ర ఆంధ్ర భాషానిలయం, వేమన ఆంధ్ర భాషానిలయం మొదలైనవి. కనుక చరిత్రనుబట్టి ఆంధ్ర జనసంఘం, ఆంధ్రోద్యమం అని వ్యవహరించారు.

మధిర, సూర్యాపేట సమావేశాలలో ప్రథమ, ద్వితీయ గ్రంథాలయాల సభలు కూడా జరిపించారు. ప్రజలలో పెల్లుబుకుతున్న ఉత్సాహాన్ని అదుపులో ఉంచి దానిని నిర్మాణ మార్గంలోకి మరల్చడానికి పంతులుగారు పూనుకున్నారు. ఆంధ్ర జనసంఘం వల్ల జరిగిన మేలు ఏమిటంటే–ఒకప్పుడు ఉర్దూ భాషలో మాట్లాడటమే నాగరికతగా భావించిన పట్టణ విద్యాధికులు క్రమంగా తెలుగులో ఉపన్యాసాలివ్వడం మొదలు పెట్టారు. పామరులు కూడా తెలుగు ఉపన్యాసాలు వినసాగారు. తరచు సభలు, సమావేశాలు అన్నిచోట్ల జరిగాయి. తెలుగుపత్రికలు పట్టణాలలోనేగాక గ్రామసీమలలో కూడా కనిపించాయి. పోస్టువాళ్ళు బండగుర్తులు పెట్టుకొని వాటిని అందించేవారు. రచయితలు, కవులు పుట్టుకువచ్చి పత్రికలలో తెలుగు కవితలు, కథలు, వ్యాసాలు రాయడం మొదలు పెట్టారు.

ఆంధ్రజన కేంద్రసంఘం సందేశాలు, దాని ఆశయాలు తెలంగాణాలోని మారుమూల గ్రామాలకు తెలియాలనే ఉద్దేశం హనుమంతరావుగారిది. అందుకోసం పంతులుగారు కేంద్రసంఘం పక్షాన ఉన్నవ వెంకటరామయ్య అనే సమర్థుడైన వ్యక్తిని ప్రచారకునిగా నియమించారు.

ప్రజలకు జరుగుతున్న సంగతులు సందర్భాలు తెలియజేయటానికి కేంద్రం సంఘం పక్షాన లఘు పుస్తకాల ప్రచురణకు పంతులుగారు ఏర్పాటు చేశారు. వర్తక స్వాతంత్ర్యము, వెట్టిచాకిరీ, గ్రంథాలయాలు, మన వాక్ స్వాతంత్ర్యము, మద్యపానము, ఋణభార నివారణ తదితర పేర్లతో వెలువరించిన చిన్న పుస్తకాలు వాటిలో కొన్ని.

ఆంధ్రోద్యమ వ్యాప్తిని గమనించిన పంతులుగారు ఆంధ్ర జనసంఘం కార్యక్రమాల పరిధిని పెంచడం అవసరమని భావించారు. అరవై లక్షలు మించి ఉన్న నిజాం రాష్ట్రాంధ్రుల సమస్యలను తెలుసుకోవడానికి, వారి సమష్టి అభిప్రాయాన్ని నిర్మించడానికి ఒక మహాసభ అవసరమని ప్రముఖులు, విద్యాధికులు భావించారు. దీని ఫలితంగా వచ్చిందే ఆంధ్ర మహాసభ.

ఆ రోజుల్లో ఆంధ్రులకు ప్రాతినిధ్యం వహించే పెద్ద సంస్థ ఆంధ్ర మహాసభ ఒక్కటే. అది నిజంగా కాంగ్రెస్‌కు పూర్వ సంస్థ అని చెప్పవచ్చు. హైదరాబాద్ రాష్ట్రంలో కాంగ్రెస్ సంస్థ ఆవిర్భావానికి అది మూలవ్యవస్థగా పనిచేసింది. కాంగ్రెస్ స్థాపన కార్యకలాపాలను బ్రిటిష్ ఇండియాకే పరిమితం చేసుకుంది. దేశీయ సంస్థానాలలో అది శాఖలను నెలకొల్పుకొనలేదు. ❑

19. ఆంధ్ర మహాసభలు

ఆంధ్ర మహాసభను జరుపుకోవటానికి ప్రభుత్వం కొన్ని షరతులతో అనుమతించింది. సభాధ్యక్షుడు నాన్‌ముల్కీ కాకూడదు. అంటే హైదరాబాద్ రాష్ట్ర నివాసి అయి ఉండాలి. ఇతర మతస్థులకి మనస్తాపం కానీ, అవమానం కాని కలిగే స్థితి కలగరాదు. సభలో రాజకీయ ప్రసక్తి ఉండకూడదు.

ఆంధ్రోద్యమం రెండవదశ 1930లో మెదక్ జిల్లా అందోలు తాలూకా జోగిపేటలో ఆంధ్ర మహాసభ మొదటి సమావేశంతో ప్రారంభమయింది. ఆ సభలో జోగిపేట వర్తకులు ఆర్థిక సహాయం చేశారు.

జోగిపేట హైదరాబాద్ నుండి వాడికి పోయే రైలు మార్గంలో శంకరపల్లి స్టేషను నుండి 28 మైళ్ళ దూరంలో ఉంది. అది అందోలు తాలూకాకు ప్రధాన స్థలం. టేకుమాల చరిత్ర ప్రసిద్ధికెక్కిన గ్రామం. కాకతీయ ప్రతాపరుద్ర చక్రవర్తి కాలంలో దీనిపేరు 'తేకుంబెద్ద' అని శాసనాల ద్వారా తెలియవస్తున్నది. ఈ పేరు జనం నాలుకపై నానడానికి కారణం బహుశా ఈ గ్రామం టేకుచెట్ల మధ్య ఉండటమే అయి ఉంటుంది. అయితే తరువాత వరుసగా నిజాం ప్రభువుల పాలనలోకి రాగానే ఉర్దూ ఉచ్చారణలో తేకుంబెద్ద– టేకుమాలగ రూపాంతరం చెందింది. గస్తీ నిషాన్ 'తిర్పన్' 1929లో వెలువడినది. ఈ జీ.వో.కు లోబడి సభ జరుపుటకు ప్రభుత్వం అనుమతించింది.

ప్రథమ మహాసభ అధ్యక్షులు సురవరం ప్రతాపరెడ్డి బి.ఏ., బి.ఎల్. పట్టభద్రుడు, గోల్కొండ పత్రిక సంపాదకుడు, బహుగ్రంథకర్త, తెలంగాణా ప్రజల వైతాళికుడు.

ఈ ప్రథమ మహాసభ 'ఆంధ్రదేశపు మట్టి అది మాకు కనకము' అనే గేయంతో ప్రారంభం కావడం గమనార్హమైన విషయం. హైదరాబాద్ సంస్థానంలో నివసించే తెలుగు వారిలో 'మేము ఆంధ్రులము ఆంధ్రుల చరిత్ర, సంస్కృతి, నాగరికత మాకు

గర్వకారణమైనవి' అనే భావాన్ని ఏదోవిధంగా కలుగజేయడమే ఆంధ్రోద్యమం మొదటి దశలో ముఖ్య దృక్పథంగా ఉండేది. దీనికి పంతులుగారు బహు జాగ్రత్తగా, సర్వజన సమ్మతమైన రీతిలో కార్యరూపమిచ్చారు. హనుమంతరావుగారి దృష్టిలో ఆంధ్ర మహాసభ తెలంగాణా ప్రజల జాతీయోద్యమం, భారత ప్రజలకు భారత జాతీయ కాంగ్రెసు ఎటువంటిదో తెలంగాణా ప్రజలకు ఆంధ్రోద్యమం ఒక జాతీయోద్యమం. తన అధ్యక్షోపన్యాసంలో ప్రతాపరెడ్డిగారు గ్రామాలలో తెలుగువారు చీటికి మాటికి కలహించుకుంటూ కోర్టుకు వెళ్ళటాన్ని తీవ్రంగా తప్పుపట్టారు. స్త్రీల పరదా పద్ధతిని నిరసించారు. వర్తక సంఘాలు, రైతు సంఘాలు సరియైన మార్గంలో నడిస్తే దౌర్జన్యాలు అరికట్టినవారమవుతాము. మనము ఏమి చేయలేమని, శక్తిహీనులమనే భావాన్ని తొలగించుకోవాలని సూచించారు. ఈ భీతికి మూలం అవిద్య. కనుక ఆంధ్ర సోదరులు విజ్ఞానవంతులు కావాలని ఆయన ఆకాంక్షించారు. బహిరంగ సభల విషయంలో గస్తీ నిషాన్ 53 వలన వ్యక్తి స్వేచ్ఛకు ఆటంకం ఉందని, దాన్ని వెంటనే రద్దు చేయాలని మహాసభ కోరింది. జనసామాన్యంలో విస్తారంగా వ్యాపించిన మద్యపాన దురభ్యాసాన్ని నిర్మూలించాలనీ, ప్రభుత్వమూ, ప్రజలు ఈ విషయంలో తీవ్ర ప్రయత్నాలు చేయాలనీ సభ తీర్మానించింది.

ఆంధ్ర మహాసభ జరిగిన రోజుల్లోనే మరో వైపు ప్రప్రథమాంధ్ర మహిళా సభ జరిపారు. ఈ సభలకు నడింపల్లి సుందరమ్మగారు అధ్యక్షత వహించారు. ఈ సభలో ప్రాచీన స్త్రీల ఔన్నత్యమూ, నేటి హీన స్థితి, వివాహ సమస్య, పాతివ్రత్యమూ, కళావంతులు, వితంతువుల స్థితి మొదలైనవి చర్చకు వచ్చాయి.

రెండవ ఆంధ్ర మహాసభ:

రెండవ ఆంధ్ర మహాసభ దేవరకొండలో 1931 మార్చి 3, 4, 5 వ తేదీలలో బూర్గుల రామకృష్ణారావు అధ్యక్షతన జరిగింది.

రామకృష్ణారావు ఇంటిపేరు పుల్లమరాజువారు. ఆయనది మహబూబ్‌నగర్ జిల్లా, షాద్‌నగర్ తాలూకాలోని బూర్గుల గ్రామం. జాగీర్దారు కుటుంబంలో జన్మించారు. పూణేలో న్యాయవాద వృత్తివిద్య చదువుకునే రోజులలో ఆ పేరు 'రాంకిషన్‌రావు బూర్గుల్' అయినది. ఊరుపేరును ఇంటిపేరుగా పెట్టుకోవడం

మహారాష్ట్రుల సంప్రదాయం. అట్లాగే అది బూర్గుల రామకృష్ణారావుగా పరిణమించింది. ఆయన అక్కన్న మాదన్నల తరువాత దక్కనుకు ప్రథమాంధ్ర ముఖ్యమంత్రి, మేధావి, బహుభాషా కోవిదుడు, కవి, గ్రంథకర్త, చాకచక్యం, నెమ్మదిగల రాజకీయవేత్త.

దేవరకొండ మహాసభలో రాజకీయాలు త్యాజ్యాలు కావన్నాడు బూర్గుల. ప్రజా హక్కులు లభిస్తేనేగాని అభివృద్ధి ఉండదన్నాడు. ఒక విధంగా శంఖం పూరించాడు. ప్రథమాంధ్ర మహాసభకు వామన్‌నాయక్ హాజరయ్యాడు. ఆయన ఆంధ్రులకు సహాయం చేస్తూ ఏ ఉద్యమానికైనా చేదోడు వాదోడుగా ఉండేవాడు. గుంటూరులోని శారదా నికేతన్‌కి ధనసహాయం చేశాడు. ఆయన మత, సాంఘిక విషయాలలో కొంచెం సనాతనుడు. తత్కారణంగా జోగిపేట ఆంధ్ర మహాసభలో చర్చించిన సాంఘిక తీర్మానాల మీద ఆయన సనాతన ప్రభావం పడినది. అందుచేత దేవరకొండలో జరిగిన రెండో ఆంధ్ర మహాసభకు ఆర్యసమాజ్ అధ్యక్షుడైన కేశవరావు కూడా హాజరై ఆంధ్రుల్ని సాంఘికంగా ముందుకు లాగడానికి ప్రయత్నించాడు. అధ్యక్షుడైన రామకృష్ణారావు చల్లగా రాజకీయాల అవసర విషయమై మాట్లాడగా సభకు వచ్చిన మహారాష్ట్రులు తీవ్రమైన ఉపన్యాసాలు చేశారు.

రెండవ మహిళా సభకు శ్రీమతి టి. వరలక్ష్మమ్మ అధ్యక్షత వహించారు. ఈ సభలో నిర్బంధ ప్రారంభోచిత విద్యను ప్రవేశపెట్టాలని కోరారు. ఉన్నత విద్యను మాతృభాష ద్వారా బోధించే అవసరం ఉందన్నారు. స్త్రీలకు వైద్య, విద్య, రోగాలకు ఉపచారం చేసే విజ్ఞానం, మంత్రసానిత్వం మొదలైనవి నేర్పించాలని చర్చించుకున్నారు. పర్దాపద్ధతిని నిరసించారు. కళావంతులలో వివాహ పద్ధతిని ప్రవేశపెట్టాలన్నారు. మొత్తం మీద ఈ సభలో చేసిన తీర్మానాలన్నీ స్త్రీ అభ్యుదయానికి సంబంధించినవే.

మహాసభలు సాధారణంగా సంవత్సరానికొకసారి జరగాలి. కానీ దేవరకొండలో జరిగిన రెండవ మహాసభ అనంతరం మూడవ సభ జరుపుకోవటానికి మూడు సంవత్సరాల కాలం పట్టింది. దీనికి కారణం ప్రభుత్వ అనుమతిలో జాప్యం.

రెండవ ఆంధ్ర మహాసభ సమావేశమైన తొమ్మిది నెలలకు మహబూబ్‌నగర్ జిల్లా జటప్రోలు సంస్థానంలో మూడవ సభ జరపాలని పెంట్లవల్లి గ్రామంలోని ప్రముఖ వకీలు చక్రహరి నరసరాజు ప్రయత్నాలు ప్రారంభించారు. అందుకు మొదటి చర్యగా నిజాం ప్రభుత్వం అనుమతిని పొందాలి.

అయితే జటప్రోలు ఒక సంస్థానం కనుక అనుమతి సంస్థాన ప్రభుత్వం నుంచి పొందాలన్నారు. సంస్థాన ప్రభుత్వాన్ని కోరితే ఆ అధికారం తమకు లేదని ప్రభుత్వం నుంచి పొందాలని లిఖితపూర్వకంగా తెలియజేశారు. దీనిపై ఆహ్వాన సంఘంవారు మహబూబ్‌నగర్ కలెక్టరును కోరగా సంస్థాన వ్యవహారాలలో జిల్లా యంత్రాంగం జోక్యం కలుగజేసుకోదని, దేవరకొండ సభకు పాటించిన విధానాన్నే ఇప్పుడు పాటించవలసిందని కలెక్టరు నుంచి సమాధానం వచ్చింది. ఆహ్వాన సంఘం వారు తమ కేసును హోం సెక్రటరీకి విన్నవించుకున్నారు. చివరకు అది ప్రధానమంత్రి మహారాజా సర్ కిషన్ పర్షాద్ బహాదుర్ దగ్గరికి వెళ్ళింది. సంస్థానంలో జరుపుకోవాలను కున్నా, మరెక్కడ జరుపుకోవాలనుకున్నా అనుమతించేది లేదని మహారాజా నుంచి సమాధానం వచ్చింది. ఒక సంవత్సరమంతా ప్రయత్నిస్తే ఇలాంటి సమాధానం రావడంవల్ల ప్రజలు కూడా అమీతుమీ తేల్చుకోవాలనుకున్నారు. ఒక సమావేశం జరుపుకోవడానికి క్యాబినెటు అనుమతి అవసరమా? ఇంత చిన్న విషయం పట్ల ఇంత తిరస్కార భావమా? వాక్స్వాతంత్ర్యం ఎడల ఏ మాత్రం అభిమానం లేని ప్రభుత్వంతో తుదిపోరాటం తప్పలేదు.

సమావేశం జరుపుకొనటానికి 1932 మార్చి 2వ తేదీన తిరిగి ప్రయత్నం ప్రారంభించారు. విన్నపాలమీద విన్నపాలు సమర్పించుకున్న తరువాత ఆరు మాసాలకు పోలీసుశాఖ మంత్రి కర్నల్ ట్రంచ్‌ని జులై 19వ తేదీన కలుసుకొనవలసిందని ప్రతినిధి వర్గానికి తెలియజేశారు. ఆ రోజు వెళితే దాన్ని మరో రోజుకు మార్చారు. మాడపాటి హనుమంతరావు, బూర్గుల రామకృష్ణారావు వాదము అద్భుతముగా పనిచేసింది. 'మా ఉద్యమం కేవలం రాజకీయేతరము. విశేషముగా గ్రంథాలయాలకు సంబంధించినది, తద్వారా విజ్ఞాన వ్యాప్తికి సంబంధించినది' అని బూర్గుల వాదన.

'అయ్యా! గ్రంథాలయోద్యమేమిటో నేను బెంగాల్ రాష్ట్రంలో నేర్చుకున్నాను. గ్రంథాలయాలనగానే విప్లవ సంఘాలు అంతే. ఇంకేమీ లేదు. జరిమానాలు చెల్లించడానికి అభ్యంతరం ఏమిటి? అంత డబ్బు మీరు చెల్లించలేరనా? లేక ఆ డబ్బు ప్రభుత్వం లాగుకుంటుందని భయమా?' మంత్రిగారి ఆక్షేపణ. 'రాష్ట్రంలోని సగభాగం జనాభాలో మేమున్నాం. ఆ మాత్రం డబ్బు చెల్లించలేమని కాదు. దీనిని సర్కారులాగుకుంటుందని భయమూ లేదు. జమానతు ఇచ్చి మహాసభ నిర్వహిస్తే

విద్యా, వైజ్ఞానిక, సామాజిక సేవలకు దేశప్రజల హృదయాలలో వున్న గౌరవభావం తగ్గిపోతుంది కనుక డబ్బు చెల్లించి సభలు జరుపుకోవడానికి మేము అంగీకరించము' అని బూర్గుల రామకృష్ణారావు గట్టిగా వాదించగా పోలీసు మంత్రి కర్నల్ ట్రెంచ్ సభకు అనుమతి ప్రసాదించక తప్పలేదు.

బ్రహ్మాండం తలకిందులు చేసి, ప్రభుత్వంవారి షరతులన్నిటినీ అంగీకరించి ఈ విధంగా నాయకులు అనుమతి సంపాదించారు. మూడవ సభ ఖమ్మం మెట్టులో నల్లగొండ వకీలు పులిజాల రంగారావు అధ్యక్షతన జరిగింది. ఈ సభలో ఒక్క రాజకీయ విషయానే గాక, సాంఘిక విషయాలను కూడా ప్రభుత్వం నిషేధించింది. అర్ధరాత్రివేళ విషయ నిర్ణయ సభ జరుగుతుండగా కలెక్టరు అధ్యక్షులకు పదే పదే కబురు పంపించి చాలా తిప్పలు పెట్టాడు. రాజకీయాలు, సాంఘికాలు లేకపోతే సభ ఎందుకు? ఒక ఉపాయం ఆలోచించారు నాయకులు. రైతు సమస్యల మీద తీర్మానాలు ఆమోదించారు. తృతీయ ఆంధ్ర మహాసభలో రైతు ప్రాముఖ్యంలోకి వచ్చాడు. అందరితోపాటు రైతు కూడా మేల్కొన్నాడు. మూడవ ఆంధ్ర మహిళాసభకు శ్రీమతి ఎల్లాప్రగడ సీతాకుమారి అధ్యక్షత వహించారు.

నాలుగవ ఆంధ్ర మహాసభ కరీంనగర్ జిల్లా సిరిసిల్లలో 1935 సం॥ జనవరి 26, 27, 28 వ తేదీలలో మాడపాటి హనుమంతరావు అధ్యక్షతన జరిగింది. గద్దె నెక్కించడమేగానీ తను ఎక్కే స్వభావం హనుమంతరావుకు లేదు. సభ్యులంత పట్టుపట్టారు. ఆయన సతీమణి మాడపాటి మాణిక్యాంబ మహిళా సభకు అధ్యక్షురాలు. సిరిసిల్ల సభలో ఉపన్యాసకులందరూ తెలుగులోనే మాట్లాడటానికి ప్రయత్నించమని ప్రోత్సహించి కృతార్థుడైనాడు అధ్యక్షుడు. ఆంధ్రాభిమానంతో ఆంధ్రభాషా పరిచయం కూడా ఇనుమడించింది. అంతేకాదు, మహాసభకి ఒక నియమావళి ఈ సభలోనే రూపొందింది. యువకుల ఆశయాలతో సహా అన్ని లక్ష్యాలనూ సమీకరించి తయారు చేసారు.

సిరిసిల్ల ఆంధ్ర మహాసభ వేదికనుంచి విద్యాపునర్నిర్మాణం, నిర్బంధ ప్రాథమిక విద్య, ఆంధ్ర బాలికలకు మాతృభాష ద్వార ఉన్నత విద్యాబోధన, బాల్యవివాహాల నిరసన, జాగీరు ప్రజల హక్కులు, గ్రామ పునర్నిర్మాణం, రైతులకు సౌకర్యాలు,

బలౌతాదారుల కష్టాలు, స్థానిక పరిపాలన, నిమ్నజాతుల ఉద్ధరణ, ఆంధ్ర మహాసభ నియామావళిలో మార్పులు మొదలైన 12 తీర్మానాలు ఆమోదించారు. సిరిసిల్ల సభలు జరిగిన ఆరు నెలలకు హనుమంతరావు ప్రభుత్వ ప్రచురణల శాఖ అధ్యక్షుడు అలీయావర్ జంగ్‌ని కలుసుకొనడానికి వెళ్ళగా మాటల సందర్భంలో ఆయన 'మీ ఆంధ్రోద్యమము ఉద్దేశం ఈ రాజ్యంలో ఉన్న ఆంధ్ర జిల్లాలను, మద్రాసులోని ఆంధ్ర జిల్లాలతో కలిపి వేయవలెనని ఉన్నట్లు ప్రభుత్వానికి తెలియవచ్చింది. తను ఆ విషయాన్ని రాజకీయ శాఖమంత్రికి రాశానని తన సందేహం వెలిబుచ్చాడు. కానీ, పంతులుగారు అది తప్పు అభిప్రాయమని ఖండించారు. అలాంటి కోరిక రాజ్యాంగ విధంగా అసంభవ మన్నారు.

1936లో షాద్‌నగర్‌లో జరిగిన అయిదవ ఆంధ్ర మహాసభకు కొండా వెంకట రంగారెడ్డిగారు అధ్యక్షత వహించారు. షాద్‌నగర్ మహాసభకు మరొక విశేషమున్నది. ఇంతవరకు జరిగిన నాలుగు సభలు జాగీర్లలోగాని, సంస్థానాలలోగాని, పాయెగాలో గాని జరుగలేదు. కానీ ఇప్పుడీ మహాసభ కిషన్ ప్రసాద్ బహదుర్ జాగీరులో జరుగుతున్నది. షాద్‌నగర్ మహాసభకు అధ్యక్షులుగా ఎన్నికైన కొండా వెంకటరంగారెడ్డి, కొత్వాలు వెంకటరామరెడ్డి తరువాత రెడ్డి నాయకత్వం వహించడానికి తయారవుతున్న వకీలు. హనుమంతరావు ప్రోద్బలంతో ఆంధ్ర జనసంఘంలో చేరి ప్రజాహిత కార్యాలలో పనిచేస్తున్నాడు. అప్పటికే ఈయనకు ముందు హైదరాబాద్ శాసన సభలో ఆంధ్రుడనే వాడులేడు. ప్రజలు, ప్రభుత్వం మన్ననలు పొందిన రంగారెడ్డి నిజాయితీపరుడనీ, నిష్కల్మషుడనీ పేరు. మనసులోని మాట పైకి అనేసే స్వభావం కలవాడు. ఈయనది విపరీతమైన ఆంధ్రప్రాంతీయాభిమానం. తెలంగాణ భక్తుడు, ఉర్దూ వకీలు. తరువాత ఆంధ్రనాయకులలో ముఖ్యాతిముఖ్యుడై స్వరాజ్యానంతరం మంత్రిపదవినీ, ఆంధ్రప్రదేశ్ ఉపముఖ్యమంత్రిపదవినీ అలంకరించాడు. అనంతరకాలంలో ఆయనపేరున 'రంగారెడ్డి జిల్లా' ఏర్పడింది.

షాద్‌నగర్ సభలకు ప్రభుత్వ వైఖరిలో కొంతమార్పు వచ్చింది. తమది కూడా ఆధునిక ప్రభుత్వమని పేరు తెచ్చుకోవాలని ప్రభుత్వ పరంగా వివిధ శాఖల ప్రదర్శనశాలలు ఏర్పాటుచేసి మహాసభలకు చేయూత నిచ్చింది. మహాసభ ప్రాంగణం నిమిత్తం షాద్‌నగరులో ఒక ప్రత్యేక కట్టడం నిర్మించబడింది. దీనికి పథకం వెయ్యడం,

నిర్మించడం అంతా వల్లూరి బసవరాజు పర్యవేక్షణలో జరిగింది. వి.బి.రాజు ఆంధ్ర మహాసభలకు రావడం ఇదే మొదటిసారి. అప్పటికే ఆయన హైదరాబాద్‌లో ఇంజనీరింగు వృత్తిలో స్థిరపడి పేరు ప్రఖ్యాతులు గడించారు. నడి యౌవనంలో ఉన్నాడు. షాద్‌నగర్ హైదరాబాద్ సమీపంలో ఉండటంవల్ల ఈ మహాసభలకు చాలామంది నాయకులు, కార్యకర్తలు వచ్చారు. అయిదవ మహిళా సభకు బూర్గుల అనంత లక్ష్మీదేవి అధ్యక్షత వహించారు. ఈ సభలో రైతుల సమస్యలకు ఎక్కువ ప్రాధాన్యమిచ్చారు.

బహదూర్‌యార్‌జంగ్ చేపట్టిన మతాంతరీకరణ ఉద్యమాన్ని కొండా వెంకట రంగారెడ్డి తమ కార్యకర్తలతో ఎదుర్కొన్నారు. మతం మార్చుకుని ఇస్లాం మతం స్వీకరించిన వారి ఇళ్ళకు వెళ్ళి వారి కష్టసుఖాలను స్వయంగా విచారించి తెలుసు కున్నారు. ఉన్నత విద్య ప్రజల మాతృభాష ద్వారా జరుగాలని షాద్‌నగర్ సభ కోరింది. సంపూర్ణంగా మద్యపాన నిషేధాన్ని ప్రవేశపెట్టాలని సభ సూచించింది.

ఆరవ ఆంధ్ర మహాసభ, నిజామాబాద్ 1935:

క్రమేణా వాతావరణం మారుతున్నది. బ్రిటిష్ ఇండియాలో 1935 చట్టం ప్రకారం ఎన్నికలు జరిగి తొమ్మిది రాష్ట్రాలలో కాంగ్రెస్ ప్రభుత్వాలు ఏర్పడ్డాయి. దీని ప్రభావం హైదరాబాద్ రాజకీయాల మీద పడటం సహజమే. ముస్లింలు కూడా సంస్కరణలు కావాలన్నారు. ప్రభుత్వం దిగిరాక తప్పలేదు. ప్రభుత్వం దివాను బహదుర్ ఎస్. ఆరవాముదు అయ్యంగార్ అధ్యక్షతన ఒక సంస్కరణ సంఘం నియమించింది. 1935లో ఆరవ ఆంధ్ర మహాసభ ఈ కొత్త వాతావరణంలో మందుముల నరసింగరావు అధ్యక్షతన సమావేశమైంది.

మందుముల నరసింగరావు 'రయ్యత్' అనే ఉర్దూ దినపత్రిక సంపాదకుడు. ఆయనది ఉర్దూలో విశిష్టమైన శైలి. ఆంధ్రోద్యమానికి ఈ పత్రిక ఎంతో సేవ చేసింది. నరసింగరావుకు రైతు సమస్యలు కొట్టినపిండి. అందుకనే రైతు సమస్యలను పరిష్కరించ డానికి కొన్ని శాసనాలు చేయవలసిన అవసరం వచ్చినప్పుడు ప్రభుత్వం మరో మారు రావుని శాసనసభకి తీసుకుంది. రాష్ట్రంలోని ముస్లిం నాయకులతో ఆయనకు స్నేహసంబంధాలు ఉండేవి. స్వరాజ్యం వచ్చిన తరువాత బావగారు బూర్గుల

రామకృష్ణరావు ప్రభుత్వంలో ల్యాండ్ కమీషన్ అధ్యక్షుడు, ఆంధ్రప్రదేశ్ ఏర్పడిన తరువాత మంత్రి అయ్యాడు.

నిజామాబాద్ సభలో సహజంగానే అధ్యక్షుడూ, సభ్యులు రాష్ట్రానికి బాధ్యతాయుత పాలన కావాలన్నారు. రాబోయే సంస్కరణలు బ్రిటిష్ ఇండియా పద్ధతిలో ఉండాలన్నారు. ఆ విధంగా తీర్మానాలు చేశారు. దీనితో ఆంధ్ర మహాసభ నిజస్వరూపం వెల్లడైంది. ఆంధ్రప్రజల ఆశలూ, ఆశయాలు బహిర్గతమయ్యాయి. రాష్ట్రంలో రాజకీయంగా తొలికోడి కూసింది ఈ ఆంధ్ర మహాసభ వేదిక మీదనే.

ఏడవ ఆంధ్ర మహాసభ, మల్కాపురం 1938:

ఏడవ ఆంధ్ర మహాసభ మల్కాపురంలో 1938లో మందుముల రామచంద్ర రావు అధ్యక్షతన జరిగింది. తెలంగాణాలో భూమిశిస్తులెక్కువ. తరి భూములపై ఎకరానికి 15 రూ॥ లనుండి 22 రూ॥ల వరకు పన్ను విధించేవారు. బ్రిటిష్ ఇండియాలో 5రూ॥ల నుండి 10రూ॥ల వరకు ఉండేది. మద్రాసు రాష్ట్రంలో ప్రకాశం పంతులు రెవిన్యూమంత్రి అయినప్పుడు నూటికి 25 వంతుల పన్ను తగ్గించారు. తెలంగాణాలో మద్రాసు మాదిరిగా పన్ను తగ్గించాలని సభ కోరింది. నిజాం సిల్వర్ జూబ్లి సందర్భంగా దివానీ అంతటకీ 40 లక్షల మాఫీ ఇవ్వగా ఒక సర్ఫెఖాస్ ప్రాంతానికే 42 లక్షలు మాఫీ ఇచ్చారు. సర్ఫెఖాస్ ఉద్యోగస్తుల మీద నేర విచారణ జరుపడానికి ప్రత్యేక అనుమతి పొందవలసిన అవసరం ఉండేది. దివానీ– సర్ఫెఖాస్‌ల మధ్య ఉన్న ఈ వ్యత్యాసాలను తొలగించాలని మహాసభ కోరింది.

ఎనిమిదవ ఆంధ్ర మహాసభ 1941:

ఎనిమిదవ ఆంధ్ర మహాసభ 1941లో యువనాయకుడు రావి నారాయణరెడ్డి అధ్యక్షతన నల్లగొండ జిల్లా హుజూర్‌నగర్ తాలూకాలోని చిల్కూరు గ్రామంలో జరిగింది. నారాయణరెడ్డి రాష్ట్రంలోని ప్రథమ సత్యాగ్రహులలో ఒకరు. స్టేటు కాంగ్రెస్‌లోని సోషలిస్టు భావాలుగల యువనాయకుడుగా రాజకీయ రంగమెక్కారు. తెలంగాణా ఇతిహాసంలో మొదటినుంచి తుదివరకు నారాయణరెడ్డిగారి పాత్ర ఉంది. ఆయన ఈ పోరాటంలో కడదాక నిలిచిన కర్ణధారి. ఈ సమావేశంలో నియమావళి మార్చి సభ్యత్వ రుసుం రూపాయి నుంచి నాలుగు అణాలకు తగ్గించారు. ఆంధ్ర

మహాసభ కమ్యూనిస్టు కార్యక్రమాలలో కూడా శ్రద్ధ తీసుకోవడం మొదలు పెట్టింది. మహిళా సమావేశానికి రంగమ్మ ఓబులరెడ్డి అధ్యక్షత వహించారు.

తొమ్మిదవ ఆంధ్రమహాసభ వరంగల్ జిల్లా ధర్మవరంలో 1947లో మాదిరాజు రామకోటీశ్వరరావు అధ్యక్షతన జరిగింది. ఈ మహాసభలో కమ్యూనిస్టులు ఒకవైపు, కమ్యూనిస్టేతరులు మరొకవైపు ప్రపంచయుద్ధంపై భిన్న ధోరణులలో వాదించారు. ధర్మవరం మహాసభలో జాతీయపతాక ఉద్యమం ప్రజల్లోకి చొచ్చుకు వచ్చింది. మందుముల నరసింగరావు అధ్యక్షత వహించారు. 8వ ఆంధ్ర మహాసభ జరిగిన తరువాత రెండు సంవత్సరాలకు ఈ సభ జరిగింది. మహిళాసభకు ఈసారి కూడా రంగమ్మ ఓబులరెడ్డి అధ్యక్షత వహించారు. ఆంధ్ర మహాసభలతో కలిసి సమావేశమైన మహిళా సభలలో ఇది చివరిది. ఆంధ్ర మహాసభలో మూడు వర్గాలేర్పడ్డాయి. కాంగ్రెస్ మొదటిది, కమ్యూనిస్టు రెండవది, మితవాదులు మూడవది. ఆంధ్ర మహాసభలకు పెరుగుతున్న ఆదరణను ప్రభుత్వం గుర్తించింది. రాజ్యంలోని ప్రముఖ సంస్థగా దీన్ని పేర్కొంది. ఆంధ్ర మహాసభను ప్రజాసంస్థగా రూపొందించడంతో వర్గ విభేదాలు బయటికి వచ్చాయి. భూస్వామ్య ప్రతినిధులైన మితవాదులు ఒకవైపు, వారికి వ్యతిరేకంగా రైతాంగ ప్రయోజనాలకై పోరాడే కమ్యూనిస్టులు ఇతర ప్రజాశక్తులు మరొకవైపున సంఘర్షణ పడసాగారు.

పదవ ఆంధ్ర మహాసభ రాజధాని నగరమైన హైదరాబాద్‌లో 1943 మే 23, 24, 25 వ తేదీలలో జరిగింది. ఈ సభను రెడ్డి హాస్టల్‌లో భారీయెత్తున నిర్వహించారు. మాడపాటి హనుమంతరావుతో సహా ఆయన అనుచరులంతా పెద్ద ఎత్తున హాజరైనారు. కమ్యూనిస్టు వారి సన్నిహితులు గణనీయమైన సంఖ్యలో ప్రతినిధులై వచ్చారు. పోటీ కొండా వెంకటరంగారెడ్డి, బద్దం ఎల్లారెడ్డిల మధ్య జరిగింది. మితవాది కొండా వెంకటరంగారెడ్డి గెలిచారు. బద్దం ఎల్లారెడ్డి, ఆరుట్ల లక్ష్మీనరసింహారెడ్డి, రావి నారాయణరెడ్డిలను కార్యవర్గ సభ్యులుగా నియమించారు. వీరికి మంచి కమ్యూనిస్టులని పేరు వుంది. వీరిని ప్రత్యేక మర్యాదలతో చూశారు.

సభ హైదరాబాద్‌లో జరగడం వలన దాని ప్రాముఖ్యం పెరిగింది. సరోజినీ నాయుడు, రాజాబహద్దూర్ వెంకటరామరెడ్డి, మేజర్ ఎం.జె.నాయుడు, కొందరు సంస్థానాధీశులు ఈ మహాసభలో పాల్గొన్నారు. ఈ సభలో చర్చకు వచ్చిన విషయం

హైదరాబాద్ సంస్థానంలో ఒక విధమైన బాధ్యతాయుత ప్రభుత్వం ఏర్పాటు చేయాలని. భారతదేశ రాజకీయాలలో ఇది ముఖ్య ఘట్టమని చెప్పాలి. ఒక సంస్థ ఆధిపత్య విషయంలో కమ్యూనిస్టులకీ, కాంగ్రెస్‌వారికీ మధ్య మొదటిసారిగా స్పష్టమైన స్పర్థ వచ్చి పెద్ద పోటీ జరిగింది, ఆంధ్ర మహాసభ సంస్థలో కాంగ్రెసుకు మెజారిటీ లభ్యమైంది. 1942లో క్విటిండియా ఉద్యమాన్ని కమ్యూనిస్టులు 'ప్రజావ్యతిరేక ఉద్యమంగా' చిత్రించి తమ నిజస్వరూపాన్ని బయటపెట్టుకున్నప్పటికీ అప్పుడు అఖిల భారత స్థాయిలో అంతా కలగలుపుగా ఉండేవారు.

అనంతర సభలు:

పదకొండవ ఆంధ్ర మహాసభ భువనగిరిలో 1944 సం॥ మే నెల 27, 28 వ తేదీలలో రావి నారాయణరెడ్డి అధ్యక్షతన జరిగింది. చీలిక ప్రభావం మహాసభలో ప్రస్ఫుటంగా కనిపించింది. ఆంధ్రోద్యమం ప్రారంభమైనప్పటి నుండి ప్రముఖ నాయకులుగా, కార్యకర్తలుగా పేరు తెచ్చుకున్నవారెవరూ ఈ మహాసభలో పాల్గొనలేదు. రాష్ట్రీయ, జాతీయ, అంతర్జాతీయ విషయాలు ఎన్నో ఈ సభలో చర్చకు వచ్చాయి. సభ్యులు చెల్లించే రుసుము నాలుగణాల నుండి ఒక అణాకు తగ్గింది.

పన్నెండవ ఆంధ్ర మహాసభ వరంగల్ జిల్లా మడికొండలో 1945 సం॥ మార్చి నెల 21, 22, 23 వ తేదీలలో మాదిరాజు రామకోటేశ్వరరావు అధ్యక్షతన జరిగింది. ఈ సభను విజయవంతంగా నడిపించడంలో కొండా వెంకటరంగారెడ్డి ఎక్కువ శ్రద్ధ తీసుకున్నారు.

పదమూడవ ఆంధ్ర మహాసభ మెదక్ జిల్లా కందిలో 1946 సం॥ మే నెల 10, 11, 12 తేదీలలో సర్దార్ జమలాపురం కేశవరావు అధ్యక్షతన జరిగింది. స్టేటు కాంగ్రెస్ సత్యాగ్రహంలో ఆయన ముందున్న నాయకుడు. గొప్ప జాతీయవాది. ఆయన తరువాత ఖమ్మం జిల్లా కాంగ్రెస్‌కు అంతటి పటిష్ఠమైన నాయకుడు మరొకరు లభించలేదు.

తెలంగాణాలో ఆంధ్రోద్యమం పరిమితమైన సాంస్కృతికోద్యమంగా ప్రారంభమై క్రమంగా విప్లవోద్యమంగా మార్పు చెందింది. ఇదే చివరి సమావేశం. మొదటి సమావేశం మెదక్ జిల్లా జోగిపేటలో జరిగింది. దీని చివరి సమావేశం మెదక్ జిల్లా

కందిలో జరిగింది. ఆ తరువాత ఆంధ్ర మహాసభ నాయకులలో మితవాదులు కాంగ్రెస్ పార్టీలో అతివాదులు కమ్యూనిస్టు పార్టీలో చేరిపోయారు.

ఆ రోజుల్లో ఆంధ్రులకు ప్రాతినిధ్యం వహించిన పెద్ద సంస్థ ఆంధ్ర మహాసభ ఒక్కటే.

ఆంధ్ర మహాసభలు

సంఖ్య	సం॥	ప్రదేశము	అధ్యక్షులు
1.	1930	జోగిపేట	సురవరం ప్రతాపరెడ్డి
2.	1931	దేవరకొండ	బూర్గుల రామకృష్ణారావు
3.	1934	నల్లగొండ	పులిజాల రంగారావు
4.	1935	సిరిసిల్లా	మాడపాటి హనుమంతరావు
5.	1936	షాద్‌నగర్	కొండా వెంకటరంగారెడ్డి
6.	1937	నిజామాబాద్	మందుముల నరసింగరావు
7.	1940	మల్కాపురం	మందుముల రామచంద్రరావు
8.	1941	చిల్కూరు	రావి నారాయణరెడ్డి
9.	1942	ధర్మవరం	మాదిరాజు రామకోటీశ్వరరావు
10.	1943	హైదరాబాద్	కొండా వెంకటరంగారెడ్డి
11.	1944	భువనగిరి	రావి నారాయణరెడ్డి
12.	1945	మడికొండ	మందుముల నరసింగరావు
13.	1946	కంది	జమలాపురం కేవశరావు

మహిళా మహాసభలు- అధ్యక్షురాండ్రు:

1) నడింపల్లి సుందరమ్మ, 2) టి. వరలక్ష్మమ్మ, 3) ఎల్లాప్రగడ సీతాకుమారి, 4) మాడపాటి మాణిక్యమ్మ, 5) బూర్గుల అనంతలక్ష్మీదేవి, 6) నందగిరి ఇందిరాదేవి, 7) యోగ్యశీలాదేవి, 8) రంగమ్మ ఓబులరెడ్డి, 9) రంగమ్మ ఓబులరెడ్డి, 10) ఎల్లాప్రగడ సీతాకుమారి.

ఆరవ ఆంధ్ర మహాసభలో బ్రిటిష్ ఆంధ్రప్రాంతం నుండి పాల్గొన్న ఆంధ్ర స్వరాజ్య పార్టీ అధ్యక్షులైన గుమ్మడిదల వెంకట సుబ్బారావుగారు తన అనుభవాన్ని ఇలా తెలిపారు: 'గత మూడు రోజుల నుండి నిజామాబాద్‌లో జరిగిన ఆంధ్ర మహాసభ వైభవమును కన్నులారా గాంచు అదృష్టము నాకు కలిగినందుకు సంతసించుచున్నాను. అచ్చటకు రాకపోకల సౌకర్యములకు ప్రత్యేక రైళ్ళు, సభాభవనములు, విద్యుద్దీపములు, దూరశ్రవణయంత్రములు మున్నగు ఏర్పాట్లయి యుండెను. ప్రతినిధుల వసతి గృహములు ప్రదర్శనశాలలందును, సభకు హాజరైన జన సమూహములందును ఇది ఒక చిన్న కాంగ్రెస్ అనిపించింది. కాంగ్రెస్‌లో ఇప్పటికినీ లేని ఇచ్చటగల మరొక విశేషము ఏమనగా ఈ సభలకు వచ్చిన 10000 మంది మించిన ప్రతినిధులు, ప్రేక్షకులందరికి శ్రీయుత నరసాగౌడ్‌గారి చేతి చలవవలనే మూడురోజులు మహావైభవముగా జరిగిన ఉచితాన్న ప్రదానము మా ఆంధ్రరత్న గోపాలకృష్ణుడు సంకల్పించిన ఆంధ్ర ప్రాంతసూత్రమును జ్ఞప్తికి తెచ్చుచున్నది. ఈ ఏడు సభలలో యువకులు కనబరిచిన ఉత్సాహము, కార్యదీక్ష, విచక్షణాశీలము, పెద్దల యందలి గౌరవాతిశయములు పురుషులతోపాటు స్త్రీలును ముందుకు నడుచుచుండుట నిజాం ఆంధ్రుల అదృష్టమే'.

తెలంగాణా ఆంధ్రోద్యమానికి ప్రజాభిమానం లభించడానికీ, ఉద్యమం దినదినాభివృద్ధి పొందడానికీ ముఖ్యకారణం, ఆంధ్ర మహాసభ ప్రజా జీవితంలో అన్నివర్గాల వారికి సంబంధించిన ఆర్థిక సాంఘిక సమస్యలను చేపట్టి, వాటిని గూర్చి తీర్మానాలు ఆమోదించి, ఆ తీర్మానాలను ప్రజల దృష్టికి తెచ్చి ప్రజా సమస్యలను పరిష్కరించేందుకు నిరంతరం కృషి జరపడమే. ఆంధ్ర మహాసభ కర్షకులు, కౌలుదార్లు, కార్మికులు, వర్తకులు మున్నగువారి సమస్యలను శ్రద్ధగా పరిశీలిస్తూ ఉండేది. గ్రామస్థుల ఋణభారం, నీటిపారుదల విధానం, ఆబ్కారీ విధానం, అటవీశాఖ విధానం, గ్రామాలలో విద్యాప్రచారం, గ్రామీణుల ఆరోగ్యం, జాగీరు ప్రజల కష్టనష్టాలు, జన సామాన్య విద్య, మాతృభాష ద్వారా విద్యాబోధన, ఉన్నత విద్యకు ప్రభుత్వం పరిమితి విధించకుండా దానిని వ్యాప్తిచేసేందుకు కృషి, మద్యపాన నిషేధం వంటి అనేక సమస్యలపై ఆంధ్ర మహాసభ తీర్మానాలు ఆమోదించి ఆందోళన జరిపింది. హనుమంత రావు పంతులుగారు, ఇతర నాయకులు గ్రామాలకు వెళ్ళి గ్రామస్థుల కష్టాలు,

అవసరాలు తెలుసుకుని, వాటి నివారణకై ఏమి చేయవలసిందీ స్థానికులతో చర్చలు జరిపారు. ఆ సారాంశాలను ఆంధ్ర మహాసభ స్థాయి సంఘం పక్షాన ప్రభుత్వ శాఖలకు పంపి, ఆ వ్యవహారాలను ఉన్నతాధికార్లు పరిష్కరించేటట్లు చూసేందుకు ముఖ్యంగా వర్తకుల సమస్యలను పరిష్కరించడంలో పూర్తిగానూ, వెట్టిచాకిరీ నిర్మూలనలో కొంతవరకూ ఆంధ్ర మహాసభ విజయం సాధించింది.

నిజాం రాష్ట్రంలో ప్రభుత్వోద్యోగులు జిల్లాల పర్యటనకు వచ్చినప్పుడు వర్తకులు వారి భోజనానికి కావలసిన సామగ్రిని సప్లయిచేయవలసి వచ్చేది. ఆ సామగ్రికి డబ్బు అసలే చెల్లింకపోవడమో, ఒకవేళ చెల్లించినా ఏ కొద్దిగానో చెల్లించడమో జరిగేది. ఈ దోపిడీవల్ల వర్తకులు నష్టపడేవారు. ఈ బాధను తప్పించుకోవడానికై గ్రామవర్తకులు 'పంతుపద్ధతి' కూడా ఏర్పరచుకున్నారు. కొందరు ఒకసారి, మరికొందరు ఇంకొక సారి సామగ్రి సప్లయిచేసేవారు. అంటే దండుగను పంచుకునే వారన్నమాట. ఆంధ్రోద్యమం ప్రారంభమైన కొద్దిరోజులకే వర్తక సంఘాలు స్థాపించబడ్డాయి. ఆంధ్ర జనకేంద్రసంఘం పక్షాన 'వర్తక స్వాతంత్ర్యము' అనే చిన్న పుస్తకం కూడా ప్రచురించ బడింది. ఈ వర్తక సంఘాలు పర్యటనలకొచ్చే అధికారులు తమకు కలిగిస్తున్న బాధలను, నష్టాన్ని ప్రభుత్వ దృష్టికి తీసుకురావడం మొదలు పెట్టారు. ఆ తరువాత ఈ జబర్దస్తీ తగ్గుముఖం పట్టింది. 'మా గ్రామంలో వర్తక సంఘం స్థాపించబడింది' అని ఒక్కమాట చెబితే చాలు, ప్రభుత్వోద్యోగులు నిరుత్తరులై పోయేవారు. క్రమేణా వర్తకుల నష్టాలు తగ్గిపోయాయి.

వెట్టిచాకిరి నిర్మూలన:

అట్లాగే వెట్టిచాకిరీ నిర్మూలనకి కూడా ఆంధ్ర మహాసభ కృషిచేసింది. ఆ రోజులలో ప్రభుత్వాధికారులు వారి పరివారంతో, సేవకులతో జిల్లాల పర్యటనకు వెళ్ళినప్పుడు కొన్ని రోజులు క్యాంపు చేసేవారు. అప్పుడు కుమ్మరి నీళ్ళు తేవాలి, వంట చేయాలి. చాకలి పాత్రలు కడగాలి, బట్టలు ఉతకాలి. హరిజనులు అధికారుల మూటాముల్లెలు ఒక గ్రామం నుంచి మరొక గ్రామానికి మోసుకుపోవాలి. ఈ పనులకు కూలీ ఇచ్చేవారు కారు. ప్రతి ఆంధ్ర మహాసభలోనూ ఈ వెట్టిచాకిరీకి వ్యతిరేకంగా ప్రబోధం జరిగేది. తీర్మానాలు చేసి ప్రభుత్వానికి పంపేవారు. అయితే వర్తకుల ఇబ్బందులు తొలగిపోయినంత సులభంగా వెట్టిచాకిరీ పద్ధతి నిర్మూలన కాలేదు.

చివరకు వెట్టిచాకిరీ అనేది కాంగ్రెసు ఆధ్వర్యాన ప్రజా ప్రభుత్వం ఏర్పాటైన తరువాత పూర్తిగా తొలగిపోయింది.

తెలంగాణా ఆంధ్రోద్యమంలో సంఘసంస్కరణోద్యమం కూడా ఒక భాగంగా సాగింది. సహపంక్తి భోజనాలు, అస్పృశ్యతా నివారణ, స్త్రీ విద్య, వితంతు వివాహాలు, రజస్వలానంతర వివాహాలు, కుల ప్రసక్తి లేకుండా, భాషా పరిధులను బట్టి ఉద్యమాల్ని నడపడం – వీటన్నిటివల్ల ఇక్కడి ప్రజానీకంలో ఆంధ్రోద్యమ కాలం నుంచే సంఘ సంస్కరణ దృక్పథం వేళ్ళూనింది.

మహిళాభ్యున్నతి:

మహిళాసభలు ఎవరు జోక్యం లేకుండా స్వతంత్రంగానే నడిచేవి. ఈ మహిళా సభలకు ఒరవడి అఖిలభారత మహిళాసభ. ఈ సభలు సంఘ సంస్కరణోద్దేశాలను బలపరచి, స్త్రీ జనోద్ధరణకు కృషిచేసి, స్త్రీలలో ఎంతో చైతన్యాన్ని వికాసాన్ని కలిగించ డానికి దోహదం చేశాయి. ఇల్లు వదిలి బహిరంగ సభలకురాని మహిళలు సైతం ఈ మహిళా సభలకు ఉత్సాహంగా వచ్చేవారు. భారతదేశమంతటా స్త్రీల హక్కుల విషయంలో వారి శ్రేయోభివృద్ధుల విషయంలో ద్యోతకమైన భావాలనే, ఆ దృక్పథాన్నే ఈ మహిళా సభలు సాధ్యమైనంతవరకు అనుసరించడం గమనించవలసిన విషయం. భారతదేశంలో సర్వత్రా వ్యక్తమైన ప్రగతిశీల భావాలను, సంస్కరణలను వీరు బలపరిచారు. వితంతు వివాహాలను సమర్థించారు. బహుభార్యత్వాన్ని, కన్యాశుల్కాన్నీ, వేశ్యావృత్తిని నిషేధించవలసిందిగా కోరారు. తల్లిదండ్రుల ఆస్తిలో కుమార్తెలకు భాగం ఉండవలెనన్నారు. శాసనసభలో స్త్రీలకు ప్రాతినిధ్యం ఉండవలెనని ఉద్ఘోషించారు. స్త్రీ సభలకు పంతులుగారిచ్చిన ప్రోత్సాహం, వాటికి కల్పించిన స్వేచ్ఛాపూరిత వాతావరణం స్మరింపదగినవి. ఎంత పెద్ద వ్యక్తి అయినా సరే, మహిళా సభలలో జరిగే చర్చలను గూర్చి జోక్యం కలుగ జేసుకోకుండా దృఢంగా నిలిచి, అవాంఛనీయ సంఘటనలు జరుగకుండా చూచారు.

సిరిసిల్ల ఆంధ్ర మహాసభ సందర్భంగా జరిగిన మహిళా మహాసభకు హనుమంతరావు పంతులుగారి సతీమణి, మాడపాటి మాణిక్యమ్మగారు అధ్యక్షులు. తెలంగాణా ఆంధ్రోద్యమ చరిత్రలో భర్త మహాసభకు అధ్యక్షులుగాను, భార్య మహిళా సభకు అధ్యక్షురాలుగాను ఉండడం ఈ ఒక్క పర్యాయం మాత్రమే జరిగింది. ఈ

మహిళా సభ తరువాత విద్యావంతులైన స్త్రీలు, ముఖ్యంగా పరదా పద్ధతిని పాటించే వారు ఆంధ్రోద్యమంలో, సంఘసంస్కరణ కార్యక్రమాలలో పాల్గొనడానికి ఉత్సాహంగా ముందుకు వచ్చారు.

రాష్ట్ర మహిళా సభలు:

హైదరాబాద్ సంస్థానంలో అధిక సంఖ్యాకులు తెలంగాణావారే. అయినప్పటికీ ప్రభుత్వోద్యోగాలలోగానీ, ఉన్నత పదవులలోగానీ ఆంధ్రులకు స్థానం ఉండలేదు. సాంఘికమైన నిబంధనలు కూడా అనంతం. రాష్ట్రంలో ఎక్కడ కొత్త దేవాలయాలు సైతం నిర్మించకూడదు. పాతవాటికి అనుమతి లేనిదే మరమ్మత్తులు చేయకూడదు. గస్తీ నిషాన్ 53 (సర్క్యులర్ 53) కింద సభలు, సమావేశాలు జరుపరాదు. ఇలాంటి అనేక నిర్బంధాలు అధిగమించి తెలుగు జాతిపురోగతిని ముందుంచవలసి వచ్చింది. ఇక మహిళల స్థితి అధ్వాన్నంగా ఉండేది. అంతులేని అవరోధాలు, పరిమితులు.

1916లో శ్రీమతి కజిన్స్ హైదరాబాద్ వచ్చారు. అప్పటికే ఢిల్లీలో అఖిల భారత మహిళాసభ ఏర్పాటైంది. హైదరాబాద్ నగరంలో శ్రీమతి సరోజినీ నాయుడు, లేడీ హమీనా హైదరీ, రుస్తుంజీ సర్దుంజీ మొదలైన వారు సమావేశమై మహిళా విద్యా, సాంఘిక సంఘం స్థాపించారు. ఈ సమావేశానికి రాజకుమారి ధన్‌రాజ్ గిర్‌జీని అధ్యక్షులుగా ఎన్నుకున్నారు.

సరోజినీనాయుడు భారత రాజకీయాలలో నిమగ్నులై ఉండేవారు. ఇతర మహిళా మణులు స్త్రీల విద్య, సాంఘికాభివృద్ధుల కోసం సభలు సమావేశాలు జరుపుతుండేవారు. నిజాం ప్రభువు కోడళ్ళు ఇందులో కార్యభారం వహించిన తదుపరి కొన్ని ఆకర్షణీయమైన కార్యక్రమాలు జరిగాయి. అయితే నాటికీ, నేటికీ ఈ సంస్థ ఉన్నతోద్యోగులు, శ్రీమంతులైనవారి భార్యలకే పరిమితం కాగా సామాన్య మహిళలకు అందుబాటులో ఉండకపోయింది. ఆ రోజుల్లో నిజాం పెద్దకోడలు దురెషావర్ దుర్దానాబేగమ్ ఈ సమాజానికి అధ్యక్షురాలిగాను, పాట్రన్‌గాను ఉండేవారు. అప్పటి సంస్థానంలో బ్రిటిష్ మంత్రుల భార్యలైన లేడీ టాస్కర్, లేడీ ట్రెంచ్ మున్నగు ఆంగ్ల వనితలు కర్నిలియస్, విలియమ్స్ మొదలైన క్రైస్తవ వనితలు కూడా సంఘ కార్యకలాపాలలో పాల్గొనేవారు. తదుపరి రంగమ్మ ఓబులరెడ్డి, రాణి సరళాదేవి, సుందరమ్మ మున్నగు మహిళలు కూడా అప్పుడప్పుడు ఇందుకు కృషి చేశారు.

సంస్కరణోద్యమం వెల్లువ, జాతీయోద్యమ ప్రభావం కలిసి తెలంగాణా స్త్రీలు జాతీయోద్యమంలో తరచుగా పాల్గొనేలా చేశాయి.

ఆంధ్ర యువతీమండలి:

సిరిసిల్ల ఆంధ్ర మహిళాసభలో శ్రీమతి ఎల్లాప్రగడ సీతాకుమారికి 'ఆంధ్ర యువతీమండలి' అనే ఒక సంస్థ ఉండాలని అభిప్రాయం కలిగింది. వెంటనే ఆమె బూర్గుల రామకృష్ణారావుగారి భార్య శ్రీమతి అనంత లక్ష్మీదేవిని కలిసి ఆంధ్ర యువతీమండలిని స్థాపించటానికి పథకం వేశారు. గద్వాల మహారాణి ఆదిలక్ష్మీదేవి గారిని కలిసి ఆమె అధ్యక్షులుగాను, బూర్గుల అనంత లక్ష్మీదేవి ఉపాధ్యక్షులుగాను, సీతాకుమారి కార్యదర్శిగాను 'ఆంధ్ర యువతీమండలి'ని స్థాపించారు. ఇది 1935లో జరిగిన విషయం. హైదరాబాద్‌లో దుర్గాబాయి దేశ్‌ముఖ్ స్థాపించిన 'ఆంధ్ర మహిళా సభ' కన్న హైదరాబాద్ ఆంధ్ర యువతీమండలి 15 సంవత్సరాలు ముందుంది.

తరువాత నగరంలో దక్షులైన ఆంధ్ర వనితలను 'కమిటీ'లో చేర్చుకున్నారు. ఇల్లిందల సరస్వతీదేవి కోశాధికారి, కూచిభొట్ల రాజ్యలక్ష్మి సంయుక్త కార్యదర్శి, ఇల్లిందల శ్యామలాదేవి ఇంకా ఇతర ప్రముఖ వనితలు కొందరు కార్యవర్గ సభ్యులు. సంస్థ ప్రారంభించిన వెంటనే వారి కార్యక్రమాలు నిర్వహించడం ప్రారంభించారు. గద్వాల రాణి ఆదిలక్ష్మీదేవి అధ్యక్షతా విశేషం వలన వీరి కార్యక్రమాలకు బొగ్గులకుంట రోడ్డులో ఉన్న రెడ్డి హాస్టలు హాలును ఉచితంగా ఇచ్చేవారు. ఒక నౌకరును నియోగించి శ్రీకృష్ణదేవరాయాంధ్ర భాషానిలయం గ్రంథాలయం నుంచి మంచి పుస్తకాలు తెప్పించి, ఇతరత్రా కూడా పుస్తకాలు సంపాదించి చదవగలిగిన స్త్రీలకు వారం రోజుల కోసం పంపేవారు. ఆ విధంగా భాషోద్ధరణ చేశారు. ఇంతకుమించి కళను ఉద్ధరించేవారు.

ఈ సందర్భంగా ఒక సంతోషకరమైన విషయం చెప్పాలి. 1935లో స్థాపించిన ఆంధ్ర యువతీమండలి 1952లో అప్పటి మేధావుల కృషివలన స్వంత స్థలం సంపాదించి ఆంధ్ర యువతీమండలి భవనం నిర్మించి, అందులో ఒక ప్రైమరీ స్కూలు తెరిచారు. అది దినాభివృద్ధి చెంది 1954లో హైస్కూలుగా మారింది. ఆలోగా 1955లో ఒక శిశు వికాస్ విహార్, తరువాత క్రమేపీ స్త్రీల హాస్టలు, లైబ్రరీ, కుట్టుపని శిక్షణా కేంద్రం నెలకొల్పారు. అలా విస్తరింపబడిన మండలి అనేక ఉత్సవాలకు, సాహిత్య సభలకు కూడా తావలమై అత్యున్నత స్థాయినందుకున్నది. ❑

20. గ్రంథాలయాలు

ఆంధ్రోద్యమంకన్న గ్రంథాలయోద్యమం పురాతనమైనది. దేశంలోని అన్ని ప్రాంతాల వలెనే తెలంగాణాలో కూడా గ్రంథాలయోద్యమం ఇరువయ్యో శతాబ్దంలో ప్రారంభమైంది. ఆనాటినుంచి ఆంధ్ర జాతీయ జీవనంలో గ్రంథాలయోద్యమం నిర్వహించిన పాత్ర అమోఘమైనది.

1901లో హైదరాబాద్ నగరంలో శ్రీకృష్ణదేవరాయ ఆంధ్రభాషానిలయం స్థాపించబడింది. కొమర్రాజు వెంకటలక్ష్మణరావు, రావిచెట్టు రంగారావు, మునగాల జమీందారు రాజా నాయని వెంకటరంగారావు ఈ గ్రంథాలయ స్థాపకులు. తెలుగు తల్లిని కనక కిరీటంతో అలంకరించాలని ఆకాంక్ష. నిరక్షరాస్యత నిర్మూలన, చరిత్ర పరిశోధన, నిజాం దమన రీతికి వ్యతిరేకంగా ఉద్యమం శ్రీకృష్ణదేవరాయాంధ్ర భాషానిలయంలో ఉద్భవించాయనడం అతిశయోక్తి కాదు.

హైదరాబాద్ నగరంలో 1886లో అబ్దుల్ ఖయ్యూం అనే జాతీయవాది, మౌల్వీ సయ్యద్ హుసేన్ బిల్‌గ్రామీ అనే నవాబు, ఇమాదుల్ ముల్క్ కలసి ఒక గ్రంథాలయాన్ని అధీనంలోకి తీసుకొని ప్రజల ఉపయోగానికి తెరిచిందే ఆసఫియా స్టేటు లైబ్రరీ. ప్రస్తుతం అఫ్జల్‌గంజ్ ప్రాంతంలో ఉన్న స్టేటు సెంట్రల్ లైబ్రరీ కూడా ఇదే. కొందరు దేశభక్తులు పాతనగరం లాల్‌దర్వాజ ప్రాంతంలో 1895లో భారత గుణవర్ధక సంస్థను స్థాపించారు. ఇప్పటికీ ఇది పని చేస్తున్నది. ఇందులో ఎందరో ప్రాచీన కవుల రచనలు, గ్రంథాలు అన్ని భాషల్లో ఉన్నాయి. 1908లో హనుమకొండలో రాజరాజనరేంద్ర ఆంధ్రభాషానిలయం స్థాపన జరిగింది. ఆంధ్ర పితామహ మాడపాటి హనుమంతరావు ఈ గ్రంథాలయానికి కార్యదర్శిగా ఉండేవారు. ఆ తరువాత సికింద్రాబాద్‌లో 1905లో ఆంధ్ర సంవర్ధనీ గ్రంథాలయం, 1911లో ఎర్రుపాలెంలో మహబూబియా గ్రంథాలయం, 1917లో సూర్యాపేటలో ఆంధ్ర విజ్ఞాన ప్రకాశన గ్రంథాలయం, 1918లో నల్లగొండలో ఆంధ్ర సరస్వతీ గ్రంథాలయ స్థాపన జరిగింది.

ఈ గ్రంథాలయాలు పాఠకులకు పత్రికలు, పుస్తకాలు అందించడమే కాక, సభలకు, సమావేశాలకు కవితాగోష్ఠులకు, వివిధ సంస్థల వార్షికోత్సవాలకు వేదిక కల్పించి ప్రజలను మేల్కొలిపాయి. గ్రంథాలయాలవలన విద్యార్థులకు, నగర వాసులకు రాజకీయ సాహిత్యం విరివిగా లభించింది. ఇవి ప్రజల విజ్ఞాన తృష్ణను పెంపొందించాయి. తెలంగాణాలో కలిగిన జాతీయ చైతన్యానికీ గ్రంథాలయాలే ముఖ్య కారణం. గ్రంథాలయాల ద్వారానే ఆంధ్రోద్యమం అతి త్వరగా రాష్ట్రంలో వ్యాపించింది.

ఆ రోజుల్లో గ్రంథాలయాలు నడపడం అంత సులభమైన పనికాదు. ఆంధ్రోద్యమం మరొక సంవత్సరానికి మొదలు కానున్నదనగా సూర్యాపేటలోని ఆంధ్ర ప్రకాశినీ గ్రంథాలయాన్ని అప్పటి కలెక్టరు పరిశీలించాడు. ఆంధ్ర గ్రంథాలయ మొకటి తాలూకా ప్రధానకేంద్రంలో కేవలం ప్రజల సహకారంతో నడపడం ఆ అధికారికి ప్రభుత్వధిక్కార చర్యగా తోచింది. ఈ గ్రంథాలయం నడపడానికి ప్రభుత్వ అనుమతి తీసుకున్నారా? అని కార్యకర్తలను ప్రశ్నించాడు. లేదని సమాధానం రాగానే గ్రంథాలయాన్ని మూసివేయమని కలెక్టరు ఆజ్ఞాపించాడు. అంతట కార్యకర్తలు ఈ వార్తను హైదరాబాద్‌లో ఉన్న మాడపాటి వారికి చేరవేశారు. పంతులుగారు అప్పటి ప్రభుత్వ హోం కార్యదర్శి సర్ అక్బర్ హైదరీకి లేఖరాస్తూ, 'కలెక్టర్ జిల్లా లోకల్ ఫండుబోర్డుకు కూడా అధ్యక్షుడు. అట్టి అధ్యక్షుడి నుంచి ప్రజా గ్రంథాలయాలకు ధనసహాయం అందుతుందని విన్నాం కాని ఏకంగా గ్రంథాలయాన్నే మూసి వేస్తారని వినలేదు. ఈ విషయంలో మీరు న్యాయం చేయాల'ని పేర్కొన్నారు. కలెక్టరు నుంచి సమాచారం తెప్పించుకున్న హోం కార్యదర్శి పంతులుగారికి సమాధానమిస్తూ 'గ్రంథాలయాలను నడపడానికి ప్రభుత్వ అనుమతి పొందవలసిన అవసరం లేద'ని చెప్పారు. దీంతో గ్రంథాలయం తిరిగి తెరిచారు.

మడికొండ గ్రంథాలయానికి కూడా ఇలాంటి దురవస్థే పట్టింది. దీనికి ఒక సంవత్సరం వరకు అనుమతించలేదు. కరీంనగర్ జిల్లా సిరిసిల్ల గ్రంథాలయాన్ని చూసిన అక్కడి తహశీల్దారు 'సర్కారు వారి దస్తరములతో వ్యవహారమంతా ఉర్దూ భాషలో ఉండగా, ఇక్కడ చచ్చిపోయిన తెలుగు భాషను గుంజవలసిన అవసరం లేదని' అన్నాడట. ఆ రోజులలో తెలుగు భాషంటే నిజాం ప్రభుత్వానికి అంతటి ద్వేషం. పైగా రాష్ట్రంలోని అధిక సంఖ్యాక ప్రజల భాష తెలుగు అని తెలిసి కూడా.

ఏ పనికైనా డబ్బు అవసరం. గ్రంథాలయాలకు విరాళాలు ఇవ్వడానికి, నెల చందాలు కట్టడానికి ఎవరు ముందుకు వచ్చేవారు కారు. అట్టి పరిస్థితులలో గ్రామపెద్దలు, సంఘశ్రేయోభిలాషులు డబ్బు సేకరించి అలమరాలు, పుస్తకాలు, వార్తా పత్రికలు, ఫర్నీచర్ కొనడానికి శ్రమించేవారు. కరీంనగరు జిల్లా కోరుట్ల గ్రంథాలయ స్థాపనకు శతావధాని కృష్ణమాచార్యులు ఇంటింటికి వెళ్ళి బియ్యాన్ని పోగు చేసి, ఆ విధంగా సేకరించిన బియ్యాన్ని విక్రయించి వచ్చిన డబ్బుతో పుస్తకాలు, పత్రికలు కొనేవారు. గ్రంథాలయ కార్యదర్శులు సైకిళ్ళపై తిరిగి పుస్తకాలు పంపిణీ చేసి (సంచార గ్రంథాలయాలు) వినూత్న ప్రక్రియను ప్రారంభించారు.

ఆదిలాబాద్ జిల్లా చెన్నూరులో ఒక వినూత్న ప్రయత్నం జరిగింది. చెన్నూరులో బ్రాహ్మణులు అధికం. సంతర్పణలు, సమారాధనలు అంటే వారికి మహా ప్రీతి. గ్రంథాలయం స్థాపించాలంటే ఏ ఒక్కరూ ముందుకు వచ్చేవారు కాదు. ఆ కాలంలో అక్కడ సర్కారీ దవాఖానాలో డాక్టరుగా పనిచేసిన ఒక మహారాష్ట్రుడు అక్కడి ప్రజల మనస్తత్వాన్ని గ్రహించాడు. తను ఒక సమారాధన చేయాలనుకున్నానని అందుకు కావలసిన డబ్బుతోపాటు బియ్యం, పంచదార, పప్పు, నూనె, చింతపండు, వంటచెరుకు, శనగపిండి మొదలైన సామగ్రిని అడగడంతో అవి ధారాళంగా వచ్చి పడినవి.

డాక్టరు అవసరం, మందుల అవసరం ప్రతి ఒక్కరికి ఉంటుంది. కనుక డాక్టరు కోరిన సరుకులు ఇవ్వడానికి పోటీ ఏర్పడింది. ప్రజలకు విందులో సాధారణ భోజనమే పెట్టారు కానీ డాక్టరుగారిని అడిగే ధైర్యం ఎవ్వరూ చేయలేదు. మరునాడు డాక్టరుగారు ఒక షావుకారిని పిలిపించి మిగిలిపోయిన సామగ్రిని విక్రయానికి పెట్టగా మూడువేలు వచ్చింది. ఆ డబ్బుతో గ్రామ కూడలిలో మూడువందల గజాల స్థలం కొని, ఒక పెంకుటిల్లు వేయించి అలమారు, పెట్రోమాక్స్ లైటు, పుస్తకాలు కొన్నారు. 'గోదావరి వచనాలయము' అని ఆ గ్రంథాలయానికి పేరు పెట్టాడు. గ్రామపెద్దలను ఆహ్వానించి ఆ డాక్టర్ మీరు సమారాధనకిచ్చిన సామగ్రిలో మిగిలిన దానిని అమ్మి వచనాలయము స్థాపించానని తెలిపారు. ఆదిలాబాద్ పట్టణంలో మరిన్ని గ్రంథాలయాలు వెలిశాయి.

తెలంగాణలో అనేక కష్టనష్టాలను ఎదుర్కొని గ్రంథాలయోద్యమాన్ని ముందుకు తీసుకుపోయిన దైవారాధకులెంతో మంది ఉన్నారు. ఒకానొక సందర్భంలో ఆంధ్ర పితామహ మాడపాటి హనుమంతరావు మాట్లాడుతూ 'మా గ్రంథాలయాలకుగాని, ఆలయాలకుగాని ప్రాముఖ్యం లేదు. దేశసేవకు పూనుకున్న ఒక యువకుడున్నాడని అర్థం' అన్నారు. అనేకమంది యువకులు వార్షికోత్సవాలు జరిపి కారాగార శిక్ష అనుభవించారు. పోలీసుల దౌర్జన్యాలను ఎదుర్కొని గ్రంథాలయాలను నిర్వహించిన సందర్భాలు ఎక్కువగా ఉన్నాయి. అటువంటి సమయంలోనే నల్లగొండలోను, సూర్యాపేటలోను గ్రంథాలయ వార్షికోత్సవాలు తలపెట్టారు. కాని జిల్లా కలెక్టరు ఆటంక పెట్టాడు. పైగా అధ్యక్షోపన్యాసాన్ని, తదితరుల ఉపన్యాసాలను ముందుగ తనకు చూపించాలని షరతు విధించాడు. కానీ అవమానకరమైన ఈ షరతులకు గ్రంథాలయ కార్యకర్తలు అంగీకరించలేదు. అంతటి నిర్బంధ విధానం అమల్లో ఉన్నప్పటికీ కూడా కార్యకర్తలలో ఉత్సాహం తగ్గలేదు. ఇంతలో ప్రభుత్వానికి సభలను ఆపే అధికారం లేదని హైకోర్టు తీర్పు ఇచ్చింది. ఇది గ్రంథాలయోద్యమ చరిత్రలో స్వర్ణాక్షరాలతో రాయవలసిన ఘట్టం.

1939లో వెల్దుర్తి మాణిక్యరావు, గుండవరపు హనుమంతరావు, తోడ్పాటుతో కె.సి.గుప్తా అణాగ్రంథమాలను స్థాపించారు. అణాకొక గ్రంథంగా, వందపుస్తకాల్ని కేవలం ఐదు రూపాయలకే ఇవ్వాలని నిర్ణయించారు. గుప్తాగారి ఇల్లే అణాగ్రంథ మాలకు కేంద్రంగా ఉండేది. హైదరాబాద్‌లోని గౌలీగూడ, సుల్తాన్‌బజారులలోని సుబ్బారావు హోటళ్ళ ముందు ఈ పుస్తకాలను విక్రయించేవారు. అణాగ్రంథమాల తొలి ప్రచురణ గా 'హైదరాబాద్ రాజ్యాంగ సంస్కరణలు' అనే పుస్తకాన్ని 1939 నవంబరులో ప్రచురించారు. నాటి నిజాం తీసుకువచ్చిన సంస్కరణలను ఉర్దూ నుండి వెల్దుర్తి మాణిక్యరావు తెలుగులోనికి అనువాదం చేశారు. దీనికి మాడపాటి హనుమంతరావు ముప్పై పేజీల పీఠిక రాశారు. ఆ పుస్తకం రెండు మార్లు అచ్చు వేసినా చాలలేదు. ఆ ఉత్సాహంతో వెల్దుర్తి మాణిక్యరావు 'రైతు' పేరుతో మరొక పుస్తకాన్ని వెలువరించారు. రైతులందరు బద్ధకం వదిలి కార్యదీక్షకు పూనాలని, ఉద్యమించాలని సూచిస్తూ రైతుల కడగండ్లను వివరించడం జరిగింది. ఈ పుస్తకంపై నిజాం ప్రభుత్వం నిషేధం ప్రకటించింది. అణా గ్రంథమాల విడుదల చేసే పుస్తకాన్ని

కనిపెట్టడానికి నిజాం నవాబు రెండు హోటళ్ళముందు పోలీసుల నిఘా పెట్టాడంటే అణా గ్రంథమాల నిజాంని ఎంతగా వణికించేదో తెలుసుకొనవచ్చు.

జగిత్యాల తాలూకా నెమలికొండ గ్రామంలో నెలకొన్న విజ్ఞాన ప్రచారిణీ గ్రంథమాల ప్రసిద్ధ రచయితల చేత గ్రామ వ్యవసాయం, వైద్యం, పరిశ్రమలు, చారిత్రక విషయాలపై రచనలు చేయించి అమూల్యమైన నాలుగు గ్రంథాలను ప్రచురించింది. నల్లగొండ జిల్లా చందూరులో ధవళా శ్రీనివాసరావు, సరిప్రగడ భార్గవరావుల కృషితో సాహితీ మేఖల సంస్థ ఏర్పడింది. దీనికి అంబడిపూడి వెంకటరత్నం పట్టుకొమ్మగా ఉండేవారు. 1932లో ఆచార్య రాయప్రోలు సుబ్బారావు అధ్యక్షులుగా ఆచార్య కురుగంటి సీతారామయ్య కార్యదర్శిగా హైదరాబాద్ సాహిత్య పరిషత్తు ఏర్పడింది. బూర్గుల రంగనాథరావు, నెల్లూరు కేశవస్వామి, వెల్దుర్తి మాణిక్యరావుల కృషితో 1939లో సాధన సమితి ఏర్పడింది. ఇది ఖండకావ్యాలను, కథానికలను, సాహిత్య విమర్శలను ప్రచురించింది. దాని సభ్యులు ఈ సమావేశాలలో తమ కొత్త రచనలు చదివి వినిపించేవారు. 1941లో వట్టికోట ఆళ్వారుస్వామి దేశోద్ధారక గ్రంథమాలను స్థాపించారు. గ్రంథమాల తరపున 1938–41, 1953–61 మధ్యకాలంలో ముప్పై పుస్తకాలను ఆయన ప్రచురించడం గొప్ప విశేషం. వట్టికోట భుజానికి జోలె సంచి తగిలించుకుని ఆ పుస్తకాలను అమ్మటమే కాదు, 10 రూపాయలు మాత్రం తీసుకొని పదకొండు రూపాయల నాలుగణాల ధర గల పుస్తకాలను ఇచ్చేవాడు. ఆ విధంగా పుస్తక పఠనానికి, పుస్తకాల ప్రచురణకు ప్రేరణ కలిగించాడు. తెలంగాణా చరిత్ర, సంస్కృతులను తెలిపే సమకాలిక సమస్యలను వివరించే తెలంగాణావారి విజ్ఞానాభివృద్ధికి చైతన్య స్ఫూర్తికి తోడ్పడే గ్రంథాలను వట్టికోట ప్రచురించి తెలంగాణాలో సాహిత్యోద్యమానికి రాజకీయ చైతన్యానికీ తోడ్పడ్డాడు.

తెలంగాణాలో ఆంధ్రోద్యమం ప్రారంభమయ్యేనాటికి 1922 వరకల్లా సుమారు 15 గ్రంథాలయాలు స్థాపించబడ్డాయి. వరంగల్‌లో శబ్దానుశాసన గ్రంథాలయం, ఖమ్మంలో జ్ఞాన విద్యుత్ ప్రవాహినీ భాషానిలయం, ఎర్రుపాలెంలో మహబూబియా గ్రంథాలయం, రేమిడిచర్లలో సిద్ధిమల్లేశ్వర గ్రంథాలయం, నల్లగొండలో ఆంధ్ర సరస్వతీ గ్రంథ నిలయం, హైదరాబాద్‌లోని గౌలీగూడలో బాలసరస్వతీ ఆంధ్ర గ్రంథాలయం, నాంపల్లిలో వేమన ఆంధ్ర భాషానిలయం స్థాపించబడ్డాయి.

1925లో మధిరలో ప్రథమ గ్రంథాలయ సమావేశం జరిగింది. తెలంగాణాలోని అన్ని గ్రంథాలయాల ప్రతినిధులు ఈ సభలో పాల్గొన్నారు. పింగళి వెంకట్రామిరెడ్డి ఈ సమావేశానికి అధ్యక్షుడు. ఆయన దేశముఖ్. జీతభత్యములు లేకుండా సెషన్స్ జడ్జీ ఉద్యోగం చేసినాడు. అప్పటికి తెలుగువారిలో అంత పెద్ద ఉద్యోగస్థుడు లేనేలేడు. ఈ గ్రంథాలయాలే నిజాం రాష్ట్రంలో నిర్మాణ కార్యక్రమానికి పునాది.

సూర్యాపేట ఆంధ్ర జనసంఘం సమావేశ సమయంలో రెండవ గ్రంథాలయ సభను కూడా అక్కడే ఏర్పాటు చేశారు. ఈ గ్రంథాలయసభతోపాటు ఆంధ్ర యువక సభ, సంఘసంస్కార సభ, ఆంధ్ర మహిళాసభ, వైశ్య యువజన సభలు జరిగాయి. ఆరు సభలు మూడు దినాలలో మహోత్సవంగా జరిగాయి. ఈ ఉత్సాహమే ఆంధ్ర మహాసభ ఏర్పాటుకు ప్రోత్సాహ పరిచింది.

సూర్యాపేట గ్రంథాలయ మహాసభ తరువాత ప్రత్యేకంగా గ్రంథాలయ మహాసభలు జరుగలేదు. రెండవ గ్రంథాలయ మహాసభలను ప్రసిద్ధ మహారాష్ట్ర నాయకుడు దాత అయిన దేశభక్త వామన్ నాయక్ అధ్యక్షతన 1929 మే 31, జూన్ 1వ తేదీలలో జరిగాయి.

ఆ రోజులలో పరిశోధకులు ఎన్నో ఇబ్బందులు ఎదుర్కొనేవారు. దూపాటి వెంకటరమణాచార్యుల పరిస్థితి తెలంగాణాలో దాదాపు అదేవిధంగా ఉండేది. ఆయన వూరూరా తిరిగి ఐదు వేలకుపైగా తాళపత్ర గ్రంథాలు సేకరించారు. వెయ్యికి పైగా శాసనాలను వెలికి తీసారు. ఆయన నెత్తిమీద తాటాకుల పుస్తకాలు పెట్టుకుని, అందరూ వదిలేసిన రాళ్ళూ రప్పలను తవ్వుతుంటే, ఆయా వూళ్ళ వాళ్ళందరూ ఆయన చేతబడి చేయడానికి వచ్చారేమో అనకునేవారట. 'బాబూ! నీకో నమస్కారం. అందరం కలిసి చందావేసుకొని నీకు డబ్బు ఇస్తాం. కానీ మావూళ్ళో నీ విద్య ప్రయోగించకు' అని బతిమిలాడుకునేవారట. రాత్రిపూట వచ్చి శిలాశాసనాలు తవ్వుకునేవారట. సుదీర్ఘమైన పరిశోధనలు జరిపి దూపాటివారు పోతన జన్మస్థలం వరంగల్లే అని నిర్ధారించి చెప్పారు.

ఖమ్మంలో విజ్ఞాన నికేతన గ్రంథాలయం కోదాటి నారాయణరావు నిర్విరామ కృషితో స్థాపించబడి ఆదర్శంగా పనిచేసింది. మునుగాల రాజా నాయని వెంకటరంగా రావు, కొమర్రాజు వెంకటలక్ష్మణరావు, గాడిచర్ల హరిసర్వోత్తమరావు, అయ్యదేవర

కాళేశ్వరరావుల కృషితో మునగాల రాజాగారి భవనంలో 'విజ్ఞాన చంద్రిక గ్రంథమాల' స్థాపించబడింది. దీని కార్యస్థానం హైదరాబాద్‌లోని రెసిడెన్సీ బజార్‌లో రావిచెట్టు రంగారావు ఇంట్లో ఉండేది. ఈ సంస్థ ప్రచురించిన తొలి నాలుగు పుస్తకాలను హైదరాబాద్ కార్యాలయం నుండే విడుదల చేశారు. రావిచెట్టు వారి కార్యకలాపాలపై హైదరాబాద్ పోలీసుల నిఘా ఎక్కువైంది. విజ్ఞానచంద్రిక కార్యాలయాన్ని మదరాసుకు తరలించవలసి వచ్చింది.

తన జీవితాన్ని తైలంగా చేసుకొని కొడిగట్టిన తెలంగాణా చరిత్రను వెలిగించిన మహోదయుడు ఆదిరాజు వీరభద్రరావు. 1922లో ఆంధ్ర జనసంఘానికి అనుబంధంగా ఆయన ఆంధ్ర పరిశోధక మండలిని నెలకొల్పారు. దానిని కొమర్రాజు వారి అస్తమయానంతరం లక్ష్మణరావు పరిశోధక మండలిగా మార్చారు. ఆదిరాజువారి కార్యదర్శకత్వంలో లక్ష్మణరావు పరిధోక మండలి చేసిన సేవ అసదృశం. తెలంగాణా శాసనాలు రెండు సంపుటాలను అది ప్రచురించింది.

1952లో వచ్చింది తెలంగాణా రచయితల సంఘం. ఇది పుట్టగానే తెలంగాణా అంతటా సాహిత్య ఝుంఝూమారుతం వీచింది. గ్రామ గ్రామాన పల్లె పల్లెలో రచయితల సంఘాలు వెలిశాయి. అనేక సంవత్సరాలుగా అణగారిన తెలంగాణా గళాల వ్యక్తీకరణకు మార్గం లభించింది. కోటి గొంతులు పలికాయి. పలుకనేర్చాయి. దీన్ని పలికించినవాడు దాశరథి. ఆచార్య లక్ష్మీరంజనం, సి. నారాయణరెడ్డి, కాళోజీ, వానమామలై, రామరాజు, పల్లా దుర్గయ్య, కప్పగంతుల లక్ష్మణశాస్త్రి, ఇరివెంటి కృష్ణమూర్తి, వి.పి. రాఘవాచార్యులు మొదలైన వారితో ఈ సంఘం పరిపుష్టి నందుకున్నది.

తెలంగాణా స్వాతంత్ర్యోద్యమంలో కవిత్వోద్యమం కూడా విజృంభించింది. గ్రంథాలయాల వార్షిక సందర్భాలలో కవితా పఠనం ఉండవలసిందే. పాఠశాల వార్షికోత్సవంలో కావ్యగానం జరుగవలసిందే. పండుగనాడు, కవుల గోష్ఠి ఏర్పాటు చేయ వలసిందే. రాజకీయ మహాసభల్లో కవుల పద్యాలు మార్మోగవలసిందే. కవిత్వం వినరానిచోటు తెలంగాణాలో ఉండేది కాదు. 'గుడిలో, బందిఖానాలో, గుడిసె కొంపలో, గోపురాగ్రమున' అంతటా కవితా ప్రతిధ్వానమే.

నాటి హైదరాబాద్ రాష్ట్ర పరిపాలకులు ఆంధ్రమాత నోటికి తాళంవేసి పరభాష

దాస్యం చేయించారు. ఆ దాస్యం ఇతర ప్రాంతాలలో కంటే చాలా ఎక్కువ తెలంగాణాలోనే భరించవలసి వచ్చింది. ఆ ఒత్తిడి ఒకందుకు మేలే అయింది. రాజకీయంగా స్వాతంత్ర్యాన్ని సంపాదించుకోవాలనే కాంక్ష భాషా స్వాతంత్ర్యానికి కూడా దారి తీసింది.

తెలంగాణాలో ఎవ్వరు తెలుగు మాట్లాడరని తెలుగు వారంతా ఉరుదూలోనే రాస్తారనీ తెలంగాణాలో కవులే లేరని కొందరు అంటుండేవారు. ఇది సురవరం ప్రతాపరెడ్డికి బాధ కలిగించింది. ఆ బాధకు పర్యవసానమే సురవరం వారు తెలంగాణాలోని నలుమూలలో ఉన్న మూడు వందల యాభై నలుగురు కవుల రచనలను సంపుటీకరించి 1934లో గోల్కొండ కవుల సంచిక ప్రకటించారు.

ఆంధ్ర భారతికి శిరోభూషణాలైన గ్రంథాలు వెలసిన నెలవు తెలంగాణ. ఈ ప్రాంతంలో ఏనాడు ఆంధ్ర కవితా స్రవంతి ఎండిపోలేదు. అది జీవనదివలె తరతరాలుగా ప్రవహిస్తూనే ఉంది. అయితే భయంకర గ్రీష్మాల తాపం అప్పుడప్పుడు తప్పలేదు. పోతన, పాల్కురికి సోమనాథుడు, పిల్లలమర్రి పినవీరభద్రుడు, వేములవాడ భీమకవి, మల్లినాథసూరి, అనంతుడు, విద్యానాథుడు పుట్టి పెరిగిన మాగాణం తెలంగాణ.

ఆంధ్ర సారస్వత పరిషత్తు:

దశమాంధ్ర మహాసభల సందర్భంలో వట్టికోట ఆళ్వారుస్వామి కొంత ముందుగా ప్రయత్నం ప్రారంభించారు. ఆయన ప్రోద్బలంవల్ల బూర్గుల రంగనాథరావు, భాస్కరభట్ల కృష్ణారావుగార్లు 1943 మే 26న రెడ్డి హాస్టల్ గ్రంథాలయ భవనంలో హైదరాబాద్ నాయకులను, జంటనగరాల సాహిత్యాభిమానులను సమావేశపరచినారు. లోకనంది శంకరనారాయణరావుగారు అధ్యక్షత వహించారు.

అన్ని విషయాలు చర్చించి ఆంధ్రభాషా సంస్కృతుల ప్రచారం ప్రధాన లక్ష్యంగా ఒక సాహిత్య సంస్థ స్థాపించవలెనని ఏకగ్రీవంగా నిర్ణయించడం జరిగింది. పేరు పెట్టే విషయంలో తర్జన భర్జనలు జరిగాయి. అదివరకే రాయప్రోలు సుబ్బారావు, మహమ్మద్ ఖాసింఖాన్, కురుగంటి సీతారామయ్య (రాఖాసి) అనే ముగ్గురు కలిసి ముచ్చటగా 'హైదరాబాద్ ఆంధ్ర సాహిత్య పరిషత్తు' అనే జేబు సంస్థను

స్థాపించుకున్నారు. ప్రభుత్వ సహాయంతో తమ గ్రంథాలను, నిజాం నవాబును పొగడే పుస్తకాలను ప్రకటించుకున్నారు. అందువల్ల ఆ సంస్థకు 'నిజాంరాష్ట్ర ఆంధ్ర సారస్వత పరిషత్తు' అని నామకరణం చేయాలని తీర్మానించుకున్నారు. ఒక నియమావళిని, కార్యప్రణాళికను తయారు చేయడానికి 11 మందితో ఒక ఉపసంఘం ఎన్నుకోబడింది. అందులో–

1. మాడపాటి హనుమంతరావు పంతులు.
2. బుక్కపట్టణం రామానుజాచార్యులు.
3. సురవరం ప్రతాపరెడ్డి.
4. లోకనంది శంకరనారాయణరావు.
5. బూర్గుల రామకృష్ణారావు.
6. చిదిరెమఠం వీరభద్రశర్మ.
7. ఆదిరాజు వీరభద్రరావు.
8. నందగిరి వెంకటరావు.
9. కోదాటి నారాయణరావు.
10. గడియారం రామకృష్ణశర్మ.
11. భాస్కరభట్ల కృష్ణారావు.

1943 జూన్ 1వ తేదీన రెడ్డి హాస్టల్ గ్రంథాలయంలో ప్రథమ మహాసభ జరిగింది.

మొదట కార్యవర్గం ఎన్నికైంది. నిజాంరాష్ట్ర ఆంధ్ర సారస్వత పరిషత్తుకు లోకనంది శంకరనారాయణరావుగారు అధ్యక్షులుగా, బిదురు వేంకటశేషయ్య ప్రధాన కార్యదర్శిగా ఎన్నికయ్యారు. మొదట ఈ సంస్థకు గోల్కొండ పత్రిక కార్యాలయం– కార్యస్థానంగా ఉండేది. లోకనందివారు ఉద్యోగరీత్యా నగరం విడవవలసి వచ్చింది. అందువల్ల సురవరం ప్రతాపరెడ్డి అధ్యక్షులైనారు.

ఆంధ్ర సారస్వత పరిషత్తు ద్వితీయ వార్షికోత్సవం వరంగల్లు పట్టణంలో

జరిగినది. ఉదయరాజు రాజేశ్వరరావుగారు అధ్యక్షులు. కాళోజీ నారాయణరావు కార్యదర్శిగా ఆహ్వాన సంఘం ఏర్పడింది. రాజేశ్వరరావుగారి బంగళా ఆవరణంలో సభా శాలను ఏర్పరచి మహాసభలను జరిపినారు. ఆయనొక్కరే వచ్చిన వాళ్ళందరికి భోజనాలు పెట్టినారు. సుమారు 30 మంది కవి పండితులకు వెండి పాత్రలలో ఆతిథ్యమివ్వడం విశేషం. సభను కోత్వాల్ వెంకటరామిరెడ్డిగారు ప్రారంభించారు. సురవరం ప్రతాపరెడ్డిగారు అధ్యక్షత వహించారు. వరంగల్ కోటలో కవి సమ్మేళనం ఏర్పాటు చేయబడింది. కొందరు రజాకార్ రౌడీలు ఆ ఉదయమే వేసిన పందిళ్ళను పీకి వేదికను ధ్వంసం చేశారు. కాని ఎం.ఎస్. రాజలింగంగారు తన యువక సంఘంతో వెళ్ళి, సభాస్థలిని బాగుచేసి ఇక్కడనే కవి సమ్మేళనం జరపాలని పట్టుబట్టారు. సమ్మేళనం అక్కడనే నిరాటంకంగా జయప్రదంగా జరిగింది.

ఆగిపోయిన తృతీయ పరిషత్‌సభలు మహాప్రయత్నంవల్ల నల్లగొండలో జరిగాయి. కంచనపల్లి చిన వెంకటరామారావుగారు సభాధ్యక్షత వహించారు. రాష్ట్రంలో రాజకీయ అనిశ్చితివల్ల సభలు ఏదో విధంగా ముగిశాయి. పెద్ద ఉత్సాహంలేదు. నిజాం రాష్ట్రంలో ఇత్తెహాదుల్ ముసల్మీన్ సంస్థ పరిషత్తును సహించలేకపోయింది దౌర్జన్యాలు కూడా జరిగాయి.

మహబూబ్‌నగర్ జిల్లాలో దేవులపల్లి రామానుజరావుగారి మిత్రుడు ఇల్లిందల రామచంద్రరావుగారు కలెక్టరుగా ఉండేవారు. తన మిత్రుని సహాయంతో పరిషత్తు సభ జరపాలని ఆయన అభిప్రాయం. స్థానిక ముస్లిం మతోన్మాదులు ఎంత ఎదిరించినా దక్షులైన కలెక్టరు ముందు వారి ఆటలు సాగలేదు.

భారత రాజకీయాలలో తీవ్ర పరిణామాలు సంభవించాయి. బ్రిటిషు ప్రభుత్వం 1947 ఆగస్టు 15న భారతదేశానికి స్వాతంత్ర్యం ప్రకటించి వెళ్ళిపోయింది. ఇక్కడ నిజాం తను స్వతంత్రుడని ప్రకటించుకున్నాడు. రజాకార్ ఉద్యమం రాష్ట్రంలో విజృంభించింది. అరాజకం రాజ్యమేలుతున్న సమయంలో పరిషత్తు కార్యదర్శి శ్రీ బిదురు వేంకటశేషయ్యగారు రాష్ట్రం విడిచి సురక్షిత ప్రాంతానికి వెళ్ళిపోయారు. పరిషత్తు కార్యకలాపాలు కొంతకాలం స్తంభించాయి.

తెలంగాణాలో జాతీయ భావాలతో ప్రేరేపితమైన సాహిత్య సాంస్కృతిక సంస్థ

ఆంధ్ర సారస్వత పరిషత్తు. ఆంధ్ర సంస్కృతీ సారస్వతాల సర్వతోముఖ వికాసానికి ఈ సంస్థ కృషి సల్పింది. ప్రజలలోని నిరక్షరాస్యతను నిర్మూలించి, మాతృభాష ద్వారా విద్యా వ్యాప్తి కావించింది. అందుకోసం సభలు, సమావేశాలు జరిగినవి. ప్రాచీన సారస్వతానికి సంబంధించిన విశేషాలను సేకరించి ప్రకటించింది. పారి భాషిక, మాండలిక కోశాలను సిద్ధం చేసింది. ఇతర సంస్థల తోడ్పాడుతో సాహిత్యాభివృద్ధికి కృషిచేసింది. తెలుగులో పరీక్షలు జరిపింది. రచయితలను ప్రోత్సహించింది. అనుబంధ శాఖలను స్థాపించింది. ఉత్తమ గ్రంథాలను ప్రకటించింది. బూర్గుల, సురవరం, మాడపాటి, చెన్నారెడ్డి, పి.వి. మొదలైన నాయకులందరూ పరిషత్తు ప్రాంగణంలో నిలిచినవారే. ఇది నాది అని ఎవరనలేదు. నాది కాదని కూడా ఎవరనలేదు. ఈ సంస్థ పోషణలో దేవుపల్లి రామానుజరావు పాత్ర చాలా ప్రముఖమైనది. మొక్కను పెంచి మానును చేశారు. తరువాత డా॥ సి.నారాయణరెడ్డి దీని బాధ్యత వహించి నూతన భవనాలు కట్టించారు. ఆధునిక కార్యక్రమాలు రూపొందించి కొత్త వెలుగులు విరజిమ్ముతున్నారు. సి.నా.రె. సేవలు పరిషత్తుకు లభించడం అదృష్టమే. ❑

21. పత్రికలు

వెనుకటి హైదరాబాద్ రాష్ట్రంలో వివిధ భాషల వారు జీవించేవారు. వీటిలో తెలుగు, మరాఠీ, ఉర్దూ, కన్నడ ముల్కీ భాషలు. వీరిలో దాదాపు సగంమంది తెలుగువారే. ఉర్దూ అధికార భాషగా ఉండేది. ఇటువంటి పరిస్థితులలో తెలుగువారైన మేధావులు గ్రంథప్రచురణలు, గ్రంథాలయ స్థాపన, సంఘసంస్కరణోద్యమం, పత్రికలు ప్రారంభించడం వంటి కార్యక్రమాలు చేపట్టి ప్రజలలో జాగృతిని కలిగించారు. 1921లో మహబూబ్‌నగరం జిల్లాలోని కోయిలకొండలో శ్రీనివాసశర్మ 'సరోజినీ విలాస్' ముద్రాక్షరశాలను స్థాపించి, తెలుగు భాషలో 'హిత బోధిని' పత్రికను ప్రారంభించారు. రాజకీయాల ప్రవేశం లేకుండా వ్యవసాయం, వైద్యం, పారిశ్రామిక, సంఘసంస్కరణం అనే నాలుగు అంశాలమీద పత్రిక నడిచింది. ఈ పత్రికకు అయిదువందల మంది చందాదారులు ఉండేవారు. శ్రీనివాసశర్మ స్వయంగా ఆయుర్వేద వైద్యుడు, వీరు'లోక నాట్యమండలి' ద్వారా సాంస్కృతిక కార్యక్రమాలలో మునిగిపోవడం వలన రెండు సంవత్సరాలు నడిచి పత్రిక ఆగిపోయింది. 1917లో దివ్యజీవన సమాజానికి చెందిన వెంకటరావు, 'ఆంధ్ర మతము' అనే మాసపత్రికను ప్రారంభించారు. ఇది గౌలీగూడలోని జగదీశ్వర ప్రింటింగు ప్రెస్సులో ప్రచురించబడేది. ఇది పూర్తిగా ఆధ్యాత్మిక జ్ఞానం వివరించే పత్రిక. అయినా అప్పుడప్పుడు రాజకీయ విషయాలను వ్యంగ్యంగా ప్రస్తావించేది.

హైదరాబాద్ నుండి కాక తెలంగాణా జిల్లాలనుండి వెలువడిన తెలుగు పత్రికలు రెండు. ఇవి 1922 సంవత్సరము ఆగస్టు నెలలో నాలుగు రోజుల వ్యత్యాసంతో ప్రారంభమైనవి. 1922 ఆగస్టు 24న షబ్నవీసు వెంకటరామనరసింహారావు సంపాదకత్వంలో నల్లగొండ నుంచి 'నీలగిరి' అనే వారపత్రిక ప్రారంభమైంది. ఇదే మొట్టమొదటి పూర్తిస్థాయి రాజకీయ పత్రిక. 1922 ఆగస్టు 27న వరంగల్ జిల్లా

మానుకోట తాలూకా ఇనుగుర్తి నుండి 'తెనుగు పత్రిక' ప్రచురించబడింది. ఈ పత్రిక సంపాదకులు వొద్దిరాజు సీతారామచంద్రరావు, వొద్దిరాజు రాఘవరంగారావు సోదరులు.

1925 వరకు నీలగిరి పత్రికను అత్యంత సమర్థతతో షబ్నవీసు రామనరసింహా రావు నడిపారు. ఆనాటి ప్రముఖ నాయకులైన మాడపాటి హనుమంతరావు, బూర్గుల రామకృష్ణారావు, పులిజాల రంగారావు తదితరులు వివిధ విషయాలపై ఈ పత్రికలో ఎన్నో కవితలు, వ్యాసాలు రాసేవారు. ఆ రోజులలో గుడిపాటి వెంకటాచలం రాసిన ఒక సంచలనాత్మకమైన కథను పత్రికలు ప్రచురించడానికి నిరాకరించాయి. అప్పుడు షబ్నవీసువారు నీలగిరి పత్రికలో ఆ కథను ప్రచురించి సంచలనం సృష్టించారు. ఆంధ్రోద్యమ నిర్మాతలైన రామనరసింహారావు 1929లో మరణించారు.

తెలంగాణాలో తొలినాటి సాహిత్య వికాసానికి సేవచేసిన ప్రతిభామూర్తులు ఒద్దిరాజు సోదరులు. ఒద్దిరాజు సోదరులు ఇనుగుర్తి నుండి 'తెనుగు పత్రిక' అనే వారపత్రికను ప్రారంభించారు. నీలగిరి పత్రిక కార్యస్థానం నల్లగొండ కావడంవల్ల అది జిల్లా కేంద్రం కావడంవల్ల నీలగిరి పత్రికకు తెనుగు పత్రిక కంటె కొంత సౌలభ్యం ఉండేది. కాని తెనుగు పత్రిక మారుమూలనగల ఒక పల్లెటూరు నుండి వెలువడటం చేత పత్రికా ప్రచురణలో వీరు అనేక ఇబ్బందులు ఎదుర్కొనవలసి వచ్చేది. పల్లెటూరు కావడంతో ముద్రణాయంత్రంపై పనిచేయటానికి మనుషులు దొరికేవారు కారు. స్థానిక యువకులనే తయారు చేసుకోవలసి వచ్చింది. వారు కూడా ఎక్కువగా లభించేవారు కారు. పత్రికలు పంపుటకు పోస్టేజ్ స్టాంపులను కూడా మహబూబాబాద్ పంపించి తెప్పించుకోవలసి వచ్చేది. అదీగాక ఆ రోజులలో రేడియో, టీవీలు ఏవీ ఉండేవికావు. వార్తాపత్రికల ద్వారానే దేశ సమాచారాలు తెలుసుకోవలసి వచ్చేది. అదికూడా సకాలానికి వచ్చేవి కావు. అందువల్ల వార్తాపత్రికలు తీసుకురావడానికి దగ్గర రైల్వేస్టేషను అయిన కె. సముద్రము నుండి ఒక మనిషి ద్వారా తెప్పించుకోవలసి వచ్చేది. పత్రిక నిర్వహణ విషయానికి వస్తే సోదరులిరువురు తప్ప మరొక సంపాదక వర్గం లేదు. అందువల్ల ఏది రాసినా ఈ ఉభయులే రాయవలసి వచ్చేది. పాఠకుల సంఖ్య కూడా స్వల్పంగానే ఉండటంవలన ఈ పత్రికానిర్వహణ అంతా చేతిచమురు భాగోతంగా ఉండేది. ఎన్నో కష్టాలు ఎదుర్కొంటూ ఇనుగుర్తి

వంటి పల్లెటూరునుండి 5 సంవత్సరాలకు పైగా పత్రికను నిర్వహించడం ఎంతో సాహసోపేతమైన కార్యం. పత్రికా నిర్వాహణతోపాటు విజ్ఞాన ప్రచారిణి గ్రంథమాల అనే పేరుతో ఒక గ్రంథమాలను నిర్వహించారు.

1926 నుండి 1946 వరకు అవిచ్ఛిన్నంగా గోల్కండ పత్రిక ద్వారా ప్రజలను మేల్కొలిపిన వైతాళికుడు సురవరం ప్రతాపరెడ్డి. అప్పుడది ద్వైవారపత్రిక. దాని సంపాదకీయాలు అద్భుతంగా ఉండేవి. నిజాం ప్రభుత్వానికి ఆ పత్రిక గుండెల్లో కుంపటి. 1947లో గోల్కొండ దినపత్రికగా మారింది. పోలీసు చర్యవరకు ప్రతాపరెడ్డి సంపాదకులు. అది అడుగుపెట్టని ఊరు లేదు. గోల్కొండ పత్రిక ఆవిర్భవించే వరకు గ్రంథాలయోద్యమాన్ని, ఆంధ్రోద్యమాన్ని నీలగిరి, తెనుగు పత్రికలు తమ భుజస్కంధాల మీద మోశాయి. 1923లో వరంగల్ నుండి ముదిగొండ వీరభద్రశాస్త్రి సంపాదకుడుగా 'శైవప్రచారిణి' అనే మాసపత్రిక ప్రారంభమైంది. ఆ రోజులలో తెనుగు పత్రిక, శైవప్రచారిణి మధ్య ఆరోగ్యకరమైన పోటీ ఉండేది.

1927లో పి.ఎన్.శర్మ సంపాదకత్వంలో వెలువడ్డ 'సుజాత' నాల్గో సంవత్సరం మొదటి సంచికతో ఆగిపోయింది. 1924లో అడుసుమిల్లి దత్తాత్రేయ శర్మ సికిందరాబాద్ నుంచి 'ఆంధ్రకేసరి' అనే వారపత్రిక ఆంధ్రాంగ్ల భాషలలో ప్రచురించారు. ఈ పత్రిక ఏడెనిమిది సంవత్సరాలు నడిచింది. 'దేశబంధు' మాసపత్రిక అత్రాఫ్‌బల్దా జిల్లా వడ్డేపల్లి గ్రామంనుండి బెల్లంకొండ రామానుజాచార్యులు, వారి సోదరులు నరసింహాచార్యుల ఉమ్మడి సంపాదకత్వంలో వెలువడి మూడేళ్ళు నడిచింది.

నల్లగొండ జిల్లా రామన్నపేట తాలూకా వలిగొండ కాపురస్థుడైన బి.ఎన్.శర్మ తెలుగు, సంస్కృతం, ఇంగ్లీషు భాషలలో పండితుడు. నీలగిరి పత్రికా సంపాదకుడు షబ్నవీసు వెంకటరామ నరసింహారావు, మాడపాటి హనుమంతరావు వద్ద పత్రికారంగంలో శిక్షణ పొందారు. ఇక్కడ పత్రిక అచ్చు వేద్దామనుకుంటే నిజాం ప్రభుత్వం సవాలక్ష ప్రశ్నలతో వేధించింది. ఈ బాధపడలేక ఆయన బెజవాడకు వెళ్ళిపోయి 'ఆంధ్రవాణి' అనే పత్రికను అయిదు సంవత్సరాలు నడిపాడు. ఆ పత్రిక బాగా ప్రాచుర్యంలో ఉండేది. ఆ పత్రిక కార్యాలయం ఉన్న వీథిని ఇప్పటికీ 'ఆంధ్రవాణి వీధి' అని పిలుస్తారు. అనేక పత్రికలలో పనిచేసిన శర్మ 1970లో చనిపోయారు.

1929లో బుక్కపట్టణం రామానుజాచార్యులు హైదరాబాద్ నగరంలో

'హైదరాబాద్ బులెటిన్' అనే పత్రికను ప్రారంభించారు. తెలంగాణాలో ప్రప్రథమంగా ఇంగ్లీషు, తెలుగు పత్రికల ప్రచురణను ప్రారంభించిన ఘనత ఆయనదే. 1942లో 'తెలంగాణా' దినపత్రిక ప్రచురణ రామానుజాచార్యుల సంపాదకత్వంలో వెలువడింది. 'చార్మినార్ గాసిప్' శీర్షిక ప్రతిదినం ఉండేది. బడే నవాబుల అంతః పుర విషయాలు, పై అధికారవర్గం కార్యాలయాల రహస్యాలు మరునాడే చార్మినార్ గాసిప్‌లో ప్రత్యక్షమయ్యేవి. అవి చదివి అందరు కనుబొమలు ఎగురవేసేవారు. ఇంగ్లీషు, తెలుగు భాషలలో ఆయన చేయి తిరిగిన రచయిత. అనంతరం ఆయన తన మిత్రుడు, సహాధ్యాయి రాజగోపాల్‌తో కలిసి 1937లో దక్కన్‌క్రానికల్ వారపత్రిక ప్రారంభించారు. దానికి ఆయనే సంపాదకుడు. 1939లో దక్కన్‌క్రానికల్ దినపత్రికగా మారింది. తెలంగాణాలో ప్రప్రథమంగా ఇంగ్లీషు, తెలుగు పత్రికల ప్రచురణను ప్రారంభించిన ఘనత రామానుజాచార్యులదే. 1942లో తెలంగాణా దినపత్రిక ఆయన సంపాదకత్వంలో వెలువడింది. దక్కన్‌క్రానికల్‌తో ఆయన సంబంధాలు తెగిపోయిన తరువాత ఆయన 'గారిసన్' సాయంకాల పత్రికను ప్రచురించారు. 1947లో ఆంగ్ల దినపత్రిక 'డెయిలీ న్యూస్' ప్రచురణను ప్రారంబించారు. ఆ పత్రిక ప్రారంభించిన నెలరోజులకే ఆయన మరణించారు.

1925లో ప్రముఖ సంఘసంస్కరణ వేత్త భాగ్యరెడ్డి 'భాగ్యనగర్' పత్రిక స్థాపించాడు. సంపాదకుడైన భాగ్యరెడ్డి అనారోగ్య కారణాలవల్ల మైసూరు వెళ్ళడంతో పత్రిక ఆగిపోయింది. ఆయన మైసూరు నుండి తిరిగి రాగానే హరిజనోద్ధరణ కృషిలో భాగంగా 'ఆది హిందూ' వారపత్రిక ప్రారంభించారు. ఈ పత్రికలో అనేక రాజకీయాంశాలు చర్చిస్తూ ఆనాటి నిజాం ప్రజా ఉద్యమాలను బలపరచే పత్రికగా దీన్ని నడిపారు. 'విభూతి' పత్రిక వీరభద్రశర్మ సంపాదకత్వంలో వెలువడింది. వరంగల్ నుంచి దేవుపల్లి రామానుజారావు సంపాదకత్వంలో 'శోభ' పత్రిక వెలువడి ప్రముఖ పాత్ర పోషించినప్పటికీ ఆర్థిక కారణాలవల్ల ఒక సంవత్సరంలోనే ఆగిపోయింది. 1938 నుండి 1945 వరకు పత్రికలు వెలువడలేదు. వాక్ స్వాతంత్ర్యంపై నిజాం విధించిన క్రూర నిర్బంధమే దీనికి కారణం. 1945లో చల్లా సుబ్బారావు 'తరణి' అనే తెలుగు మాసపత్రికను వెలువరించారు. ప్రముఖ ఉర్దూ పత్రిక 'పయాం' సంపాదకుడు ఖాజా అబ్దుల్ గఫార్ 'సందేశం' అనే తెలుగు పత్రికను ప్రారంబించారు. ఆ పత్రిక ఆరు నెలలు మాత్రమే నడిచింది.

ఖాన్ బహదూర్ అహమద్ నవాజ్‌జంగ్ అల్లుడైన గులాం మహమ్మద్ కలకత్తా

వాలా 'మీజాన్' అనే పేరుతో మూడు పత్రికలు పెట్టాడు. ఇంగ్లీషు, ఉర్దూ, తెలుగు. మూడింటివీ మూడు విధానాలు. ఇంగ్లీషు ఎడిషన్ నిజాం ప్రభుత్వాన్ని సమర్థించేది. ఉర్దూ ఎడిషన్ లీగ్‌ను, రజాకార్లను సమర్థించేది. తెలుగు మీజాన్ నిజాం వ్యతిరేక శక్తులను సమర్థించేది. తెలుగు మీజాన్‌కు అడవి బాపిరాజు సంపాదకుడు. ఈ పత్రికలో తిరుమల రామచంద్ర, రాంభట్ల కృష్ణమూర్తి, శ్రీనివాస చక్రవర్తి, బొమ్మకంటి సుబ్బారావు, విద్వాన్ విశ్వం సబ్ ఎడిటర్లుగా పనిచేసేవారు. ఎంతోమంది కవులను, రచయితలను మీజాన్ పరిచయం చేసింది. బాపిరాజు నిర్వహించే 'ధూపదీపాలు', 'మిర్చి మసాలా' శీర్షికలు ప్రజలకు వినోదాన్ని, విజ్ఞానాన్ని కలిగించాయి. మూడు సంవత్సరాలు మీజాన్ వచ్చింది. రాష్ట్రంలో రోజు రోజుకు ప్రబలుతున్న రజాకార్ల దౌష్ట్యాలకు విసుగెత్తిపోయి 1947 ఆగస్టు 7వ తేదీన బాపిరాజు సంపాదక బాధ్యతలనుండి విరమించుకున్నారు.

ఈ సందర్భంలో తెలుగు పత్రిక కానప్పటికీ తెలుగు ప్రముఖుడి సంపాదకత్వంలో వెలువడిన 'రయ్యత్' రాష్ట్ర రాజకీయాలలో ప్రముఖ పాత్రవహించింది. దీని సంపాదకుడు మందుముల నరసింగరావు. ఆంధ్ర మహాసభ పూర్వాధ్యక్షుడు. ప్రభుత్వ విధానాలను విమర్శించడంలో జంకకుండా, ధైర్యంగా ప్రజల పక్షాన పోరాడిన గౌరవం 'రయ్యత్' పత్రికకు చెందుతుంది. ఆ పత్రికని ఆపివేయడానికి రజాకార్లు తీవ్రంగా కృషి చేశారు. పత్రిక ఆగిపోయింది. నిజాం నవాబుల నిరంకుశ పాలనలో పోరాడటానికి జరిగిన కృషిలో పత్రికల పాత్ర అమోఘమైనది. ఈ పత్రికలు ఆనాడు తెలంగాణాలోని సాంస్కృతిక పునరుజ్జీవనంలో ప్రధానపాత్ర పోషించాయి. ఆనాటి హైదరాబాద్ రాష్ట్రంలో తెలుగు పత్రికల చరిత్ర ఉత్సాహకరంగా ఉండలేదు. ఒక్క గోల్కొండ పత్రిక తప్ప, ఏ పత్రికైనా ఎక్కువ కాలం నడవలేదు. పరిస్థితులు పత్రికా నిర్వహణకు అనుకూలంగా లేవు.

షోయెబుల్లాఖాన్ అనే యువకుడు 'ఇమ్రోజ్' పత్రికను స్థాపించాడు. ఈ పత్రిక రజాకారు దౌష్ట్యాలను తీవ్రంగా విమర్శించేది. ఖాసిం రజ్వీ సూచనపై రజాకారు దుర్మార్గులు షోయెబ్‌ను చంపి చేతులు నరకి వేశారు. షోయెబ్ హత్య దేశంలోనే తీవ్ర సంచలనాన్ని సృష్టించింది. ❑

22. తెలంగాణ జలవనరులు, పరిశ్రమలు

భాషా రాష్ట్రాల నిర్మాణానికి తెలంగాణా ప్రధాన కారణమైంది.. నీరు నుంచి చెట్టు పెరుగుతుంది. కానీ ఆ నీరే ఇక్కడ చెట్టును కూల్చివేసింది. తిరిగి శక్తి నందుకోవడానికి వీలుగా ఎన్నో పోరాటాలు చేయవలసి వచ్చింది.

ఆంధ్రజాతి చరిత్రలో ప్రధాన పాత్ర నిర్వహించిన రాష్ట్రం తెలంగాణా. శాతవాహనుల కాలంలోని ఆంధ్ర రాజ్యంలో ప్రధాన భాగంగా ఉండి కాకతీయుల కాలంలో ఆంధ్ర జాతీయ వికాసానికి కేంద్రమయింది. తరువాత ఆసఫ్‌జాహీ వంశపు పాలన క్రింద ఉండి అనేక కష్ట నష్టాలకు గురైంది. భారతదేశ స్వాతంత్ర్య పోరాటంలో తెలంగాణా ప్రముఖ పాత్రను నిర్వహించింది. కానీ ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో అనుబంధ స్థానానికి దిగజారింది. దక్కను పీఠభూమిలో భాగమైన తెలంగాణ సముద్ర మట్టానికి నుండి సుమారు1,200 అడుగుల యెత్తున ఉంటుంది. మొత్తం దక్కను పీఠభూమి మాదిరిగానే వాయువ్యం నుంచి ఆగ్నేయ దిశకు వంగి ఉంటుంది. అందుచేత నీటిపారుదల, నదుల ప్రవాహం కూడా ఇట్లే ఉంటుంది.

భౌగోళిక స్వరూపం

పర్వతములు :

ఎత్తైన పర్వతమయంగా కనిపిస్తుంది తెలంగాణా. పడమటి కనుమలలో భాగమైన సహ్యాద్రి వరుస తూర్పుగా వ్యాపించి ఆదిలాబాద్ జిల్లాలో అంతమవుతుంది. దీన్ని నిర్మలగుట్టలంటారు. ఇవి ఇచ్చట మూడు వరుసలుగా పడమరా, తూర్పునా సుమారు 80 మైళ్ళు వ్యాపించి వున్నవి. వెడల్పు 35-40 మైళ్ళుంటుంది. దీన్నుంచి రెండు చిన్న శాఖలు చీలి ఆగ్నేయ దిశగా పోయినవి. ఇందులో ఒకటి కరీంనగరం జిల్లాలోనికి పోయిన రాఖీ గుట్టలు, రెండవది వరంగల్ జిల్లాలోకి వ్యాపించి వున్న కందికల్ గుట్టలవరుస. పడమటి కనుమలలో ఇంకొక భాగమైన బాలాఘాటు పర్వత

వరుస నుండి వేరుపడి ఆగ్నేయదిశగా వ్యాపించిన శాఖ, హైదరాబాద్, మహబూబ్‌నగర్ వరకు వచ్చింది. వీటిలో భాగమే నల్లగొండ జిల్లాలోని రాచకొండ గుట్టలు.

తూర్పు కనుమలకు సంబంధించిన గుట్టల వరుస గోదావరిలోయకిరువైపులా వ్యాపించి ఉన్నది. గోదావరి వీటిని తొలచి సాగుతూ కొన్ని చోట్ల 200-300 గజాల మార్గం గుండానే ప్రవహిస్తున్నది. మహబూబ్‌నగర్ జిల్లాలోగల నల్లమల గుట్టల వరుస (అమ్రాబాద్ గుట్టలని పేరు) గూడ తూర్పు కనుమలలోని భాగమే. ఇవి తెలంగాణాలో ప్రారంభమై రాయలసీమలోనికి వ్యాపించి ఉన్నవి. కృష్ణానది ఇచ్చట వాటి గుండా ప్రవహిస్తుంది.

ఉత్తర బాలఘాట్ శ్రేణి వికారాబాద్ ప్రాంతంలో అనంతగిరి కొండలుగా విస్తరిస్తుంది. దక్షిణ బాలఘాట్ శ్రేణి లేక్ గోల్కొండ వాటర్‌షెడ్, మహారాష్ట్ర బీడ్ జిల్లా లోని అష్టినుండి, నైరుతి, ఆగ్నేయ దిశలుగా నల్లగొండకు చేరుతుంది. ఈ కొండల బారు హైదరాబాద్, మహబూబ్‌నగర్, నల్లగొండ జిల్లాల గుండా పోతుంది. దేవరకొండ, భువనగిరి వంటి ఇతర కొండలు నల్లగొండ జిల్లాలో ఉన్నవి.

అదిలాబాద్, వరంగల్లు జిల్లాల్లో విస్తారమైన అరణ్యాలు వున్నవి. కరీంనగర్, మహబూబ్‌నగర్, నిజామాబాద్, ఖమ్మం జిల్లాల్లో కూడ అడవులు ఉన్నవి.

ఈ ప్రధాన గుట్టల వరుసలు గాక, తెలంగాణా అంతటా చిన్న గుట్టలు వ్యాపించి ఉన్నవి. వీటినుంచి అనేక వాగులు, ఒయ్యలు బయలుదేరి ప్రవహిస్తూ తెలంగాణాలోని చెరువులకు నీటిని అందిస్తున్నాయి.

నదులు

యావదాంధ్ర దేశానికి జీవనదులైన కృష్ణా, గోదావరీ మహానదులు తెలంగాణాలో చాలాభాగం ప్రవహిస్తూ, ఇచ్చట కలిసే ఉపనదులతో మహానదుల స్వరూపాన్ని వహిస్తూన్నవి. ఈ రెండు మహానదులు తెలంగాణాను రెండు నదీ ప్రాంతాలుగా విభజించి ఇచ్చటి ప్రజల జీవితంపై ప్రభావం కలిగించాయి. ఈ రెండు మహానదులలోయల గుండానే ప్రాచీనాంధ్రులు మొదట తెలంగాణ, తర్వాత ఇతర ప్రాంతాలకు వ్యాపించి అబివృద్ధి అయి, ఇప్పటి ఆంధ్రజాతిగా పరిణామం చెందారు.

గోదావరి :

ఇది పశ్చిమ కనుమల్లో మహారాష్ట్రలో పుట్టి తెలంగాణా సరిహద్దుల్లో అనేక ముఖ్య నదులు కలిసేదాకా చిన్నదిగానే ఉండిపోయింది. దీంతో కలిసిన మొదటి ముఖ్యనది మంజీర. ఇది మరట్వాడాలోని బీడ్ జిల్లాలో బాలాఘాట్ పర్వతాలలో పుట్టి, ఆగ్నేయంగా ఉస్మానాబాద్ మెదక్ సంగారెడ్డి వద్ద ఉత్తరంగా తిరిగి నిజామాబాద్ జిల్లాలో ప్రవహించి గోదావరిలో కలుస్తుంది. దీని పొడుగు 400 మైళ్ళు. మధ్యప్రదేశ్‌లోని సాత్పూరా కొండలలో జన్మించిన పెన్‌గంగ, వమ్‌గంగ నదుల సంగమం ద్వారా ఏర్పడిన ప్రాణహిత, ఆదిలాబాద్ జిల్లా తూర్పు సరిహద్దునే ప్రవహించి, ఆ జిల్లాలోనే చెన్నూరులో కాళేశ్వరం అనే పుణ్యక్షేత్రం వద్ద గోదావరిలో కలుస్తుంది.

ఇంత వరకు తెలంగాణాలో చాలాభాగం పడమర నుంచి తూర్పుకు ప్రవహించిన గోదావరి ఇచ్చటనుంచి ఆగ్నేయంగా పోతుంది. తర్వాత కరీంనగర్ జిల్లాలో పుట్టి 40 మైళ్ళుతూర్పుగా ప్రవహించిన మానేరు నది గోదావరిలో కలుస్తుంది. అటు ఎగువ వైపు దక్షిణ బస్తరు నుండి ఇంద్రావతి, శబరి నదులు కలుస్తున్నవి. 80 మైళ్ళ పొడవుగల మానేరు కరీంనగర్ జిల్లాలోని సిరిసిల్ల కొండలలో జన్మించింది. ఇది మహాదేవపూర్ తాలుకాలో గోదావరిలో కలుస్తుంది.

కృష్ణానది:

800 మైళ్ళ పొడుగుగల కృష్ణానది పశ్చిమ కనుమలలోని మహాబలేశ్వర్ సమీపంలో జన్మిస్తుంది. దీనిలో సతారావద్ద వేణి కలుస్తుంది. శ్రీశైలం వద్ద దీనికి పాతాళగంగ అని పేరు. ఆ తరువాత యీ నది నల్లమల కొండలలోయ గుండా ప్రవహించి నాగార్జున కొండ, యేలేశ్వరాలను, నాగార్జునసాగర్ ఆనకట్ట స్థలం సమీపాన గల నందికొండ గ్రామాన్ని దాటి, యిక తూర్పుకు ప్రవహించి విజయవాడ దాటి బంగాళాఖాతంలో కలుస్తుంది.

తుంగ-భద్ర జంట నదుల సంగమమైన తుంగభద్ర ఆలంపూర్ సమీపాన గల సంగమేశ్వర్ వద్ద కృష్ణానదిలో కలుస్తుంది. 95 మైళ్ళ పొడవుగల డిండినది మహబూబ్‌నగర్ జిల్లాలోని షాహబాద్ కొండలలో పుట్టి, దక్షిణంగా అమరాబాద్,

నందికొండ కొండల గుండా ప్రవహించి యేలేశ్వరానికి దక్షిణాన కృష్ణాలో కలుస్తుంది. దీనిపైగల చిన్న ప్రాజెక్టు నల్లగొండ జిల్లాలోని 14 గ్రామాలకు సాగు నీరునందిస్తుంది.

157 మైళ్ళ పొడవుగల మూసీనది అనంతగిరి కొండలలో పుట్టి, హైదరాబాద్, నల్లగొండ జిల్లాల కొండల గుండా ప్రవహిస్తుంది. ఇది హైదరాబాద్ నగరం సమీపంలో ఉస్మాన్‌సాగర్ చెరువులో ప్రవేశిస్తుంది. ఇక్కడ వరదలని అదుపుచేసే నిమిత్తం, మంచినీటి సరఫరా నిమిత్తం ఒక ఆనకట్ట నిర్మించారు. మూసీ చిత్తూరు సమీపంలో ఆలేరును కలుపుకుని నల్లగొండ జిల్లాలోని వజీరాబాద్ సమీపంలో కృష్ణానదిలో కలుస్తుంది. తెలంగాణా రాజధాని అయిన హైదరాబాద్ నగరం మూసీనది ఒడ్డున ఉంది.

హైదరాబాద్ నగరాన్ని గోలకొండ నాల్గవ కుతుబ్‌షా మహమ్మద్‌ఖులీ 1589 లో నిర్మించాడు. ఒకనాడు ఆయన మూసీనది దక్షిణ తీరంలో వేటాడుతూ ఎదురుగా పచ్చపచ్చగా కన్పిస్తున్న ప్రదేశాన్ని చూసి ముగ్ధుడైపోయి అక్కడ కొత్త రాజధానిని నిర్మించ సంకల్పించాడు. ఈ ప్రదేశం గోలకొండ కోటకు ఆరుమైళ్ళ దూరంలో ఉంది. ఈ కొత్త నగరానికి అతడు మొదట తన ప్రియురాలైన భాగమతి పేరిట భాగ్యనగరమని నామకరణం చేశాడు. తరువాత తన భార్య అయిన హైదర్‌మహల్ పేరిట హైదరాబాద్ అని మార్చాడు. ఇప్పుడు యీ నగరం తెలంగాణా రాష్ట్ర రాజధాని.

1806 లో మూడవ నిజాం సికిందర్‌జా పేరుమీద సికింద్రాబాద్ నిర్మాణం జరిగింది. బ్రిటీష్ వారు ఇక్కడ లష్కర్, అనగా సైనిక శిబిరాలు ఏర్పాటు చేసేవారు. సికిందరాబాద్, తిరుమలగిరి, బొల్లారం ప్రాంతాలన్ని బ్రిటీష్ పరిపాలన కిందనే ఉండేవి. ఈ రెండు నగరాలను కలిపి ఒక కార్పొరేషన్ చేసినప్పటినుండి జంటనగరాలనబడుతున్నాయి. హైదరాబాద్ నగరంలో మూసీ ఉంది. మరీ పంతోషం తుంగభద్ర, కృష్ణ జీవనదులైతే, మూసీ నిర్జీవనది. మూసీలో చెత్త చెదారం తప్ప మరేముంది. అదే ఏ ప్రాశ్చాత్య దేశాలలోనో ఉంటే పాత, కొత్త నగరాల మధ్యగా నిండుగా ప్రవహిస్తూ పడవల్లో జనం వాహ్యాళికి పోతూ, యెంత ఆనందంగా ఉండేది మూసీనది.

చెరువులు, ప్రాజెక్టులు

తెలంగాణాలో భూమి ఇసుకతో కూడుకొని, నీరు త్వరగా ఇంకిపోయేదిగా ఉండటంచేత, నీటి వనరులు ఏర్పరచి, నీటి ఆధారంగా వ్యవసాయం చేసే పద్ధతి ఇచ్చట అనాది నుంచి ఏర్పడి ఉన్నది.

నల్లగొండ జిల్లా ఫణిగిరి గుట్టల దగ్గర పురావస్తుశాఖ వారు పరిశీలించిన 03 శిథిల పట్టణాలు, వాటి చుట్టు ఉన్న అనేక నీటి రిజర్వాయర్లనుబట్టి నీటి పారుదల విషయంలో తెలంగాణాలో ప్రాచీన ఇంజనీర్ల అద్భుత ప్రతిభ వెల్లడవుతుంది. కాకతీయుల కాలంలో నిర్మించిన పాఖాల, రామప్ప, లఖ్నవరం, ఘనపురం చెరువులు సుప్రసిద్ధమైనవి. 13 వ శతాబ్దపు చివరిలో ప్రారంభమైన ముస్లింరాజుల పరిపాలనలోనూ కొన్ని చెరువులు నిర్మితమైనాయి. 16 వ శతాబ్దంలో నిర్మించిన హుసేన్‌సాగర్, 1799 లో నిర్మించిన మీరాలం చెరువులను పేర్కొనవచ్చు.

20 వ శతాబ్దపు ప్రారంభంలో వచ్చిన భీకర క్షామం మరల రాకుండా చేయాలని 1902 లో హైదరాబాద్ వచ్చిన భారత ఇరిగేషన్ కమీషన్ కొన్ని ముఖ్య ప్రాజెక్టుల నిర్మాణం సూచించింది. 1908 లో వచ్చిన భయంకర మూసీ వరదల తర్వాత సర్ మోక్షగుండం విశ్వేశ్వరయ్య సలహాపై కొన్ని ప్రాజెక్టులు కట్టాలని ప్రభుత్వం నిర్ణయించింది. వీటన్నింటికీ ప్లాను వేయుటలో, నిర్మించుటలో ప్రఖ్యాత హైదరాబాద్ ఇంజనీరు నవాబుఅలీ నవాజ్‌జంగ్ చాలా ప్రముఖపాత్ర నిర్వహించారు.

ఈ స్కీము ప్రకారం నిర్మించిన నిజాంసాగర్, ఉస్మాన్‌సాగర్, హిమాయత్‌సాగర్, పోచారం, వైరా, పాలేరు, డిండి, చంద్రసాగర్,మానేరు, కోయల్‌సాగర్ ప్రాజెక్టులు ముఖ్యమైనవి. పోలవరం ప్రాజెక్టు నిర్మాణంపై అప్పటి హైదరాబాద్ ప్రభుత్వమే కొన్ని అభ్యంతరాలను లేవదీసింది. నాగార్జునసాగర్ పథకాలన్నీ అలీనవాజ్‌జంగ్ రూపొందించినవే. ఆనాటి గోదావరి లోయ పథకాన్ని ఇప్పుడు శ్రీరాంసాగర్ ప్రాజెక్టు అంటున్నారు.

పారిశ్రామిక రంగం

తెలంగాణాలో ఖనిజసంపద ఎక్కువ. కనుక పరిశ్రమల అభివృద్ధికి ఇక్కడ

ఎక్కువ అవకాశాలున్నాయి. పరిశ్రమాభివృద్ధికి మూలమైన బొగ్గు, జల విద్యుచ్ఛక్తి ఉత్పత్తి అవకాశాలు అపారంగా ఉన్నవి. ఇచ్చటగల బొగ్గు సహాయంతో ఉక్కు పరిశ్రమ అభివృద్ధి చేయుటకు అవసరమైన ముడి ఇనుము తెలంగాణాలో లభిస్తుంది. న్యూస్ ప్రింటు (కాగితం) కు అవసరమైన ముడివస్తువులు తెలంగాణా అడవుల్లో దొరుకుతవి. పరిశ్రమల అభివృద్ధికి ఎన్నో అవకాశాలున్నవి.

పరిశ్రమల అభివృద్ధికి ఆనాటి నిజాం ప్రభుత్వం 1929 లోనే ఇండస్ట్రియల్ ఫండ్ ఒకకోటి రూపాయల ధనంతో ప్రారంభించింది. 1955 లో ఇది 4 కోట్ల 98 లక్షలకు పెరిగింది. ఇది ఈ 11 ముఖ్య పరిశ్రమలను స్థాపించడానికి తోడ్పడింది:-

1. ఆజంజాహీ టెక్స్‌టయిలు మిల్లు (వరంగల్లు)
2. ఉస్మాన్‌షాహీ టెక్స్‌టయిలు మిల్లు (నాందేడ్/మహారాష్ట్ర)
3. ప్రాగాటూల్స్ కార్పొరేషన్ (హైదరాబాద్)
4. సింగరేణి కాలరీస్ (కొత్తగూడెం, ఇల్లెందు, బెల్లంపల్లి)
5. నిజాం షుగర్ ఫ్యాక్టరీ (బోధన్)
6. హైదరాబాద్ గోల్డ్‌మైన్స్ (హట్టి- కర్నాటక)
7. ప్రభుత్వ పవర్ ఆల్కహాల్ ఫ్యాక్టరీ (బోధన్)
8. అస్బెస్టాస్ సిమెంటు ప్రొడక్షన్ (హైదరాబాద్)
9. సిర్‌పూర్ గ్లాస్‌వర్క్స్ (హైదరాబాద్)
10. తాజ్‌గ్లాస్ వర్క్స్ (హైదరాబాద్)
11. సిర్‌సిల్క్ కంపెనీ (సిర్‌పూర్)

టెక్స్‌టయిలు పరిశ్రమలు

తెలంగాణాలోని ఆదిలాబాద్ జిల్లా, ముఖ్యంగా మరట్వాడాలో పండే పత్తిలో కొంత భాగాన్ని ఉపయోగించుకునేందుకు తెలంగాణాలో మూడు టెక్స్‌టయిల్ మిల్లులు (బట్టల మిల్లులు) నిర్మించబడ్డాయి.

1. హైదరాబాద్ స్పిన్నింగ్ అండ్ వీవింగ్‌మిల్లు, హైదరాబాద్

ఇది హైదరాబాద్ స్టేటులో ప్రారంభమైన మొదటి బట్టల మిల్లు. 1874 వ

సం॥లో దీన్ని ప్రారంభించారు. దీని మూలధనం రూ. 8,16,666. 1952 సం.లో 1659 మంది కార్మికులు పని చేస్తుండేవారు.

2. ఆజంజాహీమిల్స్, వరంగల్

ఇది 1931లో 18 లక్షల రూపాయల పెట్టుబడితో ప్రారంభించబడింది. విపరీత లాభాలు రావడం వలన దీని పెట్టుబడిని 1946 లో ఒకసారి, 1950 లో రెండవసారి రెట్టింపునకు పెంచారు. దీనిలో సుమారు 3400 మంది కార్మికులు పని చేసేవారు.

3. డి.బి.ఆర్.మిల్స్, హైదరాబాద్

ఇది 1929 లో స్థాపించబడింది. దీనికి చెల్లించిన మూలధనం రూ. 20,98,600. దీనిలో 1500 మంది కార్మికులు పనిచేసేవారు.

పంచదార పరిశ్రమ

నిజామాబాద్ జిల్లాలో నిర్మించిన నిజాంషుగర్ ఫ్యాక్టరీ ఆసియాలోనే పెద్దది. ఇది 1937 నుంచి పనిచేస్తూన్నది. దీని పెట్టుబడిలో 100 కి 72 వంతులు ఇండస్ట్రియల్ ట్రస్టు ద్వారా ప్రభుత్వానిదే.

కాగితపు పరిశ్రమ : భారతదేశంలోని ముఖ్య పేపర్ మిల్లులలో ఒకటైన సిర్‌పుర్ పేపర్ మిల్లును 1939 లో స్థాపించారు. కాగితం తయారు చేసేందుకు అవసరమైన వస్తువులున్న ఆదిలాబాద్ జిల్లా ఆడవులు మధ్య ఇది ఉన్నది. 1953 లో ఇది సంవత్సరానికి ఆరువేల టన్నుల కాగితాన్ని ఉత్పత్తి చేసింది.

రైల్వే వర్క్‌షాపు : వెనకట ఎన్.ఎస్.ఆర్ (నిజాంస్టేటు రైల్వే) ఉన్నప్పుడు సికింద్రాబాద్‌లో రైల్వేవర్క్ షాపుని నిర్మించారు. ఇది సెంట్రల్ రైల్వేలో కలిసిన తరువాత కొంతస్థాయి తగ్గినా సికిందరాబాద్ డివిజన్‌కు ఉపయోగపడే వర్క్‌షాపుగా పని చేస్తున్నది. దీనిలో సుమారు 2500 మంది కార్మికులు పని చేస్తున్నారు.

ఆర్.టి.సి.వర్క్ షాపులు : హైదరాబాద్ రోడ్డు రవాణా సంస్థ (ఆర్.టి.సి) కి సంబంధించిన బస్సులకు అవసరమైన రిపేర్లు, నిర్మాణాలు సాగించుటకై

హైదరాబాద్‌లోని ముషీరాబాద్‌లో ఒక పెద్ద వర్క్‌షాపు ఉన్నది. దీనితో పాటు తాత్కాలిక రిపేర్స్ చేసేందుకు హైదరాబాద్‌లోని సిటిడిపో, ఖాజీపేట, కరీంనగరు, కొత్తగూడెం, ఖమ్మంమెట్టు, నిజామాబాదు మొదలైన చోట్ల చిన్న వర్కు షాపులున్నాయి.

ప్రాగాటూల్స్ కార్పొరేషన్ : ఇది చిన్నదే అయినా భారతదేశంలోని మిషన్‌టూల్స్ (యంత్ర పరికరాలు) తయారు చేసే ముఖ్య ఫ్యాక్టరీలలో ఒకటి.

హైదరాబాద్ ఆల్విన్ మెటల్‌వర్క్స్ : 1924 లో రూ.61 లక్షల పెట్టుబడితో ప్రారంభించబడింది. 1943 లో దీనిలో 1100 మంది కార్మికులు పని చేసేవారు. ఇనుపపెట్టెలు, బ్యాంకింగ్‌కు అవసరమైన స్ట్రాంగ్ రూమ్ ఎక్విప్‌మెంటును ఇది తయారు చేసేది. రిఫ్రిజిరేటర్లను కూడా తయారు చేసింది.

రసాయనిక మందుల పరిశ్రమ:

హైదరాబాద్ కెమికల్ అండ్ ఫర్టిలైజర్స్ బెల్లంపల్లి, హైదరాబాద్ కెమికల్ అండ్ ఫార్మస్యూటికల్ వర్క్స్ అజమాబాద్ (కరీంనగరు), బయోకెమికల్ అండ్ సింథటిక్ ప్రోడక్ట్స్, సనత్‌నగర్, హైదరాబాద్, ఆల్కహాల్ పరిశ్రమ, బోధన్, లామినేటెడ్ సీట్ల పరిశ్రమ, హైదరాబాద్.... మరికొన్ని ఉన్నాయి.

సిగరెట్ల పరిశ్రమ ప్రత్యేకమైనది. 4 సిగరేటు ఫ్యాక్టరీలు ఉన్నాయి. వీటిలో హైదరాబాద్ నగరంలో ఉన్న వజీర్ సుల్తాన్ టోబాకో కంపెనీ అన్నిటికంటె పెద్దది. ఎక్కువ వ్యాప్తిలో ఉన్న చార్మినార్ సిగరేట్లు తయారుచేసిన కంపెనీ ఇదే.

1940 లో సనత్‌నగర్‌లో తాజ్‌గ్లాసు ఫ్యాక్టరీ ఏర్పడింది. ఇది చిమ్నీలు, సీసాలు, గ్లాసులు తయారు చేస్తుంది. కోహినూర్ గ్లాసు ఫ్యాక్టరీ మరొకటి. హైదరాబాద్ సంస్థానంలోగల 22 అగ్గిపుల్లల ఫ్యాక్టరీలలో అత్యధికభాగం తెలంగాణాలోనే ఉన్నాయి.

కుటీర పరిశ్రమలు

హైదరాబాద్ సంస్థానం చేతి పరిశ్రమలకు, కుటీర పరిశ్రమలకు 19 వ శతాబ్ధం వరకు ఖ్యాతిగాంచినది. తెలంగాణాలోని ఆదిలాబాద్ జిల్లాలోని నిర్మల్ తాలూకాలో తయారయ్యే 'వూట్జు' అనే కత్తులు పరిషియా దేశంలో ప్రశంసలు పొందాయి. వరంగల్‌లో తయారైన తివాచీలు యూరప్‌లోని పలుదేశాలలో ప్రశంసలు

పొందాయి. 1851 సం.లో లండన్‌లో జరిగిన వస్తు ప్రదర్శనలో వరంగల్లు తివాచీలు అన్నింటికంటె గొప్పవిగా ఖ్యాతిగాంచాయి. కరీంనగరు జిల్లాలోని వెండి చెక్కడం పని, నిర్మల్ ఆటబొమ్మలు, సంగారెడ్డి,ఆర్మూరు లలో తయారైన సిల్క్ చీరలు, నారాయణపేట చెక్కు చీరలు, మెట్టుపల్లి ఖాదీ వస్త్రాలు భారతదేశంలోనే గాక ప్రపంచ ఖ్యాతిగాంచాయి.

తెలంగాణాలో ప్రస్తుతం ఉన్న గ్రామీణ పరిశ్రమలలో చేనేత పరిశ్రమ, ఉన్ని పరిశ్రమ , తోళ్ళ పరిశ్రమ, సిల్క్ పరిశ్రమ, గుండీల పరిశ్రమ, బీడీ పరిశ్రమ, లోహ పరిశ్రమ, పింగాణి పరిశ్రమ, కాగితపు పరిశ్రమలు ముఖ్యమైనవి.

గ్రామీణ ప్రాంతాలలో వ్యవసాయం తరువాత చేనేత పరిశ్రమే ప్రధాన కుటీర పరిశ్రమ. మొత్తం తెలంగాణాలోని వస్త్ర అవసరాలలో 30 శాతం ఈ పరిశ్రమ ద్వారా తీరుతుంది. తెలంగాణాలో ఏదో చిన్న పల్లె తప్ప ముఖ్యంగా కరీంనగరు, వరంగల్లు, నల్లగొండ, మెదక్, మహబూబ్‌నగరు జిల్లాలలో ఒక్క గ్రామం కూడ చేనేత మగ్గం లేకుంగా లేదని చెప్పవచ్చు.

తెలంగాణాలోని చెప్పదగిన పరిశ్రమలలో బీడీల పరిశ్రమ ఒకటి. వీటికి కావలసిన తునికి ఆకు తెలంగాణా అడవుల్లో విస్తారంగా లభిస్తుంది. హైదరాబాద్ నగరం, మెదక్, నిజామాబాద్, ఆర్మూరు, బాన్సువాడ, డిచ్‌పల్లి, మోర్తాడ్, దోమకొండ, అమర్‌చింత, కరీంనగరులలో ప్రధాన బీడీ ఫ్యాక్టరీలు ఉన్నాయి.

కొండజాతులు

తెలంగాణాలో ఉన్న కొండజాతి ప్రజల్లో గోండులు, కోయలు. చెంచులు, లంబాడీలు ముఖ్యమైనవారు.

శతాబ్దాల నుంచి కవితామృత వర్షంతో తడిసి, పచ్చబారి, చిగిర్చి, పూచి, ఫలించిన నేల తెలంగాణము. పాల్కురికి, పిల్లలమఱ్ఱి పిన వీరభద్రుడు, మల్లినాథ సూరి, అనంతుడు, విద్యానాథుడు పుట్టి పెరిగిన మాగాణము తెలంగాణము. ఆంధ్ర భారతికి శిరోభూషణాలైన గ్రంథాలు వెలసిన నెలవు. ఈ ప్రాంతంలో ఏనాడూ ఆంధ్ర కవితా స్రవంతి ఎండిపోలేదు. అది జీవనది. తరతరాలుగా ప్రవహిస్తూనే ఉంది.

అయితే భయంకర గ్రీష్మతాపం అప్పుడప్పుడు తప్పలేదు.

అన్ని వనరులు కలిగి సుసంపన్నమైన రాష్ట్రంగా ఉండవలసిన తెలంగాణ, దురదృష్టవశాత్తు ఈ నేలమీద అభిమానం లేనివారి చేతుల్లో పడి రక్తమాంసాలు కోల్పోయిన అస్థిపంజరంలా తయారైంది. పలువురు తొక్కిన దారిలో చెట్లు మొలవవు. బీడు బారిన తెలంగాణాను అభివృద్ధి పథంలో తీసుకుపోవడానికి ప్రస్తుత ప్రభుత్వం చేస్తున్న కృషి ఫలిస్తే త్వరలోనే యీ రాష్ట్రం దేశానికే తలమానికంగా నిలవగలుగుతుంది. ❑

23. ముల్కీ కథనం

దక్కను చరిత్రలో ముల్కీ గొడవలకు చాలా ప్రాముఖ్యముంది. ఇవి చిలికి చిలికి పెనుతుఫానులై దక్కనులోని రాజ్యాలను కూల్చివేసినవి.

బహమనీ సుల్తానుల పరిపాలనలో పర్యానుంచి వచ్చి స్థిరపడినవారి సంఖ్య ఎక్కువ. అలా వచ్చిన ఆపాఖీలు, అబాషీలు, షియాల యెడల సుల్తాన్లు ఆదరణ చూపి గొప్ప గొప్ప ఉద్యోగాలిచ్చారు. వీరు దక్కనుకు వచ్చి సూఫీమతాన్ని అవలంబించారు. ఇస్లాంలోని సాత్విక మత ధోరణికి వీరు ప్రతినిధులు. ఢిల్లీ సుల్తానుల ప్రతినిధులుగా దక్కనులో స్థిరపడినవారు సున్నీలు. వీరికి మతద్వేషం హెచ్చు.

సున్నీ షియాల ఘర్షణలు నిరంతరం జరుగుతూ వచ్చాయి. బహమనీల రాజధాని బీదర్‌నగరంలో, దక్కనీయులు కుట్రపన్ని 78 సంవత్సరాల వయోవృద్ధుడైన ప్రధాని ఖాజీ మహమ్మద్ గవాన్‌ను హత్య చేయించారు. గవాన్ హత్యతో బహమనీ రాజ్యం శిథిలమైపోయింది.

పదునారవ శతాబ్ది తుదినుంచి పదునేడవ శతాబ్ది తుదివరకు గోల్కొండను రాజధానిగా విశాలాంధ్రను పాలించిన వారు కుతుబ్‌షాహీలు. ఈ వంశ స్థాపకుడైన కులీ కుతుబ్‌షా ఇరాన్‌లోని హమ్దాన్ రాజవంశానికి చెందినవాడు. మీర్ జుమ్లా స్థానంలో 1674లో మాదన్నను ప్రధానమంత్రిగా నియమించాడు అబ్దుల్ హసన్ తానీషా. ఆయనకు సూర్యప్రకాశరావు అనే బిరుదునిచ్చారు. అల్లాఉద్దీన్ ఖిల్జీ దండయాత్రల అనంతరం 300 సంవత్సరాలలో ఒక హిందువును ప్రధానిగా నియమించడం ఇదే మొదటి సారి. ఆయన సోదరుడు అక్కన్నను రెవిన్యూ మంత్రిగా నియమించారు. ఈ ముల్కీ నాన్‌ముల్కీల గొడవలతోనే మాదన్నను హత్య చేశారు. మాదన్న హత్యతో కుతుబ్‌షాహీ రాజ్యం పునాదులు కదిలాయి.

మొదటి నిజాం దక్కనుకొచ్చినప్పుడు తనకు విశ్వాసపాత్రులైన ముస్లింలను, ఉర్దూభాష మాట్లాడే కాయస్థులను తన వెంట తెచ్చుకున్నాడు. వీరికి పెద్ద పెద్ద పదవులిచ్చాడు. అలా వచ్చిన వారిలో అబుల్‌హసన్ షేర్‌ఖాన్ పాయెగా నవాబైనాడు. నిజాంరాష్ట్రంలలో సర్ఫెఖాస్ తరువాత పాయెగా వారిదే పెద్దజాగీరు. మీర్ ఆలమ్, చందూలాల్, ఇమాదుల్ ముల్క్ మొదలైన ముఖ్యులందరూ ఉత్తరాది వారే.

మొదటి భారత స్వాతంత్ర్య పోరాటానికి ముందే నిజాం రాష్ట్రంలోని చాలా ప్రాంతాలు కర్నాటక, ఉత్తర సర్కార్లు, రాయలసీమ, బిరారు, బ్రిటిష్ సామ్రాజ్యంలో కలిసిపోయాయి. ఇవి బ్రిటిష్ రాజ్యంలో కలిసి పోగానే అక్కడి వారికి నిజాం ఇచ్చిన జాగీర్లు, ఇతర సౌకర్యాలు రద్దయినాయి. వారంతా తమ బతుకు తెరువుల కోసం నిజాం రాష్ట్రంమీద పడ్డారు. ఢిల్లీ, ముర్షిదాబాద్, లక్నో మొదలైన ప్రభువులు పాలించే రాజ్యాలు అస్తమించి పోగానే ఆ రాజ్యాలలో పనిచేసే ముస్లిం ఉద్యోగులను దేశద్రోహులుగా పరిగణించి బ్రిటిష్‌వారు తొలగించారు. వారిలో చాలామంది నిజాంను మొగల్ చక్రవర్తి వారసునిగా భావించుకుని హైదరాబాద్ వచ్చారు. అలా వచ్చినవారు వైద్యం, గుత్తేదారు, వ్యాపారం మొదలైన వృత్తులు చేపట్టారు. ఉద్యోగాలు సంపాదించుకున్నారు.

నిజాం సంస్థానం జాగీర్దారీ విధానంవల్ల గాఢసుషుప్తిలో ఉంది. చదువులు ఉన్నత వర్గాలకే పరిమితం. వారు ఉద్యోగాలు చేయడానికి ఇష్టపడలేదు. కొందరు ముందుకు వచ్చినా హైదరాబాద్‌లోనే ఉండాలనుకునేవారు. ప్రభుత్వ యంత్రాంగం పని చేయాలంటే జిల్లా కార్యాలయాలు కూడా నడవాలి. అలాంటప్పుడు పిలిచి పిలిచి ఉద్యోగాలిచ్చేవారు. జాగీర్దార్లు విలాస జీవితం గడిపేవారు. బయట రాష్ట్రాలనుంచి వచ్చేవారు కష్టపడి విధులు నిర్వహించేవారు. ఈ సహజీవనం ఆదర్శప్రాయంగానే ఉండేది. మతం, భాష ఆనాడు సమైక్య శక్తిగా పనిచేసింది. ముల్కీ గొడవలు ఉన్నా సర్దుకుపోయేవారు.

ఒకానొక విచిత్ర సంఘటనవల్ల ముల్కీ శిశువు జనించింది. అయిదవ నిజాం నవాబు అఫ్జలద్దౌలబహదుర్, అతని ప్రధాని మొదటి సాలార్‌జంగ్ మధ్య కొన్ని ముఖ్యమైన ఉద్యోగాల నియామకం విషయంలో ఏకాభిప్రాయం కుదురలేదు. ఆ రోజుల్లో నిజాం ఆంతరంగిక వ్యవహారాల కార్యదర్శి పదవికి చాలా ప్రాముఖ్యముండేది.

అతడు ప్రధానిపై కొంతవరకు స్వారీ చేయగలిగేవాడు. ఆ పదవికి సాలార్‌జంగ్ సూచన చేసిన వ్యక్తిని నిజాం అంగీకరించలేదు. దీనికి బాధపడి సాలార్‌జంగ్ రాజీనామాకు సిద్ధమయ్యాడు.

బ్రిటిష్ వారి కనుసన్నలలో మెలగుతున్న సాలార్‌జంగ్‌పై నిజాంకు సదభిప్రాయం లేదు. కానీ అతన్ని తొలగించే సాహసం చేయలేకపోయాడు. ఇప్పుడు సాలార్‌జంగ్ రాజీనామాకు సిద్ధమవుతున్నాడంటే కాగల కార్యం గంధర్వులే తీర్చారన్నంత సంతోషమైంది నిజాంకు. కానీ సాలార్‌జంగ్ రాజీనామా చేయడం ఆయన భక్త బృందానికి నచ్చలేదు. వాస్తవంలో అధికారమంతా సాలార్‌జంగ్ చేతుల్లోనే ఉంది. అతడు పోతే తమగతి ఏమవుతుందో అనే బాధ వారికి కలిగింది. వారంతా కలిసి ఒక ఉపాయం ఆలోచించారు.

నిజాంకు ఫకీర్లంటే వల్లమాలిన అభిమానం. చాలా పనులు ఫకీర్ల సలహాలతోనే జరిగిపోయేవి. నిజాంకు మిక్కిలి ఆప్తుడైన ఒక ఫకీరుకు లంచమిచ్చి తమవైపు తిప్పుకున్నారు. సాలార్‌జంగ్ చెప్పిన వ్యక్తిపేరును నిజాం ఫకీరు ముందు పెట్టగానే అతడు మిక్కిలి సంతృప్తుడై, 'బాగుంది బాగుంది, సాలార్‌జంగ్ మంచి వ్యక్తినే సూచించాడు. తక్షణం అతనికి పదవి ఇవ్వండి' అని అనుగ్రహించి ఫకీరు వెళ్ళిపోయాడు. ఇంకేముంది ఉపాయం ఫలించింది. తాను సూచించిన వ్యక్తికి పదవి దొరికింది. ఎలాగో సాలార్‌జంగ్‌ను తొలగించే అధికారం నిజాంకు లేదు. దీనితో సాలార్‌జంగ్ నిజాం అభిమానం కూడా పొందాడు. ఇక నిర్భయుడై ప్రభుత్వంలో తనను వ్యతిరేకించే అధికారుల భరతం పట్టడం ప్రారంభించాడు. నిజాంకు మొరపెట్టు కొనడానికి తన అనుమతి లేనిదే నిజాంను దర్శించుకునే వీలులేదని ఉత్తరువులు జారీ చేశాడు. ఈ విధంగా నిజాం అభిమానులు, సాలార్‌జంగ్ అభిమానుల మధ్య మనస్పర్థలు మొదలైనాయి. ముల్కీ, నాన్‌ముల్కీల గొడవలు ప్రారంభమయ్యాయి.

ఆరవ నిజాం మీర్ మహబూబ్ అలీఖాన్ బహదూర్ కాలంలో 1880లో ఉర్దూ అధికార భాషైంది. మంత్రివర్గంలో ఒకరిద్దరు ఇంగ్లీషు మంత్రులు ఉండటం తప్పదు కనుక ప్రభుత్వంలో ఇంగ్లీషుకు గౌరవస్థానం లభించింది. ఈ విధంగా ఉత్తరాదివారి ప్రవేశానికి ఈ మార్గం సులభమైంది. ఉత్తరాది వారు వరదలా వచ్చి పడటంతో ఇక్కడివారిలో అసంతృప్తి ఎక్కువైంది. ఇది గమనించిన నిజాం తన రాష్ట్రంలో

బయటివారి సంఖ్య తెలుపమని సాలార్‌జంగ్‌ను ఆదేశించాడు. దీనిపై 1886లో రాష్ట్రోద్యోగుల సివిల్ లిస్ట్ మొదటిసారి విడుదలైంది.

ఉద్యోగుల సివిల్ లిస్టు (1886 సం॥)

పుట్టిన స్థలం	ఉద్యోగులసంఖ్య	శాతం	వేతన విభాగం
హైదరాబాద్ రాష్ట్రం	246	52	42
బ్రిటిష్ ఇండియా	230	48	58

బ్రిటిష్ ఇండియా నుంచి వచ్చినవారు

1.	మద్రాసు, బొంబాయి ప్రెసిడెన్సీలు మినహాయించి	97	20	24
2.	మద్రాసు ప్రెసిడెన్సీ	66	14	11
3.	బొంబాయి ప్రెసిడెన్సీ	36	8	8
4.	ఇతర యూరప్ దేశాలు	24	5	13
	మొత్తం	230	48	58

అంటే రాష్ట్రంలోని సగంమంది ఉద్యోగులు రాష్ట్రేతరులే. ముల్కీ ఉద్యోగాల సంఖ్య నూటికి 52 వరకున్న వేతన విభాగంలో వారికి లభించింది 42 శాతమే.

ముల్కీ ఉద్యమం జోరు తగ్గించడానికి ప్రభుత్వం కొన్ని చర్యలు తీసుకుంది. స్థానికులకు ఉన్నత విద్యావకాశం లభించడానికి విదేశ స్కాలర్‌షిప్ విధానం ప్రవేశపెట్టింది. ప్రత్యేక హైదరాబాద్ సివిల్ సర్వీస్ ఏర్పాటుచేసింది.

15 రబ్బీ ఉల్‌సానీ 1301 హిజ్రీ (1888 సం॥)లో విడుదల చేసిన జరీదా (గెజిటు)లో ఈ విధంగా పేర్కొన్నారు:–

'ఇస్తెహా కక అహల్ ముల్క్ బర్హల్ బిలా నదీగర్, బషర్త్– ఎ– లియాఖల్ మురజె అస్త్. ఖుదామీ బాషిందా, ముల్కీగైర్, బర్‌కుదామీ కిద్మత్ బిలావర్ఝా, వబిలా మంజూరీ–ఎ–ఖాస్ మదరుల్ మహాం మకరర్ నషీనద్'.

'ఈ రాజ్యంలో ఉద్యోగాలన్నీ అర్హతమేరకు విదేశీయుల జోక్యం లేకుండా స్థానికులకే ఇవ్వవలెను. విదేశీయుల (నాన్ ముల్కీలు) అవసరమనుకుంటే ప్రధానమంత్రి అనుమతి తీసుకోవాలి' అని దీని సారాంశం.

ఉర్దూకు సైతం ముల్కీ-నాన్‌ముల్కీ విభేదాలుండేవి. నాన్‌ముల్కీ అంటే ఉత్తరాది ఉర్దూను 'బాబాయె ఉర్దూ' (ఉర్దూ పిత) డా॥ అబ్దుల్ హక్ పోషించగా, దక్కనీ ఉర్దూకు డా॥ ఖాదర్ మొహియుద్దీన్ జోర్ ఆచార్య పీఠం వహించేవారు. ఉత్తరాది ఉర్దూను ఇదారె అద్బియాత్ ఉర్దూ అనే సంస్థ పోషించగా, దక్కనీ ఉర్దూను 'అంజుమనె తరక్కీ ఉర్దూ' అనే సంస్థ పోషించేది.

పాఠ్యగ్రంథాల అనువాదం కోసం ఉస్మానియా యూనివర్సిటీలో 'దారుల్ తర్జుమా' (అనువాద విభాగం) ఏర్పడింది. దేశంలోని ఉద్దండులైన పండితులను, శాస్త్రవేత్తలను, భాషావేత్తలను పిలిపించి గ్రంథానువాదాలు చేయించారు. అది అత్యున్నత ప్రమాణాలలో గ్రంథరచన చేసింది. ఈ గ్రంథాలు ప్రస్తుతం పాకిస్తాన్‌కు బాగా ఉపయోగపడుతున్నాయి. దక్కనీ ఉర్దూ గురించి ఎన్ని గొప్పలు చెప్పుకున్నా పాఠ్యగ్రంథరచనలోను, అధికారభాష వినియోగంలోను ఉత్తరాది ఉర్దూకే ప్రాముఖ్యం లభించింది. పోలీసు చర్య జరిగేవరకు ఆచార్యులు, శాఖాధిపతులు దాదాపు బైటివారే.

ఉస్మానియా యూనివర్సిటి స్థాపించి ఉర్దూలో బోధన ప్రారంభించగానే విద్యకు కొంత విముక్తి లభించింది. పేదలకు, సామాన్యులకు విద్యార్జనావకాశం దొరికింది. అయితే తమ శక్తిసామర్థ్యాలకు తగినట్టు జీవితంలో ఉన్నతిని సాధించే అవకాశం మాత్రం లేకపోయింది. తగిన చదువూ, సామర్థ్యం లేకపోయినా ఉన్నత పదవులన్నింటినీ జాగీర్దార్ల బిడ్డలే ఆక్రమించుకుని కూర్చున్నారు. ఫ్యూడలిజమ్ సామాన్య ముస్లింలను కూడా సహించలేకపోయింది. దీనివల్ల అశాంతి రేగింది. ఈ అశాంతి నుంచి పుట్టిందే మూడో దశాబ్దిలో పుట్టిన ముల్కీ ఉద్యమం.

'ములుక్' అనేది ఉర్దూపదం. దేశమని దీని అర్థం. ముల్కీలంటే దేశీయులు. వీరిని స్వదేశీయులని కూడా అనవచ్చు. అంటే హైదరాబాద్ రాష్ట్రంలో పుట్టి పెరిగినవారు. దేశంలో బ్రిటిష్ పాలనవలన వృద్ధి అవుతున్న నిరుద్యోగాన్ని తట్టుకోలేక వివిధ ప్రాంతాల ముస్లింలు సంస్థానంలోకి వచ్చి ఉద్యోగాలు సంపాదించుకునేవారు.

ప్రభుత్వం ఇలాంటి రాకను ప్రోత్సహించేది. కానీ ఆ ప్రాంతాల హిందువులకి అలాంటి ఉత్సాహం ఉండలేదు. దక్షిణ ప్రాంతం నుంచి కొద్దిమంది ముస్లింలు మాత్రమే రాగలిగారు. దీని ఫలితంగా స్థానిక ముస్లింలు తమకు రావలసిన ఉద్యోగాలన్నీ ఉత్తర హిందూస్థానం నుంచి వచ్చిన వారు కొట్టేస్తున్నారని వారి రాకను వ్యతిరేకించ సాగారు. ఆ విధంగా ఈ సమస్య హిందూ-ముస్లింల మధ్య వచ్చినది కాదు. స్థానిక ముస్లింలు, ఇతర రాష్ట్రాలనుంచి ముఖ్యంగా ఉత్తర హిందూస్థానం నుంచి వచ్చిన ముస్లింల ఉద్యమమే ఇది.

ఇటువంటి పరిస్థితులలో ఉత్తర హిందూస్థానం నుంచి దిగుమతి జరుగుతూనే ఉంది. అది ఎప్పుడూ ఆగలేదు. ఇక్కడి ముస్లింలు స్థానిక హిందువులతో కలసి ఉత్తరాది వారికి అన్ని ఉద్యోగాలు పోతే మాగతి ఏమిటని గోల పెట్టడం ప్రారంభించారు. స్థానికులే గాక ముందుగా వచ్చిన గైర్ ముల్కీలు కూడా తమ సంతానానికి ఆస్కారం ఉండదని ముల్కీ ఉద్యమాన్ని ప్రోత్సహించారు. నిజాం ప్రభుత్వం ఉద్యోగులకి ముల్కీ నిబంధన చేసింది. ముల్కీ కావడానికి నిజాం రాష్ట్రంలో పుట్టి ఉండాలి. లేదా ఇక్కడి మనిషిని వివాహం చేసుకొని ఉండాలి. లేదా పదిహేను సంవత్సరాలు నిజాం రాజ్యంలో నివాసంగా అయినా ఉండాలి.

అయితే నిబంధన దారి దానిదే. వచ్చిపడే గైర్ ముల్కీలు వస్తూనే ఉన్నారు. ముల్కీ సర్టిఫికెట్లు ఖరీదుకి అవలీలగా దొరికేవి. ఏ భాష వారైతేనేం, ఉద్యోగాలలో ఉన్న వారిలో చాలా మంది సర్టిఫికెట్ల ప్రకారం ముల్కీలే. ముల్కీ ఉద్యమానికి రాష్ట్రంలో అంతం లేదు. అజాద్ హైదరాబాద్ రాష్ట్రానికీ, ప్రత్యేక తెలంగాణా రాష్ట్రానికి ముల్కీ ఉద్యమమే పునాది రాళ్ళను చేకూర్చింది. బొంబాయి రాష్ట్రానికి చెందిన సర్ అక్బర్ హైదరీ రాష్ట్ర ప్రధానిగా ఉన్న కాలంలోను, అంతకు ముందు కీలక స్థానంలో ఉన్నప్పుడు తనకు కావలసిన వారినందరినీ తన ప్రాంతంనుండి తీసుకువచ్చాడు. ఆయన మాటకి ప్రభుత్వంలో ఎదురులేదు. తుదకు అడవి కంట్రాక్టర్లు కూడా బొంబాయి నుంచే వచ్చేవారు. రైల్వే ఉద్యోగాలలో కూడా తనకు సంబంధించినవారినే పెట్టించుకున్నాడు. వీరంతా ముస్లింలే. ఇంతకుముందు హైదరీ ఆర్థికమంత్రి, స్థానికులకు ఉద్యోగాల గురించి ఎవరు పట్టించుకోలేదు. అది నివురుగప్పిన నిప్పు. ఎప్పుడు భగ్గుమంటుందో తెలియదు.

ఈ ముల్కీ ప్రస్తుతం ఒక్క తెలంగాణాలోనే ఉంది. హైదరాబాద్ రాష్ట్రపూర్వ విభాగాలైన మరట్వాడా, కర్నాటకలో దీని అలజడి లేదు. అదే విచిత్రం. వారు పోతూ పోతూ దీన్ని మూసీనదిలో పారేసిపోతే తెలంగాణా వారు వారసులైనారు.

పోలీసు చర్య అనంతర పరిస్థితులు:

పోలీసు చర్య తరువాత చాలామంది యూనియన్ ఉద్యోగులు హైదరాబాద్‌కు వచ్చారు. ఉర్దూ స్థానంలో పరిపాలన వ్యవహారం ఇంగ్లీషులోకి మారడం, ప్రాంతీయ భాషలకు ప్రాముఖ్యం పెరగడం వలన ఇలా చేయవలసి వచ్చింది. పాఠశాలలలో ప్రాంతీయ భాషలను మాధ్యమంగా ప్రవేపెట్టడం వలన ప్రాంతీయ భాషలలో బోధన జరిపే ఉపాధ్యాయులు అవసరమైనారు. రాష్ట్రంలో ఉద్యోగం చేయడానికి ముల్కీ సర్టిఫికెటు అవసరమన్న నిబంధన ఉన్నా ఏదో విధంగా ముల్కీ సర్టిఫికెట్లు సంపాదించారు. మొత్తంమీద చాలామంది ఉద్యోగులుగాను, ఉపాధ్యాయులుగాను వచ్చారు. మొదట ఈ విషయానికి ఇంత ప్రాముఖ్యం లేకపోయింది. కానీ వచ్చినవారు సానుభూతితో ప్రవర్తించక తాము స్వర్గం నుండి దిగివచ్చినట్లు, అనాగరికమైన ఈ ప్రాంతాన్ని నాగరికం చేయడానికి ప్రయత్నిస్తున్నట్లు అసంబద్ధంగా వ్యవహరించడం ఆరంభించారు.

అలా వచ్చినవారు పనికిరానివారుగా తయారై లంచాలు విపరీతంగా తీసుకొని ఇక్కడి ప్రజలకు ఏ విధంగా సహాయం చేయలేదు. ఆ ఉద్యోగుల పరిస్థితి హేయాతి హేయంగా ఉండటంవలన వారి కంటె ఇదివరలో ఉన్న వారే మేలని భావించడం జరిగింది. తమ స్థానాలలో యూనియన్ ఉద్యోగస్థులు వచ్చి చేరారు. కనుక ఇదివరలో ఇక్కడ పనిచేస్తున్న ఉద్యోగులు వారికి వ్యతిరేకంగా కావలసినంత ప్రచారం చేశారు. ఈ ప్రచారం కూడా యూనియన్ వారంటే వ్యతిరేకభావాన్ని పెంపొందించడానికి తోడ్పడింది.

ఉర్దూ భాష:

ఉర్దూ భారత దేశపు భాషల్లో ఒకటి. బ్రిటిష్ వారి తోడ్పాటుతో నిజాం ప్రభుత్వం ఉర్దూను విశ్వవిద్యాలయ స్థాయివరకు బోధనా భాషగా చేసి అమలు జరిపింది. దేశీయ భాషల్లో ఒకటైనప్పటికీ కొద్దిమంది తప్ప సంస్థాన ప్రజల

మాతృభాషల్లో ఒకటి కాదు. తెలుగు, మరాఠీ, కన్నడం, వారి వారి మాతృభాషలు. వీటికి ప్రత్యామ్నాయంగా ఉర్దూను ప్రవేశపెట్టి పరాయి భాషాధిపత్యాన్ని ప్రజలపై రుద్దింది నిజాం ప్రభుత్వం. దీని ఫలితంగా ఆంధ్రుల్లో విద్యావ్యాప్తి తగ్గిపోయింది. ఈ వాస్తవాన్ని గుర్తించలేక విశ్వకవి టాగూరు నుంచి రాజగోపాలాచారి వరకు ఈ విధానాన్ని ఆకాశానికెత్తారు. అయినా సంస్థానంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడగానే దీనిని రద్దు చేసి ఇంగ్లీషును ప్రవేశపెట్టారు.

ఉద్యోగాల్లో చేరిన ఆంధ్రులలో తమకో భాష, సంస్కృతి ఉన్నదని భావించేవారు ఉండడమే అరుదు. విద్యార్థులలో అలాంటి ఉద్యమాలు అభివృద్ధి కాలేదు. స్కూల్లో, కాలేజీల్లో చేరేనాటి నుండి ఉద్యోగంలో ప్రవేశించే రోజు కోసం నిరీక్షించే వారిలో ఇలాంటి భావాలు ఉండటం అసాధ్యం. తమ తమ భాషా సంస్కృతులను అభిమానిస్తే దానిని ప్రభుత్వ వ్యతిరేకంగా పరిగణించే రోజులవి. ఈ పరిస్థితి 1940 వరకు కొనసాగింది.

ఉర్దూ భాష తమకు అక్కరలేదని రాష్ట్ర ప్రజలు ఆందోళనలమీద ఆందోళనలు జరిపారు. హైదరాబాద్ పీపుల్స్ ఎడ్యుకేషన్ కాన్ఫరెన్స్ సమావేశం పర్భనీలో 1941 ఏప్రిల్‌లో వినాయకరావు విద్యాలంకార్ అధ్యక్షతన జరిగింది. ఈ కింది అంశాలు ఈ సభలో ఏకగ్రీవ ఆమోదం పొందాయి:-

1. మెట్రిక్ వరకు ఎవరి మాతృభాషలో వారికి బోధన జరగాలి.
2. మెట్రిక్ తరువాత ఉర్దూ స్థానంలో ఇంగ్లీషులో బోధన జరగాలి.
3. హిందీ, సంస్కృతం భాషలను బోధించాలి.
4. విద్యార్థులను వందేమాతరం పాడటానికి అనుమతించాలి.
5. ఖాన్గీ స్కూళ్ళను అడ్డుకునే గస్తీని రద్దుపరచాలి.

ప్రజామండలి అధ్యక్షుడు జోషి 1941 మేలో రాష్ట్రప్రభుత్వానికి దిగువ అంశాలతో మెమోరాండం సమర్పించాడు:-

1. తెలుగు, మరాఠీ, కన్నడ భాషలలో బోధన జరగాలి.
2. ఖాన్గీ పాఠశాలలను నిషేధించే ఉత్తరువులను ఉపసంహరించుకోవాలి.

3. హిందూ బాలికలకు అనవసరమైన ఉర్దూలో బోధన జరుగరాదు.

4. ప్రాథమిక విద్యను ఉచితంగా, నిర్బంధంగా అమలు జరపాలి.

5. పాఠ్యగ్రంథాల రచనలో ప్రజామండలి ప్రతినిధులకు అవకాశం ఇవ్వాలి.

6. ప్రాంతీయ భాషలను ఆయా ప్రాంతాలలో అధికార భాషలుగా ప్రకటించాలి.

హైదరాబాద్ ప్రజా విద్యా మహాసభ ఆహ్వాన సంఘాధ్యక్షులుగా ఉన్న బూర్గుల రామకృష్ణారావు 1944 నవంబరు 11వ తేదీన మహాసభ వేదికమీది నుంచి చిరస్మరణీయమైన ఉపన్యాసం చేశారు. మాతృభాషలను బోధనా భాషలుగా చేయాలనే సూత్రాన్ని అంగీకరించి అమలు జరుపుతున్నప్పుడు ఉర్దూ మాతృభాష కాని విద్యార్థులకు ఉర్దూలో బోధన జరపడం ఎంతవరకు సమంజసం అని ప్రశ్నించారు. రాష్ట్రంలో వ్రేళ్ళమీద లెక్కపెట్టే సంఖ్యలో ఇంగ్లీషు మీడియం పాఠశాలలున్నా వాటిలో ప్రవేశం హిందూ పిల్లలకు లభించడం సులభం కాదు. ❑

24. మజ్లిస్ 'ఇత్తెహాదుల్ ముసల్మీన్' రాజకీయాలు

హైదరాబాద్ రాష్ట్ర ముస్లిం ప్రజల మనస్తత్వాన్ని మందుముల నరసింగరావు గారు తన 'యాభై సంవత్సరాల హైదరాబాద్' చరిత్రలో ఇలా రాశారు:

'హైదరాబాద్ రాష్ట్రం వరకు ఇక్కడి ముస్లింలు ప్రజాజీవితంలోను, రాజకీయ జీవితంలోను వేరుగా ఉండసాగిరి. హైదరాబాద్ ఒక స్వతంత్ర రాజ్యమని, భారతదేశంతో, అక్కడి రాజకీయాలతో హైదరాబాద్‌కు ఎలాంటి సంబంధము లేదని వారి దృక్పథము. ముస్లింలలో అధిక సంఖ్యాకులు జాగీర్దార్లు, మన్సబ్‌దారులు. చాలామంది ప్రభుత్వోద్యోగులుగా జీవితం గడిపేవారు. రాజకీయాలకు దూరంగా ఉండేవారు. 1926లో ఇత్తెహాదుల్ ముసల్మీన్ సంస్థకు పునాదులు వేయబడినవి'.

నానాటికి భారతదేశంలో రాజకీయ చైతన్యం ఎక్కువ అవుతున్న కొద్దీ బ్రిటిష్ ప్రభుత్వం కొత్త ఎత్తుగడలను వేస్తూ వచ్చింది. భారత ప్రజల ఆందోళన జాతీయ కాంగ్రెస్ రూపం ధరించగానే దానికి వ్యతిరేకంగా ముస్లిం రాజకీయాలు సృష్టించడం బ్రిటిష్ సామ్రాజ్యము పన్నిన బ్రహ్మాండమైన పన్నుగడ. ఈ పన్నుగడకు మూల పీఠం హైదరాబాద్. 1906లో ముస్లింలీగ్ కార్యదర్శి అయిన నవాబు వికారుల్ ముల్క్ బహదుర్ అలీఘర్‌లో ఇచ్చిన ఉపన్యాసంలో ఇలా అన్నాడు: 'మన సంఖ్య భారతదేశంలోని హిందువుల సంఖ్య కన్నా అల్పమైనది. భగవంతుని దయ తప్పి ఎన్నడైనా భారతదేశంలో బ్రిటిషు ప్రభుత్వం లేకుండాపోతే మనం హిందువుల పాలితులుగా ఉండవలసి వస్తుంది. అందువల్ల మన ప్రాణము, ధనము, మానము, మన మతము అన్నిటికి అపాయం వాటిల్లుతుంది. ఈ అపాయాలనుండి రక్షించు కొనడానికి భారతదేశపు ముసల్మానుల చేతుల్లో ఏదైనా ఉపాయం ఉంటే అది ఒకటే ఒకటి. అదే భారతదేశంలో బ్రిటిష్ ప్రభుత్వం శాశ్వతంగా ఉండేటట్లు చేయడం.

మనము ప్రభుత్వ సంరక్షణకు నడుము కట్టినన్నాళ్ళు మన హక్కుల సంరక్షణ ఉంటుంది'. ఇలా చెప్పిన వికారుల్ ముల్క్ హైదరాబాద్ ప్రభుత్వ యంత్రాంగంలో కీలకమైన వ్యక్తి. ఇలాంటి ఉదాహరణలు ఎన్నైనా చెప్పవచ్చు. మొత్తం మీద భారతదేశ విభజనకు దారితీసిన కుట్రలకు కూడా సంప్రదాయ సిద్ధంగా హైదరాబాదే కాణాచి అయింది.

ఇలా బ్రిటిష్ రాజ్యం శాశ్వతంగా ఉండిపోవాలనే నినాదం హైదరాబాద్‌లోనే మొదట వినబడింది. అలీఘర్ నినాదంతో ఏక కంఠంగా అరిచింది. పాకిస్తాన్‌కు దారి తీసింది.

ముసల్మానులందరినీ సంఘటితపరచడం, వారి ఆర్థికాభివృద్ధికి తోడ్పడటం, వారిని ప్రభుభక్తి పరాయణులుగా తీర్చిదిద్దడం ఈ సంస్థ ప్రధానాశయాలు. మజ్లిస్ అనే మరో ముస్లిం సంస్థ మహమ్మద్ ప్రవక్త జన్మదినోత్సవం జరుపుతుండేది. అప్పుడప్పుడు సాధారణ సమస్యల మీద ప్రభుత్వానికి విజ్ఞాపనలు అందజేస్తూ ఉండేది. ఈ రెండు ముస్లిం సంస్థలు మొదట్లో రాజకీయాలను మతంతో పెనవేసుకోనీయలేదు.

దరిమిలా 1938లో హైదరాబాద్ సంస్థానంలో స్టేటు కాంగ్రెస్ సంస్థ అవతరించింది. అది ప్రజా ప్రభుత్వం కోసం పోరాట పంథా చేపట్టింది. ఈలోగా ఆర్యసమాజ్ రంగంలో ప్రవేశించింది. హిందూ సంస్కృతి రూపుమాసిపోకుండా వుండేందుకు అది తన కార్యకలాపాలను ప్రారంభించింది. ఒకవైపు స్టేటు కాంగ్రెస్, మరొకవైపు ఆర్యసమాజ్ హిందువులను ఏకోన్ముఖం చేస్తూండటం చూసి రెండు ముస్లిం సంస్థలు ఖంగుతిన్నాయి. హైదరాబాద్ సంస్థానంలో ముస్లింల అధికారానికి ముందు ముందు ముప్పు రావచ్చునని సందేహించాయి. సంస్థానంలో ముసల్మానుల అధికారం శాశ్వతంగా కొనసాగాలని భావించాయి అంతే. అప్పటి వరకూ కేవలం మత సంస్థలుగానే కొనసాగుతున్న వాటి స్వరూపం మారింది. అవి రాజకీయ కేంద్రాలుగా మారి పోయాయి.

పూర్వపు హైదరాబాద్ సంస్థానంలో రాజకీయాల సందడి ఎక్కువగా ఉండేది కాదు. రాజ్యాధికారంలో ఉన్న ముస్లిం జనాభాలో సైతం రాజకీయ చైతన్యం కనిపించేది కాదు. సంస్థానంలోని హిందువులలాగే సామాన్యులైన ముసల్మాన్లు కూడా రాజకీయాల జోలికి పోయేవారు కారు. బ్రిటిష్ ఇండియాలో వలె రాజకీయోద్యమాలు ఉండేవి

కావు. జనంలో నిరక్షరాస్యులే ఎక్కువ. ఆర్థికాభివృద్ధి పథకాల అమలు వంటిది లేకపోవడంతో దరిద్ర నారాయణుల సంఖ్య ఎక్కువగానే ఉండేది. ఫ్యూడల్ కట్టుబాట్లు బాగా వేళ్ళూనుకున్న సమాజమది. అందువల్ల రాజకీయ చైతన్యానికి ఏ మాత్రం అవకాశం లేకుండా పోయింది. ఆ పరిస్థితుల్లోనూ ఉన్నత, మధ్యతరగతుల ముస్లింలకు ప్రత్యేకమైన సదుపాయాలు, అవకాశాలు ఉండేవి.

ఉస్మానియా యూనివర్సిటీ స్థాపించి ఉన్నత విద్యను సైతం ఉర్దూలో బోధించటం మొదలు పెట్టారు. ఏదేమైనా సామాన్యులకూ, పేదలకు విద్యార్జనావకాశం లభించింది. అయితే ఎంత పెద్ద చదువు చదివినా పెద్ద పెద్ద ఉద్యోగాలు ఉన్నత వర్గాలకు చెందిన ముసల్మానులకు తప్ప ఇతరులకు అందుబాటులో ఉండలేదు. తగిన చదువు, అర్హత, సామర్థ్యం లోపించిన జాగీర్దార్ల సంతానానికే ఉన్నత పదవులు దక్కేవి. దీనితో సర్వే సర్వత్రా అశాంతి చెలరేగింది. ఇత్తేహాదుల్ ముసల్మీన్ సంస్థ ఈ అశాంతిని పక్కదారులకు పట్టించే ప్రయత్నం చేసింది. పాలకులు ముసల్మాన్లు, రాజ్యం ముసల్మానులది. ముసల్మాన్లు రాజ్యాధికారంతో రాజు రాచరికానికి చిహ్నం మాత్రమేనని ఆ సంస్థ నాయకులు వాదించసాగారు. ఆ దశలో ఆ సంస్థకు నవాబు బహదుర్ యార్ జంగ్ నాయకత్వం లభించడం అదృష్టమే.

నిజాం రాష్ట్రపు హిందూ ప్రజల్లో రాజకీయ చైతన్యం కలిగి పౌరసత్వపు హక్కుల కోసం పోరాటం ప్రారంభించగానే నిజాం ఇరకాటంలో పడ్డాడు. బాధ్యతాయుత ప్రభుత్వమంటే ఎటుచూసినా సంఖ్యాబలంచేత హిందూ ఆధిక్యత కనబడింది. ఇది వారికి ఒక గడ్డు సమస్యగా తయారైంది. నిజాంతో మునగడానికి, తేలడానికి సంసిద్ధులైనారు. ఇక్కడి ముస్లింప్రజలూ, ఇత్తేహాదుల్ ముసల్మీన్‌సంస్థ భయాందోళనలకు గురైంది. ప్రజాపోరాటం పటిష్టమైన కొద్దీ ఇత్తేహాదుల్ ముసల్మీన్ అభివృద్ధి నిరోధక వైఖరి వెల్లడవుతూ వచ్చింది. అప్పుడు వారి బెదిరింపు ధోరణులు ఇలా ఉన్నాయి:

1. హైదరాబాద్ ప్రభుత్వం సర్వస్వాతంత్ర్యం కలిగిన రాజాధికారిగా ఉండాలి.
2. దేశాభివృద్ధి కోసం ప్రస్తుత రాజ్యాంగ విధానంలో తప్పక మార్పులు చేయవలసి వస్తే ముస్లింల రాజకీయ ఉన్నతికి ఎలాంటి మార్పులను దక్కను ముస్లింలు సహించరు.

3. శాసనసభ, స్థానిక స్వపరిపాలన సంస్థలలో ముస్లింలు అధిక సంఖ్యలో ఉండాలి.

4. ఉర్దూ భాష అన్ని స్థాయిలలోను, బోధనాభాషగా, రాజభాషగా ఉండాలి.

ఉద్యోగాలలో ముస్లింల పాత్ర ఎంత మాత్రం తగ్గరాదు. ఈ విధంగా ఉండేది ముస్లింల రాజీవైఖరి. ఇంతటితో చాలక, ముస్లింలు విజేతలనీ, వారికి ఏడు శతాబ్దాల అవిచ్ఛిన్న సార్వభౌమత్వం ఉందని, దానిని విడనాడుకోజాలమని ప్రగల్భాలు పలికేవారు. ఈ వితండ ధోరణి ఎంతవరకు వచ్చిందంటే ప్రతి ముస్లిం తానే హైదరాబాద్ రాజ్య ప్రతీకగా భావించేవాడు. ఇత్తెహాద్ నాయకుడైన బహాదుర్ యార్‌జంగ్ 'అనిల్ మాలిక్' సూక్తిని ముస్లింల మనస్సులో కెక్కించాడు. అనిల్ మాలిక్ అంటే 'నేనే ప్రభువును'. మన వేదాలు చెప్పే 'అహమ్ బ్రహ్మాస్మీ'. ఈ విధమైన రాజకీయ ఆటుపోటులతో హైదరాబాద్ రాష్ట్ర ప్రజాజీవితం సంక్షోభితమైంది.

తన రక్షణకోసం నిజాం ఇత్తెహాదుల్ ముసల్మీన్ సంస్థను ఉపయోగించు కున్నాడు. ఇందులో ముస్లింలను ఉద్ధరించిందేమీ లేదు. ఇదంతా స్వప్రయోజనం.

ఉస్మాన్ అలీఖాన్ మరొక ప్రమాదకరమైన దుశ్చర్యకు పాల్పడ్డాడు. ఇతడు రాజశాసనంతో 'తబ్లీగ్' మతాంతీకరణను ప్రారంభించాడు. అందులో బహదుర్ యార్ జంగ్‌ను ఉపయోగించుకున్నాడు. అతడొక్కడే 20 వేల మంది హిందువులను ముసల్మాన్లుగా మార్చినట్లు ప్రకటించాడు. బహదుర్ యార్ జంగ్ అనే సామాన్య వ్యక్తిని బహదుర్ యార్ జంగ్‌గా చేసి అతనిచేత నిజాం ఈ ఆటలు ఆడించాడు. రాజ్యపు బడ్జెటులో అందుకోసం నిధులను ఏర్పాటు చేశాడు. వారంతా గ్రామాలమీద పడ్డారు. హిందూ స్టాండింగ్ కమిటీవారు విడుదల చేసిన జనాభా లెక్కల ప్రకారం 1911లో హిందువుల జనాభా 88.9 శాతం కాగా, 1931లో 84 శాతానికి పడిపోయింది. ఇంతటి విపత్కర పరిస్థితుల్లోను ప్రభుత్వాన్ని అడిగిన ప్రజా సంస్థ లేకపోయింది. ప్రజ నిశ్శబ్దంగా, నిద్రాణంగా ఉండిపోయింది. అప్పుడు రంగంమీదికి వచ్చింది ఆర్యసమాజ్. శుద్ధి సంఘటన ద్వారా ముస్లింలలో చేరిన వారిని తిరిగి హిందూ మతంలోకి మార్చింది.

బహదుర్ యార్ జంగ్ మతాంతీకరణ ఉద్యమం చేపట్టగానే రాష్ట్రంలో మతకల్లోలాలకు అంకురార్పణ జరిగింది. ఈ మతాంతీకరణ ఉద్యమానికి వ్యతిరేకంగా

ఒకానొక దసరాపండుగ రోజున హిందువులు బలప్రదర్శన జరిపారు. రాజ్యాధికారంలో ఉన్న ముసల్మాన్లు ఇది చూసి భగ్గున మండారు. అల్ప సంఖ్యాకులే అయినా అధికారం తమదన్న గర్వాతిశయంతో వారు గుంపులు గుంపులుగా వీథుల్లోకి పరిగెత్తుకొచ్చి సందుల్లో కోలాటమాడారు. దాంతో కొంత గందరగోళం జరిగింది. ఇరువర్గాల వారు అక్కడక్కడా తలపడ్డారు. వారిలోను, వీరిలోను కొందరు ప్రాణాలు కోల్పోయారు. మరికొందరు గాయపడ్డారు. చనిపోయిన వారిలో బహదుర్‌యార్ జంగ్ ఇద్దరు వేలువిడిచిన మేనల్లుళ్లు ఉన్నారు. ఈ దెబ్బతో ముసల్మాన్లు కాస్త వెనక్కు తగ్గారు. వారి మతాంతీకరణ ఉద్యమం ఉధృతి కూడా తగ్గుముఖం పట్టింది.

కాక్సార్ ఉద్యమం:

ఇత్తెహాదుల్ ముసల్మీన్ చేపట్టిన మతాంతీకరణ ఉద్యమాన్ని ఆర్యసమాజ్‌వారు ఎక్కడికక్కడ గండికొట్టడం ప్రారంభించారు. ముసల్మాన్లుగా మారిన హిందువులను ఆర్యసమాజ్‌వారు ప్రాయశ్చిత్తం చేసి తిరిగి హిందూమతంలో చేర్చుకో సాగారు. ఆ విధంగా తాము చేపట్టిన మతాంతీకరణ ఉద్యమం నీరుగారిపోవడంతో ముసల్మానులకు దిక్కుతోచని పరిస్థితి ఏర్పడింది. తమ జనాభా సంస్థానంలో తక్కువగా ఉంటే హిందువులు తమ మీద తిరగబడి రాజ్యాధికారం హస్తగతం చేసుకుంటారనే భయం ముసల్మానులకు పట్టి పీడించసాగింది. అందుకు విరుగుడుగా సంఖ్యాపరంగా తక్కువగా ఉన్న తమ వారిని హిందువులకన్న బలవంతులుగా రూపొందించాలనే ఆలోచన చేశారు. ఈ దశలో ఇనాయతుల్లా మష్రికీ అనే ప్రబుద్ధునికి ముసల్మానుల ఆత్మరక్షణకు ఆయుధాలు సరఫరా చేసి వారిని సాయుధులను చేయాలని బుద్ధి పుట్టింది. దాంతో కాక్సార్ (సాయుధ శిక్షణ) ఉద్యమం బయల్దేరింది. బహదూర్ యార్ జంగ్ స్వయంగా ఈ ఉద్యమం అగ్రభాగాన నిలిచాడు. హైదరాబాద్ సంస్థానంలోని వూరూరా వాడవాడలా ముసల్మానులకు ఆయుధ శిక్షణ ఇచ్చే శిబిరాలు ఏర్పాటు చేశాడు.

బహదుర్ యార్‌జంగ్ రంగప్రవేశంతో సాయుధ శిక్షణ ఉద్యమానికి ప్రాణం పోసిన ఇనాయతుల్లా మష్రికీ ప్రాముఖ్యం తగ్గిపోసాగింది. దాంతో ఆయన ఆ ఉద్యమం మీద తన పట్టు చేజారిపోకుండా వుండేందుకు గట్టి ప్రయత్నాలు ప్రారంభించాడు. బహదుర్ యార్ జంగ్‌లో నాయకత్వ లక్షణాలు జాస్తి. ఏ ఉద్యమంలోనైనా ఆయనకు

అగ్రస్థానమే ఉండాలి. రెండోస్థానాన్ని కూడా ఆయన అంగీకరించలేదు. కాక్సార్ ఉద్యమ నాయకత్వంపై వచ్చిన పేచీ వల్ల మత్రిషీకీ-జంగ్‌ల మధ్య విభేదాలు పొడసూపాయి. చివరకు బహదుర్ యార్ జంగ్ మత్రిషీకీతో తెగతెంపులు చేసుకుని మజ్లిస్ సంస్థలో చేరిపోయాడు. ఆ సంస్థకు ఆయన త్వరలోనే ఏకైక నాయకుడుగా రూపొందగలిగాడు. రాజ్యంగ సంస్కరణలకోసం ఏర్పడిన అయ్యంగార్ కమిటీ నివేదికకు వ్యతిరేకంగా 1939లో నాటి సంస్థాన ప్రధాని సర్ అక్బర్ హైదరీకి బహదుర్‌యార్ జంగ్ వినతిపత్రం సమర్పించాడు. 'హైదరాబాద్ సంస్థానం మత సామరస్యానికి పుట్టిల్లు అనే సాకుతో హిందూ-ముస్లిం లిద్దరికి సంస్థానంలో సమాన ప్రతిపత్తి కల్పించడం పెద్ద కుట్ర. మజ్లిస్ ఈ ధోరణిని సాయశక్తులా ప్రతిఘటిస్తుంది. ఈ సంస్థానంలో ఇస్లాం మతాధిక్యాన్ని కాపాడుకోగల బలసంపత్తులు మజ్లిస్‌కు ఉన్నాయి' అన్నది వినతి పత్రం సారాంశం.

ఆనాటి పరిస్థితుల్ని బట్టి మజ్లిస్ వినతిపత్రాన్ని హైదరీ ఖాతరు చేయలేదు. అయినా మజ్లిస్‌ను కాదని ఆయన రాజ్యాంగ సంస్కరణలను అమలు పరచలేక పోయాడు.

'హిజ్ మెజెస్టీ' బిరుదు:

బహదుర్ యార్‌జంగ్ పుర్రెలో ఎప్పుడు ఏ బుద్ధి పుడుతుందో ఎవరూ చెప్పలేరు. ఉన్నట్లుండి ఆయన బ్రిటిష్ చక్రవర్తికున్న 'హిజ్ మెజెస్టీ' బిరుదును నిజాం నవాబుకు కూడా ఇవ్వాలని మరో ఆందోళన లేవదీశాడు. నిజాం నవాబుకు బ్రిటిష్ ప్రభుత్వం ఈ బిరుదు ఇవ్వకపోతే భారతదేశంలోని ముసల్మాన్లే ఆయనకు దానిని ప్రసాదించ గలరని హెచ్చరించాడు. బహదుర్ యార్ జంగ్ అప్పుడప్పుడు పగటి కలలు కనేవాడు. భారతదేశానికి ఎప్పుడో ఒకప్పుడు బ్రిటిష్ పాలకుల నుంచి విముక్తి గలుగుతుంది. స్వతంత్ర దేశంగా అవతరిస్తుంది. ఆ సమయంలో హైదరాబాద్ సంస్థానానికి స్వతంత్రం సిద్ధిస్తుంది. అది ప్రత్యేక దేశంగా ముస్లిం రాజ్యంగా అవతరిస్తుంది. ఇది ఆయనగారి పగటి కల సారాంశం. భారత జాతీయ కాంగ్రెస్ చిరకాలంగా సాగించిన స్వాతంత్ర్య పోరాట ఫలితంగా బ్రిటిష్ సామ్రాజ్యవాదులు కాంగ్రెస్ పార్టీకి దేశాధికారం అప్పజెప్ప డానికి మానసికంగా సిద్ధపడ్డారు. ఆ సందర్భంలో బహదుర్‌యార్ జంగ్ మరో

తీయటి కల కన్నాడు. బ్రిటిష్ సామ్రాజ్యవాదులకు గడ్డు సమస్యలు ఎదురైనప్పుడల్లా నిజాం నవాబు ఆదుకున్నాడు. నిజాంమీద వారికి సద్భావం ఉంటుంది. కృతజ్ఞతా భావమూ ఉంటుంది. ఈ దృష్టితో బ్రిటిష్‌వారే భారతదేశం నుంచి వెళ్ళిపోయేటప్పుడు నిజాం సంస్థానాన్ని స్వతంత్ర దేశంగా ప్రకటిస్తారు. ఆ పగటి కలల ప్రపంచంలో ఆయన భారతదేశంలో ఇస్లాం రాజ్యానికి రూపురేఖలు దిద్దేవాడు.

"భారతదేశానికి స్వాతంత్ర్యం లభించగానే నిజాం సంస్థానంలోని పూర్వ ప్రాంతాలన్నీ (సర్కారు, సీడెడ్) మళ్ళీ ఏకమవుతాయి. అప్పుడు ఆ రాష్ట్రం సరిహద్దులు ఇలా ఉంటాయి. మనం తూర్పున బంగాళాఖాతం వద్ద నిలబడి నమాజులు (ప్రార్థనలు) చదువుతూ ఉంటాం. ఉత్తరాన వార్ధా సరిహద్దుల్లో నిలబడి గాంధీజీకి సలాములు చేస్తూ వుంటాము. ఇది మన కోరిక మాత్రమే కాదు. హక్కు కూడా" అని ప్రకటించి తన సామ్రాజ్య కాంక్షను ఆయన వెల్లడించుకున్నాడు.

1940 ఆగష్టు 8వ తేదీన బహదుర్ యార్ జంగ్ బెజవాడలో ఒక ప్రకటన చేస్తూ సీడెడ్, సర్కారు జిల్లాలు త్వరలోనే నిజాం రాష్ట్రంలో కలిసిపోయి 'ఉస్మానిస్థాన్' అనే పేరుతో కొత్త రాష్ట్రం ఏర్పడుతుందని చెప్పాడు. సీడెడ్, సర్కారు జిల్లాలను నిజాం 50 లక్షల పౌండ్లకు అంటే 50 కోట్ల రూపాయలకు బ్రిటిష్ వారినుండి కొనేసుకోనున్నాడని అప్పట్లో పుకార్లు వ్యాపించాయి.

మజ్లిస్ రంగంలోకి ప్రవేశించగానే హిందూ మహాసభ నాయకులకు చేతినిండా పని కలిగింది. సర్కారు, సీడెడ్ జిల్లాలను నిజాంకు తిరిగి ఇచ్చివేయాలని బ్రిటిష్ ప్రభుత్వం నిశ్చయించుకుంటే దానిపై యావద్భారత ఆందోళన చేపట్టగలమని హిందూ మహాసభ అధ్యక్షుడు సావర్కర్ హెచ్చరించాడు. బ్రిటిష్ ఆంధ్రులు, నిజాం ఆంధ్రులు ఒకటి కావాలని చిరకాలంగా కోరుతున్నారు. అందుకు హిందూమహాసభ తనవంతు కృషి చేస్తుందని కూడా ఆయన చెప్పాడు. విశాలాంధ్ర ఏర్పాటు అభ్యుదయకరమైన చర్యగా చరిత్రలో నిలిచిపోతుందని, అది ఐక్య కర్నాటక, విశాల మహారాష్ట్ర ఏర్పాటుకు దారి తీస్తుందని కూడా సావర్కర్ ప్రకటించాడు. అయితే విశాలాంధ్రను ప్రజలే సంపాదించుకుంటారని ఆయన చెప్పారు. బహదుర్ యార్ జంగ్ ప్రకటనలపై ఆందోళన చెందిన ఆంధ్ర మహాసభ నాయకులు మద్రాసు రాష్ట్ర గవర్నరుని కలుసుకొని

ఈ విషయమై నిజానిజాలు తెలుపవలసిందిగా కోరగా ఆయన మౌనంగా ఉండిపోయాడు.

హద్దులేని అహంకారంతో, అహంభావంతో ప్రవర్తించే బహాదుర్ యార్ జంగ్ చర్యలకు అడ్డూ అదుపూలేకుండా పోయింది. 1943లో వరంగల్‌లో జరిగిన మజ్లిస్ వార్షికోత్సవ సభలో ఉపన్యసిస్తూ నిజాం నవాబుకే ఎసరు పెట్టాడు. 'ఈ రాజ్యం మొదటి నిజాం స్వంత ఆస్తికాదు. అలాగే 'ఆలాహజ్రత్' (7వ నిజాం) సొంత జాగీరు కాదు. ఈ రాజ్యం ఏ ఒక్కరి సొంతమో అనుకుంటే అందుకు బలి కావటానికి నేను సిద్ధంగా లేను. ఇది ముస్లిం ప్రజలందరి ఆస్తి. ఇది నా అభిప్రాయమే కాదు మజ్లిస్ అభిప్రాయం కూడా' అని చెప్పాడు.

బహదుర్ యార్ జంగ్ చేసిన ఈ ఉపన్యాసం నిజాం కళ్ళు తెరిపించింది. అందులో రెసిడెంటు ప్రమేయం కూడా లేకపోలేదు. అంతటితో ఒక సంవత్సరం వరకు బహదుర్‌యార్‌జంగ్ ఉపన్యాసాలపై నిషేధాజ్ఞలు జారీ అయ్యాయి. అందుకు నిరసనగా ఆయన తనకు లభించిన 'జంగ్, బహదుర్' బిరుదులను, జాగీరులను పరిత్యజించాడు. చివరకు బహదుర్ యార్‌ఖాన్‌గానే మిగిలిపోయాడు.

గొప్ప వక్త:

జాగీర్దారీ కుటుంబంలో పుట్టినా కష్టపడి పైకొచ్చిన వ్యక్తి బహాదుర్ యార్ జంగ్. చిన్నతనంలోనే ఇస్లాం మతగ్రంథాలన్నీ ఆపోశనపట్టాడు. ఆయన మహావక్త. విశ్వకవి టాగూరు, సరోజినీనాయుడు, జవహర్‌లాల్ నెహ్రూ మొదలైన అగ్రనాయకులు ఆయన వాగ్ధాటికి ముగ్ధులైనవారే. ఆయన ఉపన్యాసం వినటానికి ప్రజలు చెవికోసుకునే వారు. ఆయన పాకిస్తాన్ సంస్థాపకుడైన మహమ్మద్ అలీ జిన్నాకు ఆప్త మిత్రుడు. ముస్లింలీగ్ సమావేశాలలో ప్రత్యేక అతిథిగా పాల్గొని జిన్నా ఉపన్యాసాలను ఉర్దూలోకి అనువదించేవాడు. జిన్నా ఉపన్యాసాలకన్న ఆయన అనువాదాల ప్రభావమే ప్రజలమీద ఎక్కువ పనిచేసేది.

ఒకసారి ఢిల్లీలో అఖిల భారత ముస్లింలీగ్ సమావేశం జరుగుతున్నది. సభలో ఒక లక్షరూపాయల విరాళం సేకరించాలని జిన్నా సంకల్పం. వసూలైన డబ్బు లెక్కిస్తే కొన్ని వేలకు మించలేదు. జిన్నాకు ఏమీ పాలుపోక ముఖం చిన్నబుచ్చుకున్నాడు.

వేదికమీదికి బహదుర్ యార్ జంగ్ వచ్చాడు. 'చందాలు ఇవ్వలేనివారు దేశం ఎలా సంపాదించుకుంటారని' మహోద్రేకంగా ఉపన్యాసం ప్రారంభించాడు. అతని వాగ్ధాటికీ, వాదనా పటిమకు ముగ్ధులైన ప్రజలు తమ దగ్గర ఏ వస్తువు వుంటే దానిని వేదిక మీదికి విసిరేశారు. అలా చూస్తూ చూస్తూ ఉండగానే కొన్ని లక్షలు వసూలైనాయి. ఈ దృశ్యంతో ఆనందం పట్టలేని జిన్నా వేదిక మీదనే బహదుర్ యార్‌జంగ్‌ను ఆలింగనం చేసుకున్నాడు.

బహదుర్ యార్‌జంగ్ ఉద్దండ పిండం. ఆందోళనే ఊపిరిగా బతికాడాయన. మజ్లిస్‌కు ఆయన వాక్యమే శిరోధార్యం. నలభయ్యో ఏట అకాల మరణం చెందాడు. ఇంకా జీవించి ఉంటే ఏ స్థాయికి ఎదిగేవాడో ఊహించి చెప్పడం కష్టం. డెబ్బయి సంవత్సరాల వయస్సులో జిన్నా 'ఖాయిదె అజామ్' అయితే 40 ఏళ్ళకే బహదుర్ యార్ జంగ్ 'ఖాయిద-ఎ-మిల్లత్' అయి జిన్నాకు పోటీగా నిలిచాడు. ముస్లింలీగ్ రాజకీయాలను కూడా ఎక్కడ ఆక్రమించుకుంటాడోనని జిన్నా కూడా భయపడేవాడు.

మతగ్రంథాలను క్షుణ్ణంగా చదివినవాడు కనుక ముస్లిం ప్రజలపై ఆయన ప్రభావం అసాధారణం. అనితర సాధ్యము. బహదుర్ యార్‌జంగ్ మరణం స్వాభావికంగా జరుగలేదు. ఒక మిత్రుని ఇంట్లో హుక్కా పీలుస్తూ చనిపోయాడు. కాని విచారణలో ఇది వెల్లడి కాలేదు. ఈ సంగతి బయటపడకుండా విచారణ జరిపించారని ఆయన అనుయాయులు బాధపడ్డారు. బహదుర్ యార్‌జంగ్ మరణించిన తరువాత నిజాం నవాబు తన నిరంకుశ విధానాన్ని కాపాడుకోడానికి మజ్లిస్‌నే ఉపయోగించుకున్నాడు. నిజాం దృష్టిలో మజ్లిస్ రాజకీయ సంస్థ కాదు. అందువల్ల దానిపై నిషేధం లేదు. ❑

25. ఆర్యసమాజ్ పోరాటాలు

ఇస్లాంలోకి మత మార్పిడి ఉద్యమం ప్రారంభమైన తరువాత ఆర్యసమాజం రాష్ట్రంలో బలం పుంజుకుంది. ఈ సంస్థ ఉత్తర హిందూస్థానం నుంచి వచ్చింది. ఆ కాలంలో ఇది పంజాబు రాష్ట్రంలో చాలా బలంగా ఉండేది. సంస్థానంలోని ఆనాటి ప్రత్యేక పరిస్థితులలో ఇది బలపడింది. ఆర్యసమాజ్‌వారి పరిభాషలో 'మనం హిందువులం కాము. ఆర్యుల'మని చెప్పేవారు.

ఉత్తర హిందూస్థానంలో ఇస్లాం తాకిడికి తట్టుకోడానికి పంజాబులో సిక్కుమతం పెద్ద ఎత్తున వ్యాపిస్తున్న సమయంలో వైదిక మతాన్ని కాపాడటానికి ఆర్యసమాజాన్ని స్థాపించాడు దయానంద సరస్వతి. ఆయన గొప్ప పండితుడు. శ్రద్ధానందుడు వారి అమర వీరుల్లో ముఖ్యుడు.

హైదరాబాద్ సంస్థాన చరిత్రలో ఆర్యసమాజ్ కేవలం మత సాంఘిక సాంస్కృతిక సంస్థ మాత్రమే కాదు. విద్యా కార్యక్రమాలకే తన కార్యరంగాన్ని పరిమితం చేయలేదు. సంస్థాన స్వాతంత్ర్య పోరాటంలో కూడా ప్రధాన పాత్ర వహించింది. పండిత కేశవరావు కొరాట్కర్ 20వ శతాబ్ది తొలి దశకంలో ప్రజాహిత కార్యక్రమాలలో అగ్రగామిగా ఉండేవారు. ఆయన గొప్ప దేశభక్తుడు. ప్రముఖ న్యాయవాది. నిజాం ప్రభుత్వంలో హైదరాబాద్ హైకోర్టు న్యాయమూర్తిగా పనిచేశారు. కేశవరావు 1932 వరకు సంస్థాన ఆర్యసమాజ్ అధ్యక్షుడు. ఆర్యసమాజ్ ముఖ్య గ్రంథమైన 'సత్యార్థ ప్రకాశిక' తొలి తెలుగు అనువాదం 1921లో ప్రచురితమైంది.

సిద్దీకీ దీన్ దార్:

సంస్థానంలో 1923లో మతోన్మాదం వెర్రితలలు వేసింది. సిద్దీకీ దీన్‌దార్ అనే వ్యక్తి తనకు తాను చెన్న బసవేశ్వరుని అవతారంగా చెప్పుకుంటూ రామున్ని, కృష్ణున్ని నీచాతి నీచంగా విమర్శించేవాడు. ఈ సందర్భంగా ఆర్యసమాజ్ ప్రచారకులైన

మంగళ్‌దేవ్, పండిత రామచంద్ర దహేల్వీలు రాష్ట్రంలో పర్యటించి దీన్‌దార్ ప్రచారాన్ని ప్రతిఘటించారు. హిందూ వితంతువుల పునరుద్ధరణ కార్యక్రమాలను చేపట్టాలన్న ఉద్దేశంతో పండిత కేశవరావు హైదరాబాద్ రాష్ట్ర శాసనసభలో 1930లో ఒక తీర్మానం ప్రతిపాదించారు. అభివృద్ధి నిరోధకులైన హిందూ-ముస్లిం సభ్యులు ఏకమై దానిని ప్రతిఘటించారు. కొంతకాలానికి పండిత వినాయకరావు విద్యాలంకార్ నిరంతర పరిశ్రమవల్ల అది చట్టంగా మారింది.

కేశవరావు 1932 మే 21వ తేదీన పరమపదించారు. ఆయన మరణం ఆర్యసమాజ్‌కు తీరనిలోటు. ఆయన మరణానంతరం ఆయన కుమారుడు పండిత వినాయకరావు విద్యాలంకార్ ఆర్యసమాజ్‌కు అధ్యక్షుడై సంస్థ కార్యకలాపాలను దీక్షగా కొనసాగించారు. ప్రజా చైతన్యానికి నడుం బిగించిన ఆర్యసమాజ్ కార్యకలాపాలు నిజాం ప్రభుత్వానికి కన్నెర్ర కలిగించాయి. ఆర్యసమాజ్ కేంద్ర ప్రచారకులైన పండిత రామచంద్ర దహేల్వీ, చంద్రభానులను రాష్ట్రంలో పర్యటించకుండా నిషేధాజ్ఞలు జారీ చేసింది.

దానికి నిరసనగా కేంద్ర ఆర్యసమాజ్ ప్రతినిధి సభ 1934లో నిజాం ప్రభుత్వానికి నిరసన తెలుపగా ఆర్యసమాజ్ ప్రచారాలమీద సంస్థానంలో నిషేధాజ్ఞలు లేవని అది బుకాయించింది. పరిస్థితులను పరిశీలించటానికి నారాయణస్వామి, స్వామి స్వతంత్రానంద, ఆచార్య రాందేవులతో కూడిన ప్రతినిధివర్గం రాష్ట్రంలో పర్యటించింది. వారి పర్యటనలపై ఎలాంటి నిర్బంధాలు లేకపోయినా అటు తరువాత పరిస్థితులు పూర్వ స్థాయికి చేరుకున్నాయి.

1935లో బీదరు కలెక్టరు నిలంగాలో ఆర్య ప్రతినిధులపై దాడిచేసి హవన కుండాలను, మందిరాలను ధ్వంసం చేశాడు. దీనికి ఆర్యసమాజ్ తీవ్ర నిరసన తెలియజేయగా విచారణకొచ్చిన ఆనాటి హోంశాఖ కార్యదర్శి జువైదర్‌జంగ్‌కు సైతం కలెక్టర్ దుశ్చర్యలు కోపం కలిగించాయి. కలెక్టరు చర్యను నిందిస్తూ అతని స్వంత ఖర్చులతో మందిరాన్ని, హవనకుండాలను నిర్మించి పెట్టవలసిందని జువైదర్‌జంగ్ ప్రభుత్వానికి సిఫారసు చేశాడు.

సంస్థాన స్వాతంత్ర్య పోరాటంలో ఎక్కువ బాధలు అనుభవించినవారు ఆర్యసమాజ్ వారే. బ్రిటన్ పార్లమెంటులో సైతం ఈ విషయం ప్రస్తావించారు.

ఆర్యసమాజ్ వారు 1934లో 'వేదిక్ ఆదర్శ్' అనే పత్రికను ప్రచురించేవారు. అందులో పండిత నరేంద్రజీ వ్యాసాలు రాసేవారు. ఆయన వ్యాసాలు సంస్థానం ప్రభుత్వానికి కంటగింపుగా తోచాయి. సంవత్సరం తిరక్కుండానే ఆ పత్రికను ప్రభుత్వం ఆపు చేయించింది.

జి.వో. నం. 53:

వాక్ స్వాతంత్ర్యాన్ని అడ్డుకునే గస్తీ నిషాన్ 'తిర్పన్' (జి.వో.నెం. 53) 1937లో అమలులోకి వచ్చింది. హవనకుండాలు నిర్మించడానికి ప్రభుత్వం అనుమతి అవసరమనే ఉత్తరువు 1937లో జారీ అయింది. అయితే ఆ ఉత్తరువును ఆర్యసమాజ్‌వారు ఎన్నడూ ఖాతరు చేయలేదు. గుల్బర్గా పట్టణంలో ఒక హోలీ పండుగరోజు ముస్లిం వ్యక్తిపై రంగులు చల్లారనే నెపంతో ఘర్షణలు రేగాయి. లాల్‌సింగ్, హనుమంతరావు మొదలైన ఆర్యసమాజ్ కార్యకర్తలను అరెస్టు చేశారు. ఏప్రిల్ 16వ తేదీన ధూల్‌పేటలో జరిగిన సంఘటనల నుంచి తేరుకోటానికి ప్రజలకు చాలా సమయం పట్టింది. ఈ సందర్భంగా 21 మంది ఆర్యసమాజ్ కార్యకర్తలను అరెస్టు చేశారు. 1938 జనవరి 22న కల్యాణిలో ధర్మప్రకాశ్‌ను హత్య చేశారు. ఉద్గీర్‌లో బ్రహ్మాండంగా జరిగిన దసరా ఉత్సవాల సందర్భంలో శాంతి పరిరక్షణల నెపంతో శ్యాంలాల్‌ను అరెస్టు చేశారు. డిసెంబరు 17న ఆయన బీదర్ జైల్లో మరణించాడు. అతని మరణంపై ప్రభుత్వం విచారణ జరిపించలేదు.

నరేంద్రజీ అరెస్టు:

పండిత నరేంద్రజీ 1932 నుంచి ఆర్యసమాజ్‌తో సంబంధాలు పెట్టుకున్నాడు. 1938లో పండిత వినాయకరావు విద్యాలంకార్ ఇంట్లో సంప్రదింపులు జరుపుతుండగా ప్రభుత్వం పచ్చిమోసంతో ఆయనను అరెస్టు చేసి మన్ననూరు జైలుకు పంపింది. పండిత నరేంద్రజీ ఆ కాలంలో యువకుడు, మంచి వక్త. ఉత్తేజకరమైన ఆయన ఉపన్యాసాలు వినడానికి పెద్ద సంఖ్యలో యువకులు వచ్చేవారు. ప్రభుత్వం ఆయనంటే వణికిపోయేది. మన్ననూరును సంస్థానంలోని 'కాలాపానీ' అనేవారు. ఇది మహబూబ్‌నగర్ జిల్లాలోని నల్లమల అడవులలో అమరాబాద్ సమీపంలో ఉంది. ఆయన మన్ననూరు జైల్లో మూడు సంవత్సరాలు గడిపారు. విడుదలై రాగానే

సికింద్రాబాద్ సభలో ఉపన్యసిస్తుండగా ప్రభుత్వం నరేంద్రజీ మీద వాగ్బంధనం విధించింది. ప్రభుత్వ ద్రోహిగా ప్రకటించింది. ఆయన అరెస్టు అక్రమమని, వెంటనే నరేంద్రజీని విడుదల చేయాలని ఆర్యసమాజ్ కేంద్ర సంఘం ఎన్ని విన్నపాలు చేసినా ప్రభుత్వం పట్టించుకోలేదు.

షోలాపూర్‌లో 1938లో జరిగిన అఖిలభారత ఆర్యమహాసభలో హైదరాబాద్ సమస్య చర్చకు వచ్చింది. జనవరి 20వ తేదీన దేశవ్యాప్తంగా హైదరాబాద్ విమోచన దినం'గా పాటించాలని సభ విజ్ఞప్తి చేసింది. ఈ తీర్మానం ప్రకారం దేశమంతటా ఆందోళనలు మొదలైనాయి. 1939 జనవరి 31న మహాత్మా నారాయణస్వామి సత్యాగ్రహం చేయడానికి హైదరాబాద్ సంస్థాన సరిహద్దుల్లో ప్రవేశించగానే నిజాం పోలీసులు ఆయనను అరెస్టు చేసి షోలాపూర్‌లో విడిచి పెట్టారు. స్వామీజీకివి ఓ లెక్కా? ఆ తరువాత ఆయన 20 మంది వాలంటీర్లను వెంట పెట్టుకుని గుల్బర్గాలో సత్యాగ్రహం చేశారు. వారందరినీ ప్రభుత్వం నిర్బంధంలోకి తీసుకుని ఒక సంవత్సరం కఠిన శిక్ష విధించింది. వారి రెండవ సత్యాగ్రహం జట్టుకు కున్వర్ ప్రసాద్, మూడవ జట్టుకు కుష్‌హాల్ రాజ్, నాల్గవ జట్టుకు రాజ్‌గురు ధీరేంద్రనాథ్ శాస్త్రి నాయకత్వం వహించి అరెస్టయ్యారు. ఒకవంక ఆర్యసమాజ్ కార్యకర్తలపై నిర్బంధాలు ఎంత తీవ్రమయ్యాయో వారిలో అంతకంటె ఎక్కువ ఉత్సాహం పెరుగుతూ వచ్చింది. ప్రభుత్వం ఆర్యసమాజ్ నాయకులతో మంతనాలు జరపటానికి సిద్ధమవుతూ అదే సమయంలో ఇత్తేహాదుల్ ముసల్మీన్ సంస్థ వాతావరణాన్ని సంక్షోభితం చేసింది. అందువల్ల ప్రభుత్వం అనుకున్న చర్చలు కొనసాగలేదు. దీనితో ఆర్యసమాజ్ తన పోరాట క్రమానికి పదును పెట్టింది. వారి ఐదవ జట్టుకు పండిత వేదవ్రత, ఆరవ జట్టుకు మహాశయ కృష్ణ, ఏడవ జట్టుకు జ్ఞానేంద్ర నాయకత్వం వహించారు. వారి ఎనిమిదవ సత్యాగ్రహ బృందానికి వినాయకరావు విద్యాలంకార్ నాయకత్వం వహించవలసి ఉండగా ఈలోగా ప్రభుత్వం కొన్ని రాజకీయ సంస్కరణలను ప్రవేశపెట్టడానికి సిద్ధంగా ఉందని ప్రకటించడంతో ఇతర రాజకీయ పార్టీలతో సహా ఆర్యసమాజ్ కూడా తన ఉద్యమాలను తాత్కాలికంగా విరమించుకోవలసి వచ్చింది. రాష్ట్ర విమోచన పోరాటంలో దాదాపు 12 వేల మంది ఆర్యసమాజ్ కార్యకర్తలను వివిధ సందర్భాలలో అరెస్టు చేశారు.

నిర్బంధంలో ఉన్న ఆర్యసమాజ్ డిటెన్యూలకు కలిగిన బాధలు వర్ణనాతీతం. జైల్లో వారికి భోజన సదుపాయాలు ప్రభుత్వం సరి అయిన పద్ధతిలో సమకూర్చలేదు. వారనేక చిత్రహింసలకు లోనయ్యారు. గాయాలకు చికిత్సనైనా వారు నోచుకోలేదు. ఉద్యమాలను తాత్కాలికంగా విరమించుకున్న రోజులలో ఆర్యసమాజ్ నిర్మాణాత్మకమైన కార్యక్రమాలను చేపట్టింది. 1939లో కేశవ మెమోరియల్ హైస్కూల్ ఏర్పడింది.

సంస్థాన ఆర్యసమాజ్ సంస్థకు 1941లో పండిత వినాయకరావు విద్యాలంకార్ అధ్యక్షులుగా, పండిత నరేంద్రజీ కార్యదర్శిగా ఎన్నికయ్యారు. తన కార్యకలాపాలలో తాత్కాలిక విరామమిచ్చినా ఆర్యసమాజ్‌పై నిఘాదాడులు తప్పలేదు. గుల్బర్గా జిల్లా దామరగిద్దలో 'ఓం' జెండాలను నిషేధించారు. నాందేడు జిల్లా ఉమ్రీలో గంగారాం, గణపతిరావు, దత్తాత్రేయ అనే కార్యకర్తలను కొందరు పఠాన్లు చంపివేశారు. 1941 జూన్ 4వ తేదీన అలంద్‌లోని ఆర్యసమాజ్ మందిరాన్ని మూసివేయించారు. పద్నాలుగుమంది కార్యకర్తలను అరెస్టు చేశారు. అహమద్‌పూర్, చాకూర్‌లలో ఉన్న వారి పాఠశాలను మూసి వేయించారు. సాకుత్‌లోని కార్యకర్తలను హవన పాఠశాలను ప్రారంభించనీయలేదు. గోరంత అవకాశం లభించినా కొండంత శిక్షతో ఆర్యసమాజ్ కార్యకర్తలను ప్రభుత్వం హింసించేది.

1942-43 మధ్యకాలంలో ఆర్యసమాజానికి ఎన్నో దారుణ పరిస్థితు లెదురైనాయి. కార్యకర్తలు తమ ప్రాణాలను అరచేతిలో పెట్టుకుని జీవించారు. స్థానిక ఉర్దూ పత్రికలు ఆర్యసమాజ్ కార్యక్రమాలపై విషం కక్కాయి. ఆర్యసమాజ్ మతశక్తులతో కూడిన సంస్థ అని మజ్లిస్ ఎంత ప్రచారం చేసినా ప్రజలు నమ్మలేదు. వాస్తవంలో ఆర్యసమాజ్ వారు స్టేటు కాంగ్రెస్‌తో భుజం భుజం కలిపి స్వాతంత్ర్య పోరాటంలో వీరోచితంగా పోరాడారు.

అల్టిమేటమ్:

ఉద్గీర్‌లో 1942లో జరిగిన ఆర్యప్రతినిధి సభలో పండిత వినాయకరావు అధ్యక్షులుగా, పండిత నరేంద్రజీ కార్యదర్శిగా తిరిగి ఎన్నికయ్యారు. ఈ సమావేశంలో 12 తీర్మానాలు ఆమోదించబడ్డాయి. అందులో రాజ్యాంగ సంస్కరణల అమలుపై ప్రభుత్వం ముందుకు రాలేకపోవడం ముఖ్యమైనది. రాజ్యాంగ సంస్కరణలను ప్రభుత్వం

వెంటనే ప్రవేశపెట్టని యెడల దానివల్ల సంభవించే వ్యతిరేక పరిణామాలకు ప్రభుత్వమే బాధ్యత వహించవలసి ఉంటుందని హెచ్చరిక చేశారు.

బీదరు జిల్లా అవురాద్‌లో కొన్ని హిందువుల దుకాణాలను దుండగులు తగుల బెట్టారు. దీన్ని ప్రతిఘటించిన ఒక హిందూ కార్యకర్తను చంపివేశారు. ఈ సంగతి విని ఎంతో బాధపడ్డ మహాత్మాగాంధీ. బాధితులకు సహాయంగా 1500 రూ॥ల విరాళం పంపించారు. ఆర్యసమాజ్ రెండు వేలిచ్చింది. హుమ్నాబాద్‌లో 1942 మార్చి 3వ తేదీన ఆర్యుల ఊరేగింపు ప్రశాంతంగా జరుగుతుండగా శివచంద్రతో సహా అతని ముగ్గురు అనుచరులను మతోన్మాదులు చంపివేశాయి. నాగర్‌కర్నూలు, హింగోలీలలో మతకలహాలు జరిగితే ప్రభుత్వం ఒకే మతం వారిని నిర్బంధించి తన పక్షపాత ధోరణిని బహిరంగపరచుకుంది. జోగీపేట, తారాఖేడ్‌లలో ఇలాంటి సంఘటనలే జరిగాయి. 1942 డిసెంబర్‌లో గుల్బర్గా పట్టణంలో హిందువుల దుకాణాలను దోచుకోగా పోలీసులు నోరుమెదపలేదు. ఆ సంవత్సరం నిజామాబాద్‌లో జరిగిన మత కలహాల విచారణకు ప్రభుత్వం పూనుకోలేదు. 1944 నాటికి సంస్థానంలో 300 ఆర్యసమాజ్ శాఖలు స్వాతంత్ర్యోద్యమంలో పాల్గొన్నట్లు లెక్కలు తేల్చారు. 1945లో గుల్బర్గాలో జరిగిన ఆర్యసమాజ్ వార్షిక సమావేశంలో పాల్గొంటున్న వాలంటీర్లమీద లాఠీఛార్జీ జరిపారు. ఈ సందర్భంలో పండిత నరేంద్రజీ తీవ్రంగా గాయపడ్డారు.

భారతదేశానికి 1947 ఆగష్టు 15న స్వాతంత్ర్యం లభిస్తే నిజాం నవాబు కూడా తనకు స్వాతంత్ర్యం లభించిందని పగటి కలలు కన్నాడు. హైదరాబాద్ సంస్థానం వెంటనే భారత యూనియన్‌లో కలిసిపోవాలని గర్జించిన పండిత నరేంద్రజీని పోలీసులు అరెస్టు చేశారు. పర్కాలలో 1947 సెప్టెంబరు 2న జరిగిన జాతీయ పతావిష్కరణ సభలో 1500 మంది పాల్గొన్నారు. పోలీసులు కాల్పులు జరుపగా ఎందరికో గాయాలయ్యాయి.

1947 ఆగష్టు 15 లగాయతు 1949 సెప్టెంబరు మధ్య ఎన్నో దారుణ సంఘటనలు జరిగాయి. రజాకార్ల బాధలు పడలేక సంస్థాన ప్రజలు షోలాపూర్, పండరీపూర్, బర్సీ, బీజాపూర్, ఉమర్‌ఖేడ్, బుల్దాన, అమరావతి, విజయవాడలలో తాత్కాలిక శిబిరాలు ఏర్పాటు చేసుకొని తలదాచుకున్నారు. వీరికి ఆర్యసమాజ్

యథోచితంగా ఆర్థిక సహాయమందించింది. వినయకుమార్, సత్యనారాయణసింగ్, మదన్‌మోహన్ మొదలైన వారు రజాకార్ల రహస్య సమాచారాన్ని సేకరించి పండిత వినాయకరావుకు అందజేసేవారు. ఈ సంగతి తెలియగానే ప్రభుత్వం వినాయకరావుని అరెస్టు చేసింది. వందేమాతరం సోదరులు తమకు ఎదురయ్యే ప్రమాదాలను కూడా లెక్కపెట్టకుండా సిడ్నీకార్టన్ రహస్య చర్యలను, అతడు విదేశాల నుంచి చేరవేస్తున్న ఆయుధాల సమాచారాన్ని భారత ఏజెంట్ జనరల్ కె.యం. మున్షీకి అందజేసేవారు. పోలీసు చర్యవరకు మహాత్మ ఆనందస్వామి ప్రతినెల దేశభక్తులకు రెండువేల విరాళం పంపేవారు.

హైదరాబాద్‌లో ఆర్యసమాజ్ కేంద్రకార్యాలయం ఉండేది. కొన్ని జిల్లాలలో శాఖలు ఏర్పాటు చేసుకున్నారు. తరువాతి కాలంలో కొన్ని తాలూకా కేంద్రాలకు వ్యాపించింది. ప్రభుత్వం మద్దతు ఉన్న ముస్లింల ఒత్తిడిని తట్టుకోలేని వర్తకులు కొందరు దీన్ని ఆశ్రయించారు. మార్వాడీలు, ఉత్తర హిందూస్థానీయులు దీనికి వత్తాసుగా ఉండేవారు. హైదరాబాద్ నగరంలో తప్ప తెలంగాణాలో దీని బలం స్వల్పం.

ఆర్యసమాజ్ మతపరమైన సంస్థ. గాంధీజీ అహింసా సిద్ధాంతాన్ని తీవ్రంగా వ్యతిరేకించిన ఆ సంస్థ సభ్యులు రాజకీయాలలో పాల్గొనేవారు. పండిత వినాయకరావు విద్యాలంకార్ ఆ కాలంలో సంస్థాన ఆర్యసమాజ్ నాయకుడు. తదుపరి ఆయన బూర్గుల రామకృష్ణారావు మంత్రివర్గంలో సభ్యుడు. నిజాం ప్రభుత్వం మారి దాని స్థానంలో కాంగ్రెస్ ప్రభుత్వం రావడంతో ఈ సంస్థకు రాజకీయాలలో స్థానం లేకుండా పోయింది. ❑

26. స్వాతంత్ర్యోద్యమాలు

హైదరాబాద్ రాష్ట్ర స్వాతంత్ర్యోద్యమం ఎన్నో ఒడుదుడుకులకు గురైంది. భారతదేశమంతటా వ్యాపించిన ఉద్యమం హైదరాబాద్ రాష్ట్రంలో కూడా ప్రజ్వరిల్లింది. హైదరాబాద్ నిజాం బ్రిటిష్ వారితో 1800వ సంవత్సరంలో చేసుకున్న ఒక ఒప్పందంతో హైదరాబాద్ స్వాతంత్ర్యం అంతరించిపోయింది. స్వాతంత్ర్యోద్యమం అప్పటినుండే ప్రారంభమైందని చెప్పవచ్చు. ఆ స్వాతంత్ర్య సమరం 1948 సెప్టెంబరు 17వ తేదీన చారిత్రాత్మకమైన పోలీసు చర్యతో ముగిసింది. ఎన్నో ఉద్యమాలు జరిగాయి. ఎంతోమంది నాయకులు తిరుగుబాటు లేవదీశారు. ప్రతి సంఘటన, ప్రతి ఉద్యమం ప్రజల స్వాతంత్ర్య కాంక్షకు దోహదం కలిగించింది. మధ్యతరగతి ప్రజలలో విద్యావ్యాప్తి, రహదారులు, కమ్యూనికేషన్లు, పాఠశాలలు, గ్రంథాలయాలు, విద్యా సదస్సులు - ఇవన్నీ 1885 నుంచి 1920 వరకు ఆవిర్భవించాయి. రాష్ట్ర స్వాతంత్ర్య చరిత్రకు ఇవి కారణభూతమైనాయి.

రాష్ట్రంలో కాంగ్రెస్ మొదటి కార్యకర్త రామచంద్ర పిళ్ళై. ఆయన సికింద్రాబాద్‌లో విద్యా, సాంఘిక కార్యక్రమాలు నిర్వహించేవాడు. 1902లో వైస్రాయ్ లార్డ్ కర్జన్ హైదరాబాద్ వచ్చినప్పుడు బిరార్‌ను బ్రిటిష్ ప్రభుత్వానికి శాశ్వతంగా దత్తం చేసినట్లు ఒప్పందం కుదుర్చుకున్నాడు. ఈ ఒప్పందం తీరు తెన్నులు చూసి హైదరాబాద్ ప్రజలు దిగ్భ్రమ చెందారు. బ్రిటిష్‌వారిపై ఉన్న సదభిప్రాయం పూర్తిగా తొలగిపోయింది. బ్రిటిష్ ఇండియాలో స్వదేశీ ఉద్యమం చెలరేగినప్పుడు 1906-07 మధ్య ఇక్కడ ఎన్నో సభలు జరిగాయి. విదేశీ వస్తు బహిష్కరణకు ప్రజలు ముందుకు వచ్చారు.

ఈ సందర్భంగా గొప్ప సంస్కృత పండితుడైన శ్రీపాద దామోదర్ సత్వాల్కర్ రాసిన విషయాన్ని పేర్కొనడం అనుచితం కాదు. ఆయన హైదరాబాద్‌లో 1901

నుంచి 1906 వరకు ఉన్నాడు. 'హైదరాబాద్ స్వాతంత్ర్యోద్యమం' నాల్గో సంపుటంలో ఆయన గురించి కొంత సమాచారం లభ్యమవుతుంది. 'నాసిక్‌లో కలెక్టర్ జాక్సన్ పైన ఎవరో కాల్పులు జరిపారు. దీనికి కారణం హైదరాబాద్ నుంచి నాసిక్‌కు వచ్చిన ఒక యువకుడు. అతడు సుమారు 60 మంది యువకులకు విప్లవ భావాలు నూరిపోశాడు. వారిలో ఒకడు కలెక్టరుపై తుపాకి పేల్చాడు. హైదరాబాద్ నుంచి వచ్చిన ఆ యువకుడెవరో నాకు బాగా తెలుసు'. ఈ ప్రకారంగా నాసిక్ విప్లవకారులతో హైదరాబాద్‌కు సంబంధం ఏర్పడింది. నిజాం రాష్ట్రం విప్లవ వీరులకు పుట్టిల్లు. జర్మనీ, ఇటలీ మున్నగు దేశాలనుంచి ఆయుధాలు రాసాగాయి. అతి చాకచక్యంతో వారక్కడికి తెచ్చేవారు. బ్రెన్‌గన్ ఫ్యాక్టరీకి హైదరాబాద్ స్థావరమనే విషయం చాలా మందికి తెలియదు.

హైదరాబాద్‌లోని ధనిక విద్యార్థులు ఉన్నత విద్యకోసం అలీఘర్ వెళ్ళేవారు. అప్పటికి ఉస్మానియా విశ్వవిద్యాలయం లేదు. నగరంలో వున్న నిజాం కళాశాల ఒక్కటే రాజ్యమంతటికి ఉన్నత విద్యాలయం. అది మదరాసు విశ్వవిద్యాలయం అధీనంలో ఉండేది. ఆ రోజుల్లో అలీఘర్ జాతీయ భావాలకి నిలయమై కాంగ్రెస్ ఖిలాపత్ ఉద్యమాలకి కేంద్రమైంది. ఆ ప్రభావంతో చాలామంది ముస్లిం విద్యార్థులు జాతీయోద్యమంలో ప్రవేశించి చదువుకు స్వస్తి చెప్పారు. వారిలో ముఖ్యులు– మక్బూల్ అలీ, మహమ్మద్ హుస్సేన్, యూసఫుద్దీన్, మీర్ అక్బర్ అలీఖాన్, హమీదుద్దీన్, మహమూద్, ఫక్రుద్దీన్ మసూద్, సయ్యద్ మహమ్మద్ అన్సారీ– వీరిలో చాలామంది తరువాత నిజాం ప్రభుత్వంలో పెద్ద ఉద్యోగాలు చేసి రిటైరైనారు.

బ్రిటిష్‌వారు పన్నిన పన్నాగాలలో ఒకటి హైదరాబాద్ నిజాం, టర్కీ సుల్తాన్‌ల వియ్యం. ఒకవైపు సుల్తాన్ని పదవీభ్రష్టుడ్ని చేసి, దరిద్రుడ్ని చేసి, బెంగుళూరులో ఆశ్రయమిప్పించారు. ఈ పరిస్థితుల్లో కాంగ్రెస్ నాయకుడు షౌకత్‌అలీ, సర్ అక్బర్ హైదరలీ కలిసి ఒక ఆలోచన చేశారు. దానికి నిజాంను ఒప్పించారు. నిజాం పెద్దకొడుకు బిరారు యువరాజుకి సుల్తాన్ కుమార్తె దురూషవర్ని ఇచ్చి వివాహం చేయించారు. సుల్తాన్ సోదరుడి కుమార్తె నిలోఫర్‌ని నిజాం రెండో కుమారునికి ఇప్పించారు. అంతకు మినహా ఖిలాపత్ ప్రభావం హైదరాబాద్‌లో లేదు.

1918లో హైదరాబాద్ జిల్లా కాంగ్రెస్ సంఘం ఏర్పడింది. దీనికి అధ్యక్షుడు వామన్ నాయక్ అనే మహారాష్ట్ర సంపన్నుడు. ఈ సంఘం 15 సంవత్సరాలు పని చేసింది. ఈ సంఘం తరపున కాంగ్రెస్ మహాసభలకి కొందరు వెళ్ళేవారు. మాడపాటి హనుమంతరావు, బూర్గుల రామకృష్ణారావు, కొండా వెంకటరంగారెడ్డి ఆ విధంగా కాంగ్రెస్ సభలకు హాజరైన వారిలో కొందరు. ఎన్నిసార్లు ప్రయత్నించినా ప్రభుత్వం అనుమతించని కారణంగా చివరకు 1931లో బరార్‌లోని అకోలాలో ప్రథమ హైదరాబాద్ రాష్ట్ర రాజకీయ మహాసభ జరిగింది. ఈ మహాసభకు న్యాయమూర్తి రామచంద్ర నాయక్ అధ్యక్షుడు. ఈ స్థాయి సంఘం చెప్పుకోతగినంత పని కొనసాగించినట్లు కనిపించదు.

ఈ ఉద్యమ నాయకుల పట్ల ప్రభుత్వం చతుర్విధోపాయాలను ప్రయోగించింది. కేశవరావు, అస్గర్ యార్‌జంగ్, రామచంద్ర నాయక్ గార్లను హైకోర్టు న్యాయమూర్తులుగా నియమించింది. శర్మను సంస్థానం వెలుపలికి పంపించింది. మరికొందరిని నయాన, భయాన చీలదీసింది.

మహాత్మాగాంధీ నాయకత్వాన 1930–32 మధ్య జరిగిన శాసనోల్లంఘనోద్యమం హైదరాబాద్‌లో చాలామంది యువకులను ఆకర్షించింది. హైదరాబాద్‌లో తగిన ప్రోత్సాహకరమైన వాతావరణం లేక చాలామంది బొంబాయి, మద్రాసు, కాకినాడ వంటి ప్రదేశాలకు వెళ్ళి ఉప్పు సత్యాగ్రహంలోను, ఇతర ఉద్యమాలలోను పాల్గొన్నారు. కారాగారవాసాలను అనుభవించి హైదరాబాద్‌కు తిరిగి రాగానే వారిలో స్వాతంత్ర్యోద్యమంలో పాల్గొనాలనే కాంక్ష ప్రబలింది. వీరి ప్రోత్సాహం వల్ల చాలామంది యువకులు, కార్యకర్తలు ముందుకొచ్చారు.

1935లో భారత రాజ్యాంగ చట్టం వచ్చింది. దీని ప్రభావం హైదరాబాద్ మీద పడింది. ప్రభుత్వం కొన్ని సవరణలు చేయాలని ముందుకొచ్చింది. అందుకని దివాన్ బహాదుర్ ఆరావముదు అయ్యంగార్ అధ్యక్షతన రాజ్యాంగ సవరణలకు తగిన సూచనలుచేయడానికి ఒకసంఘాన్ని నియమించింది. ప్రజల్లో కొంత ఆశ రేకెత్తించింది. అయ్యంగార్ కమిటీకి ప్రజల పక్షాన సూచనలు చేయవలెననే సంకల్పం రాజకీయ ఆలోచనలు చేయగల మేధావులకు తట్టింది. హైదరాబాద్ ప్రజాపరిషత్తు శ్రీ మాడపాటి

హనుమంతరావు అధ్యక్షతన సమావేశమైనది. ఆ సమావేశంలో హైదరాబాద్ ప్రభుత్వ రాజ్యాంగం ఆసఫియా ఛత్రచ్ఛాయలో బాధ్యతాయుత ప్రభుత్వం ఏర్పరచాలని ఏకగ్రీవంగా తీర్మానించింది. ఈ ప్రయత్నాన్ని చూసి ప్రభుత్వం వెరగొందింది. దీన్ని భగ్నపరచాలని దీక్షపట్టింది. బహాదుర్ యార్‌జంగ్‌ను లోబరచుకుని పాక్షికంగా ఉపయోగించుకుంది. శాసన సభలోని అనధికార ప్రాతినిధ్యంలో మజ్లిస్ నాయకుడు బహాదుర్ యార్‌జంగ్ సగం ముస్లింలకీయాలని, అంజుమన్ ఇత్తెహాదుల్ ముసల్మీన్‌ను ఏకైక ముస్లిం సంస్థగా సభలో గుర్తించాలని పట్టుబట్టాడు. కానీ బహదుర్ యార్‌జంగ్ సూచనలను ఇతర సభ్యులు అంగీకరించలేదు. బాధ్యతాయుత ప్రభుత్వానికి ఎదురు తిరిగారు. ప్రజాపరిషత్తు అంతటితో విచ్ఛిత్తి అయింది.

స్టేటు కాంగ్రెసు:

ప్రజాపరిషత్తు విచ్ఛిత్తి అయిన ఫలితంగా సంస్థాన స్థాయిలో ఒక రాజకీయ వేదిక ఉండాలనే అభిప్రాయం ఆంధ్ర, మహారాష్ట్ర, కర్నాటక నాయకులందరిలోను ఉదయించింది. మైసూరు సంస్థానంలో స్టేటు కాంగ్రెసు ఏర్పడి, పనిచేస్తుండడం ఈ అభిప్రాయానికి దోహదం చేసింది. 1938 జనవరి 29న కొందరు రాజకీయ కార్యకర్తలు సమావేశమై హైదరాబాద్ స్టేటు కాంగ్రెస్ అనే సంస్థను స్థాపించుకోవాలనే అభిప్రాయానికొచ్చారు. తాత్కాలిక సమితి ఏర్పడింది. 1938 ఆగష్టు నెలలో సమితి తన ఆశయాలను వివరిస్తూ ఒక కరపత్రాన్ని ప్రచురించింది. ఈ ప్రయత్నం జరుగుతుండగానే 1938 ఆగష్టు 23న అప్పటి ప్రధాని అక్బర్ హైదరీ హఠాత్తుగా లెజిస్లేటివ్ కౌన్సిల్‌లో చిలువలు పలువలు కల్పించి హైదరాబాద్ స్టేటు కాంగ్రెసుపై మత పాక్షిక సంస్థ అనే అభాండం వేసి నిషేధించడం జరిగింది. ఈ ఆరోపణ నిరాధారమైందని చెప్పడానికి ఎన్ని విన్నపాలు స్టేటు కాంగ్రెస్ సభ్యులు చేసినా అవి చెవిటివాని ముందు చేసిన శంఖనాదాలైనాయి. చివరకు ప్రభుత్వ నిషేధాన్ని ఉల్లంఘించి, సంస్థను స్థాపించాలని కార్యకర్తలు నిర్ణయం చేసుకున్నారు. స్వర్గీయ గోవిందరావు నానల్ 1938 అక్టోబరు 24న తనకు తాను ఈ సంస్థ ప్రథమ అధ్యక్షుడుగా ప్రకటించుకుని శాసనోల్లంఘనం చేశాడు. ఆయనతోపాటు మరో నలుగురు కార్యకర్తలు– 1) రామకృష్ణ ధూత్, 2) జనార్దనరావు దేశాయి, 3) రావి

నారాయణరెడ్డి, 4) శ్రీనివాసరావు బొరీకర్ తమను సభ్యులుగా ప్రకటించుకున్నారు. ఇది హైదరాబాద్ రాజకీయ చరిత్రలో స్వర్ణాక్షరాలతో లిఖించదగిన ఘట్టం. తదాదిగా హైదరాబాద్ రాజకీయోద్యమ స్వరూపమే మారిపోయింది.

ఈ శాసనోల్లంఘనోద్యమం త్వరితగతిన రాష్ట్రమంతటా వ్యాపించింది. ఇంచుమించు ఇదేకాలంలో ప్రారంభమైన మైసూరు, తిరువన్కూరు, రాజకోట సంస్థాన ప్రజా ఉద్యమాలు అత్యంత వేగంతో పురోగమించడం హైదరాబాద్ సంస్థానానికి నూతనోత్సాహాన్ని రేకెత్తించింది. కొన్నివందల మంది సత్యాగ్రహులు కారాగార శిక్షలు అనుభవించారు. ఉద్యమం ఉన్నతస్థాయిని అందుకొనే దశవరకు వచ్చినది.

ఈ దశలో ఆర్యసమాజము, హిందూమహాసభ సత్యాగ్రహోద్యమాన్ని మొదలు పెట్టాయి. హిందువుల ప్రాథమిక హక్కులకు భంగం వాటిల్లుతున్నది. కాబట్టి వాటిని నివారించడానికి ఈ రెండు సంస్థలు శాసనోల్లంఘనం ప్రారంభించాయి. ఈ సంస్థలు ఉద్యమం కేవలం రాష్ట్రవాసులకే పరిమితం కాకుండా, బయటినుండి దళాలను సంస్థానంలోకి పంపించడానికి కూడా పూనుకున్నాయి. ఈ మూడు ఉద్యమాలు ఒకే కాలంలో జరగటం వలన ప్రభుత్వం ఈ మూడు ఉద్యమాలను ఒకే సూత్రంతో బంధించి కాంగ్రెసు ఉద్యమానికి ఇది త్రిరూప ఉద్యమమన్నారు. ఇనుముతో అగ్నికి వలె స్టేటు కాంగ్రెసుకున్న ఇతర సంస్థలతోపాటు మతపాక్షికతా నెపానికి గురికాక తప్పలేదు. అందుకని స్టేటు కాంగ్రెసు ఉద్యమం రెండు నెలలు సాగిన తరువాత మహాత్మాగాంధీ సలహా ననుసరించి ఈ ఉద్యమాన్ని తాత్కాలికంగా నిలిపి వేయవలసి వచ్చింది.

కానీ దీనికి ప్రజల ఆమోదం లభించలేదు. ప్రజాప్రవాహాన్ని ఆపడం సాధ్యం కాదని ఎరిగిన గాంధీజీ మరో పిలుపునిచ్చారు. పోరాటానికి సత్యాహింసలపై విశ్వాసం ఉన్న ఒక్కయోధుడైనా చాలన్నాడు. అందుకు స్వామీ రామానందతీర్థ సిద్ధమయ్యాడు. స్వామిజీ చేతులు మీదుగా ఉద్యమం ఎన్నో మలుపులు తిరిగింది.

వందేమాతరం ఉద్యమం:

స్టేటు కాంగ్రెసుపై నిషేధం తొలగించాలన్న సత్యాగ్రహోద్యమం అన్ని జిల్లాలకు వ్యాపించింది. ప్రజలలో గొప్ప సంచలనం కలిగింది. ఇంతకు మునుపెన్నడూ ఇంత

పెద్ద పెట్టున ప్రభుత్వపు ఆజ్ఞలను ధిక్కరించటం, అరెస్టులు కావటం జరగలేదు. ఈ ఉద్యమం ప్రభావం విద్యార్థులపై కూడా పడింది. యువజనులు, విద్యార్థులు అనేకులు ఈ ఉద్యమంలో పాల్గొన్నారు.

ఆ రోజుల్లో హైదరాబాద్ సంస్థానం అంతటా పాఠశాలల్లో ప్రతిరోజు ఉదయం తరగతులు ప్రారంభం కావడానికి ముందు నిజాం రాజును కీర్తిస్తూ ప్రార్థనా గీతం పాడటం జరిగేది. అది ఇలా ఉండేది.

తా అబ్ద్ కాలిక్ ఆలమ్ ఏరియాసత్ రఖ్ఖే
తుజ్‌కు ఉస్మాన్ భస్ద్ ఇజ్లాల్ సలామత్ రఖ్ఖే...

'భగవంతుడు నిజాం రాజ్యాన్ని చల్లగా చూచుగాక, అల్లా నిజాం రాజుకు శుభములు చేకూర్చుగాక'.. అనేది ఈ గీతం తాత్పర్యం. జాతీయోద్యమం ప్రభావం, స్టేటు కాంగ్రెసు సత్యాగ్రహోద్యమ ప్రభావంవల్ల విద్యార్థులు వందేమాతరం గీతాన్ని పాడసాగారు. నిజాంరాజును స్తుతిస్తూ పాడే ప్రార్థనలో పాల్గొనని విద్యార్థులను అధికారులు పాఠశాలలనుంచి బహిష్కరించారు.

1938వ సంవత్సరంలో దసరా పండుగనాడు ఉస్మానియా విశ్వవిద్యాలయం 'బి' హాస్టలు విద్యార్థులు సమావేశమైనప్పుడు వందేమాతరం గీతాన్ని పాడుకున్నారు. ఆ తరువాత ప్రతిరోజూ రీడింగ్ రూంలో సమావేశమైనప్పుడు వందేమాతరం గీతాన్ని మరికొన్ని భక్తిగీతాలను పాడుకోవడం మొదలు పెట్టారు. ఈ సమావేశాలలో ఎక్కువమంది హిందువులే ఉండేవారు. ఈ విషయం తెలిసిన వసతి గృహం అధికారులు వందేమాతరం గీతం రాజకీయాలకు సంబంధించినదనీ విద్యార్థులు రాజకీయాలతో సంబంధం పెట్టుకోకూడదని ఒక సర్క్యులర్ జారీ చేశారు. విద్యార్థులెవరూ ఈ సర్క్యులర్‌ను ఖాతరు చేయలేదు.

1937 మిలాదున్నబి ఉత్సవాల సందర్భంగా యూనివర్శిటీ హాస్టల్‌లో సభ జరిగింది. మౌలానా నజీరుల్ హసన్ జీలానీ అనే దీన్యాత్ ప్రొఫెసర్ 'ఈ దేశంలో, గోబర్ పరస్త్' (గోపేడ పూజించేవారు) 22 కోట్ల మంది ఉన్నారంటే బాధకలుగుతుందని పరిహసించి చేసిన ప్రసంగం హిందూ విద్యార్థులపై కారం చల్లినట్లు చేసింది. దీన్ని హిందువులు సహించలేకపోయారు. 1938 సెప్టెంబర్‌లో ఏ హాస్టల్ విద్యార్థులు

వందేమాతరం ఉద్యమం లేవదీశారు. 1938 సం॥ నవంబర్ 28వ తేదీన వందేమాతరం చదువవద్దని ఉత్తర్వులు జారీ అయ్యాయి. విద్యార్థులు ఈ సర్క్యులర్‌ను పెడచెవిని పెట్టారు. ఈ గీతం పాడేవారి సంఖ్య క్రమేణా రోజు రోజుకు ఎక్కువ కాజొచ్చింది. దీని పర్యవసనాంగా 1938 నవంబర్ 29వ తేదీన హాస్టల్‌లో నివసించే హిందూ విద్యార్థులందరినీ కళాశాలనుంచి బహిష్కరించడం జరిగింది. హాస్టలు గదులను వారు వెంటనే ఖాళీ చేసి వెళ్ళవలెనని యూనివర్సిటీ అధికారులు విద్యార్థులకు నోటీసు జారీ చేశారు.

హాస్టల్‌లో నివసించే విద్యార్థుల పట్ల విశ్వవిద్యాలయాధికారుల ఈ అనుచిత చర్యకు వ్యతిరేకంగా యూనివర్సిటీ విద్యార్థులు సమ్మెకు దిగారు. అందులో అత్యధిక సంఖ్యాకులు హిందువులే. రెండు రోజుల సమ్మె తరువాత యూనివర్సిటీ గేట్ల ముందు పికెటింగ్ జరిగింది. ఈ వార్త హైదరాబాద్ సంస్థానంలోని అన్ని జిల్లాలకు పాకిపోయింది. నగరంలోని ఇతర కళాశాల విద్యార్థులు, కొన్ని ఉన్నత పాఠశాలల విద్యార్థులు ఈ సమ్మెలో పాల్గొన్నారు. ఔరంగాబాద్, వరంగల్, గుల్బర్గా, పర్భనీ, నాందేడ్, మహబూబ్‌నగరు జిల్లాలలోని విద్యార్థులు కూడా సమ్మెచేసి తరగతులు బహిష్కరించారు. 'వందేమాతరం' గీతం సంస్థాన మంతటా మారుమోగింది. పదిరోజుల తరువాత డిసెంబరు 10వ తేదీన సమ్మెలో పాల్గొంటున్న విద్యార్థులంతా తమ చర్యకు క్షమాపణ పత్రం రాసి ఇచ్చి తరగతులకు హాజరు కావలెనని విశ్వవిద్యాల అధికారులు ఒక ప్రకటన చేశారు. అట్లా క్షమాపణ పత్రం రాసివ్వని వారిపేర్లు తరగతిలో నుంచి తీసివేయబడతాయని హెచ్చరించారు. ఈ ప్రకటన విద్యార్థులు పట్టించుకోలేదు. ఉద్యమం ఉధృతమైంది. ఉస్మానియా విశ్వవిద్యాలయం, దాని అనుబంధ కళాశాలలలో చదువుతూ, సమ్మెలో పాల్గొంటున్న దాదాపు మూడువందల యాభై మంది విద్యార్థులను తొలగించుతున్నట్లు విశ్వవిద్యాలయాధికారులు ప్రకటించారు. అట్లా బహిష్కరణకు గురైనవారిలో మాజీ ప్రధాని స్వర్గీయ పి.వి. నరసింహారావు, అచ్యుతరెడ్డి, నూకల రామచంద్రారెడ్డి, సర్వదేవభట్ల రామనాథం, ఎస్. చెన్నారెడ్డి మొదలైనవారున్నారు.

భారతదేశంలో ఏ విశ్వవిద్యాలయంలోను వీరికి ప్రవేశం ఇవ్వకూడదని ఇంటర్ యూనివర్సిటీ బోర్డుకు రాయడం జరిగింది. విద్యార్థుల ప్రతినిధివర్గమొకటి దేశంలోని

యూనివర్సిటీలకు వెళ్ళి ప్రవేశమిప్పించమని అడిగింది. ఆంధ్ర యూనివర్సిటీ, బనారసు యూనివర్సిటీలకు నిజాం నుంచి సంవత్సరానికి రెండు లక్షల విరాళం లభించేది. అందువల్ల వారు అడ్మిషన్లు నిరాకరించారని తెలిసింది. అందరు మాకు సాధ్యం కాదంటే మాకు సాధ్యం కాదన్నారు. నిరుత్సాహంతో తిరిగి వస్తున్న విద్యార్థులు నాగ్‌పూర్‌లో ఆగి అక్కడి వైస్ చాన్సులర్ కేదార్‌ని కలుసుకున్నారు. రెండు మూడు నెలల ప్రయత్నం అనంతరం అడ్మిషన్లు ఇవ్వడానికి అంగీకారం లభించింది. సైన్స్ విద్యార్థులకు నాగ్‌పూర్‌లో, ఆర్ట్స్ విద్యార్థులకు జబల్‌పూర్‌లో ప్రవేశాలు లభించాయి. ఆర్థిక స్థోమత గల కొందరు విద్యార్థులు మాత్రమే నాగ్‌పూర్ వెళ్ళి తమ చదువు కొనసాగించారు.

వందేమాతరం ఉద్యమంలో పాల్గొన్న విద్యార్థులను అభినందిస్తూ పండిట్ జవహర్‌లాల్ నెహ్రూ, సుభాస్ చంద్రబోస్ వంటి జాతీయ నాయకులు అభినందన సందేశాలు పంపించారు. ప్రార్థనా సమావేశంలో దేశభక్తి గీతమైన 'వందేమాతరం' గీతాన్ని పాడుకునే హక్కు భారతీయ విద్యార్థులందరికీ ఉన్నదని గాంధీజీ ప్రకటించారు.

జైలులో 'వందేమాతరం'

ఉస్మానియా విశ్వవిద్యాలయం విద్యార్థులు ఆరంభించిన వందేమాతరం ఉద్యమం సంస్థానమంతటా వ్యాపించింది. ఇదే సందర్భంలో ఆర్యసమాజ్ హిందూ మహాసభవారు కూడా పౌరహక్కుల సాధనకోసం వందేమాతరం ఉద్యమం చేపట్టారు. ప్రతీ గ్రామంలోనూ, పట్టణంలోనూ వందేమాతరం గీతం పాడసాగారు. సత్యాగ్రహులతో జైళ్ళన్నీ నిండి పోయాయి. జైలులో రాజకీయ ఖైదీలు ప్రతిరోజు వందేమాతరం పాడేవారు. బ్యారెక్‌లలోనూ గొంతెత్తి ఆలపించేవారు. స్వామీజీ కూడా తన సెల్‌లో ఒంటరిగా కూర్చుని ఆ గీతాన్ని పాడుకుంటూ ఉండేవారు. వందేమాతరం గీతాలాపనను ప్రభుత్వం నిషేధించింది కాబట్టి దానిని పాడకూడదని జైలు సూపరింటెండెంటు సత్యాగ్రహులకు నోటీసు ఇచ్చాడు. ఆయన ఆదేశాలను ఎవరూ పాటించలేదు. రెండు మూడు రోజుల తరువాత జైళ్ళ ఇన్‌స్పెక్టరు జనరల్ స్వయంగా వచ్చి ఖైదీలు ఈ గీతం పాడకూడదని, తన ఆజ్ఞలను ధిక్కరించినట్లయితే ఫలితం అనుభవించాల్సి వస్తుందని హెచ్చరిక చేశాడు. ఆయన హెచ్చరికను కూడా ఎవరూ లెక్కచేయలేదు. జైలు సెల్‌లో నిర్బంధించి ఉంచిన స్వామీజీకి కూడా ఈ హెచ్చరికను

తెలియపరిచారు. వందేమాతరం గీతం పాడే ఖైదీలందరికీ పన్నెండు కొరడా దెబ్బలు విధించారు. 'ఈ గీతం పాడుకోవడం మా జన్మహక్కు కనుక మేము మీ ఆదేశాలను పాటించము' అని సత్యాగ్రహులు స్పష్టంగా చెప్పేశారు. ఎటువంటి శిక్షకైనా సిద్ధమని అందరూ ముక్తకంఠంతో చెప్పేశారు. తమ మాట నిజరూపమేమిటో తెలియబరచడానికి జైల్లో ఉన్న యువ ఆర్యసమాజ్ కార్యకర్త రామచంద్రరావుకు ఈ శిక్ష విధించారు. ఆయన 'వందేమాతరం' అంటూ ఉంటే ఒక్కొక్క కొరడా దెబ్బ ఆయన వీపుపై పడింది. ఆయన శరీరంపై పదిహేను దెబ్బలు పడ్డవి. ఆయన 'వందేమాతరం' అంటూనే స్పృహ కోల్పోయాడు. రామచంద్రరావుపై జరిగిన ఈ ఘోరకృత్యానికి నిరసనగా జైల్లో ఉన్న సత్యాగ్రహులందరూ ఆ రోజునుంచి ఆహారం తీసుకోవడం మానివేసి, నిరాహారదీక్ష చేపట్టారు. ఈ విషయం తెలియగానే జైలు ఉన్నతాధికారులు జైలు సందర్శించి సత్యాగ్రహులతో సంప్రదింపులు జరిపారు. ప్రతిరోజు సాయంత్రం పూట ఒక్కసారి 'వందేమాతరం' సామూహికంగా పాడుకోవచ్చునని అధికారులకు, రాజకీయ ఖైదీలకు మధ్య ఒప్పందం జరిగింది. అత్యంత ధైర్యశాలి, త్యాగశీలి, నిరుపమాన దేశభక్తుడు అయిన రామచంద్రరావు ఆ రోజునుంచి 'వందేమాతరం రామచంద్ర రావు'గా ప్రసిద్ధి గాంచారు.

స్టేటు కాంగ్రెసు ఆధ్వర్యాన సత్యాగ్రహోద్యమం నాయకులు ముందుగా రూపొందించుకున్న కార్యక్రమం ప్రకారం కొనసాగింది. స్టేటు కాంగ్రెసుతో పాటు 'హిందూ పౌరహక్కుల సంఘం', 'హిందూపరిషత్తు', 'ఆర్యసమాజ్' వంటి సంస్థలు కూడా ఈ సత్యాగ్రహ ఉద్యమంలో పాల్గొన్నవి. ఈ సంస్థల కార్యకర్తలు కూడా చాలా మంది ప్రభుత్వం నిషేధాజ్ఞలు ధిక్కరించి జైళ్లకు వెళ్ళారు. గాంధీజీ ఆదేశాల మేరకు సత్యాగ్రహోద్యమం విరమించుకోవడం జరిగింది. ఉద్యమం విరమిస్తున్నట్లు ప్రకటించగానే స్టేటు కాంగ్రెస్ అధ్యక్షుడు గోవిందరావు నానల్‌ను, కొందరు కార్యవర్గ సభ్యులనూ ప్రభుత్వం జైలునుంచి విడుదల చేసింది. గాంధీజీ ఆదేశానుసారం తాము ఉద్యమాన్ని విరమిస్తున్నట్లు నానల్ ప్రకటించారు. కొద్ది రోజులలోనే క్రమక్రమంగా జైలులో వున్న కాంగ్రెస్ సత్యాగ్రహులందరినీ ప్రభుత్వం విడుదల చేసింది. తరువాత ఆర్యసమాజ్ కార్యకర్తలు కూడా విడుదలైనారు. ప్రభుత్వం, ఆర్యసమాజ్ హిందూ మహాసభ వారికి పౌరహక్కుల విషయంలో కొన్ని హామీలు ఇవ్వడంతో ఉద్యమాన్ని వారు విరమించుకున్నారు.

1940 వ్యక్తి సత్యాగ్రహం, 1942 క్విట్ ఇండియా ఉద్యమం, 1947 సంస్థాన విమోచనోద్యమం సందర్భంలో కూడా వందలాది కార్యకర్తలు 'వందేమాతరం' నినాదం చేస్తూ సత్యాగ్రహాలు చేస్తూ అరెస్టు అయినారు.

వందేమాతరం– మన జాతీయ గీతం:

1906లో స్వదేశీ ఉద్యమం వచ్చింది. దీని మారుపేరే వందేమాతరం ఉద్యమం. వందేమాతరం అనే గీతం 'ఆనందమఠ్' అనే నవలలో ఉంది. ఆ నవల బ్రిటిష్ ప్రభుత్వం మీద తిరుగుబాటు చేసిన ఒక సన్యాసుల మఠం కథ. ఆ నవల రచించిన మహానుభావుడు బంకించంద్ర ఛటర్జీ. ఆ గీతం మహామంత్రమైంది. భారతీయ ప్రజాస్వరాజ్య తపస్సులో మూలమంత్రమైనది.

బెంగాల్‌లో ప్రారంభమైన వందేమాతరం ఉద్యమం క్రమక్రమంగా దేశమంతటా వ్యాప్తి చెందింది. బెంగాలీలు మనసోదరులే కాబట్టి వారు ప్రారంభించిన ఉద్యమానికి మనం చేయూతనివ్వాలని, అది మన ధర్మమని భారతదేశంలో అన్ని ప్రాంతాల ప్రజలు భావించారు. దక్షిణాన, ముఖ్యంగా ఆంధ్రదేశంలో ఆ ఉద్యమం బాగా వ్యాపించి ప్రజలలో గొప్ప చైతన్యం కలిగించింది. ఎందరో యువకులు వందేమాతరం ఉద్యమం నుంచి స్ఫూర్తిపొందారు. వందేమాతరం అనే పాట జాతీయ గీతమైంది, ప్రార్థనా గీతమైంది. ఈ గీతాన్ని అత్యంత భక్తిశ్రద్ధలతో పాడుతూనే ఉన్నారు.

మన జాతీయ గీతం గురించి 1947 సం॥ జనవరి 24వ తేదీన డా॥ రాజేంద్ర ప్రసాద్ ఒక ప్రకటన చేశారు. 'ప్రభుత్వానికి సంబంధించిన అధికార కార్యక్రమాలన్నిటిలోను 'జనగణమన' గీతమే ఉపయోగపడుతుంది. స్వతంత్ర సంగ్రామంలో ఎంతో ఉత్సాహాన్ని కలిగించిన 'వందేమాతరం' గీతం కూడా 'జనగణమన' గీతంతో సమానంగా గౌరవింపబడుతుంది'. ❑

27. తెలంగాణా సాయుధ పోరాటం

1938 లో హైదరాబాద్‌లో స్టేటు కాంగ్రెసు సత్యాగ్రహం అర్ధంతరంగా ముగిసింది. ఆ కాలంలో బ్రిటిష్ పాలనలోని ఆంధ్రప్రాంతంలో కమ్యూనిస్టు పార్టీపై నిషేధం ఉంది. ఎందరో కమ్యూనిస్టు నాయకులు తెలంగాణాలో అజ్ఞాతవాసం ఏర్పరచు కున్నారు. ఆంధ్ర మహాసభ మితవాద పంథాతో తృప్తిపడని రావి నారాయణరెడ్డి వంటి జాతీయవాదులు, వందేమాతరం విద్యార్థులు కమ్యూనిస్టు పార్టీ నాయకులతో సంబంధం ఏర్పరచుకున్నారు. ఆ రోజుల్లో హైదరాబాద్‌లో కామ్రేడ్స్ అసోసియేషన్ పేరిట చర్చావేదిక ఒకటి నడిచేది. ఇందులో రావి నారాయణరెడ్డి, మక్దూం మోహియుద్దీన్, రాజ్‌బహదుర్ గౌర్, సయ్యద్ ఇబ్రహీం, ఆలం కుంద్‌మేరీ మొదలైనవారు సభ్యులు. తరువాత వందేమాతరం విద్యార్థులు దేవులపల్లి వెంకటేశ్వర రావు, సర్వదేవరభట్ల రామనాథం, బద్దం ఎల్లారెడ్డి, ఆరుట్ల లక్ష్మీనరసింహారెడ్డి, రామచంద్రారెడ్డి వంటి తెలంగాణా కార్యకర్తలు, మహారాష్ట్రకు సంబంధించిన వి..డి. దేశ్‌పాండే, చంద్రగుప్త చౌదరీ, హబీబుద్దీన్ మొదలైనవారు కలిసి నిజాం రాష్ట్ర కమ్యూనిస్టు పార్టీని స్థాపించారు. ఇదే పార్టీ సాయుధ పోరాటానికి నాంది పలికింది. ఎన్నో సాహస కృత్యాలను చేసింది.

డిసెంబరు 1939లో కామ్రేడ్స్ అసోసియేషన్ కాశీనాథరావు వైద్యా అధ్యక్షతన హైదరాబాద్‌లో ఆరంభమైంది. దీనికి సయ్యద్ ఇబ్రహీం కార్యదర్శి. హిందూ మహమ్మదీయల ఐక్యతను సాధించి, కులమత తత్త్వాన్ని రూపుమాపడం ఈ సంస్థ ముఖ్య లక్ష్యాలు. 1944 వరకు వీరి కార్యకలాపాలన్నీ ఆంధ్ర మహాసభ అంతర్భాగంగానే నడిచాయి. క్రమేపీ వీరిలో అతివాద, మితవాద వర్గాలు ఏర్పడ్డాయి. 1941 చిలుకూరు ఆంధ్ర మహాసభ సమావేశంలో వేర్వేరు ఆంధ్ర మహాసభలు ఏర్పడ్డాయి. కామ్రేడ్స్ అసోసియేషన్ హైదరాబాద్ కమ్యూనిస్టు పార్టీలోనూ,

జాతీయవాదుల ఆంధ్ర మహాసభ హైదరాబాద్ స్టేటు కాంగ్రెస్‌లోను కలిసిపోయాయి. ఎవరి పంథాలో వారు నిజాం ప్రభుత్వం వ్యతిరేకంగా బాధ్యతాయుత ప్రభుత్వం కోసం పోరాటాలు జరిపారు.

రెండవ ప్రపంచ యుద్ధానికి ముందు హైదరాబాద్ సంస్థానం బియ్యాన్ని బర్మానుండి దిగుమతి చేసుకునేది. యుద్ధకారణంవల్ల బియ్యం దిగుమతి ఆగిపోయింది. నిజాం రాజ్యంలో తగిన నీటిసౌకర్యం ఉండేది కాదు. ప్రముఖ ఇంజనీరయిన అలీ నవాజ్ జంగ్ కృష్ణా, గోదావరి నదుల నీటి పారుదల సౌకర్యాలకు పథకాలు వేసినా వాటికి ప్రభుత్వామోదం లభించలేదు. నిజాం సంపన్నుడైనా రాష్ట్రనీటి పారుదల సౌకర్యాలకు ప్రాముఖ్యం ఇవ్వలేదు. ఆ కారణంగా రాష్ట్రంలో ఆహారకొరత ఉండేది. లెవీ ధాన్యం పేరుతో నిజాం ప్రభుత్వం వారు ప్రజలనుంచి నిర్బంధంగా ధాన్య సేకరణ ప్రారంభించారు. లేవీ ధాన్యానికి మార్కెట్ ధర కన్న తక్కువ డబ్బు రైతులకు చెల్లించేవారు. పండినా, పండకపోయినా ప్రజలు ప్రభుత్వానికి లేవి చెల్లించి తీరవలసిందే. ఈ నిర్బంధ లేవీవల్ల ప్రభుత్వంలో లంచగొండితనం, భ్రష్టాచారం ప్రబలింది. ప్రజలు విసిగిపోయారు. ఇది ప్రజా ఉద్యమానికి బలమైన కారణమైంది.

1945వ సంవత్సరంలో లేవీధాన్యాన్ని వసూలు చేయడానికి వచ్చిన పోలీసు, రెవిన్యూ ఉద్యోగులను జనగామలోని ఆకునూరు గ్రామస్థులు ఎదిరించారు. పోలీసు బలప్రయోగంతో గ్రామంలోని ధాన్యాన్ని లూటీ చేశారు. తిరుగుబాటు చేసినవారిని హింసించారు. స్త్రీలపై మానభంగాలకూ వెనుదీయలేదు. పైశాచిక కృత్యాలను కొనసాగించారు. ఈ అమానుష కృత్యాలను ఆంధ్ర మహాసభ పక్షాన పద్మజానాయుడు విచారించారు. 70 మంది మానభంగానికి గురైనవారని తెలిసింది. అందులోనుంచి 36 మంది నుంచి వాఙ్మూలం సేకరించారు. పోలీసులు గ్రామాన్ని పూర్తిగా దోచారు. కంటికి కనిపించినవారిని దెబ్బలు కొట్టి హింసించారు. ఈ సంఘటన ప్రభుత్వ చిత్రహింసలకు నాంది పలికింది.

లేవీవల్ల, ప్రభుత్వ నిరంకుశ విధానంవల్ల ప్రజలు, కమ్యూనిస్టు పార్టీ కార్యకర్తల నాశ్రయించారు. కమ్యూనిస్టుపార్టీ కార్యకర్తలు ప్రజలకండగా నిలిచి ప్రజా ఉద్యమం ఆరంభించారు. అప్పటిదాక స్టేటు కాంగ్రెస్‌పై నిషేధం ఉంది. ఆంధ్ర మహాసభ రెండుగా చీలింది. కమ్యూనిస్టు పార్టీ మీద నిషేధం లేదు. వీరు ప్రభుత్వంతో జరిపే

పోరాటంకన్నా గ్రామాల్లో వర్గ పోరాటానికి ప్రాధాన్యం ఇచ్చారు. ఒకవైపు ప్రభుత్వంతో, మరొకవైపు గ్రామ పెత్తందార్లతో ద్విముఖ యుద్ధం సాగించారు. ప్రతిగ్రామంలో వున్న పెత్తందారుని ఎదరించడానికి రెండవ రకం పెత్తందార్లని 1946 వరకు సమర్థించారు. వీరి ఉద్యమం దుడ్డుకర్రలతో, వడిసెలతో ఆరంభమైంది. ప్రభుత్వాన్ని ఎదిరించడానికి ప్రజలంతా సిద్ధంగా ఉన్నారు. కాని వీరు గ్రామాలను రెండుగా చీల్చి వర్గ పోరాటం సృష్టించారు. తెలంగాణాలో సాయుధ పోరాటానికి కమ్యూనిస్టు పార్టీ 1947 సెప్టెంబరు 17న పిలుపునిచ్చింది.

రాత్‌కీ సర్కార్; దిన్‌కీ సర్కార్:

1948 ఫిబ్రవరిలో కలకత్తాలో ఆగ్నేయాసియా యువజన మహాసభ ప్రపంచ కమ్యూనిస్టు యువజన సంస్థల ఆధ్వర్యంలో జరిగింది. పైకి నిరపాయంగా కనిపించే ఈ మహాసభలో కొన్ని ముఖ్యమైన తీర్మానాలు జరిగినవి. ఆ తీర్మానాల వెనుక వివిధ దేశాల కమ్యూనిస్టుల ప్రభావమున్నది. చీనా, బర్మా, మలయా, ఇండోనీషియా దేశాల కమ్యూనిస్టు పార్టీలు ఈ సభలో ఒక ఉమ్మడి కార్యక్రమం నిర్ణయించుకున్నవి. తత్కారణంగా భారత కమ్యూనిస్టుపార్టీ విధానంలో మార్పు వచ్చి పి.సి.జోషిని విప్లవ వ్యతిరేకిగా పేర్కొని అతని స్థానంలో బి.డి. రణదివేను పార్టీకార్యదర్శిగా నియమించు కున్నారు.

ఈ మహాసభ చేసిన తీర్మానం ప్రకారం హైదరాబాద్ కమ్యూనిస్టుపార్టీ విధానంలో మార్పు వచ్చింది. మొట్టమొదట తెలంగాణాను సోవియెట్ విధానంలోకి మార్పుచేయాలి. ఇక్కణ్ణించి తక్కిన భారతదేశానికి వ్యాప్తి చేయాలి. హైదరాబాద్ భారతదేశం నడిబొడ్డున ఉంది. హైదరాబాద్ పోతే అంతా పోయినట్లేనని 1857లో జరిగిన ప్రథమ స్వాతంత్ర్య పోరాట సమయంలోనే బొంబాయి ప్రావిన్సు గవర్నరు హైదరాబాద్‌లో ఉన్న తన రెసిడెంటుని హెచ్చరించాడు.

అంతవరకు నిజాం దుశ్చర్యలను ప్రతిఘటించటానికి స్టేటు కాంగ్రెసుతో కలిసి పనిచేసిన కమ్యూనిస్టులకు స్టేటు కాంగ్రెసు–నెహ్రూ ప్రభుత్వం ప్రజావ్యతిరేకంగా కనిపించాయి. యథాతథ ఒడంబడిక నిజాం, సర్దార్ పటేల్ పన్నిన కుట్రగా చిత్రించారు. ఈ సందర్భంలో రజాకార్లకు, కమ్యూనిస్టులకు ఉమ్మడి శత్రువుగా

నెహ్రూ ప్రభుత్వం గోచరించింది. 1946 ఆగస్టు15 మొదలుకొని 1949 సెప్టెంబరు 13 వరకు కమ్యూనిస్టులు 200 మందిని ఖూనీ చేసినట్లు, 22 పోలీసు స్టేషన్ల మీద దాడి సల్పినట్లు కేంద్ర ప్రభుత్వానికి రిపోర్టులందాయి. 1948 మే 4న నిజాం ప్రభుత్వం కమ్యూనిస్టు పార్టీపై నిషేధాజ్ఞలను తొలగించింది.

పోలీసు చర్య తరువాత భారత ప్రభుత్వం కమ్యూనిస్టులపై తీవ్రమైన గాలింపు చర్యలను తీసుకుంది. తద్వారా తెలంగాణా సాయుధ పోరాటంపై కమ్యూనిస్టుపార్టీలో భిన్నాభిప్రాయాలు ఏర్పడ్డాయి. ఈ సందర్భంగా సోవియెట్ ప్రధాని మార్షల్ స్టాలిన్ భారత కమ్యూనిస్టు నాయకులైన ఎస్.ఏ. డాంగే, అజయ్ ఘోష్, రాజేశ్వరరావు, బసవపున్నయ్యలను మాస్కో పిలుపించుకుని తెలంగాణా పటం ముందర పెట్టుకొని ఎటూ కమ్యూనిస్టు భూమిలేని తెలంగాణాలో మీ విజయం సాధ్యమయ్యే పనేనా? అని ప్రశ్నించినట్లు 'కాంగ్రెస్‌లో కమ్యూనిస్టులు– కుమార మంగళమ్ సిద్ధాంతం' అనే గ్రంథంలో సతీంద్రసింగ్ పేర్కొన్నాడు. ఇంతటి అల్లకల్లోలానికి కారకుడైన రణదివే తెలంగాణాలో పర్యటించనే లేదు.

కమ్యూనిస్టు దౌర్జన్య విధానాలను అణచివేయడానికి పోలీసు, సైనిక ప్రత్యేక దళాలను కేంద్ర హోంమంత్రి సర్దార్ పటేల్ నియమించినాడు. ఇవి సివిల్ సర్వీసులో పనిచేసే కెప్టెన్ నంజప్ప ఆధ్వర్యంలో పనిచేసినవి. కమ్యూనిస్టులు చేసే దౌర్జన్యానికి ప్రతిదౌర్జన్యం చేశారు. కమ్యూనిస్టులు ఆక్రమించిన తావులన్నింటిని పోలీసు బలగం తిరిగి ఆక్రమించుకుంది. కమ్యూనిస్టుల ఆచూకీ తెలియచేయమని మిలిటరీ, పోలీసు దళాలు ప్రజలను నానా హింసలు పెట్టాయి. పగలంతా మిలటరీ వాళ్ళూ, రాత్రులలో కమ్యూనిస్టులు గ్రామాలలో నానా బీభత్సం సృష్టించారు. ఈ విధంగా దాదాపు ఏణ్నర్థం ప్రజలు అరచేతుల్లో ప్రాణాలు పెట్టుకుని జీవించారు. 'రాత్‌కీ సర్కార్, దిన్‌కీ సర్కార్' అంటే అధికార, అనధికార దౌర్జన్యాలేనన్నమాట.

1949వ సంవత్సరంలో సర్దార్‌పటేల్ రెండవసారి హైదరాబాద్ పర్యటనకు వచ్చినప్పుడు ఫతేమైదాన్‌లో జరిగిన బ్రహ్మాండమైన సభలో ప్రసంగిస్తూ 'ఎవరికైనా, ఏ దేశంపైనైనా సానుభూతి ఉంటే వారు అక్కడికి వెళ్ళవచ్చు. వారికి నేను పాస్‌పోర్ట్ ఏర్పాటు చేస్తాను. వారు తమకు నచ్చిన చోట లేకపోతే అక్కడి పనులు కుంటుపడి అక్కడి వారికి నష్టం వాటిల్లుతుంది. తాము బాధపడుతూ ఇతరులను బాధపెడుతూ

ఇక్కడ వుంటే వారికికానీ, ఈ దేశవాసులకికానీ ఏమీ ప్రయోజనం ఉండదు. గుట్టలలోనూ, అడవులలోనూ ఉండి పోరాటం చేసేవారు అడవి జంతువుల మాదిరి నిర్దాక్షిణ్యంగా హతమార్చబడతారు' ఇది ఆయన గంభీరమైన ఉపన్యాస సారాంశం. అన్నంత పని చేసి చూపించారు సర్దార్ పటేల్. కనీసం రెండు దశాబ్దాల వరకూ కమ్యూనిస్టులు హింసాచర్యలు చేబట్టడానికి సాహసించనంత తీవ్రంగా అణచివేత విధానం కొనసాగింది. తెలంగాణా సాయుధ పోరాటం నక్సలైటు ఉద్యమం మధ్య 20 సంవత్సరాల విరామముండటం యాదృచ్ఛికమైన విషయం కాదు.

ఈ పోరాటంలో ఇరుపక్షాలు బాగానే నష్టపడ్డాయి. దాదాపు 50 వేల మంది కమ్యూనిస్టులు, వారి అభిమానులు జైళ్ళపాలైనారు. 4000 మంది అసువులు బాసారు. 1947-48లో పాకిస్తాన్‌తో జరిగిన యుద్ధంలో అయినంత ఖర్చును కమ్యూనిస్టులను అదుపులో పెట్టడానికి భారత ప్రభుత్వం భరించవలసి వచ్చింది. 1951 ఆఖరు వరకు సాయుధపోరాటం కొనసాగింది. ఎన్నికల తరుణంలో ఉపసంహరించుకున్నారు. సాయుధపోరాటంవల్ల కొన్ని మంచి పనులు జరిగాయి. తెలంగాణాలో భూస్వాముల శకం అంతరించి భూసంస్కరణలు ప్రారంభమయ్యాయి. ఆచార్య వినోబాభావే తెలంగాణాలోనే భూదానోద్యమం ప్రారంభించారు. ఎన్నికల తరువాత ఆంధ్ర నాయకునికే ముఖ్యమంత్రి పదవి లభించింది. భాషాప్రయుక్త రాష్ట్రాలకిది బలం చేకూర్చింది.

కమ్యూనిస్టులకు అప్పుడు తప్పనిసరి పరిస్థితులు ఏర్పడిన కారణంగానే వాళ్ళు సాయుధులైనారు. గ్రామాలలో పెత్తందారీ వర్గంతో పోరాడే లక్ష్యంతోనే వాళ్ళు మొదటినుంచి తమ కార్యక్రమాల్ని నిర్మించుకుంటూ వచ్చారు. ఆ క్రమంలో నిజాం ప్రభుత్వం, పెత్తందార్లు, రజాకార్లు కమ్యూనిస్టుల కార్యక్రమాల్ని అణచడానికి ప్రయత్నించారు. కనుక ఒక దశలో ఆనాటి పరిస్థితుల కారణంగా వాళ్ళకు సాయుధ పోరాటం తప్పనిసరి అయింది. ప్రజలు కూడా అంతకుముందు పెత్తందార్లను ఎదుర్కొని విజయం సాధించడంవలన ఆ ఆత్మస్థైర్యంతో వాళ్ళు సాయుధ పోరాటాన్ని బలపరిచారు.

కానీ సాయుధపోరాటం ఏ లక్ష్యంతో ప్రారంభమైందో అది నెరవేరలేదనే చెప్పాలి. ఎందుకంటే హైదరాబాద్ రాష్ట్రంపై పోలీసు యాక్షన్ జరిగిన పిదప సాయుధపోరాటం ప్రారంభించిన వాళ్ళలోనే అభిప్రాయ భేదాలు పొడసూపాయి.

సాయుధపోరాటాన్ని కొనసాగించడమా– మానడమా? అన్న చోట వాళ్ళు విభేదించారు. కొందరు పార్టీ నిర్ణయానికి వ్యతిరేకంగా జట్లు జట్లుగా అండర్‌గ్రౌండ్‌లో ఉండి సాయుధ పోరాటం కొనసాగించే ప్రయత్నం చేశారు. కానీ పెత్తందారులను, పోలీసు బలగాలను ఎదుర్కోవడం వారికి దుస్సాధ్యమైంది. అంతేకాక, అంతకుముందు పెత్తందార్లను, రజాకార్లను, నిజాం ప్రభుత్వాన్ని ఎదుర్కోవడంలో సహకరించిన ప్రజలు మారిన పరిస్థితులలో పోరాటంలో పాల్గొనడం మానుకున్నారు. భారతప్రభుత్వం ప్రజా ప్రభుత్వం అన్న భావంతో ప్రజలు దానిమీద ఆశలు పెంచుకున్నారు. అందువల్ల సాయుధ పోరాటాన్ని కమ్యూనిస్టులు తప్పనిసరిగా విరమించుకోవలసి వచ్చింది. కనుక దాని లక్ష్యం నెరవేరలేదు.

భారతప్రభుత్వం చేపట్టనున్న ప్రజాస్వామ్య పరిపాలన విధానాన్ని పరీక్షించ కుండానే నిజాంకు వ్యతిరేకంగా పోరాడిన పద్ధతిలోనే భారత ప్రభుత్వాన్నీ, దాని సైన్యాన్నీ ఎదుర్కోవాలన్న నిర్ణయం సరికాదని చాలామంది అభిప్రాయ పడ్డారు.

అఖిల భారత కమ్యూనిస్టు పార్టీ నాయకత్వంలోను, విధానంలోనూ మార్పు వచ్చినందువల్ల దానిపైగల నిషేధం తొలగింది. అనేకమంది వ్యక్తులు కారాగారాల నుండి విముక్తులైనారు. ఐక్యప్రజాసంఘటన (పీపుల్స్ డెమోక్రటిక్ ఫ్రంట్) అనే పేరుతో ఎన్నికలలో పాల్గొన్నారు. ప్రజలతో పోరాట కాలంలో వీరి కేర్పడిన సాన్నిహిత్యం మూలంగా కమ్యూనిస్టు పార్టీకి తెలంగాణాలో అనుకున్న దానికంటే ఎక్కువ విజయం లభించింది. క్రమేణా కమ్యూనిస్టు పార్టీ ఐక్య ప్రజా సంఘటన బురఖాను తీసివేసి నిజరూపంతోనే రంగంలో పనిచేయ ప్రారంభించింది.

ఆనాటి తెలంగాణా భూస్వాములు మొదలైన ఫ్యూడల్ శక్తులకు కేంద్రం. అధిక సంఖ్యలో ఉన్న రైతుజనం వ్రేళ్ళపై లెక్కపెట్టగలిగినంత మంది భూస్వాముల ప్రాబల్యానికి, దర్పానికి అణగి ఉండటం అనివార్య ఘర్షణలకు దారితీసింది. రైతాంగానికీ, భూస్వామ్య వర్గానికి సహజంగా వచ్చిన ఘర్షణకు కమ్యూనిస్టులు ఉద్యమ రూపమిచ్చి నాయకత్వం వహించారు. పోలీసు చర్యవరకు ప్రభుత్వంమీద భూస్వాముల పలుకుబడి ఉంది. అటు స్వామీజీ నాయకత్వాన ఫ్యూడల్ వ్యతిరేక కాంగ్రెస్ కార్యక్రమాలు, ఇటు కమ్యూనిస్టుల సాయుధ పోరాటం భూస్వాములను బలహీనపరచింది. వారు తమ కోటల వంటి గడీలను వదలి పట్టణాలకు తరలివెళ్ళారు.

ఆ రోజుల్లో ప్రభుత్వ మద్దతుతో తమ పౌరసత్వాన్ని సైతం అణగదొక్కుతున్న దొరల పీడను తొలగించుకోవడంకోసం ఆ ప్రాంతం ప్రజలు కమ్యూనిస్టుల నాయకత్వాన్ని ఇష్టపూర్వకంగా ఆమోదించారని చెప్పక తప్పదు. పోలీసు చర్య తరువాత అప్పటి ప్రభుత్వం ఈ భూస్వాముల సహకారంతో శాంతి భద్రతలను నెలకొల్పటానికి పూనుకుంది. దౌర్జన్యవాదులను ఏరివేసింది. నిజాం ప్రభుత్వం భూస్వాములకు అండగా ఉన్నట్టే తరువాత వచ్చిన ప్రభుత్వం కూడా భూస్వాముల మాటకే తలవూపింది. ఈ ప్రత్యక్ష దృశ్యం కమ్యూనిస్టు పార్టీతో తమకున్న సంబంధాన్ని పునరాలోచించుకునే అవకాశం ప్రజలకు కల్పించలేదు. కాంగ్రెస్ అన్నా ప్రభుత్వం అన్నా భూస్వాముల ఆధిపత్యమనే విశ్వాసం ప్రజలలో నాటుకు పోయింది. కాంగ్రెస్ అంటేనే ద్వేషం కలిగింది.

పరిస్థితులను అనుకూలంగా మార్చుకునే విద్యలో పారంగతులైన భూస్వాములు తమ కొక కొత్త అండ అవసరమనుకుని కాంగ్రెస్‌లో సభ్యత్వం సంపాదించారు. ఈ విధంగా అత్యధిక జనాభా కమ్యూనిస్టు సానుభూతి పరులుగాను, కొద్దిమంది భూస్వాములు, గ్రామపెత్తందార్లు, దొరలు- కాంగ్రెస్‌వారుగాను చెలామణిలోకి వచ్చారు.

ప్రభుత్వ నిషేధానికి గురై ప్రజానీకంలో పలుకుబడిని పోగొట్టుకున్న వారనుకున్న కమ్యూనిస్టులు (పీపుల్సు డెమోక్రటిక్ ఫ్రంట్) మొదటి సార్వత్రిక ఎన్నికల్లో తెలంగాణాలో సాధించిన విజాయాలు విస్మయం కలిగించాయి. ❑

28. సోషలిస్టు పార్టీ పోరాటాలు

రెండు రౌండ్ టేబిల్ సమావేశాలు విఫలం కావడంతో కాంగ్రెసు పార్టీలోని యువకులు తీవ్ర అసంతృప్తికి లోనయ్యారు. గాంధీజీ మితవాద నాయకత్వంపై వారికిగల ఆశలు చల్లారాయి. కాంగ్రెస్ కన్న తీవ్రధోరణిలో పోరాడే పార్టీకోసం వారు ఆలోచనలో పడిపోయారు.

1934లో నాసిక్ జైల్లో నిర్బంధంలో ఉన్న జైప్రకాశ్ నారాయణ్, యూసఫ్ మొహరలీ, అచ్యుత పట్వర్ధన్, అశోక్ మెహతా, మినుమాసానీ, ఎన్.ఎం. జోషి, ఎన్.డి. గోరే, దంతల్వాలు- అలాంటి వారి పార్టీ ఒకటి ఏర్పాటు చేసుకోవాలని నిర్ణయానికి వచ్చారు. దీనికి కాంగ్రెస్ సోషలిస్టు పార్టీ అని పేరు పెట్టాలనుకున్నారు. వారికి కలిగిన ఈ అభిప్రాయాన్ని ఆచార్య నరేంద్రదేవ్, రాం మనోహర్ లోహియా, పురుషోత్తం దాస్ త్రికందాస్, గంగాశరణ్‌సిన్హా కమలాదేవి ఛటోపాధ్యాయ, కె.కె.మీనన్, సురేంద్రనాథ్ ద్వివేది, సంపూర్ణానంద్‌లు బలపరిచారు. వివిధ జైళ్ళలో ఉన్న వీరంతా విడుదలై రాగానే 1934 మే 17వ తేదీన ఆచార్య నరేంద్రదేవ్ అధ్యక్షతన పాట్నాలో అంజుమన్-ఎ-ఇస్లామియా హాల్లో సమావేశమై పార్టీ లాంఛనంగా ఆవిర్భవించినట్లు ప్రకటించారు.

మనదేశ సోషలిజమ్ ఇతర దేశాలనుంచి దిగుమతి చేసుకున్నది కాదు. వారు జాతీయవాదులే. ఆనాటి పార్టీ ప్రణాళికను పరిశీలిస్తే ఈ విషయం స్పష్టమవుతుంది.

1. కమ్యూనిస్టుల శ్రామిక నియంతృత్వాన్ని ఎదిరించడం.
2. జాతీయ సంపదను అదుపులో ఉంచుతూ, తరతరాలుగా నిర్లక్ష్యానికి గురైన వర్గాల ఆర్థికాభివృద్ధికి కృషి చేయడం.
3. కర్షక, కార్మిక సంక్షేమ పథకాలకు ప్రాధాన్యమివ్వడం.
4. నష్టపరిహారం చెల్లించకుండా జమీందారుల భూములను స్వాధీనపరచుకోవడం.

5. సంస్థానాలు, రాజరికాలు రద్దు చేయడం.

6. బీద ప్రజలకు రుణ విముక్తి కలిగించడం.

7. బీమా కంపెనీలను, భారీ పరిశ్రమలను జాతీయ పరచడం.

1937లో ఏర్పడిన కాంగ్రెస్ ప్రభుత్వాలు రైతు సమస్యలను పరిష్కరించడంలో తగిన శ్రద్ధ చూపలేదని భావించి జె.పి. రైతువర్గాన్ని తమ వైపు తిప్పుకునే ప్రయత్నం చేశారు. ఈ చర్యతో కాంగ్రెసుకు రైతులు దూరం కాగలరని ఆశించాడు. ఈ వ్యూహం కొంతవరకు ఫలించింది. 1938లో సుభాష్ చంద్రబోస్ నాయకత్వంలో జరిగిన హరిపుర కాంగ్రెస్ సమావేశంలో రైతు సమస్యలకు మొదటిసారి ప్రాధాన్యం లభించింది. 1940లో వ్యష్టి సత్యాగ్రహంలో పాల్గొన్న సోషలిస్టులు 1942 క్విట్ ఇండియా ఉద్యమంలో తీవ్రధోరణిని అవలంబించారు.

ఇక్కడ కమ్యూనిస్టుల గురించి కొంత చెప్పాలి. 1936లో కాం.సో.పా. కమ్యూనిస్టులతో యూనిటీ ఫ్రంట్‌గా ఏర్పడి తమ కార్యక్రమాలను తీవ్రతరం చేసింది. దీన్ని అదనుగా తీసుకుని కమ్యూనిస్టులు చాపకింద నీరులా ఆ పార్టీలో వ్యాపించి పోయారు. భారతదేశంలో తమది ఒక్కటే సామ్యవాద పార్టీ అని, మరో పార్టీ ఆ లేబుల్ తగిలించుకోడానికి వీలులేదని ఒక కరపత్రం పంచిపెట్టారు. 1937లో పాట్నాలో జరిగిన కాం.సో.పా. సమావేశంలో ఈ కరపత్రంపై వాదోపవాదాలు తీవ్రస్థాయిలో జరిగాయి. ఇకమీదట ఆచి తూచి కమ్యూనిస్టులకు సభ్యత్వమివ్వాలను కున్నారు. కార్యవర్గ సభ్యత్వంలో కమ్యూనిస్టు పార్టీకి మూడోవంతు స్థానాలే లభించాయి. అయినా కమ్యూనిస్టుల వ్యూహాత్మక ప్రచారం ఆగలేదు. ఈ సహజీవనం ఇలాగే కొనసాగితే తమ ఉనికికే ప్రమాదం వాటిల్లుతుందని సోషలిస్టులు గ్రహించారు. 1940లో కమ్యూనిస్టులను పార్టీనుంచి బహిష్కరించారు. ఇక్కడ ఒక సంగతి గ్రహించడం చాలా అవసరం. కమ్యూనిస్టులందరూ సోషలిస్టులే. కానీ సోషలిస్టు లందరూ కమ్యూనిస్టులు కారు.

క్విట్ ఇండియా ఉద్యమంలో జె.పి. హజారీ బాగ్‌జైలు నుంచి తప్పించుకుని పారిపోయాడు. లోహియా, అచ్యుత పట్వర్ధన్‌తో కలిసి 'అజాద్ దస్తా'ను ఏర్పాటు చేశాడు. వీరు గెరిల్లా పద్ధతిలో బ్రిటిష్‌వారితో పోరాటం జరిపారు. ఈ హింసా విధానాన్ని నిరసిస్తూ మహాత్మాగాంధీ ఒకరోజు ఉపవాస వ్రతం చేపట్టాడు. సోషలిస్టు

ఉద్యమాలు ఎంతటి తీవ్రమైనవైనా రక్తపాతంతో కూడినవి కావు. రహదారులను విచ్ఛిన్న పరచడం, ఫ్యాక్టరీ పనిముట్లను తొలగించడం, పికెటింగ్‌లు జరపడం చేసేవారు. 1947 ఫిబ్రవరి లో జరిగిన కాన్‌పూర్ సమావేశం నాటికి కాంగ్రెసు, సోషలిస్టు పార్టీల మధ్య విభేదాలు బహిరంగ మయ్యాయి.

హైదరాబాద్ రాష్ట్రంలో:

హైదరాబాద్ సంస్థాన స్వాతంత్ర్య పోరాటంలో సోషలిస్టుల పాత్ర చిరస్మరణీయమైనది. 1946లో అశోక మెహతా, ఎన్.జి.గోరే చేసిన ఉపన్యాసాలు రాష్ట్ర ప్రజలలో సమరోత్సాహం కలిగించాయి. హైదరాబాద్ స్ట్రగుల్ కమిటీ అధ్యక్షురాలు శ్రీమతి అరుణా అసఫ్‌అలీ హైదరాబాద్‌కు వచ్చిన సందర్భంలో హైదరాబాద్ ఉద్యమ కార్యకర్తలలో ఉత్సాహం పెల్లుబికింది. నిజాం నవాబు ప్రజాభీష్టానికి వ్యతిరేకంగా ప్రవర్తించినట్లయితే బ్రిటిష్ వారికి పట్టిన గతే ఆయనకు పడుతుందని అరుణా అసఫ్ అలీ చేసిన సింహగర్జన నిజాం ప్రభుత్వాన్ని గడగడలాడించింది. మజ్లిస్ ఇత్తేహాదుల్ ముసల్మీన్ పత్రికలు ఆమెను అరెస్టు చేసి జైల్లో పెట్టాలని నిజాంకు సూచించాయి. కాని ప్రభుత్వానికి ఆమెను అరెస్టు చేసే ధైర్యం లేకపోయింది.

1947 మే 7వ తేదీన జైప్రకాశ్ నారాయణ్ హైదరాబాద్‌కు వచ్చినప్పుడు రాష్ట్ర ప్రజానీకం ఒక్కటిగా కదలి స్వాతంత్ర్య సమరంలోకి దూకింది. ప్రజలలో ఏర్పడిన ఉత్సాహోద్రేకాలను చూసి ప్రభుత్వం భయపడిపోయింది. సికిందరాబాద్ కర్బలా మైదానంలో జరిగిన సభలో నిజాంను జె.పి. మీర్ జాఫర్‌గా పేర్కొన్నప్పుడు ప్రజలు దిక్కులు పిక్కటిల్లేటట్లు కరతాళ ధ్వనులు చేశారు. మరుసటి రోజు హైదరాబాద్ రఘునాథ్ బాగ్‌లో సభ ఏర్పాటు చేశారు. కాని క్రితం రాత్రి సోషలిస్టు పార్టీ నాయకుడు మహదేవ్ సింగ్ ఇంట్లో నిద్రిస్తున్న జె.పి.ని నిద్రనుండి లేపి నగర బహిష్కరణ ఉత్తర్వు లందజేశారు. ఆ రాత్రికి రాత్రే ప్రత్యేక విమానంలో జె.పి.ని బొంబాయికి తరలించారు. ఆయన అరెస్టు వార్త జంటనగరాలలో దావానంలా వ్యాపించింది. ప్రజలపై లాఠీఛార్జి జరిగింది. నిషేధాజ్ఞలను ఉల్లంఘించినవారిని అరెస్టు చేశారు.

1946-47 సంవత్సరాలలో ఎస్.ఎం.జోషి, అశోక్ మెహతా, ఎన్.జి. గోరే, పురుషోత్తందాసు త్రికందాస్, అరుణా అసఫ్ అలీ మొదలైన ముఖ్య నాయకులు

హైదరాబాద్ వచ్చి విద్యార్థుల సమావేశాలలో ప్రసంగాలు చేశారు. స్టేటు కాంగ్రెస్‌లో సభల సందర్భంగా ఏర్పాటు చేసిన 'స్వేచ్ఛ' అనే ప్రదర్శన చాలా మంది యువకులను ఆకర్షించింది. శివరామశాస్త్రి, జె.ఆర్.గోపాలరావు, రాఘవరెడ్డి, మాటూరి నరసింహారావు, గోవిందరావ్ పురోహిత్, శ్యాం అప్పంగీకార్ 'స్వేచ్ఛ' సభ్యులుగా ఉండేవారు.

1947 జులై 3వ తేదీన పండిత నరేంద్రజీని అరెస్టు చేసినప్పుడు పోలీసులు జరిపిన లాఠీఛార్జీలో చాలామంది విద్యార్థులు గాయపడ్డారు. వందలాది మంది ప్రాణాలకు తెగించి పతాకావిష్కరణలు జరిపారు. అరెస్టులకు జంకక పదివేలమంది విద్యార్థులు త్రివర్ణ పతాకాలు ధరించి సుల్తాన్‌బజార్ క్లాక్‌టవర్ వద్ద ఊరేగింపు జరిపారు. పోలీసుల దమనకాండకు వ్యతిరేకంగా అఖిలభారత విద్యార్థి నాయకుడు రవీంద్రవర్మ ఆదేశంపై దేశమంతటా 'హైదరాబాద్ విద్యార్థి దివసం' పాటించబడింది. బి.ఎస్.మహాదేవ్‌సింగ్ నాయకత్వంలో స్టేటు సోషలిస్టుపార్టీ ఉద్యమాలు జరిగాయి. ఎలక్ట్రిసిటీ డిపార్టుమెంటు, సింగరేణి, రామగుండం బొగ్గు గనుల కార్మిక సంఘాలు, అనేక పరిశ్రమల కార్మిక సంఘాలు మహాదేవ్‌సింగ్ నాయకత్వంలోనే పోరాడాయి. మహాదేవ్‌సింగ్ నాయకత్వంలో హింద్-కిసాన్ పంచాయత్‌రాజ్, హింద్‌మజ్దూర్ సభ హైదరాబాద్ సంస్థానంలో బలమైన సంస్థలుగా ఏర్పడ్డాయి. నిజాం షుగర్ ఫ్యాక్టరీ, ఆజం జాహీ మిల్సు ఇంకా అనేక కార్మిక సంఘాలకు మహాదేవ్‌సింగ్‌తోపాటు ఎస్.బి.గిరి నాయకత్వం వహించి ఉద్యమాలు నిర్వహించారు.

హైదరాబాద్ సంస్థానం విషయంలో జాతీయ ప్రభుత్వం మెతకవైఖరిని అవలంభించిందని హైదరాబాద్ సోషలిస్టులు విమర్శించేవారు. యథాతథ ఒడంబడికను తీవ్రంగా ఖండించేవారు.

సోషలిస్టులు కాంగ్రెస్‌లో అంతర్భాగంగా ఉంటూ హైదరాబాద్ విమోచన మహాయజ్ఞంలో సమిథలుగా ఆహుతై చారిత్రాత్మక పాత్ర నిర్వహించిన ధన్యజీవులు. సోషలిస్టు పార్టీ పలుకుబడి హైదరాబాద్, సికిందరాబాద్ నగరాలు, తెలంగాణాలోని కరీంనగర్ జిల్లా, కర్నాటకలోని బీదరు జిల్లాలకే పరిమితమైంది. మొదటి సార్వత్రిక ఎన్నికల్లో తెలంగాణాలో సోషలిస్టులు 11 అసెంబ్లీస్థానాలు సాధించారు.

❑

29. తెలంగాణాలో గాంధీజీ పర్యటనలు

సత్యాగ్రహాశ్రమము
సబర్మతి: B.B.C..I. Rly,
తేదీ: 7 జూన్ 1928

ప్రియమైన మిత్రమా!

ఖాదీ ఉద్యమంలో మీరు శ్రద్ధచూపుతున్నట్టు, స్వయంగా మీరే ఖాదీ వడుకుతున్నట్టు రూప్‌లాల్ ద్వారా తెలుసుకొని ఆనందించాను. ఖాదీ ఉద్యమంలో మైసూరు సంస్థానం అగ్రగ్రామిగా ఉందనే సంగతిని మీ దృష్టికి తెస్తున్నాను. ఈ ఉద్యమాన్ని మీరొక దీక్షగా నడిపిస్తే నిజాం రాష్ట్రంలోని బీదప్రజానీకానికి మీరెంతో సేవ చేసినవారవుతారు.

మీరూ, మీ జ్యేష్ఠపుత్రుడు వడికిన ఈ వారపు సాంపిల్సును నాకు పంపించండి. ఇక్కడ ప్రదర్శనశాలలో ఉంచుతాం.

– ఎం.కె. గాంధీ

(మహాత్ముడు మహారాజా కిషన్ ప్రసాద్‌కు రాసిన లేఖ)

మహాత్మాగాంధీ మొదటి హైదరాబాద్ పర్యటన 1929 ఏప్రిల్‌లో ఖరారైంది. కృష్ణస్వామి ముదిరాజ్ తన ఆంధ్ర వాలంటీరు కోర్‌ని వాడి స్టేషనుకు తీసుకువెళ్ళి మహాత్మునికి స్వాగతం పలికి నాంపల్లి స్టేషనుకు తీసుకువచ్చారు. స్టేషను ప్లాటుఫారంమీదా, స్టేషను బైటా వేలాది జనం– ఇసుక వేస్తే రాలనంతగా గుమికూడారు. జన ప్రవాహంనుంచి గాంధీజీని తీసుకురావడం కష్టమని తెలుసుకున్న ముదిరాజ్ సమయస్ఫూర్తితో రైలుపెట్టె వెనుకవైపు ఉన్న తలుపు తెరచి మహాత్ముని తన వాలంటీరు రక్షణతో వెనుకనుండి సురక్షితంగా తీసుకువచ్చి జనం నుండి తప్పించారు. అక్కడ

సిద్ధంగా ఉన్న మోటారు కారులో మహాత్ముని కూర్చోబెట్టారు. ఆ తరువాత మహాత్ముని ఊరేగింపుగా తీసుకు వెళ్ళారు. ఊరేగింపు ముందు 'ఆది ఆంధ్ర' బ్యాండు మేళాలు నడిచినవి. స్థానిక నాయకులైన వామన్ నాయక్, మాడపాటి హనుమంతరావు, మందుముల నరసింగరావు, ఆర్.ఎస్.నాయక్, రాజా బన్సీలాల్, ముకుంద్‌దాస్ మలానీ వెంటరాగా మహాత్ముడు వివేకవర్ధనీ మైదానానికి చేరుకున్నారు. అక్కడ వామన్ నాయక్ అధ్యక్షతన బ్రహ్మాండమైన సభ జరిగింది. ఈ సభలో ప్రసంగిస్తూ మహాత్ముడు– 'రాట్నము, కామధేనువు మన భారతదేశానికి సకల వరప్రదాయినిలు. ఖద్దరు ఉత్పత్తికి హైదరాబాద్‌లో మంచి అవకాశం ఉంది. మరికొంత అభివృద్ధి పరిస్తే భారతదేశంలోని ఇతర ప్రజలకు కూడా సహాయ సహకారాలు అందించే స్థితిలో ఉన్నారు. ఇక్కడ మంచి నాణ్యతగల ఖాదీ ఉత్పత్తి అవుతుందని సరోజినీ నాయుడు నాకు చెప్పారు. అయితే హైదరాబాద్ సంస్థానంలో మద్యపానం ఎక్కువ ఉందని తెలిసింది. అది అనర్థదాయకం. కనుక దాన్ని రూపుమాపవలసిన అవసరం ఉంది. ఆ విధంగానే అంటరానితనం శాస్త్రసమ్మతం కాదు. కాబట్టి హిందువులు ఈ దురాచారం నుంచి విముక్తి 'పొందలి'.

మహాత్ముని ఉపన్యాసానంతరం రాజా ధన్‌రాజ్ గీర్‌జీ 2 వేల రూపాయలు, ముకుందరావు 100 రూపాయలు మహాత్మునికి సమర్పించుకున్నారు. దేశభక్త వామన్ నాయక్ సమర్పించిన సన్మాన పత్రానికి మహాత్ముడు ఈ విధంగా సమాధానమిచ్చారు.

'మీరు ఈ దరిద్రనారాయణుని కోసం డబ్బిచ్చినందుకు కృతజ్ఞుణ్ణి. హిందూదేశం కన్న దరిద్రదేశం ఇంకొకటి లేదు. ఎందుకంటే మనదేశంలో రోజుకి ఒక్కపూటైనా అన్నం దొరకని వారి సంఖ్య మూడుకోట్ల పైనే ఉంటుంది. అటువంటి వారికి రాట్నం కామధేనువు వంటిది. రాట్నంవలన ఒక లక్షమంది స్త్రీలకు జీవనోపాధి కలుగుతంది. వారు తాము వడికిన నూలు కూలికోసం 5, 6 మైళ్ళు నడిచి వెళుతుంటారు. ఈ నూలు వడికే వారికోసమే నేను భారతదేశమంతా పర్యటిస్తున్నాను. ఇందుకోసం నేను బర్మాలో కూడా పర్యటించాను.

మేము బ్రిటిష్ ఇండియాలో చేసే పనులన్నీ స్వదేశ సంస్థానాలలో చేయలేము. కానీ మీరు ఈ విధి నెరవేరిస్తే బ్రిటిష్ ఇండియా స్థాయికి అభివృద్ధి చెందగలుగుతారు.

రాట్నం వడికి ఖద్దరు ఉత్పత్తి చేసి హిందూస్థానమంతటికీ మీరు సరఫరా చేయగలుగుతారు. మీరందరూ కలిసికట్టుగా పనిచేస్తే ఒక్క ఏడాదిలోనే కావలసినంత ఖాదీ తయారవుతుంది. మీకు సన్నని బట్టలు, విదేశీ బట్టలమీద మోజు ఉన్నదని నాకు తెలుసు. కానీ సోదర భారతీయులను దృష్టిలో పెట్టుకుని ముతక బట్టలు ధరిస్తే వారికి సహాయం చేసినవారవుతారు. అదేవిధంగా మద్యపానం విసర్జించవచ్చు. మద్యపానంవల్ల వచ్చే ఆదాయంతో బ్రిటిష్ ఇండియాలో విద్యాశాఖను నడుపుతున్నారు. అది ఎంతో లజ్జాకరము.

ఆది హిందువులను అంటరానివారిగా చూడటం హిందుమతానికే కళంకం. వారిని అంటరాదనే ఆచారం మతంలో ఎక్కడా లేదు. అంటుదోషాన్ని వదిలించుకోండని సోదర హిందువులను ప్రార్థిస్తున్నాను. నా మెడలో వేసిన నూలదండ హరిజనులు వడికినదని తెలిసి నాకెంతో సంతోషం కలిగింది. ఇలాంటి సన్నని నూలు నేను మరెక్కడా చూడలేదు' అని మహాత్ముడు తన ఉపన్యాసాన్ని ముగించారు. ఉపన్యాసానంతరం 12 వేల రూపాయలు విరాళం వసూలైంది.

తన పర్యటనలో మహాత్ముడు కృష్ణస్వామి ముదిరాజ్ చుడిబజార్‌లో స్థాపించిన బాలికా హిందీ పాఠశాలను సందర్శించి సంతృప్తి ప్రకటించారు.

1929 ఏప్రిల్ 7న సుల్తాన్ బజారులోని ప్రేం థియేటరులో మహాత్ముని గౌరవార్థం మహిళా సభను ఏర్పాటు చేశారు. మహాత్ముడు రాత్రి 9-15 ని॥లకు రైలులో విజయవాడ బయల్దేరారు.

మహాత్ముని రెండవ పర్యటన:

ఇది జరిగిన ఏదేండ్లకు మహాత్ముని రెండవ పర్యటన 1934 మార్చి 9వ తేదీన మొదలైంది. పర్యటన పర్యవేక్షించడానికి సరోజినీ నాయుడు మూడురోజులు ముందుగానే హైదరాబాద్ విచ్చేశారు. రెండురోజుల ముందు అంటే 7వ తేదీన హరిజన సేవాదళం ప్రధాన కార్యదర్శి రావి నారాయణరెడ్డి, ఎల్.ఆర్.దాచా, బసంతరావు, కుమారి పద్మజానాయుడు మహాత్మునికి స్వాగతం పలుకడానికి వాడి స్టేషన్‌కు వెళ్ళారు. కానీ వారు మహాత్ముణ్ణి వికారాబాద్ స్టేషన్‌లో కలుసుకోగలిగారు.

మహాత్ముణ్ణి జనం ఒత్తిడి నుంచి తప్పించడానికి నగరానికి 15 మైళ్ళ దూరంలో వున్న లింగంపల్లిలో దింపారు. ఈ సమాచారం ముందుగానే తెలిసినందున సరోజినీ నాయుడు, కుమారి లీలామణి నాయుడు, మేజరు ముత్యాల గోవిందరాజులు నాయుడు, వామన్నాయక్, సిరాజుల్ హసన్‌తిర్మిజీ, వినాయకరావు విద్యాలంకార్, కె. తాతాచారి, రామకృష్ణ ధూత్‌లు ఎదురేగి మహాత్ముని తీసుకురావడానికి వెళ్ళారు. మొదట స్వాగతం పలికిన సరోజినీనాయుడు మహాత్ముని మెడలో ఖద్దరు నూలు హారం వేసి తన నివాస గృహమైన ఆబిడ్స్‌లోని 'గోల్డన్ థ్రెషోల్డ్' (బంగారు గడప)కు తీసుకు వచ్చారు. గాంధీజీ వెంటవున్న పరివార సభ్యులు నాంపల్లిలో దిగారు. వారిలో మీరా బెహన్ కూడా ఉన్నారు.

గాంధీజీ లింగంపల్లి స్టేషనులో దిగగానే ఒక పల్లెటూరి ముసలమ్మ ఆయన కారు దాకా పరిగెత్తి వచ్చి రెండణాలనుచేతిలో పెట్టింది. మందహాసంతో మహాత్ముడు ఆ కానుకను స్వీకరించారు. మరో స్త్రీ మహాత్ముడిని 'లోకరక్షక' అని సంబోధిస్తూ ఒక రూపాయి సమర్పించింది. మహాత్ముడు దీన్ని మహానందంగా తీసుకొని ఆమెను అభినందించారు. మహాత్ముడు బసచేసిన గోల్డన్ థ్రెషోల్డ్ వద్ద నగర పోలీసు కమీషనర్ కొత్వాల్ వెంకటరామారెడ్డి గట్టి బందోబస్తు ఏర్పాటు చేసి ప్రజలను అదుపులో ఉంచారు.

తరువాత మహాత్ముడు లాల్ దర్వాజ బయల్దేరగా దారికి ఇరువైపులా వేలాది జనం ఆయనకు అభినందనలు తెలిపి దర్శనం చేసుకున్నారు. వీథులన్నీ తోరణాలతో అలంకరించారు. ఆదిహిందూ విద్యాలయాన్ని మహాత్ముడు సందర్శించారు. శాంతి భవనములు, మార్వాడీ విద్యాలయము, కాచీగూడ హరిజన వసతి గృహము మొదలైనవి గాంధీజీ పర్యటించనున్న కార్యక్రమంలో చేర్చడం వలన ఆయా ప్రాంతాలకు గాంధీజీ వెళ్ళినప్పుడు ప్రజలు అత్యంత ఉత్సాహంతో గాంధీజీ దర్శనం కోసం నిలబడ్డారు. అయితే గాంధీజీ అలసిపోయి ఉన్నందున ఈ కార్యక్రమాలు రద్దుకావడంతో ప్రజలకు తీవ్రమైన ఆశాభంగం కలిగింది. ఆ తరువాత జరుగవలసిన కార్యక్రమాలకు ప్రభుత్వం అనుమతించలేదు. వివేకవర్ధనీవద్ద మేజరు ముత్యాల గోవిందరాజుల నాయుడు మొదలైన పెద్దలతోపాటు వేలాది జనం హాజరైనారు. లౌడు స్పీకర్లు అమర్చారు స్థానిక హరిజన సేవక సంఘం అధ్యక్షుడైన వామన్ నాయక్ మహాత్మునికి స్వాగత పత్రం

సమర్పించారు. అనంతరం హరిజనసేవా సంఘం వారు 1630 రూ॥లు, లాల్‌దర్వాజ పౌరులు 75రూ॥లు, మార్వాడీ విద్యాలయం వారు 100 రూ॥లు, ఆర్యసమాజ్ వారు 150 రూ॥లు, హరిజన నిధికి సమర్పించారు. ఆ తరువాత మహాత్ముని ఉపన్యాసం ఈ విధంగా సాగింది:-

'మానవులంతా ఒక్కటే. వారిలో తరతమ భేదాలుండరాదు. హరిజనులకు, ఇతరులకు మధ్యభేదం లేదు. అట్లే హిందూ-ముస్లింల మధ్య విభేదాలుండరాదు. భగవంతుని 'అల్లా' అనవచ్చు, 'ఈశ్వరుడు' అనవచ్చు. ఏ పేరు పెట్టి పిలిచినా మనమంతా భగవంతుని సేవకులము. హిందువులు అస్పృశ్యత అనే కళంకాన్ని నిర్మూలించుకోవాలి. ఈ కళంకాన్ని దూరం చేయడానికి ప్రయత్నిస్తున్నాను. కాబట్టి మీరంతా హరిజనోద్ధరణ కార్యక్రమానికి తోడ్పడండి'.

1934 మార్చి 9 సాయంత్రం 5 గంటలకు సికిందరాబాద్ కర్బలా మైదానంలో పెద్ద సభ జరిగింది. పౌరుల పక్షాన బాజీకృష్ణారావు స్వాగతం పలికి వెయ్యి రూ॥లు హరిజన నిధికి సమర్పించారు. బేగంపేట కన్యాగురుకుల పాఠశాల బాలికలు వందేమాతరం గీతాలాపన అనంతరం వేదములోని ఒక 'పనస'ను శ్రావ్యంగా చదివారు. దీనికి ఆశ్చర్యపడిన మహాత్ముడు, 'వేదం చదివిన పిల్లలు హరిజనులని నేననుకోను' అని అన్నారు. 'నేను హైదరాబాదుకు వచ్చింది అస్పృశ్యత నివారణకే. ఈ నా కార్యక్రమంలో మీ సహకారం ఉండాలి. నేను ఈ పనిని ఆత్మశుద్ధికోసం చేస్తున్నాను. నా ఉద్యమంలో అసూయాద్వేషాలకు తావులేదు. ఉన్నత మతానికి చెందిన డాక్టర్లు హరిజన రోగికి చికిత్స చేయడానికి వెనకాడతారని డా॥ లతీఫ్ సయీద్ అంటున్నారు. హరిజనులకు సేవ చేయడం హిందువుల విద్యుక్త ధర్మం' అన్నారు గాంధీజీ. వేలం వేయడానికి సిద్ధ హస్తుడని పేరు తెచ్చుకున్న ఆర్.ఎస్. నాయక్‌ను పిలిచి వస్తువులను వేలం వేయించారు. మహాత్ముడు సభావేదికనుండి కారు ఆగి ఉన్న స్థలానికి చేరుకోవడానికి 15 నిమిషాలు పట్టింది. సభలో అంతమంది జనం ఉన్నారన్న మాట. సికింద్రాబాద్ స్టేషనులో మహాత్మునికి వీడ్కోలు చెప్పిన వారిలో వామన్ నాయక్, సరోజినీనాయుడు, పద్మజానాయుడు మొదలైన ప్రముఖులున్నారు. స్వల్ప వ్యవధిలోనే స్టేషనులో 225రూపాయలు వసూలైనవి. కాజీపేట స్టేషనులో రావి నారాయణరెడ్డిగారు 1900 రూ॥లు గాంధీజీకి సమర్పించారు.

ఈ పర్యటనలో హైదరాబాద్, సికింద్రాబాద్ నగరాలలో మొత్తం 10 వేలవరకు

వసూలయ్యాయి. మహాత్ముడు ఎరవాడ జైల్లో ప్రాయోపవేశం చేసినప్పుడు ఒక మామిడి చెట్టుకింద విశ్రమించారు. దాని విత్తుతో ఒక మొలక పుట్టుకు వచ్చింది. ఆ మొలకను తన వెంట తీసుకువచ్చి తన జ్ఞాపకార్థం గోల్డన్ థ్రెషోల్డ్‌లో నాటారు.

మహాత్ముని మూడవ పర్యటన:

1946 జనవరి చివరివారంలో మహాత్ముడు దక్షిణభారత హిందీ ప్రచార సభ రజతోత్సవాలలో పాల్గొనడానికి మద్రాసు వెళ్ళవలసి వచ్చింది. తిరుగు ప్రయాణంలో మహాత్ముడు ఖాజీపేట మార్గంలో వెళ్ళితే తెలంగాణాలోని ముఖ్యకేంద్రాలైన ఖమ్మం, వరంగల్ ప్రజలకు మహాత్ముని దర్శించుకునే వీలు కలుగుతుందనీ, తద్వారా తెలంగాణాలో స్వాతంత్ర్యోద్యమానికి కొత్త ఊపిరి లభిస్తుందనీ ఆంధ్ర మహాసభ జాతీయ పక్షం తీర్మానించింది. అయితే మహాత్ముడు దీనికి నిరాకరించారు. అప్పుడు మహాసభ నాయకులు మహాత్మునితో పరిచయమున్న ఎం.ఎస్. రాజలింగం గారిని మద్రాసు పంపి కార్యక్రమం ఖరారు చేసుకురమ్మని కోరారు. దీనిపై రాజలింగం మద్రాసు వెళ్ళి గొల్లపూడి సీతారామశాస్త్రిని కలుసుకుని, తెలంగాణాలో ఒకవైపు ముస్లిం మతోన్మాదులు, మరొకవైపు కమ్యూనిస్టులు చేస్తున్న దురాగతాలను దృష్టిలో పెట్టుకుని ఈ ప్రాంతంలో గాంధీజీ పర్యటిస్తే ప్రజలకు నైతిక బలం చేకూరుతుందని విశదపరిచారు. ఇదంతా విన్న గాంధీ మహాత్ముడు ఖమ్మం, వరంగల్‌లోనే కాదు అవసరమైన అన్నిచోట్ల ఆగుతానని అభయమిచ్చారు. గాంధీమహాత్ముని పర్యటనకోసం స్పెషల్ రైలు ఏర్పాటు చేయడం జరిగింది.

గాంధీ మహాత్ముని అంగీకారం పొందగానే రాజలింగం ఈ వార్తను నాయకులకు తెలియజేశారు. వ్యవధి రెండు మూడు రోజులే ఉన్నందున మధిర, మానుకోట, డోర్నకల్ కార్యకర్తలకు వెంటనే ఈ వార్త అందజేశారు. వేలకొలది కరపత్రాలను గ్రామాలకు పంపించారు. స్వామీ రామానంద తీర్థ నగరంలో లేరు. మందుముల నరసింగరావుని తీసుకురావటానికి ఒక కార్యకర్తను ప్రత్యేకంగా పంపించారు. రాజలింగం రైలులో మహాత్ముని వెంటవచ్చారు.

ఖమ్మంలో ఆంధ్ర మహాసభ జాతీయ పక్షం పట్టణ సమితి అధ్యక్షుడు గెల్లా కేశవరావు, ఖమ్మం వర్తక సంఘం అధ్యక్షుడు సుగ్గుల అక్షయ లింగం గుప్తా ఐదువేల నిధి వసూలు చేశారు. ఖమ్మంలో వెంకటగిరి లెవల్ క్రాసింగ్ గేటు వద్ద విశాలమైన మైదానంలో స్పెషల్ రైలు బండిని ఆపారు. మహాత్ముని దర్శనం కోసం ప్రజలు తండోపతండంగా వచ్చారు. సర్దార్ జమలాపురం కేశవరావు ఈ ప్రజానీకాన్ని అదుపులో పెట్టారు. రైల్వే స్టేషన్ నుంచి ఒక ఫర్లాంగు దూరంలో 15 అడుగుల ఎత్తున బల్లలతో వేదిక నిర్మించారు. రాత్రి ఎనిమిది గంటలనుంచే జనం రావడం మొదలైంది. రాత్రి నుంచి వేచి ఉన్న ప్రజల నుంచి వాలంటీర్లు 1500 రూ॥లు వసూలు చేశారు. ఉదయం 8-30 ని॥లకు స్పెషల్ రైలుబండి మైదానం వద్ద ఆగింది. మహాత్ముని వెంట కాను గాంధీ, కృష్ణబజాజ్, ఉన్నవ రాజగోపాల కృష్ణయ్య, ఎం.ఎస్. రాజలింగం మొదలైనవారు వేదికమీద కూర్చున్నారు.

స్వాగత పత్రం అందుకున్న మహాత్మునికి వెయ్యినూట పదహారు రూపాయలు వెండి పళ్ళెంలో పోసి సమర్పించారు. 'అయితే ఈ వెండి పళ్ళెం కూడా నాదేనా?' అని ముసి ముసి నవ్వులతో మహాత్ముడు ప్రశ్నించాడు. నినాదాలు పెట్టకుండా నిశ్శబ్దంగా ఉన్న ప్రజలను మహాత్ముడు ప్రశంసించారు. ఆ తరువాత, 'ప్రజలందరూ కలసి మెలసి ఉండాలి. కులమత భేదాలు పాటించవద్దు. అందరూ ఖాదీ వస్త్రాలు ధరించాలి. రాట్నం వడకాలి. త్వరలో రానున్న స్వరాజ్యానికి అర్హత సంపాదించు కోవాలని' మహాత్ముడు ఉద్బోధించారు.

డోర్నకల్ చిన్న పట్టణమైనా సుమారు ఏడువందల మంది మహాత్ముని దర్శనం చేసుకున్నారు. 4000 రూ॥ల విరాళం సమర్పించారు. గుండ్రాతి మడుగు లో 400 మంది హరిజనులు భక్తితో వచ్చి గాంధీమహాత్ముని సందర్శించి 2000 రూ॥ల నిధి సమర్పించారు. వారితో గాంధీజీ 15 నిమిషాలు మాట్లాడారు. మానుకోటలో 800 మంది జనం వచ్చారు. వారు 700 రూ॥లు హరిజన నిధికి సమర్పించుకున్నారు.

వరంగల్:

1946 ఫిబ్రవరి 5వ తేదీన గాంధీజీ వరంగల్ రానున్నారని ప్రచారం జరిగింది. అంతకుముందు రెండుమూడు రోజుల నుంచి నాయకులు పక్క గ్రామాలలో

ముమ్మరంగా ప్రచారం చేశారు. వరంగల్, హన్మకొండ, విద్యార్థి సంఘాల వాలంటీర్లు 800 మంది 'స్వతంత్ర భారత్‌కీ జై' అనే నినాదాలతో వరంగల్ స్టేషనుకు చేరుకున్నారు. గూడ్సు స్టేషను పక్కన గాంధీ మహాత్ముడు దర్శనమిచ్చి సందేశమివ్వడానికి నిర్ణయించ బడిన స్థలం వద్దకు ఉదయం ఏడు గంటలనుండే జనం రావడం మొదలైంది. కార్యక్రమం ప్రకారం గాంధీజీ ఉ॥ 9గం॥ 20 ని॥లకు రావలసి ఉంది. కానీ స్పెషల్ ట్రెయిను. మార్గమధ్యంలో అన్ని స్టేషన్లలో ఆగటంవలన 12-20గం॥లకు చేరింది. అక్కడికి వచ్చిన ప్రజలనుంచి పదివేల విరాళం సేకరించగలిగారు. కొందరు స్త్రీలు బంగారు ఆభరణాలు విరాళంగా ఇచ్చారు. గాంధీ మహాత్ముని పర్యటన విజయవంతం చేయడానికి ఏర్పడిన ఆహ్వాన సంఘంలో హయగ్రీవాచారి, ఎం.ఎస్.రాజలింగం, భండారు చంద్రమౌళీశ్వరరావు, ఎస్.శ్రీరాములు నాయుడు, ఎస్.చంద్రమౌళి, బి.రంగనాయకులు ఉన్నారు. ఆహ్వాన సంఘం పక్షాన టి. హయగ్రీవాచారి మహాత్ముని హరిజన నిధికి 15,000 రూ॥ల విరాళం సమర్పించారు. చందా కాంతయ్య ఒక్కరే 5000 రూ॥లు ఇచ్చారు. ఒక హరిజన బాలిక మహాత్ముని నుదుట తిలకం దిద్దబోగా మందహాసంతో స్వీకరించారు. మధ్యాహ్నం 12-30 గం॥లకు స్పెషల్ రైలు వరంగల్ ప్లాట్‌ఫారం మీద ఆగగానే గాంధీజీ రైలుదిగి వేదికపై గొడుగుపట్టుకొని నిలిచి, ఉదయం నుంచి ఎండను లెక్కచేయక ఆకలి దప్పులు మరచి తదేక శ్రద్ధతో ఎదురుచూస్తున్న లక్షాయాభైవేల ప్రజా సందోహానికి దర్శనమిచ్చిన దృశ్యం నిజంగా చూడదగినది. దీన్ని చూసిన ప్రతి కనుదోయి నుండి ఆనంద బాష్పాలు రాలినవి. మహాత్ముని పాద స్పర్శ చేత వరంగల్ నేల పవిత్రమైనది. గాంధీ మహాత్ముడు ఉన్న పది నిమిషాలు పదివర్షాల తుల్యం. గాంధీ మహాత్ముని వెంట హయగ్రీవాచారి, రాజలింగం మొదలైన కొందరు నాయకులు స్పెషల్ రైల్లో ఖాజీపేట వరకు వెళ్ళారు. నాయకుల కృషి ఫలితంగా జరిగిన గాంధీ మహాత్ముని పర్యటన వలన తెలంగాణా ప్రజలలో మహత్తరమైన చైతన్యం కలిగింది.

డోర్నకల్ స్టేషనులో బండి ఆగినప్పుడు గాంధీజీ స్నానం చేయడానికి స్టేషను మాష్టరు అంగీకరించలేదు. అనుమతిస్తే తన ఉద్యోగం పోతుందని భయపడ్డాడు. చివరకు రాజలింగంగారు బక్కెటు అడిగి తీసుకొని రెండుమూడు బక్కెట్ల నీళ్ళు స్టేషను పక్కనున్న వారి సహాయంతో స్టేషనులోని బాత్‌రూంలో పెట్టించగలిగారు. బాపు స్నానం చేశారు.

1946లో బాపు అంతటి వాడికి స్నానానికి ఇబ్బంది అయింది. ఆ ప్రదేశాలు నిజాం రాష్ట్రం పాలనలో ఉన్నవని తెలుసుకుంటే ఇక్కడ పరిస్థితులు ఎలా ఉన్నాయో అర్థమవుతుంది.

స్పెషల్ ట్రెయిన్ తెలంగాణా సరిహద్దులు దాటబోయే ముందు గాంధీజీ ఆంధ్రులకు స్వదస్తూరితో ఈ సందేశమిచ్చారు:-

'ఆంధ్రదేశంపై నాకు చాలా ఆశ ఉంది. ఆంధ్రదేశం నా ఆశయాలను పూర్తిగా నెరవేరుస్తుందని నా నమ్మకం. అది ఏమంటే- అస్పృశ్యతను పూర్తిగా తొలగించాలి. అస్పృశ్యుల కొరకు దేవాలయాలన్నీ తెరచి వుంచాలి- అందరూ ఖద్దరు ధరించాలి. జాతీయ సమైక్యతను కాపాడాలి. మాతృ భాషతోపాటు జాతీయ భాష అయిన హిందూస్థానీని- దేవనాగరి, ఉర్దూ లిపులలో నేర్చుకోవాలి'.

కాజీపేట *ఎం.కె.గాంధీ*

5-2-1946

❑

30. స్టేట్ కాంగ్రెస్ ఉద్యమాలు

1938లో స్టేట్ కాంగ్రెస్ అవతరించింది. నాయకులు నిజాం ఛత్రచ్ఛాయలో ప్రజాప్రభుత్వం స్థాపించడం తమ లక్ష్యమని ప్రకటించారు. కాంగ్రెస్ మతపాక్షిక సంస్థ కాదని, రాష్ట్రేతర ప్రాంత కాంగ్రెస్ రాజకీయాలతో స్టేట్ కాంగ్రెసుకు సంబంధం ఉండదని వీరు సోదర ముస్లిం నాయకులను, నిజాం ప్రభుత్వాన్ని విశ్వసింపజేసేందుకు ఎంతగానో కృషిచేశారు. కానీ వారి కృషి చెవిటివాని ముందు శంఖారావమైంది.

హైదరాబాద్ స్వాతంత్ర్య సంగ్రామంలో సిరాజుల్ హసన్ తిర్మజీ నిర్వహించిన ప్రముఖ పాత్రను ప్రస్తావించడం అవసరం. ఆ రోజులలో తిర్మజీ కాంగ్రెసు వాదుల లో ప్రత్యేకంగా చెప్పుకోదగినవాడు. ముస్లిం మతపాక్షికత అనే ఉగ్గుపాలతో పెంచబడిన హైదరాబాద్ రాజ్యం వంటి చోట ఆయన జాతీయోద్యమం పట్ల అసమాన ధైర్యస్థైర్యాన్ని అచంచలమైన విశ్వాసాన్ని ప్రదర్శించాడు. మతపాక్షిక తత్వానికి వ్యతిరేకంగా ఆయన ఎడతెగని పోరాటం జరిపాడు. ఎన్నో బాధలకు గురైనాడు. ముస్లిం మతశక్తులవల్ల అనేక అవమానాలకు గురి అయినాడు. కొనవూపిరి వదిలేవరకు కూడా ఆయన నిష్కల్మష జాతీయవాదిగానే ఉన్నాడు.

హైదరాబాద్‌లో బాధ్యతాయుత ప్రభుత్వం ఏ రూపంలో ఏ పేరుతో ఏర్పడినా అది హిందూ ప్రజల ఆధిక్యతకే దారి తీస్తుందని, ముస్లిం నాయకులు అలాంటి ఉద్యమాన్ని ససేమిరా అంగీకరించరని ఇత్తెహాదుల్ ముసల్మీన్ భీష్మించుకుని కూర్చుంది. 1939 నుండి క్రమంగా పరిస్థితులలో మార్పులు వచ్చాయి. 1942లో మహాత్ముడు క్విట్ ఇండియా ఉద్యమం ప్రకటించాడు. ఇది భారతదేశాన్నంతటినీ ఒకే ఉద్యమంగా మార్చివేసింది. కాలగతిని గమనించి నిజాం ప్రభుత్వం 1946 జూన్ 3వ తేదీన స్టేట్ కాంగ్రెస్‌పై ఆంక్షలు తొలగించింది.

1941 ఆగష్టు నెలలో సర్ అక్బర్ హైదరీ స్థానంలో నవాబు ఛత్తారీ సంస్థాన ప్రధానిగా వచ్చాడు. 1942లో ఒక దారుణ ఉదంతం జరిగింది. నిజామాబాద్ జిల్లా డిచ్‌పల్లి గ్రామంలో క్రైస్తవ మిషనరీవారు ఒక లెప్రెసీ హాస్పిటల్ నడుపుతుండేవారు. ముస్లిం పేషంట్లు హాస్పిటల్ ఆవరణలోనే ఒక చబూత్రా (అరుగు) నిర్మించుకుని దానికి మసీదు రూపమిచ్చి నమాజు చదవడం మొదలు పెట్టారు. ఇది హాస్పిటల్ నిబంధనకు విరుద్ధం కనుక ఆస్పత్రి అధికారులు దాన్ని కూల్చివేశారు. ఏ చిన్న సాకు దొరికినా దానికి మతపరమైన రంగు పులమటం ఇత్తెహాదుల్ ముసల్మీన్ సహజలక్షణం.

అంతటితో ముస్లింలు విశృంఖల విహారం ప్రారంభించారు. ఆ రోజులలో గ్రిగ్సన్ రెవిన్యూ, పోలీసుశాఖల మంత్రి. అతనికి సహజంగా మిషనరీలంటే సానుభూతి. రెసిడెంటు కూడా యూరోపియనే. కనుక అతని సానుభూతి అటే. ఛత్తారీ నవాబు ముస్లిం అయినా, మంత్రులు ముస్లింలే అయినా ఈ వ్యవహారంలో ఏమీ చెయ్యలేక పోయారు. అందుచేత ముస్లింలు రెచ్చిపోయి ప్రధానమంత్రి నివాసమైన షామంజిల్ (ప్రస్తుత రాజభవన్) గ్రిగ్సన్ ఉండే నివాసం (గ్రీన్‌ల్యాండ్) రెంటిపై దాడి చేశారు. ఛత్తారీ నవాబు మీసాలు పట్టుకు లాగారు. ఇంటిని కాల్చారు. గ్రీన్ ల్యాండ్‌లో గ్రిగ్సన్ దొర దొరకలేదు. ఈయన లైబ్రరీ, ఇల్లు కాల్చారు.

ఆ రోజున ప్రభుత్వం ఒక్క తుపాకి గుండు పేల్చినా తరువాత రజాకారు ఉద్యమం తల ఎత్తేది కాదు. పోలీసు కమీషనర్ నిస్సహాయుడై షామంజిల్ కాలుతుంటే చూస్తూ నిశ్చేష్టుడై నిలిచాడు. అందువల్ల కూడా ఈ అరాజకశక్తులు మరీ వీరవిహారం ప్రారంభించాయి. దాని ఫలితం ఛత్తారీ నవాబు నిర్గమనం.

దీని తరువాత సర్ మిర్జా ఇస్మాయిల్ ప్రధానమంత్రి అయ్యాడు. ఇతడు జాతీయవాది. వ్యవహార దక్షుడు. సమయోచిత ప్రజ్ఞ కలవాడు. మైసూరు, జైపూర్ సంస్థానాలలో ప్రధానమంత్రిగా విప్లవాత్మక మార్పులు తెచ్చాడు. నిద్రాణమైన హైదరాబాద్ సంస్థానాన్ని మేల్కొలిపి అధునాతన సంస్కరణలు ప్రవేశపెట్టడానికి ఆయన చేసిన ప్రయత్నాలు ఫలించలేదు. హైదరాబాద్ ముస్లిం ప్రజలు ఆయనను 'తోడ్ ఫోడ్' ఖాన్ అనే పేరుతో పిలిచేవారు. ఆయన ఎడల నిజాం ప్రభుత్వానికి గానీ,

ఇత్తెహాదుల్ ముసల్మీన్ సంస్థకుగానీ సానుభూతి లేదు. తన పట్ల నిరసన భావం భరించలేక సర్ మీర్జా తొమ్మిది నెలలకే 1947 మేలో ప్రధాని పదవికి రాజీనామా చేశాడు. ఆయన ప్రధానమంత్రి పదవిని వదిలిన తరువాత కూడా ఇండియన్ యూనియన్‌లో చేరవలసిందని నిజాంకు సలహాలిచ్చేవాడు. కానీ నిజాం ఆయన సలహాలను పెడచెవిని పెట్టాడు. బహదుర్ యార్‌జంగ్ చనిపోయిన తరువాత ఖాసింరజ్వీ ఇత్తెహాద్ నాయకత్వాన్ని హస్తగతం చేసుకున్నాడు. ఇతడు లాతూర్‌లో వకాలతు చేసుకునేవాడు. రజాకారు అంటే స్వచ్ఛంద సేవకుడు (వాలంటీరు).

నాటికి కాంగ్రెస్‌పై నిషేధం తొలగించారు. స్వామీ రామానంద తీర్థ అధ్యక్షతన హైదరాబాద్‌లో స్టేట్ కాంగ్రెస్ ప్రథమ మహాసభ 1947 మే 8వ తేదీన చిక్కడపల్లిలో జరిగింది. హైదరాబాద్ చరిత్రలో అంత పెద్ద సభ మునుపెన్నడూ జరగలేదు. స్వామీజీ అధ్యక్షోపన్యాసం ప్రజలను ఉగ్రూతలూగించింది. యువకుల రక్తం ఉడికిపోయింది. అదేరోజు ఇత్తెహాదుల్ ముసల్మీన్ నాయకులు స్వతంత్ర హైదరాబాద్ నినాదం లేవదీశారు. కాశింరజ్వీ నాయకత్వాన రజాకార్ ఉద్యమం ప్రారంభమైంది.

1947 ఆగస్టు 15వ తేదీన భారతదేశం స్వాతంత్ర్యం పొందింది. ఆసేతు హిమాచల పర్యంతం చండకిరణుడయిన స్వతంత్ర భానుడు సహస్ర కిరణాలతో ప్రకాశించాడు. కాని హైదరాబాద్ సంస్థానంలో నిజాం స్వాతంత్ర్యాన్ని అడ్డుకుని గాడాంధకారం సృష్టించాడు.

మొగిలయ్య బలిదానం:

భారతదేశానికి స్వాతంత్ర్యం లభించనున్న ఒకరోజు ముందుగానే నిజాం తాను స్వతంత్రుడనని ప్రకటించుకున్నాడు. అందుకని భారత జాతీయ పతాకం విదేశీ పతాకంగా భావింపబడింది. వరంగల్లు కోటలో జాతీయ జెండా ఎగురవేయాలని ఆంధ్ర మహాసభ, వామపక్షాల కలయికతో ఏర్పడిన ఆంధ్ర జాతీయపక్షం తీర్మానించింది. ఆ తీర్మానానికి అనుకూలంగానే పతాకావిష్కరణ జరిగింది. వాలంటీర్లలో ఒకరైన మొగిలయ్య ఉదయం 8 గంటలకే మహాత్మాగాంధీకీ జై, కాంగ్రెస్‌కీ జై, త్రివర్ణ పతాకానికీ జై, భారత మాతాకీ జై అంటూ వీరావేశంతో

నినాదాలు చేశాడు. ఇంకా అందరూ నినాదాలు చేయడం మొదలు పెట్టారు. కోట కోటంతా మారుమోగింది. అంతలోనే ఎక్కడి నుంచో రెండు వందల మంది దుండగులు సాయుధులై వచ్చారు. నినాదాలు చేస్తున్న మొగలయ్యను చూడగానే దుండగులు రెచ్చిపోయి బల్లెంతో అతడిని పొడిచి వేశారు. హంతకుల్లో ఒకడి ఒళ్ళు రక్తసిక్తమైంది. అతడు నెత్తురు కారుతున్న బల్లెంతో గుంపులో కలిశాడు. ఆ దుండగుల గుంపుతో ఊరేగింపు జరిగింది. అమీన్‌పట్టణంలోకి రాగానే జిల్లా కలెక్టరు ఎదురేగి హంతకుని మెడలో దండలు వేశాడు. ఆ హంతకుడు రక్తసిక్త హస్తాలతో మెడలో పూలదండలు తీసి వికటాట్టహాసంతో తన సహచరులను అభినందిస్తున్నట్లు వారిపై వాటిని విసిరాడు. ఆ హంతకుని పేరు షరీఫ్.

షరీఫ్‌ని 'లక్ష్మీపహల్వాన్' అనేవారు. ఈ వార్త పత్రికలకు ఎక్కలేదు. మొగిలయ్య హత్య వార్త సామాన్యమైనది కాదు. ఈ రోజుల్లో నైతే దేశమంతా గగ్గోలు పుట్టించేది. ఈ హత్య 9 ఆగస్టు 1946న జరిగింది. సర్ మిర్జా ఇస్మాయిల్ ప్రధాని బాధ్యతలు స్వీకరించిన వారానికి ఈ విషాద సంఘటన జరిగింది. ఆయన పరిస్థితులను పరిశీలించడానికి వరంగల్లు వచ్చాడు. కాళోజీని తన వెంట తీసుకు పొమ్మని కోరినా ప్రభుత్వం అనుమతించలేదు. దీనిపై ఉగ్రుడైన కాళోజీ కలం నుంచి వెలువడిన గళం–

ఎన్నాళ్ళనుండియో ఇదిగో అనుచు
ఈనాటికైనను దిగివచ్చితివా?
కోట గోడల మధ్య ఖూనీ జరిగినచోట
గుండాల గుర్తులు గోచరించినవా
జెండా యెత్తిన జాంబియాలు చూసిన
రక్తం తప్పదంచు చెప్పి వచ్చితివా?

ఈ సందర్భంగా పర్యటనకొచ్చిన పోలీసు మంత్రి మిస్టర్ గ్రిక్సన్ చేసిన లీలా విలాసాలు దిగ్భ్రాంతికరమైనవి. వచ్చిన గ్రిక్సన్ గుళ్లు, గోపురాలు, కోటలు మున్నగువాటిని ముచ్చటగా ఫోటోలు తీస్తూ కాలం గడిపాడు. పోలీసు యంత్రాంగంలో బాధ్యతాయుతమైన అధికారిగా కాక పురావస్తు శాఖ అధికారిగా వ్యవహరించాడు.

బ్రిటిష్‌వారి కుటిల నీతి:

కుటిల రాజకీయాలలో నిష్ణాతులైన ఆంగ్లేయ సామ్రాజ్యవాదులు గత్యంతరం లేక భారతదేశం నుంచి వెళ్ళిపోయేముందు జాతీయ ప్రభుత్వానికి కఠిన సమస్యలను సృష్టించిపోయారు. తమ సామ్రాజ్యవాదానికి అనుగుణంగానే దేశాన్ని రెండు ముక్కలు చేసి భారత- పాకిస్తాన్‌లని విభజించి పోయారు. ఆంతరంగికంగా అనేక రాజకీయ కల్లోలాను సృష్టించి, నూతన జాతీయశక్తి బలపడకుండా ఉండాలని ఆ సామ్రాజ్యవాదుల దురాశ. కొరియా, వియత్నాం, లావోస్, జర్మనీ, తదితర దేశాల్లో ఇలాంటి విషబీజాలు వారు నాటిపోయారు. దేశాలను విభజించడమే కాదు, గృహ కల్లోలాను రేపి అంతర్యుద్ధ పరిస్థితిని కల్పించాలని ఆంగ్లేయుల కుట్రల యత్నం. దీనికి అనుగుణంగానే 1947 మార్చి 3వ తేదీనాడు ఒక ప్రకటన చేశారు. భారతదేశంలోని సంస్థానాధీశులు తమ సంస్థానాలను ఇష్టానుసారంగా పాకిస్తాన్ లేదా భారత్‌లో విలీనం చేసుకోవచ్చు. లేదా స్వాతంత్ర్యాన్ని ప్రకటించుకోవచ్చునని ఆ ప్రకటన సారాంశం. అయితే సర్దార్ పటేల్ సాహసంతో రాజకీయ విజ్ఞతతో రక్తపాతం లేకుండా దాదాపు సంస్థానాలన్నింటినీ భారత్‌లో విలీనం చేయగలిగారు. అంతర్యుద్ధం అనే ప్రమాదాన్ని నివారించి స్వతంత్ర భారత చరిత్రలో ఒక శాశ్వతమైన, సంస్మరణీయమైన పుటను జోడించిపోయారు.

హైదరాబాద్ సంస్థానం భారతదేశంలో విలీనం కాకుండా వుండాలని నిజాం, మజ్లిస్, కాశిం రజ్వీ ఇక్కడి ప్రజలను మభ్యపెట్టుతూ నాటకం ఆడారు. హిందువులు, ముస్లింలు తమకు రెండు కళ్ళులాంటివారని వాళ్ళిద్దరూ తన కళ్ళలాగే ప్రీతిపాత్రులని, హైదరాబాద్ సంస్థానాన్ని పాకిస్తాన్‌లో విలీనం చేసే పక్షంలో హిందువులు బాధపడతారు. భారత్‌లో విలీనం చేయడం ముస్లింలకు ఇష్టం లేదు. కాబట్టి ఆ పరిస్థితుల్లో తన రాజ్యం స్వతంత్రంగా వుండటమే మంచిదని నిజాం తెలివిగా ప్రకటించాడు. తన రాజ్యకాంక్షను, మత దురహంకారాన్ని కప్పిపుచ్చి ఒక ప్రత్యేక ఫర్మానా ద్వారా స్వాతంత్ర్యాన్ని చాటుకున్నాడు.

యథాతథ ఒడంబడిక:

నిజాం ప్రకటించిన స్వాతంత్ర్య ప్రకటనకు ప్రజామద్దతు లేదు. ఈ సంగతి తెలుసుకున్న వెంటనే భారత ప్రభుత్వంతో సంధి చర్యలకు నిజాం ప్రయత్నాలు

ప్రారంభించాడు. ప్రముఖ బ్రిటిష్ న్యాయవాది సర్ వాల్టర్ మాంక్టన్‌ని హైదరాబాద్‌కు పిలుపించుకుని తన రాజ్యాంగ సలహాదారుగా రోజుకి ఒక లక్షరూపాయల ఫీజుపై నియమించుకున్నాడు.

హైదరాబాద్ సంస్థానపు ప్రధానమంత్రి నవాబు ఛత్తారీ, రాజ్యాంగ సలహాదారు సర్ వాల్టర్ మాంక్టన్, న్యాయశాఖ కార్యదర్శి అలీయావర్ జంగ్‌లతో ఒక ప్రతినిధి వర్గాన్ని నిజాం ప్రభుత్వం రాయబారాల నిమిత్తం ఢిల్లీకి పంపింది. 1947 ఆగష్టు 15 నాటి పరిస్థితులలో ఎలాంటి మార్పు ఉండదని భారత ప్రభుత్వం ఖండితంగా చెప్పింది. అంటే విదేశీ వ్యవహారాలు, రవాణా, సైన్యం, భారత ప్రభుత్వం అధీనంలో ఉంటాయి. బ్రిటిష్‌వారి హయాంలో కొనసాగిన విధానమే ఇది. అందుకే దీన్ని యథారీతి ఒడంబడిక అన్నారు. ఇది హైదరాబాద్‌పై భారత ప్రభుత్వం తీసుకున్న తొలి తాత్కాలిక చర్య. దీన్ని అవకాశంగా తీసుకుని హైదరాబాద్ ప్రభుత్వం మరికొన్ని రాయితీలను కోరింది. వాటిలో మూడు ముఖ్యమైనవి.

1. భారత–పాకిస్తాన్‌ల మధ్య యుద్ధం వాటిల్లితే హైదరాబాద్ ప్రభుత్వం తటస్థంగా ఉంటుంది.

2. హైదరాబాద్ ప్రభుత్వానికి విదేశాలలో ఏజెంట్ జనరల్స్‌ని నియమించుకునే అధికారం ఉండాలి.

3. భారతదేశం కనుక కామన్ వెల్త్ నుంచి విడిపోతే ఈ విషయంలో స్వతంత్రంగా వ్యవహరించడానికి హైదరాబాద్ ప్రభుత్వానికి అవకాశం ఉండాలి.

కానీ మొదటి ఒడంబడికలోని 'పుల్‌స్టాఫ్, కామా' లని కూడా మార్చటానికి వీలులేదని గవర్నరు జనరల్ లార్డ్ మౌంట్ బాటెన్ ఖండితంగా చెప్పాడు.

హైదరాబాద్ ప్రభుత్వం తన ఏజెంట్–జనరల్‌గా సుప్రసిద్ధ ఇంజనీరు నవాబు జైన్‌యార్‌జంగ్‌ని ఢిల్లీలో నియమించింది. ఆయన గొప్ప జాతీయవాది. సౌమ్యుడు. అసలు హైదరాబాద్ విషయమై ఇంత రాద్ధాంతం జరుగవలసిన అవసరమేలేదు. ఎంత ఔదార్యంగల ప్రభుత్వం కేంద్రంలో అధికారంలో ఉన్నా కూడా హైదరాబాద్‌కు స్వాతంత్ర్యం లభిస్తుందని అనుకోరు. చారిత్రకంగా కానీ, భౌగోళికంగా గానీ ఈ వాదన ఆచరణ సాధ్యం కానిది. భారత ప్రభుత్వం దేశ విభజనకు సంబంధించిన

వివిధ సమస్యలతో తలమునకలై ఉండటం వలన హైదరాబాద్‌కు ఈ అవకాశ మిచ్చింది.

నిజాం ఢిల్లీకి పంపిన ప్రతినిధి వర్గం యథారీతి ఒడంబడికను కుదుర్చుకుని నిజాం సంతకం కోసం హైదరాబాద్‌కు తిరిగి వచ్చింది. ఆగష్టు 27న నిజాం వారికి దర్శనమిచ్చాడు. ప్రతినిధి వర్గం సభ్యుల వెంట ఇత్తెహాదుల్ ముసల్మీన్ నాయకుడు ఖాసిం రజ్వీ నిజాంను సందర్శించుకున్నాడు. ఒడంబడిక మీద సంతకం చేయవద్దని, ఉత్తరాదిన అనేక సమస్యలతో భారత ప్రభుత్వం తలమునకలై ఉంది కనుక మనం కొంచెం కఠిన వైఖరి వహిస్తే మన షరతులన్నిటినీ అది అంగీకరించి తీరుతుందని నిజాంను తప్పుదారి పట్టించడానికి రజ్వీ ప్రయత్నించాడు. కానీ నిజాం పక్కా రాజకీయ వేత్త. ముఖ్యంగా పరిపాలనానుభవం ఉన్నవాడు. ఒడంబడికపై సంతకం పెట్టకపోతే రాగల పరిణామాలు అతనికి తెలుసు. ఏతా వాతా పరిస్థితులు చేయిజారి పోవడం నిజాంకు ఇష్టం లేదు. నిజాం సంతకం చేసిన పత్రాన్ని భారత ప్రభుత్వానికి అందజేయడానికి ప్రతినిధి వర్గం రేపు ఢిల్లీ రానుండగా ఆ రాత్రికి రాత్రే 50 వేల రజాకార్ల మూక (రజ్వీ పోషించిన అనధికార సైన్యం) ప్రధాని నవాబు ఛత్తారీ భవనాన్ని చుట్టుముట్టి నానారభస చేసింది. ఛత్తారీమీద చేయి చేసుకుంది. ఈ అవమానంతో తలెత్తలేని ఛత్తారీ 1947 నవంబరు 1వ తేదీన తన పదవికి రాజీనామా చేసి వెళ్ళిపోయాడు.

ఛత్తారీ స్థానంలో మెహదీ యార్‌జంగ్‌ని తాత్కాలికంగా ప్రధానిగా నిజాం నియమించాడు. తన అభీష్టానికి విరుద్ధంగా యథారీతి ఒడంబడికను భారత ప్రభుత్వానికి అందజేసినందుకు నిరసనగా ప్రధాని పదవినుంచి మెహదీ యార్‌జంగ్‌ను తొలగించవలసిందని నిజాంపై రజ్వీ ఒత్తిడి తెచ్చాడు. మెహదీ యార్‌జంగ్ రాజీనామా చేయగానే 1947 నవంబరు 29వ తేదీన లాయక్ అలీని ప్రధానమంత్రిగా నిజాం నియమించాడు.

లాయక్ అలీ 'నాలాయక్'- పనులు:

'లాయక్' అంటే తెలివైనవాడని అర్థం. కానీ ఈ లాయక్ అలీ మాత్రం అన్నీ 'నాలాయక్' (తెలివిలేని) పనులే ఒకటి తరువాత ఒకటి చేస్తుండిపోయాడు. అధికారం

స్వీకరించగానే లాయక్ అలీ ప్రభుత్వం పాకిస్తాన్‌కు 20 కోట్ల రూపాయలను ఋణంగా ఇచ్చింది. దేశ విభజన ఫలితంగా పాకిస్తాన్‌కు ఇవ్వతేలిన ఆస్తుల విలువ యాభై కోట్ల రూపాయల విషయంలో పాకిస్తాన్‌తో మంతనాలు జరుగుతుండగానే ఈ వ్యవహారం జరగడం కేంద్రప్రభుత్వానికి మరీ అభ్యంతరకరమైనది. దేశవిభజన సమయంలో ఉత్తరాదినుంచి వచ్చిన కాందిశీకులలో చాలా మంది ముస్లింలకి నిజాం తన రాష్ట్రంలో పునరావాసం కలిగించాడు. వీరంతా రజాకార్లతోకలిసి వూళ్ళకు వూళ్ళే దోచుకున్నారు. వీరి రాకవల్ల శాంతిభద్రతల సమస్య మరింత తీవ్రమైంది. సముద్రపు దొంగ అని పేరుమోసిన ఇంగ్లీషు నావికుడు సిడ్నీకాటన్ రహస్యంగా రాష్ట్రంలోకి ఆయుధాలను చేరవేసేవాడు. హైదరాబాద్‌లో తన ఏజెంట్–జనరల్‌గా భారత ప్రభుత్వం కె.ఎం. మున్షీని నియమించింది. ఆయన గొప్ప రాజనీతిజ్ఞుడే గాక గొప్ప రచయిత. బొలారంలోని దక్షిణ సదన్ (ప్రస్తుతం రాష్ట్రపతి నిలయం)లో ఆయన నివాసం. హైదరాబాద్‌లో ఉన్న రోజులలోనే మున్షీ 'దేవల్‌దేవి' అనే చారిత్రక నవల రాశాడు.

ఆ రోజుల్లో రాజ్యం నడిపింది నిజాం కాదు. లాయక్ అలీ అంతకన్న కాదు. ఖాసిం రజ్వీయే. 'బంగాళాఖాతం, అరేబియా సముద్రంలోని జలతరంగాలు మా నిజాం ప్రభువు పాదాలు కడగ గలవు' అని రజ్వీ గంభీరోక్తులు పలికేవాడు. 'అసఫియా రాజ్య పతాకం ఢిల్లీలో లాల్‌ఖిల్లాపై ఎగురగలద'ని ప్రగల్భాలు పలికాడు.

నిజాంపై బాంబు:

నిజాంరాజు ప్రతిరోజు సాయంత్రం 5 గంటలకు తన నివాసమైన కింగ్‌కోఠీ నుంచి కారులో బయలుదేరి తన తల్లి సమాధి దగ్గరకు వెళ్ళేవాడు. ఆయన కారు వెళ్ళడానికి అరగంట ముందే నగరపోలీసులు కట్టుదిట్టంగా బందోబస్తు చేసేవారు. నిజాం కారుమీద బాంబువేసి అతన్ని తుది ముట్టించాలని నారాయణరావు పవార్ ఆయన అనుచరులు ఒక ప్రణాళిక వేసుకున్నారు. 1947 డిసెంబరు 4వ తేదీన కింగ్‌కోఠీ మార్గంలో ఆల్ సెయింట్ స్కూలు మలుపు దగ్గర వేచియున్న తన అనుచరులు జగదీశ్ ఆర్య, గండయ్యలతో సాయంత్రం 4–30 గంటలకు సిద్ధమయ్యాడు. ఆల్ సెయింట్ స్కూలు దగ్గర వేచియున్న నారాయణరావు పవార్ ఒక హేండ్‌గ్రెనేడ్‌ను నిజాం కారుపై బలంగా విసిరాడు.

ఆ గ్రెనేడ్ కారు తలుపులకు తగిలి బోర్డు మీద పడి పేలిపోయింది. పెద్ద ధ్వనితో రోడ్డు మీద పొగ కమ్మింది. కారు ముందుకు దూసుకుపోవడంతో నిజాం ప్రభువుకు ఎలాంటి ప్రమాదం జరుగలేదు. వెంటనే జనం నారాయణరావు పవార్‌పై విరుచుకు పడ్డారు. ఒక అరబ్బు పవార్‌ను తన చేతిలో ఉన్న బర్చీతో అంతం చేయబోయాడు. కానీ సబ్‌ఇన్స్‌పెక్టర్ అడ్డు పడ్డాడు. పవార్‌ను బంధించి కస్టడీలోకి తీసుకున్నారు. సెషన్స్ కోర్టు ఆయనకు ఉరిశిక్ష విధించింది. దానిని హైకోర్టు ధ్రువీకరించింది. జైలులో ఆయన నరక బాధలను అనుభవించాడు. పోలీసు చర్య అనంతరం స్వామీజీ జోక్యంతో పవార్‌ని విడుదల చేశారు.

నిజాం తన సంస్థానంలో హిందువులను అణచివేయాలనే ప్రయత్నంలో భాగంగా ముస్లిం జనసంఖ్య పెంచుతున్నాడు. ఇరుగు పొరుగు రాష్ట్రాల నుండి వేలాదిమంది మహమ్మదీయులను తీసుకువచ్చాడు. ప్రత్యేకించి నిజాం రైల్వే వాళ్ళు స్పెషల్ ట్రెయిన్స్ ద్వారా కాందిశీకులను తరలించారు. సర్దార్ పటేల్ లోక్‌సభలో ప్రకటన చేస్తూ హైదరాబాద్‌లో ఎనిమిది లక్షలమంది కాందిశీకులకు నివాసం ఏర్పాటు చేశారని, అందులో పదివేల నాలుగు వందల మందిని నిజాం సైన్యంలో చేర్చు కున్నారని చెప్పాడు.

1948 జనవరి 20వ తేదీన మహాత్మాగాంధీ నిరసన దీక్ష విరమించిన తరువాత బిర్లాభవనంలో ఒక బాంబు పేలింది. గాంధీజీని హత్య చేయడానికి జరిగిన తొలి ప్రయత్నం అది. నిజాంకు సన్నిహితులైనవారు కొందరు దైవానుగ్రహం వలన గాంధీజీ సురక్షితంగా బైటపడ్డందుకు సానుభూతి పరమైన టెలిగ్రాం పంపవలసిందని నిజాంకు సలహా ఇచ్చారు. దీనిపై నిజాం కారులో వెళుతున్నప్పుడు తనమీద బాంబు విసిరిన సంఘటన గుర్తుకు తెచ్చుకుని, 'అప్పుడు గాంధీజీ నాకు టెలిగ్రాం పంపలేదు. నేనిప్పుడు ఆయనకు పంపను' అని ఆ టెలిగ్రాం పంపనేలేదు. ఈ సంగతి ఎవరో గాంధీజీ చెవిలో వేశారు. దానిపై గాంధీజీ సంస్థానాధీశులు పిల్లలవలె వ్యవహరిస్తారని చమత్కరించారు.

హైదరాబాద్ ప్రభుత్వ ధనాన్ని లాయక్ అలీ ఎంతగా దుర్వినియోగ పరిచాడో సర్దార్ పటేల్ 1948 ఏప్రిల్ ఒకటవ తేదీన పార్లమెంట్‌లో ప్రకటించారు.

1. లాయక్ అలీ ప్రభుత్వం ఇండియన్ యూనియన్‌తో యుద్ధం చేయటానికి సుమారు 8 కోట్ల 60 లక్షలను ఖర్చు పెట్టింది.

2. ఇండియాలోను, విదేశాలలోను స్వతంత్ర హైదరాబాద్ ప్రచారానికిగాను 50 లక్షలు ఖర్చు చేసింది.

3. భద్రతా సమితిలో హైదరాబాద్ తరఫున వాదించడానికిగాను 50 లక్షలు ఖర్చు చేసింది.

4. సైనిక ఖర్చులు విపరీతంగా పెరిగిపోవడంతో 1947–48కి సమర్పించిన రాష్ట్రబడ్జెటులో 4 కోట్ల లోటు ఏర్పడింది.

ఐక్యరాజ్య సమితిలో హైదరాబాద్ సమస్యకు మద్దతునివ్వాలని బ్రిటిషు ప్రభుత్వాన్ని నిజాం కోరాడు. ఇండియా నుంచి హైదరాబాద్‌ను విడదీయలేమని, ఈ విషయంలో తామేమీ సహాయం చేయలేమని బ్రిటిషు ప్రధాని అట్లీ చెప్పాడు.

ఆ రోజుల్లో స్టేటు కాంగ్రెసు మొదలైన జాతీయ పక్షాలు శాసనసభను బహిష్కరించాయి. ప్రభుత్వాన్ని సమర్థించే ధనికులు, జాగీర్దార్లు, శాసన సభ్యత్వం వల్ల లభించే అలవెన్స్‌కు ఆశపడి, అనామధేయులైనవారు పోటీలేకుండా శాసన సభకు ఎన్నికయ్యేవారు. మంత్రివర్గ నిర్మాణ సమస్య వచ్చినప్పుడు 'అభ్యుదయ ప్రజాపక్షం' అనివారు తమ వర్గానికి పేరు పెట్టుకున్నారు. ఆ వర్గం నుంచి పింగళి వెంకట్రామిరెడ్డికి లాయక్ అలీ మంత్రివర్గంలో స్థానం లభించింది.

రజ్వీ దుండగాలతో పెద్దలైనవారంతా హడలిపోయారు. అలీ యావర్‌జంగ్, జైన్ యార్‌జంగ్, మెహదీ నవాజ్‌జంగ్, హోష్యార్‌జంగ్ లాంటి ప్రముఖులు ఫించన్లు తీసుకుని ఇళ్ళల్లో కూర్చుండిపోయారు. సాలార్‌జంగ్ తన మాట వినకపోతే ఆయన దేవిడీని కాల్చి పారేస్తానని రజ్వీ బెదరించాడు.

కొందరు మతోన్మాదులకు హైదరాబాద్‌ను దక్షిణ పాకిస్తాన్ చేయాలని దుర్బుద్ధి పుట్టింది. హైదరాబాద్ రాష్ట్రంలోని హిందువులను మద్రాసు, మధ్యప్రదేశ్‌లకు తరలించి, ఆ రాష్ట్రంలోని ముస్లింలను హైదరాబాద్‌కు రప్పిస్తే ఈ సమస్య దానంతటదే పరిష్కారమై

పోతుందని ఉస్మానియా విశ్వవిద్యాలయం ప్రొఫెసర్ డా॥ లతీఫ్ సూచన చేశాడు. ఇది అంగీకారం కాలేదు. ఇది అసాధ్యమైన ప్రతిపాదన. ఉన్మాది ఊహ.

ఖాసిం రజ్వీ మతోన్మాద ప్రకటనలు:

ప్రభుత్వ యంత్రాంగమంతా ఖాసిం రజ్వీ హస్తగతమైపోయింది. లాయక్ అలీ ప్రభుత్వాన్ని రజ్వీ ప్రభుత్వమనే అనాలి. అతని మతోన్మాదం కోరలార్చి వెయ్యి నాల్కలతో విషం కక్కింది. రజాకార్ల సభలలో అతడు చేసిన కొన్ని ఉపన్యాసాలు–

1. 'హిందువు ఒక కాఫర్, (పాపులు) అతడు రాళ్ళను, కోతులను పూజిస్తాడు (సభలో నవ్వులు) మతం పేరుమీద గోపేడ తింటాడు. గోమూత్రం తాగుతాడు. అలాంటి అనాగరికుల చేతుల్లోనా రాష్ట్రం ఉంచేది? (సభలో విపరీతమైన నవ్వులు, కరతాళ ధ్వనులు).
2. హైదరాబాద్ తప్పక సీడెడ్ జిల్లాలను వశపరచుకుంటుంది. ఈ నిజాం ప్రభువు ఒక్క హైదరాబాద్ నిజామే కాదు, బిరారు నిజాం కూడా.
3. లాల్ ఖిల్లాపై అసఫియా పతాకం ఎగురవేస్తాను.
4. ముస్లింల ఉనికికి ప్రమాదం ఏర్పడినప్పుడు వారు ఇతర మతాల వారిని బతుకనీయరు.

ఇలాంటి అతని బాధ్యతారాహిత్య ప్రకటనలు భారత ప్రభుత్వం సహనాన్ని పరీక్షించాయి. 1948 మే 4వ తేదీన కమ్యూనిస్టు పార్టీపై నిషేధాన్ని రాష్ట్ర ప్రభుత్వం తొలగించింది.

తాను పదవిలో ఉన్నప్పుడే హైదరాబాద్ సమస్యను పరిష్కరించాలనుకున్నాడు లార్డ్‌మౌంట్ బాటెన్. ఈ సందర్భంలో తన ప్రెస్సు కార్యదర్శి క్యాంప్బెల్ జాన్సన్‌ను హైదరాబాద్‌కు తన ప్రత్యేక దూతగా పంపాడు. నిజాంతో, రజ్వీతో, లాయక్ అలీతో, జాన్సన్ విడి విడిగా సంభాషణలు జరిపాడు. రాజ్యాంగ బద్ధమైన రాజరికం పాశ్చాత్య దేశాలకే కానీ హైదరాబాద్‌కు వర్తించదని నిజాం గట్టిగా వాదించాడు. హిందువులపై రజ్వీ కనబరచిన ద్వేషం జాన్సన్‌కు విస్మయం కలిగించింది. 'హిందువులు తమ నాయకులను చంపుకొని ఆ తరువాత వారిని దేవుళ్ళుగా మార్చుకుంటార'ని గాంధీజీ

హత్యపై రజ్వీ చేసిన వ్యాఖ్యానం అన్యమతస్థుడైన జాన్సన్‌కు సైతం అతనిపై విపరీతమైన ద్వేషం కలిగించింది. ఈ మతోన్మాదితో సంప్రదింపులు జరపడం లాభం లేదనుకొని వచ్చినదారి పట్టాడు. యథారీతి ఒడంబడిక నామమాత్రమే. దీన్ని హైదరాబాద్ ప్రభుత్వం ఎన్నడూ ఖాతరు చేయలేదు. జరిగినవన్ని ఉల్లంఘనలే.

1947 డిసెంబరు 24వ తేదీన హైదరాబాద్ ప్రభుత్వం నగదు వ్యాపారంలో భారత కరెన్సీని ఉపసంహరించింది. డిసెంబర్ 27న విడుదలైన కరెన్సీ ఆర్డినెన్స్‌లో 1321 ఫస్లీ హైదరాబాద్ ఆక్టు 17వ నిబంధన రద్దయింది. స్టేటు వ్యాపారమంతా స్టేటు కరెన్సీలోనే జరగాలని ఈ చట్టం నిర్దేశించింది. బంగారం ఎగుమతులను నిషేధించే రెండు ఆర్డినెన్స్‌లు జారీ అయ్యాయి. ఇవన్నీ యథారీతి ఒడంబడికను భగ్నపరిచే ప్రయత్నాలే. 1947 సెప్టెంబర్ 18వ తేదీన రాష్ట్రంలో ముస్లిం శరణార్థులకు మాత్రమే ప్రవేశం లభించింది.

ప్రతీకార వాంఛతో వచ్చిన శరణార్థులు రజాకార్ల సహాయంతో వూళ్ళకు వూళ్ళు దోచుకున్నారు. వారి దౌష్ట్యానికి గురికాని గ్రామం ఒక్కటైనా మిగులలేదు. తమ మాన ప్రాణ ఆస్తి రక్షణల కోసం రాష్ట్ర హిందూ ప్రజలు ఇరుగు పొరుగు రాష్ట్రాలకు వెళ్ళిపోయారు. ఒక్క మద్రాసు రాష్ట్రానికే 8 వేలమంది హైదరాబాద్ హిందువులు వచ్చినట్లు సర్దార్ పటేల్ పార్లమెంటులో చెప్పారు. హైదరాబాద్ నుంచి వెళ్ళిపోయిన భూస్వాములు 1948 మే 15వ తేదీలోపు రాష్ట్రానికి తిరిగి రావాలని ప్రభుత్వం హెచ్చరించింది. భద్రాచలం రామాలయానికిచ్చే గ్రాంటుని 1948 జనవరిలో నిజాం ప్రభుత్వం ఆపివేసింది.

సరిహద్దు గ్రామాలపై దాడులు:

అంతటితో తృప్తిపడక సంస్థాన సరిహద్దుల్లో ఉన్న యూనియన్ ప్రభుత్వ గ్రామాలపై పడి రజాకార్లు దాడులు మొదలు పెట్టారు. ఉస్మానాబాద్ జిల్లా సమీపంలోని నానజ్ అనే గ్రామంపై రజాకార్లు దాడి జరుపగా యూనియన్ ప్రభుత్వ గస్తీదళం ఏడెనిమిది మంది పఠాను రజాకార్లను చంపివేసింది. నానజ్‌లో జరిగిన అవమానం రజ్వీలో పరాభవాగ్నిని ప్రజ్వలింపజేసింది. 1948 ఆగష్టు 9న హైదరాబాద్‌లోని జమ్రుద్ మహల్ థియేటరులో నానజ్ సంతాపసభ రజాకార్లు జరుపుకున్నారు.

తమకు వ్యతిరేకంగా రాసే చేయిని నరికివేయవలసిందిగా రజ్వీ రజాకార్ల చేత శపథం చేయించాడు. హైదరాబాద్ సంస్థానంలోని 20 మంది రజాకార్లు మద్రాసు జిల్లాలలోనికి ప్రవేశించి 50 వేల రూపాయల ఆస్తిని దోచుకున్నారని మద్రాసు శాసన సభలో ఆ రాష్ట్ర హోంమంత్రి డా॥ సుబ్బరాయన్ 1948 ఫిబ్రవరి 27న వెల్లడించాడు.

షోయెబ్‌ఉల్లాఖాన్ హత్య:

నిజాం హయాంలో స్వతంత్ర అభిప్రాయాలతో వెలువడుతున్న 'రయ్యత్' ఇకముందు రాదు. నిజాం ప్రభుత్వం ఆ పత్రికను నిషేధించింది. ఆ రోజే గూఢచారి విభాగం అధికారి ఫజల్ రసూల్‌ఖాన్ పత్రికా కార్యాలయానికి వచ్చి నిషేధాజ్ఞలను అందజేశాడు. స్వతంత్ర అభిప్రాయాలతో ప్రజల అభిమానాన్ని చూరగొన్న సంపాదకుడు మందుముల నరసింగరావు. నిరంకుశాధికారుల ఆంక్షలను శిరసావహించవలసి వచ్చింది. షోయెబ్ ఆ పత్రికలో ఉపసంపాదకుడుగా పనిచేసేవాడు.

మందుముల నరసింగరావు సహాయంవల్ల షోయెబ్ 'ఇమ్రోజ్' పత్రికను ఏర్పాటు చేసుకున్నాడు. 1947 నవంబరు 15వ తేదీనాడు 'ఇమ్రోజ్' దినపత్రిక మొదట సంచిక వెలువడింది. ఈ పత్రికకు బూర్గుల రామకృష్ణారావు ఆర్థిక సహాయం అందించారు. కొంత కాలం తరువాత 'ఇమ్రోజ్' కార్యాలయం రామకృష్ణారావు ఇంట్లోకి తరలించబడింది. సంస్థానంలో క్రమంగా పత్రిక పలుకుబడితోపాటు పాఠకుల సంఖ్య కూడా పెరిగిపోయింది.

ఆనాటి హైదరాబాద్ సంస్థానం జనాభా 1 కోటి 56 లక్షలు. అందులో 20 లక్షల 70 వేల 312 మంది ముస్లింలు. రజ్వీని బలపరిచే వారి సంఖ్య 5 లక్షలు మాత్రమే. ఈ అయిదు లక్షల మందిని వెంటవేసుకుని 'ఛలో ఢిల్లీ' అని రజ్వీ చేసే నినాదాలు ఉన్మత్తుని చర్యగా షోయెబ్ ఉల్లా ఖాన్ రాశాడు. ఆ రోజుల్లో దాదాపు ఉర్దూ పత్రికలన్నీ రజాకార్లను సమర్థించాయి. యువనాయకుడైన షోయెబ్ ఉల్లా మాత్రమే ధైర్యంగా రజాకార్ల అమానుష చర్యలను ప్రతిఘటించాడు. తత్ఫలితంగా షోయెబ్ తన కంట్లో ముల్లుగా ఉన్నాడని రజ్వీ గ్రహించాడు. 'ముస్లిం ఐక్యతను విచ్ఛిన్నం చేసే శక్తులు సజీవంగా ఉండటానికి వీలులేదు. భారతప్రభుత్వ ఏజెంట్లుగా ఉంటూ మా సమైక్యతను ధ్వంసంచేయాలనే కీలుబొమ్మల చేతులు ఉండటానికి వీలులేదు. ఆ చేయికిందికి దిగాలి, లేగా నరికి వేయాలి' అని రజ్వీ ఆ విధంగా

పరోక్షంగా తన అనుయాయులను హెచ్చరించాడు. షోయెబ్‌ని ఏ విధంగా ఎదుర్కోవాలో భావగర్భితంగా చెప్పాడు.

1948 ఆగష్టు 21న రజాకార్ల హింసాకాండ మితిమీరిపోయింది. స్వతంత్ర భారతదేశం నడిబొడ్డుమీద ఇస్లామిక్ రాజ్యం స్థాపించాలనే దుర్బుద్ధితో నిజాం నవాబు రజాకార్లను వెంటవేసుకొని రాష్ట్రప్రజలను నానాహింసలకు గురిచేశాడు. సంస్థానంలో ముఖ్యంగా హిందువుల ప్రాణమానాలు, ఆస్తులు అన్నీ రజాకార్ల దయా దాక్షిణ్యాలపై ఆధారపడి ఉన్నాయి. నగరంలో హిందువులందరు సాయంత్రం ఆరుగంటలు కాగానే ఇంటిదారి పట్టేవారు. ఏడు గంటల తరువాత వీథులన్నీ నిర్మానుష్యంగా ఉండేవి. ఎన్నో హిందూ కుటుంబాలు సంస్థానాన్ని వదలి వెళ్ళిపోయాయి.

చెప్పుల జబారు చౌరస్తా కూడా ఆ రోజు రాత్రి కాగానే నిర్మానుష్యమై పోయింది. ఈ బస్తీ కాచీగూడా స్టేషనుకు వెళ్ళే దారిలో ఉంది. దాదాపు ఇళ్ళల్లో ఎక్కడా దీపాలు లేవు. బూర్గుల రామకృష్ణారావు ఇంటిలోని ఒక భాగంలో ఉన్న 'ఇమ్రోజ్' కార్యాలయంలో మాత్రమే దీపాలు వెలుగుతున్నాయి. మరుసటిరోజు రావలసిన పత్రిక పనిముగించుకుని సంపాదకుడు షోయెబ్ పత్రికా నిర్వాహకుడు మహమ్మద్ ఇస్మాయిల్ ఖాన్ కొద్దిదూరంలో ఉన్న తమ ఇళ్ళకు వెడుతున్నారు. లింగంపల్లి చౌరస్తా దగ్గర ఉన్న తమ ఇళ్ళకు వాళ్ళు వెడుతున్నప్పుడు అర్ధరాత్రి గడచిపోయింది. చౌరస్తా దాటి కొన్ని అడుగులు ముందుకు వెళ్ళేసరికి వెనుకనుంచి కొంతమంది పరుగెత్తుకు వచ్చారు. అందులో ఒకడు తుపాకీ పేల్చాడు. వరుసగా మూడు తుపాకీ గుండ్లు తగలగానే షోయెబ్ నేలకూలాడు. వెంటనే ఆ వ్యక్తులు షోయెబ్ రెండు చేతులను కత్తితో నరికి వేశారు. అడ్డుపడిన ఇస్మాయిల్ చేతిని కూడా నరికి వేశారు. హంతకులు పనిముగించుకుని చీకట్లో పారిపోయారు.

షోయెబ్ హత్య దేశంలోని జాతీయ పత్రికలు ఖండించాయి. అంతకాలం నిజాం చర్యలను హిందూ ముస్లిం సమస్యగానే తీసుకొన్న నెహ్రూ క్రమంగా వాస్తవాన్ని గ్రహించగలిగారు. అది పోలీసు చర్యకు దారితీసింది.

నిజాం ప్రభుత్వం జాతీయ పత్రికలమీద తీవ్రమైన ఆంక్షలు విధించింది. దక్కన్ క్రానికల్, ఇమ్రోజ్, పయాం, డెయిలీ న్యూస్ వ్రాసే సంపాదకీయాలను విమర్శలను, విలేఖరులు పంపేవార్తలను ముందుగా సెన్సార్‌కు పంపాలని 1948

ఫిబ్రవరి 8వ తేదీన ఒక ఉత్తర్వు వెలువరించింది. గోల్కొండ పత్రికను దాదాపు రెండు నెలల దాకా సంపాదకీయాలు రాయడానికి అనుమతించలేదు. హైదరాబాద్‌లోని దుస్సహపరిస్థితికి నిరసనగా స్టేటు కాంగ్రెసు మహిళా వాలంటీర్లు 1948 మార్చి 28న 24 గంటలు ఉపవాస దీక్ష బూనిన వార్త మద్రాసులోని 'హిందూ' పత్రిక ప్రచురించినప్పుడు కానీ ఇక్కడి వారికి తెలియలేదు.

హైదరాబాద్ సంస్థానాన్ని భారత యూనియన్‌లో విలీన పరచి ప్రజలకు తిరిగి సుఖశాంతులు కలిగించే విధంగా పాటుపడాలని నిజాంకు విజ్ఞప్తి చేస్తూ ఏడుగురు ముస్లిం ప్రముఖులు వినతి పత్రం సమర్పించారు. సంతకం చేసినవారిలో సుబేదారుగా పనిచేసిన, నిజాంకు సన్నిహితుడుగా ఉన్న నవాబు మంజూర్‌జంగ్, విద్యాశాఖ డైరెక్టరుగా ఉన్న మహమ్మద్ హుసేన్ జాఫరీ, తహసీల్దారు ఉద్యోగానికి రాజీనామా ఇచ్చిన ఫరీద్‌మీర్జా, విదేశాలలో చదువుకున్న బాకర్ అలీ మీర్జా, ముల్లా అబ్దుల్ బాసిత్, అహమద్ మీర్జా, హుసేన్ అబ్దుల్ మునీర్, మీర్ అహమ్మద్ అలీఖాన్ ఉన్నారు. వారి వినతిపత్రం ఢిల్లీలో సంచలనం కలిగించింది. సర్దార్ పటేల్ దీని ప్రతిని యు.ఎన్.ఓ.కు పంపించారు. వారంతా పోలీసు చర్య జరిగేవరకు అరచేతుల్లో ప్రాణాలు పెట్టుకుని జీవించారు. 1948 జనవరి 30న మహాత్మాగాంధీ హత్య జరిగింది. దీనితో దేశమంతా చీకటి కమ్ముకుంది.

హైదరాబాద్ సంస్థానంలో విపరీత పరిస్థితులు చక్కబడేవరకు న్యాయస్థానంలో హాజరుకాలేమని న్యాయవాదులు నిర్ణయించారు. ఈ విధంగా ఇది ఒక అపూర్వ సంఘటన. భారతదేశంలో సహాయ నిరాకరణోద్యమ కాలంలో కూడా విజయవంతంగా జరుగని కోర్టు బహిష్కార కార్యక్రమం ఇక్కడ సంపూర్ణంగా జరిగింది. ❑

31. పరిటాల ప్రజా ఉద్యమం

హైదరాబాద్ విముక్తి చరిత్రలో పరిటాల ప్రజా ఉద్యమం చాలా గొప్పది. దౌర్జన్యం, హింసాకాండ లేకుండా, ఏడు గ్రామాల ప్రజలు తమ శక్తితో నిజాం అధికారాన్ని ధిక్కరించి ప్రజాప్రభుత్వం స్థాపించి, పరిపాలన సాగించి ఇండియన్ యూనియన్‌లో చేరేదాకా దీక్షతో తమ స్వాతంత్ర్యం సంరక్షించుకున్నారు.

ఈస్టిండియా కంపెనీవారు, నిజాం రాజ్యభాగాలు ఇచ్చిపుచ్చుకోవడంలో మధ్య కొన్ని గ్రామాలు, భూఖండాలు–అటు ఉండవలసినవి ఇటూ, ఇటు ఉండవలసినవి అటూ ఉండిపోయాయి. వాటిని 'ఆన్‌క్లేవుస్' అనేవారు. ఇటువంటివి నిజాం రాజ్య సరిహద్దుల్లో చాలా ఉండేవి. బ్రిటిషు గ్రామాలు నిజాంలోను, నిజాం ప్రాంతాలు బ్రిటిషు ఇండియాలోను ఉండేవి. 1950లో ఒక చట్టం చేసి ఈ ప్రాంతాలు ఏ రాష్ట్రంలో కలిపితే ప్రజలకు అనుకూలంగా ఉంటుందో, ఏ రాష్ట్రానికి సమీపమో నిర్ణయించి బొంబాయిలో కొన్ని, మద్రాసులో కొన్ని కలిపేశారు. అటువేపున ఉన్న కొన్ని గ్రామాలను హైదరాబాద్ రాజ్యంలో కలిపారు. యూనియన్ గ్రామాల సంపర్కం వల్ల ఈ ప్రాంతంలో సంస్కారం కొంత ముందుకు వెళ్ళిందని చెప్పవచ్చు.

ఈ విధంగా జరిగిన విలీనీకరణానికి ముందు అటూ ఇటూ ఉంటూ వచ్చిన ఏడు గ్రామాలే ఈ పరిటాల ఉద్యమానికి కేంద్రాలు. నిజాం ఇలాక వరంగల్లు జిల్లా మధిర తాలూకా బ్రిటిష్ ఇలాక కృష్ణాజిల్లా సరిహద్దులలో ఉంటుంది. తత్కారణంగా కొన్ని నిజాము ఇలాకా గ్రామాలు కృష్ణాజిల్లాలోనే ఉండేవి. అవి చుట్టూ బ్రిటిష్ రాజ్యం ఉన్న నిజాం గ్రామద్వీపాలు. కానత్ తాలూకా అనే పేరుతో ఇటువంటివి ఏడు గ్రామాలు ఉండేవి. అవి కమాల్ యార్‌జంగ్ జాగీరు గ్రామాలు. ఏడు గ్రామాలమీద ఆయనకి సాలీన 90 వేల కల్దారు రూపాయల ఆదాయం వచ్చేది. ఆ గ్రామాలలో జాగీర్దారు ప్రభుత్వమే ఉండేది. ఆ గ్రామాల పేర్లు: పరిటాల, బత్తేనపాడు,

గని ఆత్కూరు, మోగులూరు, కొడవటికల్లు, ఉస్తేపల్లి, మల్లవెల్లి. బ్రిటిష్ ఇండియా మధ్యలో ఉండటం వలన సంస్కృతిలో, మానసిక పురోగమనంలో ఈ గ్రామాల ప్రజలు తక్కిన ఆంధ్రులతో సమానంగా ఉండేవారు. గాంధీ ఉద్యమం వీరిని ఉత్తేజ పరిచింది. వీలైనంత వరకు జాగీర్దారు జులుంకి గానీ, అతని సేవకుల దౌర్జన్యానికి గాని వీరు లొంగలేదు. మితిమీరినప్పుడు తిరగబడ్డారు. కమాల్ యార్‌జంగ్ తండ్రి కాలంలో లంక సుబ్బయ్యశాస్త్రి అనే వ్యక్తి ముస్లిం జాగీర్దారు ప్రాపకంతో ప్రజల్ని బాధపెట్టేవాడు. ఈ గ్రామానికి అతను నియంత. విసిగిపోయిన ప్రజలు సుబ్బయ్యా శాస్త్రిని హత్యచేసి పీడ విరగడ చేసుకున్నారు.

1947 ఆగష్టు 15 న భారతదేశంలో అన్ని గ్రామాలవలెనే ఈ ఏడు గ్రామాలలో కూడా ప్రజలు స్వాతంత్ర్యం ప్రకటించుకుని జాతీయపతాకం ఎగురవేసి సభలు జరుపుకున్నారు. జాగీరు ఉద్యోగులు ఏమీ చేయలేకపోయారు. కమిటీలుపెట్టి సక్రమ పాలన కొనసాగించారు. ఢిల్లీ వెళ్ళి గాంధీజీ, సర్దార్‌పటేల్ మొదలైన నాయకులను కలిసి ఇండియన్ యూనియన్‌లో కలుపుకొమ్మని కోరారు. అప్పటి యథాతథ ఒడంబడిక ప్రకారం వారి కోరిక నెరవేరలేదు. కేంద్రకమిటీలు, గ్రామ కమిటీలు పెట్టి అల్పసంఖ్యాక ప్రజలకు రక్షణ కల్పించి, ఏ అల్లరులు లేకుండా నేరాలు, సివిల్ కేసులు పంచాయతీల ద్వారా చక్కగా పరిష్కరించుకున్నారు. 12000 మంది ఒక ఆదర్శ ఉద్యమం నడిపారు. 1950 జనవరి 26న పరిటాల, గని ఆత్కూరు, మోగులూరు, కొడవటికల్లు, ఉస్తేపల్లి, కృష్ణాజిల్లా నందిగామ తాలూకాలోనూ, మల్లవెల్లి గన్నవరం తాలూకాలోనూ విలీనమైనాయి. స్వాతంత్ర్య వాయువులు ముందుగా పీల్చిన ఆ గ్రామ వాసులు ఉత్సాహంతో తమ సాటివారితో కలిసిపోయారు.

పరిటాల జాగీరులో ఏడుగ్రామాలు, ఇటగి జాగీరులో 13, గుల్బర్గా జిల్లాలో 17, పర్భనీ జిల్లాలో 24, ఔరంగాబాద్ జిల్లాలో 19, ఉస్మానాబాద్ జిల్లాలో 65 గ్రామాలు స్టేట్ కాంగ్రెస్ నాయకత్వంలో స్వతంత్ర ప్రభుత్వాలు స్థాపించుకుని నిజాం సర్కారుతో తెగతెంపులు చేసుకున్నాయి. 1947 అక్టోబరు 14వ తేదీన 27 చోట్ల, 1948 ఫిబ్రవరి 26న 80 చోట్ల, ఆగష్టు 7న 10 చోట్ల రైల్వేలైన్లు విచ్ఛిన్నం చేయబడ్డాయి.

గద్వాల సంస్థానాన్ని మహారాణి ఆదిలక్ష్మి దేవమ్మ పాలిస్తున్న రోజులవి. నిజాం నవాబు రాజు కాడని, మొగల్ చక్రవర్తుల బలహీనత కనిపెట్టి స్వాతంత్ర్యాన్ని ప్రకటించుకున్నాడని తాము స్వతంత్ర ప్రభువులమని భారత సైన్యాన్ని తుంగభద్రానదీ తీరంలో ఉన్న కర్నూలు నుండి కృష్ణానదీ తీరానికి తరలించవచ్చని ఆమె సూచించారు. గద్వాల సంస్థానం తుంగభద్ర, కృష్ణా నదుల మధ్యగల ప్రాంతమని (దో ఆబ్) భారత సైన్యాన్ని తమ భాగంలో ఉంచవచ్చని తెలిపారు. ఈ లేఖను సర్దార్ పటేల్ చూసి ఎంతో సంతోషించారు. సర్దార్ పక్షాన అర్.ఆర్.దివాకర్ 29-11-1947 న రాసిన సమాధానంలో ప్రస్తుతం యథాతథ ఒడంబడిక అమలులో ఉన్నదని, కావున ఎట్టి నిర్ణయాన్ని తీసుకునే అవకాశం లేదని అనువైన సమయానికై వేచి ఉండాలని సలహా ఇచ్చారు.

వనపర్తి రాజా రామేశ్వరరావు విలీనానికి ఏర్పాట్లు ప్రారంభించారు. ఆయన వనపర్తికి సంబంధించిన పత్రాలను, నిధులను నిజాం నుంచి కాపాడే ఉద్దేశంతో హైదరాబాద్ మీదుగా చెన్నైకి తరలించారు. పత్రాలు కూడా విజయనగరం సంస్థానాధీశుడు పి.వి.జి.రాజు నివాసంలో రూపుదిద్దుకున్నాయి. ఆ పత్రాలు జయప్రకాశ్ నారాయణ్ ద్వారా ఢిల్లీకి పంపారు. ఆయన వాటిని ఢిల్లీలో సర్దార్ పటేల్‌కు అందజేశారు. ఇతర విషయాలన్నిటికంటే ఈ నిర్ణయమే పటేల్ హైదరాబాద్‌పై సైనిక చర్య తీసుకునేందుకు దోహదపడింది. మహబూబ్‌నగరు జిల్లాలో ఉన్న ఈ వనపర్తి సంస్థానంలో ఒకప్పుడు 150 గ్రామాలుండేవి.

స్వామీజీ నాయకత్వం:

స్వామీ రామానందతీర్థ నాయకత్వంలో కాంగ్రెస్ సంస్థ మరో విధానం కూడా అంగీకరించింది. అది రాష్ట్రసరిహద్దులనుండి హింసాపూర్వక ఉద్యమం. కొందరు కాంగ్రెసువారు రాష్ట్రం వెలుపలికి వెళ్ళి బ్రిటిష్ ఇండియా ప్రజల సహాయం తీసుకొని, ఆయుధాలు సంపాదించి సరిహద్దులనుండి నిజాం ప్రభుత్వంపై దాడి చేసేవారు. ఈ విధంగా కాంగ్రెసు రెండు రకాల పద్ధతులు అవలంభించిందన్నమాట. కాని, ఇవి పరస్పర భిన్న విధానాలు. దీనివల్ల కాంగ్రెసులో భేదాభిప్రాయాలు వచ్చాయి. ఒకవర్గం సత్యాగ్రహం ద్వారా ప్రభుత్వాన్ని ఎదిరించే విధానం కలది. రెండవ వర్గం సరిహద్దు

ఉద్యమం, హింసాచర్యలపై విశ్వాసం కలది. దీనికి స్వామీ రామానందతీర్థ ఆశీస్సులున్నాయని చెప్పుకునేవారు.

ఏమైతేనేం? ఇత్తెహాదుల్ ముసల్మీన్‌కు చెందిన ముస్లింలు అన్ని స్థాయిల్లో రాష్ట్రపాలక వర్గం మద్దతుతో, పట్టణాలలో గ్రామాలలో ప్రజలను అత్యాచారాలు, అవమానాల పాలు చేయడం ఉధృతం చేశారు. ఈ సంస్థకు చెందిన రజాకార్లు నానాటికి బలపడుతూ శిక్షణ శిబిరాలు నడపడం, ప్రదర్శనలు జరపడం వంటివి ఆరంభించారు. వారి వాలంటీర్లు యూనిఫారమ్‌లు ధరించి కత్తులతో పట్టణాలలో పెద్ద పెద్ద గ్రామాలలో వాడ వాడలో తిరిగేవారు. నిష్కారణంగా ప్రజలను హత్యచేసేవారు. వారి ఆస్తులను లూటీ చేసేవారు. దహనకాండకు పాల్పడేవారు.

రాష్ట్రప్రజలు తమ ప్రాణ మాన రక్షణార్థం పరిసర రాష్ట్రాలకు పోయినప్పుడు ఆర్థికంగా, సాంఘికంగా, ఇతరత్రా పెక్కు ఇడుముల పాలయ్యారు. వారి జీవితం దుర్భరమైంది. ఇక రాష్ట్రంలో రాత్రింబవళ్ళు ప్రజలు భయభ్రాంతులై నరకం అనుభవించారు. ప్రజాజీవితం స్తంభించిపోయింది. రాష్ట్రం వెలుపల సరిహద్దు ప్రాంతాలవారు సానుభూతి లేకుండా వ్యవహరించి, ఇండ్ల అద్దెలు పెంచి ఆహార ధాన్యాలు, కూరగాయల ధరలు విచక్షణా రహితంగా పెంచడంవల్ల అక్కడ తలదాచుకున్న వారి జీవన వ్యయం బాగా పెరిగిపోయింది. ❑

32. పోలీసు చర్య

హైదరాబాద్ స్వాతంత్ర్యోద్యమాన్ని ప్రాంతీయ దృక్పథంతో స్వామీజీ చూడలేదు. భారత స్వాతంత్ర్యం చివరి పోరాటం హైదరాబాద్ భూభాగంమీద కొనసాగుతున్నదని, దీనికి భారత ప్రజలందరి సహాయం అవసరమని ఆయన దేశనాయకులకు విజ్ఞప్తి చేశారు.

ఆంధ్రరాష్ట్రీయ కాంగ్రెసుకు చెందిన హైదరాబాద్ సంస్థాన కాంగ్రెసు కమిటీకి అయ్యదేవర కాళేశ్వరరావు అధ్యక్షులుగా ఉండేవారు. ఆంధ్ర ప్రజలనుంచి విరాళాలు వసూలు చేసి స్వామీజీకి అందజేస్తుండేవారు.

1947 డిసెంబరు 27వ తేదీన మద్రాసులో హైదరాబాద్ సహాయక కమిటీ ఏర్పడింది. దీనికి మద్రాసు మేయరు శ్రీకృష్ణ అధ్యక్షుడు. వెంకటస్వామినాయుడు, శ్రీమతి అమ్ము స్వామినాథన్ ఉపాధ్యక్షులు, పప్పు సోమసుందరం కార్యదర్శి. గుంటూరులో 1948 జూన్ 21వ తేదీన జరిగిన బహిరంగ సభలో ఉపన్యసిస్తూ జయప్రకాశ్ నారాయణ్ హైదరాబాద్ సమస్యలను పరిష్కరించడానికి యుద్ధం తప్ప వేరే మార్గం లేదన్నారు. హైదరాబాద్‌ను మూడు ముక్కలుగ జేసి ఆయా రాష్ట్రాలలో వాటిని కలిపివేయాలన్నారు. ఆచార్య భన్సాలీ సేవాగ్రాంలో గాంధీజీకి మిక్కిలి సన్నిహితుడు, తెలంగాణాలో రజాకార్లు చేసే దౌర్జన్యాలకు, స్త్రీలకు జరుగుతున్న అవమానాలకు వ్యతిరేకంగా ఆమరణ ఉపవాస వ్రతం చేపట్టారు. ఆయనను సంస్థానంలో ప్రవేశించడానికి నిజాం ప్రభుత్వం అనుమతించలేదు. విజయవాడలోనే ఈ వ్రతం ప్రారంభించారు.

స్టేటు కాంగ్రెసు తన ఉద్యమాన్ని ఉధృతం చేసింది. దౌర్జన్యాన్ని దౌర్జన్యంతో ఎదుర్కొంది. నిజాం రాజ్యం అగ్నిగుండంగా మారింది. రాజకీయ పోరాటంలో కర్తవ్యం సిద్ధాంతాన్ని అధిగమిస్తుంది. కాంగ్రెసు సహితంగా అన్ని పార్టీలూ సాయుధ పోరాటం

కొనసాగించాయి. కాంగ్రెసువారు మద్రాసు రాష్ట్రంలో 21, బొంబాయిలో 23, మధ్యప్రదేశ్‌లో 4 క్యాంపులు పెట్టి నిజాం సాయుధ వ్యతిరేక పోరాటం జరిపారు.

ఈ ఉద్యమ కాలంలో 14వేల మంది వాలంటీర్లు అరెస్టయ్యారు. 15వేలమంది విద్యార్థులు పాఠశాలలను బాయ్‌కాట్ చేశారు. 6వేలమంది గ్రామోద్యోగులు తమ పదవులకు రాజీనామా చేశారు. ప్రభుత్వానికి ఎక్సయిజు ఆదాయం తగ్గించటానికి 5 లక్షలు పైగా తాటి, ఈత చెట్లను సమూలంగా నరికివేశారు. నిజాం ప్రభుత్వం ఏటా వసూలు చేసే లేవీ సగానికైనా వసూలు కాకుండా చేశారు. ఈ పోరాటంలో 615 చోట్ల పోలీసు స్టేషన్లను, రజాకార్ల శిబిరాలను తుడిచిపెట్టి వేశారు. సంస్థానం చుట్టూ కృత్రిమ సరిహద్దులుగ ఉన్న 750 కరోడ్గిరి (కస్టమ్స్) స్టేషన్లలో 500 స్టేషన్లను నిర్మూలించారు. గ్రామరక్షణ కోసం ఏర్పడిన గ్రామరక్షక దళాలు 175 సార్లు పోలీసుల మీద, రజాకార్ల మీద దాడులు చేశాయి. ఈ గెరిల్లా పోరాటంలో 200 మంది రజాకార్లు, నిజాం పోలీసులు చంపి వేయబడ్డారు. తెలంగాణాలో 28 మంది, మరట్వాడాలో 22 మంది, కర్నాటకలో 15 మంది కాంగ్రెసు వాలంటీర్లు వీరమరణం చెందారు.

పోరాట కేంద్రాలను బయటనుంచి నడిపారు. బెజవాడలో ఏర్పడిన శిబిరానికి జమలాపురం కేశవరావు, వి.బి.రాజు, టి.హయగ్రీవాచారి, షోలాపూర్ శిబిరానికి కొండా లక్ష్మణ్, చాందా శిబిరానికి పి.వి.నరసింహారావు నాయకత్వం వహించారు.

లాయక్ అలీ సంస్థానాన్ని సర్వనాశనం చేయనున్నాడని ఆవేదన చెంది, తనకు 5 కోట్ల రూపాయలు ఇస్తే దేశంలోని ఏదో సురక్షిత ప్రాంతానికి వెళ్ళిపోగలనని నిజాం రెండవ కుమారుడు మొహజంజా తండ్రికి లేఖ రాసాడు.

పాకిస్తాన్‌పై ఎన్నో ఆశలు పెట్టుకున్నాడు ఖాసిం రజ్వీ. లాయక్ అలీ తన బావమరిది మొహిన్ నవాజ్‌జంగ్ సారథ్యంలో ఒక ప్రతినిధి వర్గాన్ని కరాచీకి పంపాడు. అనారోగ్య కారణాలవల్ల ఈ ప్రతినిధి వర్గానికి జిన్నా ఇంటర్వ్యూ లభించలేదు. గత్యంతరం లేక తనే కరాచీకి పోదామనుకున్నాడు రజ్వీ. కానీ జిన్నా 1948 సెప్టెంబరు 12వ తేదీన మరణించాడు. సెప్టెంబరు 13వ తేదీన పోలీసు చర్య ప్రారంభమైంది.

ప్రజలను మాయచేసి మభ్య పెట్టడంలో ఖాసిం రజ్వీ సిద్ధహస్తుడు. పోలీసు చర్య జరుగుతున్నప్పుడు రజాకార్లను తన కమాండింగ్‌లో ఉంచమన్నాడు హైదరాబాద్ సేనాని మేజన్-జనరల్ ఎల్‌ద్రూసు. కానీ రజ్వీ అందుకు సమ్మతించలేదు.

పోరాటానికి తమకు ఆయుధాలు కావాలని రజాకార్లు మొత్తుకున్నారు. 'ఆయుధాలు, ఆయుధాలు అవి ఎక్కడున్నాయి? మీరు అల్లాపై విశ్వాసం ఉంచి పోరాడండి సత్యమే జయిస్తుంది. భూమాత ఆయుధాలను సృష్టించి పెడుతుంది. ఆకాశం ఆయుధవర్షం కురిపిస్తుంది' అని రజాకార్లను తుదివరకు రెచ్చగొట్టాడు రజ్వీ. సిడ్నీకాటన్ దొంగచాటుగా తెచ్చిన ఆయుధాలు నిజాం సైనికులకు పనికిరాలేదు. వాటి ఉపయోగం వారికి తెలియదు. రజ్వీ చేసే ప్రచారాలు హిట్లర్‌ని మించిపోయినై. దక్కను రేడియోను తన చెప్పుచేతల్లో ఉంచుకున్నాడు. అనేక అసత్య ప్రచారాలను దక్కన్ రేడియో ప్రసారాలు చేసేది:-

1. హైదరాబాద్‌పై భారత ప్రభుత్వం సైనిక చర్యకు పూనుకుంటే ఇరాన్, ఆఫ్ఘనిస్తాన్, పాకిస్తాన్, టర్కీ, ఈజిప్టు మొదలైన ముస్లిం రాజ్యాలు హైదరాబాద్‌ను ఆదుకుంటాయి. అరబ్‌లీగ్ సహాయానికి ముందుకు వస్తుంది.

2. అమెరికా రంగంలో ప్రవేస్తుంది. ఆగ్నేయాసియాలో కమ్యూనిజమ్ నిరోధానికి అమెరికన్లకు హైదరాబాద్ రక్షిత స్థావరంగా పనిచేస్తుంది.

3. అనేక ఆంతరంగిక సమస్యల పోరాటాల మధ్య ఉన్న భారతదేశం ఇప్పటికే బలహీనపడింది. సిక్కులు ప్రత్యేక రాష్ట్రం కోరుతున్నారు. సంస్థానాధీశులంతా ఒక మంచిరోజు చూసుకొని భారత ప్రభుత్వంపై తిరుగుబాటు లేవదీస్తారు. దాని చాలీచాలని సైన్యం కాశ్మీర్‌లోనే కేంద్రీకృతమై ఉంది.

4. పాకిస్తాన్‌తో మనం రహస్య ఒడంబడిక చేసుకున్నాము. గోవాలో రెండు విమాన కేంద్రాలను పాకిస్తాన్ మనకు నిర్మించి పెడుతుంది. ఈ కేంద్రాల నుండి మనం భారత్‌పై దాడులు జరుపనున్నాము.

5. కొద్దిరోజులలో బందరు రేవుని చేజిక్కించుకుంటాం. బందరు రేవు లభించగానే మనకు విదేశాలతో సరాసరి సంబంధాలేర్పడుతాయి.

హైదరాబాద్ కేసును నిజాం ప్రభుత్వం ఐక్యరాజ్య సమితికి ఫిర్యాదు చేసింది. ఒకవంక ఈ కేసు ఐక్యరాజ్యసమితి పరిశీలనలో ఉండగానే భారత ప్రభుత్వం హైదరాబాద్‌పై పోలీసు చర్య జరిపిందని విదేశీ పత్రికలలో ప్రచురితమైన వార్తలను హైదరాబాద్ ప్రతినిధివర్గానికి నాయకత్వం వహించిన మోహిన్ నవాజ్‌జంగ్ సెక్యూరిటీ కౌన్సిల్‌లో చదివి వినిపించాడు. భారత ప్రతినిధి వర్గానికి నాయకత్వం వహించిన సర్ రామస్వామి మొదలియార్ హైదరాబాద్ భారతదేశపు ఆంతరంగిక సమస్య అని ఇది ఐక్యరాజ్య సమతి పరిధిలోకి రాదని వాదించాడు. ఈ వాదోపవాదాలు కొనసాగుతుండగానే సెప్టెంబర్ 17న పోలీసుచర్య పూర్తైంది. అదేరోజు ఈ కేసును తను ఉపసంహరించుకుంటున్నట్లు నిజాం తంతిద్వారా ఐక్యరాజ్య సమితికి తెలియబరిచాడు.

ఇది యుద్ధమే కాదు. నిజాం సైనికులు ఎక్కడ పోరాటమే చేయలేదు. వాస్తవంలో నిజాంకు సైన్యం అంటూ ఏదీ లేదు. రెండవ నిజాం కాలంలోనే అది బ్రిటిష్‌వారి హస్తగతమైంది. నిజాం సొంత సైన్యమైనా అది ఏదైనా పూర్తిగా బలహీనమైనది. హైదరాబాద్‌లోని అన్ని సైనిక శిబిరాలలో బ్రిటిష్ సైన్యమే తిష్ఠవేసినది. హైదరాబాద్ సైన్యానికి ఆధునిక ఆయుధాలు లేవు. యుద్ధసామగ్రి తయారు చేసే ఫ్యాక్టరీలు లేవు. 200 సంవత్సరాల బానిసత్వం హైదరాబాద్ సైనిక శక్తిని నామమాత్రం చేసి వదిలిపెట్టింది. పోరాడింది, ప్రతిఘటించింది రజాకార్లే. పోలీసు చర్య సందర్భంలో 2 వేలమంది రజాకార్లు చనిపోయారని, 4500 మంది పట్టుబట్టారని పోలీసు చర్యను విజయవంతంగా నడిపించిన మేజర్-జనరల్ జె.ఎన్.చౌదరి తన ఆత్మకథలో పేర్కొన్నాడు. పోలీసు చర్య నాలుగు రోజులలో ముగిసింది.

రజాకార్లను రెచ్చగొట్టునప్పుడు 'ఫైర్ ఈటర్'గా పేరుపొందిన రజ్వీ పోలీసు చర్య జరుగుతున్నప్పుడు 'పేపరు టైగర్'గా మారిపోయాడు. తను నిజాం సైనికులను నమ్మి మోసపోయినట్లు బుకాయించాడు. దక్కను రేడియోలో ఖాసిం రజ్వీ చేసిన చివరి సందేశంలో తన దైన్యస్థితిని వెల్లడించుకున్నాడు.

'మీ దురదృష్టంపై దురపిల్లండి. ప్రపంచంలో ఇలాంటి సంఘటనలు తరచు జరుగుతూనే ఉంటాయి. భారత ప్రభుత్వం తన అపారమైన సైనిక శక్తితో మనమీద దాడిచేసింది. దీన్ని మనం ఎదుర్కొనలేము. మీ రక్షణ మీరే చూసుకోండి' అని చప్పగా

జారుకున్నాడు 'ఫీల్డ్ మార్షల్' ఖాసిం రజ్వీ.

భారత సైన్యం హైదరాబాద్‌లో ప్రవేశించగానే పాకిస్తాన్‌కు పారిపోదామను కున్నాడు రజ్వీ. అందుకు విమానాశ్రయంలో సిద్ధంగా ఉన్నాడు. కానీ అంతలోనే విమానం వెళ్ళిపోవడంతో రజ్వీ పట్టుబడ్డాడు. బీబీనగర్ కేసులో అతనికి ఏడు సంవత్సరాల కఠిన శిక్ష విధించబడింది.

పోలీసు చర్య:

ఈ సైనికచర్య మొత్తం ఎంత వేగంగా, ఎంత సమర్థవంతంగా జరిగిందంటే దాదాపు రక్తపాతంలేని దండయాత్ర ఇది అని చెప్పవచ్చు. వారం రోజుల్లోనే భారత సైన్యాలు నిజాం ఆట కట్టించాయి. మతప్రాతిపదికపై ఏర్పాటైన రజాకారు సంస్థ బండారం బయటపడింది. అది పేకమేడలా కూలి, అతీగతీ లేకుండా అంతర్ధానమై పోయింది.

రాష్ట్రంలో కాంగ్రెసుకు మెజారిటీ ఉన్నది. ప్రజాభిమానం పొందింది. కనుక పోలీసు చర్య తరువాత సహజంగా ఆ పార్టీకి రాష్ట్ర పరిపాలన బాధ్యత అప్పగించవలసి ఉన్నది. కానీ, కాంగ్రెసులో చీలికలు ఏర్పడటం వల్ల కమ్యూనిస్టు అనుకూల శక్తుల ప్రాబల్యం వల్ల, స్టేటు కాంగ్రెసు ఏ విధానాలు అనుసరించాలనే విషయంలో కొందరికి కొన్ని విశ్వాసాలు ఉండటంవల్ల కాంగ్రెసుకు అధికారం అప్పగించడానికి వీలు పడలేదు. పండిట్ జవహర్‌లాల్ నెహ్రూ, సర్దార్ వల్లభ్‌భాయ్ పటేల్ హైదరాబాద్ సందర్శించారు. వారికి ఘనస్వాగతం లభించింది. రాష్ట్రపరిపాలన నిర్వహించడానికై స్టేటు కాంగ్రెసు ప్రాతినిధ్యం లేకుండా తాత్కాలిక ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయడం అవసరమని భావించడం జరిగింది. మేజర్-జనరల్ జె.ఎన్.చౌదరి మిలిటరీ గవర్నరుగా నియమించబడ్డాడు. ప్రజలు మొదట్లో మిలిటరీ ప్రభుత్వాన్ని మనస్ఫూర్తిగా ఆహ్వానించారు. కానీ, పోలీసు, మిలిటరీ ప్రభుత్వంవారు మద్రాసు, బొంబాయిల నుంచి అధిక సంఖ్యలో అధికారులను దిగుమతి చేసి అన్ని శాఖలను నింపేశారు. ❑

33. సైనిక, సివిల్ ప్రభుత్వాలు

1712లో మొదటి నిజాం చీన్‌ఖులిచ్‌ఖాన్ స్థాపించిన అసఫ్‌జాహీ రాజ్యం 1948 సెప్టెంబరు 17న పోలీసుచర్యతో అంతరించింది. ఆ రోజు సాయంత్రం ఏడున్నర గంటలకు ఏడవ నిజాం మీర్ ఉస్మాన్ అలీఖాన్ బహాదుర్ దక్కన్ రేడియోలో ప్రజలకు ఇలా వీడ్కోలు సందేశమిచ్చాడు:

'నా ప్రభుత్వం రాజీనామా చేసి రాష్ట్రపరిపాలన స్వీకరించవలసిందని నన్ను కోరింది. అందుకు నేను అంగీకరించాను. యుద్ధాన్ని ఆపివేసినట్లు గౌరవనీయులైన భారత గవర్నరు-జనరల్‌కు తెలియజేశాను. కొత్త ప్రభుత్వం ఏర్పడేవరకు తాత్కాలిక ప్రభుత్వంగా ఏర్పడిన కమిటీలో మహాఘనత వహించిన బిరారు యువరాజు, మేజర్-జనరల్ ఎల్ ద్రూసు (కమాండర్), నవాబు దీన్‌యార్‌జంగ్ (పోలీసు కమీషనర్), జి. రామాచారి (మాజీ మంత్రి), పన్నాలాల్ పిట్టి, అబుల్ హసన్ సయ్యద్ అలీ (రజ్వీ ముందు ఇత్తెహాద్ అధ్యక్షుడు) సభ్యులు. ప్రస్తుతం బొంబాయిలో ఉన్న మీర్జా ఇస్మాయిల్, జైన్‌యార్‌జంగ్, ఆరావముదు అయ్యంగార్‌లను రాష్ట్రం విచ్చేయవలసిందిగా ఆహ్వానాలు పంపించాను. లాయిక్ అలీ ప్రభుత్వం రాజీనామాతో తలెత్తిన సమస్యలపై వారు నాకు సలహాలివ్వగలరు. స్టేటు కాంగ్రెసు అధ్యక్షుడు స్వామీ రామానందతీర్థను విడుదలకు ఆజ్ఞాపించాను. ఈ సందర్భంలో స్వామిజీ సేవలు అవసరమవుతాయి. కాంగ్రెస్ కార్యవర్గ సభ్యులపై గల నిషేధాజ్ఞలను తొలగించివేశాను. భారత ఏజెంటు-జనరల్ కె.ఎం.మున్షీతో సంప్రదిస్తున్నాను. నా ప్రియమైన ప్రజానీకమంతా కులమత విద్వేషాలను విస్మరించి సోదర భారత ప్రజలతో కలసి మెలసి జీవించగలరని ఆశిస్తున్నాను. నా మాజీ ప్రభుత్వం ఐక్యరాజ్యసమితిలో పెట్టిన కేసుపై ఒత్తిడి తీసుకురావద్దని ఆజ్ఞాపించాను. భారత ప్రభుత్వంతో స్నేహ

సంబంధాల నూతన శకంలో మన ప్రవేశం శుభసూచకం. ప్రజల యోగక్షేమాలకు మా వంశంవారు ఎంతగా పాటుపడ్డారో నేను కొత్తగా చెప్పవలసిన అవసరం లేదు'. నిజంగా నిజాం చాలా ఆకర్షణీయమైన ప్రసంగమే చేశాడు.

కమిటీకి అధికార బాధ్యతలు స్వీకరించవలసిన అవసరం లేకుండానే మేజర్–జనరల్ జె.ఎన్.చౌదరి 1948 సెప్టెంబర్ 18వ తేదీన రాష్ట్ర పరిపాలనా బాధ్యతలను స్వీకరించాడు. చౌదరి మిలిటరీ గవర్నరే అయినా పరిపాలన సివిల్ పద్ధతిలోనే నడిచింది. చౌదరి ప్రభుత్వంలో బి.ఎన్.భాక్లే చీఫ్ సివిల్ అడ్మినిస్ట్రేటర్ అంటే దాదాపు ముఖ్యమంత్రి హోదా. నవాబు జైన్ యార్‌జంగ్ బహాదుర్, రాజా దొండేరాజ్ బహాదుర్, సి.వి.ఎస్.రావు, జి.వి.హెచ్. కృష్ణారావు, కాజంయార్‌జంగ్ సభ్యులు.

పోలీసు యాక్షన్ తరువాత హైదరాబాద్ రాష్ట్రంలో ఎన్నికలు జరగలేదు. ఆ కాలంలో విచక్షణారహితమైన హింసాకాండ కమ్యూనిస్టు సాయుధ పోరాటం వున్నచోట్ల జరిగింది. ఈ హింసాకాండమూలంగా ప్రజలలో కాంగ్రెసుపట్ల కొంత విముఖత కలిగినప్పటికీ కమ్యూనిస్టులకు సహాయం చేయడాన్ని విరమించుకున్నారు. మధ్యతరగతి ప్రజానీకంలో కమ్యూనిస్టు పార్టీపైన విశ్వాసం సడలజొచ్చింది. కమ్యూనిస్టులపైన విశ్వాసంగల ప్రజానీకం కూడా వారి సాయుధపోరాట విధానం పట్ల పెడముఖం పెట్టింది. పార్టీలోను అనేక తర్కవితర్కాలు జరిగి చివరకు కమ్యూనిస్టు పార్టీ సాయుధ పోరాటాన్ని విరమింపజేసుకుంది. కమ్యూనిస్టుపార్టీ సాయుధ పోరాటాన్ని అణచివేసిన ప్రతిష్ఠను మిలటరీ గవర్నరు దక్కించుకున్నారు. మిలటరీ గవర్నరు ప్రభుత్వం రోజులలో వారేది తలచుకుంటే అది వెనువెంటనే శాసనం కావడం, ఖచ్చితంగా అమలు జరగడం జరుగుతూ వుండేది.

పోలీసు చర్య మూలంగా తన నిరంకుశాధికారాన్ని కోల్పోయి రాజప్రముఖుడైన నిజాం ఏ శాసనంపైనైన సంతకం చేయడానికి వెనుదీసే స్థితిని కోల్పోయినాడు. కాబట్టి ఎంత ప్రబలమైన సంస్కరణైనా ఎట్టి నిరోధం లేకుండా నల్లేరుపై బండి సాగినట్లు అమల్లోకి వచ్చిందీ కాలంలో. ఎవరికీ కాదనడానికి దమ్ములు లేకపోయినవి. మిలటరీ గవర్నరు కాలంలో చిరకాలంగా నిజాంపాలనలో గల జాగీర్దారీ వ్యవస్థతో

సహా నిజాం సొంత జాగీరు సర్ఫెఖాస్ ఒక్క కలంపోటుతో రద్దయినది. నిజాం తన సార్వభౌమ చిహ్నాలని చెప్పుకుంటున్న అన్ని లాంఛనాలు అనగా కరోడ్‌గిరి, ఎగుమతి, దిగుమతుల సుంకాలు, హాలీసిక్కా, ప్రత్యేక పోస్టు, టెలిగ్రాఫ్, సైన్యం మొదలైన వన్నీ రద్దయి, ఇతర ప్రాంతాలతోపాటు పూర్తిగా హైదరాబాద్ రాష్ట్రం భారతదేశంలో చేరిపోయింది. ప్రజల భాషలైన ఆంధ్ర, మహారాష్ట్ర, కర్నాటక భాషలలో మెట్రిక్ వరకు విద్యాబోధన ప్రారంభమైంది. చిరకాలంగా వస్తున్న శుక్రవారం సెలవు రద్దయి దాని స్థానంలో ఆదివారము వచ్చింది.

ఫసలీ తారీఖుల మార్పు:

1946 అక్టోబరు లో 1356 వ సంవత్సరం ప్రారంభం అవుతుంది. ఫసలీ నెలలు, రోజులు: ఆజూర్ (31), దై (30), బహమన్ (31), ఇస్ఫందార్ (31), ఫర్వర్దీ (28), అర్దిబహష్త్ (31), ఖుర్దాద్ (30), తీర్ (31), అమరాద్ (30), షహరేవర్ (31), మెహర్ (31), ఆబాన్ (30) ఫసలీ నెలలు రద్దయి ఇంగ్లీషు నెలలు వాడుకలోకి వచ్చాయి.

విద్యారంగంలోను, పురాతత్వశాస్త్రరంగంలోను జనరల్ చౌదరి కొన్ని మంచి పనులు చేశాడు. హైదరాబాద్ పురాతత్వ శాఖకు ఎక్కువ నిధులు మంజూరు చేసి ఎల్లోరా, అజంతా శిల్పాల పరిరక్షణకు, బీదరుకోటను మరమ్మతు చేయటానికి తోడ్పడ్డాడు. ఇంకా కొన్ని ప్రాచీన స్థలాల పునరుద్ధరణ జరిపించాడు. ఆయన ఉదారంగా విడుదల చేసిన నిధులకు పురాతత్వశాఖ వారు ఆశ్చర్యపోయారు.

మిలిటరీ గవర్నరు చౌదరి దిన చర్యలలో గ్రామాలకు వెళ్ళడం, ప్రజలను కలుసుకోవడం విధిగా ఉండేది. ఒక జీపులో ఇద్దరు సైనికులతో ఊళ్ళకు వెళ్ళిపోతూ ఉండేవాడు. ఆశ్చర్యం, సంతోషం. పేదలిచ్చే చాయ్ తాగేవాడు. వాళ్ళ అర్జీలు పుచ్చుకునేవాడు. అక్కడికక్కడ సమస్యలు పరిష్కరించేవాడు. అతని ఆదేశాలకు తిరుగులేదు మరి. హైదరాబాద్ రాష్ట్రం నుంచి భారతరాజ్యాంగ పరిషత్తుకు ప్రజా ప్రతినిధులు నామినేట్ చేయబడ్డారు. ఉర్దూలో జరుగుతూ ఉండిన పరిపాలన ఇతర భారతీయ ప్రాంతాలతోపాటు ఇంగ్లీషులో మొదలైంది.

ఆ కాలంలో పౌర పరిపాలనశాఖలను 'సివిల్ అడ్మినిస్ట్రేట్' అని మిలటరీ గవర్నరు కింద నెలకొల్పారు. ఆ శాఖను చూసే అత్యున్నత అధికారిని ఛీఫ్ సివిల్ అడ్మినిస్ట్రేటర్ అన్నారు. తాలుక్దార్ (కలెక్టర్)ను సివిల్ అడ్మినేస్ట్రటర్ అనీ, దువ్వంతాలుక్దార్ (డిప్యూటీ కలెక్టరు)ను డిప్యూటీ సివిల్ అడ్మినిస్ట్రేటర్ అనీ, తహసీల్దారును అసిస్టెంటు సివిల్ అడ్మినిస్ట్రేటర్ అని పిలిచేవారు. ఛీఫ్ సివిల్ అడ్మినిస్ట్రేటర్‌కు దాదాపు ముఖ్యమంత్రి హోదా ఉండేది. మిలిటరీ గవర్నరు నుండి మామూలు ఉద్యోగి వరకు సుపరిపాలన పేరు మీద కొన్ని వేలమంది పరిసర రాష్ట్రాలైన మద్రాసు, మైసూరు, సి.పి. (నాగ్‌పూర్), బొంబాయి రాష్ట్రాల నుండి వచ్చారు. వీరిని ఆశ్రయించుకుని అనేకమంది ఇక్కడికి వచ్చి చిల్లర ఉద్యోగాలు కూడా సంపాదించు కున్నారు. ఆ విధంగా పెద్ద ఎత్తున ఇతర ప్రాంతాలనుండి వచ్చిన వారి సంఖ్య చాలానే ఉన్నది. 'సివిల్ టీమ్' పేరుమీద దాని పుణ్యమా అని ప్రభుత్వ వ్యవస్థలో రెండు వర్గాల మధ్య కలహాలరంగం మొదలైంది. సంస్థానంలో ఏ ప్రాంతంలో చూసిన స్టేటు ఉద్యోగులు, బయట ఉద్యోగులు' అన్న ప్రస్తావన వినిపించేది. బయటి ఉద్యోగులు పాలకులగాను, స్టేటు ఉద్యోగులు పాలితులుగాను చెలామణి అవుతూ వచ్చారు. వారి మధ్య ఏర్పడిన అఖాతం నానాటికి విశాలమవుతూ వచ్చింది. దీనివల్ల ప్రజా సంక్షేమానికి తీరని హాని కలిగింది.

ఉద్యోగులకు సంబంధించిన ఈ వర్గీకరణ పరిపాలనా యంత్రంలో పైన మంత్రులు మొదలుకొని కింది ఆఫీసు బంట్రోతు వరకు ఏర్పడింది. ముఖ్యమైన శాఖలేవీ రాష్ట్రమంత్రులకు ఇవ్వలేదు. ఇచ్చిన శాఖలలోనైన వారికి పూర్తి అధికారం లేదు. ఛీఫ్ సెక్రటరీ బైటవాడు కనుక ఈ అపోహ మరింత నాటుకుపోయింది. యథార్థంలో భారత రిపబ్లిక్‌లో 'బయట', 'లోపల' అనే ప్రమేయమే ఉండటానికి వీలులేదు. బయటివారు వచ్చి ఇక్కడ స్థిరమైన ఉద్యోగాలు సంపాదించుకోవడం విషయంలో కూడా అంత పేచీ లేదనే చెప్పాలి. కానీ అప్పుడు హైదరాబాద్ రాష్ట్రంలో ఉన్న బయట ఉద్యోగుల పరిస్థితి వేరు. హైదరాబాద్ ప్రభుత్వం వారిని అరువుకు తెచ్చింది. ఏనాటికైనా వారు తమ స్వంత రాష్ట్రాలకు పోవలసినవారే. కనుక వారిని బయటి వారు అని అన్నారు.

ఈ విధానంవల్ల జిల్లాలన్నింటిలోను పరిపాలన విధానం పోటీలో ఇరుక్కుంది. ప్రభుత్వోద్యోగులు ఖచ్చితంగా రెండు ముఠాలుగా చీలిపోయారు. ఇది బయటికి స్పష్టంగా కనిపించకపోయినా చేయవలసిన హాని ఎంతో చేసింది. ప్రజా సంస్థలలో ఇలాంటి విభేదాలు ఉంటే, వెంటనే బయటికి వచ్చే అవకాశం ఉంది. కానీ ప్రభుత్వ యంత్రాంగంలోని చీలికలు కాబట్టి వెంటనే బాహాటంగా కనిపించవు. ఉద్యోగవర్గం అంతఃకలహాలతో ప్రభుత్వ ప్రతిష్ఠ ప్రజాదృష్టిలో పూర్తిగా దిగజారిపోయింది. జనరల్ చౌదరి అధికారంలో ఉన్నప్పుడే ప్రధాని పండిట్ నెహ్రూ, ఉపప్రధాని సర్దార్ పటేల్ హైదరాబాద్ రావడం జరిగింది. నిజాం నవాబు విమానాశ్రయానికి వెళ్ళి నాయకులకు స్వాగతం పలికాడు. అవసరమైనప్పుడు జనరల్ చౌదరి రాష్ట్ర కాంగ్రెసు నాయకులైన స్వామీరామానంద తీర్థ, డా॥ జి.ఎస్. మెల్కోటేల సహాయం తీసుకునేవాడు. పద్నాలుగు నెలల మిలిటరీ పరిపాలన అనంతరం పరిస్థితులు కుదుట పడ్డాయి. రాష్ట్రాన్ని ఒక సంవత్సరం పాలించిన జనరల్ చౌదరి కమ్యూనిస్టులను అణచివేసే వ్యూహం కింద రాష్ట్రాన్ని గడగడ లాడించాడు.

సైనిక పాలనను తొలగించి సివిలియన్ పరిపాలన ఏర్పాటు చేయాలని కేంద్ర ప్రభుత్వం భావించింది. 1949 డిసెంబరు 1వ తేదీన ఎం.కె. వెల్లోడీ ముఖ్య పరిపాలనాధికారిగా వచ్చాడు. ఇంచుమించు ముఖ్యమంత్రి అన్నమాట. అయితే శాసనసభలాంటివి లేవు. నియమిత ముఖ్యమంత్రిగా వెల్లోడీ పరిపాలన మొదలైంది. 1950 జనవరి 26న వెల్లోడీ రాజ్యాంగం ప్రకారం ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేశాడు. ఆ రోజే నిజాం రాజ్‌ప్రముఖ్ అయ్యాడు.

వెల్లోడీ మంత్రివర్గంలో నలుగురు కాంగ్రెసు నాయకులకు–బూర్గుల రామకృష్ణా రావు, వి.బి.రాజు, వినాయకరావు విద్యాలంకార్, ఫూల్చంద్ గాంధీలకు మంత్రి పదవులు లభించాయి. మిలిటరీ ప్రభుత్వం పాలనలో ప్రవేశపెట్టిన సంస్కరణలనే వీరు కొనసాగించారు. సివిల్ అడ్మినిస్ట్రేటర్లు కలెక్టర్లయ్యారు. అట్లాగే ఇతర యంత్రాంగమంతా ఇతర రాష్ట్రాల మాదిరిగానే సివిల్ పరిపాలనగా మారిపోయింది. కమ్యూనిస్టులు తమ పాలసీ మార్చుకున్నారు. వారికోసం ఏర్పాటు చేసిన 'కాన్

సెంట్రేషన్' క్యాంపులను క్రమేణా ఉపసంహరించుకున్నారు. రజాకార్లపై పెట్టిన కేసులు పరిష్కారం చేయడం, ఖాసిం రజ్వీ నిర్బంధం, లాయక్ అలీ పాకిస్తాన్‌కు పారిపోవడం ఈ కాలంలో జరిగిన ప్రముఖ సంఘటనలు. ద్వంద్వ పరిపాలన క్రమేణా రద్దుచేయబడింది. దఫాలవారీగా ఇతర రాష్ట్రాలనుంచి వచ్చిన పోలీసులు తిరిగి పంపించివేయబడ్డారు. రాష్ట్రంలో శాంతిభద్రతలు నెలకొన్నాయి. ఆ పరిపాలన రెండు సంవత్సరాలు కొనసాగింది. ఎన్నికలవరకు వెల్లోడి ప్రభుత్వమే అధికారంలో ఉంది. ❑

34. స్టేట్ కాంగ్రెసు వ్యవహారాలు

భారతదేశానికి స్వాతంత్ర్యం లభించిన 13 మాసాల తరువాత భారత ప్రభుత్వం హైదరాబాద్ రాష్ట్రంపై పోలీసు చర్య జరిపింది. హైదరాబాద్‌లో ప్రజలు, కార్యకర్తలు చేసినంత త్యాగం, పడ్డ ఇబ్బందులు భారత స్వాతంత్ర్య సంగ్రామ కాలంలో ఎన్నడూ, ఎక్కడా పడలేదని చెబితే అతిశయోక్తి కాదు. పోలీసు చర్యతో నిజాం వెంటనే లొంగిపోయిన వార్త వాస్తవమే కాని, భారత ప్రభుత్వపు బ్యూరోక్రటిక్ యంత్రాంగం ప్రజల త్యాగాన్ని అర్థం చేసుకోవడం కానీ, అంచనావేసుకోవడం కానీ చేయలేక పోయింది. దీనితోపాటు పోరాటంలో నామమాత్రంగా ఉన్న మితవాద నాయకులు అంతా తామే చేసినట్లు ప్రచారం చేసుకోసాగారు. అప్పుడు భారత ప్రభుత్వ ప్రతినిధిగా ఉన్న కె.ఎం.మున్షీ ఆశీర్వాదం ఈ మితవాద నాయకత్వానికి లభించింది. ఆ కారణంగా తీవ్రవాద దృష్టితో పోరాడిన వర్గానికి సర్దార్ పటేల్ దృష్టిలో తగినంత మన్నన లభించలేదు. హైదరాబాద్ స్టేట్ కాంగ్రెసు నాయకత్వం చేసిన ఒక చిన్నపాటి ఎత్తుగడను ఆధారం చేసుకొని కాంగ్రెస్‌లో చీలిక వచ్చింది.

గోసాయి, దేశాయి పార్టీలు:

స్వాతంత్ర్య సమరంలో స్వామీజీ సారథ్యంలో పోరాడిన ప్రజాపక్షాలన్నీ సమర ఫలితం అనుభవించే సమయం రాగానే దేనిదారి అది చూచుకున్నది. స్టేట్ కాంగ్రెసులో అతివాద, మితవాద వర్గాలు మొదటినుంచీ ఉన్నవే. అతివాద పక్షానికి స్వామీ రామానంద తీర్థ నాయకుడు. సర్దార్ జమలాపురం కేశవరావు, వి.బి.రాజు, మాడపాటి రామచంద్రరావు, జలగం వెంగళరావు, పి.వి. నరసింహారావు ఈ గ్రూపువారే. మితవాద గ్రూపునకు బూర్గుల రామకృష్ణారావు, కొండా వెంకటరంగారెడ్డి నాయకులు. డా॥

చెన్నారెడ్డి ఈ గ్రూపులోనివారే. కేంద్రంలో నెహ్రూ, పటేల్ గ్రూపులున్నవని అనుకుంటున్నప్పుడు నెహ్రూ గ్రూపును స్వామీజీ, పటేల్ గ్రూపును రంగారెడ్డి బలపరిచేవారు. కేంద్రంతో నేరుగా సంప్రదింపులు జరుపుతున్నారని చెప్పి బూర్గుల, రంగారెడ్డి, రామాచారి, వైద్యాలను స్టేట్ కాంగ్రెసు నుండి సస్పెండ్ చేశాడు స్వామీజీ. దీనిపై వ్యతిరేక వర్గంవారు పోటీ కాంగ్రెసు పెట్టి జనార్ధనరావు దేశాయిని అధ్యక్షుడుగా, బూర్గుల రామకృష్ణారావుని కార్యదర్శిగా చేసుకున్నారు. నిజంగా స్టేట్ కాంగ్రెసు ఆవిర్భావం నుంచి నాయకత్వానికి స్వామీజీ, బూర్గుల ప్రతి ఎన్నికల్లో పోటీ పడేవారు. ఒకటి, రెండు ఓట్లతో బూర్గుల ఓడిపోయేవారు. స్వామీజీ గ్రూపునకు 'గోసాయి' పార్టీగాను, బూర్గుల గ్రూపునకు దేశాయి పార్టీగాను పేర్లు పెట్టుకున్నారు. పోటీ కాంగ్రెసుకు జనార్ధనరావు దేశాయి అధ్యక్షుడుగ ఉండేవాడు. ఈ చీలిక కారణంగా ప్రజలలో తెచ్చుకోవలసిన పేరు ప్రతిష్ఠలను పోలీసు చర్య అనంతరం స్టేట్ కాంగ్రెసు తెచ్చుకోలేకపోయింది. భారత ప్రభుత్వం తీసుకున్న పోలీసు చర్యయే తమ విముక్తికి కారణమని మధ్యతరగతి ప్రజానీకం భావించ జొచ్చారు.

పోలీసు చర్య తరువాత కమ్యూనిస్టులు తమ సాయుధపోరాటాన్ని విరమింపజేస్తే పరిస్థితులు మరోలా ఉండేవి. కమ్యూనిస్టు పార్టీకి మౌలికమైన వత్తాసు ప్రజలలో ఉన్నదనే నెపంతో భారతసైన్యం, పోలీసులు ప్రజలపై విచక్షణారహితమైన హింసకు తలపడ్డారు. ఆనాడు కేంద్రంలో, పరిసర రాష్ట్రాలలో ఉన్నది కాంగ్రెస్ ప్రభుత్వమే కాబట్టి అంతకుముందే పోరాటాన్ని విరమించి, ప్రజలకు విముక్తి కలుగజేశామని చెప్పే కార్యకర్తల పరిస్థితి అడకత్తెరలో పోకచెక్క మోస్తరయింది. భారత ప్రభుత్వ సైన్యాన్ని హింసాకాండను మానుకోమని చెప్పే స్థితి లేకపోయింది. ప్రజల పక్షం నుండి ధైర్యంగా హింసకు ప్రతికూలంగా పోరాటాన్ని సాగించగల దశలో లేకపోయింది. వీటన్నిటికి తోడు కాంగ్రెసు ఈ అఘాయిత్యాలకు కారణమని ఉధృతమైన కమ్యూనిస్టుల ప్రచారం ఉండనే ఉంది.

1948లో పండిట్ నెహ్రూ హైదరాబాద్ వచ్చినప్పుడు ఈ రెండు గ్రూపుల తగాదాలను విని విసుగుచెంది పరిష్కరించలేదు. ఆ తరువాత ఈ బాధ్యత సర్దార్ పటేల్‌పైన పడింది. 1949 జనవరి 10వ తేదీన సర్దార్ హైదరాబాద్ పర్యటనకు వచ్చినప్పుడు ఇరువర్గాలను సమావేశపరచి, వర్కింగ్ కమిటీలో ఉభయ గ్రూపులకు

సమాన ప్రాతినిధ్యమిచ్చి స్వామీజీ అధ్యక్షతన నూతన కాంగ్రెసు వర్కింగ్ కమిటీ ఏర్పాటు చేసాడు. అంతటితో పోటీ కాంగ్రెసుతో పాటు హైదరాబాద్ స్టేట్ కాంగ్రెసుకు గల స్వతంత్ర ప్రతిపత్తిని రద్దుచేసి, అఖిలభారత కాంగ్రెసు కమిటీ అనుబంధ సంస్థగా మార్చివేశారు. హైదరాబాద్ స్టేట్ కాంగ్రెసుకు స్వామీజీ, దిగంబర్రావ్ బిందూ, రంగారెడ్డి, మల్లప్ప కొల్లూరు, జె.వి. నరసింగరావులు వరుసగా అధ్యక్షులైనారు.

పోలీసు చర్య ముగింపుతో స్టేట్ కాంగ్రెసులో ఏదో మహత్తరశక్తి ఉందని, దానిలో ప్రవేశిస్తే ఏనాటికైనా ఏదో ఒక పదవి సంపాదించి తిరిగి పెత్తనం నిలబెట్టుకోవచ్చుననే దురాశతో చాలామంది అవకాశవాదులు, మిథ్యాదేశభక్తులు (కపట) దేశముఖులు, జమీందార్లు నిముషంలో కాంగ్రెసు బురఖా ధరించి దానిలో చొరబడ్డారు. వారి ప్రవేశాన్ని ఎవరూ ఆటంకపరచకపోగా ఇదంతా సంస్థ అభివృద్ధికే జరుగుతున్న కార్యకలాపాలని, కాంగ్రెస్‌పై గల అమేయ భక్తి అనుకుని వీరందరికీ ఆనాటి నాయకులు స్వాగత గీతం పాడి, తక్షణం కాంగ్రెసు ముద్రలు అంటించి కులంలో కలుపుకున్నారు.

కాంగ్రెసు ముద్రలు ధరించిన వీరు కమ్యూనిస్టుల వేట నెపంతో పోలీసు బలగాల్ని పల్లెలకు రప్పించి, చేయవలసిన అకార్యాలన్నీ చేసి, ప్రజలవీపులు చిట్లగొట్టించి, అమాయకులను నిర్బంధింపజేసి, పూర్వం తమకు వ్యతిరేకులైన వారిని, కౌల్దార్లను అణచడానికి ఎంతో ప్రయత్నం చేశారు. ఈ నియంతలకి ఎదురు తిరిగిన కాంగ్రెస్ కార్యకర్తలు, శీల సంపద కలవారు కూడా జైళ్లకు వెళ్ళడం తటస్థించింది. సామర్థ్యమూ, స్వచ్ఛత కలిగిన కార్యకర్తలు ఈ దుర్గంధంలోంచి బయటపడక తప్పలేదు. సేవా భావం లోపించి, కేవలం ప్రజల్ని వేటాడటమే పనిగా పెట్టుకున్న కాంగ్రెసును ప్రజలు తిరస్కార భావంతో చూడటం మొదలుపెట్టారు. సంస్థాన కాంగ్రెసు ప్రదేశ్ కాంగ్రెసుగా అవతరించిన సమయంలో లోలోపల ప్రకోపించిన మనస్తత్వాలు బట్టబయలైనాయి. పదవులకోసం బహిరంగంగా జరిగిన గుద్దులాటలు, రాయబారాలు, ముఠాబందీలు ఇంకొక మెట్టు కాంగ్రెసును కిందికి దింపాయి.

ఈ విభేదాలతో కాంగ్రెసు బాగానే నష్టపోయింది. పోలీసు చర్య జరిగిన రెండేళ్లకు కాని రాష్ట్రమంత్రివర్గంలో స్టేట్ కాంగ్రెసుకు ప్రాతినిధ్యం లభించలేదు. అదికూడా పాక్షికమే. స్వతంత్ర భారతదేశంలో రాష్ట్రేతరులతో మంత్రివర్గం ఏర్పడటం

ఒక్క హైదరాబాద్ రాష్ట్రంలోనే జరిగింది. వీరి తగాదాలవల్ల అల్పసంఖ్యాక వర్గంలో స్టేట్ కాంగ్రెసు నాయకుల యెడల విశ్వాసం కుదరలేదు. 'మేధావి, విశాల హృదయుడు రాష్ట్రనాయకత్వానికి అర్హుడైన బి.రామకృష్ణారావు కూడా అప్పటి రోజుల్లో అల్ప సంఖ్యాక వర్గాల పూర్తి విశ్వాసం పొందలేకపోయాడని' సర్దార్ పటేల్ చరిత్రలో ఆయన కార్యదర్శి వి. శంకర్ పేర్కొన్నాడు. స్వరాష్ట్రం, స్వభాషపై ఎక్కువ మక్కువ జూపే హైదరాబాద్ రాష్ట్రాన్ని పాలించిన ముఖ్యమంత్రులంతా గైర్ ముల్కీలే. సర్ అలీ ఇమామ్, సర్ అక్బర్ హైదరీ, నవాబు ఛత్తారీ, సర్ మీర్జా ఇస్మాయిల్, జనరల్ చౌదరి, ఎం.కె. వెల్లోడీలు రాష్ట్రీయులు కారు. వీరంతా ముల్కీ ఉద్యమాన్ని పోషించిన నిజాం ఉస్మాన్ అలీఖాన్ కాలంవారే. ముల్కీ నినాదం ఉన్న రాష్ట్రంలో నాన్ ముల్కీల పాలన పోలీసుచర్య అనంతరం కూడా మూడేళ్ళు సాగింది. ❑

35. మొదటి సార్వత్రిక ఎన్నికలు

హైదరాబాద్ రాష్ట్రంలో మొదటి సార్వత్రిక ఎన్నికలు 1951 నవంబరు 21వ తేదీ నుండి 1952 జనవరి 18 వరకు జరిగాయి. శాసన సభకు 175 మంది అభ్యర్థులు, పార్లమెంటుకు 25 మంది అభ్యర్థులను ఎన్నుకున్నారు.

రాష్ట్ర కాంగ్రెసు అన్ని సీట్లకు పోటీ చేసింది. కాంగ్రెసుపైకి ఒకే సంస్థగా కనిపించినా లోపల రెండు పెద్ద సంస్థలుగా చీలి ఉంది. ఒకటి స్వామి రామానందతీర్థ వర్గం, రెండోది– పోటీ కాంగ్రెస్ లేదా రామకృష్ణారావు వర్గం. వాటినే గోసాయి, దేశాయి పార్టీలనేవారు. స్వామీజీ వర్గం మరట్వాడాలో బలీయంగా ఏకగ్రీవంగా ఉండేది. అయితే ఈ వర్గంలో స్వామీజీకి కుడిచేయిగా ఉండి, పోరాటం జరిపించిన గోవిందదాస్ షరాఫ్, ఆయన సహచరులు వైశంపాయన్, ఆనందరావు వాగ్మరే మొదలైనవారు కాంగ్రెసు నుంచి నిష్క్రమించారు. అయినప్పటికీ మరట్వాడాలో స్వామీజీ వర్గమే బలీయంగా ఉండేది. వారి వర్గంవారే మరట్వాడాలో ఎక్కువ సీట్లు పొందారు. కర్నాటకలో స్వామీజీ వర్గం బలహీనంగా ఉంది. పోటీ కాంగ్రెసు బాగానే ప్రాబల్యం సంపాదించుకుంది. ప్రధానంగా లింగాయత్‌లు ఎక్కువమంది పోటీ కాంగ్రెసులోనే ఉన్నారు. మొత్తంమీద మరట్వాడా, కర్నాటకలో కాంగ్రెసు సభ్యులు ఎక్కువమంది గెలిచారు.

ఇక తెలంగాణా సంగతి. తెలంగాణాలో కాంగ్రెసు స్వామీజీ వర్గంగాను, పోటీ కాంగ్రెసుగాను విడిపోయిన తరువాత ప్రతిచోట తీవ్రమైన ఘర్షణ జరిగింది. తెలంగాణా కాంగ్రెసు కమిటీ అధ్యక్షుడుగా పోటీ కాంగ్రెసు ప్రముఖుడైన కొండా వెంకటరంగారెడ్డి ఎన్నికైనాడు. అందువల్ల తెలంగాణాలో పోటీ కాంగ్రెసుకు ప్రాబల్యం లభించింది.

తెలంగాణాలో ప్రజలకి కాంగ్రెసు మీద అభిమానం తగ్గిన సమయంలో ఈ ఎన్నికలు రావడంతో అసలు పరిస్థితి బయటపడింది. 'నామ్ కే వాస్తే'గా నిలబడ్డ తెలుగు మంత్రులు తమ తమ నియోజకవర్గాలలో విజయాల గురించి ప్రయత్నం చేసుకున్నారు. కాంగ్రెసులోగల ప్రతివారు తలా ఒక మంత్రి పీఠాన్ని సంపాదించుకోవాలని, కనీసం శాసనసభలోనైనా ప్రవేశించాలనే వ్యామోహంతో కాంగ్రెసు టికెటు కోసం అభ్యర్థించారు. ఇందరి దాహం ఒకేసారి తీర్చడానికి వీల్లేని పరిస్థితి ఏర్పడింది. చాలామంది అభ్యర్థనలను తోసిపుచ్చారు. టికెటు దొరకని కాంగ్రెసు వాదులు ఆగ్రహావేశపరులై సంస్థను విడిచిపెట్టి స్వతంత్రులుగా నిలబడి కాంగ్రెసును ఎదుర్కొన్నారు. ఈ స్వతంత్రులలో కొందరు మేధావులున్నారు. నిజాయితీపరులున్నారు. అలాంటివారికి కాంగ్రెసు నాయకుల రహస్య మద్దతు లభించింది. వారంతా మాజీ కాంగ్రెసు వారే. కానీ ఎన్నికలలో కాంగ్రెసుకు తీవ్ర వ్యతిరేకంగా ప్రచారం చేశారు.

అసలు కాంగ్రెసు అభ్యర్థులకు నియోజకవర్గాల కేటాయింపులోనే ఎన్నో అవక తవకలు జరిగాయి. తమ తమ నియోజక వర్గాలలో పలుకుబడిగల నాయకులను అరణ్యప్రాంతాలకు వేసి ప్రచార సౌకర్యాలు లేకుండా చేసి వారి ఓటమికి కారకులైన పెద్దలే కమ్యూనిస్టులు భయపెట్టి గెలుస్తున్నారని ప్రచారం చేసారు.

దీనికితోడు కమ్యూనిస్టులు గత ఐదారు సంవత్సరాల నుంచి పోరాటంలోను, పోలీసు చర్య తరువాత సాయుధపోరాటం రోజులలోనూ ప్రజాస్వామ్యానికి చాలా సన్నిహితంగా ముందుకు వచ్చారు. పోలీసు చర్యకు పూర్వం, తరువాత వీరు సామాన్య జనానికి భూమి పంపిణీ కార్యక్రమాన్ని లేవదీసి ఊరిలో ఉన్న భూస్వాముల భూములను పంచి పెట్టారు. వీరి దళాలలో చేరిన సైనికులు చాలామంది సామాన్య ప్రజానీకంలో ఉన్నారు. కాబట్టి కమ్యూనిస్టుల ప్రాబల్యం ఉన్న నల్లగొండ, వరంగల్లు, ఖమ్మం, మెదక్ జిల్లాలలో జనసామాన్యం కమ్యూనిస్టులు నెగ్గితే భూములు వస్తాయని, ఆస్తి చెందుతుందని సులభంగా నమ్మటానికి ఆస్కారం ఏర్పడింది. ఆవిధంగా కమ్యూనిస్టు పార్టీ వారిని నమ్మగొల్పింది. సరిగ్గా అదేసమయంలో ఎన్నికలు వచ్చాయి. ఎన్నికలలో పాల్గొనడానికి జైలు నుండి విడుదలై వచ్చిన కమ్యూనిస్టులు మధ్యతరగతి ప్రజలను గ్రామాలలో భయపెట్టారు. వీటన్నిటిమూలంగా తెలంగాణాలో కాంగ్రెసు బాగా పరాజయాన్ని ఎదుర్కొనవలసి వచ్చింది. కాంగ్రెసులో వున్న ముఠావైషమ్యాలు,

ప్రముఖుల నిష్క్రమణ, కమ్యూనిస్టు సాయుధపోరాటం మొదలైన కారణాలవల్ల అతిరథ, మహారథులైన కాంగ్రెసు నాయకులు ఓడిపోయారు.

ఎన్నికలు జరిగే తుది క్షణంవరకు 'విజయం మాదే' అని ఢంకామీద దెబ్బవేసి ప్రచారం చేసుకున్న కాంగ్రెసుకు చివరి పరిస్థితి ఎదురు తిరిగింది. 'తుపాకుల్తో ప్రజల్ని భయపెట్టి కమ్యూనిస్టులు ఓట్లు వేయించుకున్నారు' అని విమర్శించడం వాస్తవానికి చాలా దూరం. నిష్కల్మష ప్రజాసేవకులైన సర్దార్ జమలాపురం కేశవరావు, ఆంధ్ర పితామహ మాడపాటి హనుమంతరావు, అభ్యుదయ నాయకులైన కాళోజీ నారాయణరావు, కోదాటి నారాయణరావు, భండారు చంద్రమౌళీశ్వరరావు, బొమ్మకంటి సత్యనారాయణరావుల ఓటమి కమ్యూనిస్టుల వల్ల జరిగింది కాదు. కమ్యూనిస్టులు బెదిరించి ఓట్లు తెచ్చుకున్నారనే అనుకుంటే కాంగ్రెసుకు వ్యతిరేకంగా నిలబడ్డ ఇండిపెండెంటు అభ్యర్థులకు కూడా వేలకొద్ది ఓట్లు పడ్డాయి. ఓడిపోయిన వారంతా దాదాపు కొన్నివేల ఓట్లు సంపాదించుకుని మెజారిటీ లేకపోయారే కానీ ఖాళీ డబ్బాలతో బయటపడలేదు. అలాంటప్పుడు ఈ ప్రచారం అర్థరహితం, అక్రమం. నమ్మడానికి పనికిరాని వాదన. ప్రభుత్వ నిషేధానికి గురై ప్రజానీకంలో పలుకుబడి పోగొట్టుకున్న కమ్యూనిస్టులు 'పీపుల్స్ డెమోక్రటిక్ ఫ్రంట్' పేర తెలంగాణాలో సాధించిన విజయాలు విస్మయం కలిగించాయి. రాష్ట్రంలో మరట్వాడా, కర్నాటక ప్రాంతాల మూలంగా కాంగ్రెసు అధికారంలోకి వచ్చింది.

ఎన్నికల ఫలితాలు: మొత్తం స్థానాలు 175. కాంగ్రెసు-93, పి.డి.ఎఫ్-42, సోషలిస్టు-12, ఇండిపెండెంట్లు-ఇతరులు-29.

తెలంగాణా ఫలితాలు: కాంగ్రెస్-46, పి.డి.ఎఫ్-35, సోషలిస్టు-12, షెడ్యూల్డు కాస్ట్స్ ఫెడరేషన్-5, ఇండిపెండెంట్లు-3, మొత్తం సీట్లు 101.

రాష్ట్రంలోని పి.డి.ఎఫ్. ప్రతిపక్షంలో కూడా ఐక్యత స్వభావం పెద్దగా కనిపించలేదు. డా॥ జయసూర్య, ధగేలాంటి మేధావులకు పార్టీ నాయకులైన బద్దం ఎల్లారెడ్డి, ఆరుట్ల లక్ష్మీనరసింహారెడ్డి, సర్వదేవరభట్ల రామనాథం మొదలైన వారి మధ్య సమన్వయం కుదురలేదు. ప్రధాని నెహ్రూ ప్రత్యేక దూత ద్వారకనాథ కచ్రూ హైదరాబాద్ వచ్చినప్పుడు నెహ్రూ, పటేల్ మధ్యగల వైరాన్ని పార్టీ తన ప్రయోజనాలకు వినియోగించుకోలేక పోయింది. ఈ చర్యలకు సహాయ పడటానికి ముందుకొచ్చిన

జయసూర్య కృషిఫలించలేదు. పి.డి.ఎఫ్. సభ్యుల మధ్య దినదినానికి విభేదాలెక్కువై అది నామమాత్రపు వేదికగా మిగిలింది. వీరి పిడివాదానికి విసుగు చెందిన డా॥ జయసూర్య పార్టీ సభ్యత్వానికి రాజీనామా చేశారు.

తెలంగాణాలో ఎస్.బి.గిరి, మహాదేవ్ సింగ్‌లాంటి కార్మిక నాయకులు సోషలిస్టు పార్టీ స్థాపనకు కొంత ప్రయత్నించారు. వీరి కార్యరంగం కరీంనగరు, ఆదిలాబాద్ జిల్లాలకే పరిమితమైంది. సాధారణంగా గ్రామీణ ప్రాంతాల రాజకీయాలు ఎన్నికల్లో గెలిచిన శాసన సభ్యుల అధీనమై ఉంటాయి. అందువలన ఇతర ప్రాంతాలలో ఈ పార్టీ ఎదగలేకపోయింది. ఎన్నికల్లో పోటీ చేయడానికి సోషలిస్టుపార్టీకి ఎప్పుడూ డబ్బు సమస్య ఎదురౌతూ వచ్చింది. ఆ తాకిడికి తట్టుకోలేక ఈ పార్టీ శాసన సభలో తన సంఖ్యను పెంచుకొనలేకపోయింది.

హైదరాబాద్ రాష్ట్ర రాజకీయాలలో స్వామీజీ కన్న మిన్న అనిపించుకున్న వ్యక్తి జనార్ధనరావు దేశాయి. రాయచూరు జిల్లా సింధనూరు నుంచి పోటీ చేసి ఆయన ఓడిపోయారు. ఆ ఓటమితో రాష్ట్రరాజకీయాలలో కనుమరుగైపోయారు. మొదటి సాధారణ ఎన్నికలు జరిగిన నాటి తెలంగాణా పరిస్థితులు వేరు, నిరంకుశులైన రజాకార్లు పతనమై, కమ్యూనిస్టులు అరాజకచర్యలు కొనసాగిస్తున్న సంధికాలంలో ప్రప్రథమంగా ప్రజలు ఎన్నికల్లో పాల్గొన్నారు.

ఈ ఎన్నిల్లో ఎంత గొప్ప కాంగ్రెస్ నాయకుడైనా సామాన్య కమ్యూనిస్టు కార్యకర్తముందు ఓడిపోయాడు. రావి నారాయణరెడ్డి నల్లగొండ జిల్లా నుంచి పార్లీమెంటుకు పోటీ చేసి భారతదేశంలో అందరికన్నా అధికసీట్లు సంపాదించుకో గలిగారు. ఆయన భువనగిరి శాసనసభ నియోజక వర్గం నుండి కూడా పోటీ చేసి గెలిచారు. కాని ఆ ప్రభావం చాలా కాలం నిలువలేదు. రావి నారాయణరెడ్డి లోకసభ సభ్యత్వాన్ని వుంచుకొని భువనగిరి శాసన సభ్యత్వానికి రాజీనామా చేశారు. ఆ స్థానంలో ఉప ఎన్నికలు జరిగాయి. తన సహపాఠి మిత్రుడు కాంగ్రెసు అధిష్ఠాన వర్గం నుంచి అసమ్మతితో వెడలిపోయి పి.డి.ఎఫ్. పార్టీలో చేరిన గోవింద్‌దాస్ షరాఫ్‌ను భువనగిరి నియోజకవర్గం నుంచి పోటీ చేయించి గెలిపించలేకపోయారు. కాంగ్రెస్ కార్యకర్త గెలిచాడు. ఆ ఎన్నిలో షరాఫ్‌గారి రాజకీయ జీవితం దశతిరిగి పోయింది. ❑

36. బూర్గుల మంత్రివర్గం

ఎన్నికల అనంతరం ముఖ్యమంత్రి ఎవరనే సమస్య ఎదురైంది. స్వామీజీ అభ్యర్థి దిగంబర్రావ్ బిందూ. రంగారెడ్డి అభ్యర్థి బూర్గుల రామకృష్ణరావు. వెల్లోడీ మంత్రివర్గంలో బూర్గుల దాదాపు రెండవ స్థానంలో ఉండేవారు. కనుక ఎన్నికల తరువాత ఆయనే ముఖ్యమంత్రి అవుతారని చాలామందికి విశ్వాసం ఉండేది. ఢిల్లీలో కొంత తర్జన భర్జన జరిగింది. రామకృష్ణరావునే ముఖ్యమంత్రిగా అంతా అంగీకరించారు. ఈ విషయంపై హైదరాబాద్‌లో జరిగిన ప్రదేశ్ కాంగ్రెసు లెజిస్లేచర్ పార్టీ సమావేశంలో ప్రత్యేక ఆహ్వానితునిగా వచ్చిన స్వామీజీ ఈ విధంగా ప్రకటించారు:

'నాయకుని ఎన్నిక విషయంలో పండిట్ నెహ్రూతో సంప్రదించడానికి నేను ఢిల్లీ వెళ్ళాను. దిగంబర్రావు బిందూ పేరును నేను సూచించాను. రామకృష్ణరావు తప్ప మరొకరు నాయకుడు కాదగిన వారు లేరని ఆయన నాతో చెప్పారు (అప్పుడు బిందూ పి.సి.సి. అధ్యక్షుడు). ప్రతిపక్షానికి అధికారం చేపట్టడానికి 8 స్థానాలు మాత్రమే తక్కువ ఉన్నాయి. అలాంటి సంక్లిష్ట సయమంలో బూర్గుల ఏకగ్రీవంగా ఎన్నిక కావడం చిన్న విషయం కాదు. కాంగ్రెసు ఎప్పటికప్పుడు జాగ్రత్తగా ఉండటానికి మొదట చేయవలసిన పని కనీసం తన పార్టీవారు 88 మంది అసెంబ్లీలో హాజరై ఉండాలనే కట్టుబాటు, బూర్గుల రామకృష్ణరావు ముఖ్యమంత్రి అయ్యారు.

మంత్రివర్గం నిర్మాణంలోనే ఎన్నో సమస్యలెదురైనాయి. బిందూకు సాధారణ పరిపాలనశాఖ, పూల్చంద్ గాంధీకి రెవిన్యూ శాఖ ఇవ్వాలని పట్టుబట్టాడు స్వామీజీ. తనకు పూర్తి రెవిన్యూశాఖ తప్ప ఏ ఇతర శాఖ అంగీకారం కాదని కుండబద్దలు కొట్టినట్టు చెప్పాడు రంగారెడ్డి. రంగారెడ్డికి కొంత రెవిన్యూశాఖ (ఎక్సైజ్ శాఖతోసహా), బిందూకు హోంశాఖ ఇచ్చి అప్పటికి సర్దుకుపోయాడు ముఖ్యమంత్రి.

ఈలోగా ప్రదేశ్ కాంగ్రెసు కమిటీకి జరిగిన ఎన్నికలలో స్వామీజీతో పోటీ చేసి ఓడిపోయాడు దేశాయ్. పూర్తి రెవిన్యూ శాఖ కావాలని రంగారెడ్డి పోరు ఎక్కువైంది.

తనకు రెవిన్యూశాఖ ఇవ్వనందుకు ఫూల్‌చంద్ గాంధీ మరి బరితెగించి పోయాడు. హైదరాబాద్‌లో రామకృష్ణరావు ముఖ్యమంత్రిగా ఉన్న కారణంగా ఆంధ్రులకు కొంత ఆత్మవికాసం చేకూరిందని ఆంధ్ర ప్రజానీకం స్తుతించింది. అయితే మహారాష్ట్ర ప్రజానీకం ఎక్కువ లాభం పొందగలిగింది. ఆంధ్రుల మొహమాటానికి ఇదొక నిదర్శనం.

రామకృష్ణరావు ముఖ్యమంత్రి అయిన తరువాత ఇంతవరకు ఒక ముఠాగా ఉన్న చెన్నారెడ్డి, ఆయన వర్గం రామకృష్ణరావుకి వ్యతిరేకులైనారు. చెన్నారెడ్డి ఒత్తిడి మూలంగా రంగారెడ్డి కూడా బూర్గుల వ్యతిరేకిగా మారారు. ఈ విధంగా కాంగ్రెస్ శాసనసభా పక్షంలోనూ, బయటనూ రావు-రెడ్డి ముఠాలు ఏర్పడ్డాయి. లోలోపల ఇవి వ్యక్తిగత లాభాపేక్షతో ఏర్పడిన ముఠాలైనప్పటికీ వీటికి బ్రాహ్మణ, బ్రాహ్మణేతర కక్షల రంగు పులుమజొచ్చారు. ఒకవంక రావూ, రెడ్డీ వర్గాల మధ్య కుమ్ములాట జరుగుతుండగా, స్వామీజీ వర్గంలో ఉన్నామని చెప్పుకునే పూల్చంద్ గాంధీ, వి.బి.రాజు, జగన్నాథరావు చంద్రకీ, దేవీసింగ్ చౌహాన్‌లు రామకృష్ణరావు ముఖ్యమంత్రిత్వాన్ని సవాల్ చేయడం మొదలు పెట్టారు. వీరు స్వామీజీ వర్గంలోని కొందరు శాసన సభ్యులను కూడగట్టుకున్నారు. ఈ పోరాటంలో గల విచిత్రం ఏమిటంటే ప్రత్యర్థులైన రంగారెడ్డి, చెన్నారెడ్డి, ఫూల్‌చంద్ గాంధీ, వి.బి.రాజు మొదలైన అందరూ మంత్రివర్గ సభ్యులే. తన మంత్రివర్గ విశ్వాసాన్ని చూరగొనవలసిన పరిస్థితిలో ముఖ్యమంత్రిగా రామకృష్ణరావు మనుగడ దినదినగండం నూరేళ్ళ ఆయుష్షుగా కొనసాగింది.

కాంగ్రెసు పార్టీ క్రమశిక్షణగా పనిచేయాలంటే ఎలాంటి చర్యలు తీసుకోవడం అవసరమో సూచించవలసిందని మందుముల నరసింగరావు, గోపాలరావు ఎక్బోటే, రావు సాహెబ్ దేశ్ పాండేలతో ఒక ఉపసంఘం నియమించబడింది. ఆ ఉపసంఘం ముఖ్యమంత్రి మీద విశ్వాసం లేని మంత్రులను రాజీనామా చేయమన్నది. మంత్రివర్గ సభ్యుల సంఖ్యను పెంచాలని కూడా సూచించింది. దీన్ని తమ మీద క్రమశిక్షణపేర ముఖ్యమంత్రి వేలాడదీస్తున్న బరకత్తిగా అసంతృప్తి వాదులు భావించారు. దీనికి నిరసనగా మంత్రులు ఫూల్‌చంద్ గాంధీ, వి.బి.రాజు, జగన్నాథరావు చంద్రకీ, దేవిసింగ్ చౌహానులు రాజీనామాలు సమర్పించారు.

రామకృష్ణరావు ఏదో ఒక విధంగా అన్ని మతాలను సమన్వయ పరచుకుంటూ వచ్చారు. అసెంబ్లీలో ప్రతిపక్షాల వారి వాదనలను ఎదుర్కోవటంలో మంచి ప్రజ్ఞ చూపారు. పరిపాలనా వ్యవహారంలో ఆయనను వ్యతిరేకించిన శక్తులు సైతం అసెంబ్లీలో ముఖ్యమంత్రి వైఖరిని శంకించలేదు. ఆనాటి హైదరాబాద్ రాష్ట్ర అసెంబ్లీలో సభ్యుల సంఖ్య 175 మంది. అందులో కాంగ్రెస్ వారి సంఖ్య 93, కమ్యూనిస్టుల ప్రాబల్యంలోని పి.డి.ఎఫ్‌ల సంఖ్య 42. ఇతరులు 40 మంది. శాసనసభ ప్రారంభోత్స వానికి నిజాం నవాబు రాజ్ ప్రముఖ్ హోదాలో రాగానే కాంగ్రెసు వారు తప్ప 77 మంది శాసన సభ్యులు నిజాం ఇష్టంలేక వెళ్ళిపోయారు. అసెంబ్లీ ఆరంభమే అలా జరిగింది. మంత్రులు రాజీనామా చేయగానే ముఖ్యమంత్రికి పార్టీలో తిరిగి విశ్వాసం పొందవలసిన అవసరం కలిగింది. 1953 జనవరిలో కాంగ్రెసు లెజిస్లేచర్ పార్టీ బూర్గులపై పూర్తి విశ్వాసం ప్రకటిస్తూ తీర్మానించింది. ఎప్పటి రీతిగానే పరిపాలన వ్యవహారాలు నిర్వహించవలసిందిగా ఆయనను కోరుతూ, ఉపసంఘ సూచనల ప్రకారం మంత్రివర్గ పునర్వ్యవస్థీకరణకు, సంఘటిత పరచుటకు ముఖ్యమంత్రి తీసుకునే అన్ని చర్యలకు తమ ఆమోదం తెలిపింది.

హైదరాబాద్ రాష్ట్రంలో తెలంగాణాలోనే దేశముఖులు, జాగీర్దారులు ఎక్కువ. అందువల్లనే తెలంగాణాలోనే రైతు పోరాటం అంత తీవ్రరూపం దాల్చింది. ముందు ఇక్కడ కావలసింది భూసంస్కరణలు. కాంగ్రెసు లెజిస్లేచర్ పార్టీలో భూసంస్కరణల విషయమై తీవ్రమైన అభిప్రాయ భేదాలుండేవి. పార్టీలో అత్యధిక సంఖ్యాకులు మహారాష్ట్రులు, కన్నడిగులు. వాళ్ళ ప్రదేశాలలో తీవ్రమైన భూ సంస్కరణలు జరపడం వాళ్ళకు ఇష్టం లేదు. కానీ జరిగి తీరాలని అధిష్టానవర్గం ఆశయం. ముఖ్యమంత్రి ఎన్నికల్లో మొదట ఓటమి ఎదుర్కొన్న స్వామీజీకి ఇది రెండవ ఓటమి అయింది. అసలు రామకృష్ణరావు ముఖ్యమంత్రి కావడంతోనే స్వామీజీ బలం తగ్గింది. ఇప్పుడు స్వామీజీ శిష్యులలో వి.బి.రాజు, ఫూల్‌చంద్ గాంధీ, జగన్నాథరావు చంద్రకీ, అన్నారావు, శంకర్‌దేవ్‌లు బయటికి పోయారు. కానీ ముఖ్యమంత్రి కోరిక మీద ఒక్క శంకర్ దేవ్ రాజీనామాను ఉపసంహరించుకున్నారు. మంత్రివర్గ పునర్నిర్మాణంలో గోపాలరావు ఎక్బోటేను క్యాబినెటు మంత్రిగా తీసుకుని మరో ఏడుగురిని ఉపమంత్రులుగా నియమించారు ముఖ్యమంత్రి.

మంత్రివర్గం:

క్యాబినెటు మంత్రులు: బూర్గుల రామకృష్ణరావు (ముఖ్యమంత్రి), దిగంబర్రావు బిందూ, కొండా వెంకటరంగారెడ్డి, డా॥ జి.ఎస్. మెల్కోటే, డా॥ ఎం. చెన్నారెడ్డి, వినాయకరావు విద్యాలంకార్, నవాబు మెహదీ నవాజ్‌జంగ్, గోపాలరావు ఎక్బోటే.

ఉప మంత్రులు: శ్రీనివాసరావు అఖిలేకర్, పల్లెర్ల హనుమంతరావు, ఎం.ఎస్. రాజలింగం, అరిగె రామస్వామి, విరూపాక్షప్ప, భగవంతరావు గాధే, శ్రీమతి సంగెం లక్ష్మీబాయి.

ఎన్నో సమస్యలకు ఆలవాలమైఉన్న ఆనాటి హైదరాబాద్ రాష్ట్రానికి ముఖ్యమంత్రి కావడం మాటలు కాదు. ఆంధ్రులు, మహారాష్ట్రులు, కర్నాటకులు మరియు మహమ్మదీయ వర్గం వారినీ, పూర్వపు జాగీర్దారీ తెగవారని, నేటి అనుమాములను కూడగట్టుకు రావడం మాటలా? బూర్గుల మంత్రివర్గంలో కన్నడిగులు, మహారాష్ట్రులు చీటికి మాటికి లేచి తమకు అన్యాయం జరుగుతున్నదంటూ సౌకర్యాలు పొందుతుండేవారు. అది మంత్రివర్గంలోని ఆంధ్రసభ్యులకు చీకాకుగా ఉండేది.

1954లో ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీకి జరిగిన ఎన్నికల్లో స్వామీజీ పాల్గొనలేదు. స్వామీజీ రాజకీయాలనుండి నిష్క్రమించినా శాంతియుత వాతావరణంలో కాంగ్రెసు నావ ఏ ఒడుదుడుకులు లేకుండా గట్టుకు చేరలేదు. రామకృష్ణరావు, రంగారెడ్డి, చెన్నారెడ్డిల మధ్య పరస్పర అపోహలు, స్పర్థలు తగ్గలేదు. స్వామీజీ తరువాత మంత్రిగానే ఉంటూ ఆరుమాసాలవరకు ప్రదేశ్ కాంగ్రెసు అధ్యక్ష పదవి నిర్వహించాడు రంగారెడ్డి. అటు పిమ్మట మల్లప్ప కొల్లూరు అధ్యక్షుడైనాడు. 1955లో తిరిగి ప్రదేశ్ కాంగ్రెసు అధ్యక్ష పదవికి ఎన్నికలు నిర్వహించవలసి వచ్చింది. ఈసారి ముఖ్యమంత్రీ, స్వామీజీ కలిసి తిరిగి మలప్ప కొల్లూరునే నిలబెట్టారు. కానీ చెన్నారెడ్డి నిలబెట్టిన జె.వి. నరసింగరావు గెలిచాడు. దీనితో రామకృష్ణరావుతో రంగారెడ్డి చెన్నారెడ్డిల స్పర్థలు తారాస్థాయికి చేరుకున్నాయి. 1955 మే 2వ తేదీన ముఖ్యమంత్రి డా॥ చెన్నారెడ్డి నుంచి ప్లానింగ్, అభివృద్ధి శాఖలు లాగేసుకున్నారు.

స్వామీజీ ముఖ్య శిష్యుడిగా ఉండి, రామకృష్ణరావు మంత్రివర్గంలో ఉన్నప్పుడు

రామకృష్ణరావు, రంగారెడ్డి, చెన్నారెడ్డిలను తీవ్రంగా ఢీ కొన్న వి.బి.రాజుకు ఈ పరస్పర కలహాలు మంచి అవకాశమిచ్చాయి. ఈ అవకాశాన్ని ఆయన యుక్తిగా ఉపయోగించుకున్నాడు. ముఖ్యమంత్రికి అండగా నిలిచి, రంగారెడ్డి, చెన్నారెడ్డిలతో పోట్లాటకు ముందుగా నిల్చున్నాడు. తన పూర్వస్థానం పొందాడు. యుక్తాయుక్తులు, ఎత్తుకు పైఎత్తు, సమయస్ఫూర్తి వర్తన, పార్టీలను అంతర్పార్టీలను నిర్మించుకునే సామర్థ్యం, చతురత కలిగిన రాజనీతిజ్ఞునిగా రాజు ప్రసిద్ధుడైనాడు. ముఖ్యమంత్రి రామకృష్ణరావు విశాలాంధ్రను బలపరుస్తున్నప్పుడు ఆయనకు పూర్తి మద్దతునిచ్చి రంగారెడ్డి, చెన్నారెడ్డిలను చకితుల్ని చేసిన మేధావి ఆయన. ఇక పదేళ్ళు రాజకీయాలలో వి.బి.రాజు కీలకమైన వ్యక్తిగా స్థానం పొందుతూ వచ్చాడు.

రామకృష్ణరావు హయాంలో హైదరాబాద్ రాష్ట్రంలో సంపూర్ణమైన ప్రజాస్వామ్య వ్యవస్థ నెలకొన్నది. భారతదేశంలో అభ్యుదయకరమైన కౌలుదారు శాసనం చేయబడింది. జాగీర్దారీ రద్దు సమస్యతో మొదలైన ఫ్యూడల్ ప్రతికూల సమాజ స్థాపన కౌల్దారీ శాసనంతో చాలాముందుకు పోయింది. నాగార్జునసాగర్ నిర్మాణానికి రామకృష్ణరావు చాలా పట్టుదల వహించి సానుకూలం కావడానికి తోడ్పడ్డారు. రాష్ట్రంలో చదువుకు చాలా ప్రోత్సాహం ఇవ్వడమే కాకుండా దేశభాషలకు చాలా దోహదం కలిగింది. హైదరాబాద్ రాష్ట్రంలోకల్లా హైదరాబాద్ పట్టణంలో రెండు మూడు కళాశాలలు, వరంగల్లు, ఔరంగాబాద్, గుల్బర్గాలలో ఒక్కొక్క కళాశాల అదివరకు ఉండగా రామకృష్ణరావు ప్రోత్సాహం ఉండడం వల్ల అనేక చోట్ల కళాశాలలు ఏర్పాటైనాయి. జిల్లాకు ఒక్కొక్క కళాశాల ఉండేలాగా ఏర్పాటు చేశారు. ఇది తెలంగాణా విద్యాభివృద్ధిలో గొప్ప పురోగతి అని చెప్పవచ్చు. స్థానిక పరిపాలన సంస్థలకు సంపూర్ణ ప్రజాస్వామిక స్వరూపం ఆయన కాలంలోనే ఇవ్వడం జరిగింది. అనేక నూతన శాసనాలు, ఉద్యమాలు తలెత్తాయి.

పెద్ద ఎత్తున చెలరేగిన అల్లర్లను పేర్కొనవలసి వస్తే, ఒకటి – రామకృష్ణరావు ముఖ్యమంత్రి పదవి స్వీకరించిన కొద్దికాలానికే రాష్ట్రంలో తలెత్తిన ముల్కీ ఉద్యమం. ఈ ఉద్యమం ఎలా ప్రారంభమైందో కారణమేమిటో ఈ సందర్భంగా రాయడం అప్రస్తుతం కాకపోవచ్చు. కానీ ఈ ఉద్యమం ప్రధానంగా ఉద్యోగస్థులను ముఖ్యంగా మద్రాసు రాష్ట్రం నుండి వచ్చిన ఉద్యోగులను ఉద్దేశించి ఆరంభమైనదని మాత్రం

చెప్పవచ్చు. అయితే అదునుచూసుకొని అనేక శక్తులు ఉద్యమంలో ప్రవేశించి ఉద్రిక్తతను పెంపొందింపచేసినవి. హైదరాబాదులో శ్రీకృష్ణదేవరాయ ఆంధ్ర భాషానిలయం స్వర్ణోత్సవాలలో పాల్గొంటున్న ముఖ్యమంత్రి రామకృష్ణరావు కారును తగులబెట్టారు. ఆయనకు, ఆయన కుటుంబానికి ప్రాణహాని కలుగజేయాలని ప్రయత్నం జరిగింది. వెంట్రుకవాసిలో ఆ అపాయం తప్పిపోయింది.

ఉద్యమం దౌర్జన్య పంథా అవలంభించగానే కాల్పులు జరిగాయి. ఇద్దరు వ్యక్తులు మరణించారు. చనిపోయిన వారు విద్యార్థులు కారు. ఆజాద్ హైదరాబాద్ నినాదాలు బయల్దేరాయి. మరుసటి రోజున శవాలు ఇవ్వమని ఉస్మానియా ఆస్పత్రి ఎదుట గుంపులుగా జనం గుమికూడారు. చనిపోయిన వ్యక్తుల్లో ఒకరి పేరు షేక్ ముక్త్యార్, రెండవ వ్యక్తి మహమ్మద్ ఖాన్. బస్సుకు నిప్పుపెడుతుండగా వీరిని కాల్చిచంపడం జరిగింది. ఈ విషయం మొట్టమొదట ప్రసారం చేసింది పాకిస్తాన్ రేడియో. ఉద్యమకారులు వెర్రితలలు వేశారు. పత్థర్‌గట్టి పోలీసుస్టేషను తగులబెట్టారు. గుంపులను చెదరగొట్టడానికి ప్రత్యేక సైనిక, పోలీసు దళాలను పిలిపించవలసి వచ్చింది. అదుపు తప్పిన జనంపై కాల్పులు జరిపారు. ఈ ముల్కీ గొడవలు రామకృష్ణరావు గద్దెను ఒక్క ఊపు ఊపి వదలిపెట్టినవి. నెహ్రూ వెంటనే హైదరాబాద్ పర్యటనకు వచ్చారు. బ్రహ్మాండమైన సభలో ప్రసంగిస్తూ 'నేను అలహాబాద్‌లో పుట్టాను, ఇంగ్లాండ్‌లో చదువుకున్నాను, ఇప్పుడు ఢిల్లీలో ఉంటున్నాను ఇక చెప్పండి, నేను ఏ ప్రాంతం ముల్కీని?' ఒక సమ్మోహనాస్త్రం వదిలారు. సద్దుమణిగింది.

మరొకటి ప్రత్యేక తెలంగాణా గురించి జరిగిన అల్లరులు. ఫజల్ అలీ కమీషన్ రానున్న సమయంలో చెలరేగిన తెలంగాణా ఉద్యమానికి చెన్నారెడ్డి, జె.వి. నరసింగరావులు నాయకత్వం వహించారు. ఆంధ్రప్రదేశ్ అవతరణ వరకు బూర్గుల ప్రభుత్వమే అధికారంలో ఉంది. హైదరాబాద్ చరిత్రలో అక్కన్న మాదన్నల తరువాత బూర్గుల రామకృష్ణరావుకు ముఖ్యమంత్రి కాగల అవకాశం లభించింది. ప్రధాని నెహ్రూ ఆశించిన ఆర్థిక సంస్కరణలను బూర్గుల రామకృష్ణరావు రాష్ట్రంలో ప్రవేశపెట్టగలిగారు. కత్తినీ, కలాన్నీ సరిసమానంగా ప్రయోగించిన ధీశాలి రామకృష్ణ రావు. ❑

37. భూదానోద్యమం

హింస, శాసనం, దానం- ఈ మూడు పద్ధతుల ద్వారా ఏ సమస్యనైనా పరిష్కరించవచ్చు. భారతదేశంలో అతి క్లిష్టమైన ఈ భూ సమస్య పరిష్కరించడానికి ఈ మూడు పద్ధతులు అమల్లో ఉన్నాయి. కమ్యూనిస్టులు భారతదేశంలో ముఖ్యంగా తెలంగాణాలో కొంతకాలం వరకు హింసాపద్ధతి ననుసరించి విఫలమైనారు. ప్రభుత్వం రెండోపద్ధతిని అనుసరిస్తున్నది. ఈ సంస్కరణ కోసం శాసనాలు తయారు చేసి వాటిని సాధ్యమైనంత త్వరలో ఆచరణలో పెట్టాలనే ప్రయత్నంలో ఉంది. ఆ పద్ధతి ద్వారా ఎంతో ప్రగతి సాధించింది. అయితే ఈ మార్గంవల్లనే సమస్య పూర్తిగా పరిష్కారం కాదు. దీనికి అనుబంధంగా కలవారు సంఘానికి తాము చేయవలసిన విద్యుక్త ధర్మాన్ని అవగతం చేసుకొని స్వచ్ఛందంగా ప్రేమతో భూదానం చేయడం అవసరం. ఆ చర్యను వినోబాభావే మనకందజేశారు.

భూదానం ద్వారా భూ సమస్య పరిష్కరించవచ్చునని వినోబాకు అకస్మాత్తుగ ఒక ఆలోచన తట్టింది. 1951 మార్చి నెలలో హైదరాబాద్ నగరానికి సమీపంలోని శివరాంపల్లిలో జరుగనున్న సర్వోదయ సమావేశానికి రావలసిందని ఆయనకు ఆహ్వానమందింది. ఆయన వార్ధానుండి హైదరాబాద్‌కు 300 మైళ్ళ కాలినడకతో వచ్చారు. తెలంగాణా ప్రాంతంలో కమ్యూనిస్టులు హింసకు పూనుకొని దురంతాలు చేస్తున్నారనీ, గ్రామీణ ప్రజానీకమంతా భయాందోళనలకు గురైందని ఆయన విన్నారు. ఈ ప్రాంతంలో ప్రేమసందేశాలను వ్యాపింపజేయాలనుకున్నారు. ఈ పర్యటన సందర్భంలోనే తెలంగాణాలో చరిత్ర కెక్కిన భూదానోద్యమం జనించింది.

ఆ రోజు శ్రీరామనవమి. వినోబాభావే తమ సందేశంలో కల్లోలిత తెలంగాణా ప్రాంతంలో పర్యటించాలనుకున్నట్లు ప్రకటించారు. 16వ తేదీన ఆయన ప్రయాణం ప్రారంభమైనది. ఉదయం 5 గంటలకు వినోబా పరివారం హైదరాబాద్ పట్టణం నుంచి బయల్దేరి 10 మైళ్ళ దూరం పయనించి హాయత్‌నగర్ చేరుకుంది. ఆనాడు

వారి వెంట డా॥ జి.ఎస్.మెల్కోటే, డా॥ మర్రి చెన్నారెడ్డి వంటి ఎందరో ప్రముఖు లున్నారు. 1951 ఏప్రిల్ 18నాడు యథాప్రకారం వినోబాభావే పరివారం బాటసింగారం నుంచి బయల్దేరింది. రోడ్డు వదిలి గుట్టల ప్రదేశాలలో పయనించాలి. ఏ క్షణంలోనైనా వారిపై తుపాకుల ప్రయోగం జరుగవచ్చు. కానీ, వినోబాభావే ఎలాంటి ప్రమాదమైనా ఎదుర్కొనటానికి సంసిద్ధులయ్యే బయల్దేరారు. వారు క్షేమంగానే పోచంపల్లి చేరుకున్నారు.

వినోబాభావే తన అనుచరులతో పాటు రోజూ ఉదయం పది, పన్నెండు మైళ్ళు నడిచి ఏదో ఒక గ్రామంలో మజిలీ చేసి అక్కడ బహిరంగ సభలో శాంతి సందేశాన్ని ఇచ్చేవారు. గుడిసెలను దర్శించి హరిజనులను పరామర్శించి వారి యోగక్షేమాలు విచారించేవారు. ఆయన నల్లగొండ జిల్లా పోచంపల్లి గ్రామానికి వచ్చిన తరువాత ఏప్రిల్ 18వ తేదీన ఇద్దరు హరిజనులు ఆయనను దర్శించి, పోచంపల్లిలో తాము ఎనభై కుటుంబాలవారము ఉన్నామనీ, తమకు సెంటు భూమి కూడా లేదని, కొంతభూమి తమకు ఇప్పించమని ఆయనను కోరారు. స్థానిక దేశముఖు అయిన వి. రామచంద్రారెడ్డి ఇది విని తమ భూమిలో నుంచి వంద ఎకరాలు ఇస్తానని అన్నారు. వినోబాజీ ఆ హరిజనుల నుద్దేశించి మాట్లాడుతూ వారు సహకార పద్ధతిపైన ఆ భూమిని సేద్యం చేసుకుంటామని అంగీకరించినట్లయితే ఆ భూమి వారికి ఇవ్వడం జరుగుతుందని చెప్పారు.

సాయంత్రం ఆరుగంటలకు యథాప్రకారం సభ జరిగింది. ప్రార్థన అనంతరం వారి సందేశంలో వినోబాభావే హరిజనులు 100 ఎకరాలు అడిగారని రామచంద్రారెడ్డి అందుకు అంగీకరించారని, ఒకవేళ దొర తన వాగ్దానాన్ని నిలుపుకుంటే భారతదేశంలో ఒక మహత్తర కార్యం జరుగబోతుందని ప్రకటించారు. ఆనాటి నుంచి భూదాన యజ్ఞం ప్రారంభమైంది.

వినోబాజీ యాత్ర నల్లగొండ, దేవరకొండ, మిర్యాలగూడ తాలూకాల నుంచి సూర్యాపేటకు సాగింది. కమ్యూనిస్టులు ఎక్కడా అడ్డుకోలేదు. వినోబాజీ ప్రతిరోజూ భూదానం కోరేవారు. దాతలు ఇచ్చేవారు. సగటున దినానికి రెండు వందల ఎకరాల భూమి భూదానంలో ప్రకటితమయ్యేది. తెలంగాణాలో వినోబా పర్యటన ఎంతో

ఫలవంతమయిందని దాని గురించి ప్రధాని నెహ్రూ పార్లమెంటులో ప్రకటించారు. 'తెలంగాణాలో శాంతిభద్రతల పరిరక్షణకు 50 వేల సైన్యం చేయని పనిని ఒకే ఒక బక్కచిక్కిన మనిషి వినోబా చేస్తున్నార'ని ప్రకటించారు నెహ్రూ. ఆ ప్రకటనతో ప్రపంచ దృష్టి వినోబా పాదయాత్రమీదపడింది. హింసావాదులకు వినోబా సందేశాలు ఎంతవరకు ఉపయోగపడ్డాయో తెలియదు కానీ, అవి సాధారణ ప్రజలను బాగా ఆకట్టుకున్నాయి.

1955లో హైదరాబాద్ సందర్శించిన వినోబాభావేను పాలమూరు జిల్లా సందర్శించవలసిందిగా పల్లెర్ల హనుమంతరావు కోరగా 50 వేల ఎకరాలు భూదానోద్యమానికి ఇస్తేనే, పాలమూరులో అడుగుపెడతానని వినోబా అన్నారు. అందరినీ నిర్ఘాంతపరిచేలా పల్లెర్ల సవాలును స్వీకరించారు. జిల్లా అంతటా తాను పర్యటించి కల్వకుర్తి, కొల్లాపూర్, నాగర్ కర్నూలు తాలూకాలో భూస్వాములనుండి భూదానోద్యమానికి భూమి సేకరించారు. వినోబాభావే కొల్లాపూర్ తాలూకాలోని మాధవరావు పల్లెలో విడిది చేయడం, అప్పుడే వనపర్తి పాలిటెక్నిక్ కళాశాల ప్రారంభోత్సవానికి నాటి ప్రధానమంత్రి జవహర్‌లాల్ నెహ్రూ రావడం అలనాటి జ్ఞాపకాలుగా చెప్పుకోవచ్చు.

'ఒక స్వతంత్ర ప్రజాస్వామ్య దేశంలో సమస్యలు సామరస్యంగా పరిష్కారం కావాలి. హింసకు తావుండదని, అటువంటి అహింసాయుత పోరాటం ప్రజాస్వామ్యంలో ప్రజలపైనే సాగుతుం'దని చెప్పారు వినోబా. తెలంగాణాలో ఈ పర్యటన సందర్భంలో స్వీకరించిన భూములకు ప్రభుత్వం చట్టబద్ధత కల్పించింది. అప్పుడు బూర్గుల రామకృష్ణారావు, వెల్లోడీ మంత్రివర్గంలో రెవిన్యూ మంత్రిగా ఉన్నారు. ఆయన వెంటనే ప్రవేశపెట్టిన భూదాన స్పెషల్ రూల్స్ దానముగా లభించిన భూములను క్రమబద్ధం చేయడానికి ఎంతగానో ఉపయోగపడినవి. ❑

38. భాషా రాష్ట్రాల ఆందోళన

భాషా రాష్ట్రాల ఆందోళన పూర్వాపరాలను ఇ.వి.ఎస్. నంబూద్రిపాద్ తన 'భారత స్వాతంత్ర్య పోరాట చరిత్ర'లో వివరంగా తెలిపారు.

రాష్ట్ర విభజనకు వ్యతిరేకంగా బెంగాల్ ప్రజలు సాగించిన పోరాటం ప్రతిధ్వనులు ఇతర రాష్ట్రాలలో కూడా వినిపించాయి. బెంగాల్ విభజన రద్దు పరిపాలనా సౌలభ్యం కోసం అంతకుపూర్వం ఏర్పాటు చేసిన బహుభాషా రాష్ట్రాల స్థానంలో ఒకే భాష మాట్లాడే ప్రజలు నివసించే ప్రాంతాలతో కూడిన రాష్ట్రాల నిర్మాణానికి దారితీసింది. అది, ఇతర భాషలు మాట్లాడే ప్రజానీకంలో కూడా ఒక విధమైన సంఘీభావ దృష్టి ఏర్పడటానికి దోహదపడింది. ఆ తరువాత అదే భాష ప్రాతిపదికపై రాష్ట్రాల పునర్వ్యవస్థీకరణ జరుగాలనే సాధారణ కోర్కెగా పెంపొందింది.

బెంగాల్ విభజనకు వ్యతిరేకంగా సాగిన పోరాటం విజయవంతం కావడంతో అంతవరకూ బెంగాల్‌లో భాగంగా ఉంటూవచ్చిన ఒరియా మాట్లాడే ప్రజలతో ఒరిస్సా రాష్ట్రం, హిందీ మాట్లాడే ప్రజలతో బీహార్ రాష్ట్రం ఏర్పడ్డాయి. మొత్తంగా బెంగాలీ భాష మాట్లాడేవారు మాత్రమే ఉండే కొత్త రాష్ట్రం ఏర్పడింది. భారతదేశంలో బ్రిటిష్ పాలన స్థాపన తరువాత ఏర్పడిన మొట్టమొదటి ఏక భాషా రాష్ట్రం బెంగాలే. అదే విధంగా ఆంధ్రప్రజలు తెలుగు మాట్లాడే ప్రజలకు ఒక రాష్ట్రం కావాలన్న వాంఛను వ్యక్తం చేశారు. 1913లో ఏర్పాటు చేసుకున్న ఆంధ్ర మహాసభ భాషా ప్రయుక్త రాష్ట్రాలు కావాలని కోరుతూ సాగించిన ఆందోళనలు ముందు పేజీన నిలిచింది. భాషా ప్రయుక్త రాష్ట్రాలు ముందుకు రావటం, భారతదేశంలో జాతీయోద్యమంలో ఒక ప్రధానమైన సంఘటన. జాతీయ ఉద్యమం పెంపొందడం ఆ ఉద్యమంలో అంతర్భాగంగా వివిధ జాతీయ భాషలు పెంపొందటం ఆ వాదనకు సమాధానంగా వచ్చాయి. కులాలకు, మతాలకు, భాషలకు అతీతంగా ఆధునికీకరణ, భారత

జాతీయతతో కూడిన చైతన్యాన్ని రూపొందించి, భారత ప్రజలను సమైక్యపరిచింది. అయితే భాషారాష్ట్రాలు కావాలన్న కోరిక ఆ సమయంలో తీవ్రమైన ఒక పరిమితి కారణంగా దెబ్బతిన్నది. ఆ కోరిక 'బ్రిటిష్ ఇండియాగా' వ్యవహరించబడుతున్న భారతదేశ భాగాల విషయంలోనే లేవనెత్తటం జరిగింది. ఆనాటి జాతీయ నాయకులు తాము కోరుతున్న భాషారాష్ట్రాలలో స్వదేశీ సంస్థానాలను కూడా చేర్చటాన్ని గూర్చి ఊహించనైన ఊహించలేక పోయారు.

తెలుగు మాట్లాటం కోసం ఆంధ్రరాష్ట్రాన్ని ఏర్పాటు చేయాలన్న డిమాండ్‌తోనే భాషా ప్రయుక్త రాష్ట్రాల కోసం ఆందోళన ప్రారంభమయింది. అయితే ఆ రోజుల్లో ఆందోళనకు నాయకత్వం వహించినవారు కోరుకున్నది ఆనాటి ఉమ్మడి మద్రాసు రాష్ట్రం నుంచి తెలుగు మాట్లాడే ప్రాంతాలను విడదీసి ఆంధ్రరాష్ట్రంగా ఏర్పాటు చేయాలని మాత్రమే. తెలుగు భాష మాట్లాడే ప్రజానీకంలో గణనీయ భాగం హైదరాబాద్ సంస్థానంలోని తెలంగాణా ప్రాంతంలో నివాసముంటున్నారు. 'విశాలాంధ్ర' అనే ఆలోచన రావటానికి, మరో మూడు దశాబ్దాల కాలం పట్టింది. నిజాం పాలనలో హైదరాబాద్ సంస్థానంలోగల తెలంగాణా ప్రాంతాన్ని కూడా చేర్చి 'విశాలాంధ్ర' నిర్మాణం జరుపాలన్న కోరిక అప్పటికి ఆవిర్భవించలేదు.

మద్రాసు రాష్ట్రంలోని తెలుగు భాషా ప్రాంతాలే ఒక పెద్ద రాష్ట్రం అంత ఉన్నాయి. అందువల్ల ఆ రాష్ట్రాన్ని ఆంధ్రరాష్ట్రంగాను, మిగిలి ఉన్న రాష్ట్రాన్ని మద్రాసు రాష్ట్రంగాను విభజించాలని అప్పట్లో తలపోశారు. మద్రాసులోని మళయాళ, కన్నడ భాషా ప్రాంతాల పరిస్థితి అలా లేదు. అందుకు భిన్నంగా ఉంది. ఆనాటి మద్రాసు రాష్ట్రంలో మళయాళ భాషాప్రాంతం ఒక్క మలబారు జిల్లా మాత్రమే. కన్నడ భాషా ప్రాంతం రెండు, మూడు జిల్లాలలో ఉంది. అదికూడా ఏకఖండంగా లేదు. అందువల్ల ఆ ప్రాంతం అంతటినీ ఒకటిగా కర్నాటక రాష్ట్రంగా విడదీయడానికి వీలులేదు.

అంతేకాదు, మళయాళ, కన్నడ భాషలు మాట్లాడే ప్రజలు అత్యధికులు, స్వదేశీ సంస్థానాలలో నివసిస్తున్నారు. మళయాళీలు తిరువాన్కూర్, కొచ్చిన్ సంస్థానంలో వుండేవారు. కన్నడ భాష మాట్లాడేవారు మైసూరు సంస్థానంలో, మరో పన్నెండు ఇతర చిన్న చిన్న సంస్థానాలలో ఉండేవారు. అందువల్ల స్వదేశీ సంస్థానాలను

మొత్తంగా రద్దు చేసి వివిధ ప్రాంతాలలో చెల్లా చెదురై వున్న ప్రజలందరినీ భాషా ప్రాతిపదికగా పునర్వ్యవస్థీకరించడం సాధ్యమైనప్పుడే భాషారాష్ట్రాలు కావాలనే కోరిక ఆచరణ సాధ్యమవుతుంది.

ఐక్యమహారాష్ట్ర సంగతి:

బొంబాయి రాష్ట్రంలో ఒక భాగంగా మహారాష్ట్ర ఉండేది. వారితోపాటు గుజరాతి, కన్నడ భాషలు మాట్లాడే ప్రజలు ఉండేవారు. గుజరాతి, కన్నడ భాషలు మాట్లాడే ప్రజలలో అత్యధిక సంఖ్యాకులు స్వదేశీ సంస్థానాలలో ఉండేవారు. మరాఠీ మాట్లాడే ప్రజలలో కొంతభాగం హైదరాబాద్ సంస్థానంలోని మరట్వాడా ప్రాంతంలో వుండేవారు. అందువల్ల మరాఠి, గుజరాతి, కన్నడ భాషలు మాట్లాడే ప్రజలకు ప్రత్యేక రాష్ట్రాలు ఏర్పాటు చేయాలంటే రెండు పెద్ద సంస్థానాలైన హైదరాబాద్, మైసూరు సంస్థానాల్లోను, గుజరాత్‌లో దాదాపు మూడు వందల చిన్న చిన్న సంస్థానాలలోను విముక్తి గావించాలి. వారందరినీ 'బ్రిటిష్ ఇండియా' ప్రజలలో సంలీనం చేయాలి. చివరకు అదే జరిగింది. 1953లో మద్రాసు రాష్ట్రం నుంచి ఆంధ్రరాష్ట్రాన్ని ఏర్పాటు చేశారు. అయినా విశాలాంధ్ర, ఐక్య కేరళ, సంయుక్త కర్నాటక, సంయుక్త మహారాష్ట్రల నిర్మాణం 1956లో, ఆ తరువాత జరిగింది. హైదరాబాద్, తిరువాన్కూర్, మైసూరు, బరోడా మొదలైన పెద్ద సంస్థానాలను రద్దు చేయడానికి వివిధ భాషలు మాట్లాడే ప్రజలను, ఇతర రాష్ట్రాలలోని వారి సోదరులతో ఏకం చేయటానికి అనువైన రాజకీయ వాతావరణం ఏర్పడిన తరువాతనే సాధ్యమైంది.

ఎలాంటి సమస్యలు లేని ఏకరాష్ట్రం బెంగాల్. బెంగాలీ భాష మాట్లాడే ప్రాంతంలో స్వదేశీ సంస్థానం ఒక్కటైనా లేదు. అంతేకాదు, బెంగాల్ విభజన జరిగేవరకు బెంగాలీ భాష మాట్లాడే ప్రజలందరూ ఒకే రాష్ట్రంలో ఉండేవారు. అయితే బీహారీలు, ఒరియాలు కూడా వారితో కలిసి ఉండేవారు. బెంగాల్ విభజనకు వ్యతిరేకంగా సాగిన ఆందోళన విజయం చేపట్టడంతో బిహారీలను, ఒరియాలను వేరు చేయడం జరిగింది. ఇక బెంగాలీలు మాత్రమే ఆ రాష్ట్రంలో మిగిలారు. అప్పటివరకు ఉంటున్న సంయుక్త భాషారాష్ట్రాన్ని ఏర్పాటు చేసిన విధంగానే మద్రాసు రాష్ట్రం నుండి తెలుగు భాష మాట్లాడే ప్రజలు నివసించే ప్రాంతాలను ఎందుకు

విడదీయకూడదు? తమకోసం ప్రత్యేక రాష్ట్రాన్ని ఎందుకు ఏర్పాటు చేయకూడదు? అనే ప్రశ్నలు తెలుగువారినుండి వెలువడటానికి ఆ పరిస్థితి దారితీసింది.

మహారాష్ట్ర వివాదం:

మధ్యపరగణాలు (మధ్యప్రదేశ్)లో మరాఠీభాష మాట్లాడే ప్రజలు– తాము హిందీ మాట్లాడే ప్రజల పెత్తందారికింద ఉండజాలమని, తమకు ప్రత్యేక రాష్ట్రం కావాలని 1905 నుండే కోరుతున్నారు. రాజకీయాలలోనే గాక, ఉద్యోగాలలోను అభివృద్ధి పథకాల కేటాయింపులలోను తమ ప్రాంతానికి అన్యాయం జరుగుతున్నదని మధ్య మధ్య ఆందోళనలు లేవదీసేవారు. పత్తి ఉత్పత్తి చేసే సౌభాగ్యవంతమైన తమ ప్రాంతానికి జరుగుతున్న అన్యాయాలను కేంద్రం దృష్టికి తెచ్చేవారు. మధ్యపరగణాలలోని మరాఠీ మాట్లాడే జిల్లాలను విడదీసి, బిరారుతో కలిపి ఒక ప్రత్యేక రాష్ట్రం ఏర్పాటు చేయాలని మాంటెంగ్ చెమ్స్‌ఫర్డ్ నివేదికలో పేర్కొనబడింది. దీని ఆధారంగా 1925లోనే అఖిల భారత కాంగ్రెస్ కమిటీ విదర్భను ప్రత్యేక యూనిట్‌గా తీసుకుని ప్రత్యేక కాంగ్రెస్ కమిటీని ఏర్పరచింది.

మరాఠీ భాష మాట్లాడే అన్ని ప్రాంతాలతో మహారాష్ట్ర ఏర్పడాలనే వాంఛ 1940లో పూనాలో జరిగిన ఐక్యమహారాష్ట్ర నాయకుల సమావేశంలో వెల్లడైంది. ఇది జరిగిన ఆరు మాసాలకు అఖిల భారత కాంగ్రెసు కమిటీ ప్రధాన కార్యదర్శి శంకరరావు దేవ్ దీన్నొక ప్రజాఉద్యమంగా నడిపారు. కానీ విదర్భనుంచి దీనికి స్థిర వ్యతిరేకత ఉంది. బహుశా పూనా, నాగ్‌పూర్‌ల మధ్యగల చారిత్రక వైరాలు దీనికి కారణం కావచ్చు. మహారాష్ట్ర, మహావిదర్భ నాయకుల మధ్య 1947 ఆగష్టు ఒకటో తేదీన అకోలాలో ఒక సామరస్య ఒడంబడిక కుదిరి మహావిదర్భకు ఉపరాష్ట్ర ప్రతిపత్తి ఇవ్వాలని అంగీకారం కుదిరింది. భాషారాష్ట్రాల నిర్మాణానికి కేంద్ర ప్రభుత్వం వెంటనే అంగీకరించకపోవడంతో ఈ ఉద్యమం వెనక్కిపోయింది. ఆంధ్రరాష్ట్రం ఏర్పడగానే 1953 సెప్టెంబరు 28న వివిధ ప్రాంతాల మహారాష్ట్ర నాయకులతో నాగ్‌పూర్‌లో మరొక సమావేశం జరిగింది. ఆ సమావేశంలో ప్రత్యేక మహారాష్ట్ర తక్షణం ఏర్పడాలని తీర్మానించడం జరిగింది. ఆ ఒడంబడిక ప్రకారం సంయుక్త మహారాష్ట్రలో మహారాష్ట్ర,

మహా విదర్భ, మరట్వాడ అనే మూడు భాగాలు ఉంటాయి.

ఇది ఇలా ఉండగా రాష్ట్ర పునర్వ్యవస్థీకరణ సంఘం బొంబాయి రాజధానిగా గుజరాతీ, మరాఠీ మాట్లాడే ప్రాంతాలతో ద్విభాషా రాష్ట్రం ఏర్పరచి మహావిదర్భకు మాత్రం ప్రత్యేక రాష్ట్ర ప్రతిపత్తి ఇవ్వాలని సిఫారసు చేసింది. ఈ సంఘం సమర్పించిన సిఫారసును చర్చించిన అఖిలభారత కాంగ్రెసు కమిటీ 1955 నవంబరు 1వ తేదీన మహారాష్ట్ర మూడు రాష్ట్రాలుగా ఏర్పడాలని సూచించింది:-

1. బొంబాయిలోని మరాఠీ మాట్లాడే ప్రాంతాలు, హైదరాబాద్ రాష్ట్రంలోని మరట్వాడా ప్రాంతం, మధ్యప్రదేశ్‌లోని విదర్భ విభాగంతో సంయుక్త మహారాష్ట్ర ఏర్పడుతుంది. బొంబాయినగరం ఈ రాష్ట్ర పరిధిలో ఉండదు.

2. బొంబాయి రాష్ట్రంలోని గుజరాతీ మాట్లాడే జిల్లాలు, సౌరాష్ట్ర, కచ్ విభాగాలతో గుజరాత్ ప్రత్యేక రాష్ట్రంగా ఏర్పడుతుంది. బొంబాయి నగరం గుజరాత్‌కు కూడా లభించింది.

3. బొంబాయి ప్రదేశ్ కాంగ్రెసు పరిధిలో ప్రత్యేక బొంబాయి రాష్ట్రం ఏర్పడుతుంది.

కానీ సంయుక్త మహారాష్ట్ర ప్రజలు తమకు బొంబాయి కావాలని పట్టుబట్టారు. 190 మంది పార్లమెంటు సభ్యులు ప్రధాని నెహ్రూపై ఒత్తిడి తెచ్చారు. చివరకు బొంబాయి రాజధానిగా మహారాష్ట్ర, గుజరాత్‌లతో 1956 నవంబరు 1వ తేదీన బొంబాయి ద్విభాషా రాష్ట్రంగా ఏర్పడింది. కాని ఈ ద్విభాషా రాష్ట్రం మూణ్ణాళ్ళ ముచ్చటే అయింది. 1960లో అది విడిపోయి మహారాష్ట్ర, గుజరాత్‌లు రెండు ప్రత్యేక రాష్ట్రాలుగా ఏర్పడ్డాయి. బొంబాయి నగరాన్ని మహారాష్ట్ర దక్కించుకుంది.

కర్నాటక చరిత్ర:

ఇక కర్నాటక చరిత్రను చూస్తే సువిశాలమైన కర్నాటక రాజ్యం 1564లో తల్లికోట యుద్ధంలోనే ముక్క చెక్కలైంది. ఎంతో కాలానికి కన్నడిగులను హైదర్ అలీ ఒక చోట చేర్చగలిగాడు. నాల్గవ మైసూరు యుద్ధంలో టిప్పుసుల్తాన్ మరణంతో ఐక్య కర్నాటక విచ్ఛిన్నమైంది. కొంతభాగాన్ని మద్రాసు ప్రెసిడెన్సీలోను, మరికొంత బొంబాయి ప్రెసిడెన్సీలలోను కలిపివేశారు. బీదరు, రాయచూరు, గుల్బర్గా జిల్లాలను నిజాంలో చేర్చారు. మిగిలిన ప్రాంతాలతో మైసూరు సంస్థానం ఏర్పరచి ఒడియార్

రాజులకు తిరిగి ఇచ్చివేశారు. 1956లో ఐక్య కర్నాటక రాష్ట్రం ఏర్పడింది. రాష్ట్ర పునర్వ్యవస్థీకరణ సంఘం సిఫారసుపై మద్రాసునుండి కూర్గు, బళ్ళారి, దక్షిణ కెనెరా, బొంబాయి నుండి ఉత్తర కెనరా, బెల్గాం, బీజాపూర్, ధర్వాడ్ జిల్లాలు, హైదరాబాద్ రాష్ట్రం నుంచి బీదరు, గుల్బర్గా, రాయచూర్ జిల్లాలు పూర్వపు మైసూరు రాష్ట్రంలో కలిసిపోయాయి. 1973 నవంబరు 1వ తేదీన మైసూరు రాష్ట్రం పేరును కర్నాటకగా మార్చారు. అంతవరకు రాయచూర్ జిల్లాలో వున్న గద్వాల, ఆలంపూర్ తాలూకాలను మహబూబ్ నగరు జిల్లాలో కలిపారు.

ప్రత్యేక, సమైక్య వాదనలు:

1953 అక్టోబరు 1వ తేదీన ప్రత్యేక ఆంధ్రరాష్ట్రం ఏర్పడగానే వివిధ భాషలు మాట్లాడే ప్రజలున్న అవాస్తవిక రాష్ట్రాలను పునర్నిర్మాణం చేసి, భాషా ప్రయుక్త రాష్ట్రాలను ఏర్పరచాలనే ప్రజా ఆందోళనలు దేశమంతా ఉవ్వెత్తున లేచాయి. భాషా ప్రయుక్త రాష్ట్రాలను ఏర్పరచడానికి ఫజల్ అలీ అధ్యక్షతన ఒక కమీషన్‌ను కేంద్ర ప్రభుత్వం నియమించింది. సర్దార్ ఫణిక్కర్, హృదయనాథ్‌కుంజ్రూలు సభ్యులు.

ఈ కమీషన్ హైదరాబాద్ రాష్ట్రాన్ని విభజించడం అనివార్యం అని చెప్పింది. హైదరాబాద్ రాష్ట్రాన్ని విభజించడమే జరుగకపోతే, దక్షిణాపథంలో రాష్ట్రాల పునర్వ్యవస్థీకరణ కార్యక్రమాన్ని తలపెట్టవలసిన పనేలేదని కూడా ఖండితంగా చెప్పింది. రాష్ట్ర విభజనలో ఏ మాత్రం జాప్యం జరిగినా అక్కడ నివసిస్తున్న పలు భాషా ప్రాంతాల అభివృద్ధికి తీరని విఘాతం కలుగుతుందని కమీషన్ హెచ్చరించడం గమనించవలసిన విషయం. హైదరాబాద్ రాష్ట్రాన్ని యథాతథంగా ఉంచితే ప్రజాభిప్రాయాన్ని తృణీకరించినట్లే అవుతుంది. తెలంగాణా గురించి భిన్నాభిప్రాయాలు వ్యక్తం చేసిన రాజకీయ పార్టీలన్నీ రాష్ట్ర విభజనతో ఏకీభవించాయి. హైదరాబాద్ రాష్ట్రాన్ని యథాతథంగా ఉంచాలని వాదించిన వారి సంఖ్య లెక్కలోనికి తీసుకోవలసిది కాదు.

తెలంగాణాలోని తొమ్మిది జిల్లాలు, చాందా, బస్తర్‌లలోని తెలుగు ప్రాంతాలు, భద్రాచలం తాలూకాలోని కొంత ప్రాంతం కలిపి తెలంగాణా రాష్ట్రం నిర్మించాలని హైదరాబాద్ ప్రదేశ్ కమిటీ ఫజల్ అలీ కమీషన్‌కు ఇచ్చిన నివేదికలో పేర్కొంది.

కమ్యూనిస్టులు నిరంతరం విశాలాంధ్ర వాదులే.

దాదాపు రెండు వందల సంవత్సరాలు నవాబుల పాలనలో ఉంటూ, మహారాష్ట్ర జిల్లాలతో కలిసి వున్నప్పటికీ, తెలంగాణా సిరిసంపదల్లో జీవనగతిలో అచ్చంగా తెలుగు భూభాగంగానే మిగిలింది. తెలుగు సంస్కృతిని తెలంగాణా ఎన్నడూ విస్మరించి ఎరుగదు. సంస్కృతిని, సభ్యతను జీవితంలోని ప్రతి కదలికలో కాపాడుకుంటూ వచ్చింది. కాని బహుశః విద్యా వ్యాప్తి జరుగని కారణంగా ఇక్కడి ప్రజలు బయ టి తెలుగు వాళ్ళకన్న వెనుకబడి ఉన్నారు.

విద్య తరువాత ఇక్కడి యువకుల్లో, విద్యార్థుల్లో దాగిన పెద్దభయం నిరుద్యోగం. అసలు ఈ భయమే కొంతవరకు విశాలాంధ్రకు వ్యతిరేకంగా పనిచేసింది. దీన్ని స్వప్రయోజకులు బాగా వాడుకున్నారు. ఆంధ్రలో చదువుకున్నవారు హెచ్చు. కనుక అన్ని ఉద్యోగాలు తమ చేతుల్లో నుండి పోతాయనే ఆదుర్దా. ప్రస్తుతం ప్రతి శాఖలో బయటి వాళ్ళే కనబడటం ఇవన్నీ కలిసి బలంగా విద్యార్థులను ప్రభావితం చేశాయి.

ఎస్.ఆర్.సి. సూచనలు:

1. ఎస్.ఆర్.సి. చేసిన ముఖ్యమైన సూచనలో ఒకటి– హైదరాబాద్ రాష్ట్రాన్ని విభజించి, బహు భాషాప్రాంతమైన బీదరు (మరట్వాడా) జిల్లాను కూడా చేర్చి హైదరాబాద్ రాజధానిగా ప్రత్యేక తెలంగాణా రాష్ట్రాన్ని ఏర్పరచాలి. దాని పేరు హైదరాబాద్ రాష్ట్రమే.

2. నల్లగొండ జిల్లా మధ్యలో ఉన్న మునగాల పరగణాను కూడా హైదరాబాద్ రాష్ట్రంలో కలిపివేయాలి.

3. 1961 దేశ వ్యాప్తంగా జరిగే ఎన్నికలలో నూతన హైదరాబాద్ రాష్ట్ర శాసన సభకు ఎన్నుకునే సభ్యుల మొత్తంలో మూడింట రెండువంతుల మంది కోరే పక్షంలో తెలంగాణా రాష్ట్రాన్ని ఆంధ్రరాష్ట్రంలో చేర్చి వేసి విశాలాంధ్ర ఏర్పాటు చేసుకోవచ్చు.

4. బళ్ళారి, సిరిగుప్ప, హోస్పేట తాలూకాలను, మల్లపురం సబ్‌తాలూకాను తిరిగి

ఆంధ్రులకు అప్పగించాలి.

45,000 చదరపు మైళ్ల రాష్ట్ర వైశాల్యం కలిగి, 113 లక్షల జనాభాతో, 17 కోట్ల రూపాయల సాలుసరి ఆదాయంతో ఏర్పడే తెలంగాణా రాష్ట్రం స్వయం సమృద్ధిగానే ఉండగలుగుతుందని కమీషన్ వారి అంచనా.

అయితే విశాలాంధ్ర వాదాన్ని కమీషన్ పూర్తిగా కొట్టివేయలేక పోయింది. 'విశాలాంధ్ర చాలా సబబైందే. తెలంగాణాను ఆంధ్రలో కలిపివేయడం వలన చాలా లాభాలు ఉన్నాయి. చిరాకెత్తుతున్న ఆంధ్ర రాజధాని సమస్య పరిష్కారానికి ఆంధ్ర తెలంగాణాల కలయిక ఎంతైనా అవసరం అయితే, వెనుకబడి ఉన్న తెలంగాణా ప్రజల అనుమానాలను, భయాలను బట్టి పరిస్థితులను బట్టీ ఐదేళ్ళవరకు ఈ కలయిక అంత వాంఛనీయం కాదు. 1961లో జరిగే ఎన్నికల అనంతరం కొత్త హైదరాబాద్ రాష్ట్ర శాసన సభ్యులలో మూడింట రెండువంతుల మంది కోరే పక్షంలో ఆంధ్ర-హైదరాబాద్ రాష్ట్రాలు కలిసిపోవచ్చు.

ఈ ఐదేళ్ళను ఆంధ్ర, హైదరాబాద్ ప్రభుత్వాలు తమ తమ పరిపాలనా వ్యవస్థలను సుస్థిరం చేసుకోవచ్చు. భూమిశిస్తు విధానాన్ని, విద్యావిధానాన్ని ఏకస్థాయికి తీసుకుపోవచ్చని, తెలంగాణా ప్రజల భయాలను, అపోహలను పోగొట్టి, ఉభయ రాష్ట్రాలు, హృదయ పూర్వక విలీనానికి అవసరమైన ప్రజాభిప్రాయాన్ని కూడ గట్టుకురావటానికి ఈ అయిదేళ్ళ వ్యవధి బాగా తోడ్పడుతుందని కమీషన్ తన వాదనను సమర్థించుకుంది.

పైగా కృష్ణా, గోదావరి నదీలోయ ప్రాజెక్టులను త్వరితంగా నిర్మించుకుంటేనేగాని తెలంగాణాగాని, ఆంధ్రగాని అభివృద్ధి చెందలేవు. ఏకరాష్ట్ర పరిపాలన వ్యవస్థకిందే సత్వరాభివృద్ధి సాధ్యమవుతుంది. కృష్ణా-గోదావరి పవిత్ర నదీ తీరాలతో ఒకప్పుడు వర్ధిల్లిన ఆంధ్ర సంస్కృతి తిరిగి ప్రాచీన ఔన్నత్యానికి రావాలంటే విశాలాంధ్ర ద్వారా ముక్కోటి ఆంధ్రుల ఏక పరిపాలన పద్ధతి ఏర్పడాలి.

ఆంధ్ర, ఉత్కళ సరిహద్దు విషయాన్ని కూడా కమీషన్ వాస్తవిక దృష్టితో పరిశీలించలేకపోయింది. ఆంధ్ర, ఒరిస్సా సరిహద్దుల విషయం ఎప్పుడో ఇరవై ఏళ్ళకిందనే జరిగిపోయిందనీ, దీన్ని తిరగ దోడవలసిన అవసరం లేదన్నది. ఈ

నిర్ణయంవల్ల బరంపురం, ఛత్రపురం, పర్లాకిమిడి, విజయపురం పట్టణాలతోపాటు 80 గ్రామాలు అంటే 10 లక్షల జనాభాతోపాటు 18వేల చదరపు మైళ్ళ విస్తీర్ణంగల ప్రదేశం ఆంధ్రలో చేరటానికి వీల్లేకపోయింది.

భాషాసూత్రాన్ని ప్రాతిపదికగా పెట్టుకున్నట్లయితే నూటికి 54 వంతుల మంది తెలుగు ప్రజలు కోలారు జిల్లాలో ఉన్నారు. రాకపోకల దృష్ట్యా కోలారు మైసూరులోనే ఉండాలన్నారు. చాందా,బస్తరు ప్రాంతాలను ఆంధ్రలో చేర్చవలసిన అవసరమే లేదు పొమ్మన్నారు.

ప్రత్యేక రాష్ట్రవాదాలు:

హైదరాబాద్ రాష్ట్ర కాంగ్రెసు అధ్యక్షుడు జె.వి.నరసింగరావు, రాష్ట్ర కాంగ్రెసు కార్యదర్శి ఎస్.చెన్నారెడ్డి (డా॥ఎం.చెన్నారెడ్డి కాదు) 1955 నవంబరు 6న రాష్ట్ర కాంగ్రెసు అధ్యక్షుల సమావేశంలో పాల్గొనడానికి ఢిల్లీ వెళ్ళినప్పుడు కాంగ్రెసు అధ్యక్షుడు యు.ఎన్. ఢేబర్‌ని కలుసుకున్నారు. ప్రత్యేక తెలంగాణా నిర్మాణ విషయమై ప్రజాభిప్రాయం తమకు అనుకూలంగా ఉందని వివరించారు. తిరుగు ప్రయాణంలో నవంబరు 11వ తేదీన బొంబాయి నగరంలో ఒక ప్రకటన చేస్తూ జె.వి. నరసింగరావు ఇలా అన్నారు–

'ఆర్థికంగా స్వయంపోషకంగా ఉండగలిగిన హైదరాబాద్ రాష్ట్రం కావాలనే ప్రజలలో అత్యధిక సంఖ్యాకులు కోరుతున్నారు. తెలంగాణా ప్రాంతంలో ఒకటి మినహా ఇతర జిల్లాల కాంగ్రెసు సంఘాలన్నీ ప్రత్యేక హైదరాబాద్‌ను కోరాయి. వ్యతిరేకించిన ఒక్క జిల్లా సంఘం కూడా ఒక్క ఓటు తేడాతోనే (8–9) నిరాకరించింది. అది ఒక్కటే విశాలాంధ్రను కోరింది. హైదరాబాద్ రాష్ట్ర కాంగ్రెస్‌లో తెలంగాణా ప్రాంతం ప్రతినిధుల్లో 70వంతులు ప్రత్యేక తెలంగాణా రాష్ట్రాన్నే కోరుతున్నారు. హైదరాబాద్ నగర కార్పోరేషన్, అనేక సంఘాలు, ముఖ్యంగా వెనుకబడిన తరగతుల సంఘాలు, 'జమియత్–ఉల్–ఉలేమా', జాతీయ విద్యార్థి సంఘం, వర్తక సంఘం, న్యాయవాదుల సంఘాలు, గ్రామ పంచాయతీలు, రైతు సంఘాలు ప్రత్యేక రాష్ట్రాన్ని కోరుతున్నాయి' అని స్పష్టంగా చెప్పారు.

నవంబరు 16వ తేదీన రెండు రాష్ట్రాల వాదులతో హైకమాండ్ సంప్రదింపులు

జరిపింది. తెలంగాణావాదుల తరఫున రెవిన్యూ మంత్రి కొండా వెంకట రంగారెడ్డి, ప్రదేశ్ కాంగ్రెసు అధ్యక్షులు జె.వి.నరసింగరావు పాల్గొన్నారు. తెలంగాణాలో నూటికి 95 మంది ప్రత్యేక రాష్ట్రం కోరుతున్నారని చెప్పారు. అప్పుడు ఆంధ్ర కాంగ్రెసు అధ్యక్షుడు అల్లూరి సత్యనారాయణరాజు తెలంగాణాలో నూటికి నూరుమందికి అభివృద్ధి కృషిలో ఎలాంటి లోపం జరుగదని హామీ ఇచ్చారు. ఆ విషయంలో అగ్రనాయకులు ఏ విధంగా అభివృద్ధి కార్యక్రమాలు రూపొందించమంటే అలా చేయడానికి ఆంధ్రులు ఎవరికి వైముఖ్యం ఉండదని వివరించారు. అప్పుడు హైదరాబాద్ ఆంధ్రులకు ఎలాంటి అన్యాయం జరుగదని ధేబర్ చెప్పారు.

బూర్గుల పాత్ర:

హైదరాబాద్ రాష్ట్ర ముఖ్యమంత్రి బూర్గుల రామకృష్ణారావు ప్రదర్శించిన వైఖరి చాలా స్పష్టంగా ఉంది. సంప్రదింపులకు ఉపక్రమించింది. ఆంధ్రరాష్ట్రం తరఫున ప్రదేశ్ కాంగ్రెస్ అధ్యక్షుడొక్కరే హాజరైనాడు. దీనినిబట్టి ఆంధ్రుల భవిష్యత్తు బూర్గుల చేతుల్లోనే రూపొందగలదని వారిలో అనేకులు నిశ్చయించుకున్నారు.

హైదరాబాద్ కాంగ్రెసు నాయకులు ప్రత్యేక తెలంగాణా వాదాన్ని ఢిల్లీలో తుదివరకు గట్టిగా వాదించారు. హైదరాబాద్ ప్రదేశ్ కాంగ్రెసు అధ్యక్షుడు జె.వి. నరసింగరావు ఒక ప్రకటనలో 'తెలంగాణాను ఆంధ్రలో కలిపే ప్రతిపాదన గురించే అంగీకారం కుదరనప్పుడు తెలంగాణాకు కావలసిన రక్షణలు చర్చించే ప్రశ్నే లేదని, ఒకవేళ తెలంగాణా ప్రాంతాన్ని ఆంధ్రలో కలిపివేయవలసి వస్తే రక్షణలు కోరుకోవడంలో తమకే మాత్రం నమ్మకం లేదని అన్నారు. ఈ విషయం నేను కాంగ్రెసు అధిష్ఠాన వర్గానికి విశదం చేశాను. ప్రస్తుత శాసన సభ్యులు విశాలాంధ్ర సమస్యపై ఎన్నికలలో పోటీచేసి గెలిచిన వారుకారని చెప్పాను. అంతేకాక ప్రత్యేక పరిస్థితులలో కమ్యూనిస్టులు ఆ ఎన్నికలలో శాసనసభకు అధిక సంఖ్యలో ఎన్నికయ్యారు' అని వివరించారు.

'తెలంగాణా ప్రజలు అంగీకరిస్తే తెలంగాణా, ఆంధ్ర ప్రాంతాల కలయిక జరుగుతుందని కాంగ్రెసు కార్యవర్గం చేసిన తీర్మానం అస్పష్టంగా ఉంది. తెలంగాణా ప్రజలు విశాలాంధ్ర కావాలంటున్నారనే పొరపాటు అభిప్రాయం ఒకటి ఢిల్లీవర్గంలో

వ్యాపించిపోయింది. ఆ అభిప్రాయాన్ని తొలగించడంలో మేము కృతకృత్యులమైనాము. తెలంగాణాలో 90 శాతం మంది ఈ ఉభయ ప్రాంతాలను కలిపివేసే సూచనలకు విముఖులు. రాష్ట్రాల పునర్వ్యవస్థీకరణ సంఘం సూచించినట్లు ప్రత్యేక రాష్ట్రమే కావాలంటున్నారు' అని జె.వి. నరసింగరావు వెల్లడించారు.

విశాలాంధ్ర విషయం తేల్చుకోవడానికి 1955 నవంబరు 23న కర్నూలులో ఏర్పాటైన సమావేశానికి రంగారెడ్డి, చెన్నారెడ్డి, జె.వి. నరసింగరావులు వెళ్ళనే లేదు. ఆ విషయాన్ని ఆంధ్రముఖ్యమంత్రి గోపాలరెడ్డికి తంతిద్వారా జె.వి.నరసింగరావు తెలిపారు.

'16వ తేదీన జాబు రాసినందుకు కృతజ్ఞతలు. ఢిల్లీ నుంచి వచ్చిన తరువాత నేటి ఉదయం అది నాకు చేరింది. రంగారెడ్డిగారి ఒంట్లో బాగాలేదు. చెన్నారెడ్డిగారు బొంబాయి నుండి రేపు ఉదయం వస్తారు' తంతిలోని సారాంశం.

'విశాలాంధ్ర నిర్మాణానికి సంబంధించిన ప్రజాభిప్రాయాలు తెలంగాణా ప్రజలకు నచ్చలేదు. పైగా ఈ విధమైన అవాంఛనీయ ప్రచారం ఇంతగా జరుగుతున్న పరిస్థితులలో మేము కర్నూలుకి వచ్చినా ప్రయోజనమేమీ లేదు. మేము హైదరాబాద్ తిరిగి వచ్చినప్పటి నుంచి అనేక ప్రజాహిత సంఘాల నాయకులు, సంఘాల ప్రతినిధులు మమ్మల్ని కలుసుకుంటున్నారు. ఆ పరిస్థితులలో మేము కర్నూలు పోరాదని ప్రజల అభిప్రాయంగా ఉంది'.

'ఈ ఉభయ ప్రాంతాలు సక్రమాభివృద్ధి చెందడానికి రెండు రాష్ట్రాల ఏర్పాటు చాలా అవసరమని తెలంగాణా ప్రజల నమ్మకం. ఆ విషయంలో మీ సహకారం అర్థిస్తున్నాం. ప్రజలలో నూటికి 90 మంది అభీష్టానికి విరుద్ధంగా బలవంతాన విశాలాంధ్రను ఏర్పాటుచేస్తే అభ్యున్నతిని సాధించలేమని మీరంగీకరిస్తారని అనుకుంటున్నాను'.

రంగారెడ్డి వాదన:

తెలంగాణా రాష్ట్రం ఏర్పడి స్వయం పోషకం కాగానే ఎప్పుడో ఆరేళ్లకు విశాలాంధ్రను ఎవరూ కోరరు. ఆంధ్రతో పోలిస్తే తెలంగాణా ఆదాయం 4 కోట్లు

ఎక్కువ. విశాలాంధ్ర ఏర్పడితే మనకు అది దక్కదు. ఈ డబ్బుతో ఎన్నో అభివృద్ధి కార్యక్రమాలు సాధించవచ్చు. కనుక తెలంగాణాను విశాలాంధ్ర వచ్చి ఏదో ఉద్ధరిస్తుందనే భ్రమతో ప్రత్యేక తెలంగాణాను వ్యతిరేకించడం భావ్యం కాదని కొండా వెంకటరంగారెడ్డి 1955 అక్టోబరు 22న కొత్త ఢిల్లీలో స్పష్టంగా చెప్పారు.

తెలంగాణా అనుకూల వాదనలు:

ఎస్.ఆర్.సి. కమీషన్‌లో తెలంగాణా అనుకూల వాదనలు: 375- ప్రత్యేక తెలంగాణా రాష్ట్రానికి అనుకూల వాదనలు కూడా అంత తేలిగ్గా కొట్టిపారవేయడానికి వీలులేని విధంగానే ఉన్నాయి.

376- ప్రస్తుత ఆంధ్రరాష్ట్రం ఏర్పడినప్పటినుంచి చెప్పుకోదగ్గస్థాయిలో ఆర్థిక సమస్యలను ఎదుర్కొంటున్నది. తెలంగాణాతో పోలిస్తే ఆంధ్రరాష్ట్రంలో ప్రభుత్వానికి ప్రజలనుంచి తలసరి పన్ను ఆదాయం తక్కువ. మరోవైపు తెలంగాణాకు ఆర్థిక సమస్యలు తలెత్తే అవకాశాలు బహు తక్కువ. తెలంగాణాలో భూమి పన్ను ఆదాయం ఎక్కువ. మద్యంమీద ఏటా 5 కోట్ల ఆదాయం వస్తుంది. రెండు ప్రాంతాల ప్రభుత్వ ఆదాయాల్లో తేడాకు ఇదే కారణం. చెబుతున్న కారణం ఏమైనప్పటికీ- తెలంగాణా స్థిర ఆదాయ వనరులనుంచి వచ్చే మొత్తాలను ఏకీకరణ తరువాత ప్రస్తుతం ఆంధ్రరాష్ట్రం ఎదుర్కొంటున్న ఆర్థిక అస్థిరత్వాల వంటి పరిస్థితులలో ఉమ్మడి అభివృద్ధి పథకాలకు వెచ్చించే అవకాశం ఉందని తెలంగాణా నేతలు భయపడుతున్నట్లు కనిపిస్తోంది. ప్రగతి పథంలో ఉన్నట్టు చెప్పుకుంటున్న తెలంగాణా ప్రాంతానికి ఈ ఏకీకరణ పాలనా పరంగా ఎలాంటి లాభం ఉండదనే వాదన ఉంది.

377- భవిషత్తు అభివృద్ధి ప్రణాళికలను పరిగణనలోనికి తీసుకుంటే, తమ ప్రాంతం డిమాండ్లను విశాలాంధ్రలో అంతగా పట్టించుకోరేమోననే భయం తెలంగాణాలో వ్యక్తమవుతున్నది. ఉదాహరణకు నందికొండ (కృష్ణానది) కుష్టాపురం (గోదావరినది) ప్రాజెక్టులు తీసుకుంటే ఇవి తెలంగాణాలోనే కాకుండా యావత్తు భారతదేశంలో చేపట్టిన అత్యంత ప్రాముఖ్యమైన ప్రాజెక్టుల కోవకు చెందినవి. అదే సమయంలో ఆ రెండు నదులపై కోస్తా డెల్టాలో సాగునీటి పారుదలకు ప్రణాళికలు తయారవుతున్నాయి. అందుకే తెలంగాణా ఆ రెండు నదులకు సంబంధించి తన

ప్రాంత స్వతంత్ర జల వినియోగం హక్కులను వదులుకోవడానికి ఇష్టపడటం లేదు.

378– కోస్తాకు చెందిన ఆధునికులు దోపిడీ చేస్తారేమో నన్న అనుమానం, విద్యాపరంగా వెనుకబడిన తెలంగాణా ప్రజల్లో నెలకొనడం విశాలాంధ్రపై వ్యతిరేకతకు ముఖ్యమైన కారణాల్లో ఒకటి కావచ్చు. హైదరాబాద్‌ను దాటితే తెలంగాణా జిల్లాల్లో విద్యారంగం దారుణంగా వెనుకబడి ఉంది. దాంతో ప్రభుత్వ ఉద్యోగాల్లో కనీస విద్యార్హతలు ఆంధ్రప్రాంతంతో పోలిస్తే తక్కువగా ఉండేవి. తెలంగాణా ప్రజల అసలు భయం ఏటంటే... ఆంధ్ర రాష్ట్రంలో కలిస్తే తమను ఆంధ్రవాళ్ళకన్నా తక్కువ స్థానంలో ఉంచుతారని, ఆ భాగస్వామ్యంలో ప్రధాన వాటాదారైన ఆంధ్ర తక్షణమే లబ్ధి పొందుతుందని, వాణిజ్యరంగంలో ఆరితేరిన కోస్తాంధ్రకు తెలంగాణా వలస ప్రాంతంగా (కాలనీ) మారుతుందేమోనని...

379– తెలంగాణా తనకు తానుగా ఒంటరిగా మనగలిగిన సుస్థిర రాష్ట్రం అవుతుందనే వాదన వినిపిస్తూన్నది. ఆ ప్రాంతం రెవిన్యూ వసూళ్ళు రూ.– 17 కోట్లుగా అంచనా వేస్తున్నారు. కృష్ణా, గోదావరి ప్రాజెక్టు నిర్మాణానికి తెచ్చే భారీ అప్పులకు ఏటా చెల్లించాల్సిన వడ్డీవల్ల కొత్తరాష్ట్రానికి (తెలంగాణా)కి పడే లోటు భారీగా ఏమీ ఉండబోదని విశ్వసిస్తున్నారు. అనుకూల పరిస్థితుల్లో ఆదాయం– ఖర్చు సమానం అయ్యే అవకాశం ఉందని, మిగులు బడ్జెటు కూడా చూపించవచ్చు ననే వాదనలు ఉన్నాయి. అయితే ఇది పూర్తిగా ఆశాజనకమైన భవిష్యత్తు అంచనా. పలు కారణాలతో దీన్ని సమర్థించుకోవచ్చు.

380– మరో ముఖ్యమైన కారణం ఉంది. 1952 ఏప్రిల్ నాటి ఆర్థిక సంఘం సూచనలతో హైదరాబాద్ రాష్ట్రంలో భాగమైన తెలంగాణా చెప్పుకోతగ్గ స్థాయిలో లబ్ధిపొందింది. ప్రస్తుత విధానంలో మాత్రమే కేంద్రం నుంచి వచ్చే పన్నుల వాటా అప్పటిలాగ గరిష్ఠంగా ఉంటుంది. తెలంగాణా పరిస్థితులు మెరుగు పడినందున పోలీసు శాఖపై ఖర్చు తగ్గిస్తే దిగుమతుల పన్ను రద్దువల్ల ఏర్పడుతున్న లోటు భర్తీ అవుతుంది. రాష్ట్రంలో పన్ను వసూళ్ళ అవకాశం పూర్తిగా సద్వినియోగం చేసుకుంటే తెలంగాణా ప్రాంతం ఆర్థిక పరిస్థితి గురించి ఆందోళన చెందాల్సిన అవసరమే

లేదు.

381- విశాలాంధ్ర ఏర్పాటువల్ల లాభాలు స్పష్టం. అయితే కలయిక స్వచ్ఛందంగా జరగాలి. తమ భవిష్యత్తుకు సంబంధించిన నిర్ణయాన్ని తీసుకునే బాధ్యత తెలంగాణా ప్రజలదే.

382- విశాలాంధ్ర ఏర్పాటు జరిగితే తెలంగాణా ప్రయోజనాల పరిరక్షణకు తగిన హామీలు ఇచ్చేందుకు ఆంధ్ర రాష్ట్రనేతలు సిద్ధంగా ఉన్నారని అర్థం చేసుకున్నాము. ఆ హామీలు (కోస్తా, సీమ నేతల మధ్య కుదిరిన శ్రీబాగ్ ఒడంబడిక లాంటి) ఒప్పందంగా రూపొందే అవకాశం దక్కేట్లు చూడటం, ఆ ప్రాంతం అభివృద్ధి పట్ల ప్రత్యేక శ్రద్ధ వహించే హామీ ఇవ్వడం జరగవచ్చు.

383- ఆ దిశగా జరిగే ఏర్పాట్లు వివరాల్లోకి వెళ్ళి జాగ్రత్తగా గమనించాం. శ్రీబాగ్ తరహా ఒప్పదం కానీ, బ్రిటన్‌లో స్కాటులాండు విలీనం అయినప్పుడు ఇచ్చిన రాజ్యాంగం హామీ లాంటిది గాని తెలంగాణా ప్రజల అసవరాన్ని తీర్చలేదు. తెలంగాణా ప్రత్యేక అవసరాలను తీర్చే చర్యలపై కేంద్ర ప్రభుత్వ పర్యవేక్షణ తప్ప మరేదైన నిరుపయోగమే. అలాంటి ఒప్పందాలను, ఏర్పాట్లను సూచించే బాధ్యత మాకు ప్రభుత్వం అప్పగించలేదు.

384- గమనంలో ఉంచుకోవలసిన మరో విషయం ఏమిటంటే ఆంధ్రరాష్ట్రం ఇటీవలే ఏర్పడింది. మార్పు దశలో ఒత్తిడి నుంచి ఇంకా కోరుకోలేదు. ఉదాహరణకు భూసంస్కరణల విషయంలో అదింకా విధానాన్ని రూపొందించుకోలేదు. ఉమ్మడి మద్రాసు రాష్ట్రం నుంచి విడిపోయిన సందర్భంగా తలెత్తిన సమస్యలు ఇంకా సమసి పోలేదు. ఆ దశలో ఎంత జాగ్రత్త వహించినా తెలంగాణా, ఆంధ్ర విలీనం రెండు ప్రాంతాలకు పాలనాపరమైన ఇబ్బందులు తెచ్చిపెట్టే అవకాశం ఉంది.

385- ఆ అంశాలన్నీ పరిగణనలోకి తీసుకొని మేము కొన్ని అవగాహనలకు వచ్చాం. ఆంధ్ర-తెలంగాణాల ఉమ్మడి ప్రయోజనార్థం ప్రస్తుతానికైనా తెలంగాణాను ప్రత్యేక రాష్ట్రంగా కొనసాగించాలి. ఆంధ్రతో విలీనం అంశాన్ని 1961 సాధారణ ఎన్నికల తరువాత ఏర్పడే హైదరాబాద్ శాసనసభ చేపట్టే వీలు కల్పించాలి. హైదరాబాద్

శాసనసభ 2/3 మెజారిటీతో విలీనానికి అనుకూలంగా నిర్ణయం తీసుకుంటే దాన్ని అమలు చేయాలి.

386– ఆ ఏర్పాటుతో లాభాలు ఏమిటంటే– ఆంధ్రుల ఏకీకరణ ప్రక్రియకు ఆ ఆరేళ్ళలో ఎవరూ అవరోధాలు కల్పించకుంటే... రెండు ప్రభుత్వాలు తమ పాలనాయంత్రాంగాన్ని చక్కదిద్దుకుంటాయి. కుదిరితే తమ భూమి పన్ను విధానాలను సమీక్షించుకుంటాయి. రెండు ప్రాంతాల్లో ఏకీకృత విధానాలకోసం ప్రయత్నం చేస్తాయి. ఆ సంధి విలీనభయాలను పారదోలేందుకు ఒక అవకాశంగా ఉపయోగపడుతుంది. రెండు రాష్ట్రాల మధ్య నిజమైన కలయికకు అవసరమైన ఏకాభిప్రాయ సాధనకు సమయం దొరుకుతుంది.

387– ఆంధ్ర, తెలంగాణాల మధ్య ఉమ్మడి ప్రయోజనాలున్నాయి. ఈ ప్రయోజనాలు వారిని మరింత దగ్గర చేస్తాయని ఆశిస్తున్నాం. ఒకవేళ రెండు ప్రాంతాల విలీనానికి అనుకూలమైన వాతావరణం వృద్ధి చెందాలన్న మన ఆకాంక్షలు కార్యరూపం దాల్చకపోతే తెలంగాణా ప్రజల సెంటుమెంటు ఇరు రాష్ట్రాల ఏకీకరణకు వ్యతిరేకంగా స్థిరత్వం చెందితే తెలంగాణా ప్రత్యేక రాష్ట్రంగా కొనసాగుతుంది.

388– హైదరాబాద్ రాష్ట్రం ప్రస్తుతానికి కొనసాగుతుంది. మహబూబ్‌నగరు, నల్లగొండ, వరంగల్, ఖమ్మం, కరీంనగర్, ఆదిలాబాద్, నిజామాబాద్, హైదరాబాద్, మెదక్, బీదరు జిల్లాలు. ఆంధ్రరాష్ట్రంలోని కృష్ణాజిల్లా మునగాల సంస్థానం హైదరాబాద్ రాష్ట్రంలో ఉంటాయి.

విశాలాంధ్రకు అనుకూలంగా ప్రచారాలు సాగుతూనే ఉన్నాయి. బి.వి.గురుమూర్తి, కొండా లక్ష్మణ్ బాపూజీ, కొత్తూరి సీతయ్యగుప్త, దేవులపల్లి రామానుజరావు, పాగ పుల్లారెడ్డి మొదలైన వారంతా విశాలాంధ్ర వాదులు. తెలంగాణా ప్రాంతంలో 200 మహాసభలు విశాలాంధ్రను కోరుతూ తీర్మానాలు చేసారు. పాగ పుల్లారెడ్డి గ్రామ గ్రామాన విశాలాంధ్ర సభలు జరిపారు. అయ్యదేవర కాళేశ్వరరావు విశాలాంధ్ర ఉద్యమానికి నాయకుడు.

1956 మార్చి 6వ తేదీన నిజామాబాద్‌లో భారత సేవక సమాజం వార్షిక

సమావేశం జరిగింది. నెహ్రూ అధ్యక్షత వహించారు. సికింద్రాబాద్‌లో స్పెషల్ రైలు ఎక్కుతూ రామకృష్ణరావుతో ప్రధాని అన్నారు... 'రాంకిషన్‌రావ్ ఏ ఎలాన్ కర్నహై' (రామకృష్ణరావు ఇది ప్రకటించాలి). ఆ వేళ సాయంత్రం నిజామాబాద్‌లో జరిగిన బహిరంగ సభలో 'విశాలాంధ్ర నిర్మాణానికి అనుకూలంగా కేంద్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకుం'దని ప్రకటించారు. ఈ నిర్ణయం అంతా ఆమోదించవలసిందని విజ్ఞప్తి చేశారు.

స్టేటు కాంగ్రెసులోని బూర్గుల, స్వామీజీ వర్గాలు విశాలాంధ్రను బలపరిచాయి. ఆదిలో తెలంగాణాకు మద్దతు ఇస్తానన్న బూర్గుల ఢిల్లీకి పోయి మారిపోయాడని కొండా వెంకట రంగారెడ్డి వర్గం వాదన. దీనికి చాలావరకు గోవిందవల్లభ్ పంత్ కారణమంటారు. ఎవరి ప్రచారాలు వారు చేసుకున్నారు. ఐదేళ్ళు తెలంగాణాను ప్రత్యేక రాష్ట్రంగా ఉంచితే ఈ అయిదేళ్ళు నిత్యతెలంగాణా, నిత్య విశాలాంధ్ర చర్చలతోనే సరిపోతుందని దూరాలోచనతో వాదించి తన వాదనను అసెంబ్లీలో నెగ్గించుకున్నాడు బూర్గుల. ఇరు ప్రాంతాల నాయకుల మధ్య పెద్దమనుషుల ఒప్పందం కుదిరింది. తెలంగాణా ప్రాంతం ఆంధ్రరాష్ట్రంలో కలిసిపోయి 1956 నవంబరు 1వ తేదీన ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం ఏర్పడింది. హైదరాబాద్ రాష్ట్రం విచ్ఛిన్నం కావడంతో నిజాం నవాబు రాజ్ ప్రముఖ్ పదవి రద్దయింది. దీనితో తెలుగువారి చరిత్రలో ఒక శకం ముగిసింది. ❑

39. నాటి ప్రభుత్వం

రాష్ట్రం విడిపోతున్నప్పుడు రాజ్ ప్రముఖ్ మీర్ ఉస్మాన్ అలీఖాన్ బహాదుర్ మంత్రివర్గంలో నలుగురు తెలంగాణావారు, ముగ్గురు మరట్వాడావారు, ఒక్కరు కర్నాటకవారు మంత్రులుగా ఉన్నారు. ఉపమంత్రులలో నలుగురు తెలంగాణావారు, ముగ్గురు కర్నాటకులు, ఒకరు మరట్వాడా వారు.

మంత్రి వర్గం

మంత్రి	వీరు నిర్వహించే శాఖ–శాఖలు
1. **బూర్గుల రామకృష్ణరావు** (ముఖ్యమంత్రి)	1. జనరల్ అడ్మినిస్ట్రేషను 2. రెవిన్యూ (రెవిన్యూ శాఖలో 2,3, 4, 10, 12, 16, 17 అంశాలు)
2. **శంకరదేవ్** (డిప్యూటీమంత్రి	3. సమాచార శాఖ 4. సాంఘిక సేవ శాఖ
3. **దిగంబర్రావ్ గోవిందరావు బిందూ** (హోంశాఖమంత్రి) **శ్రీనివాసరావు అఖెలీకర్** (డిప్యూటీ మంత్రి)	1. హోంశాఖ, న్యాయశాఖ 2. పునరావాసశాఖ
4. **కొండా వెంకటరంగారెడ్డి** (రెవిన్యూమంత్రి)	1. ఎక్సైజు శాఖ 2. అటవీ శాఖ 3. కస్టమ్స్ శాఖ 4. రెవిన్యూశాఖ (ముఖ్యమంత్రికి లేని విభాగాలు)

పల్లెర్ల హనుమంతరావు	
(డిప్యూటీ మంత్రి)	
5. **డా॥ మర్రి చెన్నారెడ్డి**	1. వ్యవసాయ, సప్లయి శాఖలు
(సప్లయి శాఖమంత్రి)	2. అభివృద్ధి, ప్లానింగ్ శాఖలు
అరిగె రామస్వామి	
(డిప్యూటీ మంత్రి)	
6. **వినాయకరావు కొరాట్కర్ విద్యాలంకార్**	1. ఫైనాన్స్ శాఖ
	2. గణన శాఖ
(ఆర్థికశాఖమంత్రి)	3. పరిశ్రమలు, వాణిజ్యం
విరూపాక్షప్ప	
(డిప్యూటీ మంత్రి)	
7. **గోపాల్ సుబ్బుకృష్ణ మెల్కోటే**	
(పరిశ్రమల శాఖ)	
ఎం.ఎస్.రాజలింగం	1. కార్మికశాఖ
(డిప్యూటీ మంత్రి)	2. పబ్లిక్ వర్క్సు శాఖ
8. **మెహదీ నవాజ్‌జంగ్**	1. ప్రజారోగ్యం, వైద్యశాఖ
(ఆరోగ్యశాఖమంత్రి)	2. గ్రామోద్ధరణ
భగవంతరావు గాధే	1. సహకారశాఖ
(డిప్యూటీ మంత్రి)	2. పశువైద్యశాఖ
9. **గోపాల్‌రావు ఎక్బోటే**	1. విద్యాశాఖ
(విద్యాశాఖమంత్రి)	2. స్థానిక పరిపాలన శాఖ
శ్రీమతి సంగెం లక్ష్మీబాయి	3. పార్లమెంటరీ వ్యవహారాల శాఖ
(డిప్యూటీ విద్యామంత్రి)	
శాసనసభ స్పీకరు	**కాశీనాథరావు వైద్య** (కం).
డిప్యూటీ స్పీకరు	**పాంపన గౌడ్ సకరప్ప** (స్వతంత్ర)
కాంగ్రెసు పార్టీనాయకుడు	**బూర్గుల రామకృష్ణరావు**
ప్రతిపక్షనాయకుడు	**వి.డి.దేశ్‌పాండే** (ఫ్రంటు)

రెండవ భాగం

1. ఆంధ్రరాష్ట్ర నిర్మాణం

పొట్టిశ్రీరాములు మద్రాసు నగరంలో 19-10-1952న ఆంధ్రరాష్ట్రం కోసం ఆమరణ నిరాహారదీక్ష ప్రారంభించారు. 58 రోజుల కఠోర నిరసన వ్రతం తరువాత పొట్టిశ్రీరాములు అమరత్వం పొందారు. శ్రీరాములు ఆత్మార్పణంతో ఆంధ్ర ప్రపంచం భగ్గుమంది. క్రోధాగ్ని ప్రజ్వలించింది. కోస్తా, రాయలసీమ, తెలంగాణ- యావదాంధ్ర భూమి, ఊరు-ఊరూ, వాడ-వాడా ఆపిల్ల బాలాది ప్రజానీకం అట్టుడికినట్లు ఉడికిపోయారు. హర్తాళ్లు, ఊరేగింపులు, బహిరంగసభలు, విద్యార్థిలోకంలో ఆగ్రహం, ద్వేషం, ఆవేశం ప్రజ్వలివ్వినవి. ఎక్కడిరైళ్ళను అక్కడే ఆపివేశారు. ప్రజానీకంలో ఆ కదలిక న భూతో న భవిష్యతి. ఆంధ్రదేశానికి సంబంధించినంతవరకు ప్రభుత్వం స్తంభించిపోయింది. 1953 అక్టోబరు 1 నాటికి నిర్వివాద ప్రాంతాలతో ఆంధ్రరాష్ట్రం ఏర్పడుతుందని ప్రధాని నెహ్రూ పార్లమెంటులో ప్రకటించారు.

ఆంధ్రరాష్ట్రం ఏర్పడుతున్న సమయంలో ఆంధ్రప్రాంతం నుంచి ఎన్నికైన కాంగ్రెస్ ప్రతినిధుల బలం తక్కువగా ఉంది. రంగా ఆధ్వర్యాన లోక్‌పార్టీ, ప్రకాశం ఆధ్వర్యాన ప్రజాపార్టీ కాంగ్రెసు బలాన్ని పంచుకుని ఉన్నాయి. కమ్యూనిస్టులు ఒక పార్టీగా కాంగ్రెసుతో సరితూగుతూ నిలిచారు. ఈ సమయంలో ఆంధ్ర కాంగ్రెసు శాసనసభా పక్షనాయకుని ఎన్నిక అవసరమైంది. అందుకోసం సంజీవరెడ్డి పోటీ పడ్డారు. అప్పటి మంత్రి నాయకంటి శంకరరెడ్డి పేరును మంత్రి పట్టాభిరామారావు ప్రతిపాదించే ఏర్పాటు కూడా రాజాజీ చేశారని ప్రచారం జరిగింది. వాటికి అన్ని ఏర్పాట్లు పూర్తి అయిన తరువాత శ్రీకాకుళం, విశాఖపట్నం, తూర్పుగోదావరి జిల్లాల సభ్యులలో తిరుగుబాటు వచ్చింది. గోపాలరెడ్డి సలహాను పాటించి శంకరరెడ్డి రంగం నుంచి తప్పుకున్నారు. సంజీవరెడ్డి రాష్ట్ర కాంగ్రెసు అధ్యక్ష పదవితోపాటు రాష్ట్ర కాంగ్రెసు శాసనసభా పక్షనాయకత్వాన్నికూడా స్వీకరించారు.

ఏర్పడుతున్నది తమ చిరకాల వాంఛితమైన ఆంధ్రరాష్ట్రం. కానీ తాము ఆంధ్రులమనే జాతీయ భావం అప్పటి రంగంలో నిలబడి వున్న నాయకులలో ఏ ఒక్కరికీ కలుగలేదు. రాజధాని విషయంలో ఎవరి దారి వారిదే అయింది. ఏ నగరాన్ని నిర్ణయిస్తే ఎవరి పార్టీ బలం పడిపోతుందో, ఎవరి స్థానబలం పెరుగుతుందో అనే దిగాలుతో మూడు పార్టీలవారు ప్రయత్నాలు ప్రారంభించారు. ఒక్కొక్క నగరమే చర్చించి త్రోసి పుచ్చుకున్నారు. విశాఖ రాయలసీమకు దూరమైంది. కాంగ్రెసును పరాభవించి కమ్యూనిస్టుల్ని ఎన్నుకున్న బెజవాడ కాంగ్రెసు వారికి గిట్టలేదు. ముందుగానే కృషికార్ లోక్‌పార్టీవారు పేరు చెప్పినందుకు సంజీవరెడ్డిగారికి, ప్రకాశం గారికి తిరుపతి పట్టణం నచ్చలేదు. తన స్వస్థానమైన అనంతపురం ఇతరులెవ్వరికీ సమ్మతం కాదని సంజీవరెడ్డికి తెలుసు. రాజాజీ పేరు పెట్టనందుకు అందులో ఏదో కుట్ర ఉందని అందరూ ఏకమై నెల్లూరుని తిరస్కరించారు. ఇక మిగిలింది కర్నూలు ఒక్కటే. ఆఖరుకి శంకరరెడ్డి కూడా అడగని కర్నూలుకు అందరూ కలిసి పట్టం గట్టారు. మూడు పార్టీలు అంగీకరించాయి.

అయితే మద్రాసు శాసనసభలో ఆంధ్రరాష్ట్ర శాసనం చర్చకు వచ్చినప్పుడు తాత్కాలిక రాజధాని పేరు కర్నూలు తీసివేసి విజయవాడ ఉండాలని కమ్యూనిస్టులు, తిరుపతి ఉండాలని కె.ఎల్.పి. వారు సవరణలు ప్రతిపాదించారు. కమ్యూనిస్టులకు బలంలేని రాయలసీమలో కాంగ్రెసు బలాన్ని విచ్ఛిన్నం చేసి కె.ఎల్.పి. తన బలం పెంచుకోవాలని ఈ ఎత్తు చేసిందని విమర్శకుల అభిప్రాయం. అయిదుగురు ఆంధ్రేతర సభ్యులు కర్నూలుకు అనుకూలంగా ఓటువేయడంతో విజయవాడ సవరణ వీగిపోయింది. తిరుపతికి చెప్పుకోదగ్గ ఓట్లు పడలేదు.

ప్రథమాంధ్ర మంత్రి వర్గం:

ఉమ్మడి మద్రాసు రాష్ట్రం నుండి విడివడి ఆంధ్రరాష్ట్రం ఏర్పడే సమయంలో అసెంబ్లీలో మొత్తం 140 స్థానాలలో వివిధ పార్టీల బలా బలాలు ఇలా ఉన్నాయి: కాంగ్రెస్-51, కమ్యూనిస్టులు-43, కృషికార్ లోక్‌పార్టీ-14, ప్రజాపార్టీ-6, ప్రజా సోషలిస్టు పార్టీ-15, షెడ్యూల్డ్ కాస్ట్స్ ఫెడరేషన్-2, ఇండిపెండెంట్లు-9. ఆంధ్ర అసెంబ్లీలో కాంగ్రెసుకు పూర్తి మెజారిటీ లేదు. ఇతర పార్టీల సహాయం లేనిదే ప్రభుత్వం

ఏర్పాటు చేసే అవకాశం లేదు. పైగా నెహ్రూతో సహా ప్రకాశం లేని మంత్రివర్గం తలలేని మొండెమే అన్నారు. సంజీవరెడ్డి అల్లూరి సత్యనారాయణ రాజులు తమ రాజకీయ చతురత అంతా ఉపయోగించి ప్రకాశంని కాంగ్రెసులో పునః ప్రవేశం చేయించారు.

1953 అక్టోబరు 1వ తేదీన ప్రధానమంత్రి నెహ్రూ ఆంధ్రరాష్ట్రానికి ప్రారంభోత్సవం చేశారు. ప్రకాశం ముఖ్యమంత్రి, నీలం సంజీవరెడ్డి ఉపముఖ్యమంత్రి, తెన్నేటి విశ్వనాథం, ఎస్.బి.పి. పట్టాభిరామారావు, సంజీవయ్య, కడప కోటిరెడ్డి మంత్రులు. పార్లమెంటరీ పార్టీ చరిత్రలో పార్టీ నాయకుడు కాకుండా ముఖ్యమంత్రిగ ఉన్న వ్యక్తి ప్రకాశం ఒక్కరే. తెన్నేటి ప్రజాపార్టీని వీడలేదు కనుక మొదట ఆంధ్రప్రభుత్వం మిశ్రమ ప్రభుత్వమే. తర్వాత గౌతు లచ్చన్నను మంత్రివర్గంలోకి తీసుకున్నారు. ఇప్పుడు ప్రభుత్వం మూడు పార్టీల మిశ్రమమయింది. మంత్రివర్గ సభ్యులలో నలుగురు రాయలసీమవారే. అసెంబ్లీలో బలాబలాలు 70–75గా ఉన్నాయి. రాజకీయం దృష్ట్యా పరిస్థితులు అనిశ్చితంగా పరిణమించాయి. ఎప్పటికెయ్యది ప్రస్తుతమో అప్పటికి ఆ మాట చెప్పి కాలం వెళ్ళదీసే స్థితి వచ్చింది. తెగతెంపుల కోసం ఎదురు చూస్తున్నారు. ఆ సమయంలో మద్యనిషేధ విషయమై ప్రభుత్వం శౌంఠి రామమూర్తి సంఘాన్ని నియమించింది. అది నిషేధం రద్దు చేయవలసిందని సూచించింది. ప్రభుత్వానికి ఆ సూచన అమలు పరచడానికి కాంగ్రెస్ సిద్ధాంతం అడ్డువచ్చింది. ఈ సూచనను అమలు పరచనందుకు ప్రభుత్వంపై అవిశ్వాస తీర్మానం ప్రవేశపెట్టాడు గౌతు లచ్చన్న. మంత్రివర్గంపై కన్నెర్రగా వున్న కాంగ్రెస్ సభ్యులు నాయకంటి శంకరరెడ్డి అడుసుమిల్లి సుబ్రహ్మణ్యం, వ్యతిరేకంగా ఓటు వేశారు. ప్రకాశం మంత్రివర్గం ఒకే ఒక ఓటుతో 1954 నవంబరు 6వ తేదీన పతనమైంది. మొత్తంమీద అందరూ కలిసి ఆంధ్రరాష్ట్రానికి గవర్నరు పాలన తెచ్చారు. కానీ రాజాజీ ప్రవేశపెట్టిన నూతన విద్యావిధానం మద్రాసు అసెంబ్లీలో నెగ్గకపోయినా ఆయనను రాజీనామా చేయవలసిందని తమిళులు పట్టుపట్టలేదు. తెలుగువారికి మంత్రివర్గాలను పడగొట్టడంలో ఉన్న నేర్పు నిలబెట్టుకోవడంలో లేదు. పద్నాలుగున్నర మాసాలు

రాష్ట్రం రాష్ట్రపతి పాలనలో ఉంది.

గోపాలరెడ్డి మంత్రివర్గం:

ఆంధ్రకేసరి ప్రకాశం మంత్రివర్గం పతనంతో 1954 డిసెంబర్‌లో రాష్ట్రపతి పాలన వచ్చింది. 1955లో మధ్యంతర ఎన్నికలు జరిగాయి. 1952 ఎన్నికల్లో జరిగిన పరాభవం గుర్తుంచుకుని కాంగ్రెసువారు, కాంగ్రెసులోంచి విడిపోయినవారు ముందుగానే జాగ్రత్త పడ్డారు. కమ్యూనిస్టులను ఎదిరించడం కోసం కాంగ్రెసు, ప్రజాపార్టీ, కె.ఎల్.పి. పార్టీలతో యునైటెడ్ ఫ్రంట్‌ను ఏర్పాటు చేశారు. నియోజక వర్గాల పునర్విభజనతో 140 స్థానాల సంఖ్య 194 స్థానాలకు పెరిగింది. అధికారం లభిస్తుందన్న ఆశతో కమ్యూనిస్టులు పెద్ద ఆర్భాటంతో రంగంలోకి దిగారు.

ఆంధ్రరాష్ట్రానికి కమ్యూనిస్టు ప్రమాదాన్ని తప్పించాలనేది 1955 ఎన్నికల్లో ప్రత్యేక నినాదమైంది. రాష్ట్రంలో రాజకీయ ప్రజాస్వామ్యాన్ని భద్రపరచుకొనడానికి ఒక ఉద్యమం ఉప్పెనలా బయలుదేరింది. దానికి బ్రహ్మాండమైన ప్రజావిజయం లభించింది. ఈ ఎన్నికల్లో ప్రజలచేత కాంగ్రెసుకు ఓట్లు వేయించిన శక్తి 'కొన్ని సమస్యలది కానీ కొందరు నాయకులది కాదు'. అందులోను ప్రజాస్వామ్యాన్ని రక్షించుకొనడానికి, జాతీయమైన ఒక పార్టీని ఉంచుకొనడానికి మధ్యతరగతులు ఆవేశంతో కృషి చేశాయి. కనుకనే కాంగ్రెస్ ఘన విజయాన్ని సాధించింది. తిరిగి రాష్ట్రనాయకులందరూ రంగం మీదికి వచ్చారు.

ఐక్య కాంగ్రెస్ 196 స్థానాలకు పోటీ చేసి 146 స్థానాలను గెలిచింది. కమ్యూనిస్టులు 169 స్థానాలకు పోటీ చేసి 15, ప్రజాసోషలిస్టులు 45 స్థానాలకు చేసి 13, ఇండిపెండెంట్లు 1692 మంది పోటీ చేసి 22 స్థానాలు గెలిచారు. పోటీ చేసిన 13 మంది మంత్రుల్లో తెన్నేటి విశ్వనాథం, శంకరరెడ్డి ఓడిపోయారు. 1952 ఎన్నికల్లో కాంగ్రెసు వారికి పట్టిన గతే ఈ ఎన్నికల్లో కమ్యూనిస్టులకు పట్టింది. ఆ పార్టీ దిగ్గజాలు మాకినేని బసవపున్నయ్య, తరిమెల నాగిరెడ్డి, మోటూరి హనుమంత రావు, చండ్ర రాజేశ్వరరావుతో సహా పలువురు ఓడిపోయారు. ప్రకాశం గెలిచారు. ఆనాటికి ఆయన వయస్సు 86 సంవత్సరాలు. ఎప్పుడైతే యునైటెడ్ ఫ్రంట్ గెలిచిందో

అప్పుడే మళ్ళీ ముఖ్యమంత్రి ఎవరు అనే ప్రశ్న వచ్చింది. గోపాలరెడ్డి సీనియర్లలో లెక్క. ఆయన పోటీకి నిలిచారు. రాష్ట్రనిర్మాణ బాధ్యత వహించి, ప్రకాశానికి పట్టంగట్టిన సంజీవరెడ్డి అర్హతకూడా గమనించ తగ్గదే. ఢిల్లీ నుంచి వచ్చిన కాంగ్రెసు పెద్దలు గోపాలరెడ్డిని నాయకుడుగా నిర్ణయించారు. సంజీవరెడ్డి డిప్యూటీ ముఖ్యమంత్రిగా ఉండటానికి అంగీకరించారు. అప్పుడు ఏర్పడిన మంత్రివర్గం, యునైటెడ్ ఫ్రంట్ మంత్రివర్గం: బెజవాడ గోపాలరెడ్డి ముఖ్యమంత్రి, నీలం సంజీవరెడ్డి ఉపముఖ్యమంత్రి, కల్లూరి చంద్రమౌళి, కళా వెంకట్రావు, గౌతు లచ్చన్న, ఏ.బి. నాగేశ్వరరావు, ఓబులరెడ్డి, డి. సంజీవయ్య, నీరుకొండ రామారావు, మంత్రులు. ఆహార మంత్రిగా ప్రమాణం చేసిన నీరుకొండ రామారావు 1955 మే 4వ తేదీన 41 సం॥ల వయస్సులో చనిపోయారు. గోపాలరెడ్డి ముఖ్యమంత్రి కావడంతో అల్లూరి సత్యనారాయణరాజు పి.సి.సి. అధ్యక్షులయ్యారు.

1955 ఎన్నికల అనంతరం ఆంధ్రలో కురువృద్ధుల తరం అంతరించిందనే చెప్పాలి. ప్రకాశం వృద్ధాప్యంవలన నాయకత్వానికి పోటీ పడలేదు. డా॥ పట్టాభి మధ్యప్రదేశ్ గవర్నర్‌గా రాష్ట్రం విడిచిపోయారు. ప్రదేశ్ కాంగ్రెసు అధ్యక్ష పదవికి పోటీ చేసి ఓడిపోయిన ఆచార్య రంగాది ఒంటరి బతుకై పోయింది. ఆయన దరిమిలా 'రైతుజన బాంధవుడు'గా మిగిలిపోయారు.

కర్నూలు రాజధాని నగరం:

ఆనాటి కర్నూలు పట్టణ జనాభా 40,000. కలెక్టరు కార్యాలయాన్ని సెక్రటేరియట్‌గా మార్చారు. కలెక్టరు కార్యాలయాన్ని నంద్యాలకు తరలించారు. అసెంబ్లీని జిల్లాకోర్టు కార్యాలయంలో నెలకొల్పారు. గవర్నరు త్రివేది 4000 టెంట్‌లను ఢిల్లీ నుంచి తెప్పించారు. కలెక్టరు నివాసభవనం చీఫ్ సెక్రటరీ ఓ. పుల్లారెడ్డి నివాస భవనమైంది. ఇంతచేసినా శాఖాధిపతులు, డైరెక్టర్ల కార్యాలయాలకు కర్నూలులో సౌకర్యాలు కల్గించలేకపోయారు. ఆంధ్రప్రదేశ్ ఏర్పడి హైదరాబాద్ రాజధాని నగరమయ్యేవరకు ఈ కార్యాలయాలు మద్రాసు నగరంనుండే పనిచేశాయి.

మంత్రివర్గ సమావేశాలు జరుగుతున్న రోజుల్లో శాఖాధిపతులు మద్రాసునుంచి

ట్రైనులో గుత్తిలో దిగేవారు. అక్కడి నుంచి కార్లలో వారిని కర్నూలు తీసుకుపోయే వారు. కె.సి.కెనాల్ తీరంలో ఉన్న ఎగ్జిక్యూటివ్ ఇంజనీరు నివాస భవనాన్ని రాజ్‌భవన్‌గా తీర్చిదిద్దారు. ప్రకాశంగారి ప్రోత్సాహంతో 45 రోజులు జరిగిన అసెంబ్లీ బడ్జెటు సమావేశాలు విశాఖపట్టణంలో జరిగాయి. యూనివర్సిటీ ఆవరణలోని తిక్కవరపు రామిరెడ్డి హాల్‌ను అసెంబ్లీగా మార్చుకున్నారు. శాసనసభ్యులకు యూనివర్సిటీ హాస్టల్లో విడిదినిచ్చారు. వైజాగ్ సమావేశంలోనే వేంకటేశ్వర విశ్వవిద్యాలయం బిల్లుకు ఆమోదం లభించింది. ప్రాథమిక విద్యను జాతీయం చేయడం జరిగింది.

ఆంధ్రరాష్ట్ర నూతన రాజధాని విషయంలో గవర్నరు త్రివేదిగారు ఎంతో పట్టుదల వహించారు. ఇంజనీర్లతో రాత్రులంతా పనిచేయించారు. పని నిర్విరామంగా సాగిపోయింది. రాష్ట్రరాజధాని కాగలిగిన పట్టణంలోని రోడ్లకు కావలసిన కళ కొంతలో కొంతైనా అప్పుడు వచ్చిందంటే అది త్రివేదిగారి చలవే. ❑

2. పెద్దమనుషుల ఒప్పందం

ఆంధ్రప్రదేశ్ ఏర్పడకముందు, తెలంగాణ, ఆంధ్రప్రాంతాల నాయకుల మధ్య 1956లో ఒక ఒప్పందం కుదిరింది. దీన్ని పెద్దమనుషుల ఒప్పందం (జెంటిల్‌మెన్స్ అగ్రిమెంట్)గా వ్యవహరిస్తారు. ఆంధ్రప్రాంతం నుంచి డా॥ బెజవాడ గోపాలరెడ్డి (ముఖ్యమంత్రి), నీలం సంజీవరెడ్డి, అల్లూరి సత్యనారాయణరాజు, గౌతు లచ్చన్న, తెలంగాణా నుంచి డా॥ బూర్గుల రామకృష్ణారావు (ముఖ్యమంత్రి), కొండా వెంకటరంగా రెడ్డి, జె.వి. నరసింగరావు, డా॥ మర్రి చెన్నారెడ్డి సంతకాలు చేశారు.

ఒప్పందంలోని అంశాలు:

1. రాష్ట్రానికి సంబంధించిన కేంద్ర, రాష్ట్ర సాధారణ పరిపాలనా వ్యయం ఆంధ్ర తెలంగాణా నిష్పత్తి ప్రకారం భరించాలి. తెలంగాణా మిగులు ఆ ప్రాంతం అభివృద్ధికి కేటాయించాలి. ఐదేళ్ళ దాక ఈ ఏర్పాటు ఉండాలి. అటు తరువాత తెలంగాణా శాసనసభ్యులు కోరిన పక్షంలో మరో ఐదేళ్ళు పొడిగించవచ్చు.

2. శాసనసభలో తెలంగాణా సభ్యులు నిర్ణయించిన విధంగా తెలంగాణలో మద్యనిషేధం అమలుపరచాలి.

3. తెలంగాణాలో ఉన్నత విద్యా సౌకర్యాలు తెలంగాణవారికే లభించాలి. ఇంకా అభివృద్ధి పరచాలి. లేకపోతే మొత్తం రాష్ట్రంలోని సాంకేతిక విద్యతో సహా అన్ని విద్యాలయాలలోనూ మూడోవంతు తెలంగాణ విద్యార్థులకు కేటాయించాలి.

4. ఏకీకరణ కారణంగా కొన్ని ఉద్యోగాలు విధిగా తగ్గించవలసి వస్తే నిష్పత్తి ప్రకారం జరగాలి.

5. ముందు రాబోయే ఉద్యోగాలు ఉభయ ప్రాంతాల జనాభా ప్రాతిపదికమీద ఉండాలి.

6. అయిదేళ్ళ పాటు తెలంగాణలో పరిపాలన, న్యాయశాఖలలో ఉర్దూ భాషకున్న స్థానం కొనసాగించాలి. తర్వాత ప్రాంతీయ మండలి ఈ అంశం చర్చించి సమీక్షించి సవరించవచ్చు. ఉద్యోగాలలో చేర్చుకునే ముందు తెలుగు భాష వచ్చి తీరాలనే నిబంధన ఉండరాదు. చేరిన రెండేళ్ళలోగా తెలుగు నేర్చుకోవాలని నియమం ఉండవచ్చు.

7. తెలంగాణాలో నిష్పత్తి ప్రకారం నిర్ణయించిన ఉద్యోగాలలో ప్రవేశించడానికి అభ్యర్థులు ఆ ప్రాంతంలో 12 సంవత్సరాల నివాసం ఉండాలి.

8. తెలంగాణా సర్వతోముఖాభివృద్ధి సాధించడానికి ఒక ప్రాంతీయ సంఘం ఉండాలి.

9. తెలంగాణా ప్రాంతంలో వ్యవసాయ భూముల అమ్మకం, ప్రాంతీయ సంఘం అధీనంలో ఉండాలి.

10. ఈ ప్రాంతీయ సంఘంలో 20 మంది సభ్యులు ఉండాలి. తెలంగాణాలో తొమ్మిది జిల్లాల ప్రతినిధులుగా తొమ్మండుగురు శాసన సభ్యులను శాసనసభ ఎన్నుకోవాలి. శాసన సభలోని తెలంగాణా సభ్యులు పార్లమెంటునుంచిగానీ, శాసనసభ నుంచి గానీ 6 గురు సభ్యులను ఎన్నుకుంటారు. ముఖ్యమంత్రి, స్పీకరు తప్పితే తెలంగాణా ప్రాంతానికి చెందిన మంత్రులంతా ఈ సంఘం సభ్యులే. 11. ప్రాంతీయ సంఘాన్ని రాజ్యాంగంలోని 371 నిర్దేశిక సూత్రం ప్రకారం రాష్ట్రపతి నియమిస్తారు. కనుక ఇది చట్టబద్ధమైన సంస్థ. ప్రణాళిక రచన, అభివృద్ధి వ్యవహారాలు, నీటిపారుదల, ఇతర వ్యవసాయ పథకాలు, పారిశ్రామికాభివృద్ధి, తెలంగాణా ఉద్యోగాలు, ప్రజారోగ్యం, మద్యనిషేధం అంశాలను ప్రాంతీయ సంఘం పరిశీలించి నిర్ణయాలు తీసుకుంటుంది. రాష్ట్రప్రభుత్వానికీ, ప్రాంతీయ సంఘానికీ మధ్య అభిప్రాయ భేదం ఏర్పడితే నిర్ణయానికై భారత ప్రభుత్వానికి నివేదించవచ్చు. ఈ ఏర్పాటు మధ్యలో మరో ఒప్పందం లేని పక్షంలో పది సంవత్సరాల తరువాత సమీక్ష చేయబడుతుంది.

12. మంత్రివర్గ నిర్మాణంలో ఆంధ్రప్రాంతం, తెలంగాణ ప్రాంతం వారు 6:4 నిష్పత్తిలో ఉండాలి. తెలంగాణ ప్రాంతం నుంచి ఒక ముస్లిం మంత్రి ఉండాలి.

13. ముఖ్యమంత్రి ఆంధ్ర ప్రాంతం వారైతే ఉపముఖ్యమంత్రి తెలంగాణా ప్రాంతం వారుండాలి. ముఖ్యమంత్రి తెలంగాణా వారైతే ఉపముఖ్యమంత్రి ఆంధ్రప్రాంతంవారై ఉండాలి. హోం, ఫైనాన్స్, ప్లానింగ్, డెవలప్‌మెంట్, వాణిజ్య, పరిశ్రమల శాఖలలో కనీసం రెండైనా తెలంగాణా వారికివ్వాలి.

14. హైదరాబాద్ ప్రదేశ్ కాంగ్రెస్ అధ్యక్షులు 1962 వరకు తెలంగాణాకు ప్రత్యేక కాంగ్రెస్ కమిటీ ఉండాలని కోరుకున్నారు. దీనికి ఆంధ్ర కాంగ్రెసు అధ్యక్షులు అభ్యంతరం తెలుపలేదు.

ఈ పెద్దమనుషులు తిరిగి 1956 ఆగష్టు 14న సమావేశమై మరికొన్ని అంశాలు చర్చించి ఒకనోటు కూడా తయారు చేసుకున్నారు.

కొత్త రాష్ట్రానికి పేరు ఆంధ్ర–తెలంగాణా అని ఉండాలని. తెలంగాణ ప్రతినిధులు కోరారు. ఈ పేరు ముసాయిదా బిల్లులో ఉన్నది. కానీ జాయింట్ సెలెక్టు కమిటీ ఆంధ్రప్రదేశ్ అని వివరించింది. ఆంధ్రప్రదేశ్ పేరే ఉండాలని ఆంధ్ర ప్రతినిధులు కోరారు.

హైకోర్టు ప్రధానమైన బెంచి హైదరాబాద్‌లోనే ఉండి, ఒక బ్రాంచి గుంటూరులో ఉండాలని, తెలంగాణా ప్రతినిధులు కోరారు. మొత్తం హైకోర్టు హైదరాబాద్‌లోనే ఉండాలని ఆంధ్రప్రతినిధులు కోరారు.

తెలంగాణా రక్షణలు

ప్రాంతీయ స్థాయి సంఘం:

1. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రమంతటికి ఉమ్మడి శాసనసభ ఉంటుంది. మొత్తం రాష్ట్రానికి ఈ సభ శాసనాలు తయారు చేస్తుంది. ఒకే గవర్నరు ఉంటాడు. మొత్తం రాష్ట్రానికి రాష్ట్రశాసన సభకు మంత్రిమండలి బాధ్యత వహించాలి. వారు సలహాలిస్తూ, సహాయ పడతారు.

2. కొన్ని ప్రత్యేక విషయాలలో ప్రభుత్వ వ్యవహారం సులువుగా జరుగటానికి

గాను తెలంగాణ ఒక ప్రాంతంగా పరిగణింపబడుతుంది.

3. తెలంగాణా ప్రాంతానికి ఒక స్థాయీ సంఘం ఉంటుంది. తెలంగాణ మంత్రులతో సహా తెలంగాణ శాసన సభ్యులు ఇందులో సభ్యులుగా ఉంటారు. ముఖ్యమంత్రి ఇందులో సభ్యుడు కాడు.

4. ప్రత్యేక విషయాలకు సంబంధించిన శాసన విషయాలు ప్రాంతీయ సంఘానికి నివేదించబడతాయి. ఆ విషయాలకు సంబంధించిన శాసన చర్యను ప్రాంతీయ సంఘం ప్రభుత్వానికి సూచించవచ్చు. ఆర్థిక బాధ్యతలకు సంబంధించిన సాధారణ ప్రభుత్వ విషయాలలో కూడా ప్రాంతీయ సంఘం ప్రతిపాదనలు చేయవచ్చు. అది రోజువారీవిగానీ, అవసర వ్యయానికిగానీ సంబంధించినవి కాకూడదు.

5. ప్రాంతీయ సంఘం ఇచ్చిన సలహాలను సాధారణంగా ప్రభుత్వమూ శాసనసభ ఆమోదించాలి. అభిప్రాయభేదం వస్తే గవర్నరుకు నివేదించాలి. గవర్నరు నిర్ణయం పాటించాలి. అదే తుదినిర్ణయం.

ప్రాంతీయ సంఘం పరిశీలించే అంశాలు:

1. శాసనసభ చేసిన పథకాల పరిధిలో అభివృద్ధి, ఆర్థిక ప్రణాళికలు.

2. స్థానిక పరిపాలన వ్యవహారాలు అనగా– మునిసిపల్ కార్పొరేషన్లు, రాజ్యాంగ అధికారాలు, అభివృద్ధి ట్రస్టులు, జిల్లా బోర్డు, గ్రామ పరిపాలనకు సంబంధించిన ఇతర అధికారాలు.

3. ప్రజారోగ్యం, పారిశుధ్యం, స్థానిక ఆసుపత్రులు, చికిత్సశాలలు.

4. ప్రాథమిక విద్య, మాధ్యమిక విద్య.

5. తెలంగాణా విద్యా సంస్థలలో ప్రవేశాలు.

6. మద్యనిషేధం.

7. వ్యవసాయ భూముల అమ్మకం.

8. కుటీర పరిశ్రమలు, లఘు పరిశ్రమలు.

9. వ్యవసాయ సహకార సంఘాలు, అంగళ్ళు, సంతలు.

నివాస నిబంధనలు:

తాత్కాలిక ఐదేళ్ల, తెలంగాణా సబార్డినేటు ఉద్యోగాలకు రిక్రూటుమెంటు విషయంలో తెలంగాణా ఒక యూనిట్‌గా పరిగణించబడుతుంది.

ఈ ఉద్యోగాలకు సంబంధించిన పదవులు ప్రస్తుత హైదరాబాద్ నిబంధనలతో నిర్ణయించిన నిష్పత్తిలో నివాసపు షరతులకు అనుగుణంగా వున్న వారితో భర్తీ చెయ్యడానికి కేటాయించబడతాయి. రాష్ట్రంలో ప్రస్తుత పరిపాలన న్యాయవ్యవస్థలలో ఉర్దూ భాషకున్న స్థానాన్ని ఐదేళ్ళపాటు కొనసాగించేందుకు తగిన చర్యలు తీసుకోవడానికి భారతప్రభుత్వం రాష్ట్రప్రభుత్వానికి సలహా ఇవ్వాలి.

కొత్త రాష్ట్రంలో ఉద్యోగుల రిట్రెంచ్‌మెంట్:

ఉద్యోగాలలో ఉన్నవారిని తొలగించవలసి వస్తుందని, రిట్రెంచ్‌మెంట్ అవసరమవుతుందని భారతప్రభుత్వం భావించడం లేదు. ఎటువంటి వడపోత కార్యక్రమాలు లేకుండానే హైదరాబాద్ రాష్ట్ర ఉద్యోగాలను ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర సమగ్ర ఉద్యోగాలలోకి సాధ్యమైనంత వరకు చేర్చుకోవాలన్నదే ఉద్దేశం. ఒకవేళ రిట్రెంచ్‌మెంట్ అవసరమైతే యావత్తు విశాల రాష్ట్ర ఉద్యోగులు అందరికీ ఒకే తీరు వర్తించేటట్లు చూడబడుతుంది.

రాష్ట్రంలోని ఆర్థిక వనరులను బట్టి ఖర్చుని కేటాయించడం కూడా రాష్ట్ర ప్రభుత్వం, శాసనసభల అధికారంలోని వ్యవహారం. అయితే కేంద్రీయ సాధారణ పరిపాలన వ్యవహారాలకు సంబంధించిన కొత్త రాష్ట్రం ఖర్చులను రెండు ప్రాంతాల మధ్య నిష్పత్తి ప్రకారం భరించి, తెలంగాణా ఆదాయంలోని మిగులును తెలంగాణా అభివృద్ధికి కేటాయించాలని ఆంధ్ర, తెలంగాణా ప్రాంతాల ప్రతినిధులు అంగీకరించి ఉన్నారు. కాబట్టి బడ్జెటు కేటాయింపుల విషయంలో ఆ ఒప్పందాన్ని ప్రభుత్వం పాటించవచ్చు. ముఖ్యంగా ఈ ఒప్పందం గురించిన అంశాన్ని ఆంధ్ర ముఖ్యమంత్రి దృష్టికి తేవాలని భారత ప్రభుత్వం ఉద్దేశిస్తున్నది. ఇది అమలుపరచబడాలని కూడా భారతప్రభుత్వం ఆశాభావం వ్యక్తపరుస్తున్నది. ఈ పత్రాన్ని హైదరాబాద్ ముఖ్యమంత్రి

డా॥ బి. రామకృష్ణారావు సంతకంతో 1956 ఆగష్టు 14వ తేదీన హైదరాబాద్ ప్రభుత్వం విడుదల చేసింది.

నోటు:

పై ఒప్పంద పత్రంలోని అంశాలు: 2, 3, 7, 8, 10, 11 ఆంధ్రప్రదేశ్ రీజనల్ కమిటీ ఆర్డర్‌లో చేర్చబడినవి. 9 ఇండియా రాజ్యాంగ ఆర్టికల్ 371లో చేర్చబడినది.

రక్షణలు 9, 6 ఆంధ్రప్రదేశ్ రీజనల్ కమిటీ ఆర్డర్ 1956లో చేర్చబడినవి.

6 బి. డొమెస్టిక్ రూల్స్ ఆఫ్ స్టేటు గవర్నమెంటు (స్టేటు ప్రభుత్వపు ముల్కీ నియమము) రీజనల్ కమిటీ ఆర్డరు 1958లో చేర్చబడినది.

మిగిలిపోయిన అంశాలు 'పెద్దమనుషుల' ఒప్పందంగా అంగీకరించబడినవి.

'ఈ అంశాలు ఏది రాజ్యాంగబద్ధమో, ఏది కాదో నిర్ణయించడానికి మీకు ఒక న్యాయశాస్త్రవేత్తను సహాయం ఇస్తాను. అతని సలహాతో ఆ నిర్ణయం కూడా చేసి తీసుకోండి' అని శ్రీ గోవింద్ వల్లభ్ పంత్ (కేంద్ర హోంమంత్రి) రెండు పక్షాల నాయకులను ఆదేశించారు. ఈ పని తెలంగాణా నాయకులకు వదిలిపెట్టి ఆంధ్ర నాయకులు కర్నూలు వెళ్ళిపోయారు. అప్పట్లో ఈ బిల్లును 'ఆంధ్ర-తెలంగాణాప్రదేశ్' బిల్లుగా పార్లమెంట్‌లో శ్రీ పంత్ ప్రవేశపెట్టారు. ఒక సభ్యుని సూచనపై రాష్ట్రం పేరు 'ఆంధ్రప్రదేశ్'గా అంగీకరించబడింది. అప్పటి ఆంధ్ర హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి కోకా సుబ్బారావు హైదరాబాద్ వెళ్ళి రంగారెడ్డిని ఒకే హైకోర్టు ఉంచాలని ఒప్పించారు. ఉర్దూ తెలిసిన జడ్జీల బెంచి పెట్టుకుందామని సలహా ఇస్తే రంగారెడ్డి అంగీకరించారు. అప్పుడు ఆంధ్ర హైకోర్టు, తెలంగాణా హైకోర్టు కలిపి ఒకే హైకోర్టుగా ఏర్పడింది.

1955 ఏప్రిల్‌లో ఈ బిల్లు తీర్మానాన్ని కర్నూలు శాసనసభలో ప్రవేశపెట్టారు. శాసనసభ కొన్ని సవరణలతో ఆ తీర్మానాన్ని ఆమోదించింది. కొత్త రాష్ట్రం పేరు ఆంధ్రప్రదేశ్ అని ఉండాలి. రాజధాని, హైకోర్టు హైదరాబాద్‌లోనే ఉండాలి. రాబోయే 1957 శాసనసభ ఎన్నికలు ఒక్క తెలంగాణా ప్రాంతానికే వర్తిస్తాయి. ఆంధ్రప్రదేశ్ అంతటికి 1962లోనే ఎన్నికలు జరగాలి. 72 సభ్యులతో ఎగువ సభ ఉండాలి. ఇవి

కొన్ని సవరణలు.

1956 ఏప్రిల్ 13న హైదరాబాద్ శాసనసభ ఈ బిల్లును ఆమోదించింది. ఆగస్టు 31న రాష్ట్రపతి ఆమోదం లభించింది.

ఆంధ్రప్రదేశ్ శాసన సభ్యుల సంఖ్య 301గా నిర్ణయించబడింది. అయితే ఆంధ్రప్రదేశ్ ఏర్పడినప్పుడు ఆంధ్రశాసన సభ్యుల సంఖ్య 196 మంది. హైదరాబాద్ శాసనసభలోని తెలంగాణా సభ్యులు 101 మంది. మొత్తం 297 మందితో ఆంధ్రప్రదేశ్ శాసన సభ ప్రారంభమయింది. ❑

3. ఆంధ్రప్రదేశ్ అవతరణ

ప్రధాని నెహ్రూ 1956 నవంబరు 1వ తేదీన ఆంధ్రప్రదేశ్ నూతన రాష్ట్రానికి ప్రారంభోత్సవం చేశారు.

ఆంధ్రప్రదేశ్ ఏర్పడుతుండగానే మంత్రివర్గానికి ఎవరు నాయకుడని ప్రశ్న వచ్చింది. ప్రకాశం పంతులు తిరిగి మంత్రివర్గానికి నాయకుడు కావాలనే అభిప్రాయం కొంతమందికి ఉన్నప్పటికీ అనేక కారణాలవల్ల అది సర్వత్రా అంగీకారం కాలేకపోయింది. అప్పటికే ఆయన చాలా వృద్ధుడైపోయినందువల్ల ఆయన కూడా ఆ విషయంలో అంతగా ఆసక్తి చూపించలేదు. ఆంధ్రప్రాంతం నుండి బెజవాడ గోపాలరెడ్డి, నీలం సంజీవరెడ్డి బరిలో దిగారు. అయితే వారిరువురు రామకృష్ణారావు నాయకుడుగా నిలవదలిస్తే తమ పోటీని వదులుకోవడానికి సంసిద్ధత ప్రకటించారు. పోటీ లేకుండా ఉంటే రామకృష్ణరావు సంసిద్ధత ప్రకటించారు. రామకృష్ణరావుకు పూర్తిగా ప్రతికూలంగా ఉండటమే కాకుండా ఆయనకు ఎవరు పోటీ లేకపోతే తానైనా పోటీ చేస్తాను కానీ, ఏకగ్రీవంగా ఆయనను ఎన్నిక కానివ్వనని డా॥ ఎం. చెన్నారెడ్డి ప్రతిజ్ఞ చేశారు. ఇక రంగంలో మిగిలింది గోపాల సంజీవరెడ్లు.

ఒక ఆంధ్రరాష్ట్రమే అయితే పోటీ ఎలా ఉండేదో తెలియదు. గోపాలరెడ్డి, సంజీవరెడ్డి బలా బలాలు తులతూగేవేమో! ఆంధ్రప్రదేశ్ నిర్మాణంతో తొమ్మిది జిల్లాల తెలంగాణా ఒక కొత్త శక్తిగా రూపొందింది. తెలంగాణా రెడ్లు ఎటువైపు మొగ్గితే అటు వైపు గెలుపు తథ్యం. ఆ రెడ్లకి నాయకుడు కొండా వెంకటరంగారెడ్డి. ఆయన అనుయాయులు మర్రి చెన్నారెడ్డి, వెలమ నాయకుడైన జె.వి. నరసింగరావు. రంగారెడ్డి అభిప్రాయమేమంటే అద్దరి రెడ్లు ఇద్దరు పోటీ పడుతుండగా ఇద్దరి వాళ్ళం తటస్థంగా ఉండాలి. గెలుపు ఇష్టం ఉన్నవారు మన దగ్గరికి వస్తారు. అప్పుడు వారు మన మాట వినక తప్పదు. ఆ మాట చెన్నారెడ్డికి గాని, నరసింగరావుకు కాని నచ్చలేదు.

తెలంగాణాలో తెలంగాణా వాదులని విశాలాంధ్ర వాదులని రెండు వర్గాలవారు ఉన్నారు. తెలంగాణావారికి నాయకుడు కొండా వెంకటరంగారెడ్డి. విశాలాంధ్ర వాదులలో ప్రముఖుడు వల్లూరి బసవరాజు. ఆయన కేవలం రాజధాని రాజకీయవేత్త. రంగారెడ్డికి తెలంగాణా గ్రామాలలో ఉన్న జనబలం ఈయనకు లేదు. కానీ తెలంగాణా అంటే హైదరాబాద్, సికిందరాబాద్ నగరాలేనన్న దశను ఆ ప్రాంతం అనుభవిస్తు న్నందుకు రాచరికం చేయగలిగాడు రాజు.

బ్రహ్మాండమైన ప్రచారం జరిగింది. ఇటువంటి పరిస్థితులలో ఆంధ్ర, తెలంగాణా సభ్యులంతా కర్నూలులో సమావేశమైనారు. సభా కార్యక్రమ పర్యవేక్షణకు కాంగ్రెస్ కార్యదర్శి శ్రీమన్నారాయణ హైకమాండ్ నుంచి వచ్చారు. తెలంగాణా నుండి రంగారెడ్డి అస్వస్థతగా ఉండి సభకు హాజరుకాలేదు. తనకున్న కొద్దిమందితో చెన్నారెడ్డి వెళ్ళారు. నర్సింగరావు, రామకృష్ణరావు గ్రూపులు సంజీవరెడ్డికి ఓటు వేశారు. ఆంధ్రప్రదేశ్ కాంగ్రెస్ శాసనసభా పక్షనాయకుడుగ సంజీవరెడ్డి ఎన్నికైనారు. విశాలాంధ్రకు తొలి ముఖ్యమంత్రి అనిపించుకున్నారు. పోటీ చేసిన గోపాలరెడ్డి వెంటనే కాకపోయినా సంజీవరెడ్డి మంత్రివర్గంలో చేరినాడు. సహాయం చేసిన రామకృష్ణరావు కేరళ గవర్నరుగా పదవిని స్వీకరించి ఆంధ్రప్రదేశ్ రాజకీయాలతో సంబంధం వదులుకున్నారు. వ్యతిరేకించిన చెన్నారెడ్డి మాత్రం పదవిలేకుండా మిగిలిపోయాడు. సంజీవరెడ్డి మంత్రివర్గంలో కొండా వెంకటరంగారెడ్డి, వి.బి.రాజు, జె.వి. నరసింగరావు, మెహదీ నవాజ్‌జంగ్, మందుముల నరసింగరావు తెలంగాణా మంత్రులు. పెద్దమనుషుల ఒడంబడిక ప్రకారం మంత్రివర్గంలో మూడు, రెండు నిష్పత్తిలో ఆంధ్ర, తెలంగాణా వారు పదవులు పంచుకోవాలి. కాని తెలంగాణాలో వున్న మూడు వర్గాలను దగ్గరకు తీసుకుని అయిదు మంత్రిపదవులు మాత్రమే ఇచ్చారు. ఆరవ పదవిని పొందవలసిన నూకల రామచంద్రారెడ్డికి ప్రదేశ్ కాంగ్రెస్ కార్యదర్శి పదవి ఇచ్చారు.

ఇలాంటి రాజకీయవేత్తల నిలయంగా ఉన్న తెలంగాణాలో నీలం, అల్లూరి ద్వయం చక్కని పద్మవ్యూహాలు పన్నారు. విశాలాంధ్ర వాదులను చేతిలో వుంచుకొని తెలంగాణా వాదులను చీల గొట్టారు. విశాలాంధ్ర అవతరణ సమయంలో తెలంగాణాతో చేసుకున్న పెద్దమనుషుల ఒడంబడిక ప్రకారం ఉపముఖ్యమంత్రి తెలంగాణా వారికి ఇవ్వాలి. కాని ఇది ఎవరికి దక్కుతుందనే విషయంలో తెలంగాణా

నాయకుల మధ్య ఉన్న ఆశలని, అనుమానలని చక్కగా వినియోగించుకున్నారు. ఉపముఖ్యమంత్రి పదవి అనేది నిరుపయోగమైన ఆరవ వేలు వంటిదన్నారు. ఆంధ్ర, తెలంగాణా భావసమైక్యతకు ఇది తొలిసోపానంగా చిత్రించారు.

తెలంగాణా అభివృద్ధికి విడిగా అభివృద్ధి అవసరమని తెలంగాణావారు కోరగా, విడి సంస్థ అనేది అవరోధమే కానీ, అసలు పని జరుగ నివ్వదని రాయలసీమ ప్రతినిధిగా ఉమ్మడి మద్రాసు రాష్ట్రంలో తాను పొందిన అనుభవాన్ని సంజీవరెడ్డి ఉదాహరించారు. ఈ విధంగా ఆంధ్రరాష్ట్ర నిర్మాణ సమయంలో శ్రీబాగ్ ఒడంబడికను పట్టుదలగా అమలు జరిపించుకున్న రాయలసీమ నాయకుడైన సంజీవరెడ్డి తెలంగాణాతో జరిగిన పెద్దమనుషుల ఒప్పందం అమలు అనవసరమన్నాడు. ఈ పరిణామాలన్నిటిలోను నీలం-అల్లూరి నాయకత్వం ఏకంగా వ్యవహరించింది. మరాట్వాడ, కర్నాటక ప్రాంతాలు తమ నుండి విడిపోయినప్పటికీ అంతకంటే విశాలమైన ఆంధ్రప్రదేశ్‌కు హైదరాబాద్ రాజధాని అయింది.

గాంధీభవనంలో నెహ్రూ ప్రసంగం:

ప్రధానమంత్రి నెహ్రూ నగరానికి విచ్చేసిన కొద్ది సేపటికే గాంధీభవన్ హాలులో కాంగ్రెసు శాసనసభ్యుల, కార్యకర్తల సమావేశంలో ప్రసంగించారు. ప్రధాని తన ప్రసంగంలో– ఈ ఉదయం నుంచీ భారతదేశ పటంలో వచ్చిన మార్పులను ప్రస్తావించి, ఒక విధంగా చాలా గొప్ప మార్పు హైదరాబాద్‌లో వచ్చిన మార్పు అన్నారు. హైదరాబాద్‌లో వచ్చిన మార్పు కేవలం రాజకీయమైనదే కాదు, అది మానసిక మైన మార్పు కూడా. ఎందుచేతనంటే భారతదేశ పటం నుంచి ఒక సంస్థానం అదృశ్యమైపోయింది. హైదరాబాద్ రాష్ట్రం మూడు ప్రాంతాలుగా విభాజితమై, వాటిలోనుంచి ఒక ప్రాంతం ఆంధ్రరాష్ట్రంలో విలీనమైపోయింది. దేశంలో వస్తున్న గొప్ప మార్పులకు ఇది ఒక తార్కాణం.

మిశ్రమ సంస్కృతి:

హైదరాబాద్ ప్రజలు ఒక ప్రత్యేక సంస్కృతిని రూపొందించుకున్నారు. ఇతర సంస్కృతులవలెనే దీనిలో కూడా మంచీ, చెడూ ఉన్నవి. నవభారతంలో పాతకాలపు 'దర్బారీ' సంప్రదాయాలకు తావులేదు. క్రమేణా ఆ సంప్రదాయాలకు బదులు నూతన

పరిస్థితులకు అనుగుణమైన పద్ధతులను మనం అనుసరించాలి. అయితే హైదరాబాద్‌లో కొంత మంచి కూడా ఉన్నది. దానిని ఏ విధంగానైనా చివరకు ఒత్తిడితోనైనా మార్చకూడదు. హైదరాబాద్ మిశ్రమ సంస్కృతిని ఇలాగే ఉండేటట్లు చూడాలి. దానివల్ల ఆంధ్రులకు కూడా మేలు కలుగుతుందని ప్రధాని అన్నారు.

ఆంధ్రప్రదేశ్‌లో తెలంగాణాకు ప్రముఖ స్థానం ఉండాలని ప్రధాని అన్నారు. ఆంధ్రకు తెలంగాణాకు సామరస్యం ఏర్పడాలి. ఉభయ ప్రాంతాలు సహనంతో సద్భావనతో వ్యవహరించాలి. ఒకరు మరొకరిపై ఒత్తిడి తేకూడదు. చారిత్రాత్మకమైన ఫతేమైదానం (ఎల్.బి.స్టేడియం)లో ప్రధానమంత్రి నూతన రాష్ట్రానికి ప్రారంభోత్సవం చేశారు. నెహ్రూ హిందూస్థానీలో మాట్లాడారు. కోస్తా, రాయలసీమ నుంచి వచ్చిన వేలాది జనానికి అర్థంకాలేదు. రామకృష్ణరావు తెలుగులోకి అనువదించాడు. సభలో అలజడి తగ్గింది. ఆయన రాష్ట్రం విడిచి పెట్టడంతో రెండు భాగాల మధ్య ద్విభాషి అయినాడు. ఉభయులు ఒకర్ని ఒకరు అర్థం చేసుకోవడం కష్టసాధ్యమైనది.

ప్రభుత్వ కార్యాలయాలు, హైకోర్టు, జనరల్ హాస్పిటల్స్, శాసనసభా భవనము మొదలైన హంగులతో, సుమారు 96 చదరపు మైళ్ళుగల హైదరాబాద్ నగరం ఆంధ్రులకు రాజధానిగా లభించింది. తెలంగాణాలో వున్న అజంజాహీ మిల్స్, సిర్పూరు పేపరు మిల్స్, సిర్‌సిల్క్, బోధన్ పంచదార కర్మాగారం, సింగరేణి, బెల్లంపల్లి బొగ్గుగనులు, ప్రాగాటూల్స్, సికింద్రాబాద్ రైల్వే కర్మాగారం ఇండియాలోనే కాదు ఆసియా ఖండంలోనే ముఖ్యమైనవి. మద్రాసు నుంచి తరలి వచ్చిన తరువాత రాజధాని విషయమై తగాదాలు, సాధక బాధకాలు మనమనుభవించినవే.

సంజీవరెడ్డి మొదటి పాలన:

ఆంధ్రప్రజల చిరకాల వాంఛ అయిన విశాలాంధ్రావతరణ నెరవేరడంతో చాలాకాలంగా నిర్లక్ష్యం చేయబడిన ఆంధ్రభాషా సంస్కృతులు వర్ధిల్లగలవని, ఆవిధంగా వర్ధిల్లడానికి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం అన్నివిధాలా దోహదం చేయగలదని ఆంధ్రులంతా ముఖ్యంగా తెలంగాణా ప్రజలు వాంఛించారు. విశాలమైన తీరప్రాంతం, కృష్ణా–గోదావరీ నదీ నదాలు, తెలంగాణా ప్రాంతంలో గల పారిశ్రామిక వనరులు, రాయలసీమలోని ఖనిజాలు ఇవన్నీ కలిసి ఆంధ్రజాతిని సుసంపన్నంగా చేయగలవని

ఆశించారు. ప్రణాళికాబద్ధమైన అభివృద్ధికి ఆంధ్రనాయకత్వం కృషి చేయగలదని ఆశించారు.

సంజీవరెడ్డి ముఖ్యమంత్రిగా ఆంధ్రప్రదేశ్ నెలకొనగానే ఒక సంవత్సరకాలం సిబ్బంది తరలింపు, కాగితాలు వెతుక్కోవటంతో సరిపోయింది. తరువాత శాసనాలు, చట్టాలు ఇవన్నీ సమన్యాయం కావటం అలా వుంచీ, ఆంధ్ర–తెలంగాణా అనే భేదాలు ప్రభుత్వ పరంగా అధికమయ్యాయి. ఆంధ్రప్రాంతానికి తెలంగాణా అనుబంధం అని పేర్కొనడం చేత ప్రభుత్వ తతంగమంతా ఆంధ్రప్రొసీజరు ప్రకారం నడవాలని, తెలంగాణా కేవలం అనుబంధం కాబట్టి తెలంగాణా ప్రొసీజరు గురించి ఆలోచించ నవసరం లేదని ప్రభుత్వ అధికారులు అభిప్రాయపడ్డారు. ఆంధ్రప్రొసీజరు అంటే మద్రాసు ప్రొసీజరు అన్నమాట. ముఖ్యంగా టాటన్‌హోమ్ ప్రొసీజరు అని పేరు పడ్డ వ్యవహారకాండ. దానిని అనుసరించవలసిందని ఆంధ్రప్రభుత్వం నిర్ణయించింది. అదివరకు హైదరాబాద్‌లో బొంబాయి పద్ధతి అమల్లో ఉండేది. ఒకటి సవ్యం, ఇంకొకటి అపసవ్యం. ఈ సవ్యాపసవ్యాల సామరస్యం కుదరలేదు. పైగా ఈ టాటన్‌హోమ్ కోర్టు కాపీలు అచ్చులో లేవు. అది ఎట్టిదో కూడా తెలంగాణా వారికి కలలో కూడా తెలియదు. వెంటనే ప్రారంభించారు కర్నూలు వారు. గవర్నరు నుంచి బంట్రోతు వరకు తెలంగాణా వారికి పని రాదనీ వీరు సోమరులని అన్నారు. ప్రభుత్వానికి కీలకమైన ఉద్యోగస్థుల మధ్య రాజీ కుదరలేదు. మనం–మనం అనే భావం ఆదిలోనే కలగలేదు. కర్నూలువారి జులుం హైదరాబాద్ వారికి నచ్చలేదు. హైదరాబాద్ వారి బడాయి కర్నూలు వారికి గిట్టలేదు.

1957లో తెలంగాణా ప్రాంతానికి మాత్రమే శాసనసభ ఎన్నికలు జరిగాయి. 1956 పెద్దమనుషుల ఒప్పందం ప్రకారం హైదరాబాద్ ప్రొవిన్షియల్ కాంగ్రెసు కమిటీ 1962 దాకా విడిగా కొనసాగాలి. ఆ ఒప్పందంవల్ల తెలంగాణా ప్రాంతంలో 1957 ఎన్నికలకు అభ్యర్థుల ఎంపిక చేసే విషయంలో తెలంగాణా కాంగ్రెసు నాయకులపై ఆంధ్ర కాంగ్రెసు నాయకుల ప్రభావం, పెత్తనం లేకుండా ఉండటానికి వీలుంటుందని భావించారు. 1957 ఎన్నికలు ముగిసిన తరువాత ఇప్పటి వరకు విడిగా ఉన్న హైదరాబాద్ ప్రొవిన్షియల్ కాంగ్రెసు కమిటీ, ఆంధ్ర ప్రొవిన్షియల్ కాంగ్రెస్‌లో విలీనం కావాలా వద్దా అనే సమస్య తలెత్తింది. కాంగ్రెసు హైకమాండ్

రాష్ట్రంలో మొత్తానికి ఒకే కాంగ్రెస్ ఉంటే బాగుంటుందని సలహా ఇచ్చింది. హైదరాబాద్ కమిటీ దీనిని అంగీకరించింది.

1957 ఎన్నికల తర్వాత సంజీవరెడ్డి తిరిగి ముఖ్యమంత్రి అయ్యారు. 1957లో లెజిస్లేటివ్ కౌన్సిల్ ఏర్పడింది. కథనాయకుడుగా ముఖ్యమంత్రి సంజీవరెడ్డి బలపడుతుండగా ఉపనాయకుడుగా అల్లూరి సంస్థా స్థాయిలో ప్రదేశ్ కాంగ్రెస్ అధ్యక్షులుగా స్థిరపడిపోయారు. కానీ అఖిల భారత కాంగ్రెసు అధ్యక్షుడు యు.ఎన్.ఢేబర్ తన కార్యదర్శిగా మాధవన్ నాయర్ స్థానంలో అల్లూరిని నియమించడంతో ఆంధ్ర రాజకీయాలలో కొత్తఘట్టం ప్రారంభమైంది. ఇక్కడి నుంచే నీలం–అల్లూరి తగాదాలు ప్రముఖంగా తలెత్తాయి. సంజీవరెడ్డి పరిపాలన మూడు సంవత్సరాల రెండు మాసాలు కొనసాగింది. అటు తర్వాత ఆయన అఖిల భారత కాంగ్రెసు అధ్యక్షుడుగా ఢిల్లీ వెళ్ళిపోయారు.

సత్యనారాయణరాజు ముఖ్యమంత్రి కావాలనుకోవడం తప్పులేదు. అందుకు అర్హుడు కూడా. సత్యనారాయణరాజు ఆకర్షణీయమైన వ్యక్తి, సమర్థుడు, ప్రచార దక్షుడు. హిందీ క్షుణ్ణంగా తెలిసినవాడు. రాహుల్ సాంకృత్యాయన్ హిందీలో రచించిన 'ఓల్గా నుంచి గంగా వరకు' అనే గ్రంథాన్ని తెలుగులోకి అనువదించాడు. అంతవరకు 'సత్యం' సంజీవరెడ్డికి ఆప్తమిత్రుడు. అధిష్ఠానవర్గంలో సంజీవరెడ్డి పేరు ప్రతిష్ఠలు ప్రచారం చేసినవాడు. కానీ తన 'ఆప్తమిత్రుడు' ఆశని సంజీవరెడ్డి వ్యతిరేకించాడు. మిత్రుల మధ్య వైరుధ్యం ప్రారంభమైంది. బ్రహ్మానందరెడ్డికి ముఖ్యమంత్రి పదవి అంటగట్టాలనే ఆశతో ఉన్నాడు సంజీవరెడ్డి. సంజీవరెడ్డి ఏ ప్రయత్నం చేసినా దాన్ని భగ్నం చేయాలని కంకణం కట్టుకున్నాడు అల్లూరి. వీలైతే కేరళ గవర్నరుగా ఉన్న రామకృష్ణరావుని రంగంలో దించాలని ప్రయత్నించాడు.

రామకృష్ణరావుతో అప్పటికప్పుడే దేబర్ సంప్రదించాడు. మొదట్లో సంజీవరెడ్డి, గోపాలరెడ్లు కదా ఈ పదవికి పోటీపడినారు. గోపాలరెడ్డిని పిలిపిస్తే మంచిదని సలహా ఇచ్చారు. తను రాష్ట్రరాజకీయాలలోకి రానని రామకృష్ణరావు స్పష్టంగా చెప్పాడు. గోపాలరెడ్డి కూడా ఉత్సాహం ప్రకటించలేదు. పరిపాలనానుభవంలేని సత్యనారాయణ రాజు మంత్రిగా ఉంటేనే బాగు. ముఖ్యమంత్రిగా తగడని అభిప్రాయం వెల్లడైంది.

తత్కారణంగా తన తరఫున సంజీవయ్య, పట్టాభిరామారావులని ప్రచారంలోకి తెచ్చాడు రాజు.

ఏమైనా ముఖ్యమంత్రి వ్యవహారాన్ని సంజీవరెడ్డి క్లిష్టతరం చేశాడు. దీనితో సంజీవరెడ్డి వ్యతిరేకులు చివరకు ఒక్క సారిగా విజృంభించారు. అల్లూరిని ముఖ్యమంత్రిగా సూచించారు. అల్లూరిని కాదంటూ సంజీవయ్య ముఖ్యమంత్రిగా ఉండటానికి అంగీకరించారు. ముఖ్యమంత్రి పదవిలో సంజీవయ్య ఉన్నా అల్లూరి ప్రధాన కథానాయకుడుగా మార్పు చెందాడు.

సంజీవరెడ్డి అఖిల భారత కాంగ్రెసు అధ్యక్షపదవి స్వీకరించినా ఆయన మనస్సు రాష్ట్ర రాజకీయాలలోనే లగ్నమై ఉంది. తను ఉన్నత పదవిలో ఉన్నా ఆ పదవి కంటే శాసన సభ్యత్వమే మిన్న అని భావించాడు. కాంగ్రెసు సంస్థలో పదవులు నిర్వహించే వారు, శాసనసభ పదవులు వదులుకోవాలనే నిబంధన ఉంది. ప్రదేశ్ కాంగ్రెస్ అధ్యక్షుడు కాగానే అల్లూరి రాజ్యసభ సభ్యత్వం వదులుకున్నాడు కానీ, సంజీవరెడ్డి మాత్రం చివరి వరకూ ఆంధ్రప్రదేశ్ శాసన సభలో కాళహస్తి ప్రతినిధిగానే ఉన్నాడు.

ముఖ్యమంత్రిగా సంజీవయ్య:

సంజీవరెడ్డి అఖిల భారత కాంగ్రెసు కమిటీ అధ్యక్షుడుగా వెళ్ళిన తరువాత ఆంధ్రప్రదేశ్ రెండవ ముఖ్యమంత్రిగా దామోదరం సంజీవయ్య 1960 జనవరి 10వ తేదీన ప్రమాణ స్వీకారం చేశాడు. ముప్పయ్ ఎనమిదేళ్ళ చిన్న వయస్సులో సంజీవయ్య ముఖ్యమంత్రి అయ్యాడు. మనదేశంలో ఆయనే మొదటి హరిజన ముఖ్యమంత్రి. సంజీవయ్య మంత్రివర్గ నిర్మాణంలో తగాదా కనిపించలేదు. నలుగురు అనుకున్నవారే మంత్రులుగా వచ్చారు. తెలంగాణా సీనియర్ నాయకుడు కొండా వెంకటరంగారెడ్డికి ఉప ముఖ్యమంత్రి పదవి లభించింది. మరో తెలంగాణా నాయకుడు నూకల నరోత్తమ రెడ్డికి ప్రదేశ్ కాంగ్రెస్ అధ్యక్ష పదవి లభించింది.

ప్రదేశ్ కాంగ్రెస్ అధ్యక్షుడుగా నూకల నరోత్తమరెడ్డిని ఏకగ్రీవంగా ఎన్నిక చేసుకోవడంతో రాజకీయాలలో కొత్త రవరవలు బయలుదేరాయి. తెలంగాణాకు ప్రదేశ్ కాంగ్రెస్ అధ్యక్ష పదవి అంటూ అల్లూరి చేసిన వాదన సర్కారు జిల్లాలలో అసంతృప్తిని

తెచ్చింది. ఆనాడు రాయలసీమ నాయకులను పెంచి అన్యాయం చేశారు. ఈనాడు తెలంగాణా నాయకులను పెంచి తమ స్వప్రయోజనాలను చూసుకుంటూ సర్కార్లలో మిగిలి ఉన్న నాయకులకు అవకాశాలు తగ్గిస్తున్నారనే విమర్శలకు అల్లూరి గురి అయ్యాడు. తెలంగాణాలో తన ప్రతినిధి ప్రదేశ్ కాంగ్రెస్ అధ్యక్షుడయ్యాడనే సంతృప్తి, సంతోషం కలిగించలేదు. నూకల రామచంద్రారెడ్డి మంత్రి అయిన తరువాత ఆయన సోదరుడు నరోత్తమరెడ్డినే ప్రదేశ్ కాంగ్రెస్ అధ్యక్ష పదవి ఎందుకు ఎంచుకో వలసి వచ్చిందని తెలంగాణా నాయకులే ప్రశ్నించారు. ఇప్పుడేమో జె.వి.ని. విస్మరించి తెలంగాణా రాజకీయాల్లో సంజీవరెడ్డి చేసిన తప్పులను, మరొక రూపంలో అల్లూరి చేస్తున్నాడనే నింద వచ్చింది. అది సర్కారు జిల్లాలలో కేంద్రీకృతమైనది. ఈ గొడవల్లో పడి నరోత్తమరెడ్డి కాంగ్రెస్ అధ్యక్ష పదవికి రాజీనామా చేయవలసి వచ్చింది. ఉభయులకు రాజీగా మల్లిపూడి పళ్లంరాజు కాంగ్రెస్ అధ్యక్షులయ్యారు.

వరుసగా అల్లూరి చేస్తున్న తప్పులవలన సంజీవయ్య బలపడుతూ వచ్చాడు. సంజీవయ్య, అల్లూరి మధ్య ఏకాభిప్రాయం లేదన్న వాతావరణం ఏర్పడింది. సంజీవయ్య స్వతంత్ర శక్తిగా నిలబడ్డాడు. సంజీవయ్య స్వతహాగా సమర్థుడు. జన్మించింది హరిజన కుటుంబంలో. యుక్త వయస్సు వచ్చేవరకూ అష్టకష్టాలు అనుభవించాడు. అదృష్టం కలిసి వచ్చి రాజాజీ పుణ్యమా అని. వరుసగా రాజాజీ, ప్రకాశం, గోపాలరెడ్డి, సంజీవరెడ్డి మంత్రి వర్గాలలో మంత్రిగా పదేళ్ళు ఉన్న ఆయన ఎంత నివురు కప్పిన నిప్పో ఎంతోమందికి తెలియదు. సంజీవయ్య విజృంభించడం మొదలుపెట్టగానే వారూ వీరూ కలిసి పద్మవ్యూహం పన్నుకుంటూ వచ్చారు. శాసనసభ ఎన్నికలకు ముందే తను ముఖ్యమంత్రి పదవికి పోటీ చేస్తానని సంజీవయ్య ప్రకటించారు. ఇక అక్కడినుంచి ప్రారంభమైనాయి కాంగ్రెస్ అధిష్టాన వర్గం ఆదేశాలు.

అఖిల భారత కాంగ్రెస్ అధ్యక్షులుగా సంజీవరెడ్డి, మరి ఎనిమిది నెలలు ఉండవలసిన అవకాశం ఉన్నది. అవసరమైతే మరొకసారి ఆయననే అధ్యక్షులుగా ఎన్నుకొనడానికి అడ్డంకి లేదు. కాని కాంగ్రెసు అధిష్ఠాన వర్గానికి అలాంటి యోచనలు రాలేదు. ఆయనను తమ మధ్య ఉంచుకునే అవసరమూ కనిపించలేదు. కాంగ్రెసు అధ్యక్షుడు ముఖ్యమంత్రి పదవిని స్వీకరించదలచినప్పుడు ఏకగ్రీవంగా ఎన్నుకోవడం

అవసరం అనే వాదన చేసింది. అఖిల భారత కాంగ్రెస్ అధ్యక్షుని హోదాలో సంజీవరెడ్డి ఆంధ్రప్రదేశ్ శాసనసభా కాంగ్రెస్ పక్షం నాయకుడుగా ఏకగ్రీవంగా ఎన్నికయ్యే వాతావరణాన్ని సృష్టించింది. కేవలం సంజీవరెడ్డిని ముఖ్యమంత్రిగా చేయాలన్న తలంపుతోనే ఎన్నికలలో అభ్యర్థులను ఖరారు చేసింది. 1962 ఎన్నికల్లో కాంగ్రెసు పార్టీ అంతఃకలహాల వలన 50 సీట్లను పోగొట్టుకుంది. కమ్యూనిస్టులు 51 స్థానాలలో విజయం సాధించారు.

ఇక తెలంగాణాలో కాంగ్రెసు బలం పెరగకపోగా తగ్గిపోయింది. 1957 ఎన్నికలలో ఆ పార్టీ ఆ ప్రాంతంలో 68 స్థానాలు గెలుచుకోగా ఈసారి 62కి మించి రాలేదు. కమ్యూనిస్టుల కంచుకోటలైన ఖమ్మం, నల్లగొండ మొదలైన జిల్లాలలో పాగా వేశామని కాంగ్రెసువారు చేసిన ప్రచారాలు పటాపంచలై పోయాయి. పైగా వరంగల్‌లో క్రితంసారి 14 స్థానాలు గెలుచుకోగా ఈసారి 7 కన్న ఎక్కువ రాలేదు. కాకపోతే ఖమ్మంలో ఒక సీటు, మెదక్‌లో 2, కరీంనగర్‌లో 3 అధికంగా గెలుచుకొన్నది. హైదరాబాద్‌లో ఒకటి, ఆదిలాబాద్‌లో రెండు స్థానాలను ఆ పార్టీ కోల్పోయింది. ఉపముఖ్యమంత్రి కొండా వెంకటరంగారెడ్డి, మంత్రులు– కొండా లక్ష్మణ్ బాపూజీ, శ్రీమతి మాసుమా బేగం, మాజీ మంత్రి జె.వి. నరసింగరావు, తెలంగాణా ప్రాంతీయ అభివృద్ధి సంఘం అధ్యక్షుడు అచ్యుతరెడ్డి, బొమ్మకంటి సత్యనారాయణరావు ప్రభృతులు ఓడిపోయారు. జనసంఘ్‌కు ఒక్క సీటు కూడా రాలేదు.

సంజీవరెడ్డి పునరాగమనం:

1962 ఎన్నికల తరువాత నీలం సంజీవరెడ్డి శాసనసభా కాంగ్రెసు పక్ష నాయకుడుగా ఎన్నికై రెండవసారి రాష్ట్రముఖ్యమంత్రి అయ్యారు. ఐదేళ్ళ తరువాత డా॥ మర్రి చెన్నారెడ్డికి మంత్రివర్గంలో స్థానం లభించింది. సంజీవరెడ్డి ఈసారి గతాని కన్నా విశాల ప్రాతిపదికపై మంత్రివర్గం నిర్మించినా అల్లూరికి స్థానమీయలేదు. సంజీవయ్యకు స్థానమిచ్చినా మంత్రివర్గంలో చేరలేదు. సంజీవయ్య అఖిల భారత కాంగ్రెస్ అధ్యక్షుడుగా ఎన్నిక కావడంతో ఆ కాలంలో మంత్రిర్గంలో విభేదాలు లేవు. చైనా యుద్ధంవలన దేశంలో ప్రకటించిన అత్యవసర పరిస్థితి కూడా తోడైంది. అల్లూరి

సత్యనారాయణ రాజు 1963 సెప్టెంబరు 2వ తేదీన మరణించారు. దానితో ఆంధ్రప్రదేశ్ రాజకీయాలు మరికొంతకాలం సంజీవరెడ్డి తిరుగులేని నాయకత్వంలో నడిచినవి. 1964లో కమ్యూనిస్టు పార్టీ రెండుగా చీలింది.

కర్నూలు జిల్లాలో బస్సు రూట్లను జాతీయం చేసినందుకు బస్సు యజమానులు సుప్రీంకోర్టుకు వెళ్ళి కేసు గెలుచుకున్నారు. నిపుణుల సంఘం తీర్పు ప్రకారం ముందు నెల్లూరు, చిత్తూరు, కడప జిల్లాల బస్సు రూట్లను జాతీయం చేసి కర్నూలు చేపట్టాలి. ముఖ్యమంత్ర వ్యతిరేకులైన పిడతల రంగారెడ్డి విజయభాస్కరరెడ్డి మొదలైన వారి మీద జరిగిన దాడి ఇది అని ఒక విమర్శ. వారి ఫిర్యాదులను సుప్రీంకోర్టు 1964 ఫిబ్రవరి 23న అంగీకరించింది. తప్పు తనమీద వేసుకొని సంజీవరెడ్డి ముఖ్యమంత్రి పదవికి వెంటనే రాజీనామా చేశారు. 1964 మే 27న జాతిరత్నం జవహర్‌లాల్ నెహ్రూ మరణించారు. లాల్ బహాదూర్ శాస్త్రి ప్రధానమంత్రి అయ్యారు.

బ్రహ్మానందీయం:

సంజీవరెడ్డి స్థానంలో కాసు బ్రహ్మానందరెడ్డి 1964 ఫిబ్రవరి 29న రాష్ట్ర ముఖ్యమంత్రి అయ్యారు. సంజీవరెడ్డి మినహా ఆయన మంత్రివర్గ సభ్యులంతా మంత్రులుగా చేరారు. మొదట్లో శాఖల మార్పుకూడా చేయలేదు. నాలుగు నెలల తర్వాత సంజీవరెడ్డి అనుమతిలేకుండా తోట రామస్వామి, చెంచు రామానాయుడు, తానేటి వీరరాఘవులను మంత్రివర్గంలో చేర్చుకున్నాడు.

మన రాష్ట్రంలో అఖిలభారత స్థాయిలో నాయకులైన అవకాశం ఎవరికి లభించినా అందులో స్థానబలం హెచ్చు. తన బలం తక్కువ. అందువలన వీరు ఎంతటి ఉన్నత పదవిలో ఉన్నా రాష్ట్రరాజకీయాలను వదులుకోలేకపోతున్నారు. సంజీవరెడ్డి కూడా ఆ మార్గంలో పయనించినవాడే. ఆ ప్రయత్న ఫలితంగా రాష్ట్రంలో ఒక గ్రూపు అవతరించింది. దీనికి నాయకుడు ఏ.సి. సుబ్బారెడ్డి. స్నేహితులు అతన్ని ప్రోత్సహించారు.

ఏ.సి. సుబ్బారెడ్డిని మంత్రివర్గంలో తీసుకున్నా, ఆయనకు నెల్లూరు జిల్లాలో ప్రత్యర్థిగా చెంచు రామానాయుడుకు మంత్రివర్గంలో స్థానం లభించింది. దీనితో

ఏ.సి. మరింత ఆగ్రహం చెంది ముఠారాజకీయాలను మరింత పెంచారు. మంత్రివర్గం రెండుగా చీలింది. ఈ ముఠా చీలికలు జిల్లాలోని నాయకత్వాన్ని కూడా ప్రభావితం చేశాయి. తెలంగాణా ప్రాంతంలో ఆదినుండే నూకల రామచంద్రారెడ్డికి మర్రి చెన్నారెడ్డికి పడదు. సంజీవరెడ్డి వ్యతిరేకి అయిన చెన్నారెడ్డి, బ్రహ్మానందరెడ్డి వర్గంలో చేరడంతో నూకల సంజీవరెడ్డి వర్గంలో చేరాడు.

1966 జనవరిలో ప్రధాని లాల్ బహాదుర్ శాస్త్రి ఆకస్మికంగా మరణించారు. 19 మాసాల వ్యవధిలోనే కాంగ్రెస్ పార్లమెంటరీ పార్టీకి కొత్త నాయకుని ఎన్నిక అవసరమైనది. శాస్త్రీజీ అంత్యక్రియలకు హాజరైన బ్రహ్మానందరెడ్డి, సంజీవరెడ్డిని సంప్రదించకుండానే ఇతర రాష్ట్రముఖ్యమంత్రులతో చేరి ఇందిరాగాంధీని బలపరిచారు. ప్రధానమంత్రి ఎన్నిక వంటి ముఖ్య విషయంలో తనని ముఖ్యమంత్రి సంప్రదించకపోవడంతో తను ప్రాముఖ్యం కోల్పోతున్నట్లు సంజీవరెడ్డి భావించాడు. బ్రహ్మానందరెడ్డిని అదుపులో పెట్టే ఆలోచనలు మొదలైనాయి.

లాల్‌బహాదూర్ శాస్త్రి మరణానంతరం 1966 జనవరి 19వ తేదీన జరిగిన పోటీలో శ్రీమతి ఇందిరాగాంధీ మురార్జీ దేశాయ్‌ని ఓడించి ప్రధానమంత్రి అయ్యారు. 1967 ఎన్నికలలో అనేక రాష్ట్రాలలో ఓడిపోయిన కాంగ్రెస్ కేంద్రంలో 22 మంది సభ్యుల మెజారిటీతో గెలిచింది. తమిళనాడు, పంజాబు, కేరళ, పశ్చిమ బెంగాల్, ఒరిస్సా, బిహార్, హర్యానా, ఉత్తర ప్రదేశ్, మధ్యప్రదేశ్, కేంద్రపాలిత ప్రాంతమైన ఢిల్లీలో కాంగ్రెసేతర ప్రభుత్వాలు ఏర్పడ్డాయి. కేంద్ర, రాష్ట్రప్రభుత్వాల వ్యవసాయ, ఆహారశాఖల మంత్రులు అందరూ ఓడిపోయారు. ఎన్నికల అనంతరం ఇందిరాగాంధీ తిరిగి ప్రధాని అయ్యారు. మురార్జీదేశాయ్ ఉప ప్రధానమంత్రి పదవిని స్వీకరించారు. సంజీవరెడ్డికి లోక్‌సభ స్పీకరు పదవి లభించింది.

రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ 164 స్థానాలు గెలుచుకుంది. ఎన్నికల తరువాత బ్రహ్మానందరెడ్డి తిరుగులేని నాయకుడయ్యాడు. మంత్రివర్గం ప్రమాణ స్వీకారం చేసిన వారం రోజులలోనే డా॥ ఎం. చెన్నారెడ్డి కేంద్రంలో మంత్రిగా నియమించబడ్డాడు. చెన్నారెడ్డిని రాష్ట్ర రాజకీయాలనుంచి దూరంగా ఉంచడం కోసం ముఖ్యమంత్రే కేంద్రమంత్రి పదవికి సిఫారసు చేశారంటారు. అంతేగాక రాష్ట్రరాజకీయాలలో తన

భవిష్యత్తును దృష్టిలో పెట్టుకుని వి.బి.రాజు పన్నిన వ్యూహమని మరికొందరి అభిప్రాయం.

ఎనబైమూడు సంవత్సరాలు జీవించిన నిజాం మీర్ ఉస్మాన్ అలీఖాన్ 1967 ఫిబ్రవరి 21న స్వర్గస్థుడైనాడు. 1911లో రాజ్యానికొచ్చినాడు. ముప్పయ్ఏడు సంవత్సరాలు సంస్థానాధీశ్వరులలో మేటిగా హైదరాబాద్ రాజ్యం పాలించి, స్వరాజ్యం వచ్చిన తరువాత రాజ్ ప్రముఖ్గా కొన్నాళ్ళు ఉండి, ఆంధ్రప్రదేశ్ అవతరణ తరువాత రాజ్య చిహ్నాలేగాని, అధికారం లేకుండా జీవితం గడిపి హతాశుడై దివంగతుడైనాడు. ఇందిరాజీ తన సంతాప సందేశంలో 'ఒక శకం అంతరించింది' అన్నది. తెలుగుల చరిత్రలో ఇది నిజంగా ఒక శకమే. 1967 లోక్సభ ఎన్నికలలో బ్రహ్మానందరెడ్డి ఇష్టపడినా, అధిష్ఠాన వర్గం బూర్గులకు సికిందరాబాద్ నియోజకవర్గం నుంచి పోటీ చేయడానికి అనుమతించలేదు. ప్రధానమంత్రి ఎన్నికలలో మురార్జీదేశాయ్ని బలపరచినందుకు బూర్గులకు ఈ శిక్ష పడింది. సెప్టెంబరు 15వ తేదీన డా॥ బూర్గుల రామకృష్ణరావు కన్ను మూశాడు. ఆంధ్ర–తెలంగాణా ప్రాంతాలను ఎన్నాళ్ళ తరువాతనో మళ్ళీ కలిపి, సమగ్ర ఆంధ్రప్రదేశ్ స్వరూపం దర్శించి, దర్శింప చేసి, తను రాష్ట్రేతర ఆంధ్రుడుగా కలిసిపోయి, కేరళ గవర్నరుగా ఉత్తర ప్రదేశ్ గవర్నరుగా పనిచేసి అటువారికీ, ఇటు వారికీ దూరమై స్వప్నభంగంలో స్వర్గస్థుడైనాడు. 1968 ఏప్రిల్లో హైదరాబాద్ హైకోర్టు చెన్నారెడ్డి ఎన్నికపై వ్యతిరేక తీర్పు ఇచ్చింది. ఆయన సుప్రీంకోర్టుకు అప్పీలు చేసుకున్నారు.

ఈ ఏడాది అఖిల భారత కాంగ్రెస్ మహాసభలు హైదరాబాద్లో మహావైభవంగా జరిగాయి. అందరి మన్ననలను పొందగలిగాడు బ్రహ్మానందరెడ్డి. దీని ఫలితంగా కాంగ్రెసు కార్యనిర్వాహక వర్గంలో బ్రహ్మానందరెడ్డికి సభ్యత్వం లభించింది. ఆ విధంగా బ్రహ్మానందరెడ్డి అఖిల భారత ఖ్యాతికి వచ్చాడు. 1968 ప్రారంభంలో బ్రహ్మానందరెడ్డి బ్రహ్మాండ నాయకుడు.

ఇంతలో చెన్నారెడ్డి ఎన్నికల పిటిషన్ సుప్రీంకోర్టులో ఆయనకు వ్యతిరేకంగా వచ్చింది. ఆయన తన కేంద్రమంత్రి పదవినే కాక, రాజ్యసభ సభ్యత్వానికి కూడా

రాజీనామా చేయవలసి వచ్చింది. ఈ సందర్భంలో బ్రహ్మానందరెడ్డి సహాయంతో కొంత పోలీసు సాక్ష్యం లభిస్తే తన మీద కేసు నెగ్గేది కాదని ఆయన నమ్మకమైన స్నేహితులంటారు. పత్రికలు కూడా రాసినవి సహాయం లభించలేదని. చెన్నారెడ్డి ఉద్దండ పిండం, రాజకీయ అరణ్యవాసం భరించలేని వ్యక్తి. అటువంటి పరిస్థితులెదురైనప్పుడు ఒకసారి కాంగ్రెసు విడిచి వెళ్ళిపోయాడు. కాంగ్రెసుకు వ్యతిరేకంగా డెమోక్రటిక్ ఫ్రంటు పెట్టాడు. ఏనాటికైనా ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి కాదగిన తెలంగాణ నాయకుడు. తను కోరినట్లు 1956లోనే తెలంగాణా రాష్ట్రం లభించినట్లయితే హైదరాబాద్ ముఖ్యమంత్రి పదవి తప్పకుండా అతనికే దక్కేది. వక్త, ప్రచార దక్షుడు. ఇలాంటి పరిస్థితి వి.బి.రాజుకు ఎదురైనప్పుడు ఆయనకు రోడ్డు రవాణా సంస్థ అధ్యక్షుడుగా ఒక ఉన్నత పదవి నిచ్చి గౌరవించారు. చెన్నారెడ్డికి అటువంటి అవకాశమే బ్రహ్మానందరెడ్డి కల్పించవలసింది. ఆయన 1952లోనే మంత్రిపదవిని పొందాడు.

బెంగుళూరు కాంగ్రెసు సమావేశానంతరం ముఖ్యమంత్రి బ్రహ్మానందరెడ్డి 1969 జూలైలో కొత్తమంత్రి వర్గాన్ని ప్రకటించాడు. నూకల రామచంద్రారెడ్డి, రామభూపాలరెడ్డి చేరలేదు. నూకల నిరాకరణతో ఉపముఖ్యమంత్రి పదవి జె.వి. నరసింగరావుకు లభించింది.

ఎన్నో కష్ట నిష్ఠూరాలను, గడ్డుకాలాన్ని, అగ్నిపరీక్షలను ఎదుర్కొని నెగ్గుకు వచ్చాడు ముఖ్యమంత్రి బ్రహ్మానందరెడ్డి. 1969-70లలో రాష్ట్రానికి ఏర్పడిన గడ్డుకాలాన్ని ఆయన గడుసుతనంగా, సమర్థంగా గట్టెక్కించాడు. ఆనాడు ఆంధ్రప్రదేశ్ విడిపోకుండా ఉండటానికి బ్రహ్మానందరెడ్డి దక్షతే కారణం.

ఢిల్లీ పెద్దమనుషుల ఎదుట చేసిన వాగ్దానం ప్రకారం రాష్ట్ర సుస్థిరతకు భంగం వాటిల్లని పరిస్థితులు ఏర్పడగానే ముఖ్యమంత్రి కాసు బ్రహ్మానందరెడ్డి 1971 సెప్టెంబరు 24వ తేదీన తన పదవికి రాజీనామా చేశారు. ప్రజాస్వామ్య బద్ధంగా ఏర్పడిన ప్రభుత్వాన్ని హింసద్వారా కూల్చివేయడం జరిగింది. చట్టం కాకుండా బలమే అంతిమ నిర్ణయమైంది. రాష్ట్రసమైక్యతకు అమోఘమైన త్యాగంగా బ్రహ్మానందరెడ్డి రాజీనామాను చెప్పుకున్నారు. ఆ విధంగానే ప్రధాని ఇందిరాగాంధీ ప్రకటనలో పేర్కొన్నారు. నిజానికి

జరిగింది బ్రహ్మానందరెడ్డి బర్తరఫ్ మాత్రమే.

రాజీనామా చేయడం మినహా మరో మార్గంలేక ఆయన ఆ విధంగా చేసారు. స్వచ్ఛందంగా తానే నాయకత్వ మార్పుకు పూనుకున్నట్లయితే కొత్త నాయకుని ఎన్నికలో ఆయనకు విలువ ఉండేది. కానీ ఆయన అలా చేయలేదు కనుక ఆంధ్రప్రదేశ్ శాసనసభ్యులు ఢిల్లీలో ఎంపికచేసిన వ్యక్తిని తమ ముఖ్యమంత్రిగా ఎన్నిక చేయడానికి అంగీకరించవలసి వచ్చింది.

కేంద్రంలో శ్రీమతి ఇందిరాగాంధీ సంపూర్ణ అధికారం స్వాధీనం చేసుకోగానే సామ్యవాద నిర్మాణానికీ, అధునాతన రాజకీయ కార్యకలాపాలకు అనుగుణంగా కాంగ్రెసు ప్రభుత్వాలలోనూ, కాంగ్రెసు సంస్థల్లోనూ ఆమె కొత్త మార్పులు ప్రవేశపెట్టాలనుకున్నారు. ఈ వ్యూహం ప్రకారమే ఆమె అన్ని రాష్ట్రాలలో కొంతకాలంగా స్థిరంగా ఉన్న నాయకత్వాలను సమూలంగా తొలగించారు. ఆంధ్రప్రదేశ్‌లోనూ అదే జరిగింది. తమ విధానాలకు అనుకూలమైన వ్యక్తులనే ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రిగా, పి.సి.సి. అధ్యక్షుడుగా చేశారు. రాజస్థాన్‌లో సుఖాడియాను తొలగించింది, మహారాష్ట్రలో వి.పి.నాయక్ (ముఖ్యమంత్రులు) ను తొలగించింది.

కాంగ్రెస్‌లో చీలిక:

స్వతంత్ర భారతదేశంలో రాష్ట్రపతి పదవికి అత్యంత తీవ్రంగా జరిగిన పోటీ 1969లో వి.వి.గిరి, సంజీవరెడ్డి మధ్య జరిగింది. అది కాంగ్రెసు పార్టీలో చారిత్రాత్మకమైన చీలికకు అంకురార్పణ చేసిన ఎన్నిక. అప్పటి రాష్ట్రపతి డా॥ జాకీర్ హుసేన్ మరణంతో ఉపరాష్ట్రపతి వి.వి.గిరి తాత్కాలిక రాష్ట్రపతి బాధ్యతలను చేపట్టారు. ఆయనను రాష్ట్రపతి చేయడం కాంగ్రెసులోని ఒక వర్గానికి ఇష్టం లేదు. రాజీప్రయత్నాలు విఫలంకాగా, ఇందిరాగాంధీ గిరిచేత రాష్ట్రపతి పదవికి రాజీనామా ఇప్పించారు. ఇండిపెండెంట్ అభ్యర్థిగా రాష్ట్రపతి పదవికి ఆయనచేత పోటీ చేయించారు. పార్టీ ఆధికారిక అభ్యర్థికే ఓటు చేయాలంటూ పార్టీకి చెందిన పార్లమెంటు సభ్యులకు విప్ జారీ చేయడానికి అప్పటి కాంగ్రెసు పార్లమెంటరీ పార్టీ నాయకురాలు శ్రీమతి ఇందిరాగాంధీ తిరస్కరించారు. పై పెచ్చు 'అంతరాత్మ ప్రబోధం' మేరకు ఓటు వేయాలంటూ తిరుగుబాటుకు కూడా దారి చూపారు. జనసంఘ్ స్వతంత్ర పార్టీ,

బి.కె.డి., మినహా తక్కిన అన్ని ప్రధాన పక్షాలు, వర్గాలు సైతం గిరిని బలపరచడానికి నిర్ణయించాయి. పార్టీల సరిహద్దులు చెరిపివేస్తూ రాష్ట్రపతి పదవికి పూర్తి స్థాయిలో సైద్ధాంతిక ప్రాతిపదికన జరిగిన పోటీ అది ఒక్కటే కావడం చెప్పుకో తగ్గ విషయం. మొదటి ప్రాధాన్యత ఓట్లద్వారా కాకుండా రెండో ప్రాధాన్యత ఓట్ల ద్వారా మాత్రమే వి.వి. గిరి గెలుపు సాధించారు. రాష్ట్రపతి ఎన్నికల్లో ఆంధ్రప్రదేశ్ నుంచి వి.వి.గిరికే ఎక్కువ ఓట్లు పడ్డాయి. ❑

4. తెలంగాణా ఉద్యమం

తెలంగాణా ప్రత్యేక రాష్ట్ర ఉద్యమానికి ప్రధాన కారకులు ఉద్యోగులు. ప్రభుత్వ ఉద్యోగుల గురించి పార్లమెంటు 1957లో చేసిన చట్టం ప్రకారం తెలంగాణా ప్రాంతీయులకు 15 సంవత్సరాల నివాస అర్హతను బట్టి తెలంగాణలో తహసీల్దారు హోదా వరకు అన్ని ఉద్యోగాలివ్వాలనే శాసనం చెల్లనేరదని 1969లో సుప్రీంకోర్టు తీర్పు నిచ్చింది. అలాంటి నిబంధన 16వ ఆర్టికల్ ప్రకారం రాష్ట్రంలో విధించవచ్చు కానీ రాష్ట్రంలోని భాగంలో విధించరాదు కనుక రద్దు అన్నది కోర్టు. దాంతో ప్రత్యేక రాష్ట్రం ఇచ్చి అలాంటి రక్షణలు ఇప్పించమన్నారు తెలంగాణవారు.

రాజకీయాలలో అవకాశవాదం ఎక్కడ ప్రారంభమవుతుందో, ఎక్కడ సమాప్తమవుతుందో చెప్పలేం. అవకాశవాద జాతికి చెందిన రాజకీయ వాదుల సంఖ్య తెలంగాణాలో కూడా తక్కువేమీ కాదు. అలాంటి వారికి ఈ ఉద్యమం మంచి ప్రేరణ నిచ్చింది. సమైక్యాంధ్ర వ్యవస్థలో అమరని తెలుగేతర శక్తులకు ప్రత్యేక తెలంగాణా అవతరణ అవకాశం కొత్త వెలుగుబాటగా కనిపించింది.

రాజకీయంగానూ, ఆర్థికంగానూ పరిణతి చెందిన ఆంధ్రనాయకులు రాష్ట్ర నాయకత్వం వహిస్తుండగా తెలంగాణావారు వంతపాడుతూ వచ్చారు. రాష్ట్రమంతటికీ ఆమోదయోగ్యమైన తెలంగాణా నాయకుడు రాలేదు. పెద్దమనుషుల ఒప్పందం ప్రకారం ఆంధ్ర నుండి ముఖ్యమంత్రి ఉంటే తెలంగాణా నుండి ఉపముఖ్యమంత్రి ఉండాలి. తెలంగాణా వ్యక్తి ముఖ్యమంత్రి అయ్యే అవకాశం అట్లా వుంచి, ఆరవ వేలుగ చిత్రించి, ఉపముఖ్యమంత్రి హోదానే తొలగించారు సంజీవరెడ్డి. 1967లో బ్రహ్మానందరెడ్డి ముఖ్యమంత్రి అయ్యేనాటికి చాలా విషయాలు తెలియవచ్చాయి. పెద్దమనుషుల ఒప్పందం అమలు జరుగుతున్నదో లేదో చూడవలసిన ప్రాంతీయ సంఘం నామమాత్రమైంది. అప్పటికి అచ్యుతరెడ్డి, హయగ్రీవాచారి అధ్యక్షతన రెండు సంఘాలు

పనిచేశాయి. చొక్కారావు అధ్యక్షుడు అయిన తరువాత ఒప్పందం భగ్నమైన విషయాలు కొన్ని బయటికి వచ్చాయి.

15 సంవత్సరాలు గడిచినా సీనియారిటీ జాబితాలు సిద్ధం కాలేదు. అసమానతలు, అక్రమాలు తెలంగాణా వారు బయట పెడుతూ వచ్చారు. తెలంగాణా నిధులు కొన్ని ఆంధ్రకు తరలించారనేది ప్రధాన ఫిర్యాదు అయింది. తెలంగాణా ప్రభుత్వోద్యోగులలో కొన్ని ఫిర్యాదులతో కూడిన అలజడి ప్రారంభమైంది.

తాండూరు నుండి రాష్ట్రశాసనసభకు ఎన్నికైన డా॥ ఎం. చెన్నారెడ్డి మంత్రివర్గంలో ఉండగానే కేంద్రానికి పోవలసి వచ్చింది. చెన్నారెడ్డిపై గల ఎన్నికల ఫిర్యాదు అపీలు సుప్రీంకోర్టులో ధ్రువపడి 6 సంవత్సరాల పాటు ఎన్నికయ్యే ఏ పదవికి అర్హత లేకుండా పోయింది. ప్రజలు తమను స్ఫురణలో ఉంచుకునేటట్లు కార్యాచరణను అన్వేషిస్తూ- బ్రహ్మానందరెడ్డికి ఆందోళన కలిగిస్తూ, వీలు కలిగితే పదవీ భ్రష్టుణ్ణి చేయడానికి ప్రయత్నించాడు చెన్నారెడ్డి. బ్రహ్మానందరెడ్డి మంత్రివర్గంలో తమ స్థానాలు కొన్ని మాత్రమే ఉన్నందుకు వెంగళరావు వంటి నాయకులు ఒత్తిడి తెచ్చారు. బిర్లాలు నడిపే ఆల్విన్ మెటల్ ఫ్యాక్టరీ అవకతవకల్ని విచారించి ప్రభుత్వం చేపట్టటానికి బ్రహ్మానందరెడ్డి ఉత్తరువులు జారీ చేశాడు. ఆ కారణంగా ఆందోళన సమయంలో బిర్లాలు ఉద్యమానికి ఆర్థిక సహాయం చేసినట్లు అనుమానించబడింది. తెలంగాణా ఉద్యోగులకు న్యాయం జరగాలంటూ ఎన్జీవోలు ఒత్తిడి చేసినప్పుడు పై కారణాలన్నీ కలిసి వచ్చాయి. ముల్కీ నిబంధనలు అమలు పరచలేకపోతే ఉద్యోగావకాశాలు కోల్పోతామనే దృష్టిలో విద్యార్థులు చేతులు కలిపారు. 1969 జనవరి 10న వెంగళరావు దీవెనలతో తెలంగాణా రక్షణకై ఖమ్మంలో విద్యార్థి నాయకుడు నిరాహార దీక్ష ప్రారంభించాడు. రక్షణలకై ఉద్దేశించినా క్రమేణా ఇది విద్యార్థి నాయకులనాకర్షించి వేర్పాటుకు దారి తీసింది. వేర్పాటు వర్గం నాయకుడు వైద్య విద్యార్థి మల్లికార్జున్ ఆవిర్భవించాడు. వ్యవస్థాపనలోనూ, చురుకుదనంలోనూ చాలా ప్రజ్ఞ కనబరచాడు. చెన్నారెడ్డి ఉద్యమంలో ప్రవేశించేవరకు రహస్యంగా అతని నుండి ఉత్తేజం పొందుతూ మల్లికార్జున్ ఆందోళన కొనసాగించాడు. క్రమంగా పిల్లలపిడుగు పెద్దల పోరయింది.

ఆంధ్రప్రదేశ్ నిర్మాణానికి కొన్ని హామీలు, వాటిని అమలు పరచవలసిన నైతిక బాధ్యతలు, పునాది, వీటి విస్మరణ జరిగిందనటానికి అఖిల పక్ష ఒప్పందమే తార్కాణం.

అఖిలపక్ష బృందం:

తెలంగాణా రక్షణలు అమలు పరచడానికై తీసుకొనవలసిన చర్యలను గురించి చర్చించడానికి ముఖ్యమంత్రి అన్ని రాజకీయ పార్టీల నాయకులతో 1969 జనవరి 19వ తేదీన ఒక అఖిలపక్ష సమావేశం ఏర్పాటు చేశారు. ఉద్యోగాలు, ఉద్యోగుల సీనియారిటి జాబితాలు, తెలంగాణా మిగులు నిధులు, అభివృద్ధి, విద్యా సౌకర్యాలు మొదలైన వాటిని గురించి చర్చలు జరిగాయి. అఖిలపక్ష సమావేశం ఈ దిగువ నిర్ణయాలు గైకొన్నది:-

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వోద్యోగుల నియామకం, నిబంధనల కింద తెలంగాణ ప్రాంతీయులకు రిజర్వు చేసిన ఉద్యోగాలలో నేరుగా, లేక ప్రమోషన్ ద్వారా లేక బదిలీ ద్వారా నియమించబడిన అన్యప్రాంత వాసులైన వ్యక్తుల నందరినీ వెంటనే తొలగించడం జరుగుతుంది. ఆ విధంగా ఏర్పడిన ఖాళీలన్నింటినీ అర్హులైన తెలంగాణా ప్రాంతీయుల నియామకం ద్వారానే భర్తీ చేయడం జరుగుతుంది. ఆ విధంగా ఉద్యోగాల నుండి తొలగించబడిన అన్యప్రాంతీయులకు సర్వీసు విచ్ఛిత్తి లేకుండా ఆంధ్రప్రాంతంలో ఉద్యోగాలు చూపుతారు. అవసరమైతే తాత్కాలికంగా కొత్త పదవులు కల్పిస్తారు.

ఈ నిర్ణయాలను వెంటనే ఖచ్చితంగా అమలు జరిపే బాధ్యత నిర్వహణకై ఇద్దరు సీనియరు అధికారులను నియమిస్తారు. దొంగ ముల్కీ సర్టిఫికెట్ల ఆధారంగా ఉద్యోగాలు సంపాదించుకున్న ఫిర్యాదులపై దర్యాప్తు కొనసాగుతుంది.

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వోద్యోగుల నియామకపు (ముల్కీ నిబంధన) చట్టం నిబంధనలు ప్రభుత్వోద్యోగులకు, స్థానిక పరిపాలన కిందగల ఉద్యోగులకే వర్తిస్తాయి. ఆ చట్టం ఆంధ్రప్రదేశ్ విద్యుచ్ఛక్తి బోర్డుకు వర్తించదని హైకోర్టు తీర్పు తెచ్చింది. ఆ సంస్థలు రాష్ట్ర వ్యాప్తమైనవి అయినందున వాటిలోని ఉద్యోగాలకు కూడా ప్రభుత్వోద్యోగుల విషయంలోవలెనే తెలంగాణా ప్రాంతపు అభ్యర్థులకు రిజర్వేషన్

ఉండాలని ప్రభుత్వం భావిస్తున్నది. ఈ నిబంధనలు రాష్ట్ర విద్యుచ్ఛక్తి బోర్డుకు వర్తింపజేసే విషయంలో హైకోర్టు తీర్పుపై రాష్ట్ర ప్రభుత్వం వెంటనే అప్పీలు దాఖలు చేస్తుంది.

సీనియారిటీ జాబితాలు:

ఆంధ్ర తెలంగాణా ఉద్యోగులకు వారి హోదాలు నిర్ణయిస్తూ ఒక జాబితాను కేంద్రప్రభుత్వం ఆమోదించిన అన్ని సందర్భాలలోను లేక అట్టి జాబితాల తయారీ లేక వాటి సవరణలకై ఆదేశాలు జారీచేసిన సందర్భాలలోను, అట్టి ఆమోదం పొందిన జాబితాలనే, వారి ఉద్యోగ నిబంధనలను క్రమబద్ధం చేసే విషయంలో అనుసరించడం జరుగుతుంది. కేంద్రప్రభుత్వం ఆమోదించిన ఆ తరహా జాబితాలు లేని సందర్భాలలోనూ, కేంద్రప్రభుత్వామోదం లభించేవరకు రాష్ట్రప్రభుత్వం అనుసరిస్తున్న తాత్కాలిక జాబితాలను అనుసరించడమే జరుగుతుంది పదవులను సమస్థాయిలో ఉండేటట్లు చేసే విషయంలో లేదా హోదాల నిర్ణయానికి ఉమ్మడి జాబితాలను తయారు చేసే విషయంలో కేంద్రప్రభుత్వం ఏదైనా ఆదేశం జారీ చేసిన సందర్భంలో ఇక ఆ విషయంపై ఎట్టి ఉత్తర ప్రత్యుత్తరాలు జరుపకుండా అట్టి ఆదేశాన్ని రాష్ట్రప్రభుత్వం అనుసరిస్తుంది.

తెలంగాణా మిగులు నిధులు:

అఖిలపక్ష ఒప్పందంలో తెలంగాణా మిగులు నిధులను గూర్చి చర్చలు జరిగినవి. అపోహలను తొలగించి తెలంగాణా మిగులు నిధులను తేల్చడానికి కంట్రోలర్ అండ్ ఆడిటర్ జనరల్‌ను అభ్యర్థించడానికి అంగీకారం జరిగింది. 1956లో జరిగిన పెద్దమనుషుల ఒప్పందం తరువాత తెలంగాణాకు జరిగిన మరొక అనుకూలమైన ఏర్పాటే అఖిలపక్ష ఒప్పందం. అయితే తెలంగాణా ఆందోళన ఉధృత దశకు చేరేసరికి సంతకాలు చేసినవారిలో కొందరు ముఖ్యులు జారుకున్నారు.

అఖిలపక్ష ఒడంబడిక ప్రకారం లెక్కలు తీయిస్తే తెలంగాణా ప్రాంతంలో 4500 మంది గైర్ ముల్కీలు పనిచేస్తున్నట్లు తేలింది. వారిని ఆంధ్ర ప్రాంతానికి తరలించడానికి సుప్రీంకోర్టు అడ్డువచ్చింది. ఆ పరిస్థితి నెదుర్కొనేందుకై ముఖ్యమంత్రి తెలంగాణాకు ప్రత్యేకంగా 2000 ఉద్యోగాలు కొత్తగా కల్పించి, వాటిలో అభ్యర్థులను నియమించే అధికారం కలెక్టర్లకిచ్చారు.

అఖిలపక్ష ఒప్పందంలోని రెండవ అంశం తెలంగాణా మిగులు నిధులు. కుమార్ లలిత్ (అక్కౌంటెంట్ జనరలు హోదా కలిగిన కేంద్ర ఉద్యోగి) నివేదిక ప్రకారం తేలిన తెలంగాణా మిగులునిధులు 34.10 కోట్ల రూపాయలు. భార్గవ కమిటీ తేల్చిన మిగులు నిధులు 28.34 కోట్లు.

ఇది ఇలా ఉండగా మంత్రి కొండా లక్ష్మణ్‌బాపూజీ తెలంగాణాకు ఆంధ్రప్రదేశ్‌లో అంతర్భాగంగా స్వతంత్ర ప్రతిపత్తి ఇవ్వాలన్నాడు. ఆయనమాట చెల్లలేదు. ఢిల్లీలోనే ముఖ్యమంత్రికి రాజీనామా అందజేసి డా॥ చెన్నారెడ్డితో సమాలోచనలు ప్రారంభించారు. నూకల నరోత్తమరెడ్డి ఆంధ్రుల భాష, తెలంగాణా వారి భాష ఒకటి కాదన్నాడు. జలగం వెంగళరావు మాత్రం తెలంగాణా వారికి ఇచ్చిన హామీలు సంపాదించుకునేందుకు ఏ సహాయం చేయడానికైనా సిద్ధమేనన్నారు. కానీ ప్రత్యేకవాదాన్ని మాత్రం తను అభినందించజాలనని బహిరంగంగా చెప్పారు. కారణాలు ఏమైనా నూకల రామచంద్రారెడ్డి, చొక్కారావులు ప్రత్యేక వాదులు కారు.

ఏ. మదన్‌మోహన్ కన్వీనర్‌గా ఏర్పడిన 'పీపుల్స్ కన్వెన్షన్' ప్రజాసమితిగా మారింది. 1969 ఆగష్టు 27వ తేదీన హైదరాబాద్ కార్పొరేషన్ ఎన్నికలలో ప్రత్యేక రాష్ట్రవాదాన్ని సమర్థించే ఎం.లక్ష్మీనారాయణ మేయరుగానూ, మేడం రామచంద్రయ్య ఉపమేయరుగాను ఎన్నికయ్యారు. డా॥ ఎం. చెన్నారెడ్డి ప్రజాసమితి అధ్యక్షుడుగా ఎన్నికైన వెంటనే తెలంగాణా ఆందోళనకు ప్రాముఖ్యం లభించింది.

1970లో పార్లమెంటుకు జరిగిన మధ్యంతర ఎన్నికలలో వెల్లువగా విజృంభించిన ప్రజాసమితి, పర్వతాలనుకున్నవారిని పెళ్ళగించివేసి తెలంగాణాలోని 13 స్థానాలను గెలుచుకుని లోక్‌సభలో ఎనిమిదవ పెద్దపార్టీ అయింది.

వి.బి.రాజు యునైటెడ్ ఫ్రంట్:

తెలంగాణా ప్రత్యేక రాష్ట్ర ఉద్యమం డా॥ చెన్నారెడ్డి చేతుల్లోనే ఉండటం ఇష్టపడని వి.బి.రాజు తన నాయకత్వం కూడా ఉందనిపించుకునేందుకు అసెంబ్లీలో యునైటెడ్ ఫ్రంట్ (టఫ్) సృష్టించి దానికి 'సదర్‌సాబ్' అనిపించుకున్నారు. అందుకే ప్రజాసమితి నాయకత్వానికి, టఫ్ నాయకత్వానికి మొదటి నుంచి తూర్పు పడమరలే. ప్రజాసమితిలో డా॥ చెన్నారెడ్డి నాయకత్వాన్ని అంగీకరించినవారు వి.బి.రాజు పరోక్ష

నాయకత్వచ్ఛాయలో నూకల రామచంద్రారెడ్డి, కొండా లక్షణ్ నాయకత్వం కింద తెలంగాణా కాంగ్రెసు పేర మరో వర్గంలో చేరిపోయారు.

1934లోనే తెలంగాణాలో స్థిరపడి పోయిన వల్లూరి బసవరాజు ఆంధ్ర మహాసభల నాటి నాయకుడు. రాజ్యతంత్రం నడపడంలో కళా వెంకటరావు అంత దిట్ట. వెల్లోడి కాలంనాటి మంత్రి. అయితే రాజుగారికి పూర్తికాలం మంత్రిపదవిలో ఉండే యోగం లేదు. 1952లో బూర్గుల రామకృష్ణరావు మంత్రివర్గంలో చేరిన రాజుగారు ముఖ్యమంత్రితో విభేదించి మధ్యలోనే 'గుడ్‌బై' అన్నారు. 1956లో సంజీవరెడ్డి మంత్రివర్గంలో చేరితే ఎన్నికల్లో గెలుపు చెల్లదని ట్రిబ్యునల్ ఇచ్చిన తీర్పుపై 1959లో మంత్రిపదవికి రాజీనామా చేశారు. 1967 ఎన్నికల్లో గెలిచి బ్రహ్మానందరెడ్డి మంత్రివర్గంలో రెవిన్యూ మంత్రి అయ్యారు.

రాజకీయ రథాన్ని స్వయంగా నడపడంకంటె నడిపించేవారికి సహాయ పడటమే వి.బి.రాజుకు ఆలవాటు. రాజకీయ నాటకాలను స్వయంగా ఆడించడం కంటే ఆడించే వారికి సహాయపడి తెరవెనుక నాయకుడుగా ఉండటమే ఆయనకు సరదా. ముఖ్యమంత్రికి సచివుడుగా, సారథిగా ఉంటున్న రాజుగారు ఆయనతో విభేదించి రాష్ట్ర సమైక్యతకై ముఖ్యమంత్రి రాజీనామా చేయాలని ప్రకటించి మంత్రివర్గం నుంచి బయటపడ్డారు. తాను పోషించిన ఫ్రంట్ పక్షాన రాజ్యసభకు ఎన్నికై కేంద్ర రాజకీయాలకు పరిమితమైనారు.

ఉద్యమానికి కారణాలు:

'ఉద్యోగులకు జరిగిన అన్యాయాలే ప్రత్యేక రాష్ట్ర ఉద్యమానికి ఆజ్యం పోశాయి. రాష్ట్ర తొలి ముఖ్యమంత్రి నీలం సంజీవరెడ్డి హయాంలో స్థానిక ఉద్యోగులకు జరిగిన అన్యాయాలు ఇన్నీ అన్నీ కావు. ఆనాడు జరిగినంత అన్యాయం వారికి మరెన్నడూ జరుగలేదు. రెండు ప్రాంతాలకు చెందిన ఉద్యోగుల సర్వీసులను ఏకీకృతం చేసే క్రమంలో తెలంగాణా సిబ్బందికి నాటి ప్రభుత్వం తీరని నష్టం తలపెట్టింది. దీనికి సంబంధించి ఏర్పాటైన రాష్ట్ర కేంద్ర సలహా సంఘాల సూచనలను ప్రభుత్వం బుట్టదాఖలు చేసింది. ఈ నేపథ్యంలో రాష్ట్రపతి ఉత్తరువుల మేరకు తెలంగాణా ప్రాంతీయ సంఘం ఏర్పాటైంది. సంఘం పరిస్థితిని అధ్యయనం చేసి సమర్పించిన

నివేదికను కూడా ముఖ్యమంత్రి హోదాలో నీలం సంజీవరెడ్డి బేఖాతరు చేశారు. అన్ని కీలక పదవుల్లో ఆయన ఆంధ్ర ప్రాంతం వారిని నియమించారు. తెలంగాణాకు చెందిన నిజాయితీపరులైన ఉన్నతోద్యోగులు ఈ.వి. రాంరెడ్డి, రామప్ప, విఠల్‌రావు వంటి వారిని అవమానాల పాలు చేశారు. విశేషమేమంటే ఈ ముగ్గురూ ఆంధ్రప్రాంతంలో పనిచేసి మంచి అధికారులుగా అక్కడి ప్రజల మన్ననకు పాత్రులయ్యారు. నాటినుంచి స్థానిక ఉద్యోగులకు జరుగుతూ వచ్చిన అన్యాయాలను చక్కదిద్దేందుకు 1985లో ఎన్టీఆర్ ప్రభుత్వం 610 జీవో తెచ్చింది. పాలకుల పాక్షిక దృష్టి వలన ఈ పరిస్థితి ఏర్పడింది. నేను ఈ సమస్యపై సమర్పించిన శ్వేతపత్రం కూడా అమలుకు నోచుకోలేదు' అని మాజీ మంత్రి ఎం.ఎస్. రాజలింగం 13-12-2009 తేదీన 'సాక్షి' పత్రిక కిచ్చిన ఇంటర్వ్యూలో వెల్లడించారు.

ప్రజోన్మాదం రెచ్చగొట్టిన ఈ ఉద్యమంలో విద్యార్థులు అసంఖ్యాకంగా చేరారు. నినాదాలు, కరపత్రాలు, సమావేశాలు ఎక్కడివక్కడ జరిగాయి. హైదరాబాద్ పోలీసులను బహిరంగంగా ప్రతిఘటించిన, ఇలాంటి ఉద్యమం ఎప్పుడూ గతంలో జరుగలేదు. వీథులకు అడ్డంగా అవరోధాలు ఏర్పరిచారు. టెలిఫోన్లు కట్ చేయడం, పోలీసులపై దాడికి రాళ్ళు సిద్ధం చేసి ఉంచడం, ఈ ఉద్యమంలో ప్రధాన విశేషాలు. రోడ్లపై అవరోధాలు ఉంచడంవలన పోలీసులు వెంటనే ప్రమాదస్థలాలకు వెళ్ళలేక పోయారు. చిన్నపిల్లలకు శిక్షణ ఇచ్చి పోలీసులపై రాళ్ళు వేయించారు. వారిని శిక్షించడం పోలీసులకు కష్టమయ్యేది. ప్రతి హైస్కూల్‌లోనూ, కళాశాలలోను విద్యార్థి సంఘాలు ఆందోళన సంఘాలుగా ఏర్పడ్డాయి. 1969 జూన్ 3, 4 వ తేదీలలో ఆందోళన అదుపు తప్పగా సైనికులను పిలిపించవలసి వచ్చింది. విశ్వవిద్యాలయంతో సహా తెలంగాణాలోని విద్యాలయాలన్నింటినీ వరుసగా తొమ్మిది నెలల వరకు మూసి ఉంచారు. ఈ ఉద్యమ కాలంలో 400 మంది ఆందోళన కారులు అమరులైనారు. ఖైరతాబాద్, సిద్ధిపేట, నియోజకవర్గాలలో జరిగిన ఉప ఎన్నికలలో టి.పి.ఎస్. అభ్యర్థులు పెద్ద సంఖ్యాబలంతో గెలిచారు.

మానసిక కారణాలు:

1. తెలంగాణా, ఆంధ్ర ఉద్యోగుల మధ్య పొంతన కుదరలేదు. ఆంధ్ర ఉద్యోగులు తామే తెలివి గలవారైనట్లుగా సోదర తెలంగాణా ఉద్యోగులను చిన్నచూపు

చూడటం. తెలంగాణా ఉద్యోగులు నెమ్మదిగా తీరికగా పనిచేస్తారు. ఆంధ్ర ఉద్యోగులు చేయదలిస్తే త్వరత్వరగా పని తెమల్చుకుంటారు. దీనివల్ల ఒకర్నొకరు అర్థం చేసుకోవడం కష్టమైంది. పరస్పరం ఈర్ష్యాద్వేషాలు ప్రబలాయి.

2. తెలంగాణా అధికారులలో హిందువులు, ముస్లింలు పని విషయంలో ఎలా ఉన్నా మర్యాద ఇచ్చిపుచ్చుకుంటారు. ఆంధ్ర గెజిటెడ్ ఉద్యోగుల ప్రవర్తన కొంత భిన్నంగా ఉండేది. దీనితో ఉభయ వర్గాల మధ్య అపోహలు పెరిగాయి.

3. ఆంధ్రులు తెలంగాణా రైతుల భూములు 3 లేక 5 వందలకు కొని ఎకరానికి ఒక వెయ్యి రూపాయల పంట పండించడం మొదలు పెట్టారు. పొలం అమ్ముకున్న రైతు తన పొలంలోనే కూలీ చేయవలసి వచ్చింది. తెలంగాణా దేశముఖు కన్నా ఎక్కువ కూలి ఇచ్చే ఆంధ్ర ప్రాంతం నుండి వచ్చిన రైతు దగ్గర తన పొలంలోనే కూలి చేయవలసి రావటం, తెలంగాణ గ్రామీణునికి మానసిక వ్యధ కలిగించింది. ఈ భూముల లావాదేవీలకు సంబంధించిన ఒక్క అంశం కూడా ప్రాంతీయ సంఘం దృష్టికి రాలేదు. అవసరం ఉన్నవాడు అమ్ముకుంటే శక్తి ఉన్నవాడు కొనుక్కుంటాడన్న సూత్రం ఈ సందర్భంలో వర్తింపజేయడం దురదృష్టకరం.

4. తెలంగాణాకు ప్రాణప్రదమైన పోచంపాడు వంటి భారీ ప్రాజెక్టుల పని చాలా మందకొడిగా జరిగింది. పూర్వపు హైదరాబాద్ ప్రభుత్వం రూపొందించిన అంచనాల ప్రకారం 117 కోట్ల రూపాయల ఖర్చుతో నిర్మించబడిన ఈ ప్రాజెక్టు 24 లక్షల ఎకరాలను సాగుకు తేవాలి. కానీ ఆర్థిక వనరుల కొరతవల్ల 39 కోట్ల రూపాయలకు తగ్గించి 5 లక్షల 50 వేల ఎకరాలు మాత్రమే సాగులోనికి వచ్చేటట్లు కుదించవలసి వచ్చింది. కేంద్రప్రభుత్వం నుంచి అందని సహాయాన్ని రాష్ట్రప్రభుత్వం భరించవలసి వచ్చింది.

5. హైదరాబాద్ ఇంజనీర్లు నాగార్జునసాగరు రూపకల్పన చేసినప్పుడు కుడి కాలువ నీరు గుంటూరు జిల్లా మొదలగు ఆంధ్రప్రాంతాలలో, ఎడమ కాలువ తెంగాణాలోని నల్లగొండ, ఖమ్మం, వరంగల్ జిల్లాల్లోనే గాక కృష్ణ, గోదావరి జిల్లాలలో కూడా కొంత భూమిని సాగు చేయడానికి ఉద్దేశించబడింది. ఈ

పథకం ప్రకారం 19వ డిస్ట్రిబ్యూటరు నుండి నందిగామ ప్రాంతానికి నీరు వెళ్ళవలసి ఉండగా అంతవరకు కాలువ నిర్మాణం కాక మునుపే 16వ డిస్ట్రిబ్యూటర్ నుండి అడ్డంగా కాలువ తవ్వించి నందిగామ ప్రాంతానికి సరాసరి నీటిని అందజేయాలని ఎత్తు వేసినట్లు, ఇది 'కె.ఎల్. ప్రాజెక్టు'గా మారినట్లు ప్రచారం జరిగినది.

వాంఛూ సంఘం నివేదిక:

తెలంగాణాలో ముల్కీలకు ఉద్యోగంసంరక్షణ రాజ్యాంగ బద్ధంగా వుండే టందుకు మార్గాలు అన్వేషించడానికి సుప్రీంకోర్టు మాజీ చీఫ్ జడ్జి జస్టిస్ కె.ఎన్. వాంఛూ అధ్యక్షతన ఒక సంఘం నియమించబడింది. కేంద్రప్రభుత్వ అటార్నీ జనరల్ నిరేన్‌డే, మాజీ అటార్నీ జనరల్ ఎం.సి. సెతల్వాడ్ ఈ సంఘంలో సభ్యులు.

దేశంలో ఏ పౌరుడైనా, ఎక్కడికైనా వెళ్ళి ఉద్యోగం చేసుకునేందుకు రాజ్యాంగం హక్కు ఇచ్చినందున ముల్కీ రూల్స్ వంటి నిర్బంధాలు విధించే వీలులేదనీ, ఒక రాష్ట్రంలోని ఉద్యోగాలలో నియామకానికి ఆ రాష్ట్రానికే ప్రాధాన్యత దొరికేటట్లు చట్టం రూపొందించే అధికారం పార్లమెంటుకు ఉన్నప్పటికీ ఒక ప్రాంతం వారికే ప్రాధాన్యతను పరిమితం చేసే హక్కు పార్లమెంటుకు లేదని వాంఛూ కమిటీ అభిప్రాయపడింది.

ఒక ప్రాంతం వారికి కూడా ఈ సౌకర్యం దొరికే విధంగా రాజ్యాంగాన్ని సవరించడం జరిగితే ఉత్తరోత్తరా ఒక జిల్లావారు లేక తాలూకా లేక గ్రామంవారు తమ ప్రాంతంలో ఉద్యోగాలలో తామే నియమింపబడాలనే ప్రమాదం ఏర్పడగలదని వాంఛూ సంఘం పేర్కొన్నది. రాజ్యాంగాన్ని సవరించకుండానే స్థానికులకు సహాయ పడాలన్న ఉద్దేశం ప్రభుత్వానికి ఉంటే ఆయా జిల్లాలలో వివిధ శాఖల అధికారులకు ఉద్యోగస్థుల నియామకానికి అధికారం ఇవ్వాలని, రాష్ట్రం మొత్తంలోని కొన్ని తరగతుల ఉద్యోగాలలో అభ్యర్థులను నియమించే అధికారాన్ని పబ్లిక్ సర్వీసు కమీషన్ పరిధి నుండి తొలగించాలని కూడా ఈ సంఘం సూచించింది.

1969 జనవరి– ఆగష్టు మధ్య కాలంలో తెలంగాణా ప్రాంతమంతటా ఆందోళనలు చెలరేగిన సందర్భంలో జరిగిన సంఘటనలు సమస్త దేశాన్ని, విదేశాలను కూడా ఆకర్షించాయి. ప్రజలు ముఖ్యంగా యువకులు తిరుగుబాటు చేయడం, జాతీయ

స్వాతంత్ర్య పోరాటం నాటి యువకుల త్యాగనిరతి, సాహసం, ఆహుతి అయిపోవాలనే పట్టుదలతో ప్రవర్తించడం, పరిపాలనా యంత్రాంగాన్ని స్తంభింపజేయడం, లాఠీచార్జీలు, కాల్పులు– సాధారణంగా ప్రశాంతమైన వాతావరణంలో మూర్ఛీవించిన స్తబ్దతకు మారుపేరుగా ఉండే, సుందరమైన రాష్ట్ర రాజధాని హైదరాబాద్ కొన్ని మాసాలు వరుసగా ఓ సైనిక శిబిరంగానో, ఓ మహామారి పీడ కారణంగానో నిర్జీవమైపోయినట్లు కనిపించింది. కేవలం తెలంగాణా అభ్యున్నతిని కోరేవారికే గాక, సకల తెలుగు ప్రజల ఔన్నత్యాన్ని కోరే వారికి, ప్రజాస్వామ్య పద్ధతుల్లో విశ్వాసం ఉన్నవారికి ఇవి ఎంతో మనస్తాపం కలిగించాయి.

సింహగర్జనతో ప్రారంభమైన ప్రజా సమితి, ప్రధాని అష్టసూత్ర పథకాన్ని అంగీకరించి కాంగ్రెసులో విలీనమైంది. బ్రహ్మానందరెడ్డిని గద్దెదించడానికి డా॥ చెన్నారెడ్డిని ప్రధాని వాడుకున్నారని ప్రచారం జరిగింది. జరిగిన నష్టాలలో విద్యార్థులకు ఎక్కువ కోటా లభించింది. చాలామంది జీవితాలు పోగొట్టుకున్నారు. ఒక విద్యా సంవత్సరం నష్టమైంది. పరీక్షలు తమాషా కింద మారాయి. ఇంత జరిగినా బ్రహ్మానంద రెడ్డి దిగిపోవడం తప్ప మరో మార్గం కనిపించలేదు.

బ్రహ్మానందరెడ్డి తెలంగాణా ఉద్యోగులతో చాలా దురుసుగా ప్రవర్తించేవారు. తెలంగాణా హక్కుల రక్షణ సమితి సభ్యులతో ముఖ్యమంత్రి బ్రహ్మానందరెడ్డి అరనిమిషం సేపు నిల్చోనే మాట్లాడి వెళ్ళగొట్టారు. రక్షణలు సక్రమంగా అమలు జరగాలని కోరుతూ పోచంపాడు ప్రాజెక్టు విషయం ప్రస్తావించగా 'పునాదులు గట్టిగానే ఉన్నాయి. మీరు వెళ్ళండి, లెండి' అని సమాధానమిచ్చారు. ఇక్కడి ఎన్జీవోలకు జరుగుతున్న అన్యాయాలపై అసంఖ్యాకులు కోర్టుకు వెళ్ళుతున్న విషయం ముఖ్యమంత్రి దృష్టికి తేగా, 'కోర్టు ఫీజు పెంచితే కోర్టుకు వెళ్ళడం వాళ్ళే మానేస్తారు' అని వ్యంగ్యంగా సమాధానమిచ్చి పంపించారు. ఇలాంటివి ఎన్నో! ఆంధ్రప్రదేశ్ సమైక్యతను కాపాడటంలో బ్రహ్మానందరెడ్డి భావోద్రేకమైన అనుభూతిని ప్రదర్శించారు. ఎందరో మహానుభావుల కృషి ఫలితంగా ఏర్పడ్డ ఆంధ్రప్రదేశ్ విచ్ఛిన్నత తన హయాంలో జరగరాదన్న పట్టుదలతో పనిచేశారు. రాజకీయాలలో విరామం కానీ విరమణ కానీ ఎరుగని బ్రహ్మానందరెడ్డి క్లిష్ట సమస్యలను పరిష్కరించడంలో నేర్పరని పేరు పొందారు. ❑

5. పి.వి. పాలన

బ్రహ్మానందరెడ్డి రాజీనామాతో మళ్ళీ నాయకత్వ సమస్య తలెత్తింది. తెలంగాణా వారిలో నాయకత్వ పోటీ ప్రారంభమైంది. రంగంలో చొక్కారావు, వెంగళరావు, పి.వి. నరసింహారావు ఉన్నారు. వారిలో పి.వి. నాయకుడుగా ఎన్నిక కావడంలో బ్రహ్మానందరెడ్డి వర్గం అధిష్ఠాన వర్గంతో సహకరించింది. పి.వి. ప్రభుత్వం 1971 సెప్టెంబరు 21న ప్రమాణ స్వీకారం చేసింది. జాతీయ స్థాయిలో ఉన్న సంజీవయ్య, రఘురామయ్యలు కలిసి బ్రహ్మానందరెడ్డి వర్గీయులకు మంత్రిపదవులు లభించకుండా చేశారు. దీనితో బ్రహ్మానందరెడ్డి వర్గం అసంతృప్తి వర్గమైంది. మొదటిసారి మంత్రివర్గంలో వెనుకబడిన తరగతులవారికి ప్రాధాన్యం లభించింది.

ఆంధ్రప్రదేశ్ అసెంబ్లీకి అయిదవ సార్వత్రిక ఎన్నికలు 1972 ఫిబ్రవరిలో జరిగాయి. వెనుకబడిన కులాలకు, మైనారిటీ వర్గాలకు, హరిజనులకు, మహిళలకూ వెరసి 60 శాతం సీట్లు కేటాయించబడ్డాయి. మొదటిసారిగా మంత్రివర్గంలో అగ్రకులాలు, సంపన్న వర్గాలకు ప్రాతినిధ్యం తగ్గింది. బి.వి.సుబ్బారెడ్డి ఉపముఖ్యమంత్రి అయ్యాడు. ఆ కాలంలో జరిగిన విశేషాలు రెండు. ఒకటి పూర్వపు మంత్రి వర్గాలు చేసిన దానికన్న ఎక్కువ అభ్యుదయకర భూసంస్కరణలు. రెండు పంచాయతీరాజ్ సంస్థలు భూస్వాముల జేబు సంస్థలుగా ఉండి కాంగ్రెస్ ప్రగతిపాలనకు అడ్డంకులు అనే కారణంతో వాటిని రద్దు పరిచే ప్రయత్నాలు.

పి.వి. చేపట్టిన కార్యక్రమాలు, అనుసరించిన వ్యూహాలు కాంగ్రెసు పార్టీ విధానాలకు అనుగుణమైనవైనా, రాష్ట్రరాజకీయాలలో తన స్థానం బలపరచుకోడానికి చేసిన ప్రయత్నాలుగానే భావించాలి. అగ్రకులాల బలంతో గాక, ఇందిరాగాంధీ వల్లనే ముఖ్యమంత్రి అయినా, పదవి కొనసాగడానికి బ్రహ్మానందరెడ్డిని బలపరిచే కమ్మ, రెడ్డి, వెలమ కులస్థుల సహకారం తప్పనిసరి అని ఆయనకు తెలుసు. పైగా

అవసర పరిస్థితులలో తనకు పూర్తిగా బలపరుస్తారనే నమ్మకం కూడాలేదు. అందువల్ల తనకొక స్వంత ముఠా ఉండాలనుకొని దానికై హరిజనులు, గిరిజనులు, వెనుకబడిన వర్గాలు, అల్ప సంఖ్యాక వర్గాలను తనవైపు తిప్పుకొనడానికి పి.వి. యుక్తిగా ప్రయత్నించారు. ఈ ప్రయత్నం బలహీనవర్గాలపై భూస్వాముల పెత్తనం కొంత సడలించినా, పెత్తందారీ కులాల వారికి దూరమవడానికి దారి తీసింది. ఈ పరిస్థితి ప్రత్యేక ఆంధ్రోద్యమం బలపడటానికి కారణమైంది.

భూ సంస్కరణలు:

దేశంలో ఓం ప్రథమంగా వ్యవసాయ భూముల అన్యాక్రాంతాన్ని నిషేధిస్తూ ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఆర్డినెన్స్‌ను జారీచేసింది. 18 ఎకరాల మాగాణి భూములపై, 34 ఎకరాల మెట్ట భూములపై గరిష్ఠ పరిమితి విధించబడింది. ఈ సందర్భంలో భూములు అన్యాక్రాంతం చేయడాన్ని నిషేధించే శాసనం భూస్వాములపై గట్టి దెబ్బ తీసింది. ఆర్థికశక్తి వికేంద్రీకరణ కానిదే రాజకీయ వికేంద్రీకరణ సాధ్యం కాదు. 1972 మే 3వ తేదీన వచ్చిన ఆర్డినెన్స్‌తోనే భూస్వాములు రానున్న బిల్లును నిరోధించాలనుకున్నారు. ప్రత్యక్షంగా ఆ పని చేసే ధైర్యం చాలకపోయింది. 1972 డిసెంబరులోగా బిల్లు ఆమోదించి అమలు జరుపుతామని ప్రభుత్వం ప్రకటించింది. పంచాయతీరాజ్ వ్యవస్థ కనుక ఈ అభ్యుదయకర చర్యలకు సాహసించకపోతే ఆ వ్యవస్థ రూపురేఖల్ని మార్చాలనుకున్నారు. సెప్టెంబరులో భూ సంస్కరణల బిల్లు సిద్ధమైంది. సెలెక్టు కమిటీ నివేదిక వచ్చింది. ఉభయ శాసనసభలు అత్యధిక సంఖ్యలో దీనిని ఆమోదించాయి. ఇక భూ సంస్కరణలు అమలు జరుపటానికి రంగం సిద్ధమైందనుకుంటున్న సందర్భంలో అక్టోబరు 3న సుప్రీంకోర్టు తీర్పు వచ్చింది.

ఆంధ్రప్రదేశ్ హైకోర్టులోని ముగ్గురు న్యాయమూర్తులు 1970 డిసెంబరు 12వ తేదీన ముల్కీరూల్స్ చెల్లుతాయని ఇచ్చిన తీర్పును 1972 ఫిబ్రవరి 4వ తేదీన ఐదుగురు న్యాయమూర్తులు రద్దుపరిచారు. దీనిపై పి.వి. ప్రభుత్వం సుప్రీంకోర్టుకు అప్పీలు చేసుకుంది. హైకోర్టు నిర్ణయాన్ని మామూలుగా సుప్రీంకోర్టు బలపరచవచ్చుననీ, తద్వారా ఆ సమస్య అణిగిపోగలదనీ రాష్ట్రప్రభుత్వ అభిప్రాయానికి విరుద్ధంగా ముల్కీ రూల్స్ చెల్లుతాయని 1972 అక్టోబర్ 3న సుప్రీంకోర్టు ఇచ్చిన

తీర్పు రాష్ట్రప్రభుత్వానికి అనేక సమస్యలను తెచ్చిపెట్టింది. ఆ తీర్పు తెలంగాణావారి హక్కుపై తుది తీర్పు అన్నారు ముఖ్యమంత్రి పి.వి.నరసింహారావు. ఆ ప్రకటన ఆంధ్రప్రాంతం వారిని కోపోద్రిక్తులను చేసింది. ఈ తీర్పుతో భూస్వాములకు చక్కని సాకు దొరికింది. ఈ చట్టాన్ని అమలు పరచకుండా వాయిదా వేయించడానికి ఇదే అదననుకున్నారు. నడుంకట్టి రంగంలోకి దిగారు. ఈ చట్టాన్ని తప్పించుకోవడానికి వీరు చేసిన కొన్ని ప్రయత్నాలు తెలుసుకుంటేనే వారి అభ్యుదయం ఏమిటో వెల్లడౌతుంది. మైనర్లను మేజర్లు చేశారు, మైనరు ఆడపిల్లలకు హడావుడిగా పెళ్ళిళ్ళు చేశారు. కొందరు తమ భూములను ఉప్పు కొఠారులని ప్రకటించారు. ఒక పక్కన ఇలాంటి చట్ట వ్యతిరేకమైన చర్యలు చేస్తూ మరో పక్క ఆందోళనలలో పాల్గొన్నారు. ఆ సందర్భంగా ముఖ్యమంత్రి, ఆంధ్రమంత్రులతోను, తెలంగాణా మంత్రులతోనూ వేరు వేరుగా సంప్రదింపులు మొదలు పెట్టారు. ఆంధ్రప్రాంతం అట్టుడికినట్లు ఉడికిపోయింది. తెలంగాణా మంత్రులు, ఆంధ్రమంత్రులు ఇచ్చిన వాగ్దానాలను పురస్కరించుకొని ఇందిరాగాంధీ పంచసూత్ర పథకాన్ని ప్రకటించారు.

పంచసూత్ర పథకం:

1. ముల్కీ నిబంధనల ద్వారా నివాసార్హత తెలంగాణా ప్రాంతంలోని నాన్ గెజిటెడ్ ఉద్యోగులకు, నాల్గవ తరగతికి, తహసీల్దారు, అసిస్టెంటు సర్జను, జూనియరు ఇంజనీరు వర్గాలకు వర్తిస్తుంది. సచివాలయంలో శాఖాధిపతుల కార్యాలయాల్లో ఉమ్మడి సంస్థ కార్యాలయాల్లో ప్రతిమూడు ఖాళీలలో రెండవది ముల్కీ నిబంధనల కిందికి వస్తుంది.

2. ఈ రక్షణలు తెలంగాణా ప్రాంతంలో 1980 వరకు, జంటనగరాలలో 1987 వరకు ఉంటాయి.

3. మొదటి లేక రెండవ గెజిటెడ్ గ్రేడు వరకు ప్రమోషన్‌కు సంబంధించిన సర్వీసులను ప్రాంతీయకరణ చేయడమవుతుంది.

4. ఇప్పుడు తెలంగాణా వారికున్న సాంకేతిక విద్యావకాశాలు పెంచబడతాయి. అదనంగా వచ్చే సదుపాయాలకు నివాసార్హత పై ఆధారపడే ఆంక్షలు ఉండవు.

5. జంటనగరాలలో ఉమ్మడి పోలీసు దళం ఏర్పాటు చేయబడుతుంది.

జూనియర్ ఇంజనీర్లు, అసిస్టెంటు సివిల్ సర్జన్లకు ఇది వర్తింపచేయటం ఈ పంచసూత్ర పథకం ప్రత్యేకత. ఇది రాజీ పథకం మాత్రమే కాని శాశ్వత పరిష్కార మార్గం కాదు. దీన్ని ప్రజలు ఆమోదించలేదు. ప్రత్యేక ఆంధ్రరాష్ట్ర డిమాండ్ ఎక్కువైంది.

ప్రత్యేక ఆంధ్రరాష్ట్రానికి అనుకూలంగానూ, ప్రధాని పంచసూత్ర పథకానికి వ్యతిరేకంగాను ప్రజాభిప్రాయాన్ని బలపడటాన్ని చూసి తొమ్మిది మంది ఆంధ్ర మంత్రులు రాజీనామా చేశారు. 1973 జనవరి 11వ తేదీన మద్దూరి సుబ్బారెడ్డి, ఆనం వెంకటరెడ్డి, జి.సోమశేఖర్, సి. దాస్, వడ్డే నాగేశ్వరరావు, ఆర్.రాజగోపాల రెడ్డి, ఎన్.అమరనాథరెడ్డి అనే కొత్త మంత్రులను నియమించారు. అదే రోజున రాష్ట్ర కాంగ్రెసు కార్యవర్గాన్ని రద్దు చేస్తూ ఉన్నతాధికార సంఘాన్ని వేశారు. ఈ ఉన్నతాధికార సంఘం రాష్ట్రంలో అధ్యక్షపాలనను సూచించింది. ప్రధాని ఆదేశంపై ముఖ్యమంత్రి పి.వి. నరసింహారావు 1973 జనవరి 17న తన పదవికి రాజీనామా చేశాడు. రాష్ట్రంలో 1973 జనవరి 18వ తేదీన ప్రవేశపెట్టబడిన రాష్ట్రపతి పాలనలో హెచ్.సి. సరీన్, వి.కె. రావులు గవర్నరు సలహాదార్లుగా నియమితులైనారు. 1973 జనవరి 18 నుంచి డిసెంబరు 13 వరకు అంటే 320 రోజులు రాష్ట్రం రాష్ట్రపతి పాలనలో ఉంది. ఆ సమయంలో అసెంబ్లీ సుప్త చేతనావస్థలో ఉంది.

షట్సూత్ర పథకం (సిక్స్ పాయింట్స్ ఫార్ములా):

ఆంధ్రప్రదేశ్ సమగ్రతను, సమైక్యాన్ని కొనసాగిస్తూ మరింత పటిష్ఠం చేస్తూనే అదే సమయంలో అన్ని ప్రాంతాల ప్రజల సత్వర అవసరాలను, దీర్ఘకాలిక అవసరాలను తీర్చడంకోసం త్వరితంగా నిర్మాణాత్మక చర్యలు తీసుకోవడానికి గల ప్రాముఖ్యాన్ని దృష్టిలో పెట్టుకుని ఆంధ్ర-తెలంగాణా నాయకులు ఒక షట్సూత్ర పథకం (సిక్స్ పాయింట్స్ ఫార్ములా) రూపొందించుకున్నారు. ప్రజల సహకారంతో అన్ని ప్రాంతాలలో సమ అభివృద్ధిని సాధించడానికి అవకాశాలు కల్పించడం ఈ సూత్రంలోని ముఖ్యాంశం.

ఈ సూత్రంతో తెలంగాణాకు ప్రాంతీయ సంఘం, ముల్కీరూల్స్ అవసరం లేకుండాపోతాయి. ముల్కీ నిబంధనలు పేరుకు మాత్రమే రద్దయినా, ప్రాంతీయ సంఘం లేకపోయినా తెలంగాణా ప్రజల హక్కులకు ఏలాంటి హాని జరుగదు. నాన్

గెజిటెడ్ ఉద్యోగాలను, తహసీల్దారు, జూనియరు ఇంజనీర్లు, అసిస్టెంటుసర్జన్లను నేరుగా నియమించేటప్పుడు స్థానిక సభ్యులకే ప్రాధాన్యత ఇవ్వబడుతుంది. వారికి మొదటి రెండవ ప్రమోషన్లు ప్రాంతీయ సీనియారిటీ ప్రకారమే లభిస్తాయి. మూడు ప్రాంతాలకు మూడు ప్రాంతీయ మండలాలు ఏర్పడుతాయి. రాష్ట్ర ప్రజల విద్యా సౌకర్యాలను వృద్ధి పరచడానికి కొన్ని కోట్ల రూపాయల ఖర్చుతో కేంద్ర విశ్వవిద్యాలయం ఏర్పడుతుంది. ఉద్యోగుల సాధక బాధకాలను పరిశీలించడానికి ఉన్నతాధికారాలుగల ఒక ట్రిబ్యునల్ ఏర్పడుతుంది. ఆ ట్రిబునల్ తీర్పును ఖాయమైనదిగా పరిగణిస్తారు. దీనితో ఉద్యోగులలో అలుముకున్న అనిశ్చిత పరిస్థితి తొలగిపోతుంది.

రాజధాని నగరాన్ని ప్రణాళికాబద్ధంగా వృద్ధి పరుస్తారు. ఆ అభివృద్ధి పథంలో జంటనగరాల పౌరులకు తగు మేర ప్రాధాన్యం ఇచ్చి వారికి ఉద్యోగాలు లభించే విధంగా చేస్తారు. రాష్ట్రంలోని వెనుకబడిన ప్రాంతాల అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం నుండి విరివిగా ఆర్థిక సహాయం లభిస్తుంది. మధ్యతరహా నీటిపారుదల వసతులకు మరింత ప్రాముఖ్యమివ్వడానికి, గ్రామీణ విద్యుదీకరణ పథకాల యెడల ఉదార వైఖరిని అవలంబించడానికి వీలు కలుగుతుంది. ఒక నిర్ణీత కాలంలో రాష్ట్రంలోని అన్ని ప్రాంతాలు సమస్థాయికి చేరుకోవడానికి జరిగే కృషిలో తెలంగాణా ప్రాంతాన్ని త్వరితంగా అభివృద్ధిలోకి తేవడం జరుగుతుంది.

ఈ షట్సూత్ర పథకం కింద ఏర్పడ్డ తెలంగాణా, రాయలసీమ, ఆంధ్ర ప్రాంతాల అభివృద్ధి మండలాల ఖర్చుకై కేంద్రప్రభుత్వం నుండి నూరు కోట్ల నిధులు లభించాయి. ఇందులో హైదరాబాద్ నగరాభివృద్ధికై కేటాయించిన పది కోట్లు కలిసి ఉంది. ఈ నిధులను తెలంగాణా, రాయలసీమ, ఆంధ్ర ప్రాంతాలలోని 162 వెనుకబడిన తాలూకాలలో అభివృద్ధి కార్యక్రమాలకై 5:3:2 నిష్పత్తిలో వెచ్చించడం జరుగుతుంది. 1979 మార్చి 31వ తేదీతో దీని గడువు పూర్తి అవుతుంది. ప్రాంతీయ సంఘం అధ్యక్షులకు మంత్రిహోదా ఉంటుంది. ఈ పథకాన్ని రూపొందించడంలో పి.వి.ప్రధాన పాత్ర వహించారు. ఈ పథకాన్ని అంతా ఆమోదించారు. ఆంధ్రప్రాంతంలో ఆందోళన వెనుకంజ వేయడంతో కాంగ్రెసువారు అధికారం కోసం తహతహలాడారు. రాష్ట్రంలో ప్రశాంత పరిస్థితులు నెలకొన్న తర్వాత కూడా రాష్ట్రపతి పాలన కొనసాగడం

కాంగ్రెసు శాసనసభ్యులు భరించలేకపోయారు. ఆరు సూత్రాల పథకం ఆమోదించేవరకు రాష్ట్రపతిపాలన తొలగించే వీలులేదని కేంద్రం చెప్పింది. ఇందుకు శాసనసభా కాంగ్రెసు పార్టీ ప్రత్యేకంగా సమావేశమై ఆరు సూత్రాల పథకాన్ని ఏకగ్రీవంగా ఆమోదించింది. ఆంధ్రప్రాంతం నాయకులు పి.వి. నాయకత్వం వీడవలసిందేనని పట్టుబట్టడంతో పి.వి.కి తన మెజారిటీ నిరూపించుకునే అవకాశమే లభించలేదు.

1973 ఆరు సూత్రాల పథకం ఆధారంగా ఒక రాజకీయ పరిష్కారం లభించడంతో కొంతకాలం శాంతియుతంగానే గడిచింది. కానీ ప్రత్యేక తెలంగాణా ఉద్యమం మాత్రం అంతర్లీనంగా ఏదో కారణంతో తరచు పొడసూపుతూనే ఉంది. ❑

6. జలగం వెంగళరావు పాలన

పి.వి. నరసింహారావు స్థానంలో 1973 డిసెంబరు 10వ తేదీన జలగం వెంగళరావు ముఖ్యమంత్రిగ ఎన్నికయ్యారు. చాలామంది ముఖ్యమంత్రుల కన్న వెంగళరావు సమర్థుడనటంలో సందేహం లేదు. అయితే ఎమర్జెన్సీ కల్పించిన అనుకూల పరిస్థితిలో పార్టీలో అసమ్మతి గొడవలేకుండా హాయిగా అధికారంలో కొనసాగి, జలగం వ్యక్తిగతంగా బలపడటమే కాక రాష్ట్రాభివృద్ధికి కూడా చేతనైనంత కృషి చేశారు. బ్రహ్మానందరెడ్డికి కేంద్రమంత్రివర్గంలో స్థానం కల్పించడం, చెన్నారెడ్డి ఉత్తర ప్రదేశ్ గవర్నరుగా నియమితుడు కావడం, పి.వి. అఖిల భారత కాంగ్రెసు కార్యదర్శిగా రాష్ట్రంనుంచి వెళ్ళడం- ముఠా రాజకీయాలు సర్దుమణగటానికి కారణమైనవి. బి.వి. సుబ్బారెడ్డి ఉపముఖ్యమంత్రి అయ్యారు.

నరసింహారావు తరువాత ముఖ్యమంత్రి అయిన వెంగళరావు భూ సంస్కరణల విషయంలో తొందరపడలేదు. పి.వి.హయాంలో అమలులోకి వచ్చిన భూ పరిమితి చట్టం ఏ పరిస్థితులకు దారితీసిందో, దాని ప్రభావం ప్రత్యేక ఆంధ్రరాష్ట్రం ఉద్యమంపై ఎంత ఉందో వెంగళరావుకు బాగా తెలుసు. అందువల్ల తొలి రోజులలో కొత్త ప్రణాళికలు చేపట్టే ముందు, ముందూ వెనుకలు ఆలోచించేవారు. నరసింహారావువలె ఆయనకు కూడా ప్రత్యేక గ్రూపులేదు. పదవిలో కొనసాగడానికి బ్రహ్మానందరెడ్డి అనుచరులైన అధిక కులాల మద్దతు వెంగళరావుకు కూడా తప్పనిసరి అయింది. వెంగళరావు స్వతహాగా అభ్యుదయవాది కాడు. విప్లవాత్మకమైన మార్పులు వెంటనే సాధించాలనే వారుకూడా కాడు. ఆయన రాజకీయ భావాలు, బలహీన వర్గాల వారి భావాలు ఒకటిగా కనబడటం వలన ఆయనను కొందరు రాడికల్‌గా భావించవచ్చు. మౌలికంగా ఆయన రాడికల్ కాడు.

వెంగళరావు ముఠాలను కట్టకపోయినా, ముఠాలను ప్రోత్సహించక పోయినా మంత్రివర్గ విస్తరణ జరుగుతుందని వదంతులు వ్యాపించినప్పుడల్లా ప్రతి జిల్లాలోను ప్రత్యర్థి వర్గానికి చెందిన మంత్రుల మధ్య తగాదాలు మొదలైనాయి. ఇద్దరు మంత్రులు

ఉన్న జిల్లాలలో ముఠా కలహాలు లోపాయకారిగా ఉండేవి. ఏ జిల్లాలోనైనా ఏం జరిగినా నీవల్ల అంటే నీవల్ల అని నిందారోపణలు చేసుకునేవారు.

1975లో మొట్టమొదటి ప్రపంచ తెలుగు మహాసభలను ఏర్పాటు చేసిన ఘనత వెంగళరావుదే. అయితే ఆయన పాలనను మరో కోణం నుంచి కూడా చూడాలి. సంజయ్‌గాంధీని సంతృప్తి పరచడానికి ఎమర్జెన్సీ కాలంలో అధికారులు, పోలీసులు చేసిన పనులు ఆయన పాలనలోని వికృత పార్శ్వానికి అద్దం పడతాయి. నక్సలైట్లను అణచివేయడానికి తీసుకున్న చర్యలు కూడా ఆయనను ఇరకాటంలో పెట్టాయి. 1977 నవంబరు 19వ తేదీన దివిసీమలో ఉప్పెన సంభవించినప్పుడు ముందుగా హెచ్చరిక వ్యవస్థలు లేనందువల్ల వినాశనాన్ని తగ్గించే అవకాశాలు లేక సుమారు 10వేల మంది మరణించారు.

జనతా పార్టీ:

1977 మార్చిలో పాత కాంగ్రెస్, జనసంఘం, భారతీయ లోక్‌దళ్, సోషలిస్టు పార్టీ, బి.కె.డి.లు కలిసి ఏకైక పక్షంగా ఏర్పడటానికి జనతాపార్టీ ఏర్పడింది. జనతా పార్టీకి రాష్ట్రంలో మొదట బలం ఉన్నట్టు కనబడలేదు. నరసింహారావు, వెంగళరావు చర్యలకు వ్యతిరేకులైన వారందరూ జనతాపార్టీలో చేరారు. జనతా బలం మూడు రకాలు. మొదటిరకం పట్టణ ప్రాంతాల్లోని విద్యాధికులు. వీరు కాంగ్రెసు ప్రభుత్వాన్ని నియంతృత్వాన్ని పెంపొందించే ప్రభుత్వంగా గుర్తించి, జనతాపార్టీ ఒక్కటే ప్రజాస్వామ్యాన్ని రక్షించగలదని నమ్మడంవలన జనతాను సమర్థించారు. రెండవ వర్గం భూ సంస్కరణల అమలులో కష్టాలకు గురైన వారు, బానిసత్వ రద్దుకు బాధపడిన వారు తదితరులు. సంపన్న భూస్వాములు ముఖ్యంగా సంపన్న వ్యవసాయ కుటుంబీకులైన రెడ్లు. జనతాకు సహకరించడానికి రాజకీయ, మానసిక కారణాలు కూడా ఉన్నాయి.

ఆంధ్రప్రదేశ్ అవతరణ తరువాత రెడ్లకు రాజకీయ రంగంలో అగ్రస్థానం ఉండేది. ఇది క్రమేపీ తగ్గుతూ వచ్చింది. కమ్మ, కాపు, వెలమ కులస్థుల ప్రాధాన్యత పెరిగింది. ఆంధ్ర రాయలసీమ రెడ్లకు వెంగళరావు ప్రభుత్వంలో తక్కువ ప్రాతినిధ్యం లభించింది. ఎక్కువగా రెడ్ల చేతుల్లో ఉన్న పంచాయతీరాజ్ పదవులను వెంగళరావు ప్రభుత్వం రద్దుచేసింది. ఇది కూడా రెడ్లకు బాధ కలిగించింది. ఈ కారణాలవల్ల సాంప్రదాయికంగా కాంగ్రెసును బలపరుస్తూన్న భూస్వామ్య శక్తులు జనతాపార్టీ

అవతరణ తరువాత ఆ పార్టీని బలపరచడం ప్రారంభించారు. జనతాను బలపరచిన మూడవ వర్గం నిరుత్సాహపరులైన పాత కాంగ్రెసు కార్యకర్తలు. కొంతకాలం కిందట కాంగ్రెసు పాలనలో విసుగెత్తి కొత్త పార్టీకోసం ఎదురు చూసినవారు.

కాంగ్రెస్ ఘోర పరాజయం:

1977లో జరిగిన లోక్‌సభ ఎన్నికల్లో కాంగ్రెస్‌కు 153 స్థానాలే లభించాయి. జనతా, దాని అనుబంధ పార్టీ ప్రజాస్వామ్య కాంగ్రెస్‌కు 298 స్థానాలు లభించాయి. ఉత్తరాది రాష్ట్రాలలో జనతాపార్టీ అఖండ విజయాలను సాధించింది. కానీ, దక్షిణాన జనతా ప్రభంజనం కానరాలేదు. అయితే ఆంధ్రప్రదేశ్‌లో జనతాపార్టీ పూర్తిగా తుడిచిపెట్టుకు పోలేదు. రాష్ట్రంలో ఓడిపోయిన అన్ని నియోజక వర్గాలలో జనతా అభ్యర్థులు ద్వితీయ స్థానంలో ఉన్నారు. దాదాపు అందరికీ లక్షకు పైగానే ఓట్లు వచ్చాయి. ఎన్నికలలో ఓడిపోయిన ఇందిరాగాంధీ 1977 మార్చి 23న ప్రధానమంత్రి పదవికి రాజీనామా చేశారు.

అప్పటి ప్రజాతీర్పు దేశంలో వివిధ రంగాలలో అనేక రకాలుగా నవ్యత్వానికి నాంది పలికింది. అది కేంద్రంలో మొట్ట మొదటి కాంగ్రెసేతర (జనతా పార్టీ) సంకీర్ణ ప్రభుత్వాన్ని అధికారంలోకి తెచ్చింది. ఇప్పుడది భారతదేశ రాజకీయ సంస్కృతిలో సువ్యవస్థీకృతం అయినది. జాతీయ స్థాయిలో అది పటిష్ఠమైన ప్రభుత్వ వ్యతిరేక పవనాల ధోరణికి నాంది పలికింది. ఫలితంగా వివిధ రాష్ట్రాలలో కాంగ్రెసును ఓడించి ప్రాంతీయ పార్టీలు అధికారంలోకి రాగలిగాయి. 1977 నాటి రాజకీయ వారసత్వం ఇప్పటికీ కొనసాగుతూనే ఉంది. రాష్ట్రాలలోను, కేంద్రంలోను అధికారంలో ఉన్న అనేక పార్టీల మూలాలు జనతాపార్టీలోనే ఉన్నాయి.

భారత రిపబ్లిక్ నాల్గవ ప్రధానిగా మురార్జీదేశాయ్ 1977 మార్చి 24న పదవీ ప్రమాణం చేశారు. కానీ ఆయన మొండిపట్టుదల, చాదస్తపు భావాలు, ఎవ్వరితో రాజీపడని ఆయన మనస్తత్వం జనతాపార్టీ విచ్ఛిత్తిని త్వరితం చేశాయి. 1979 జులై 15న ప్రధానమంత్రి పదవికి మురార్జీ రాజీనామా చేయవలసి వచ్చింది.

మురార్జీ స్థానంలో ఇందిరాగాంధీ మద్దతుతో చరణ్‌సింగ్ ప్రధాని అయ్యారు. చరణ్‌సింగ్‌కు ఇందిరాగాంధీ మద్దతు ఉపసంహరించుకోవడంతో ఆయన ప్రభుత్వం 24 రోజులే పని చేసింది. రాష్ట్రపతి నీలం సంజీవరెడ్డి 1979 ఆగష్టు 27న లోక్

సభను రద్దుచేస్తూ మధ్యంతర ఎన్నికలకు ఆదేశాలు జారీ చేశారు. రాష్ట్రాలలో మాదిరిగ కేంద్రంలో రాష్ట్రపతి పాలనకు వీలులేదు.

కాంగ్రెస్ అధ్యక్షుడుగా కాసు:

ఇరవై ఏడు సంవత్సరాల కాలంలో కాంగ్రెసు పార్టీ అత్యున్నత పదవికి 1977 మే 7వ తేదీన పోటీ జరిగింది. కాసు బ్రహ్మానందరెడ్డికి 317 ఓట్లు, ఆయనతో పోటీ చేసిన సిద్ధార్థ శంకర్‌రేకి 160 ఓట్లు వచ్చాయి. రాజకీయ అరణ్యవాసం భరించని ఇందిరాగాంధీ కాంగ్రెసును రెండవసారి చీల్చడానికి పూనుకున్నారు. గడచిన ఎనమిదేళ్ళలో ఎనిమిది మంది కాంగ్రెసు అధ్యక్షులు మారారు. శ్రీమతి ఇందిరాగాంధీ తనకు నచ్చని వారిని చెప్పుచేతల్లో ఉండనివారిని అధికారంలో ఉండనీయరని, తాను కాంగ్రెసు అధ్యక్షుడైన మూడు నెలల్లోనే ఉద్వాసన చెప్పించడానికి ఆమె ఉద్యమం ప్రారంభించారని కాసు అన్నారు.

ఇందిరా కాంగ్రెసు ఆవిర్భావం:

1978 జనవరి 2వ తేదీన శ్రీమతి ఇందిరాగాంధీ అఖిలభారత జాతీయ కాంగ్రెసు నుండి విడిపోయి తన అధ్యక్షతన ఇందిరా కాంగ్రెసును స్థాపించారు. 21 మంది కాంగ్రెసు వర్కింగ్ కమిటీ సభ్యులలో సర్వశ్రీ కమలాపతి త్రిపాఠీ, సయ్యద్ మీర్ ఖాసిమ్, పి.వి.నరసింహారావు, రవీంద్రవర్మ, బూటాసింగ్, ఏ.పి.శర్మ, మరగతం చంద్రశేఖరం, శ్రీమతి ఇందిరాగాంధీతో ఉండిపోయారు. అఖిలభారత కాంగ్రెస్ కమిటీ జనవరి 8వ తేదీన శ్రీమతి ఇందిరాగాంధీని కాంగ్రెసు నుండి బర్తరఫ్ చేసింది. జనవరి 18న హైదరాబాద్‌లో ఇందిరా కాంగ్రెసు సదస్సు జరిగింది. డా॥ చెన్నారెడ్డి ఇందిరా కాంగ్రెసు రాష్ట్రశాఖ అధ్యక్షులుగా నియమించబడ్డారు.

శాసనసభ ఎన్నికలు- అనూహ్యమైన ఫలితాలు:

1978 ఫిబ్రవరిలో ఆంధ్రప్రదేశ్, కర్నాటక రాష్ట్రాలకు ఎన్నికలు జరిగాయి. ఏ పార్టీకి రాష్ట్రంలో మెజారిటీ రాదనుకున్న రాజకీయ అతిరథ జ్యోతిష్కులందరికీ ఈ ఎన్నికల ఫలితాలు సంభ్రమాశ్చర్యాలు కలిగించాయి. ఇందిరా కాంగ్రెసు 175, జనతా 60, అధికార కాంగ్రెసు 30, సి.పి.ఐ., సి.పి.ఎం. 8, ఇండిపెండెంట్లు, ఇతరులకు 15 స్థానాలు లభించాయి. ఎన్నికలలో తన పార్టీకి సంభవించిన ఓటమివలన వెంగళరావు మంత్రివర్గం 1978 ఫిబ్రవరి 28న రాజీనామా చేసింది.

❑

7. ఐదేళ్ళలో నలుగురు ముఖ్యమంత్రులు

1. డా॥ ఎం. చెన్నారెడ్డి:

ఎన్నికలలో ఇందిరా కాంగ్రెసుకు పూర్తి మెజారిటీ లభించడంవలన ఆ పార్టీ రాష్ట్రశాఖ అధ్యక్షుడు, ఇందిరాకాంగ్రెసు శాసనసభా పార్టీ నాయకుడుగా ఎన్నికైన డా॥ మర్రి చెన్నారెడ్డి 1978 మార్చి 6వ తేదీన ముఖ్యమంత్రి పదవీ ప్రమాణ స్వీకారం చేశారు.

ఆ మంత్రివర్గంలో 19 మంది ప్రప్రథమంగా మంత్రులైనారు. ఆంధ్ర, తెలంగాణా ప్రాంతాల వారికి 3:2 నిష్పత్తిలో మంత్రి పదవులు లభించాయి. స్పీకరుగా దివి కొండయ్య చౌదరి, డిప్యూటి స్పీకరుగా కె. ప్రభాకరరెడ్డి పోటీలేకుండా ఎన్నికయ్యారు. విధాన సభలో ప్రతిపక్షనాయకుడుగా ఎన్నికైన గౌతు లచ్చన్నకు మంత్రిహోదా కల్పించబడింది. ఎం.ఏ. అజీజ్ పిసిసి అధ్యక్షులైనారు.

ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చెన్నారెడ్డి, కర్నాటక ముఖ్యమంత్రి దేవరాజ్ అర్స్ 1978 ఏప్రిల్‌లో ఢిల్లీ వెళ్ళినప్పుడు తమ తమ రాష్ట్ర వ్యవహారాలలో ఇందిరా కాంగ్రెసు అధిష్ఠానవర్గం జోక్యం చేసుకోవడాన్ని సహించబోమని అధిష్ఠానవర్గానికి స్పష్టం చేశారు. అసంతృప్తి వర్గం ఢిల్లీకి వెళ్ళి కేంద్ర నాయకత్వానికి ఫిర్యాదులు చేసినందువల్ల ఫలితం ఉండదని, విభేదాలు ఉంటే వాటిని పరస్పరం చర్చల ద్వారానే పరిష్కరించు కోవాలని ఆ రెండు రాష్ట్రాల ముఖ్యమంత్రులు ఆయా రాష్ట్రాల అసంతృప్తి వాదులకు స్పష్టం చేశారు.

పార్టీ అధ్యక్షురాలు శ్రీమతి ఇందిరాగాంధీ కూడా తాను ప్రధానిగా ఉండగా రాష్ట్రాల ముఖ్యమంత్రులను ఆదేశించినట్లు ఇప్పుడు ఆదేశాలు జారీచేస్తే చెల్లుబాటు కాదని గ్రహించారు. అందుచేతనే రాష్ట్రాల అసంతృప్తి వాదులు చేస్తున్న ఫిర్యాదులను

విని ఊరుకున్నారు. ఆ ఫిర్యాదులను ఆయా ముఖ్యమంత్రులకు పంపిస్తూ వచ్చారు. ఆంధ్రప్రదేశ్, కర్నాటక ముఖ్యమంత్రులు ఢిల్లీలో ఇందిరాగాంధీని కలుసుకున్నప్పుడు తమ తమ రాష్ట్రాలలో తలెత్తిన ఎటువంటి పరిస్థితిని అయినా తాము ఎదుర్కొనగలమని, అసంతృప్తివాదుల విషయంలో చూసుకోగలమని చెప్పారు.

ముఖ్యమంత్రిగా పదవిని స్వీకరించిన మూడు నెలలకే చెన్నారెడ్డి మీద అసంతృప్తి మొదలయింది. ఆయన షష్టిపూర్తి సంరంభాలు తీవ్ర విమర్శకు గురైనాయి. 1980 లోక్‌సభ ఎన్నికల్లో ఇందిరాగాంధీ విజయం పొంది తిరిగి అధికారానికి రావడంతో రాష్ట్రంలోని అసమ్మతివాదులకు బలం చేకూరినట్లయింది. పాలనా యంత్రాంగాన్ని తన వ్యక్తిగత ఆర్థిక ప్రయోజనాలకోసం వాడుకుంటున్నారని ముఖ్యమంత్రిపై చేసిన ఆరోపణ పత్రంమీద 15 మంది మంత్రులు సంతకాలు చేశారు. ముఖ్యమంత్రి వర్గీయులు, అసమ్మతి వర్గీయుల మధ్య ఘర్షణలు తారాస్థాయికి చేరాయి. కేంద్రం జోక్యం తప్పనిసరి అయింది. ఆ ప్రతిష్ఠంభన ఇలా కొనసాగుతుండగా చెన్నారెడ్డి ఢిల్లీ వెళ్ళలేదు. దానివల్ల ఆయన ఇందిరాగాంధీతో సమానులుగా భావిస్తున్నట్లు అపార్థం కల్పించారు. ఇందిరా కాంగ్రెసుకు చెందిన మొత్తం 255 మంది శాసనసభ్యులలో 167 మంది, 40మంది విధాన పరిషత్తు కాంగ్రెసు సభ్యులలో 29 మంది ముఖ్యమంత్రిని తొలగించాలని సంతకం చేసినట్లు అసమ్మతి వర్గం నాయకుడు రాజారాం ప్రకటించారు. తమ కోట దుర్భేధ్యం అన్నాడు. ఉభయ పక్షాలు సమరోన్ముఖంగా నిలుచున్నాయి.

ఎటువంటి రాజకీయ సమస్యనైనా అవలీలగా పరిష్కరించగలిగే ఇందిరాగాంధీ ఇప్పుడు పరిస్థితి మీద అదపు కోల్పోయి ఉండాలి. లేదా ఉద్దేశ పూర్వకంగా తాత్సారం చేస్తూ చెన్నారెడ్డికి చిత్త క్షోభను కలిగిస్తూ ఉండాలి. డా॥ చెన్నారెడ్డి రాష్ట్ర వ్యవహారాలలో అధిష్ఠాన వర్గం జోక్యాన్ని వ్యతిరేకించారు. అధిష్ఠానవర్గం జోక్యం వల్లనే అసమ్మతి వాదులు తిరుగుబాటు చేయడానికి ప్రోత్సాహం లభించిందని ముఖ్యమంత్రి అభిప్రాయ పడ్డారు.

పరువుగా, హుందాగా, సంతృప్తితో పదవీ విరమణ చేసే అవకాశం కాంగ్రెస్ (ఐ) అధిష్ఠానవర్గం ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రులకు ఏనాడూ ఇవ్వలేదు. డా॥ మర్రి

చెన్నారెడ్డిని మూడు నెలల పాటు ముప్పుతిప్పలు పెట్టారు. ఆయనపై తిరుగుబాటు చేయడానికి అసమ్మతివాదులను దువ్వి వారిని ప్రోత్సహించారు. మంత్రివర్గ సమావేశానికి హాజరు కావడానికి మంత్రులు నిరాకరించారు.

అసెంబ్లీని సమావేశపరచడానికి, పంచాయతీ సంస్థలకు ఎన్నికలు జరిపించ డానికి అనుమతి ఇవ్వలేదు. గవర్నరుకు రాజీనామా లేఖ పంపించమని అడిగారు. అంతలోనే ఇప్పుడు వద్దు అన్నారు. ముఖ్యమంత్రి డా॥ మర్రి చెన్నారెడ్డి 1980 అక్టోబరు 10వ తేదీన పదవికి రాజీనామా చేశారు. దీనితో రాష్ట్రంలో మూడు నెలలుగా సాగిన సంక్షోభం తొలగిపోయింది. చెన్నారెడ్డి 30 నెలల పాలన ముగిసింది.

పార్టీలో తిరుగుబాటు ఫలితంగానే చెన్నారెడ్డి ఆ ఉన్నత పదవి నుండి వైదొలగవలసి వచ్చింది. చొరవ, సాహసం కలిగిన నాయకుడుగా, పరిపాలనా దక్షుడుగా, కార్యశూరుడుగా ఎంతో పేరు తెచ్చుకున్నా, సహనం, సంయమన శక్తి లోపించడం వల్ల డా॥ చెన్నారెడ్డి అన్నివర్గాల ఆదరాభిమానాలను చూరగొనలేక పోయాడు. మంత్రివర్గ సహచరులకు సైతం ఓ పట్టాన ఆయన దర్శనభాగ్యం కలిగేది కాదు. దీనికి తోడు ఆయన హయాంలో అవినీతి కోడై కూసింది. ఇది నిజం కాదని నిరూపించడంలో జాగ్రత్త పడకపోవడమే ప్రజల దృష్టిలో చెన్నారెడ్డి ప్రభుత్వం అపఖ్యాతి పాలుకావడానికి కారణమైంది. తాము ఏమిచేస్తున్నది ముఖ్యం కాదు. తమను గురించి ప్రజలు ఏమనుకుంటున్నారో గమనించడం అంతకంటే ముఖ్యం. గత రెండేళ్ళ రాజకీయ చరిత్ర నేర్పిన గుణపాఠం ఇది.

చెన్నారెడ్డి ముఖ్యమంత్రిగా ఉండగా ఏ చర్య చేపట్టినా స్వతంత్రంగా నిర్వహించే వారు. తను పార్టీలో ఒక క్రమశిక్షణ కలిగిన నాయకుడుగా భావించేవారు. అధిష్ఠాన వర్గమే వేదం అని ఆయన ఏనాడూ అన లేదు. ముఖ్యమంత్రిగా ఉన్నన్నాళ్ళూ ఏనాడు ఏ పరిస్థితులలోను తన హుందాతనాన్ని పోగొట్టుకోలేదు. ఆరు కోట్ల జనాభాగల రాష్ట్రానికి తగిన ముఖ్యమంత్రిగా వ్యవహరించారు. పత్రికా స్వాతంత్ర్యాన్ని గౌరవించిన వ్యక్తి. ఏటికి ఎదురీది తన ముఖ్యమంత్రిత్వాన్ని చండశాసనుడిగా నడుపగలిగాడు.

చెన్నారెడ్డిని దించి వేసింది అసమ్మతి వాదుల కృషి కాదు. తాను కోరనంత స్థాయిలో విధేయత ఆయన నుండి తనకు దక్కలేదనే బాధతో ఇందిరాగాంధీ చెన్నారెడ్డిని పదవి నుంచి దించివేశారు.

2. 'గరీబోళ్ళ' బిడ్డ– టి.అంజయ్య:

డా॥ మర్రి చెన్నారెడ్డి స్థానంలో మాజీ కేంద్రమంత్రి టంగుటూరి అంజయ్య రాష్ట్ర ఎనిమిదవ ముఖ్యమంత్రిగా 1980 ఆగష్టు 13న ప్రమాణం చేశారు. ఆల్విన్ ఫ్యాక్టరీలో ఆరు అణాల రోజువారీ కూలీగా పనిచేసిన అంజయ్య అంతై, ఇంతై, అంతకంత అల్లంతై ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి అయ్యారు. నిర్వివాదమైన ప్రతిష్ఠ, స్నేహశీలత, అందరినీ కలుపుకోగలడన్న విశ్వాసంవల్ల అంజయ్యకు ముఖ్యమంత్రి పదివి లభించింది.

అంజయ్య మంత్రివర్గం 22 మందితో ప్రారంభమైంది. 1980 నవంబరు 2వ తేదీన అంటే రెండు నెలల తర్వాత కొత్తగా ముప్పయి ఎనిమిది మంది మంత్రులను చేర్చుకోవడంతో మంత్రుల సంఖ్య 61కి పెరిగింది. ఆంధ్రప్రదేశ్ చరిత్రలో ఇది అతి పెద్ద మంత్రివర్గం.

మంత్రివర్గ విస్తరణలో ప్రతిముగ్గురు శాసన సభ్యులలో ఒకరు మంత్రిగానో, కాకపోతే ఇంచుమించు అదే హోదాగల కార్పొరేషన్ ఛైర్మన్‌గానో ఉన్నారు. మంత్రులకు ఉండే ఖరీదైన కార్లు, బంగ్లాలు, పి.ఏ. వగైరా సౌకర్యాలు, హంగులన్నీ వీరికున్నాయి. రాష్ట్ర అసెంబ్లీ సభ్యుల సంఖ్య 291 మంది. వీరిలో సుమారు వందమందికి పదవులు లభించాయి.

ఎంతమంది ఎక్కువ మంత్రులుంటే పరిపాలన అంత సమర్థంగా ఉంటుందని అంజయ్య సారాంశం. తన మంత్రివర్గాన్ని 'ఎయిర్ బస్'తో పోల్చి, విమానం ఎంత పెద్దదయితే ప్రయాణం అంత హాయిగా ఉంటుందని ఆయన భావన. అలాంటి అవగాహన ఉన్నందుకే ఆయన మంత్రివర్గం పుష్పక విమానంలా తయారైంది. మంత్రివర్గ నిర్మాణంలో పూర్తి స్వేచ్ఛ అనుభవించింది అంజయ్య ఒక్కరే. తన ఎయిర్‌బస్ మంత్రి వర్గాన్ని ఆయన ప్రకటించినప్పుడు చాలామంది చకితులైనారు. అయితే శ్రీమతి ఇందిరాగాంధీ ఆయన పట్ల వాత్సల్యంతో ఆ ముచ్చట తీర్చుకోనిచ్చారు. విమర్శలు శరపరంపరగా వచ్చినతరువాతనే ఆమె జోక్యం చేసుకొని మంత్రివర్గం సైజు కుదించమని చెప్పారు. దానితో మంత్రివర్గం ఏర్పాటు చేసిన తొమ్మిది వారాలకే మంత్రుల సంఖ్యను 45కు కుదించవలసి వచ్చింది. 11 ఏళ్ళ తరువాత పంచాయతీ రాజ్ సంస్థలలో ఎన్నికలు జరిపించిన ఘనత అంజయ్యదే.

ఇందిరాభక్తే అంజయ్య శక్తి. కనుక అంజయ్యపై పార్టీలో తిరుగుబాటు లేదు. అధిష్ఠానవర్గం ఎప్పుడు దిగిపొమ్మని చెబితే అప్పుడు దిగిపోవడానికి సిద్ధంగా ఉన్నట్లు అంజయ్య చెప్పేవారు. అంజయ్య కొన్ని ప్రజాస్వామ్య నిర్ణయాలు తీసుకొని అమలు చేసినప్పటికీ ఆయన కూడా ఏడాదిన్నర కంటె ఎక్కువ కాలం అధికారంలో ఉండలేకపోయారు. ఆయన మంత్రివర్గంలోని ఎన్.జనార్ధనరెడ్డి ఒకవైపు, కోన ప్రభాకరరావు మరొకవైపు సాగించిన అసమ్మతి కార్యకలాపాలు అంజయ్య మంత్రివర్గాన్ని గంగపాలు చేశాయి. ముఖ్యంగా ఎన్.జనార్ధనరెడ్డి ఢిల్లీలో సాగించిన రాజకీయ పన్నాగాల మూలంగా రాజీవ్‌గాంధీ కలుగజేసుకొని అంజయ్యను బాహాటంగా అవమానించి మరీ పదవీ భ్రష్టున్ని చేశారు. ఆయన కాలంలో ప్రభుత్వోద్యోగులు కలసి వచ్చారు. నిబద్ధతతో, న్యాయంతో పనిచేసే అట్టడుగు జీవి ఎన్ని శిఖరాలైనా అధిరోహించగలడని అంజయ్య నిరూపించాడు. రాష్ట్రంలో ఆర్థిక రంగంతో పాటు కళారంగాన్ని కూడా ఎంతగానో ప్రోత్సహించిన దార్శనికుడాయన.

3. భవనం వెంకట్రామ్:

అంజయ్య అనంతరం 1982 ఫిబ్రవరి 16న ముఖ్యమంత్రిగా ప్రమాణస్వీకారం చేసిన భవనం వెంకట్రామ్‌రెడ్డి ఆరు నెలలు అధికారంలో ఉండి 1982 సెప్టెంబరులో తన పదవికి రాజీనామా చేశారు. భవనం శాసనమండలి సభ్యుడు. తెలంగాణా ప్రాంతానికి చెందిన సి.జగన్నాథరావు ఉపముఖ్యమంత్రి అయ్యారు. అప్పటికే సినీ నటుడు ఎన్టీరామారావు పార్టీ పెట్టే సన్నాహంలో ఉన్నారు. ఎన్టీఆర్‌ని ఎదుర్కొనే శక్తి భవనంకు లేదని, అందుకు తగిన వ్యక్తిని ముఖ్యమంత్రిగా నియమించాలని భవనం వెంకట్రామ్‌ను రాజీనామా చేయమన్నారు. దానితో ఆయన 1982 సెప్టెంబరు 20వ తేదీన రాజీనామా చేశారు. భవనం పాలన 6 మాసాల 26 రోజులు సాగింది.

4. కోట్ల విజయ భాస్కరరెడ్డి:

భవనం రాజీనామాచేసిన తరువాత కోట్ల విజయభాస్కరరెడ్డిని అధిష్ఠాన వర్గం ఎంపిక చేసింది. ఆయన 1982 సెప్టెంబరు 20న ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేశారు. అప్పటికే ఎన్టీఆర్ ప్రభంజనం రాష్ట్రమంతగా వీచడం ప్రారంభమైంది. ఎన్టీఆర్ తాకిడిని విజయభాస్కరరెడ్డి తప్ప ఎవరూ ఎదుర్కొనలేరని భావించి వచ్చే ఎన్నికల

వరకేగాక, ఎన్నికల తరువాత కూడా ఆయనే ముఖ్యమంత్రిగా కొనసాగుతారని కూడా ఢిల్లీ అధిష్ఠానవర్గం హామీ ఇచ్చింది.

విజయభాస్కరరెడ్డి మంత్రివర్గంలో డా॥ వై.ఎస్.రాజశేఖరరెడ్డి, చంద్రబాబు నాయుడులు మంత్రులైనారు. నాలుగో ముఖ్యమంత్రిగా విజయభాస్కరరెడ్డి వచ్చినట్లే నాల్గో పిసిసి అధ్యక్షుడుగా జి.వెంకటస్వామి వచ్చారు.

కాంగ్రెసు ముఖ్యమంత్రులు పూర్తికాలం పదవిలో వుండలేక పోయినా వారి పరిపాలనా కాలంలో కొన్ని అవకతవకలు జరిగినా వారంతా సమర్థులే. పరిపాలనా దక్షత కలిగిన వారే. కాంగ్రెస్ పార్టీ జాతీయ పార్టీ కావడంతో వారంతా అధిష్ఠానవర్గం ఆజ్ఞలకు శిరసావహించవలసి ఉంది. కనుకనే వారు తమ శక్తి సామర్థ్యాలను, పరిపాలనా దక్షతను ప్రదర్శించలేకపోయారు. అది వారికి అపకీర్తిని తెచ్చి పెట్టింది. ఇది తెలుగు దేశంపార్టీకి వరప్రసాదమైంది. విజయభాస్కరరెడ్డి ప్రభుత్వం మూడు నెలల 19 రోజులు అధికారంలో ఉంది. 1983 జనవరి 8వ తేదీన ఎన్నికలలో కాంగ్రెసు ఓడిపోవడంతో విజయభాస్కరరెడ్డి ముఖ్యమంత్రి పదవికి రాజీనామా చేశారు. ఇక రాష్ట్రంలో తెలుగుదేశం పార్టీ శకం ప్రారంభమైంది. ❑

8. తెలుగు దేశం పార్టీ ఆవిర్భావం

ఎన్టీఆర్ పాలన:

ప్రసిద్ధ సినీ నటుడు నందమూరి తారక రామారావు. 1982 మార్చి 2వ తేదీన తన రాజకీయ రంగ ప్రవేశాన్ని ప్రకటించారు. మార్చి 29వ తేదీన తెలుగుదేశం పార్టీని స్థాపించి దాని తొలి అధ్యక్షులయ్యారు. అప్పటికే నాలుగేళ్ళలో నలుగురు ముఖ్యమంత్రులు మారారు. ప్రజల్లో కాంగ్రెసుపట్ల వ్యతిరేకత పెరిగింది. ప్రజలు మార్పు కోరారు. అందువల్లనే 1983లో జరిగిన ఎన్నికల్లో ప్రజలనుంచి టి.డి.పి.కి అద్భుతమైన ఆదరణ లభించింది. రాజకీయాలలో ఓనమాలు తెలియని వ్యక్తి కేవలం తొమ్మిది నెలలలో అధికారాన్ని హస్తగతం చేసుకోవడం ప్రపంచంలోనే అరుదైన విషయం. స్థానికంగా పట్టుమని పదిమందికి తెలియని అభ్యర్థులు సైతం రామారావు సమ్మోహన శక్తితో విజయభేరి మోగించారు. ఈ ఎన్నికలలో తెలుగుదేశం 202, కాంగ్రెస్ 60, సి.పి.ఐ4, సి.పి.ఎం 5, జనతా 1, బిజెపి 3 మజ్లిస్ 5, ఇండిపెండెంట్లు–ఇతరులు 13 స్థానాలు సాధించారు.

ఎన్టీఆర్ ప్రభుత్వం 1983 జనవరి 9న ప్రమాణ స్వీకారం చేసింది. 1983 మేలో విజయవాడలో జరిగిన తొలి మహానాడు సమావేశం భారత రాజకీయ చరిత్రలోనే నూతన అధ్యాయాన్ని సృష్టించింది. దేశంలోని వామపక్షాలు, సెంట్రిస్టు జాతీయపార్టీలు, బిజెపి, ప్రాంతీయ పార్టీలన్ని కలిపి 23 ప్రతిపక్ష పార్టీల అధినేతలంతా అఖిలపక్ష ఐక్య సంఘటనపై చర్చలు జరిపారు. నాటినుంచి ఎన్టీఆర్‌కు రాజకీయవేత్తగా గుర్తింపు లభించింది. అధిక కార్యభారం వల్ల ఆయన ఆరోగ్యం దెబ్బతిన్నది.

బైపాస్ ఆపరేషన్ చేయించుకోవడానికి ఆయన 1984 జులై 24న అమెరికా వెళ్లారు. హోస్టన్‌లో ఆపరేషన్ జయప్రదంగా జరిగింది. అప్పటి నుంచి మొదలైనాయి తెలుగుదేశం పార్టీలో అసమ్మతి రాజకీయాలు, వెన్నుపోట్లు.

రామారావు చికిత్స నిమిత్తం అమెరికాలో ఉండగానే 'కో పైలెట్' అని చెప్పుకునే నాదెండ్ల భాస్కరరావు రెండో కంటికి తెలియకుండా రామారావుకు వ్యతిరేకంగా సంతకాల ఉద్యమం చేపట్టారు. ఎన్టీఆర్ మీద అవిశ్వాసం ప్రకటిస్తూ 'మేము పార్టీ నుంచి విడిపోతున్నాం. రామారావుకు శాసన సభలో ఆధిక్యం లేదు' అని రాసి ఉంచిన విజ్ఞాపన పత్రంమీద చాలామంది సంతకాలు చేసారు. రామారావు ఆగష్టు 14న హైదరాబాద్‌కు చేరుకున్నారు. ఆలస్యం చేయకుండా ఆయన భాస్కరరావును తొలగిస్తూ గవర్నరుకు లేఖ పంపించారు. పోతే, నాదెండ్లను ముఖ్యమంత్రి సలహాపై మంత్రివర్గం నుంచి గవర్నరు బర్తరఫ్ చేసినట్లు రాజ్‌భవన్ నుంచి వార్త వెలువడగానే మంత్రులు టి.జీవన్‌రెడ్డి, సంగంరెడ్డి సత్యనారాయణ, రామమునిరెడ్డి, రాజీనామా చేసి పార్టీలో సంక్షోభం సృష్టించారు. ముఖ్యమంత్రి నియంతృత్వ ధోరణితో గత 17 నెలలుగా తాము అనుభవించిన అవమానాలతో విసుగెత్తి పోయామని వారు పేర్కొన్నారు. తెలుగుదేశం ఒకపార్టీలా కాక 'ప్రైవేటు' కంపెనీగా పనిచేస్తున్నదని దానిని సహించలేక, తాము రాజీనామా చేస్తున్నామని వారు చెప్పారు. తమకు మెజారిటీ ఉందని భాస్కరరావు చెప్పగానే గవర్నరు రాంలాల్ దాన్ని విశ్వసించి ఆయన చేత ముఖ్యమంత్రిగా ప్రమాణం చేయించారు.

ఎన్టీఆర్‌ను తొలగించడంతో ఘోర తప్పిదం జరిగింది. ఆయనను తొలగించ డానికి అది సమయం కాదు. అనుసరించిన పద్ధతి కూడా అనుకూలమైనది కాదు. నిరంకుశుడుగా రామారావు తన పార్టీలోనే, తన పార్టీ ఎం.ఎల్.ఏ.లలోనే క్రమంగా అభిమానం కోల్పోతూ వచ్చారు. దుందుడుకు విధానాలు, స్వార్థ ప్రయోజనాలు, వివిధ వర్గాల ప్రజలను రెచ్చగొట్టే చర్యలతో, రద్దుల కార్యక్రమాలతో ప్రజలలో ఆయనమీద ఉన్న భ్రమలు పటాపంచలై పోయాయి. దేశంలో కాంగ్రెస్‌పట్ల సుముఖభావం ఏర్పడి ప్రధానమంత్రి ఇందిరాగాంధీ ప్రతిష్ఠ పెరుగుతున్న సమయంలో రామారావుని స్వేచ్ఛగా వదిలిపెట్టి ఉంటే ఆ పతనం ఆయనవల్లనే జరిగేది. రాజకీయంగా హత్యకు గురైన వ్యక్తికి అధికారచ్యుతి కలిగించి అపారమైన సానుభూతి కలుగజేశారు. కొద్దికాలంలోనే రాజకీయంగా జీరో అయిన వ్యక్తిని హీరో చేశారు.

294 సభ్యులున్న అసెంబ్లీలో ఎన్టీఆర్‌కు 168 మంది సభ్యుల బలం ఉంది. ఆ 168 మంది ఎన్టీఆర్ పక్షంలో ఉండగా ఆయనకు అసెంబ్లీలో మెజారిటీ

పోయిందని, రాజీనామా చేయాలని గవర్నరు రాంలాల్ కబురు పంపారు. రాజ్‌భవన్‌లోనే తన మద్ధతుదారులను కళ్ళారా చూపించడానికి కూడా ఎన్టీఆర్ సిద్ధపడితే రాజ్‌భవన్‌లోకి కూడా ఆయనను రానివ్వలేదు. ఆ చర్యను యావద్దేశం గర్హించింది.

అయినప్పటికీ రామారావు, భాస్కరరావుల వెంట ఉన్న శాసన సభ్యుల బలా బలాలను అప్పటికప్పుడు కానీ, మూడు రోజుల వ్యవధిలో శాసనసభలో కానీ, పరీక్షించి చూడటానికి గవర్నరు నిరాకరించారు. తనకు తానే రామారావు మెజారిటీ కోల్పోయినట్లు సంతృప్తి చెందారు. దొరికిన అవకాశాన్ని ప్రతిపక్షాలు తమ రాజకీయ స్వార్థానికి వినియోగించుకున్నాయి. తెలుగుదేశం పార్టీకి సమీకృత బలంలేదు. అందు వల్లనే ఆ సంక్షోభకాలంలో ఎన్టీఆర్ పార్టీ మిత్ర పక్షాలపై పూర్తిగా ఆధారపడి పోయింది. అన్నగారి ఆవేశపూరిత ప్రసంగాలు తప్ప తక్కిన పెత్తనమంతా ప్రతిపక్షాలది. అందులో బిజెపి, కమ్యూనిస్టుల పాత్ర ఎక్కువ. ఒక్క మాటలో చెప్పాలంటే రామారావు సంఘటన ద్వారా లాభసాటిగా వ్యాపారం చేసుకోవడానికి ప్రతిపక్షాలకు పెట్టుబడి పెట్టింది కాంగ్రెస్ పార్టీ.

ఎన్టీఆర్‌కు అనుకూలంగా దేశవ్యాప్తంగా జరుగుతున్న నిరసనలను చూసి ఇందిరాగాంధీ చలించి పోయారు. గవర్నరు రాంలాల్‌ను వెనక్కి పిలుపించుకుని ఆయన స్థానంలో డా॥ శంకరదయాళ్ శర్మను గవర్నరుగా నియమించారు. నాదెండ్ల తన మెజారిటీని నిరూపించుకోలేకపోయారు. 1984 సెప్టెంబరు 16న ఎన్టీఆర్ తిరిగి పట్టాభిషిక్తుడయ్యాడు. ఆ వెంటనే అంటే సెప్టెంబరు 27న అసెంబ్లీ రద్దయింది. అసెంబ్లీ ఏర్పడి ఆనాటికి 22 నెలల 15 రోజులైంది. మంత్రివర్గానికి అసెంబ్లీలో మెజారిటీ బలం ఉన్నప్పటికీ రాజకీయాలలో విలువలు పునరుద్ధరించడం కోసం తాజాగా ప్రజల తీర్పు అవసరమని మంత్రివర్గం భావించింది.

నెల రోజుల ముఖ్యమంత్రి:

నాదెండ్ల భాస్కరరావు నాయకత్వంలో ఏర్పడిన కొత్త ప్రభుత్వం గవర్నరు ఆదేశాల ప్రకారం నెలరోజులలో మెజారిటీ నిరూపించుకోవాలి. అది సాధ్య పడలేదు. గవర్నరు చేత బర్తరఫ్‌కు భయపడి నాదెండ్ల మంత్రివర్గం సెప్టెంబరు 16న రాజీనామా చేసింది. ప్రజాదరణ కోల్పోయి పతనం అంచున నిలబడిన తెలుగుదేశం పార్టీ

భాస్కరరావు నడిపిన రాజకీయ తంత్రంవల్లనే మరో ఆరేళ్లపాటు అధికారంలో కొనసాగింది.

ఎన్టీఆర్ రెండవ పాలన:

1985 జనవరిలో అసెంబ్లీకి జరిగిన మధ్యంతర ఎన్నికలలో తెలుగు దేశం పార్టీకి మూడింట రెండు వంతుల మెజారిటీ లభించింది. ఎన్టీఆర్ తిరిగి ముఖ్యమంత్రి అయ్యారు. తొలి రోజులలో కమ్యూనిస్టుల ప్రాబల్యాన్ని తరువాత తెలుగుదేశం బలాన్ని దెబ్బతీయడం కాంగ్రెసు లక్ష్యం. అలాంటి లక్ష్యం ఒక రాజకీయ పార్టీకి ఉండడంలో తప్పులేదు. ఆ లక్ష్యసాధనకు సంఘవ్యతిరేక శక్తులను రాజకీయ పార్టీలు ఉపయోగించడం ఎప్పుడు ప్రారంభమైందో అప్పుడే విజయవాడలో విషబీజం పడింది. హత్యలు ఒకసారి మొదలయ్యాక అవి ఆగవని కర్నూలు, కడప రాజకీయాలు చాటుతూనే ఉన్నాయి.

1986లో ఎన్టీఆర్ తిరిగి పార్టీ అధ్యక్షుడుగా ఎన్నికయ్యారు. నియమావళి ప్రకారం ఆయనే కార్యవర్గం నియమించాలి. పార్టీ ప్రధాన కార్యదర్శిగా చంద్రబాబు నాయుడు ఉండాలని ఆయన కోరిక. చంద్రబాబు పోలిట్ బ్యూరో సభ్యుడిగా ఉండి, నిర్వహణ వ్యవహారాలు చూసుకుంటూ ఉంటే మరొకరికి కార్యదర్శి పదవి ఇవ్వవలసిందని కొందరు పార్టీ సభ్యులు సూచించారు. కానీ, చంద్రబాబు నాయుడుకే ఆ పదవి లభించింది. పి.ఉపేంద్ర ఢిల్లీలో తెలుగుదేశం పార్లమెంటరీ పార్టీ అధ్యక్షు డయ్యాడు. ఆ సమయంలోనే కేంద్రంలో ప్రధాని రాజీవ్‌గాంధీతో విభేదించి రక్షణ మంత్రి వి.పి.సింగ్ 'జనమోర్చా' అనే కొత్తపార్టీని స్థాపించాడు. 'బోఫోర్స్' విషయంలో ఎన్టీఆర్ సూచనపై ప్రతిపక్షపార్టీల సభ్యులు 1989 జులై 24న అంటే లోక్‌సభ ఎన్నికలకు నాలుగు నెలల ముందు పార్లమెంటు సభ్యత్వాలకు రాజీనామా చేశారు.

ఉపేంద్ర ఉత్థాన పతనాలు:

సమ్మతి, అసమ్మతి లేని రాజకీయ పార్టీలు మనదేశంలోనే లేవంటే అతిశయోక్తి కాదు. తెలుగుదేశం పార్టీ కూడా అందుకు అతీతం కాలేకపోయింది. నాదెండ్ల భాస్కరరావు అధ్యాయం పూర్తి కాగానే ఆ స్థానం పి.ఉపేంద్రకు లభించింది.

తెలుగుదేశం పార్టీ విజయ విహారాలలో అధినేతకు కుడి భుజంగా వ్యవహరించిన వ్యక్తిగా ఆ పార్టీ మొదటి ప్రధాన కార్యదర్శి ఉపేంద్రకు గౌరవం దక్కుతుంది. రాష్ట్రంలో తెలుగుదేశం ఓటమి, విజయాలకు ఉపేంద్ర చేసినదేమి లేకపోయినా, తెలుగు దేశం పార్టీని జాతీయ ప్రతిపక్ష పార్టీలతో అనుసంధానం చేయించి, వాటి మధ్య దానికి పెద్ద పీట లభించేటట్లు జరిగిన కృషిలో ఉపేంద్ర పాత్ర ప్రధానమైనది. మాజీ సోషలిస్టు నాయకులతో తనకున్న పూర్వ పరిచయాన్ని వినియోగించుకుని, ఉపేంద్ర తెలుగు దేశాన్ని ప్రతిపక్ష రాజకీయ రాకెటుకు తగిలించి ప్రయోగించగలిగాడు.

లోక్‌సభ ఎన్నికల్లో ఉపేంద్ర సిఫారసు చేసిన అనేక మందికి టికెట్లు ఇచ్చిన ఎన్టీఆర్, అసెంబ్లీ ఎన్నికల్లో ఆయన సిఫారసును ఏ మాత్రం ఖాతరు చేయలేదు. ఉపేంద్రకు కోరిన స్థానం తిరుపతి ఇవ్వక హిమాయత్ నగర్ స్థానమిచ్చారు. అక్కడ తెలంగాణా, తెలంగాణేతర విభేదాలు ఎక్కువగా ఉన్నాయి. అక్కడ ఆయన ఓటమి సహజం. ఎన్నికయితే తిరుగుబాటు చేస్తాడేమోననే అనుమానంతో ఉపేంద్రను ఎన్టీఆర్ ఢిల్లీ రాజకీయాలకే పరిమితం చేశారు. ఆయనను రాజ్యసభకు పంపించారు. ఉపేంద్ర తనకున్న నేర్పుతో జాతీయ రాజకీయాలలో ప్రముఖ స్థానం ఆక్రమించాడు. ఉపేంద్ర పలుకుబడి పెరగడంతో ఆయన పట్ల ఎన్టీఆర్‌కు అయిష్టం కూడా పెరిగింది. ఏది ఎలా ఉన్నా ఒక వ్యక్తి సమ్మోహనాశక్తి మీద ఆధారపడి నడిచే పార్టీలో ఆ వ్యక్తి నిరంకుశత్వానికి వ్యతిరేకంగా నోరు విప్పేవారెవరూ ఉండరు. ఒకవేళ ఎవరైనా అలా సాహసించినా ఎన్టీఆర్ వారి భరతం పట్టేవారు. తెలుగుదేశం పార్టీ మాజీ కార్యదర్శి ఉపేంద్ర వ్యవహారమే ఇందుకు నిదర్శనం. ఉపేంద్ర స్థానంలో చంద్రబాబు నాయుడు కార్యదర్శి అయ్యాడు.

1988 ఆగస్టు 6, 7, 8 వ తేదీలలో నేషనల్ ఫ్రంటు లాంఛనంగా ఏర్పడింది. ఎన్టీరామారావును ఫ్రంటు అధ్యక్షుడుగా, వి.పి.సింగ్‌ను కన్వీనర్‌గా ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. 1989 ఎన్నికలకు ముందు నేషనల్ ఫ్రంటు ఆధ్వర్యంలో వివిధ ప్రతిపక్షాలు సీట్ల సర్దుబాటు ఒప్పందం చేసుకున్నాయి. ఫలితంగా నేషనల్ ఫ్రంటు, వామపక్షాల కూటమి, బిజెపితో కలిసి దాదాపు 300 స్థానాలు ఫ్రంటు సంపాదించింది. వి.పి.సింగ్ ప్రధానమంత్రి అయ్యారు. తెలుగుదేశం రాజ్యసభ సభ్యుడు పి. ఉపేంద్రకు కేంద్రంలో సమాచార, ప్రసారశాఖల మంత్రిపదవి లభించింది.

1989లో జరిగిన శాసనసభ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ 180, టిడిపి 74, సిపిఐ 8, సిపిఎం 6, బిజెపి 4, మజ్లిస్ 4 ఇతర స్థానాలను ఇండిపెండెంట్లు ఇతరులు గెలుచుకున్నారు. రాష్ట్రంలో తిరిగి కాంగ్రెస్ అధికారంలోకి వచ్చింది.

1985 దిగ్విజయం తరువాత టి.డి.పి. ఒక్కొక్కవర్గానికి దూరమవుతూ వచ్చింది. ప్రభుత్వోద్యోగులు ఈ పార్టీకి దూరమయ్యారు. ఎంట్రీ టాక్సులతో వర్తక వర్గాలు దూరమైనాయి. తెలుగుదేశంపై ఆశలు పెట్టుకున్న వెనుకబడిన వర్గాలు కూడా నిరాశకు గురైనాయి. నిరుద్యోగం, చదువుల ఖర్చులు పెరిగి యువతరం దూరమైంది. ఆ తరువాత పార్టీ అదేపనిగా జిల్లాల్లో మూలస్తంభాలను కోల్పోవడం మొదలైంది. 'ఫ్యామిలీ రూల్' తాకిడికి ఎన్నో స్తంభాలు కూలాయి. నల్లపురెడ్డి శ్రీనివాసులురెడ్డి, ముద్రగడ పద్మనాభం, కె.ఇ.కృష్ణమూర్తి, జానారెడ్డి, వసంత నాగేశ్వరరావు, హరిరామ జోగయ్య, పెంచలయ్య, ఆనంద గజపతిరాజు, చింతా మోహన్ ఒక్కొక్కరే పార్టీనుంచి బయట పడ్డారు. వారు కాంగ్రెసులో చేరడంతో ఇటువైపు మైనస్, అటువైపు ప్లస్ అయింది.

ప్రజాస్వామ్యంలో ఏ పార్టీకి అధికారం శాశ్వతం కాదు. జనాభీష్టాన్ని బట్టి పార్టీల జాతకాలు తారుమారై చేతులు మారడం పార్లమెంటరీ సంప్రదాయం. ఈ ఎన్నికల్లో ఆ అంశం నిర్ద్వంద్వంగా రుజువైంది. ❑

9. ముగ్గురు ముఖ్యమంత్రులు

డా॥ మర్రి చెన్నారెడ్డి (03-12-1989 నుండి 7-12-1990):

ఎన్నికలలో కాంగ్రెసుకు స్పష్టమైన మెజారిటీ లభించగానే పి.సి.సి. అధ్యక్షుడు డా॥ మర్రి చెన్నారెడ్డి రెండవసారి రాష్ట్రముఖ్యమంత్రి అయ్యారు. ఆయన మంత్రివర్గం 1989 డిసెంబరులో ప్రమాణస్వీకారం చేసింది. ఈసారి చెన్నారెడ్డి పాలన అసంతృప్తితోనే ప్రారంభమైంది. అప్పటి నుంచి రెండుగా విడిపోయిన శిబిరాలను తిరిగి కలిపే పరిస్థితులుగానీ, కలుపుకునే ప్రయత్నాలు గానీ జరుగలేదు. రాజశేఖరరెడ్డి వెలుపల నుండి అసమ్మతివర్గంగా ఉంటే, జనార్దనరెడ్డి మంత్రిమండలిలో ఉన్న అసమ్మతి వర్గం. జనార్దనరెడ్డితో పోలిస్తే రాజశేఖరరెడ్డి పోరాటం వేరు. అది విరామంలేని వీధి పోరాటం వంటిది. ఎదురొడ్డి పోరాడటం తప్ప వెన్నుచూపి పారిపోవడం, వెన్నుపోట్లు పొడవటాలు తనకు అలవాటు లేదని రాజశేఖరరెడ్డి నిర్భయంగా అనేవారు.

డా॥ చెన్నారెడ్డి అమెరికా నుంచి తిరిగి వచ్చాక పలుమార్లు ఢిల్లీ వెళ్ళినా మంత్రివర్గ పునర్వ్యవస్థీకరణకు ఒక పట్టాన ఆమోదముద్ర లభించలేదు. అది అసంతృప్తిని పెంచిందే కానీ తగ్గించలేదు. హైకమాండ్ మొండిపట్టు కారణంగానే చెన్నారెడ్డిపై కత్తి కట్టిన శ్రీనివాసులురెడ్డికి మాత్రం స్థానభ్రంశం కలుగలేదు. ఉంచక తప్పనప్పుడు ఆయనతో మంచిగా మెలగడానికి ముఖ్యమంత్రికి మనస్కరించలేదు. పాడిపరిశ్రమలు లేని పశుసంవర్ధక శాఖనిచ్చి కించపరచడం ద్వారా ఆయనను రెచ్చగొట్టడం తప్ప సాధించింది శూన్యం.

పార్టీలో అసంతృప్తి కార్చిచ్చుగా వ్యాపించడానికి చెన్నారెడ్డి బాధ్యత కూడా ఉంది. పార్టీలోని అన్నివర్గాలను కలుపుకొని వెళ్ళాలన్న కోరిక, ఓపిక ఆయనకు

లేవు. ఆయన వ్యవహారశైలి ఎమ్మెల్యేలతో సన్నిహిత సంబంధాలకు ప్రతిబంధకమైనది. పార్టీ, ప్రభుత్వ వ్యవహారాలలో విశ్వాస పాత్రులైన తన అనుచరుల కిచ్చే విలువ ఇతరులకు ఇవ్వకపోవడం సహజంగానే సహచరులనేకమందిని నొప్పించింది.

చెన్నారెడ్డిని అప్రతిష్ఠపాలు చేయడానికి అదిష్ఠానవర్గం తనవంతు పాత్రను పోషించింది. నాయకుని ఎంపిక మొదలు కార్పోరేషన్ చైర్మన్ల నియామకం వరకు అధిష్ఠానవర్గం నిర్ణయించాలి. చెన్నారెడ్డి ఎప్పుడు ఢిల్లీకి వెళ్ళినా రోజుల తరబడి నిరీక్షిస్తేగాని రాజీవ్‌గాంధీ ఇంటర్వ్యూ దొరకలేదు.

కేంద్రంలో వి.పి.సింగ్ నేతృత్వంలోని ప్రభుత్వం 11 నెలల పరిపాలనానంతరం 1990 నవంబరు 7వ తేదీన తన మెజారిటీ నిరూపించుకోలేక కూలిపోయింది. చంద్రశేఖర్ నాయకత్వంలో కాంగ్రెసు మద్ధతుతో జనతాదళ్ (ఎస్) ప్రభుత్వం ఏర్పడింది.

ముఖ్యమంత్రి చెన్నారెడ్డి రాష్ట్రంలో ముఖ్యంగా రాజధాని నగరంలో శాంతి భద్రతల పరిరక్షణలో ఘోరంగా విఫలమయ్యారు. 1990 డిసెంబరు మొదటి వారంలో జరిగిన మతఘర్షణలో 71 మంది మరణించారు. 8 మంది పిల్లలు మృతి చెందారు. ఇది హైదరాబాద్ నగర చరిత్రలో అసాధారణమైన మారణకాండ.

పాతబస్తీలో మతఘర్షణల పరిస్థితిని అధ్యయనం చేయడానికి కాంగ్రెసు ఉన్నత స్థాయి ప్రతినిధి వర్గం అయిదుగురు సభ్యులతో బలరాం జక్కర్ నాయకత్వంలో మూడు రోజులు రాష్ట్రంలో పర్యటించింది. పాత బస్తీలోని పరిస్థితిని అదుపుచేసే బాధ్యత పోలీసుల నుంచి సైన్యం తీసుకోగా, శాంతిభద్రతలను పార్టీ ప్రతినిధి వర్గం ముఖ్యమంత్రి నుంచి తీసుకున్నట్లు కనిపించింది. వారు పర్యటించిన ప్రాంతంలో ఇచ్చిన సూచనలను సూచనలుగానే ప్రతినిధి వర్గం చెప్పుకున్న ముఖ్యమంత్రి వాటిని తు.చ. తప్పకుండా పాటించవలసి వచ్చింది.

హైదరాబాద్ పాతనగరంలో అకస్మాత్తుగా పెల్లుబికిన మత కలహాలు, మంత్రి శ్రీనివాసులురెడ్డి రాజీనామాల తాకిడితో పార్టీలో తీవ్ర సంక్షోభం ఏర్పడింది. చెన్నారెడ్డిని మార్చకపోతే రాష్ట్రంలో పార్టీ ప్రతిష్ఠ, కాంగ్రెస్(ఐ) అధ్యక్షుడు రాజీవ్‌గాంధీ ప్రతిష్ఠ

తీవ్రంగా దెబ్బతినే ప్రమాద పరిస్థితి ఏర్పడింది.

ఏడాది కాలం ముఖ్యమంత్రిగా ఉన్న చెన్నారెడ్డి గత తెలుగుదేశం ప్రభుత్వం ప్రవేశ పెట్టిన అనేక పథకాలు, వ్యవస్థల్ని రద్దుచేయడం, ఎన్టీఆర్ రద్దుచేసిన పథకాల్ని, వ్యవస్థల్ని పునరుద్ధరించడం ద్వారా సంచనలం సృష్టించారు. కోస్తా జిల్లాలలోని తుఫాను ప్రాంతాల్లో శాశ్వత పథకాల్ని అమలు చేయడానికి ప్రపంచ బ్యాంకు రుణాల్ని సాధించడంలో ఆయన చేసిన కృషిని ప్రజలు మరువలేదు. ముఖ్యమంత్రిగా ఉన్న ఏడాది కాలం సన్మానాలు, సంరంభాలు, వైద్య చికిత్సకు అమెరికా యాత్ర, వివాదాస్పద ప్రకటనలు, నిర్ణయాలు, పార్టీలో అసమ్మతి, అధిష్ఠాన వర్గం సహాయ నిరాకరణ, అవినీతి కుంభకోణాలు. నక్సలైట్ల బెడద, మత కల్లోలాలతో గడిచిపోయింది. పరిపాలనాదక్షుడిగా, రాజనీతిజ్ఞుడుగా దశాబ్దాల తరబడి రాజకీయ అనుభవం గడించినా, చెన్నారెడ్డి ఏడాది పాలన ఆ విధంగా ముగిసింది.

1990 డిసెంబరు 15వ తేదీన డా॥ మర్రి చెన్నారెడ్డి ముఖ్యమంత్రి పదవికి రాజీనామా చేశారు.

ఎన్. జనార్ధనరెడ్డి (17-12-1990 నుండి 9-10-1992):

డా॥ ఎం.చెన్నారెడ్డి స్థానంలో నేదురుమిల్లి జనార్ధనరెడ్డి 1990 డిసెంబరు 17వ తేదీన ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి అయ్యారు. 1955లో డా॥ బెజవాడ గోపాలరెడ్డి ముఖ్యమంత్రి అయిన తరువాత 35 ఏళ్లకు రాష్ట్రానికి నాయకత్వం వహించే అవకాశం నెల్లూరు జిల్లాకు లభించింది. జనార్ధనరెడ్డి మొదటి నుంచి కాంగ్రెసు పార్టీకి కట్టుబడి ఉన్న వ్యక్తి. ఎన్నో సందర్భాలలో జనార్ధనరెడ్డి ఎన్నో అవమానాలకు గురైనప్పటికీ పార్టీని మాత్రం వదలలేదు. 1985 ఎన్నికల్లో జనార్ధనరెడ్డికి టికెటు ఇవ్వకుండా అవమానించారు. 1988లో ఆయనను ప్రదేశ్ కాంగ్రెసు అధ్యక్షుడుగా నియమించి మూడు నాలుగు మాసాలలోనే తొలగించి చెన్నారెడ్డిని పిసిసి అధ్యక్షుడుగా నియమించారు. ఏదిఏమైనా జనార్ధనరెడ్డి కాంగ్రెస్‌పార్టీకి ఇందిరాగాంధీ కుటుంబానికి విధేయుడుగా ఉంటూ వచ్చిన ఫలితంగానే ఈనాడు ముఖ్యమంత్రి అయ్యారు. ఒక దశాబ్దకాలం ఆలస్యం అయినప్పటికీ జనార్ధనరెడ్డి ప్రదర్శించిన సహనానికి మంచి ఫలితం లభించిందని చెప్పవచ్చు.

ముఖ్యమంత్రిగా బాధ్యతలు స్వీకరించిన వెంటనే ప్రాంతీయ బోర్డుల రద్దు,

నక్సలైట్ల సమస్యపై పోలీసులకు స్వేచ్ఛ, మండల వ్యవస్థ కొనసాగింపు లాంటి నిర్ణయాలు కాంగ్రెస్‌పార్టీలో అందరికీ సంతృప్తిని కలిగించాయి. ప్రజలు హర్షించిన మరోపని పనిదినాలలో మార్పు. అది విద్యాసంస్థలు, ప్రభుత్వ కార్యాలయాలకు వారానికి ఆరు రోజుల పని తిరిగి ప్రారంభించడం. అధ్యాపకులు, ప్రభుత్వోద్యోగులు కూడా ఈ నిర్ణయాన్ని వ్యతిరేకించలేదు.

పి.సి.సి. అధ్యక్షుడు వి. హనుమంతరావు, ముఖ్యమంత్రి జనార్దనరెడ్డిల మధ్య ఉన్న విభేదాలు 1991 లోక్‌సభ ఎన్నికల సమయంలో అభ్యర్థుల నిర్ణయంలో బహిర్గతమయ్యాయి. అలాగే కొంతమంది కాంగ్రెస్ కార్యకర్తల పేర్లను ముఖ్యమంత్రికి సిఫారసు చేస్తూ పార్టీకోసం కష్టించి పని చేసేవారికి ప్రభుత్వరంగ పదవుల్లో నియమించవలసిందని హనుమంతరావు ఉత్తరం రాసినప్పటికీ ముఖ్యమంత్రి లెక్క చేయలేదు. రాజీవ్‌గాంధీతో చనువువల్ల ముఖ్యమంత్రితో విభేదాలు తగ్గించుకొనడానికి ఆయన సిద్ధమయ్యారు.

రాజీవ్‌గాంధీ హత్య:

1991 మే 21వ తేదీ రాత్రి మద్రాసు సమీపంలోని శ్రీ పెరంబుదూరులో ఒక ఎన్నికల సభలో మాట్లాడటానికి వెళ్ళిన రాజీవ్‌గాంధీ అమానుషమైన దారుణ హత్యకు గురైనారు. ఆయన హత్య దేశసార్వత్రిక ఎన్నికలను, మూడువారాల దూరానికి విసిరేస్తే పార్టీలో అంతకుమించి సమస్యలను, సంక్షోభాలను సృష్టించింది.

రాష్ట్రంలో మొదటి విడతగా జరిగిన లోక్‌సభ ఎన్నికలలో తెలుగుదేశంపార్టీ అత్యధిక స్థానాలలో గెలిచింది. 1989 పరిస్థితిని మార్చే ప్రయత్నం చేసింది. కానీ, రాజీవ్‌గాంధీ మరణానంతరం ఎన్నికలు జరిగిన నియోజకవర్గాలలో సానుభూతి పవనాల వెల్లువలో తెలుగుదేశం పార్టీ కొట్టుకుపోక తప్పలేదు. ఎన్టీఆర్ దీక్షగాని, ఆయన సినిమా ఆకర్షణ శక్తిగాని సానుభూతి పవనాలను ఎదుర్కోలేకపోయాయి. కాంగ్రెస్ 24, టి.డి.పి.13, మజ్లిస్1, సి.పి.ఐ1, సి.పి.ఎం1, బిజెపి1 స్థానాలు గెలుచుకున్నాయి.

ప్రధానిగా పి.వి.:

రాజీవ్‌గాంధీ హత్యానంతరం పి.వి.నరసింహారావు కాంగ్రెస్ పార్టీ అధ్యక్షు లయ్యారు. ఎన్నికల అనంతరం ఆయనే ప్రధానమంత్రి అయ్యారు. ప్రధానమంత్రిగా ఎన్నికైనప్పుడు పి.వి. పార్లమెంటు సభ్యుడు కాదు. ఆర్నెల్ల లోపల ఆయన పార్లమెంటుకు ఎన్నిక కావలసి ఉంది. పులివెందుల నుండి తన సోదరుని రాజీనామా చేయించి అక్కడి నుండి తను శాసన సభకు పోటీచేసి, కడప నుండి ప్రధానిని పోటీ చేయించి శాసన సభకు ఎన్నిక కావడం ద్వారా జనార్ధనరెడ్డికి పదవీ గండం కల్పించాలని వై.ఎస్. చేసిన వ్యూహ్యం తారుమారైంది. ప్రధాని నంద్యాల నుండి పోటీచేసి అఖండ విజయం సాధించారు.

కేపిటేషన్ ఫీజు వసూలుకు అనువుగా యాజమాన్యాలకు యాభైశాతం సీట్లు కేటాయించే ప్రాతిపదికన రాష్ట్రంలో 12 మెడికల్, 8 డెంటల్ కాలేజీలు ఏర్పాటుకు ముఖ్యమంత్రి అనుమతించారు. ఇందుకు సంబంధించిన జీ.వో 1992 జులైలో జారీ అయింది. దీనిపై రాష్ట్రవ్యాప్తంగా పెద్ద నిరసన వ్యక్తమైంది. విద్యార్థి వర్గాలు, రాజకీయ పార్టీలు ఆందోళనలు చేపట్టాయి. హైకోర్టులో లావాదేవీలు నడిచాయి. చివరకు 1992 సెప్టెంబరు 18న హైకోర్టు ఆ జీవోని కొట్టివేసింది. ముఖ్యమంత్రి వైద్య, దంత కళాశాలల ఏర్పాటుకోసం 'జనప్రియ' ఎడ్యుకేషనల్ అకాడమికి అనుమతి ఇవ్వడంతో బంధుప్రీతికి పాల్పడ్డారని కోర్టు వ్యాఖ్యానించింది. దీన్ని న్యాయమూర్తులు ఎంత తీవ్రంగా భావించారంటే రాష్ట్రప్రభుత్వం సుప్రీంకోర్టులో అపీలు చేసుకొనడానికి అనుమతి నిరాకరించారు. అంతకుముందు అసంతృప్తి వాదుల ఒత్తిడి పెరిగిపోవడంతో రాష్ట్రరాజకీయ పరిస్థితిని చక్కదిద్దడానికి ఢిల్లీ నుంచి అదిష్ఠానవర్గం పరిశీలకులు రావడం ఆ తరువాత వారు ప్రధానికి నివేదిక సమర్పించడం జరిగాయి. దీనిపై తదుపరి చర్య తీసుకోవలసిన అవసరం లేకుండానే కాగల కార్యం హైకోర్టు తీర్చినట్లయింది.

పూర్తికాలం ముఖ్యమంత్రిగా ఉండాలనుకున్న ముఖ్యమంత్రి ఎన్.జనార్ధనరెడ్డి మెడికల్ కాలేజి ఫైళ్ళపై పెట్టిన ఒక్క సంతకం ఆయనను ఇరవై నెలలకే గద్దె దించేసింది.

కోట్ల విజయభాస్కరరెడ్డి:

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర పదమూడవ ముఖ్యమంత్రిగా కోట్ల విజయభాష్కరరెడ్డి 1992 నవంబరు 9వ తేదీన ప్రమాణస్వీకారం చేశారు. నైతిక విలువల పునాదులపై సామాజిక, ఆర్థిక సంస్కరణల గోడలతో నూతన రాజకీయ సౌధం నిర్మించాలని ఆకాంక్షంచే అతికొద్ది మంది పాతతరం రాజకీయ నాయకులలో కోట్ల ఒకరు. రాష్ట్రంలో సారాయిని నిషేధించి ఆయన మహిళల అభిమానం పొందారు.

అంతకుముందు ముఖ్యమంత్రిగా ఉన్న మర్రి చెన్నారెడ్డి మాదిరిగా విజయభాస్కరరెడ్డిలో నిరంకుశత్వం లేదు. అయినా తన మంత్రులలోను, శాసన సభ్యులలోనూ మంచిపేరు తెచ్చుకోలేకపోయారు. జనార్ధనరెడ్డి ప్రభుత్వంతో పోలిస్తే కోట్ల ప్రభుత్వంలో అవినీతి తక్కువే. చెన్నారెడ్డి జనార్ధనరెడ్డిలతో పోలిస్తే విజయభాస్కర రెడ్డి రాజకీయ స్థాయి ఎక్కువ, అయినా ఆయన ప్రజల్లో చొచ్చుకుపోలేదు. ప్రజల్లో ఆయన పట్ల ఏమాత్రం ఉత్సాహం కనిపించలేదు. పాత తరహా రాజకీయాలు ఇప్పుడు ప్రజలను ఆకర్షించలేకపోయాయి. రాజకీయంగా సుదీర్ఘ అనుభవం, మచ్చలేని వ్యక్తిత్వం ఉన్నప్పటికీ ఆయన ప్రజలకు మంచిపాలన అందించడంలోను, పార్టీని పటిష్ఠంగా మలిచి ఎన్నికలను ఎదుర్కోవడంలోను ఎప్పుడూ విఫలమవుతూనే ఉన్నారు.

విజయభాస్కరరెడ్డి అన్నీ సవ్యంగా, సక్రమంగా చేసినట్లు కనిపిస్తారు. కాని మరెందుకో అవి మంచి ఫలితాలను ఇచ్చినట్లు కనబడవు. సారాపై నిషేధం ప్రకటించి ఆ ఆదాయం లోటును భర్తీ చేసుకునేందుకు టర్నోవరు టాక్సు విధిస్తే ప్రజలనుంచి తీవ్ర వ్యతిరేకత వచ్చింది. టాక్సు పేరుతో అన్ని వస్తువుల ధరలను విపరీతంగా పెంచడంతో సామాన్యుడిపై భారం పడింది. ఇది కోట్ల ప్రభుత్వంపై జనంలో నిరసన వ్యక్తం కావడానికి కారణమైంది. అలాగే ఎంతో కాలంగా ఎదురుచూసిన మంత్రివర్గ విస్తరణ కూడా నిరసననే మిగిల్చింది. అసంతృప్తికి తావు లేకుండా అన్ని వర్గాలకు ఉదారంగా మంత్రిపదవులు ఇచ్చినా అసమ్మతి జీవుల జోరు యథాతథంగా మిగిలింది.

రెండోసారి స్వయంగా అధికారాన్ని ఎన్టీఆర్‌కు అప్పగించడానికి కోట్ల వచ్చారనే చమత్కారానికి ఆయన గురి అయ్యారు. ధిక్కారయుతమైన ఆత్మవిశ్వాసం విజయభాస్కర రెడ్డి విలక్షణత. అవసరమైన విషయాలకు ప్రాధాన్యమిచ్చి, సమర్థ పాలన కొనసాగించా

లనే తత్వం ఆయనది. ఆ విషయంలో ఆయనను అంతా ప్రశంసిస్తారు. ఆయన జబర్దస్తీ శైలి మంత్రులకూ నచ్చకపోయినా కోట్ల సచ్చరిత్ర, సుదీర్ఘ పరిపాలనానుభవం వల్ల నిరసన తెలియజేయడానికి కానీ, తిరుగుబాటు చేయడానికి గాని వారు సాహసించ లేక పోయారు. అన్ని వర్గాలను కలుపుకొని వెళ్ళడమే తన విధానంగా, ప్రతి సమస్యకు సామరస్యపూర్వకంగా పరిష్కారం కనిపెట్టడం తన లక్ష్యంగా ఆయన ప్రకటిస్తూ వచ్చారు పిసిసి అధ్యక్షుడుగా మజ్జి తులసీదాస్ పార్టీ పరిస్థితిని అదుపు చేయలేకపోయారు. పార్టీ పరిస్థితి ఈ విధంగా ఉంటే ముఖ్యమంత్రి విజయభాస్కరరెడ్డి దీన్ని సరిదిద్దే ప్రయత్నం చేయలేదు.

తరచుగా మారుతున్న నాయకత్వంతో అభివృద్ధి కార్యక్రమాలు మారుతుంటాయి. కోట్ల విజయభాస్కరరెడ్డి ముఖ్యమంత్రి పదవి స్వీకరించే నాటికే రాష్ట్రంలో పార్టీ పరిస్థితి క్షీణ దశలో ఉంది. కానీ, ఈ రెండేళ్ళకాలంలో విజయభాస్కర రెడ్డి ఎంతో కృషి చేసి పార్టీ ప్రతిష్ఠ పెంచారు. పార్టీలో అంతఃకలహాలు లేకపోతే, అసమ్మతి వాదులు క్రమశిక్షణను వీడకపోతే రాష్ట్రచరిత్రలో విజయభాస్కరరెడ్డి పరిపాలించిన ఆ రెండేళ్ళ కాలం పుణ్యకాలంగానే గడచిపోయేది.

అసెంబ్లీ ఎన్నికలు సమీపిస్తూండటంతో కాంగ్రెసులోని వివిధ వర్గాలు పడగలు విప్పి ప్రత్యర్థి గ్రూపులను కాటువేసేందుకు సమాయత్తమైనాయి. పార్టీ అధిష్ఠానవర్గం కలుగజేసుకుని గ్రూపుల మధ్య విభేదాల పరిష్కారానికి ప్రయత్నాలు చేసినా ఫలితం కనిపించలేదు. ఎన్నికల వరకు రాజీధోరణి కంటే పోరాట పటిమనే ప్రదర్శించాలనే ముఖ్యమంత్రి అభిప్రాయమై ఉంటుంది. డా॥ రాజశేఖరరెడ్డి వర్గీయులు పట్టుదల వహించి కనీవినీ ఎరుగని రీతిలో అసమ్మతి కార్యక్రమాలు నడిపారు. కాంగ్రెసుపార్టీ ఇంతటి దయనీయమైన స్థితికి దిగజారడం ఇదే ప్రథమం. పాలకపక్షం, ప్రతిపక్షం అనేవి ప్రజాస్వామ్య రథానికి రెండు ఇరుసులు. ఒకటి విపరీతం, మరొకటి అతి స్వల్పం అయితే అభివృద్ధి పథంలో ప్రస్థానం దుర్లభం. ఇప్పుడు రాష్ట్రం ఆ సమస్యను ఎదుర్కోనుంది.

కాంగ్రెసు పార్టీకి కనీ వినీ ఎరుగని రీతిలో 26 స్థానాలు మాత్రమే లభించినా ఓటర్లలో వున్న దాని పునాది పోలేదు. 35 శాతానికి లోపు ఓట్లు రాకపోవడమే ఇందుకు కారణం. ❑

10. ఎన్టీఆర్ పతనం

1994 డిసెంబరులో జరిగిన ఎన్నికలలో తెలుగుదేశం పార్టీ విజయం ఒక జైత్రయాత్రగా కొనసాగింది. ఈ జైత్రయాత్ర వెల్లువలో అధికార కాంగ్రెసు పార్టీ అభ్యర్థులైన హేమా హేమీలు అనేకులు ఒక్క పెట్టున కొట్టుకు పోయారు. 'దేశం' మిత్రపక్షాలైన ఉభయ కమ్యూనిస్టులు గత మూడు దశాబ్దాలుగా ఎరుగనన్ని సీట్లపంట పండించుకున్నారు. తెలుగుదేశం విజయాలు ఆ పార్టీనేతల అంచనాలనే మించి పోయాయి. మొత్తం సీట్లు-292. కాంగ్రెస్-26, తెలుగుదేశం-219, బిజెపి-3, పి.పి.ఐ.-19, సి.పి.ఎం.-15, ఇతరులు-10. ఆదిలాబాద్, కరీంనగర్, ఖమ్మం, మహబూబ్‌నగర్, మెదక్, నల్లగొండ, రంగారెడ్డి, విజయనగరం, విశాఖపట్టణం జిల్లాల్లో కాంగ్రెసుకు ఒక్క సీటు కూడా లభించలేదు. తెలంగాణాలో కాంగ్రెసుకు లభించినవి ఆరు స్థానాలే.

ఎన్నికలకు ముందు ప్రజలకిచ్చిన వాగ్దానాలలో రెండు రూపాయల కిలో బియ్యం, సంపూర్ణ మద్యనిషేధాన్ని అమలు చేయడంలో ఎన్టీఆర్ కృతకృత్యులయ్యారు. 1989కి పూర్వం ముఖ్యమంత్రిగా ఉన్నంతకాలం కేంద్రలోని కాంగ్రెసు ప్రభుత్వంతో కయ్యానికి కాలుదువ్విన ఎన్టీఆర్ ఈసారి ముఖ్యమంత్రి కాగానే ఢిల్లీకి వెళ్ళి. 'పోలవరం నిర్మాణానికి సహాయం చేయండి ఆ ప్రాజెక్టుకు మీ పేరు పెడతా' అని ప్రధాని పి.వి.ని. కోరారు. కేంద్రంతో సత్సంబంధాలు నెలకొల్పుకోడానికి, అక్కడి నుంచి సహాయం పొందడానికి ప్రయత్నించారు.

ఎన్టీఆర్ 1993 సెప్టెంబరులో తిరుపతిలో 'మేజర్ చంద్రకాంత్' సినిమా శతదినోత్సవ సభలో వేదిక మీదనే శ్రీమతి లక్ష్మీపార్వతిని వివాహం చేసుకున్నట్లు ప్రకటించి ఎంత సంచలనం సృష్టించారో, శ్రీమతి పార్వతి ఆయన జీవితంలో ప్రవేశించి అంతకంటె ఎక్కువ సంచలనాన్ని సృష్టించారు. శాసనసభ ఎన్నికల్లో తెలుగుదేశం

పార్టీ ఘనవిజయం సాధించడంతో లక్ష్మీపార్వతి శక్తిమంతురాలైన నాయకురాలిగా తన పాత్రను ప్రదర్శించడం మొదలు పెట్టారు. పార్టీ లక్ష్మీపార్వతి హస్తగతం కావడం సహించని వారు పార్టీలో చీలిక తెచ్చారు. దీనికి చంద్రబాబు నాయుడు నాయకత్వం వహించారు. ప్రాతినిధ్య ప్రజాస్వామ్యంలో ప్రజాప్రతినిధుల ప్రాముఖ్యాన్ని గుర్తించడంలో విఫలమైన ఎన్టీఆర్ భారీ మూల్యమే చెల్లించుకోవలసి వచ్చింది. తాను నెలల తరబడి ఎన్నికల ప్రచారం సాగించి గెలిపించుకున్న పార్టీ సభ్యులే తనను విడిపోవడం అత్యంత బాధాకరమే. కానీ రాజీకి వున్న అన్ని అవకాశాలను ఆయన మొండిగా, మూర్ఖంగా జారవిడుచుకున్నారు. ఎం.ఎల్.ఏ.లను ఆయన ఏమాత్రం ఖాతరు చేయలేదు. ఎన్టీఆర్ కసిబూనితే తాము అవస్థలు పడవలసి వస్తుందని ఎమ్మెల్యేలు చంద్రబాబు, దగ్గుబాటిని జత చేసి కొండకు తాడుగట్టి లాగారు. ఫలితంగా కొండ తమ దగ్గరికి వచ్చింది. మిత్ర వాక్యాలను పెడచెవిని పెట్టడం, తనను ఎదురించలేరన్న గుడ్డి నమ్మకం, రెండో భార్య పట్ల ఎనలేని విశ్వాసం– ఇవన్నీ కలిసి ఎన్టీఆర్ రాజకీయ మహాభినిష్క్రమణకి దారితీశాయి.

సాధారణంగా రాజకీయాలలో అభిమానం కన్న అధికారం చాలా బలమైనది. ఎన్టీఆర్‌కున్న అభిమానం పోయేది. కాగా చంద్రబాబుకు రాబోయేది అధికారం కనుక ఎన్టీఆర్‌కున్న ఆకర్షణ కన్న చంద్రబాబుకు రాబోయే అధికారమే ప్రజలలోను, పార్టీలోను ఎక్కువ ప్రభావం కనబరచింది. క్రమశిక్షణాయితమైన ఎం.పి.లు, ఎమ్మెల్యేలు, కార్యకర్తలు ఉన్న తెలుగుదేశం పార్టీకి నాయకుడుగా ఉన్న రామారావు కేవలం ఒక మహిళవల్లనే పార్టీలో విశ్వాసం కోల్పోయారు. తెలుగుదేశంపార్టీ సర్వసభ్య సమావేశంలో ఆగస్టు 30న పార్టీ అధ్యక్షునిగా ఏకగ్రీవంగా చంద్రబాబు నాయుడును ఎన్నుకున్నారు. తొలుత ఎన్టీఆర్‌ను తొలగిస్తున్నట్లు తీర్మానం ఆమోదించిన తరువాత బాబును ఎన్నుకున్నట్లు ప్రకటించారు. 1995 ఆగస్టు 30వ తేదీన ఎన్టీఆర్ ముఖ్యమంత్రి పదవికి రాజీనామా చేశారు. 'నేనే తెలుగుదేశం–తెలుగుదేశమే నేను' అన్న నినాదంతో 13 ఏళ్లపాటు పార్టీని సర్వంసహాధిపతిగా ఏలిన ఎన్టీరామారావు ఆ విధంగా అధికార రాజకీయాలనుండి హఠాత్తుగా తెరమరుగయ్యారు.

రాష్ట్రప్రజల హృదయాలలో ఎన్టీ రామారావు చిరస్మరణీయమైన స్థానం సంపాదించుకున్నారంటే అందుకు కారణం సినిమాలే తప్ప రాజకీయాలు కావు.

తెలుగు చిత్రపరిశ్రమలో ఆయన తిరుగులేని నటుడు. ప్రతి సినిమాలోను ఆయన సద్గుణాలు మూర్తీభవించిన వ్యక్తి. అదేదో చాలా తేలికైన విషయం మాదిరిగా ఆయన తన సినిమాల్లో విలన్లను సునాయాసంగా మట్టికరిపించేవారు. ఆ ఇమేజ్‌ని ఓట్ల రూపంలో మార్చుకోగలిగితే తేలికగా ముఖ్యమంత్రి కావచ్చని ఆయన 1983లో నిరూపించారు. ఆయన పాలనాదక్షుడు కాడు. రాజకీయ వేత్త కాడు. ఆయన ఒకసారి గెలిచారు. మరోసారి ఓడిపోయారు. మళ్ళీ ముఖ్యమంత్రి కావాలనే లక్ష్యంతో ఆయన రెండు రూపాయలకే కిలో బియ్యం అందజేస్తానని వాగ్దానం చేశారు. మహిళలను ఆకట్టుకోవడానికి ఆయన మద్యనిషేధం కూడా ప్రకటించారు. అలా ఆయన గెలిచారు. అయితే ఆయన జనాకర్షణ పథకాల కోసం రాష్ట్రం 2000 కోట్ల రూపాయలమేరకు మూల్యం చెల్లించుకోవాల్సి వచ్చింది. దానితో ఖజానా ఖాళీ అయింది. ❑

11. చంద్రబాబునాయుడు రెండవ పాలన

కమలంతో స్నేహం:

1999 శాసనసభ ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీ బిజెపితో చేతులు కలపవలసి వచ్చింది. రాష్ట్రంలోని ఎనమిది లోక్‌సభ స్థానాలను, 25 శాసనసభ స్థానాలను టిడిపి తన మిత్రపక్షం బిజెపికి వదిలిపెట్టింది. చంద్రబాబు నాయుడు 1998లో వాజ్‌పేయి ప్రభుత్వానికి అంశాల ప్రాతిపదికన మద్దతునివ్వడంతో టిడిపికి మొదటి నుంచి అండగా నిలిచిన సి.పి.ఐ., సి.పి.ఎం.లు ఆ పార్టీతో తెగతెంపులు చేసుకున్నాయి. దానితో చంద్రబాబుకు బిజెపితో చేతులు కలపడం మినహా మార్గం లేకపోయింది. బిజెపికి ఎక్కువ నియోజకవర్గాలు ఇవ్వడం బాబుకు ఇష్టంగా లేదు. అలా చేస్తే ఆ పార్టీ రాష్ట్రంలో బలమైన శక్తిగా అవతరించే అవకాశం ఉండటమే కాకుండా రేపు అధికారం కోసం దానిమీద ఆధారపడాల్సిన పరిస్థితి ఏర్పడవచ్చు. ఆ పరిణామాన్ని నివారించడానికే చంద్రబాబు బిజెపికి వీలైనన్ని తక్కువ స్థానాలు ఇవ్వాలని నిర్ణయించుకున్నారు.

ఎవరితోనూ పొత్తులేకపోతే లోక్‌సభ ఎన్నికల్లో తాము పూర్తిగా తుడిచిపెట్టుకు పోయే ప్రమాదం ఉందని కమ్యూనిస్టు పార్టీలు గ్రహించాయి. ఇతర పార్టీలతో చేతులు కలపని పక్షంలో తనకు ఒక జాతీయ పార్టీగా గుర్తింపు పొందడానికి కావలసిన ఓట్లు కూడా రావని సిపిఐ భావించింది. ఓట్ల సంఖ్యను పెంచుకునే ఉద్దేశంతో అవి 90 శాసనసభ 12 లోక్‌సభ స్థానాలలో అభ్యర్థులను నిలబెట్టాయి. ఏతావాతా అన్న టిడిపి నాయకుడు హరికృష్ణను అడ్డం పెట్టుకుని చంద్రబాబును దెబ్బతీయాలనుకున్నాయి. గత అసెంబ్లీలో కేవలం 26 సీట్లు గెలుచుకున్న కాంగ్రెస్ కొత్త అసెంబ్లీలో 90 సీట్లు గెలుచుకోవడమే ఆ పార్టీకి ఊరట కలిగించే విషయం. జాతీయస్థాయిలో ఇప్పుడు టిడిపి 29 సీట్లతో బిజెపికి పెద్ద మిత్రపక్షంగా అవతరించింది. ఎన్టీఆర్

వారసులమని చాటుకుంటూ రంగంలోకి దిగిన ఎన్టీఆర్ టిడిపి అధ్యక్షురాలు లక్ష్మీపార్వతి, అన్నా టిడిపి అధ్యక్షుడు నందమూరి హరికృష్ణలు తమ పార్టీ అభ్యర్థులను గెలుపించుకోలేకపోవడమే కాదు వారే ఓడిపోయారు. కాంగ్రెసు సర్వశక్తులు ఒడ్డి పోరాడినా అధికారం దగ్గరికి రాగానే విఫలమైంది.

తెలుగు దేశం పార్టీ ఇంత భారీమెజారిటీతో గెలుపొందుతుందని ఎవరూ ఊహించలేదు. వాజ్‌పేయి ప్రభుత్వంపై ఉన్న అభిమానం చంద్రబాబు నాయుడు అభివృద్ధి కార్యక్రమాలు కలసి టిడిపి–బిజెపి కూటమికి 36 లోక్‌సభ సీట్లను, అసెంబ్లీలో 192 సీట్లను సాధించి పెట్టాయి. అసెంబ్లీలో మూడింట రెండింతల మెజారిటీకి ఇది కొద్దిగా మాత్రమే తక్కువ. ఇక కాంగ్రెస్ పార్టీ కేవలం 5 లోక్‌సభ సీట్లతో సర్దిపెట్టుకోవలసి వచ్చింది.

హరికృష్ణ:

1995లో తండ్రిని ఎదిరించి చంద్రబాబుతో చేతులు కలిపి శాసనసభ్యుడు కాకపోయినా మంత్రి అయి, అరుమాసాలు కొనసాగిన హరికృష్ణ ఆ తరువాత తెరమరుగున ఉండిపోయారు. పిమ్మట శాసన సభకు ఎన్నికైనా మంత్రివర్గంలో స్థానం లభించలేదు. తెలుగు యువత అధ్యక్షుడు నందమూరి హరికృష్ణ ఆ పార్టీ అధినేత చంద్రబాబు పనితీరుపై విరుచుకపడటం మొదలు పెట్టారు. ఈ ఇద్దరి మధ్య పరోక్ష యుద్ధం జరిగింది. హరికృష్ణ శాసన సభ్యత్వానికి రాజీనామా చేసి 1999 జనవరి 27న అన్నా టిడిపి స్థాపించారు.

పరిపాలనలో మార్పు:

1999 ఎన్నికల్లో చంద్రబాబు నాయుడు ఘనవిజయం రాష్ట్రానికే కాదు, యావత్ భారతదేశానికి కూడా చాలా ముఖ్యమైన వార్త అయింది. ఈ రోజుల్లో జనాకర్షణ పథకాలను తోసి రాజనగల సాహసం చేసిన ఏకైక ముఖ్యమంత్రి ఆయన ఒక్కరే. ఆయన ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టే నాటికి రాష్ట్రం చాలా వరకు దివాలా తీసింది. ఆయన మామగారు ఎన్టీ రామారావు అనుసరించిన జనాకర్షక పథకాలతో రాష్ట్రం ఆర్థికంగా బాగా చితికి పోయింది. ఆయన గత కాలపు విధానాలను

అనుసరించే వ్యక్తి అయి ఉంటే వీటి ద్వారా మరింతగా ప్రయోజనం పొంది ఉండేవారు. ఇటువంటి పథకాలను ఆశ్రయించే రాజకీయ నాయకులు తామేదో భాగ్యదేవత అయినట్లు ఎవరేది కోరినా ప్రసాదిస్తుంటారు. రెండు రూపాయల కిలో బియ్యం, మూడు రూపాయల చీర, ఉచితంగా విద్యుచ్ఛక్తి, ఉచితంగా గృహవసతి, హైదరాబాద్ వీధుల్లో పనిపాటా లేకుండా తిరగడం వగైరా వగైరాలని ఈ ఊబిలో చేర్చవచ్చు.

ఈ పరిస్థితిని ఎదురీదాలని చంద్రబాబు భావించారు. అది తనను ప్రజలకు దూరం చేసే ప్రమాదం ఉందని తెలిసినప్పటికీ, ఆయన తెగించారు. ఇంతవరకు జనాకర్షణ పథకాలతో, కాలం చెల్లిన విధానాలతో పాలించడం జరుగుతోందనీ, నిజానికి ఇటువంటి విధానాలు ప్రపంచంలో ఎక్కడా విలువలేదని ఆయన ప్రజలకు నచ్చచెప్పడం ప్రారంభించారు. ప్రభుత్వమంటే పాలించడానికే ఉంది తప్ప పెత్తందారుగా వ్యవహరించడానికి కాదని ఆయన నిరూపించేందుకు ప్రయత్నించారు. రెండు రూపాయలకు కిలో బియ్యం వంటి భారీ సబ్సిడీ పథకాలకు ఆయన మంగళం పాడారు. మద్యనిషేధం మంచి ఆలోచనే కానీ ఆంధ్రప్రదేశ్‌లోనే కాదు, ప్రపంచంలోనే ఎక్కడా కూడా విజయం సాధించే అవకాశం లేనేలేదని తేల్చి చెప్పారు.

ప్రభుత్వాన్ని ఆధునీకరించే ప్రక్రియలో ఆయన కంప్యూటరు విధానాల్ని ప్రవేశపెట్టారు. భూమి రికార్డులను కంప్యూటరీకరించడం మొదలు పెట్టారు. కోర్టు కేసులలో అధిక భాగం భూమికి సంబంధించిన తగాదాలే. అటువంటి పరిస్థితుల్లో భూమి రికార్డుల కంప్యూటరీకరణ వల్ల కేసులను తేలికగా, త్వరగా పరిష్కరించడానికి వీలవుతుంది. కంప్యూటరు నొక్కితే చాలు ఎవరికి ఎక్కడ భూమి ఉందో తెలిసిపోతుంది. ఆయన జన్మభూమి కార్యక్రమాలు ప్రారంభించారు. రైతుబజార్ల పేరుతో రైతుల కోసం మార్కెట్లు తెరిచారు.

రాష్ట్ర రాజకీయాలను ఎన్టీఆర్ తరువాత ఎక్కువగా ప్రభావితం చేసిన చంద్రబాబు నాయుడుకి మరో పదిహేనేళ్లు తాను ముఖ్యమంత్రిగా అధికారంలో ఉండాలని ఒక కల (విజన్) ఉండేది. దీన్ని సాకారం చేసుకునేందుకు ఆయన ఎన్నో పథకాలను ప్రవేశపెట్టారు. ప్రపంచ బ్యాంకు ముందు సాగిలపడ్డారు. రాష్ట్రాభివృద్ధికి కావాల్సిన నిధులను రప్పించుకున్నారు. ప్రపంచ బ్యాంకు నిబంధనలమేరకు సంక్షేమ పథకాలను తొక్కిపట్టారు. సాగునీటి ప్రాజెక్టులు,

వ్యవసాయాన్ని అస్సలు పట్టించుకోలేదు. ప్రభుత్వ అధికారులను బెంబేలెత్తిస్తూ, క్షణ క్షణానికి ఆకస్మిక తనిఖీలు, ప్రజల వద్ద పాలన, జన్మభూమి వంటి పథకాలు నిర్వహించారు. కట్టెల పొయ్యిలతో పొగచూరిన మహిళల బతుకుల్లో వెలుగు నింపేందుకు గ్యాస్ కనెక్షన్లు మంజూరు చేయించారు. డ్వాక్రా గ్రూపులకు రుణాలిచ్చారు. ఇన్ని తెలివి తేటలుండి కూడా ఆయన 2004 నాటి ఎన్నికల్లో ఓడిపోయారు. ఎప్పుడైతే రైతులను పట్టించుకోలేదో అప్పుడే నారా చంద్రబాబు నాయుడుని ప్రజలు వ్యతిరేకించడం మొదలు పెట్టారు. ఇటు ఉద్యోగస్థులను రాత్రి అనక పగలు అనక జన్మభూమి, ప్రజలవద్దకు పాలన అంటూ నిద్రాహారాలు లేకుండా గురిచేసినందుకు వారిలోనూ వ్యతిరేకత పెరిగిపోయింది. ఫలితంగా ఆయనకు పరాజయం దరి చేరింది.

కేంద్రంతో సంబంధాలు:

1995లో చంద్రబాబు నాయుడు రాష్ట్రంలో అధికారంలోకి వచ్చినప్పటి నుండి జాతీయ రాజకీయాలలో కీలక పాత్ర పోషిస్తూ వచ్చారు. 1996లో లోక్‌సభకు జరిగిన ఎన్నికలలో 'హంగ్' ఏర్పడిన సందర్భంగా కాంగ్రెస్, బిజెపిలకు ప్రత్యామ్నాయంగా యునైటెడ్ ఫ్రంట్ రూపొందడంలో చంద్రబాబు ప్రధాన పాత్ర పోషించారు. అప్పట్లో టిడిపికి లోకసభలో 16 స్థానాలున్నాయి. పెద్ద పార్టీగా అవతరించిన బిజెపి వాజ్‌పేయి నేతృత్వంలో కేంద్రంలో ప్రభుత్వాన్ని ఏర్పరచింది. 13 రోజుల పాటు సాగిన బిజెపి ప్రభుత్వం తన మెజారిటీని నిరూపించుకోలేక రాజీనామా చేసింది. ఫలితంగా కాంగ్రెస్ మద్దతుతో యునైటెడ్ ఫ్రంట్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చేలా చంద్రబాబు చక్రం తిప్పారు. ఆ ప్రభుత్వంలో తెలుగుదేశం పార్టీ కూడా అధికారం పంచుకుంది.

1998 ఎన్నికల్లో తిరిగి ఏ పార్టీకి మెజారిటీ రాలేదు. ఆ ఎన్నికల్లో లోక్‌సభలో 12 స్థానాలు పొందిన తెలుగుదేశానిది కీలక పాత్ర అయింది. బిజెపితో జట్టుకట్టిన తెలుగుదేశం పార్టీనేత చంద్రబాబు నాయుడు జాతీయ స్థాయిలో ఏన్డీఏ కూటమి ఏర్పాటు కావడంలో ప్రధాన భూమిక వహించారు. ఆ తరువాత నుంచి జాతీయ రాజకీయాలలో ఆయన ఒక వెలుగు వెలిగారు. లోక్‌సభ స్పీకరు పదవిని తెలుగు

దేశం స్వీకరించినప్పటికీ ప్రభుత్వంలో చేరకుండా బయట నుంచే మద్దతు తెలిపింది. అన్నా డి.ఎం.కె. తన మద్దతును ఉపసంహరించుకోవడంతో 13 నెలల్లోనే ఎన్డీఏ ప్రభుత్వం కూలింది.

1999 ఎన్నికల్లో తిరిగి ఎన్డీఏ కూటమితో కలిసి పోటీ చేసిన టిడిపి రాష్ట్రంలో 29 లోక్‌సభ స్థానాలను కైవసం చేసుకుంది. స్పీకరు పదవిని మాత్రమే తీసుకుని ఆ ప్రభుత్వానికి బయటనుంచే మద్దతు ప్రకటించింది. స్పీకరు బాలయోగి ప్రమాదంలో మృతి చెందగా ఆ పదవినీ వదులుకుంది. నమ్మకస్థుడైన మిత్రుడుగా వ్యవహరించిన టిడిపి అధినేత చంద్రబాబు నాయుడుకి బిజెపి నేతలు గౌరవ మన్ననల్ని అందించారు. కేంద్రం నుంచి రాష్ట్రానికి కావలసినన్ని వనరులు చంద్రబాబు అడిగినదే తడవుగా అందించారు. కూటమితో ఇతర పక్షాలతో ఎన్నో చిక్కులు ఎదురైనా తెలుగుదేశం పార్టీనుంచి మాత్రం బిజెపికి సమస్యలు ఏర్పడకపోవడంతో ఇతర నాయకులకన్నా చంద్రబాబుకే ఎక్కువ ప్రాధాన్యం లభించింది.

యునైటెడ్ ఫ్రంట్ ప్రభుత్వాలు అధికారంలో ఉండగా ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఫ్రంటు సారథ్య సంఘం కన్వీనరుగా తన పాత్రను సీరియస్‌గా తీసుకున్నారు. ముఖ్యమంత్రి పాత్రను ఓ పక్కన పెట్టి రోజూ విమానంలో ఢిల్లీ రావడానికీ, పోవడానికీ ఎక్కువ సమయం వినియోగించారు. ఢిల్లీలో తన పట్టు ఉండాలని తెగ తాపత్రయ పడేవారు. గతంలో రామకృష్ణ హెగ్డే, ఎన్టీఆర్, దేవీలాల్, జాతీయ రాజకీయాలలో పడి రాష్ట్రాల ప్రాథమిక బాధ్యతను విస్మరించారు. అప్పుడు వారికి పట్టిన గతే ఇప్పుడు చంద్రబాబుకు పట్టింది.

చంద్రబాబునాయుడు అధికారంలో ఉన్నప్పుడు సమాచార, సాంకేతిక పరిజ్ఞానానికి పెద్దపీట వేసి మిగిలిన రంగాలను నిర్లక్ష్యం చేశారు. నిజానికి ఆయన పాలనలో రాష్ట్ర ప్రజలకు మేలు కంటే కీడే ఎక్కువ జరిగింది. ఆయన విధానాలు తక్కువ జనాభా కలిగిన బ్రూనేవంటి దేశాలకు వర్తిస్తాయేమో కానీ, అధిక జనాభా గల మనదేశానికి ముఖ్యంగా మన రాష్ట్రానికి వర్తించవు. ఉదాహరణకు, ఆరోగ్యంగా నడుస్తున్న ప్రభుత్వరంగ సంస్థలను ప్రపంచ బ్యాంకు సలహా మేరకు మూయించేయడమే కాకుండా వి.ఆర్.ఎస్. పేరుతో అనేక లక్షలాది ఉద్యోగుల్ని ఇంటిదారి పట్టించారు. పశ్చిమబెంగాల్ ముఖ్యమంత్రిగా దీర్ఘకాలం వ్యవహరించిన జ్యోతిబసు రికార్డును

అధిగమించాలన్న చంద్రబాబు నాయుడు ఆశలకు తెలుగు ప్రజలు గండి కొట్టారు. రాష్ట్రంలో తమంతటి రాజకీయ వ్యూహ రచనా నిపుణుడు మరొకడు లేడన్న అవధులు మీరిన ఆత్మవిశ్వాసంతో కాంగ్రెసు పాలనకు తెరతీసారు. పార్టీలోని సహచర నాయకులను ఏమాత్రం నమ్మని చంద్రబాబు అధికారులిచ్చే గణాంకాలు, నివేదికలమీద ఆధారపడ్డారు. క్షేత్రస్థాయిలో ఉన్న వ్యక్తులను గుర్తించకుండా ప్రతి అంశంపై ముందుగానే ఒక అభిప్రాయాన్ని ఏర్పరచుకున్నారు. దాన్ని ఎటువంటి పరిస్థితుల్లోనూ మార్చుకోని చంద్రబాబునాయుడు పార్టీలో తనకంటూ ఒక విశ్వసనీయ నేతల బృందాన్ని తయారు చేసుకోలేక పోయారు. ప్రజల్లో పలుకుబడి ఉన్న నాయకులను పార్టీలో ఒక స్థాయికి మించి ఎదుగనీయకుండా చేశారు.

ప్రతికూల పరిస్థితులెదురైనప్పుడల్లా ఏదో ఒక జనాకర్షణ పథకాన్ని ప్రయోగించడం చంద్రబాబుకు వెన్నతో పెట్టిన విద్య. కానీ ఆ పథకాలు ముఖ్యమంత్రికి ప్రచారం తెచ్చి పెట్టడమే తప్ప తమకు లబ్ధిచేకూర్చేవి కావని ప్రజలకు తెలుసు. ఏది ఏమైనా ఒక జనాకర్షణ పథకం ముగిసిన వెంటనే మరో కొత్త పథకాన్ని ప్రకటించడం చంద్రబాబు ఆనవాయితి. 1995 సెప్టెంబరులో అధికార పగ్గాలు చేపట్టిన నాటి నుంచి ఎన్నో పథకాలను ప్రారంభించారు. కానీ ఆ పథకాలను కట్టుదిట్టంగా అమలు చేసి పరిపాలనా సామర్థ్యాన్ని పెంచాలన్న చిత్తశుద్ధి కొరవడింది. ఉదాహరణకు ప్రజల వద్దకు పాలనాకార్యక్రమాలు విజయవంతమైనా, ఒక వారం రోజుల మురిపెం తర్వాత 1995 అక్టోబరులో ముఖ్యమంత్రి ఈ కార్యక్రమానికి స్వస్తి చెప్పి వెంటనే శ్రమదానం పథకం ప్రారంభించారు. స్వయంగా చీపురు పట్టుకుని వీధులు ఊడ్చటానికి ఉపక్రమించారు.

ప్రకటించటానికి కొత్త పథకాలేవీ తట్టకపోతే ముఖ్యమంత్రి ప్రభుత్వ కార్యాలయాలను, ఆస్పత్రులను ఆకస్మాత్తుగా తనిఖీలు చేశారు. ఆ తనిఖీలకు పాత్రికేయులను వెంట తీసుకు వెళ్ళడం మరచిపోరు. మరికొన్ని జన చైతన్య యాత్రలు నిర్వహించేవారు. గ్రామ, మండల, రెవిన్యూ డివిజన్, పట్టణ స్థాయిలలో సమావేశాలు నిర్వహించి తమ ప్రభుత్వం ఏ మేరకు ప్రజా సమస్యలను పరిష్కరించిందో ప్రజలకు వివరించేవారు. మనదేశంలో ప్రజలు నూతన పథకాలను అకస్మాత్తుగా అంగీకరించరు. చంద్రబాబు పథకాలకు కూడా ఇదే గతి పట్టింది. ❑

12. తెలంగాణ రాష్ట్ర సమితి

ఉద్యమమే ఊపిరిగా కె.సి.ఆర్.:

కేంద్రంలో ఎన్డీఏ కూటమి దేశంలో మూడు కొత్త రాష్ట్రాలు ఏర్పాటు చేయాలని నిర్ణయించడంతో నిద్రాణమై ఉన్న తెలంగాణావాదం మరోసారి తెరపైకి వచ్చింది. రాష్ట్ర అసెంబ్లీ ఉప సభాపతి పదవికీ, శాసన సభ్యత్వానికి తెలుగుదేశంపార్టీ ప్రాథమిక సభ్యత్వానికి రాజీనామా చేసి కల్వకుంట్ల చంద్రశేఖరరావు తెలంగాణా రాష్ట్రసమితిని స్థాపించారు. విశాలాంధ్రలో దశాబ్దాలుగా కొనసాగుతున్న వివక్షవల్ల తెలంగాణా నిర్లక్ష్యానికి గురైందని ఆయన వివరించారు. తెలంగాణాలో స్థిరపడ్డ ఆంధ్ర ప్రాంతం వారితో తనకు ఇబ్బంది లేదని, పొట్టకొడుతున్న వారితోనే తప్ప పొట్టకూటికోసం వచ్చిన వారితో తమకే పంచాయితీ లేదన్నారు.

తెలంగాణా రాష్ట్రసమితి ఆవిర్భావంతో ప్రత్యేక తెలంగాణా రాష్ట్ర అంశం ఈ ప్రాంతంలో ఒక ప్రధాన అంశం అయింది. అయితే తనకు తానుగా ఒక లక్ష్యాన్ని సాధించడానికి తనకంత శక్తి లేదని అర్థం చేసుకున్న ఈ పార్టీ అధినేత కె. చంద్రశేఖర రావు చివరకు 2004 ఎన్నికలకు ముందు కాంగ్రెసుతో చేతులు కలిపారు. ప్రత్యేక తెలంగాణా రాష్ట్రాన్ని ఏర్పాటు చేయడానికి సి.పి.ఐ. సుముఖంగా ఉంది.

2004 లో జరిగిన ఎన్నికలలో టి.ఆర్.ఎస్. అయిదు లోక్‌సభ స్థానాలు, 26 అసెంబ్లీ సీట్లు గెలుచుకుని ఢిల్లీలో, హైదరాబాద్‌లో కాంగ్రెస్ నాయకత్వంలోని ప్రభుత్వాలలో భాగస్వామి అయింది. చంద్రశేఖరరావు ఆయన సీనియరు సహచరుడు ఏ.నరేంద్ర కేంద్రంలో పదవులు చేపట్టగా కె.సి.ఆర్. మేనల్లుడు టి. హరీశ్‌రావుతో సహా మరో ఆర్గురు వై.ఎస్. మంత్రివర్గంలో సభ్యులయ్యారు.

రాష్ట్ర క్రీడల శాఖమంత్రి ఎం. సత్యనారాయణరావు విసిరిన సవాలు వల్ల కరీంనగర్ లోక్‌సభ ఉప ఎన్నిక జరిగింది. 1980లో సత్యనారాయణరావు కరీంనగరు

నుంచి 1,56,328 ఓట్ల మెజారిటీతో గెలిచారు. అంతవరకు అదే పెద్ద రికార్డు. ఈసారి కె.సి.ఆర్. 2,01,582 ఓట్ల మెజారిటీతో అద్భుత విజయం సాధించారు. ఆంధ్రప్రదేశ్‌లోని ప్రధాన రాజకీయ పార్టీలతో టి.ఆర్.ఎస్. ఒక పెద్ద ఎన్నికల పోటీలో తలపడడం ఇదే మొదటిసారి. ఒక ప్రాంతీయ పార్టీ తన కాళ్ళపై తాను నిలబడగలదనే విషయాన్ని అది తిరుగులేని విధంగా నిరూపించింది. తెలంగాణా ప్రత్యేక రాష్ట్ర డిమాండ్‌తో పార్లమెంట్‌లో బిల్లును ప్రవేశపెడుతామని బిజెపి వాగ్దానం చేసింది. కాని ఆ పార్టీ అభ్యర్థి సిహెచ్. విద్యాసాగరరావు అవమానకరమైన రీతిలో తన ధరావతు కోల్పోయారు. ఆయన కె.సి.ఆర్. ఓటును చీల్చడానికి బదులుగా తన ఓట్లనే టి.ఆర్.ఎస్. కు కోల్పోయారు. టి.ఆర్.ఎస్, కాంగ్రెస్ పొత్తుకు కారణమేమిటి? తమ కొత్త పొత్తుతో తాము చంద్రబాబునాయుడును మూడవసారి అధికారంలోకి రాకుండా అడ్డుకోగలమని కాంగ్రెసు గట్టి నమ్మకంతో ఉంది.

2004 శాసనసభ ఎన్నికల్లో తెలంగాణా ప్రాంతంలో కాంగ్రెస్ పోటీ చేసిన 52 సీట్లలో 48 సీట్లు గెలుచుకోగా టి.ఆర్.ఎస్. కేవలం 26 సీట్లను గెలుచుకో గలిగింది. తెలుగుదేశం పార్టీ కేవలం 11 సీట్లను గెలుచుకున్నది. ఆ పార్టీ లోక్‌సభలో ఒక స్థానం మాత్రమే గెలిచింది.

తెలంగాణా రాష్ట్రం ఇవ్వడంలో కేంద్రంలోని ఐక్య ప్రగతిశీల కూటమి ప్రభుత్వం విఫలమైనందుకు నిరసనగా రాష్ట్రంలోని 18 శాసనసభ స్థానాలకు, 4 లోక్‌సభ స్థానాలకు టి.ఆర్.ఎస్. సభ్యులు రాజీనామా చేశారు. 2008 సం॥లో మేలో జరిగిన ఉప ఎన్నికలలో టి.ఆర్.ఎస్. రాజీనామా చేసిన వారినే బరిలో దింపింది. ఉద్యమ పథంలో అత్యంత కీలకమైన ఉప ఎన్నికల్లో తెలంగాణా రాష్ట్ర సమితికి అనూహ్య, ఆశ్చర్యకర, దిగ్భ్రాంతికర ఫలితాలు వచ్చాయి. కె.సి.ఆర్. ఈసారి 15,765 ఓట్లతో బయట పడ్డారు.

ఉప ఎన్నికల ఫలితాలతో ఢిల్లీ పెద్దల దిమ్మదిరిగేలా చేస్తే దెబ్బకు దిగివచ్చి తెలంగాణా ఇస్తారని అంటూ కాంగ్రెసు అధిష్టానాన్ని ప్రభావితం చేయబోయిన కె.సి.ఆర్. వ్యూహం బెడిసికొట్టింది. నిజామాబాద్ జిల్లాలో తెరాస చేతుల్లో ఉన్న రెండు స్థానాలను కాంగ్రెస్ కైవసం చేసుకుంది. ప్రజాతీర్పుతో దిగ్భ్రాంతి చెందిన కె.సి.ఆర్. వెంటనే పార్టీ పదవికి రాజీనామా చేశారు. సీనియరు నాయకులు, కార్యకర్తల

ఒత్తిడివల్ల చివరకు రాజీనామా ఉపసంహరించుకున్నారు. ఆ విధంగా ఉపఎన్నికల్లో పార్టీ ఓటమి నుంచి అందరి దృష్టిని మళ్ళించగలిగారు. కాంగ్రెస్‌లోకి టి.ఆర్.ఎస్. నాయకుల వలసలను ప్రస్తుతానికి నివారించగలిగారు.

2009 సార్వత్రిక ఎన్నికల్లో రాజకీయంగా భారీగా నష్టపోయిన కె.సి.ఆర్. చాలాకాలం మౌనముద్ర దాల్చారు. అంతర్గతంగా తెలంగాణా ఉద్యమానికి జవసత్వాలు నింపేందుకు ప్రయత్నించారు. 2009 నవంబరు 29న తెలంగాణా రాష్ట్రసాధన కోసం 11 రోజులపాటు దీక్ష చేశారు. తద్వారా తనకు దూరమైన తెలంగాణా వాదులు, ఉద్యమసంస్థలను దగ్గరికి తెచ్చుకోగలిగారు. కేంద్రంపై ఒత్తిడి పెంచగలిగారు.

2012 మార్చిలో జరిగిన 8 స్థానాల ఉప ఎన్నికలలో తెలంగాణాలో పోటీ చేసిన అయిదు స్థానాల్లో నాలుగు చోట్ల తెరాస విజయ ఢంకా మోగించింది. కాంగ్రెస్ అభివృద్ధి మంత్రం పనిచేయలేదు. ఇప్పటి వరకు తెలుగుదేశం పార్టీ, కాంగ్రెస్ వారే నెగ్గుతూ వచ్చిన ఆదిలాబాద్, కొల్లాపూర్, కామారెడ్డి నియోజక వర్గాల్లో తొలిసారి తెరాస పాగా వేసింది. తెలంగాణా రాష్ట్ర సమితి ఆవిర్భవించిన 12 ఏళ్ళలో విశ్వసనీయతకు లభించిన పరీక్షలతో సహా అనేక ఒడుదుడుకులను ఎదుర్కొంది. ఏమైతేనేం– ప్రత్యేక ఉద్యమ సారథిగా అది తన స్థానాన్ని సువ్యవస్థితం చేసుకుంది. 2001లో టి.ఆర్.ఎస్.ను కె.సి.ఆర్. స్థాపించి తన చేతుల్లోకి తీసుకున్నారు. ఆయన రాజకీయ వ్యూహరచనా ధురంధరుడు. ఎన్నిసార్లు దెబ్బతిన్నా, సహజసిద్ధమైన నేర్పరితనంతో మళ్ళీ లేచి నిలబడగలిగిన సమర్థుడు. మంచి భాషతో, తెలంగాణా మాండలికం నిండిన యాసతో జనాన్ని ముగ్ధుల్ని చేయగల మాటకారి. తెలంగాణా రాష్ట్రసాధకుడని పేరు తెచ్చుకున్న భాగ్యశాలి. ❑

13. ఎవరికీ పూర్తికాలం లేదు

జననేత డా॥ వై.ఎస్. రాజశేఖరరెడ్డి:

2004 సం॥ అసెంబ్లీ ఎన్నికలలో కాంగ్రెస్–183, సి.పి.ఐ.–9, సి.పి.ఎం.–6, టి.ఆర్.ఎస్.–26, టి.డి.పి.–48, బి.జె.పి.–2, ఇతరులు–20 స్థానాలు సాధించుకున్నారు. డా॥ వై.ఎస్. రాజశేఖరరెడ్డి ముఖ్యమంత్రి అయ్యారు.

తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు ఆపద్ధర్మ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు. ఆయన పార్టీ సమైక్య ఆంధ్రప్రదేశ్ నినాదంతో ఓటర్లను ఆకట్టుకోవాలని నిశ్చయించింది. సమైక్య ఆంధ్రప్రదేశ్ అన్న నినాదంతో కోస్తాజిల్లాల ఓట్లన్నీ మూకుమ్మడిగా తమ బ్యాలెట్ పెట్టెలో పడతాయిని ఆ పార్టీ భావించింది. తెలుగుదేశం ప్రభుత్వ వ్యతిరేకత ప్రభంజనంపై అధికారంలోకి రావడానికి తీసుకోవలసిన చర్యలన్నింటినీ తెలుగుదేశం పార్టీ తీసుకుంది. గడువు తీరడానికి ఏడాది ముందే అంటే 2003 నవంబరులో అసెంబ్లీని రద్దుచేసి ముందస్తు ఎన్నికలకు ఆయన సిద్ధమయ్యారు. ఈ ముందస్తు ఎన్నికలలో తెలుగుదేశం పార్టీ తుడిచిపెట్టుకు పోతుందని చంద్రబాబు కలలో కూడా ఊహించి ఉండరు.

రాజశేఖరరెడ్డికి ముఖ్యమంత్రి పదవి కేవలం అధిష్ఠానవర్గం ప్రసాదించింది కాదు. అపారమైన ప్రజల మద్దతు కూడా ఆయనను ఆ పదవిలో కూర్చుండబెట్టింది. బహుశా ఆవిధంగా చెప్పుకోగలిగిన ముఖ్యమంత్రి ఆంధ్రప్రదేశ్‌లో ఆయన ఒక్కరే. వై.ఎస్.కు అగ్రనేతల భయం ఉండలేదు. అసమ్మతిని ఆయన ఎదుర్కొనలేదు. అధిష్ఠానవర్గం వేటు వేస్తుందేమో అన్న అనుమానం ఉండలేదు. ఆయన పరిపాలనా సరళి చూస్తూవుంటే కాంగ్రెస్ సర్కారు కన్నా వై.ఎస్. సర్కారు చేసిన పనులివి అనిపించుకునేలా ఉండేది.

2009 ఎన్నికల్లో విజయానికి దోహదం చేసే ఏ చిన్న అవకాశాన్నయినా చంద్రబాబునాయుడు వదులుకోదలచుకోలేదు. అతకడానికి అవకాశం లేని పక్షాల మధ్య ఎన్నికల అవసరం ఆసరగా అతికష్టం మీద అతుకుని సాధించారు. టి.ఆర్.ఎస్. నాయకులతో పొత్తు కలపడం నిజంగా చంద్రబాబు సాధించిన అనూహ్యమైన రాజకీయ ఘనకార్యం. చంద్రబాబు–చంద్రశేఖర్‌రావులు రాజకీయ రణరంగంలో బద్ధవైరులు. అందుకని చంద్రబాబు తెలంగాణా విషయంలో కూడా తన విధానాన్ని మార్చుకుని, తెలంగాణాకు అభ్యంతరం లేదనే విధంగా కొత్త ప్రకటన చేశారు. ముఖ్యమంత్రిగా సుదీర్ఘ కాలం పనిచేసిన ఖ్యాతిని అప్పటికే స్వంతం చేసుకున్న చంద్రబాబు, ఆ ఖ్యాతిని నాటి ముఖ్యమంత్రి వై.ఎస్.ఆర్. ఎగరేసుకుపోకుండా గండి కొట్టడానికి అందరికన్నా ఎక్కువకాలం రాష్ట్రానికి ముఖ్యమంత్రి సేవలందించిన ఖ్యాతి సొంతం చేసుకోవడానికి బద్ధవ్యతిరేకులతో కూడా పొత్తులు పెట్టుకోక తప్పలేదు. ఈ ఎన్నికల్లో తెలంగాణా రాష్ట్రసమితి 10 స్థానాలను గెలుచుకున్నది. కాంగ్రెస్ తిరిగి అధికారంలోనికి వచ్చింది.

ఎన్నికల అనంతరం తిరిగి ముఖ్యమంత్రి అయిన రాజశేఖరరెడ్డి ఎక్కువ కాలం అధికారంలో ఉండలేకపోయారు. ఆయన ప్రయాణిస్తున్న హెలికాప్టర్ 2009 సెప్టెంబరు 2వ తేదీన నేలకూలి దుర్మరణం పాలయ్యారు.

కె.రోశయ్య పాలన:

డా॥ వై.ఎస్. రాజశేఖరరెడ్డి తరువాత కొణిజేటి రోశయ్యను సోనియాగాంధీ ముఖ్యమంత్రిని చేశారు. ఆయనకున్న విశేషానుభవం, రాజనీతిజ్ఞత రాష్ట్ర సమస్యల పరిష్కారానికి ఎంతగానో తోడ్పడుతాయని సోనియా భావించారు. అయితే కారాణాంతరాల వల్ల రోశయ్యను కాంగ్రెసు శాసనసభా పక్షనాయకుడుగా ఎన్నుకునే ప్రక్రియను దాదాపు మూడు నెలలు ఆలస్యం చేశారు. ఎన్నికల బరినుంచి తప్పుకుని ఎం.ఎల్.సి.గా గెలుపొందిన రోశయ్య వడ్డించిన విస్తరిలా ముఖ్యమంత్రి పీఠాన్ని దక్కించుకోవడం బహుశా 2010 సం॥ రాజకీయ వేత్తలందరి మధ్య అత్యంత అదృష్ట వంతుడుగా భావించవచ్చు. అయితే ఆ వెంటనే తెలంగాణా వివాదం ఒక్కసారిగా రేగడం ప్రారంభించి ఆయనకు నిద్రలేకుండా చేసింది.

రోశయ్య సర్దుకున్నారే గాని సహనంగా ఉన్నారని చెప్పడం కష్టం. అంతరంగంగా సమస్యలు ఏమున్నాయో తెలియదు గాని, బయట ప్రజలను చుట్టు ముడుతున్న సమస్యలను పరిష్కరించడంలో, ఆయన తగిన శ్రద్ధాసక్తులు చూపిస్తున్నారన్న భావనను కలిగించలేకపోయారు. ప్రతిదానికీ 'నా చేతిలో ఏముందీ' అన్నట్లు 'నేను నిమిత్త మాత్రుడన'న్నట్లు మాట్లాడుతూ తనను తాను తక్కువ చేసుకున్నారు.

ప్రమాణ స్వీకారం చేసిన గంటనుండే జగన్మోహనరెడ్డి (వై.ఎస్. కుమారుడు) ని ముఖ్యమంత్రిగా చేయాలన్న డిమాండ్ తెరపైకి రావడంతో రోశయ్యకు ఇబ్బందులు మొదలైనాయి. జగన్‌కోసం పలువురు మంత్రులు, ఎమ్మెల్యేలు బాహాటంగా రంగంలోకి దిగడంతో రోశయ్య పాలనపై దృష్టి పెట్టలేకపోయారు. తన బిడ్డలాంటి వాడు అని తాను చెబుతున్న వ్యక్తి తనను తండ్రిలాంటివాడు అని అనకపోయినా కనీసం ముఖ్యమంత్రి రోశయ్య అని ఒక్కటంటే ఒక్క సారైనా సంబోధించకపోయినా రోశయ్య సరిపెట్టుకున్నారు.

కె.సి.ఆర్. అరెస్టు:

తెలంగాణా రాష్ట్ర సమితి అధ్యక్షుడు కె. చంద్రశేఖరరావు అరెస్టుతో సహజంగానే పరిస్థితి ఉద్రిక్తమైంది. ముందే ప్రకటించిన ఆమరణ ఉపవాసదీక్షను ప్రారంభించడం కోసం కరీంనగరు నుంచి సిద్ధిపేటకు బయల్దేరిన కె.సి.ఆర్.ను సినిమా ఫక్కీలో దారికాసి, కరీంనగరు జిల్లాలో అడ్డగించి పట్టుకుపోయి వరంగల్‌కు తీసుకుపోవాలని చెప్పి ఖమ్మం తీసుకుపోయి రిమాండ్ చేశారు. తమ నాయకుని అరెస్టుకు నిరసనగా హైదరాబాద్, ఇతర తెలంగాణా ప్రాంతాలలో తీవ్ర ఉద్రిక్త పరిస్థితి ఏర్పడింది. రాష్ట్రంలోను, దేశంలోను ఆమరణ నిరాహార దీక్షలు కొత్తవి కావు. నిరవధిక దీక్షలకు ఉపక్రమించిన వారి ఆరోగ్య పరిస్థితి విషమించగానే పోలీసులు అరెస్టు చేసి, బలవంతంగా ఏ ఆస్పత్రికో తరలించడం మామూలే. కాని ఆమరణ దీక్షకు కూచోబోతున్నానని చెప్పిన వ్యక్తిని, అది మొదలు పెట్టకుండానే దారిమధ్య అడ్డగించి, బలవంతంగా అరెస్టు చేసి జైల్లో వేయడం మాత్రం ఇటీవలి చరిత్రలో బహుశా ఇదే ప్రథమం.

కె.సి.ఆర్. ఆమరణ ఉపవాస దీక్ష తెలంగాణాను అతలాకుతలం చేసింది.

ఎవరు ఎన్ని హామీలిచ్చినా, కె.సి.ఆర్. ఆమరణ దీక్ష విరమించకపోవడం, పరిస్థితులు చేజారిపోవడం గమనించిన కాంగ్రెసు అధిష్ఠాన వర్గం రోశయ్యను ఢిల్లీకి పిలిపించింది. వై.ఎస్. జీవించి ఉంటే ఈ సమస్యే తలెత్తేది కాదని కొంతమంది చెబుతున్న మాట వాస్తవమే అయినప్పటికీ అనువైన సమయం తనకు అనుకూలంగా మార్చుకుని దీక్షకు దిగిన కె.సి.ఆర్. అపరచాణక్యుడుగా పేరొందిన రోశయ్యకు మరిన్ని ఇబ్బందులు సృష్టించాడు. మొత్తానికి తెలంగాణా అంశంపై తీర్మానాన్ని పెట్టించేందుకు అధిష్ఠానం అంగీకరించడంతో, కె.సి.ఆర్. కూడా దీక్షను విరమించడం రోశయ్యకు ఉపశమనం కలిగించింది. కానీ తరువాత ప్రారంభమైన సమైక్య ఆంధ్ర ఉద్యమం మళ్ళీ రోశయ్యకు శిరోభారాన్ని తెచ్చిపెట్టింది. సమైక్యాంధ్ర నుండి తెలంగాణాను విడదీయడం సరికాదంటూ ఆంధ్ర, రాయలసీమకు చెందిన ఎమ్మెల్యేలు, స్థానిక సంస్థల ప్రజా ప్రతినిధులు రాజీనామాలు చేయగా ప్రభుత్వం మనుగడే ప్రశ్నార్థకంగా మారింది.

ప్రత్యేక తెలంగాణా, సమైక్యాంధ్ర ఆందోళనల కారణంగా రాష్ట్ర మంత్రివర్గం, శాసన సభ్యులు ప్రాంతాలవారీగా చీలిపోయారు. ఒక్కరికి మోదం కలిగించే నిర్ణయం తీసుకుంటే మరొక్కరికి ఆగ్రహం కలిగింది. దానితో రోశయ్య పరిపాలనపై సరైన దృష్టి కేంద్రీకరించలేకపోయారు.

వేర్పాటువాద ఉద్యమం మూలంగా రాష్ట్ర ప్రజల్లో భావోద్వేగ పరంగా చీలికలు రావడం రోశయ్య రాజకీయంగా తడాఖా చూపలేకపోవడానికి తక్షణ కారణంగా కనబడుతుంది. 14 మాసాల రెండు నెలల 22 రోజుల పాలనకుగాను రోశయ్య రాజకీయ చరిత్రలో ఎలాగు తన స్థానం తాను పొందుతారు. రోశయ్య ముఖ్యమంత్రి అయినప్పటినుంచి మంత్రివర్గ విస్తరణ జరుగుతుందని 14 నెలలు ఎదురు చూసి చివరకు ముఖ్యమంత్రే మారిపోయారు. తను పొరపాటునో, గ్రహపాటునో ముఖ్యమంత్రి అయ్యానని ఆయన చేసిన వ్యాఖ్య అక్షర సత్యం. పదవి వచ్చేదీ, పోయేదీ అదృష్ట, దురదృష్టాలవల్ల జరిగే పనిగా రోశయ్య చరిత్ర తెలుపుతుంది.

ఆంధ్రప్రదేశ్ నుంచి విభజించి, ప్రత్యేక తెలంగాణా ఏర్పాటు చేసే ప్రక్రియ సత్వరమే ప్రారంభం కానుంది– అంటూ కేంద్ర హోంమంత్రి పి.చిదంబరం ప్రకటించిన క్షణంలోనే ఆంధ్రప్రదేశ్‌లో కాంగ్రెస్ చేజారింది. 2009 డిసెంబరు 9 నాటి అర్ధరాత్రి చిదంబరం ఆ ప్రకటన చేశారు. నిలబెట్టుకోని ఆ వాగ్దానపు పద్మవ్యూహం నుంచి

బయట పడటంకోసం అప్పటినుంచి ఆ పార్టీ శతవిధాలా ప్రయత్నించింది.

రోశయ్య ఆర్థిక మంత్రిగా ఉన్నప్పుడు ఆయన పర్వతాలను అధిరోహించే మేక అంత అవలీలగా తన కార్యభారాన్ని చక్కబెట్టేవారు. కానీ ముఖ్యమంత్రి పదవి చేపట్టాక నీట మునిగే అభాగ్యునిలా తపతప కొట్టుకులాడారు. ముఖ్యమంత్రి పదవి నుంచి దిగిపోగానే రోశయ్యకు గవర్నరు పదవి లభించింది. గవర్నరు పదవి రాజకీయాలలో వాన ప్రస్థాశ్రమం వంటిది. కాకపోతే ఫించను ఉద్యోగం లాంటిది. ఏ వివాదాలు లేకుండా చెన్నైలో రోశయ్య హాయిగా కాలక్షేపం చేస్తున్నారు.

పతనం దశలో కాంగ్రెస్:

ఆంధ్రప్రదేశ్ 16వ ముఖ్యమంత్రిగ నల్లారి కిరణ్‌కుమార్‌రెడ్డి 2010 సం॥ నవంబరు 24వ తేదీన ప్రమాణ స్వీకారం చేశారు. రాష్ట్రరవాణాశాఖ మంత్రి బొత్స సత్యనారాయణను అధిష్ఠానవర్గం పిసిసి అధ్యక్షునిగా నియమించింది. ముఖ్యమంత్రి, శాసనసభ స్పీకరు, శాసనమండలి చైర్మన్, తాజాగా పిసిసి అధ్యక్ష పదవి- ఇలా కీలక పదవులన్నీ కోస్తా, రాయలసీమకు చెందిన వారికే అధిష్ఠానవర్గం కట్టబెట్టడం వెనుక ఏమైన వ్యూహం ఉందో తెలియదు. 2004, 2009లలో రెండుసార్లు కాంగ్రెసుకు రాష్ట్రాన్ని కట్టబెట్టిన కీ॥శే॥ వై.ఎస్.ఆర్. అకాల మరణం తర్వాత ఆయన కుమారుడు జగన్మోహన్‌రెడ్డి వై.ఎస్.ఆర్ కాంగ్రెస్ పేరుతో పార్టీ నెలకొల్పారు.

యువకుడైన కిరణ్‌కుమార్‌రెడ్డిని ముఖ్యమంత్రిని చేస్తే రాష్ట్రంలో కాంగ్రెసు పరిస్థితి చక్కబడుతుందని కాంగ్రెసు అధిష్ఠానవర్గం ఆశించింది. కిరణ్‌కుమార్‌రెడ్డి మీద ఎన్నో ఆశలు పెట్టుకుంది. కానీ ఆశించిన రీతిలో ఆయన పనితీరు లేదని అతి తక్కువ సమయంలోనే అధిష్ఠానవర్గం ఒక అంచనాకు వచ్చింది. అధిష్ఠానవర్గంలో అసంతృప్తి గూడుకట్టింది. ప్రభుత్వ పనితీరు మెరుగు పడలేదు. కనీసం పార్టీనైనా బాగుచేసుకుందామని రవాణాశాఖమంత్రి బొత్స సత్యనారాయణకు పిసిసి పగ్గాలు అధిష్ఠానవర్గం అప్పగించింది. పిసిసి బాధ్యతలను చేపట్టిననాడే తాను ముఖ్యమంత్రి రేసులో ఉన్నానని ఆయన చెప్పారు. అప్పటినుంచి కిరణ్‌కుమార్‌రెడ్డి- బొత్స సత్యనారాయణ మధ్య విభేదాలు మొదలయ్యాయి. వారిమధ్య విభేదాలు చక్కదిద్దడమే అధిష్ఠానవర్గానికి పెద్ద తలనొప్పిగా మారింది.

పార్టీలో తనకంటూ ఒక బలమైన వర్గాన్ని కిరణ్‌కుమార్‌రెడ్డి ఏర్పాటు చేసుకోలేక

పోయారు. కిరణ్‌కు మద్దతు నిస్తున్న కొంతమంది కూడా ముఖ్యమంత్రి కిరణ్‌కుమార్ రెడ్డికే తప్ప కాంగ్రెస్ నాయకుడు కిరణ్‌కుమార్ రెడ్డి కి కాదని కొందరి వాదన. తన మంత్రివర్గంలోని సీనియర్లనైనా కిరణ్ విశ్వాసంలోకి తీసుకోలేదు. పార్టీలోని కీలక నాయకులందరూ ఆయనకు వ్యతిరేకులే. సొంత పార్టీలోనే తీవ్ర వ్యతిరేకత ఉన్నా అత్యంత సున్నితమైన తెలంగాణా సమస్య, మరొక పక్క జగన్ సమస్య ఉన్నా ఎటువంటి తొట్రుపాటులేకుండా రెండేళ్ళు ముఖ్యమంత్రిగా కిరణ్‌కుమార్‌రెడ్డి నెట్టుకు వచ్చారు.

కిరణ్‌కుమార్‌రెడ్డి ఆత్మవిశ్వాసం చూస్తే ఆశ్చర్యం వేస్తుంది. పార్టీనాయకులు ఎంత ప్రచారం చేసినా తన పదవికి ఎటువంటి ముప్పు రాదని ఆయన బలంగా నమ్ముకున్నారు. కాంగ్రెస్‌లో ముఖ్యమంత్రి పదవిలో కొనసాగడానికి ఇక్కడ రాష్ట్రంలో ఎమ్మెల్యేల బలం కన్నా ఢిల్లీలో అధిష్ఠానవర్గం అండ ముఖ్యం. ఇది కాంగ్రెసు సంప్రదాయం, సంస్కృతి. ఒక నాయకుడు పార్టీలో బలంగా ఉండటాన్ని కూడా అధిష్ఠానవర్గం సహించదు. పార్టీలో బలం పెంచుకుంటే ఎక్కడ తమ మాట వినడేమో నన్న భయం అధిష్ఠానవర్గానికి ఉండవచ్చు. దీన్ని అక్షరాల నిరూపించుకున్నారు కిరణ్‌కుమార్‌రెడ్డి. అందువల్లనే పార్టీలో బలమైన నాయకులకన్న బలహీనులైన నాయకులకి అధిష్ఠానవర్గం ఎక్కువ ప్రాధాన్యం ఇస్తుంది.

ముఖ్యమంత్రి పదవికి రాజీనామా చేసిన అనంతరం కిరణ్‌కుమార్ రెడ్డి పెట్టిన జై సమైక్యాంధ్ర పార్టీకి ప్రజలనుంచి ఆదరణ లభించలేదు. కాంగ్రెస్‌లో అన్ని పదవులు అనుభవించి ఆ పార్టీనే ధిక్కరించడం ప్రజలు మన్నించలేకపోయారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి కిరణ్‌కుమార్‌రెడ్డి చివరి ముఖ్యమంత్రిగా మిగిలిపోయారు. మూడు నెలల రాష్ట్రపతిపాలన అనంతరం రాష్ట్రం ఆంధ్ర, తెలంగాణాలుగా విడిపోయింది. ❑

14. నవ తెలంగాణ ఆవిర్భావం

దేశంలోని సగానికి పైగా రాష్ట్రాలు తెలంగాణా కంటే చిన్నవి. భౌగోళిక విస్తీర్ణం రీత్యా చూసినప్పుడు బెంగాల్, కేరళ సైతం తెలంగాణాముందు చిన్నబోతాయి. అపార సంస్కృతీ సిరులు, సహజవనరులు, నదీ జలాలున్న తెలంగాణా దానికదే మరింత బాగా వృద్ధి చెందుతుంది.

శ్రమజీవులైన ప్రజలతోపాటు సహజవనరులు సుసంపన్నంగా ఉన్న తెలంగాణా ప్రణాళికాబద్ధంగా అభివృద్ధి చేస్తే దేశంలోనే మొదటి రాష్ట్రంగా నిలుస్తుంది. నీరు, నేల, బొగ్గు- ఈ మూడు ప్రకృతి సంపదలు తెలంగాణాలోనే అపారంగా ఉన్నాయి. జలవనరులతో మంచినీరు, సాగునీరు అందించడానికి; బొగ్గు నిక్షేపాలతో విద్యుత్తు తయారుచేసుకోవడానికి తనకున్న అవకాశాలు దక్షణాదిలో మరో రాష్ట్రానికి లేవు. కృష్ణ, గోదావరి నదులు రాష్ట్రపడమర శిఖరం నుంచి తూర్పు లోగిలికి సమాంతరంగా ప్రవహిస్తున్నాయి. సంవత్సరంలో ఆరు నెలలు ఈ నదీ ప్రవాహాలు అపార జలంతో కళకళ లాడుతుంటాయి. తుంగభద్ర, మంజీర, ప్రాణహిత, శబరి, సుద్దవాగు, పెన్‌గంగ, పాలేరులాంటి ఎన్నో నదులు ఉన్నాయి. హైదరాబాద్ మినహా తెలంగాణాలోని తొమ్మిది జిల్లాల్లో అడవులు పోను మిగిలిన భూమిలో 90 శాతం సాగుయోగ్యమైనదే.

తెలంగాణా స్వాతంత్ర్యోద్యమంలో కవితోద్యమం కూడా విజృంభించింది. గ్రంథాలయ వార్షికోత్సవ సందర్భాలలో కవితాపఠనం ఉండి తీరవలసిందే. పాఠశాల వార్షికోత్సవంలో కావ్య గానం జరుగవలసిందే. పండుగ నాడు కవుల గోష్ఠి ఏర్పాటు చేయవలసిందే. రాజకీయ మహాసభల్లో కవుల పద్యాలు మార్మోగవలసిందే. కవిత్వం వినరాని చోటు తెలంగాణాలో ఉండేది కాదు. గుడిలో, బడిలో, బందిఖానాలో, గుడిసె కొంపల్లో, గోపురాగ్రమున అంతటా కవితా ప్రతిధ్వానమే. తెలుగులో మొదట కేంద్రసాహిత్య అకాడమీ బహుమతి సురవరం ప్రతాపరెడ్డికే లభించింది.

గుబాళించిన గులాబి:

ప్రత్యేక రాష్ట్ర ఏర్పాటు నినాదంతో కె.సి.ఆర్. నేతృత్వంలో ఉద్యమ పార్టీగా అడుగులు ప్రారంభించిన తెలంగాణా రాష్ట్రసమితి అనుకున్న లక్ష్యాన్ని సాధించింది. తెలంగాణా ప్రజల అరవయ్యేళ్ళ కలను సాకారం చేయటమే కాదు, అధికార పగ్గాలను అందుకునే స్థాయికి ఎదిగింది. తెలంగాణ సెంటుమెంటుతో పాటు ప్రజా సంక్షేమ కార్యక్రమాలను, అభివృద్ధి పథకాలను గురించి ప్రచారం చేసింది టి.ఆర్.ఎస్. ఓటర్లను ఆకట్టుకుంది. వెయ్యిమందికిపైగా తెలంగాణా వాసులు ప్రత్యేక రాష్ట్రసాధన పోరాటంలో అమరులైనారు. మా రాష్ట్రం మాకు కావాలన్న బలమైన భావన, మేం నష్టపోతున్నాం అన్న వేదన తెలంగాణా ప్రజల్లో అరవైఏళ్ళ నుంచి ఉంటున్నవే. వాటిని టి.ఆర్.ఎస్. నేత కె. చంద్రశేఖరరావు నేర్పుగా ఓర్పుగా పట్టుకుని తెలంగాణా ఉద్యమం విజయవంతం చేశారు.

2014లో జరిగిన లోక్‌సభ, శాసనసభ ఎన్నికల్లో 17 లోక్‌సభ స్థానాల్లో 11,119 అసెంబ్లీ స్థానాల్లో 63 గెలుచుకొని టి.ఆర్.ఎస్. తెలంగాణా రాష్ట్రంలో అధికార పగ్గాలు చేపట్టింది. ఆ పార్టీ అధ్యక్షుడు కె. చంద్రశేఖరరావు 2014 జూన్ 2వ తేదీన నూతన రాష్ట్ర తొలి ముఖ్యమంత్రి పదవిని స్వీకరించారు.

కొత్తగా ఏర్పాటైన తెలంగాణా రాష్ట్రంలో తొలిసారి ప్రమాణస్వీకారం చేసిన మంత్రివర్గం:

1.	**కల్వకుంట చంద్రశేఖరరావు** (ముఖ్యమంత్రి)	సాధారణ పరిపాలన, విద్యుత్, మున్సిపల్, పట్టణాభివృద్ధి, బొగ్గు, ఎస్సీ, ఎస్టీ, బిసి, మైనారిటీ శాఖలతోపాటు మంత్రులకు కేటాయించని ఇతర శాఖలు
2.	**ఎం.డి మహమూద్ అలీ** (ఉప ముఖ్యమంత్రి)	రెవెన్యూ, స్టాంపులు, రిజిస్ట్రేషన్లు
3.	**డా॥ తాటికొండ రాజయ్య** (ఉప ముఖ్యమంత్రి)	వైద్యం, ఆరోగ్యం

4.	**నాయిని నర్సింహారెడ్డి**	హోం, జైళ్లు, ఫైర్ సర్వీసులు, సైనిక సంక్షేమం, కార్మిక, ఉపాధి కల్పన
5.	**ఈటెల రాజేందర్**	ఆర్థిక, ప్రణాళిక, చిన్నమొత్తాల పొదుపు, పౌరసరఫరాలు
6.	**పోచారం శ్రీనివాసరెడ్డి**	వ్యవసాయం, దాని అనుబంధశాఖలు
7	**తన్నీరు హరీశ్‌రావు**	భారీ నీటిపారుదల, శాసనసభ వ్యవహారాలు, మార్కెటింగ్
8.	**కల్వకుంట్ల తారకరామారావు**	పంచాయతీరాజ్, ఐ.టి.
9.	**పి. మహేందర్‌రెడ్డి**	రవాణా
10.	**జోగు రామన్న**	అడవులు, పర్యావరణం
11.	**టి.జగదీశ్‌రెడ్డి**	విద్య
12.	**టి.పద్మారావు**	ఎక్సైజ్, మద్య నియంత్రణ

పునర్వ్యవస్థీకరణ తర్వాత :

1.	ముఖ్యమంత్రి **కల్వకుంట్ల చంద్రశేఖరరావు**	ఎస్.సి, మైనారిటీ సంక్షేమం, మున్సిపల్ పాలన, పట్టణాభివృద్ధి, బొగ్గు, సాధారణ పరిపాలన, ఎవరికీ కేటాయించని ఇతర శాఖలు
2.	ఉప ముఖ్యమంత్రి **మహమ్మద్ మహమూద్ అలీ**	రెవెన్యూ, పునరావాసం,పట్టణభూగరిష్ట పరిమితి, స్టాంపులు, రిజిస్ట్రేషన్.
3.	ఉప ముఖ్యమంత్రి **కడియం శ్రీహరి**	విద్య
4.	**టి. హరీశ్‌రావు**	సాగునీరు, గనులు, భూగర్భవనరులు, మార్కెటింగ్, శాసనసభా వ్యవహారాలు,

5.	కల్వకుంట్ల తారకరామారావు	పంచాయితీరాజ్, సమాచార సాంకేతిక పరిజ్ఞానం, ప్రవాసభారతీయులు, ఉపాధి, సంబంధాలు.
6.	జూపల్లి కృష్ణారావు	చేనేత, జౌళి, పరిశ్రమలు, చక్కెరశాఖలు.
7.	నాయిని నర్సింహారెడ్డి	హోం, జైళ్లు, అగ్నిమాపక సేవలు, సైనిక సంక్షేమం, కార్మిక, ఉపాధి శాఖలు.
8.	పి. మహేందర్‌రెడ్డి	రవాణా
9.	పోచారం శ్రీనివాసరెడ్డి	వ్యవసాయం, తోటలపెంపకం, సెరీకల్చర్, పశుసంవర్ధక,మత్స్య,పాడిపరిశ్రమాభివృద్ధి సంస్థ, విత్తనసంస్థ
10.	జి.జగదీశ్‌రెడ్డి	విద్యుత్
11.	డా.సి.లక్ష్మారెడ్డి	వైద్యఆరోగ్యశాఖ
12.	ఎ.ఇంద్రకరణ్ రెడ్డి	గృహనిర్మాణం, న్యాయం, దేవదాయశాఖలు
13.	ఈటెల రాజేందర్	చిన్నమొత్తాలు, రాష్ట్రలాటరీలు, వినియోగ వ్యవహారాలు, లీగల్‌మెట్రాలజి, ఆర్థిక శాఖలు
14.	జోగురామన్న	అటవీ, పర్యావరణ,బిసి సంక్షేమశాఖలు
15.	టి.పద్మారావు	ఎక్సైజ్, మద్యనిషేదం, క్రీడలు, యువజన సంక్షేమశాఖలు
16.	తుమ్మల నాగేశ్వరరావు	రోడ్లు, రవాణా, మహిళా, శిశు సంక్షేమ శాఖలు
17.	తలసాని శ్రీనివాస్‌యాదవ్	వాణిజ్యపన్నులు, సినిమాటోగ్రఫీ
18.	అజ్మీరా చందూలాల్	గిరిజన సంక్షేమం, పర్యాటక, సాంస్కృతిక శాఖలు

❄ ❄ ❄

ఆంధ్ర సారస్వత పరిషత్తు కొన్ని ప్రచురణలు

1.	ఆంధ్ర మహాభారతోపన్యాసములు	రూ.	100/-
2.	తెలుగు వాగ్గేయకారులు - అన్నమయ్య విలక్షణ వ్యక్తిత్వం	రూ.	70/-
3.	తెనుగు సాహితి	రూ.	36/-
4.	స్త్రీల రామాయణపు పాటలు	రూ.	36/-
5.	సమీక్షణం	రూ.	36/-
6.	పరిణతవాణి - 1,2,3,4,5,6 సంపుటాలు (36,45,60,65,60,150)	రూ.	370/-
7.	ఆధునిక తెలుగు సాహిత్యంలో విభిన్న ధోరణులు	రూ.	70/-
8.	ఇరివెంటి వ్యాసాలు	రూ.	30/-
9.	శాలివాహన గాథా సప్తశతీసారము	రూ.	15/-
10.	రాయప్రోలు రచనలు - తత్త్వవివేచన	రూ.	60/-
11.	తెలుగు సాహిత్యోద్ధారకులు	రూ.	40/-
12.	మల్లికా గుచ్ఛము	రూ.	8/-
13.	మన జాతినిర్మాతలు	రూ.	4/-
14.	సుమతి, వేమన, కృష్ణ శతకాలు	రూ.	24/-
15.	ఆంధ్ర సారస్వత పరిషత్తు స్వర్ణోత్సవ సంచిక	రూ.	50/-
16.	ఆంధ్ర సారస్వత పరిషత్తు వజ్రోత్సవ సంచిక	రూ.	250/-
17.	తెలంగాణాలో జాతీయోద్యమాలు	రూ.	10/-
18.	సంస్కృత పాఠవల్లరి	రూ.	4/-
19.	నా సాహిత్యోపన్యాసములు	రూ.	5/-
20.	గౌతమబుద్ధుడు - జవహర్‌లాల్ నెహ్రూ	రూ.	3-60
21.	విమర్శకవతంసులు	రూ.	45/-
22.	మన దేశం - తెలుగుసీమ	రూ.	7/-
23.	మన నదులు - కృష్ణా గోదావరులు	రూ.	3/-
24.	మధురభక్తి - ముగ్ధభక్తి	రూ.	80/-
25.	ప్రాచీన కవిత	రూ.	10/-
26.	ప్రసంగ వ్యాసాలు	రూ.	5/-
27.	దశరూపక సారం	రూ.	5/-
28.	భారతీయ వాస్తు శిల్ప విజ్ఞానం	రూ.	2/-
29.	నా రేడియో ప్రసంగాలు	రూ.	5/-
30.	సాహిత్యానువాదం : సమాలోచనం	రూ.	60/-
31.	శివరాత్రి మాహాత్మ్యము	రూ.	75/-
32.	తెలుగు రచన	రూ.	7/-
33.	ఆంధ్ర వాఙ్మయ చరిత్ర	రూ.	85/-
34.	సాహిత్య సోపానములు	రూ.	75/-
35.	మన హాస్యము	రూ.	100/-
36.	తెలుగు భాషా సాహిత్య వైశిష్ట్యం	రూ.	100/-
37.	వ్యాస గుళుచ్ఛం (1, 2 భాగాలు)	రూ.	130/-
38.	తెలంగాణలో తెలుగు సాహిత్య వికాసం	రూ.	150/-